అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 317

సంపుటి: 38 సంచిక: 10 ఆగస్టు-సెప్టెంబరు, 2015 పేజీలు: 188 వెల: రు. 50

కూర్చున్న వాళ్ళు :

ఎడమ నుంచి : (1) కానూరి (2) తెలీదు (3) ప్రభంజన్; కుడి నుంచి కె.ఎన్.రావు, నాజర్

నిల్చున్న వాళ్ళు

మొదటి వరుస : కృష్ణక్క, ప్రసాద్, వివి, సి.ఎస్.రావు, రావిశాస్త్రి, కె.వి.ఆర్., శ్రీశ్రీ, కొకు, జ్వాలాముఖి, ఆర్‌విబి శర్మ, లోచన్, కారా, ఎం.వి. రమణారెడ్డి, ఉమ్మెంతల వెంకటరెడ్డి, టంకశాల అశోక్, బి. విజయ్‌కుమార్, లింగారెడ్డి, ఎన్.వెంకటయ్య, అగ్నిమిత్ర (?).

రెండవ వరుస : చంద్ర, యాదగిరి (కె.ఎం.సి. వరంగల్), శ్రీపతి, ఎన్.ఎస్. ప్రకాశరావు, ఎన్.కె., క్రాంతికార్, చెరబండరాజు, మరువాడ రాజేశ్వరరావు, తెలీదు, బుచ్చయ్య, జె.సి., వెంకటరెడ్డి,

మూడవ వరుస : రవిబాబు, పెండ్యాల కిషన్‌రావు, తెలీదు, రాజేశ్వరరావు, నిఖిలేశ్వర్, తెలీదు, జయరాం, తెలీదు. **(విరసం తొలి మహాసభలు వర్తక సంఘం భవనం, ఖమ్మం, అక్టోబర్ 1970)**

KRSA101M107

సంపాదక లేఖ

సీపీ కోసం..

విప్లవాకాశంలో అరుణతార వెలుగుతూ ఉండాలని ఆయన ఎంతగా పరితపించాడో! ప్రతి సంచిక హృదయానికి హత్తుకొనే వాడు. తన కోసం అప్పుడే ఇలా ఈ కన్నీటి సంపుటం తేవాల్సి వస్తుందనుకోలేదు.

సీపీ మరణానంతర జీవితానికి నెల వయసు దాటిపోయింది. సోషలిజం కోసం కలగని, దాన్ని నిజం చేయడానికి జీవితాన్ని, ప్రాణాన్ని అర్పించిన అమరుల సరసన ప్రసాద్ స్థానం పదిలం. ఆయన గురించి రాసే ప్రతి వాక్యం ఆయన మూర్తిమత్వం ముందు కురచైపోతుంది. ప్రసాద్ ఎదుట ఏ పదమూ అతిశయం ధ్వనించజాలదు. ఎందుకంటే ఆయన చరిత్ర తీర్చిదిద్దిన మానవుడు. దాన్ని నిర్మించే ప్రజల ముందు ఆయన అత్యంత వినయశీలి. జ్ఞానం, అనుభవం, వ్యక్తీకరణ మొదలైన వాటిపట్ల ఆయన కంటి చూపే విభిన్నం. అక్కడ ఆయన అరుదైన మార్క్సిస్టు. అందుకే మానవ సంబంధాలే తన ఉనికిగా రుజువు చేసుకున్నాడు.

సీపీని స్మరించుకోవడమంటే విరసం తన కల్లోలభరిత చరిత్ర లోలోపలి నుంచి ఒక మానవుడిని పునరావిష్కరించుకోవడమే. ఆయనతో కలసి నడిచి, ఆయన దగ్గర నేర్చుకొని... అత్యంత సహజమైన మరణం వల్ల కలిగిన ఎడబాటులో నుంచి తిరిగి ఆయన స్ఫూర్తిని పునర్నిర్మించుకోవడమే. జీవితమంతా విప్లవమై మారుమోగిన ప్రసాద్ తన చూపుడు వేలుతో చూపిన శ్రీకాకుళ విప్లవాగ్నులను తిరిగి తిరిగి జ్వలింపజేయడమే.

ఈ సంచికకు విరసం సభ్యులు, పూర్వ సభ్యులు, సాహిత్యకారులు, విప్లవాభిమానులు, ప్రసాద్ ఆత్మీయ సన్నిహితులు ఎందరెందరో. మూడు తరాల వాళ్లు ఆయన స్నేహ పరిమళాన్ని అద్దారు. దు:ఖపు చెమ్మతో ఆయన విప్లవాభినివేశానికి అక్షరాలు సమకూర్చారు. ఆయన సాహిత్య, సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని అంచనా వేశారు. విప్లవానికి ప్రసాద్ లోపలి మనిషి అయినట్లే, వేలాది మంది మిత్రులకు, రచయితలకు, అభిమానులకు కూడా లోపలి మనిషి. ఈ సంచికలో వ్యక్తమైన కొన్ని భావనలు విరసం అంగీకరించలేకపోవచ్చు. కొన్ని రాజకీయ అభిప్రాయాలతో ఏకీభావం లేకపోవచ్చు. కొన్ని పునరుక్తులు ఉండొచ్చు. అయినా ప్రసాద్‌ను అందరూ ఉప్పొంగిన కన్నీటి జాడల్లో పోల్చుకున్నారు. ఆయన జీవితంతో ఏకీభావం ఉన్నా .... ఆయన అభిప్రాయాలతో ఈ రచయితల్లో కొందరికి ఏకీభావం ఉండకపోవచ్చు. అయినా ఈ సంచికలోని ప్రతి వ్యాసం ప్రసాద్ వ్యక్తిత్వ పార్శ్వాలపై కాంతి రేఖలు అద్దాయి. విలువలు, విశ్వాసాలు, స్నేహాలు, సాహసోపేతంగా ఈదిన వర్గయుద్ధాలు.. అన్నీ కలిస్తేనే చలసాని ప్రసాద్. విప్లవమూ, సాహిత్యమూ నిర్మించిన ఆ మానవుడిని ఏ ఏ కోణాల్లో తాము కనుగొన్నదీ ఈ సంచిక రచయితలు చెప్పారు.

చలసాని ప్రసాద్‌ను పునర్నిర్మించుకోడానికి తెలుగు సమాజం, విప్లవ, విప్లవ సాహిత్యోద్యమం చేయవలసిన విస్తారమైన పనిలో ఈ సంచిక తొలి అడుగు మాత్రమే. అయితే ఆ పని ఎలా సమగ్రంగా చేయగలమో ఈ సంచిక దారి చూపుతుంది. ఒక విప్లవ మానవుడిగా ప్రసాద్‌ను ఎలా పదిలపరుచుకోవాలో ప్రతి రచనా మనలోకి ప్రసరించి స్ఫూర్తిని అద్దుతుంది. అందుకు సిద్ధం కమ్మని పాఠకులను కోరుతూ...

వర్కింగ్ ఎడిటర్

డి.వి. రామక్రిష్ణారావు

ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ పంపవచ్చు

సంపాదకవర్గం :

ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామా

మేనేజర్

వలేటి అరవింద్ కుమార్

భీమ్‌సేన్‌రావు, 1-9-52/ఎఫ్/2,
ఈ-సేవ దగ్గర, మదర్ హైస్కూల్ ఎదురుగా, రామ్‌నగర్,
హైదరాబాద్ - 500020.

సెల్ : 8142200711

(ఫోన్ చేయాల్సిన సమయం
ఉ.10 గంటల నుండి మ. 1 గంట వరకు)

విరసం కార్యదర్శి చిరునామా

పి. వరలక్ష్మి

5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి.టి.పి. అండ్ లే అవుట్

ఆర్. భాగ్యలక్ష్మి

మొదటి, చివరి కవర్ డిజైన్ :

జుగాష్ విలి, భాగ్యలక్ష్మి

ఫోటోలు : వర్మ, పావని, కె.వి.ఎస్. వర్మ, నారాయణవేణు, కూర్మనాథ్, క్రాంతి, రత్నం, రమణ, వసంత, సింగంపల్లి అశోక్ కుమార్, బాల్‌రెడ్డి, సృజన తదితరులు

Like Page://arunatara viplava rachayitala sangham

Virasam website : *www.virasam.in*

ఈ సంచిక వెల : రు. 50/-

(317) సంపుటి : 38 ◆ సంచిక : 10
◆ ఆగస్టు-సెప్టెంబరు, 2015

కామ్రేడ్ చలసాని ప్రసాద్ (పుట్టిన తేది : 8 డిసెంబర్ 1932, అమరత్వం : 25 జూలై 2015) ప్రత్యేక సంచిక

విషయసూచిక

రేపటి మానవుడికి స్వాగతం - పాణి	6
మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని తుది వరకూ... - అభయ్	8
కొన ఊపిరి దాకా ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన... - ప్రతాప్	10
విప్లవ సాహిత్యోద్యమ నాయకుడు, ఉత్తమ కమ్యూనిస్టు... - రాజకీయ ఖైదీలు	12
సిపి చెప్పిన పాఠం - వరలక్ష్మి	13
చలసాని - శ్రీశ్రీ : సాహిత్యంలో వర్గపోరాట సందర్భాలు - వరవరరావు	15
గత స్మృతుల తలపోతలు - కృష్ణాబాయి	19
చలసాని స్నేహం, సాహిత్యం - కాశీం	21
ప్రజల మనిషి చలసాని ప్రసాద్‌కు జోహార్లు - ఫి.వి. రమణ	24
సాహితీవేత్త, స్నేహశీలి - డాక్టర్ నళిని	26
చలసాని ప్రసాద్ దారి - శివలక్ష్మి	30
బొడ్డుతాడు తెగిన దుఃఖం! - రివేరా	30
తెలుగుకు ఏమీ ఢోకా లేదు - సామల రమేష్ బాబు	34
విరసం నేత చలసాని ప్రసాద్ మృతికి జనసాహితి సంతాపం - దివికుమార్	34
సాంస్కృతిక సేనాని చలసాని - కె.పి. సుబ్బారావు	35
మా ఇంటికి రాకుండానే వెళ్ళిపోయిన చలసాని - ప్రొ. ఎస్. శేషయ్య	36
నిర్మలత్వానికి నిర్వచనం చలసాని ప్రసాద్ - హేమ పరిమి	38
చలసాని ప్రసాద్ వ్యక్తిత్వం - సాహిత్యం - కాత్యాయనీ విద్మహే	39
తరమెళ్లిపోతున్నది... త్యాగాల తరమెళ్లిపోతున్నది - డేవిడ్	46
మా తరానికి ప్రియమైన సీపీ - క్రాంతి	47
స్నేహమే ఉద్యమం, ఉద్యమమే ప్రాణం! - అవ్వారి నాగరాజు	48
కొన్ని ఉద్విగ్నక్షణాల మధ్య... - బాలసుధాకర్ మౌళి	49
మరో ప్రపంచపు మనిషి - ప్రొ. జి. హరగోపాల్	50
చలసాని ప్రసాద్‌తో నా అనుబంధం - జె.ఎస్. ప్రకాశ్‌రావు	51
చరిత్రప్రవాహంలో చలసాని - అట్టాడ అప్పల్నాయుడు	52
కామ్రేడ్ చలసానికి లాల్‌సలాం - రాజకిశోర్	54
సాహిత్యం - స్నేహం - ప్రేరణ - అరవింద	55
చలసాని ప్రసాద్ గారితో గడిపిన కొన్ని మధుర క్షణాలు - పి. శాంతకుమారి	56
ఒక అసాధారణ పట్టకం చలసాని ప్రసాద్ - ఎన్ వేణుగోపాల్	57
చలసాని చిరంజీవి - ప్రొ. బి.వి. సుబ్బారావు	61
అక్షర నివాళి - మెట్టు రవీందర్	62
విలక్షణ బుద్ధిజీవి - పాణి	63
ఒక గుండెతడి మనిషి - పి.మోహన్	71
ప్రసాద్‌గారు ఇక పలకరించరు! - నిఖిలేశ్వర్	72
నువ్వులేవు, నీ అవసరం ఉంది - పి. రామకృష్ణ	72
అందరికీ బాబాయ్ ఓ విజ్ఞాన గని - స్వాతి వారపత్రిక	73

అగ్నిజ్వాల మన 'చలసాని' - షేక్ అహ్మద్ వలీ 73
చలసాని ప్రసాద్ జ్ఞాపకాలు కొన్ని... - సజ్జా వెంకటేశ్వరు 74
విప్లవ రచయిత చలసాని ప్రసాద్‌కు విప్లవ జోహార్లు - వాయిస్ ఆఫ్ న్యూ డెమోక్రసీ 76
చలసాని ప్రస్థానం - సంచలన వార్తాపత్రిక లీడర్ 77
పోరాటశీల సాహితీ స్వరం - రామతీర్థ 78
అతడిప్పుడు లేడు... అతడెప్పుడూ ఉన్నాడు - చందు సుబ్బారావు 79
ఆ నవ్వులో అరుణతార వెలుగు - పద్మకుమారి 80
అరమరికలు లేని ఉద్యమ నేత - శిఖామణి 84
సాహితీ సేనాని చలసాని - కె.వి.ఎస్. వర్మ 85
కా. విజయ సంస్మరణలో - చలసాని ప్రసాద్ 86
మరపురాని చలసాని - లోచన్ 87
ఆత్మీయ జ్ఞాపకం - వకుళాభరణం రామకృష్ణ 88
చలసాని ప్రసాద్ - భూపాల్ 89
శ్రీశ్రీ పరిశోధక మహాశక్తి - సింగంపల్లి అశోక్‌కుమార్ 90
శ్రీశ్రీ చలసాని - అసి 91
చలసాని జ్ఞాపకాలు - సమతా కోటేశ్వరరావు 92
నాకు ప్రియమైన తమ్ముడు ప్రసాద్ - అనసూయమ్మ 93
అరుదైన కార్యకర్త - సి.ఎస్.ఆర్. ప్రసాద్ 94
అతని వెనుక నడవడం - అరసవిల్లికృష్ణ 95
చలసాని నాకెలా తెలుసంటే... బొప్పూడి సాగర్ 96
మూడు తరాల నేస్తానికి ప్రేమతో... - చిన్ని చుక్కు (అనూరాధ సుధ) 97
కార్యశీల మహా స్వాప్నికుడు - జనజ్వాల 99
రేపటి మనిషికి నమూనా - నల్లూరి రుక్మిణి 100
లక్షల అడుగుల్లో పదైనా వేయగలమా? - ఎస్.ఆర్.కె. 104
'మా కామూ' అని ఇంకెవరంటారు? - డాక్టర్ వి.కామేశ్వరి 106
వెండి మేఘం - కృష్ణుడు 108
విప్లవ కలల నేతగాడు - మల్లీశ్వరి 110
నమ్మినవాడు మంచివాడు - వెల్చేరు నారాయణరావు 111
రన్నింగ్ కామెంటరీ - దేవిప్రియ 111
నా దృష్టిలో - వివిన మూర్తి 112
పుస్తకాలూ, ప్రజల మధ్య చలసాని! - నారాయణస్వామి వెంకట యోగి 115
స్నేహశీలి, సాహితీవేత్త - చలసాని ప్రసాద్ - చిగురుపాటి సతీష్ బాబు 117
చలసానికి మావోయిజం ఒక WAY OF LIFE! - కూర్మనాథ్ 118
సీపీ అంటే హేపీ! - బమ్మిడి జగదీశ్వరరావు 119
విలక్షణ సాహిత్య సంపాదకుడు - కుమార్ 121
సి.పి. కి మానవ సంబంధాలే కీలకం - గంటి రమణ 122
విప్లవోద్యమం ఇచ్చిన కానుక - చలసాని - కె. నాగేశ్వరాచారి 123
మూగబోయిన విప్లవ స్వరం - ఉప్పెన 124
కలం సిపాయి - చిలువేరు అశోక్ 124
ఈయనే మా ప్రసాద్ - హేమ-దాసు 125
తూరుపు తీరాన తీరని లోటు - జి ఎస్ రామ్మోహన్ 132
ఆయనే సముద్రమూ కొండ శిఖరాగ్రమూ... - కె. క్యూబ్‌వర్మ 133
సాహిత్యోపజీవి చలసాని ప్రసాద్ - ఆర్వీ రామారావు 134
ఆత్మవిశ్వాసం ఉన్న విప్లవ సాహిత్య జీవి - వి. చెంచయ్య 135
చలసాని స్మృతి - ఎం.వి. రమణారెడ్డి 138
ఆతడనేక యుద్ధముల.... - కాకరాల 139
అలసిన చలసాని - సంగ్రామ్ 143
అమరుడు చలసాని ప్రసాద్ మామయ్య - నాదెళ్ళ పాపారావు 144
విప్లవమే శ్వాసగా, ధ్యాసగా బతికిన కామ్రేడ్ చలసాని - రాంకి 145
చలసాని ప్రసాదన్న స్మరణలో - కోటి 147
ప్రసాదు ప్రస్థానం - నగరి బాబయ్య 148
విరసం నాయకులు చలసాని ప్రసాద్ కన్నుమూత - ఉపాధ్యాయ 149
విరసం చలసాని ప్రసాద్ మృతి - ఉపాధ్యాయ దర్శిని 149
చలనశీల ప్రసాద్ - ఎం. రాఘవాచారి 150
విశాఖ సముద్రం వెక్కివెక్కి ఏడ్చింది - ఎస్వీ 151
చలసాని ఒక చరిత్ర - వి. ప్రతిమ 151
చలసాని ప్రసాద్‌గారికి భాష్పాంజలి - తుర్లపాటి రామమోహన్‌రావు 152
విరసం చిరునామా! - డా. బీరం సుందరరావు 153
విరసం అరుణతార చలసాని ప్రసాద్ - ప్రమోద్ 154
ప్రియమిత్రుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్‌ను గుర్తు చేసుకుంటూ - సనోబర్ 155
చలసాని ప్రసాద్ ఒక యాది - ఒక వెంటాడే స్ఫూర్తి - బాసిత్ 157
కలం యోధుడు చలసానికి నివాళి - డప్పు రమేష్ 159
సాహిత్యం, సాహిత్య విమర్శ - చలసాని - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 160
భద్రపర్చండి... - ఉదయమిత్ర 161
విప్లవ పూవయ్యి పూసినా చలసాని - తంగెళ్ల సుదర్శనం 164
స్మృత్యంజలి - బి. కూర్మారావు 164
జైత్రయాత్ర - ఆర్. శశికళ 165
'అడవి తల్లిని' కడసారి చూసిన 'చలసాని' - తుంపాల శ్రీరామామూర్తి 167
అరుణారుణతార - పోతుల బాలకోటయ్య 168
ఒక ఏ.ఐ.ఎల్.ఆర్.సి. సెమినార్ - కామ్రేడ్ చలసాని జ్ఞాపకం - షోమాసేన్ 170
మరపురాని మహామనిషి - మన చలసాని ప్రసాద్ - కడియాల సుబ్బాచారి 170
చలసాని ప్రసాద్ మరణంతో డిటిఎఫ్ ఒక శ్రేయోభిలాషిని కోల్పోయింది - డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 171
నాకు తెలిసిన చలసాని - డా.ఇ. పెద వీర్రాజు 171
చలసాని స్వప్నం నిజం చేద్దాం - రామచంద్రం 172
కామ్రేడ్ చలసాని ప్రసాద్ - మిత్ర 173
అరుణకాంతులను - ఆకుల రఘురామయ్య 174
దశాబ్దాలుగా కరుగుతూ - బొగ్గరపు రాధాకృష్ణమూర్తి 174
కమ్యూనిస్టు మానవుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్ - కోటయ్య పిన్నిబోయిన 175
అమరుడు కా. చలసాని ప్రసాద్‌తో నా జ్ఞాపకాలు - అరుణోదయ రామారావు 176
చలసాని ప్రసాద్ అంతిమ యాత్ర సందర్భంలో 178
విరసం ఆధ్వర్యంలో చలసాని ప్రసాద్ సంస్మరణ సభల నివేదికలు 179

గమనిక : కామ్రేడ్ వివేక్, కామ్రేడ్ సూర్యంలపై కవితలు, పాటలు
అలాగే కామ్రేడ్ చలసాని ప్రసాద్‌పై మిగతా రచనలు రాబోయే సంచికలలో ప్రచురిస్తాం. - సం.



సంపాదకీయం...

రేపటి మానవుడికి స్వాగతం

పాణి

గుండెలవిసే దు:ఖంతో విరసం, విప్లవోద్యమం, విశాల ప్రగతిశీల సాహిత్య ప్రపంచం కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు వీడ్కోలు చెప్పాయి. అంటే మరింతగా సొంతం చేసుకున్నాయి. దు:ఖకరమైన ఉత్తేజమది. ఆయన నెలకొల్పిన సాహిత్యోద్యమ సంప్రదాయాన్ని భుజానికెత్తుకోవడం అది అంత తేలిక కాదు. కేవలం విస్తారమైన చారిత్రక యుగావధికి చెందిన మానవుడి వారసత్వమనే కాదు. అంతకంటే ఇంకా చాలా విశాలమైనదీ, గాఢమైనదీ. సాహిత్యం, సమాజం, విలువలు, విప్లవం.. వంటి సుదీర్ఘ గతానికీ, సుదూర భవిష్యత్తుకూ సంబంధించిన ఒక అద్భుత నమూనా ఆయన జీవితం. నిజంగానే రేపటి మానవికి, మానవుడికి ప్రయోగాత్మక సజీవ రూపం చలసాని ప్రసాద్. విరసానికి ముందు కూడా ఆయనకు ఎంతో చరిత్ర ఉన్నప్పటికీ ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలోనే ఒక కొత్త ఒరవడిగా, కొత్త ప్రయోగంగా విప్లవ రచయితల సంఘాన్ని ముందుకు తేవడంలో కీలకపాత్రధారి అయిన చలసాని ఇక అప్పటి నుంచి ఆ చరిత్ర నిర్మాణంలో భాగం.

విప్లవం చేసే కమ్యూనిస్టు పార్టీ వలె నిర్మాణం, రాజకీయ లక్ష్యం, సిద్ధాంత దృక్పథంతో సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పని చేస్తామని రచయితలు నిర్భీతిగా, బాహాటంగా చెప్పుకొని ఒక సంఘంగా ఏర్పడటం అప్పటికి ప్రయోగంగాక ఏమవుతుంది? చరిత్ర అలా ముందుకు తోసింది. దీని వెనుక చలసాని సుమారు పదేళ్లపాటు చారిత్రక శక్తుల సంఘర్షణను చెవియొగ్గి విని, అదెలా వ్యక్తం కానున్నదో తెలుసుకొంటూ వచ్చాడు. చరిత్రలోని పురోగామి శక్తుల గతిశీలతను ఆయన ముందుగానే తెలుసుకోవడం, ఆ దిశా నిర్దేశానికి తగినట్లు తాను నడవడం, తన తోటి వాళ్లను కదిలించడం అనే కీలక స్థానంలోకి వచ్చి నిలబడ్డాడు. చరిత్ర ఆయనను అక్కడ కనుగొన్నది.

నక్సల్బరీ ఆవిర్భావానికి ఉన్న చారిత్రిక క్రమమంతా తెలుగు సాహిత్య రంగానికీ వర్తిస్తుంది. బయటికి ప్రసాద్‌తో సహా అనేక మంది వ్యక్తులు కనిపించవచ్చు. ఘటనలకు, వ్యక్తుల సకల చర్యలకు, స్పందనలకు ఏవో కనిపించని చారిత్రక శక్తుల ప్రేరేపణ ఉంటుందని, సుదీర్ఘ క్రమాలు ఉంటాయని, ఎక్కడ ఏ రాపిడో జరిగి అనేక దారులు తెరుచుకుంటాయని చారిత్రక భౌతికవాద ప్రాథమిక పాఠాలు తెలిసిన వాళ్లకు కూడా స్పష్టమే. చరిత్ర ఎంత రైట్ టైం అవకాశమిచ్చిందంటే...విప్లవానికి నాయకత్వం వహించాల్సిన కార్మికవర్గ పార్టీ (సీపీఐ ఎంఎల్) ఆవిర్భవించినట్టే విప్లవోద్యమంలో భాగంగా విప్లవ సాహిత్యోద్యమం నడపడానికి విరసం కూడా పుట్టింది. పార్టీ ఏర్పాటు సక్రమంగా జరగలేదని విప్లవ శక్తుల్లోనే విమర్శ ఉన్నట్లు, విరసం ఏర్పాటు గురించి కూడా భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అది పూర్తిగా వేరే కత. కానీ చరిత్ర ఆ అవకాశాన్ని మాత్రమే ఇచ్చింది. కాబట్టే అవి అలా ఏర్పడ్డాయి. అప్పుడవి ఏర్పడి ఉండకపోయి ఉంటే ప్రసాద్ అన్నట్లు 1951లోనే .. రష్యాలోకంటే చాలా ముందే పెరిస్త్రోయికా వచ్చిన మన దేశంలో నక్సల్బరీ తిరుగుబాటులోంచి కూడా వర్గపోరాట పంథా చేతికి అంది వచ్చేది కాదు. చాలా సులభంగా నక్సల్బరీ తర్వాత కూడా పార్లమెంటరీ పంథా ఆధిక్యంలోకి వచ్చేది. విప్లవం గురించిన పండిత చర్చలు, పవిత్ర ఆకాంక్షలు మాత్రమే మిగిలిపోయేవి. సాహిత్యంలో దిగంబర కవులు అన్నట్లు నన్నయ బొందలోనే చాలా మంది విశ్రాంతి తీసుకుంటూ ఉండేవారు. సినిమా తళుకు బెళుకుల్లో మరి కొందరు, అకాడమీల్లో ఇంకొందరు తనవితారా మునిగితేలుతుండేవారు. శివసాగర్ అన్నట్లు నిజంగానే సమాజ విమానాన్ని నక్సల్బరీ హైజాక్ చేసింది. అందులో సాహిత్య రంగం కూడా ఉన్నది. అందులోని పురుటి నొప్పులన్నీ చలసానే అనుభవించాడు.

నక్సల్బరీ ప్రభాతోదయంలో విరసం ఆవిర్భావానికి తెర వెనుక సకల కార్యకర్తృత్వం చలసాని ప్రసాద్ చేతుల మీదుగా, ఆయన చైతన్యంలో భాగంగా జరిగింది. ఇక అక్కడి నుంచి విరసం చలనం, అందులోని

వేగం, సమాజం మీద వేసిన ప్రభావం, సమాజంలోని ఇతర ప్రగతిశీల శక్తుల ప్రభావానికి తాను గురికావడం.... అన్నీ విప్లవోద్యమ గతిశీలతతో ముడిపడి ఉన్నవే. విప్లవోద్యమంతో అలాంటి పేగుబంధాన్ని నిలబెట్టుకోవడం వల్లే ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో తన వంటి సంస్థ తనొక్కటే అయింది. చరిత్ర నుంచి ఒక ప్రయోగాత్మక ఆచరణగా నిగ్గుదేలి తానే ఒక నిజ చరిత్ర అయింది. శత్రువైనా, మరెవరైనా దీన్ని విప్లవోద్యమంతో రాజకీయ అనుబంధంగా మాత్రమే గుర్తించవచ్చు. కానీ ఇది అంతకంటే చాలా సంకీర్ణమైనది. తాత్వికమైనది. మౌలికంగా మనిషికి సంబంధించింది. అంటే మానవ సంబంధాల పునర్నిర్మాణానికి చెందినది. సంకుల సమరంలా సాగే వర్గ యుద్ధం నుంచి అతి సున్నితమూ, మానవీయమూ, సౌందర్యాత్మకమూ అయిన కళా వ్యక్తీకరణ ద్వారా ఒక కొత్త మానవ నిర్మాణం జరిగే ప్రక్రియలన్నిటినీ సాధించడం. సాహిత్యాన్ని అలా అర్థం చేసుకొని, రచించి, వ్యాఖ్యానించి విలువల, భావజాల వ్యవస్థగా తీర్చిదిద్దడమన్నమాట. విప్లవ రచయితలు ఒక నిర్మాణంగా, ఉద్యమంగా, సిద్ధాంతంగా ఇప్పటికి మూడు తరాలుగా ఏకమవుతున్న అతి మౌలిక క్షేత్రం ఇది. ఇలాంటి అనుభవం ప్రపంచంలోని ఏ దేశ విప్లవ రచయితలకూ కలగలేదు.

ప్రసాద్ తరం నలభై ఐదేళ్ల కింద దీన్ని కనుగొన్నది. అందులో అందరికంటే ఆయన పాత్ర ఎక్కువ. ప్రసాద్ స్మారకంగా ఇప్పుడు అదంతా గుర్తు చేసుకోకుండా ఎలా ఉండగలం? మానవ జీవితంలో, సామాజిక పరివర్తనలో సాహిత్యం, కళలు నిర్వర్తించే పాత్ర గురించి ఆయన చెప్పిన పాఠానికి విప్లవ రచయితలు నిత్య విద్యార్థులు, సహాన్వేషకులు. విప్లవంలో భాగమైన సాహిత్యతత్వాన్ని, దృక్పథాన్ని విరసం జీవశక్తిగా ప్రసాద్ అందించాడు. విరసం ఏర్పాటుకు ముందు పదిహేనేళ్ల నుంచి విరసం వంటి సాహిత్య సంస్థ నిర్మాణానికేగాక ఒక ప్రామాణికమైన సాహిత్య దృక్పథాన్ని అందివ్వడానికి ఆయన చేసిన కృషి సాహిత్యకారులందరిలోకి ఆయన్ను ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఆయన అందించిన సాహిత్య దృక్పథం సమస్త ప్రగతిశీల సాహిత్య ధోరణులన్నిటికంటే విలక్షణమైనది.

అందులో మనిషి ఆనందంతో, దుఃఖంతో కార్చే కన్నీళ్లు ఉన్నాయి. ఎన్నటికీ శృతి తప్పని రాగాలు ఉన్నాయి. ఏదో ఒకనాటికి పెట్టుబడి సకల దుర్మార్గాలను ధ్వంసించి మనిషి మాత్రమే లేచి నిలబడి తెరలు తెరలుగా సాగే నవ్వులు ఉన్నాయి. స్వేచ్ఛా మానవి, మానవుడు ఉన్నారు. ఇదొక ఎదురు చూపు, ఇదొక ఆచరణ, ఇదొక క్రమం. విప్లవంలో సాహిత్యాన్ని ఇలా సృజించాలనుకొని కత్తుల కోలాటం మధ్యలోకి వెళ్లి కవి నిలబడ్డాడు. ప్రసాద్ అలా వెళ్లి నిలబడి, దాన్ని వ్యాఖ్యానించి, రాసి, ప్రచారం చేసి ఒక తాత్విక, ఆచరణాత్మక ఒరవడి అయ్యాడు. ఆయన నిర్మించిన విరసంలోని బలం అంతా ఇదే.

అందుకే చలసాని ప్రసాద్ విస్తారమైన కమ్యూనిస్టు, విప్లవ చరిత్రకు, విప్లవ ప్రజా సాహిత్య చరిత్రకు చైతన్యవంతమైన మూర్తిమత్వం. అత్యంత ప్రయాసభరితమైన, పదునైన వర్గపోరాటపు కొస అంచుల మీద నడుచుకుంటూ ఆయన చరిత్ర ఆవరణలోకి వచ్చాడు. పరస్పరం సంఘర్షించిన శక్తుల్లోంచి చరిత్ర ఎలా పుడుతుందో ఆయన తన కళ్ల ఎదుట చూశాడు. చూస్తూ నిమిత్తమాత్రంగా ఉంటే ఆయన చలసాని ప్రసాద్ అయ్యేవాడు కాదు. జీవితమంతా తనవాళ్లెవరో, పరవాళ్లెవరో ఆయనకు కలలోనైనా, కలత నిద్రలోనైనా తడబడ లేదు. కోస్తా ప్రాంతంలో తన ఐదో ఏట జమిందారీ వ్యతిరేక పోరాటాల్లో పట్టిన ఎర్రజెండాను దండకారణ్య జనతన సర్కార్‌లో ఎగరేసి వచ్చాడు. తన బాల్యంలో కలగన్న సమసమాజ భావనను క్రాంతికారీ జనతన సర్కార్‌లో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో తనివితీరా చూశాడు. మహోజ్వల ప్రజానాట్యమండలిలో, అభ్యుదయ సాహిత్యోద్యమంలో చిగురించిన తన గానం, సాహిత్య రచన, అధ్యయన అభినివేశాలను చేతనా నాట్యమంచ్, దండకారణ్య రచయితల తుపాకీ కలాల అంచుల్లోని వెలుగుల్లో, అత్యున్నత రూపంలో పునర్దర్శించి వచ్చాడు.

విముక్తి ప్రాంతాల ఏర్పాటు అనేది ఆ తరం కమ్యూనిస్టులను వెంటాడిన కల కదా? అందునా సాహిత్య జీవుల నిజ, కల్పనా ప్రపంచమంతా పరుచుకున్న కల కదా? దాన్ని పలవరిస్తూ ఎందరు అమరులయ్యారో లెక్కించలేం. చలసానికి చరిత్ర ఎప్పుడూ ఎలాంటి అపురూపమైన, అరుదైన అవకాశాలను, జీవితాన్నీ ఇస్తూ వచ్చిందో కదా అనిపిస్తుంది. అలనాడు స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్ అని పిలిపించుకున్న కోస్తా కమ్యూనిస్టు గ్రామాల్లో పుట్టి పెరిగి, ఆడి పాడి, చదివి, రచించి, పోరాడి, త్యాగాలను భరించి ... ఇవాళ ఒక గెరిల్లా బేస్ విముక్తి ప్రాంతం కావడానికి పెనుగులాడుతున్న.. అక్షరాలా ప్రజా యుద్ధం సాగుతోన్న సన్నివేశాన్ని కళ్లారా చూసి వచ్చి ఒరిగిపోయాడు. ఆ విప్లవాకాంక్షే సర్వస్వంగా బతికాడు. ఈ దుర్మార్గ సమాజంలో సహితం కమ్యూనిస్టుగా జీవించడం సాధ్యమే అని నిరూపించడమేగాక విప్లవానికి విరసం వంటి నిర్మాణం అత్యవసరమని దాని.సుదీర్ఘ ప్రస్థానం ద్వారా అడగడుగునా నిరూపించాడు.

చలసాని జీవితం భారత కమ్యూనిస్టు ఉద్యమంలోని ఆటుపోట్లన్నీ రంగరించుకొని రాటుదేలిన నిజ గాథ. దశాబ్దాల పోరాటాలు, ఆరాటాలు, గెలుపు ఓటముల సంధ్యారాగాలు, నిందలు, నిష్ఠూరాల నడుమ సాగుతున్న అడుగుల సవ్వడి. నిత్య నూతనంగా రెపరెపలాడే మా అరుణ ధ్వజం. ఆ చరిత్ర పొడవునా నెత్తుటి దారుల్లో, డొంకదారుల్లో, కీకారణ్యాల్లో, మహోజ్వలమైన త్యాగాల విజయ పరంపరలో.. ప్రతి అడుగులో చలసాని కవిత్వమై. గానమై, పలు రచనా రూపాలై అక్షరాల కాగడాలతో నడిచాడు.

చలసాని ఉమ్మడి పార్టీ వైభవోజ్వల దినాలనూ చూశాడు. పార్టీ విద్రోహాన్నీ చూశాడు, ప్రపంచ మానవాళికి ఉత్తేజాన్నిచ్చిన సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాలను చూశాడు, అవి కూలిపోవడం చాలా ముందే పసిగట్టాడు, మళ్లీ రాజుకున్న నిప్పు కణికను సాహిత్యరంగంలోకి తెచ్చి వర్గపోరాటపు పెనుజ్వాల చేశాడు, అసలు వర్గమే లేదు, వర్గపోరాట మహా కథనాలు ముగిసిపోయాయనే వాదనలూ విన్నాడు. మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలాగే మావోయిస్టుల నేతృత్వంలోని బీజరూప ప్రజా రాజ్యాధికారాన్నీ చూశాడు. ఇవన్నీ గ్రాఫ్ గీచామంటే ఎన్నెన్ని ఎగుడుదిగుళ్లు, ఎంత శూన్యం, ఎంత రప్చర్, ఎంత దుఃఖం, ఎంత త్యాగం... హాయిగా శ్రీశ్రీని అలపిస్తూ బతికేయక ఇంత యాతన ఎందుకుపడ్డాడు? ఇష్టమైంది చదువుకుంటూ రాసుకుంటూ ప్రసంగిస్తూ ఉండక ఎందుకింత సాహసానికి ఒడిగట్టాడు? బతుకును ఎందుకింత ఒరిపిడి పెట్టుకున్నాడు? ఒక రచయితకు ఇదెలా సాధ్యమైంది? ఆయన కమ్యూనిస్టు మిత్రులేగాక ఇతర స్నేహితులు కూడా రాసినట్లు ఒక పసిపిల్లవాడిలాంటి, 'అమాయకుడైన సాదాసీదా మనిషి కదా? ఇవన్నీ ఎలా చేయగలిగాడు? తన కంటూ ఏమీ కోరుకోకుండా, తీసుకోకుండా అచ్చమైన కమ్యూనిస్టులా బతికి అమరుడయ్యాడు. ఆయన రూపొందుతూ ఉన్న రేపటి మానవుడు. ఆయనకు ఎలా వీడ్కోలు పలకగలం? స్వాగతం తప్ప.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని తుది వరకూ ఎత్తిపట్టిన ప్రముఖ విప్లవ రచయిత కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు విప్లవ జోహార్లు

అభయ్

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ

ప్రముఖ విప్లవ రచయిత కామ్రేడ్ చలసాని ప్రసాద్ తన 83వ ఏట విశాఖ పట్నంలో జూలై 25 నాడు తుది శ్వాస విడిచాడు. దేశంలో దీర్ఘకాల ప్రజాయుద్ధ రాజకీయాలను ఎత్తిపడుతూ ప్రధానంగా సాహితీ సాంస్కృతిక రంగాలలో చివరి వరకూ తన విశేష సేవలనందిస్తూ అశువులు బాసిన ప్రముఖ విప్లవ రచయిత కామ్రేడ్ చలసాని ప్రసాద్ స్మృతిలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది. ఆయన ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని ప్రతిజ్ఞ చేస్తోంది.

కామ్రేడ్ చలసాని దేశంలో విప్లవ రాజకీయాలను, ప్రధానంగా సాయుధ విప్లవాన్నీ, ప్రజా యుద్ధ పంథానూ ఎత్తిపడుతూ సాహితీ, సాంస్కృతిక రంగాలలో ఎనలేని కృషి చేశాడు. ఆయన తన యవ్వన ప్రాయంలో కమ్యూనిస్టు రాజకీయాల పట్ల ఆకర్షితుడై సోషలిస్టు సమాజ స్థాపనను తన జీవిత లక్ష్యంగా ఎంచుకొని సాంస్కృతిక రంగంలో నిజమైన బోల్షివిక్‌గా కృషి చేశాడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు రాజకీయాలను వంటబట్టించుకొని పార్లమెంటులో చొరబడి బూర్జువా ఎన్నికల రాజకీయాల జెండానెత్తుకుని సాయుధ విప్లవానికి తీరని ద్రోహం చేయడంతో కామ్రేడ్ చలసాని ఆ రాజకీయాలను ఏవగించుకున్నాడు. ఆ నాటి అభ్యుదయ రచయితల సంఘాన్ని వ్యతిరేకిస్తూ విప్లవ రాజకీయాల పక్షం వహించాడు. నక్సల్బరీ విప్లవోద్యమం దేశాన్ని అన్ని రంగాలలో పెద్ద కుదుపుకు గురి చేసింది. దేశ ప్రజల ముందు అది స్పష్టమైన విప్లవ పంథానుంచింది. భారత దేశాన్ని అర్ధ వలస అర్ధ భూస్వామ్య దేశంగా చెప్పి చైనా పంథాయే మన పంథా అంటూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని దేశ ప్రజల ముందు ఆవిష్కరించింది. నక్సల్బరీ విప్లవ రాజకీయాల జ్వాలలు దేశంలోని నలుమూలలకు వ్యాపించాయి. శ్రీకాకుళ విప్లవాగ్ని రగులుకుంది. ఆ విప్లవాగ్నులు ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులను, యువకులను, మేధావులను, రచయితలను, కళాకారులను, ప్రజాస్వామిక వాదులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ సమయంలోనే 'రచయితలారా మీరే వైపు అంటూ' విప్లవోద్యమం రచయితలను నిలదీసింది. ఆ ప్రశ్న కొత్త ఆలోచనలకు ప్రాణం పోసి కొత్త దారులను తెరిచింది. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవ రచయితల సంఘం అవతరించింది. ఆ నిర్మాణ కృషిలో ప్రముఖ పాత్ర పోషించిన సంస్థాపకులలో కామ్రేడ్ చలసాని ఒకరు.

దేశంలోని విప్లవోద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్ల నుంచి సాంస్కృతికోద్యమాన్ని ఎన్నటికీ విడదీసి చూడలేం. గత నలభై అయిదు సంవత్సరాలలో రాజ్యం సాగించిన దాడులన్నింటినీ అది ధైర్యంగా ఎదుర్కొంటూ విప్లవ రాజకీయాల జెండాను సమున్నతంగా ఎత్తిపడుతూ వస్తోందంటే అందులో కామ్రేడ్ చలసాని వంటి అనేక మంది కృషి నిబిడీకృతమై ఉంది. అది 1975 నుంచి 77 వరకూ దేశాన్ని జైలుగా మార్చిన అత్యవసర పరిస్థితి కాలమే కావచ్చు, విప్లవ రచయితల మీద బనాయించబడిన పలు కుట్ర కేసుల ఆగడాల కాలమే కావచ్చు, విరసంపై రాజ్యం విధించిన నిషేధ కాలమే కావచ్చు లేదా ఈ నాటి విప్లవోద్యమం అందులో భాగంగా సాంస్కృతికోద్యమం ఎదుర్కొంటున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ కాలమే కావచ్చు! అది ఏదైనా కావచ్చు! దాదాపు గత నాలుగున్నర దశాబ్దాలుగా దోపిడీ రాజ్యం కొనసాగిస్తున్న అన్ని నిర్బంధాలనూ, హంతక దాడులనూ ఆంధ్రప్రదేశ్‌లోని సాంస్కృతికోద్యమం అందులో భాగంగా కామ్రేడ్ చలసాని ధైర్యంగా ఎదుర్కొన్నారు. రచయితలను కుట్రదారులంటూ కటకటాల వెనుకకు రాజ్యం తోసినా 'విప్లవం కుట్ర కాదు, విప్లవకారులు కుట్రదారులు కారంటూ' నినదించిన వారిలో నమ్మిన ఆశయాల కోసం దృఢంగా నిలిచిన కామ్రేడ్ చలసాని ఒకరు. ఆయన ఎంతటి

విప్లవోద్యమ ఆటుపోట్లలోనైనా చలించని సంద్రంలా విప్లవ మేధావుల మధ్య, రచయితల మధ్య, కళాకారుల మధ్య అన్నింటికీ మించి జనం మధ్య నిలిచి నిత్యం కలానికి పదును పెడుతూ విప్లవ రాజకీయాల జెండాను ఎత్తిపట్టాడు.

పోటెత్తిన నక్సల్బరీ తదనంతర ఆటుకాలంలో విప్లవోద్యమ నిర్మాణ పార్టీ ముక్కచెక్కలైన పరిస్థితులలో నడి సంద్రంలో నావను వదిలి, తెరచాపను చింపి పలాయనం సాగించిన విప్లవ ద్రోహుల నీచమైన రాజకీయ దాడులకు నిశితమైన జవాబులిస్తూ దేశంలో సాయుధ నక్సల్బరీ విప్లవ పంథాను ఎత్తిపట్టిన వారిలో కామ్రేడ్ చలసాని ఒకరు. 'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి. సత్యమూ మాస్టారు ఎవ్వరని అడిగితే గిరిజనుల సత్యమని గొప్పగా చెప్పాలి' అన్నదే ఆయన సునిశితమైన జవాబుగా నిలిచింది. ఆ రాజకీయాలే ఊపిరిగా వాటికి ఆయన ప్రతిబింబంగా నిలిచాడు. 1995లో ఏర్పడిన అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి నిర్మాణ కృషిలో కామ్రేడ్ చలసాని పాత్ర మరవలేనిది. ఆ తర్వాత కాలంలో కూడా విప్లవోద్యమం ఎన్నెన్నో ఆటుపోట్లను చవి చూసింది. ఆంధ్రప్రదేశ్‌లో 1980వ దశకం మధ్యలో విప్లవ పార్టీని, విప్లవ రాజకీయాలనూ వదిలి బహురూపిగా ప్రజల ముందు బయటపడిన శివసాగరుడి దారితప్పిన రాజకీయాల స్వభావాన్ని అనవ్యాంచుకున్నాడు. 1970, 1980లలో విప్లవోద్యమానికి చుక్కానిలా నిలిచిన సిపిఐ(ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్) పార్టీ సర్వోన్నత నాయకత్వంలో ప్రముఖులైన కొండపల్లి సీతారామయ్య 90ల ప్రారంభంలో ఆ విప్లవ రాజకీయాలకే అపచారం చేస్తూ అంతిమంగా ఉద్యమం నుంచి బహిష్కృతుడైన పరిస్థితులలో సరైన విప్లవ రాజకీయాల పక్షం నిలిచి వాటి కోసం దృఢంగా పోరాడిన వారిలో కామ్రేడ్ చలసాని ఒకరు. ఆయన ప్రజా యుద్ధ రాజకీయాలకు పూర్తిగా అంకితమై అత్యంత విశ్వసనీయంగా పనిచేశాడు. శ్రీకాకుళ కొండల్లో 'గిరిజనులు' తిరిగి సాయుధమైన క్షణాన ఆయన ఆనందానికి అవధుల్లేవు. ఆయన తుది సంవత్సరాలలో (2013) దండకారణ్య గెరిల్లా బేసులో వీర గెరిల్లాల ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం మధ్య గడిపిన కొద్ది రోజులు ఆయన యవ్వన ఆనందాన్ని అనుభవించాడు. దండకారణ్య రచయితలు, కళాకారులతో, పార్టీ నాయకత్వంతో పంచుకున్న అపార అనుభవ చారిత్రక అరుణారుణ జ్ఞాపకాలు అజరం, అమరం. ఆయనొక గొప్ప ఆదర్శ జీవి. ఆయన యువ విప్లవకారులకు ఒక చక్కని విప్లవ గురువు. ఆయన తన సర్వస్వాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన నిస్వార్థజీవి. విశాఖ పట్నంలో ఆయన ఇల్లు విప్లవ రాజకీయాలకు ఒక ముఖ్య కేంద్రం. ఆయన కుటుంబం ఒక పెద్ద నేస్తం. ఆయన ఎంతో శ్రద్ధాసక్తులతో సేకరించుకున్న పుస్తకాల భాండాగారం విప్లవ అధ్యయన పరులందరికీ తరగని విప్లవ ఖనిలా నిలిచింది. ఆయన లేని లోటు తీర్చాల్సిన బాధ్యత మనపై ఉంది. ఆ అమర జీవి ఆశయాల సాధనకై పోరాడుతామని మనమంతా దృఢంగా ప్రతిన బూనుదాం.

దండకారణ్యంలో పోలీసులు జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన కామ్రేడ్ వివేక్ (న్యాయశాస్త్ర విద్యార్థి) స్మృతిలో విరసం తన నలభై అయిదవ ఆవిర్భావ దినం సందర్భంగా 'రచయితలారా! మీరే వైపు' అంటూ ప్రశ్నించింది. 1970లో విరసం నిర్మాణానికి దారి తీసిన 'రచయితలారా మీరేవైపు' అన్న ప్రశ్నను గుర్తు చేసుకుంటూ విరసం ఈ రోజు మరోమారు ఆ ప్రశ్నను రచయితల ముందుంచింది. కానీ ఈ రోజు కామ్రేడ్ ప్రసాద్ భౌతికంగా మన మధ్య లేడు. ఆ పిలుపులో ఆయన భాగంగా ఉన్నాడు. 1970 నాటి పిలుపుకు కార్యరూపం ఇవ్వడంలో విప్లవ పట్టుదలను ప్రదర్శించిన ప్రసాద్ ఆచరణ - ఆదర్శాలు నేటి తరం ముందున్నవి. ఆ నాటి కన్నా సాపేక్షికంగా ముందంజలో ఉన్న విప్లవోద్యమం ఈనాడు దేశంలో ఉంది. ఆనాడు ఒక స్వప్నంగా నిలిచిన ఎర్ర సైన్యం ఈ నాడు దేశ ప్రజల చేతుల్లో ఆయుధంగా నిలిచి ఉంది. ఆనాటి కన్నా కామ్రేడ్ ప్రసాద్ లాంటి వారెందరెందరి కృషి ఫలితంగా ఈనాడు దేశంలో విప్లవ సాంస్కృతికోద్యమం బలంగా ఉంది. ఇవన్నీ ఒక పార్శ్వం. దీని మరో పార్శ్వం దేశంలో బ్రాహ్మణీయ హిందూ ధార్మిక ఫాసిస్టులు రాజ్యమేలుతున్నారు. నేటి విప్లవోద్యమాన్ని నిర్మూలించడం వారి తక్షణ ఎజండాలో ఉంది. అందుకు వారు ఎంతటి ఫాసిస్టు చర్యలకైనా తలపడతారు. గత యుపిఏ ప్రభుత్వం అనుసరించిన ఫాసిస్టు విధానాల కన్నా దుర్మార్గమైన విధానాలను నేటి ప్రభుత్వం అనుసరించి తీరుతుంది. గత ప్రభుత్వం ప్రపంచ విప్లవ మేధావుల్లో ఒకరైన యాన్ మిర్డాల్‌ను మన దేశం రావడంపై నిషేధం విధించింది. దేశంలో పీడిత ప్రజల పక్షాన నిలిచి పనిచేస్తున్న విప్లవ ప్రజాస్వామిక ఫ్రంటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ప్రస్తుతం దేశంలోని మేధావులు, రచయితలు, కళాకారులు ఎంతటి భయానక పరిస్థితుల మధ్య తమ కలాలను సాగించాల్సి వస్తుందో, గళాలను విప్పాల్సి వస్తుందో హైద్రాబాద్‌లో గత సెప్టెంబరు 21నాటి ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను భగ్నం చేసిన అనుభవాన్ని బట్టి సులువుగానే అర్థం చేసుకోవచ్చు. ఫాసిస్టు రాజ్యం కొనసాగిస్తున్న అణచివేత దాడులను ఐక్యంగా, ధైర్యంగా ప్రతిఘటిస్తూ ఓడించకపోతే దేశంలో ఉన్నాయంటున్న సోకాల్డ్ సెక్యులరిజంగానీ, ప్రజాస్వామ్యం గానీ, హక్కులు గానీ అన్నీ ఉత్తవే అయిపోయి భారత దేశం అతిపెద్ద జాతుల బందీఖానాగా, బడా జైలుగా మిగిలిపోతుంది. ఈ ప్రమాదాన్ని అరికట్టడానికి ప్రగతిశీల, అభ్యుదయ, విప్లవ రచయితలు, మేధావులు, కళాకారులు, పాత్రికేయులు, మీడియా పర్సన్స్, పర్యావరణ వాదులు, ఆదివాసీ హితాభిలాషులు సమైక్యంగా నిలవాలి. ప్రజా ఉద్యమాలలో సమీకృతులై తమ వంతు పాత్ర పోషించాలి. విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ విజయం వైపు పురోగమింప చేస్తూ కామ్రేడ్ చలసాని విప్లవ స్వప్నాలను సాకారం చేయ్యాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తూ ఆయనకు మనమందించే నిజమైన నివాళి అదే అవుతుందని తెలియచేస్తోంది.

కామ్రేడ్ చలసాని అమర్ హై!

మార్క్సిజం - లెనినిజం - మావోయిజం వర్ధిల్లాలి!

విప్లవ సాహితీ సాంస్కృతికోద్యమాలు వర్ధిల్లాలి!

భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి నశించాలి!

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలను సమైక్యంగా ఓడించాలి!

నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

- 28 జూలై, 2015

(www.bannedthought.net నుంచి)



కొన ఊపిరి దాకా ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన విప్లవ రచయితల సంఘం నాయకుడు

కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు అరుణారుణ జోహార్లు!

ప్రతాప్

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సెంట్రల్ రీజినల్ బ్యూరో

విరసం వ్యవస్థాపక సభ్యుడు, విప్లవ రచయిత, మేధావి కామ్రేడ్ చలసాని ప్రసాద్ (83) జూలై 25 పొద్దున గుండెపోటుతో విశాఖ పట్టణంలో మరణించారని తెలిసి మా పార్టీ తీవ్రంగా విచారిస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకూ, విరసానికీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఈ సందర్భంగా విప్లవోద్యమానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటోంది.

కామ్రేడ్ చలసాని ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో ఒక మధ్య తరగతి కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టారు. విశాఖపట్టణంలో అధ్యాపక వృత్తిని చేపట్టిన ఆయన విశాఖపట్టణాన్నే స్వస్థలంగా చేసుకున్నారు. ఆయన సహచరి కామ్రేడ్ విజయలక్ష్మి 2003లో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. కాగా ఆయన పెద్ద కూతురు కామ్రేడ్ నవత మా పార్టీ సీనియర్ కార్యకర్త.

కుటుంబ నేపథ్యం రీత్యా సహజంగానే చిన్న వయసులోనే ఆయన కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. విప్లవ విద్యార్థి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన, ఆ తర్వాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త అయ్యారు. కానీ ఆ తర్వాత కాలంలో ఆ పార్టీలు పార్లమెంటరీ పంథాను అనుసరించి, విప్లవానికి ద్రోహం చేయడంతో వాటిని వ్యతిరేకించారు.

సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం)ల రివిజనిజం, నయా రివిజనిజాలను ఎండగడుతూ భారత విప్లవ పంథాను నిర్దేశించిన నక్సల్బరీ మేఘగర్జన పట్ల ఆకర్షితులైన అసంఖ్యాక యువతరంలో ఆయన ఒకరు. నక్సల్బరీ పంథాలో పోటెత్తిన శ్రీకాకుళ పోరాటంతో ఆయన పూర్తిగా మమేకం అయ్యారు. నక్సల్బరీ, శ్రీకాకుళాలు తీవ్ర నిర్బంధానికి గురై దెబ్బ తిన్నప్పటికీ, ఆ విప్లవాగ్నులు ఆరిపోకుండా రాజేసిన విప్లవకారుల్లో ఆయన ఒకరు. అభ్యుదయ రచయితల సంఘం సభ్యుడైన కామ్రేడ్ చలసాని ఆ సంఘం పరిమితులను, మితవాద వైఖరిని ఎండగట్టారు. నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాలను వ్యాపింపజేసే సాహితీ సాంస్కృతిక వేదికగా విప్లవ రచయితల సంఘం ఏర్పాటుకు కృషి చేశారు. 1970లో విశాఖలో జరిగిన శ్రీశ్రీ అరవై ఏళ్ల సభలో 'రచయితలారా! మీరెటువైపు?' అంటూ ప్రశ్నించిన చారిత్రక కరపత్రాన్ని వెలువరించడంలో కామ్రేడ్ చలసాని కృషి చిరస్మరణీయమైనది.

విరసం వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన కొన ఊపిరి వరకూ విరసంలో చురుకైన పాత్ర వహించారు. నిప్పులు చెరిగే నిర్బంధంలో సైతం ఆయన విరసం పతాకను దృఢంగా ఎత్తిపట్టారు. ఎమర్జెన్సీలో అరెస్టయి జైలు గోడల నడుమ కూడా విప్లవాన్ని నినదించారు. 1985లో అప్పటి విరసం కార్యదర్శి కామ్రేడ్ వరవరరావును ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెడితే, కామ్రేడ్ చలసాని కార్యదర్శి బాధ్యతలు చేపట్టి 1986లో కార్యదర్శిగా ఎన్నికై విరసానికి మార్గదర్శకత్వం అందించారు. 1998 జనవరిలో శ్రీకాకుళం విరసం మహా సభల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన కెవిఆర్ మూడు రోజులకే అమరుడు కాగా ఆ బాధ్యతలు చేపట్టి 2000 దాకా అధ్యక్షుడిగానూ విరసానికి సేవలందించారు. విరసం అధికార పత్రిక అరుణతారకు ఆఖరి శ్వాస దాకా ఆయనే ఎడిటర్, ప్రింటర్, పబ్లిషర్‌గా పని చేశారు. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితిలోనూ ఆయన పాత్ర మరువలేనిది. విరసం సభల్లో, సాహిత్య పాఠశాలల్లో, సెమినార్లలో, వర్క్‌షాపుల్లో, రాజకీయ తరగతుల్లో ఇంకా మరెన్నో విప్లవ సంస్థల కార్యక్రమాల్లో ఆయన పాల్గొని విలువైన పాఠాలు చెప్పారు. ప్రసంగాలు చేశారు. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావుల రచనలను సంపుటాలుగా వెలువరించడానికి ఆయన అలుపెరగని కృషి చేసారు. సంస్థకు ఆయన అందించిన విలువైన సేవలకు గుర్తుగా విరసం ఆయనను శాశ్వత ఆహ్వానితుడిగా గుర్తించి గౌరవించింది. అయితే ఆయన వినమ్రంగా శాశ్వత సభ్యత్వాలు విప్లవ సంప్రదాయం కాదని నచ్చచెప్పారు.

విప్లవోద్యమ ఆటుపోట్లలో, ఎగుడు దిగుడుల్లో ఆయన నిబ్బరంగా విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొనే ఉన్నారు. సత్యమూర్తి, కొండపల్లి మా పార్టీలో సంక్షోభం తీసుకువచ్చిన సందర్భాల్లో ఆయన విప్లవ పక్షం వైపు దృఢంగా నిలబడ్డారు. నాటి శ్రీకాకుళ పోరాటం దెబ్బతిన్నా, నేటి నల్లమల ఉద్యమం దెబ్బతిన్నా భవిష్యత్ పట్ల ఆశావహ దృక్పథాన్ని వీడలేదు.

లోతైన, విస్తృతమైన రాజకీయ, సైద్ధాంతిక అధ్యయనం చేసిన సాహిత్యకారుడు ఆయన. ఆయన సేకరించుకున్న పుస్తకాలు ఒక అరుదైన గ్రంథాలయంగా, విలువైన సాహితీ సంపదగా నిలిచాయి. విస్తృతమైన అధ్యయనంతో ఆయన పలు రచనలు చేశారు. సూటిదనం, సరళత్వం, క్లుప్తతతో కూడిన ఆయన శైలి పాఠకులను ఆకర్షిస్తుంది. వివిధ సందర్భాల్లో ఆయన చేసిన రచనలను విరసం 2008లో సాహిత్య వ్యాసాలు, 2010లో చలసాని ప్రసాద్ రచనలు అనే సంపుటాలుగా వెలువరించింది. కె.వి.ఆర్. చరిత్ర రచనలోనూ, త్రిపురనేని తత్వశాస్త్ర రచనలోనూ కృషి చేయగా ప్రసాద్ ఈ రెండింటిలో కృషి చేశారు. వాటికి కార్మిక వర్గ రాజకీయాలు జోడించి ఆయన చేసిన రచనలైనా, ప్రసంగాలైనా చాలా పదునుగా ఉండేవి. ఆయన కొన్ని కవితలు కూడా రాశారు.

ప్రజాస్వామిక ఉద్యమాల పట్ల స్పష్టమైన అవగాహనను కలిగి ఉన్న ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని గట్టిగా సమర్థించడమే కాదు, విశాఖపట్టణంలో ఆ ఉద్యమానికి మద్దతును కూడగట్టడానికి కృషి చేశారు.

కామ్రేడ్ చలసాని ఎల్లప్పుడూ ఉత్సాహంగా యువ కార్యకర్తలకు ప్రేరణగా ఉండేవారు. 80 ఏళ్లు దాటిన వయసులో కూడా ఆయన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో జరిగిన దాదాపు అన్ని విప్లవ కార్యక్రమాలకు హాజరయ్యేవారు. మా ప్రియతమ అమరుల మృతదేహాల స్వాధీనం కోసం పోరాడేవారు. నిర్బంధాన్ని ధిక్కరించి అమరుల అంత్యక్రియలకు హాజరయ్యేవారు.

ఆయన మంచి గాయకుడు కూడా. ఆయన పలు సందర్భాల్లో 'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి' అంటూ శ్రీకాకుళ ఉద్యమ స్మృతులను, శ్రీకాకుళ అమరుల త్యాగాలను గుర్తు చేసుకొనేవారు. ఆయనే ప్రత్యేకంగా పాడే పాటలు శ్రీకాకుళ ఉద్యమంతో ఆయన మమేకత్వాన్ని చాటిచెప్పేవి.

కామ్రేడ్ చలసాని స్నేహశీలి. తన సంస్థలోనూ, విప్లవోద్యమంలోనూ పని చేసే అతి చిన్న వయసు కార్యకర్తలతో కూడా స్నేహితుడిగా వ్యవహరించేవారు. రాజకీయంగా విభేదించే వాళ్లతోనూ సన్నిహిత స్నేహ సంబంధాలు కొనసాగించే విలక్షణ వ్యక్తిత్వం ఆయనది. తాళాలు లేని ఇండ్లు, బెత్తాలు లేని బళ్లు ఉండాలనేది ఆయన కల. దానికి తగినట్టుగా విశాఖపట్టణంలోని వాళ్ల ఇల్లు రాష్ట్రంలోని, దేశంలోని రాజకీయ కార్యకర్తలకు సొంత ఇంటిలాగానూ, రాజకీయ కేంద్రంగానూ ఉండేది.

శాస్త్రీయ దృక్పథంతో తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన కామ్రేడ్ చలసాని తన మృత దేహం కూడా శాస్త్ర విజ్ఞానానికి, ప్రజలకు ఉపయోగపడాలనే ఆకాంక్షతో విశాఖ కింగ్‌జార్జ్ హాస్పిటల్‌కు దానం చేశారు. ఆయనకు మరోసారి వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నాం.

విప్లవోద్యమం పట్ల కామ్రేడ్ చలసాని అంకిత భావం, సైద్ధాంతిక నిబద్ధత, నిమగ్నత, విప్లవోత్తేజం, ఉత్సాహం, అవిశ్రాంతంగా శ్రమించే గుణాలను నేటి యువతరం ప్రేరణగా తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

కామ్రేడ్ చలసాని ఏ విప్లవోద్యమ రాజకీయాలకు తన నిండు జీవితాన్ని అంకితం చేశారో, ఆ విప్లవోద్యమంపై తీవ్ర అణచివేతకు పాల్పడిన, పాల్పడుతున్న; ఆ విప్లవోద్యమ కార్యకర్తలెందరినో క్రూరాతి క్రూరంగా హత్యచేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నేడు కామ్రేడ్ చలసాని మృతికి సంతాపం తెలియజేయడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసి, అమరుడిగా చరిత్రకెక్కిన కామ్రేడ్ చలసాని పేరును ఉచ్చరించే అర్హత కూడా చంద్రబాబుకు లేదని, చంద్రబాబు బూటకపు మాటలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విప్లవ ప్రజానీకం మోసపోయే స్థితిలో లేరని తెలియజేస్తున్నాం.

తేదీ: జులై 26 2015

(www.bannedthought.net నుంచి)

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని - 2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

వెల : రు. 125/-

ప్రతులకు :

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387

విప్లవ సాహిత్యోద్యమ నాయకుడు, ఉత్తమ కమ్యూనిస్టు కా. చలసాని ప్రసాద్‌కు విప్లవ జోహార్లు

రాజకీయ ఖైదీలు, విశాఖ సెంట్రల్ జైలు

అభ్యుదయ సాహిత్యోద్యమ వారసత్వం నుంచి వచ్చి నాలుగున్నర దశాబ్దాలకుపైగా విప్లవ సాహిత్యోద్యమ నిర్మాణానికి అహరహం కృషి చేసిన కా. చలసాని ప్రసాద్ తన ఎనభై మూడవ ఏట తుదిశ్వాస వదిలాడు. 1970లో విరసం సంస్థాపనలో కీలకమైన భూమికను నిర్వహించింది మొదలు తన జీవన సర్వస్వం విప్లవ సాహిత్య ఉద్యమ నిర్మాణానికే వెచ్చించాడు. ప్రగతిశీల, విప్లవ సాహిత్యాలే తన ఊపిరిగా బతకటమే కాదు, విప్లవోద్యమానికి కూడా నాలుగున్నర దశాబ్దాలుగా అంకితమై ఎనలేని కృషి చేశాడు. తానే కాదు, తన కుటుంబసభ్యులందరూ విప్లవోద్యమానికి సహాయ సహకారాలు అందించేలా, అందులో క్రియాశీల భాగస్వాములయ్యేలా మలిచాడు.

విప్లవకారులు, విప్లవ రచయితలు, మేధావులు సాధారణంగా అజాత శత్రువులుగా ఉండరు. అయితే చలసాని వంటివారు అందుకు కొంత మినహాయింపు. రకరకాల రాజకీయ అభిప్రాయాలున్నవారిలో, భిన్నవర్గాల వారిలో కూడా చలసాని అంటే అమితమైన గౌరవం, అభిమానం ఎంతగా ఉన్నాయో ఆయన అంతిమ యాత్రకు తరలి వచ్చిన వారిని చూస్తేనే అర్థమవుతుంది. ఆయన నిరాడంబరత్వం, స్నేహశీలత, పసిపిల్లల్లాంటి అమలినమైన స్వచ్ఛమైన మనస్సు, తను నమ్మిన సిద్ధాంతం కోసం అక్షరాలా అంతిమశ్వాస వరకు పోరాడటం - ఇవే అతన్ని అందరూ 'తమ వాడు' అనుకునేలా, 'అందరివాడు' అయ్యేలా చేశాయి. అతనిది ఒక ఆదర్శ కమ్యూనిస్టు జీవితం. అది నేటితరం అనుసరించవలసిన జీవన విధానం.

సాహిత్యజీవిగా ఆయన ప్రయాణం జగమెరిగినదే. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావం నాటి నుంచి నలభై అయిదో వార్షికోత్సవం దాకా సాహిత్య సభలు, సమావేశాలు, కార్యశాలలు, పాఠశాలలు ఆయన పాల్గొనని కార్యక్రమం లేదంటే అతిశయోక్తి కాదేమో! వందలాది పుస్తకాల ప్రచురణకు అహరహం శ్రమించాడాయన. శ్రీశ్రీ, కొకుల సాహిత్య సర్వస్వం తీసుకురావటంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా పట్టుదలగా ఆ కర్తవ్యాన్ని నెరవేర్చాడు. అయితే తన గురించి కాక, ఇతరుల గురించే ఎల్లప్పుడూ ధ్యాస ఉండటం వల్ల కావచ్చు తన రచనలను ప్రచురించటంలో మాత్రం నలభై యేళ్లపాటు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఆయన రచనలు తెలుగు అభ్యుదయ, విప్లవ సాహిత్య చరిత్ర పాఠాలు. రచనల కంటే ఎన్నో రెట్లు అధికంగా ఆయన ఇచ్చిన వేలాది ఉపన్యాసాల్లో తెలుగు సాహిత్య, సమాజ చరిత్ర నిండి ఉండేది. ఆయన పాఠాలు, ఉపన్యాసాలు, రచనలు ఆయన మాటల్లాగానే ఎంతో సరళమైనవి, తేట తెనుగులూరేవి. అచ్చ తెలుగుకు ఆయన వ్యాసాలు ఒక ఉదాహరణ.

చలసాని సాహిత్యజీవి మాత్రమే కాదు. తొలితరం విప్లవ నాయకులకు ఆయన శ్రీకాకుళ ఉద్యమ చరిత్రోపాధ్యాయుడు కూడా. ఆయన చెప్పిన చరిత్ర పాఠాలు ఎందరికో స్ఫూర్తి కలిగించాయి. తన పాఠాలతో ఆయన ఎందరినో విప్లవకారులుగా మలిచాడు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో విప్లవోద్యమాన్ని పునర్నిర్మించటానికి ఎనభైల నుండి పూను కున్నప్పుడు విప్లవ పార్టీకి అన్ని విధాల సహాయ సహకారాలందించాడు. వయసును కూడా లెక్కల్లోకి తీసుకోకుండా, ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఆనాటికీ, ఈనాటికీ కూడా ఆయన ఒక పెద్ద దిక్కుగా, వెన్నుదన్నుగా నిలబడ్డాడు. బయట నుంచి వచ్చే ఎవరికైనా ఆయన ఇల్లే ఒక చిరునామా, ఒక ఆశ్రయం, ఒక కమ్యూన్.

కా. చలసాని సాహిత్యానికీ, రచనలకూ మాత్రమే పరిమితమైన వాడు కాదు. అతను కార్యశీలి. ఉత్తరాంధ్రలో ఏ బహిరంగ ప్రజా పోరాటం జరిగినా అందులో ఆయన ప్రత్యక్షంగా భాగస్వామి అయ్యాడు. ప్రజాయుద్ధ పోరాటాలన్నింటికీ విస్తృత మద్దతు కూడగట్టటానికి ప్రయత్నించాడు. జూన్ 20న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కా. సూర్యం పార్థివ శరీరాన్ని తల్లితండ్రులకు అప్పగించటానికి జూన్ 27న పాడేరు వెళ్ళిన బృందంలో ఒక పెద్ద దిక్కుగా ఆయన ఉన్నాడు. అంత వృద్ధాప్యంలో కూడా వెళ్ళటం అతని కార్యశీలతకు నిదర్శనం. అతని వయసు ఎనభై మూడు అని తెలుసు కాబట్టి వృద్ధాప్యం అనవలసిందే, కానీ ఆయన స్ఫూర్తిని చూస్తే మాత్రం వృద్ధుడు అనడానికి మనసొప్పదు. అతను నిత్య నవ యవ్వనుడు.

చలసాని పుస్తకాభిమానం, ఆయన ఇల్లే ఒక పెద్ద గ్రంథాలయం కావటం తెలిసిన విషయమే. ఆ పుస్తకాలయాన్ని తమ సొంతం చేసుకోవటం కోసం పదుల లక్షలు కొందరు ఇవ్వజూపినా ఆ పుస్తకాలు ఉద్యమానికి ఉండాలని ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించాడు. ఈ అమూల్య సంపత్తిని ప్రజల ఆస్తిగా చిరకాలం భద్రంగా ఉండేలా తగిన ఏర్పాట్లు చేయటం విరసానికి ఉన్న గురుతర బాధ్యత. ఇందుకు విరసానికి తోడ్పడటం చలసాని అభిమానులందరి కర్తవ్యం. అదే ఆయనకు నిజమైన నివాళి.

కా. చలసాని లేని లోటు రాజకీయ ఖైదీలకు పూరించలేనిది. రాజకీయ ఖైదీలకు కావలసిన అన్ని రకాల సహాయాలు బయటి నుంచి అందించటమే కాదు. రాజకీయ ఖైదీల హక్కుల దినంగా జరుపుకుంటున్న సెప్టెంబర్ 13న జరిగే నిరసన కార్యక్రమాల్లో ఇతర సంఘాలతో కలిసి కా. చలసాని తప్పనిసరిగా పాల్గొనేవాడు. ఖైదీలను కలవటానికి వచ్చే దూరప్రాంతపు బంధుమిత్రులు తన ఇంట్లోనే ఉండాలని పట్టు పట్టేవాడు. 'తలుపుల్లేని ఇళ్ళు'ండే సమాజాన్ని గురించి స్వప్నించడమే కాదు, ఆయన ఇంటిని తలుపుల్లేని ఇల్లులా మలిచాడు. విశాఖ జైలులో బయటి రాష్ట్రాలకు చెందిన ఎందరో విప్లవోద్యమ నాయకులు నిర్బంధం నుంచి బయటకు రావటానికి అవసరమైన పూచీకత్తు ఇవ్వడానికి ఎవరు సిద్ధపడతారను కున్నప్పుడు మన చలసాని ఉన్నారనే భరోసా ఒకటుండేది. అత్యవసరంగా ఏ ఆర్థిక అవసరం వచ్చినా సరే... ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనైనా సరే తక్షణమే తనకున్న విస్తృత పరిచయాలతో సాయం చేయగలడని రాజకీయఖైదీలకు ఒక నిశ్చింత, భరోసా ఉండేది. వీలైనప్పుడల్లా రాజకీయ ఖైదీలను జైలులో కలిసి ఎంతో అనురాగం, ఆప్యాయతలతో పలకరించి తన దృఢమైన కరచాలనాలింగనాలతో విప్లవస్ఫూర్తిని మాలోకి ప్రసరింప జేసేవాడు.

కమ్యూనిస్టుగా మారటం గొప్పకాదు. కమ్యూనిస్టుగా తుదకంటా మనగలగటం గొప్ప. జ్ఞానమెరిగిన నాటి నుంచి కమ్యూనిస్టుగా జీవించి, మరణించిన చలసాని ధన్యజీవి. ఆ కామ్రేడ్‌కు మా విప్లవ జోహార్లు.

కా. చలసాని ప్రసాద్ అమర్ రహే!

విప్లవ సాహిత్యోద్యమం చిరకాలం వర్ధిల్లాలి!

నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

సిపి చెప్పిన పాఠం

వరలక్ష్మి

జులై 25న పుష్కరాల వల్ల నా బస్సు ఆలస్యం కాకుండా ఉంటే చివరిసారి చలసాని ఏం చెప్పేవాడో! అంతకుముందు, దానికన్నా ముందు చెప్పినట్లుగానే మొదట అరుణతార గురించే మాట్లాడేవాడేమో. మీరు చెప్పినట్లు పత్రిక నెల నెలా వస్తోంది చూడండి అంటే అలా కాదు, ప్రతినెలా అయిదోతేదీ లోపు తప్పనిసరిగా రావాలి అని నొక్కిచెప్పేవాడు. అరుణతార ఎడిటర్ బాధ్యతల్ని కాగితాల మీద కూడా బదిలీ చేశాక ప్రశాంతంగా పోతాను అని రాంకీతో అన్నట్లుగానే ఆయన చివరి సంతకం అదే అయింది. ప్రతిదీ నాలుగైదుసార్లు చెప్పేవాడు. ఆ రోజు చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. సాయంకాలం దండకారణ్య కవిత్వం గురించి ఆయన మాట్లాడాల్సి ఉంది. 'ప్రజల్ని సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి' అంటూ విప్లవ సాహిత్యం రూపొందిన చారిత్రక పరిణామమే కాదు, సాయుధ ప్రజలే లిఖిస్తున్న చరిత్ర గురించి, సాహిత్యం, కళల గురించి తాను చూసిన దండకారణ్య నూతన సమాజాన్ని పొయెటిక్‌గా చెప్తాడనుకున్నాం. శ్రీశ్రీ నుండి షహీదా వరకు ఎక్స్‌టెండ్ అయిన సాహిత్య ప్రేమికుడు, విప్లవ సాహిత్య సాంస్కృతిక కార్యకర్త, సాంస్కృతికోద్యమ నాయకుడు చలసాని ప్రసాద్. ఆయన పాఠాలు విన్న చివరి తరం వాటిని గుర్తు చేసుకుంటే, గోర్కీ చెప్పినట్లు, సాహిత్యాన్ని సున్నితమైన స్నేహితుడిగా, నిశితమైన న్యాయమూర్తిగా మన వెన్ను తట్టి, మన నిష్ప్రయోజకత్వాన్ని నిరసించి, జీవితం కన్నా ఒక మెట్టు పైనుండి సైన్సుతో పాటు మానవాళికి దారి చూపే మార్గదర్శిగా ఆయన పరిచయం చేస్తాడు. డెబ్బై ఏళ్ల భారత విప్లవోద్యమం, ప్రపంచవ్యాప్త సోషలిస్టు ఉద్యమాల సారం చలసాని ప్రసాద్ అనే సాంస్కృతికోద్యమ కార్యకర్తను రూపొందించింది. ఆయన నుండి నేర్చుకునే అవకాశం చరిత్ర నావంటి వాళ్లకూ కల్పించింది.

కవిత్వం వర్క్‌షాప్‌లో ఒకసారి షెల్లీ కొటేషన్ చెబుతూ, "Poets are the Unacknowledged legislatures of the world" అని అందరూ కోట్ చేస్తారు కాని, దాని కన్నా ముందు Poets are the trumpets which speak battle... అని కూడా షెల్లీ అన్నాడు, కాని ఇదెవరూ చెప్పరు అన్నాడు సిపి. అట్లా ఆయనే చెప్పగలిగినవి చాలా ఉన్నాయి. వయసు రీత్యా కొంత కాలంగా సంస్థ ఆయనకు ప్రత్యేకించి బాధ్యతలు ఏవీ అప్పగించడం లేదు. పొయెట్రీ వర్క్‌షాప్ ఎప్పుడుంటుందో గుర్తు చేయండి అని అడిగి మరీ రెండు వర్క్‌షాపులకు వచ్చి చాలా ఓపిగ్గా పాఠాలు చెప్పాడాయన.

మంగళగిరి సమావేశానికి (నవంబర్ 2014) ఇద్దరు కవులు రాసిన రెండు ఎలిజీలను తీసుకొచ్చి చదివాడు. కవుల పేర్లు ముందుగా చెప్పలేదు. అందులో లబ్దప్రతిష్టుడైన కవి రాసింది తేలిపోగా, అంతగా పేరులేని కవి రాసింది హృదయాన్ని తాకింది. భాష మీద ఎంత పట్టుంటేనేం, ఫీలవ్వకపోతే కవిత్వం రాదు అని తేల్చి చెప్పాడు. అదే సమయంలో తెలుగు భాషను, ప్రజాజీవితాల నుండి, శ్రమ నుండి వచ్చిన భాషను మనం, ముఖ్యంగా సాహిత్య సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న వాళ్లం ఎంతగా ప్రేమించాలో కూడా చెప్పాడు. చిన్నయసూరి దగ్గరి నుండి విప్లవ సాహిత్యం దాకా అనేక దశల్లో పరిణామం చెందిన సాహిత్యాన్ని ఎట్లా అధ్యయనం చేయాలో కూడా చెప్పాడు. తెలుగు, ఇంగ్లీషు కొటేషన్లు, రెఫరెన్సులు ఎన్నెన్నో. వెంటనే సంపాదించి చదవాలనిపిస్తుంది. ఆధునిక సాహిత్య చరిత్రే మన ముందుకొచ్చి మాట్లాడినట్టు ఉన్నా, తక్కువ వాక్యాల్లో, వాటిల్లో కూడా కోట్స్, హింట్స్ ఎక్కువగా ఉండి చెప్పే శైలి (ముఖ్యంగా రాత) గమ్మత్తుగా ఉంటుంది. ముచ్చటైన భాష, మంచి మంచి ముచ్చట్లు. వాక్యాల మధ్య చదువుకోవలసినవే ఎక్కువగా ఉంటాయి. ఆయన ఏ కబుర్లు పంచుకున్నా వాటినిండా సాహిత్యం పరిమళిస్తుంది. ఏ రెఫరెన్సు కావాలన్నా ఫోన్ కాల్ దూరంలో చలసాని అందుబాటులో ఉండేవాడు. అటు ఏ సాయం కావాలన్నా ఆయన మాట, చేయి ఎప్పుడూ

సిద్ధంగా ఉన్నట్లుగానే.

ఆయనకున్న అపార జ్ఞానంతో పోలిస్తే ఆయన రాసినవి తక్కువున్న మాట నిజమే కాని, ఆయన రచనలు, ఉపన్యాసాలు, పాఠాలు కలిపి మొత్తంగా ఆయన వ్యక్తీకరించిన సాహిత్య సాంస్కృతిక రాజకీయ అంశాల్ని అంచనా వేసినా ఆయన సాహిత్య వ్యక్తిత్వం అంతమాత్రమే కాదు. సాహిత్యాన్ని ఆయన ఎంతగా ప్రేమించాడో, విప్లవ సాహిత్యోద్యమ పరివ్యాప్తికి ఎంత శ్రమ పడ్డాడో, ఎన్ని తీర్ల పనులు చేశాడో గుర్తు చేసుకుంటే అద్భుతమనిపిస్తుంది. ఆయన సంపాదకత్వం వహించి సంకలనం చేసిన రచయితల సమగ్ర సాహిత్యం, వాటి కోసం ఆయన పరిశ్రమ, పరిశోధన చరిత్రలో ఒక మోడల్‌గా నిలిచిపోయాయి. సాహిత్యంపై తన ఇష్టం, అభినివేశం కమ్యూనిస్టు నేపథ్యం వల్లనేనని, ఈ నేపథ్యం వల్ల విప్లవ సారం అందులోకి వచ్చిందని ఆయనే చెప్పాడు. 'ప్రజారాజకీయాల ప్రభావంతో సాగే సాహిత్య ఉద్యమంలో నేను భాగస్వామిని. ఉద్యమం ఆరోగ్యవంతంగా కొనసాగాలంటే సాహిత్యం పట్ల ఆసక్తి ఉండి నిజాయితీతో పనిచేసే వ్యక్తులు కావాలి. వ్యక్తులు విడివిడిగా చేసే కృషి ఉద్యమం ఉమ్మడి లక్ష్యాలను సాధిస్తుంది. వ్యక్తులు విడిగా చేయలేని పని సంస్థ చేయగలుగుతుంది' అని చెప్పే చలసాని విప్లవాగ్నుల పాట పాడుతూ తన్మయత్వంలో మనిగితేలుతున్నప్పుడు చూస్తే సాహిత్యాన్ని, ప్రజారాజకీయాల్ని ఆయన ఎంతగా తనలో భాగం చేసుకున్నాడా అనిపిస్తుంది. ఆ పాట పాడాక చాలాసార్లు ఒక ముగింపు వాక్యం చెబుతాడు. 'ఈ పాట రాసిన మంచి వెంకటనర్సయ్య కవీ కాదు, పాడిన నేను గాయకుడ్నీ కాను. అది ఈ పాట గొప్పదనం, ప్రజల గొప్పదనం, శ్రీకాకుళ ఉద్యమ గొప్పదనం' అని. పాటనీ, పాట సారాంశాన్నీ చాలా సింపుల్‌గా మన ముందు పెడ్తాడు. ఎమర్జెన్సీ కాలంలో జైల్లో ఉన్నప్పుడు ఓ గ్రామీణ యువకుడి దగ్గర నేర్చుకున్న సరదా పాట వినిపించి దాని వెనక రాజకీయార్థిక కోణం చెప్పాడొకసారి, ప్రజల నుండి నేర్చుకోవల్సింది ఎంతైనా ఉంటుందని, ప్రజలను, కళాసాహిత్యాలను ఎల్లలు లేకుండా ఎంతగా ప్రేమించవచ్చో ఆయన చూపించాడు. సాంస్కృతిక రంగంలో పనిచేసే విరసం కార్యకర్తలు చేయవలసింది ఇదే కదా! సిపి చెప్పిన విలువైన పాఠం ఇది. అంతమాత్రమే కాదు, విశాల ప్రజా ఉద్యమంలో తాను ఒక సాంస్కృతిక కార్యకర్తనే అనుకోవడం ఆయన వ్యక్తిత్వ రహస్యమని కూడా ఆయన జీవితం తెలుపుతుంది.

ఎన్ని రకాల మనుషుల మధ్య ఎంత హాయిగా, స్వేచ్ఛగా సంచరించాడో చలసాని. ఎంతో మందికి సొంత మనిషి అయ్యాడు. విప్లవ మానవుడు స్వేచ్ఛాజీవి, ప్రేమాస్పదుడూ కదా! మూడు తరాల విరసం సభ్యులకు పాఠాలు చెప్పాడు సీపీ. ఒకే తీరుగ అందరితో స్నేహమూ చేశాడు. తెనాలి సభలప్పుడు విరసం యువసభ్యులు పెద్దవాళ్ల ముచ్చట్లకు దూరంగా ఎక్కడో కూర్చొని కాలేజీ బ్యాక్‌బెంచ్ జోకులు వేసుకుంటూ ఉంటే చలసాని 'ఏంట్రా, కుర్రాళ్లంతా గుంపుకట్టి గూడుపుఠానీ చేస్తున్నారా' అంటూ వచ్చాడు. మా బృందంలో కలిసిపోయాడు. ఆ రోజు రాత్రి పొద్దుపోయేవరకు విరసం పతాక గీతం నేర్పించాడు. ఎప్పుడూ నేనే పాడాలా, మీరెప్పుడు నేర్చుకుంటారు అని కోప్పడ్డాడు. ఆ తర్వాత అటువంటి సమావేశాల్లోనే రాత్రులు పొద్దుపోయేదాకా ఆయన బ్రాండ్ పాటలు పాడుతుంటే ఆయన స్టయిల్లో కోరస్ ఇవ్వలేక తికమకపడేవాళ్లం. తర్వాత విరసం సాంస్కృతిక బృందం ఏర్పడినా విరసం పతాక గీతం సీపీయే పాడాలని యువసభ్యులు పట్టుపట్టేవాళ్లు. సీపీ ఉన్నన్నాళ్లు పతాకగీతం ఆయనే పాడాలి అన్నాడు ఉదయ్. నిజంగానే సీపీ పతాకగీతం లేని వరంగల్ సభలు చాలా వెలితిగా అనిపించాయి. బొబ్బిలి సభల్లో యథావిధిగా ఆయనే పతాకగీతం పాడుతూ మధ్యమధ్యలో చరణాలు గుర్తురాక మర్చిపోతున్నాడు. మర్చిపోయినప్పుడల్లా బాధ, దిగులు కనపడుతోంది. ఇక ఆయన్ని ఇబ్బంది పెట్టొద్దని అనుకున్నాం. ఆయనకు విశ్రాంతినిచ్చే అవకాశాన్ని కూడా మాకివ్వలేదు సీపీ.

ఎవరికి ఏ ఇన్హిబిషన్స్ ఉన్నా క్షణాల్లో తొలగించే గొప్ప విద్య ఆయన వద్ద ఉంది. పరిచయమైన కొద్ది కాలానికే ఆయనతో భడవా, గాడిదా అనిపించుకోవడం మాకందరికీ సరదా అయిపోయింది. శ్రీశ్రీని ఏదో ఒకటి అని కూడా కొందరు ఆయన్ను ఉడికించేవాళ్లు. మొదటిసారి విరసం సభల్లో వేదిక మీద మాట్లాడినప్పుడు నా ప్రసంగం మీద మిత్రులు ఎన్ని జోకులో. సీపీ మాత్రం వడివడిగా వచ్చి సూపర్ రా అన్నాడు. వదిన కూడా మెచ్చుకుంది అన్నాడు. ఎంత ఆశ్చర్యంగా ఉంటుందంటే అటువంటి నాకు ఒకసారి ఫోన్ చేసి సాక్షి ఛానల్ వాళ్లు, పత్రికా స్వేచ్ఛ మీద ఇంటర్వ్యూ అడుగుతున్నారు, కుర్రాడు మనాడే, ఇమ్మంటావా అని అనుమతి అడిగాడు. వద్దులెండి అని ఏదో చెప్పబోయేలోపే, సరే అలాగైతే కుదరదని చెప్తాలే అని చాలా మామూలుగా కుశల ప్రశ్నలు వేసి ఫోన్ పెట్టేశాడు. ఇలా చాలాసార్లు ఆయన వ్యక్తిత్వానికి ఆశ్చర్యపడిపోతూ అందులో నుండి తేరుకోకముందే చాలా సాదాసీదాగా సరదాగా మాట్లాడేస్తాడు. మనుషుల మధ్య అంతరాల్ని అలవోకగా అధిగమిస్తాడు సిపి. 'మాకు గోడలు లేవు, గోడలు పగలగొట్టడమే మా పని' అంటాడు. వ్యక్తిగతం, సామాజికం మధ్య దూరాన్ని ఎలా అంతగా చెరిపేశాడో ఆయన గురించి తెలుసుకుంటున్న కొద్దీ విప్లవం పట్ల, రేపటి సమాజం పట్ల విశ్వాసం దృఢమవుతుంది. 'మా నాయకురాలు, మా యంగ్ అండ్ డైనమిక్ సెక్రెటరీ' అని ఆయన స్నేహితులకు పరిచయం చేస్తూ చాలా సంతోషాన్ని, తృప్తిని కనబరుస్తుంటే, టెన్షన్ కన్నా సిపి ఉంటే ఎంత పనైనా చేసేయొచ్చు అని భరోసా కలిగేది. ఎంత ఎంత పెద్ద బాధ్యతలను ఈ తరానికి వదిలివెళ్లాడు చలసాని!

సీపీ ఇంటికి మొదటిసారి తాళం వేసి ఉంది. సీపీ ఇక లేడని తెలిసినప్పుడు శూన్యం కమ్ముకుంది. అమరత్వం గురించి ఎంత మాట్లాడుకున్నా మరణం మరణమే కదా. కానీ చిత్రంగా నెల రోజుల నుండి సీపీ ప్రస్తావన లేని రోజు కాదు కదా, పూట కూడా లేదు. ఆయన జీవితంలోని విస్తృతి రోజురోజుకూ మరింతగా తెలిసి వస్తోంది. ఎందరి జ్ఞాపకాల నుండి కొత్తకొత్తగా పుడుతున్నాడో సీపీ. ఎన్నెన్ని కొత్త విషయాలు చెబుతున్నాడో. కొన్ని వేల పుస్తకాలనే కాదు, వేల మందితో పంచుకున్న విజ్ఞానం, వివేకం, ప్రేమ, ఉద్యమ ఆచరణలో తెలుకోవలసిందెంతో వదిలి వెళ్లాడు. చరిత్రలో ఆయన వదిలి వెళ్లిన ఆనవాళ్లను పోగు చేసి సీపీని పునర్నిర్మాణం చేసి భవిష్యత్తరాలకివ్వాలి. చలసాని అట్లా చేసి మనకెంతో ఇచ్చాడు. ఇప్పుడు మనం చేయాలి.

☆

చలసాని - శ్రీశ్రీ
సాహిత్యంలో వర్గపోరాట సందర్భాలు

వరవరరావు

శ్రీశ్రీ కవిత్వాభిమానం నాకు చలసాని ప్రసాద్ అనే ప్రాణ స్నేహితుణ్ని ఇచ్చింది. చలసాని మా ఇద్దరికే కాదు ఇంకెందరో విప్లవాభిమానులకు విరసంనిచ్చాడు.

ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే 1957లో పరోక్ష పరిచయం అయిన సందర్భం నుంచీ ఇప్పటిదాకా చలసానితో నా పరిచయమైనా, అనుబంధమైనా శ్రీశ్రీ వల్లనే. అయితే అది కేవలం శ్రీశ్రీ పట్ల అభిమానం, లాలసయేనా? ఆయనకు శ్రీశ్రీ అంటే ఆరాధన, భక్తి ఉన్నమాట నిజమే (ఆయన పడకగదిలో మంచంపక్కన కిటికీలో శ్రీశ్రీ ఫొటో ఉంటుంది. దానికింద శ్రీశ్రీ స్వదస్తూరీలో ఆయనకు రాసిన లేఖ ఉంటుంది. కళ్లు నలుపుకొని, లేచి అవి చూసి, మళ్లీ అవిచూసి గానీ నిద్రపోయేవాడు కాడనుకుంటాను. భూకంపం వచ్చినపుడు అందరూ ప్రాణాలు కాపాడుకోవడానికి ఇళ్లనుంచి బయటికి పరుగెత్తితే ఆయన శ్రీశ్రీ ఫొటోను కాపాడుకోవడానికి పరుగెత్తాడట) కానీ నాకు అభిమానం, నామీద ఆయన ప్రభావం మాత్రమే ఉన్నాయి. రాజకీయంగానైతే విమర్శనాత్మక అభిమానం.

ఆ అనుబంధాన్ని పొరలు విప్పితే నాకు ఏ రాజకీయాలు లేని కాలంలో, ఆయన నన్ను పలకరించిన సందర్భాలు సాహిత్య, రాజకీయ రంగాల్లో కీలకమైనవి. మలుపు తిప్పినవి. ఇపుడవి యాదృచ్ఛికమనలేను.

1957లో నేను బి.ఏ. మొదటిసంవత్సరంలో ఉన్నప్పుడు 'తెలుగు స్వతంత్ర'లో చేకూరి రామారావు 'సినిమా చిట్టడవిలో చిక్కుకున్న మహాకవి' అని శ్రీశ్రీ గురించి ఒక కవిత రాసాడు. ఏదో డబ్బింగ్ సినిమా ప్రచార పోస్టర్‌పై 'శ్రీశ్రీ- రామభక్త హనుమాన్ ఫేమ్' అని పెద్దక్షరాల్లో వుందట. (ఎందుకంటే శ్రీశ్రీకి డబ్బింగ్ మాటలు, పాటలు రాయడంలో ఎవరూ సాటిరారు. 'ఆకలిరాజ్యం' సినిమా చూసినవాళ్లకు ఆ అసాధారణమైన శక్తి తెలుసు. సినిమావాళ్లకు ఆ ప్రచారం అవసరం). చేకూరి మనసు చివుక్కుమని, 'మహాప్రస్థానం' కవి పరిచయం తెలుగు సమాజానికి, ఈ తరానికి ఇట్లా చేసే భావదారిద్ర్యం వచ్చిందా అనేది ఆ కవితలోని ఆవేదన, నేను చాలా ఆవేశంతో 'ఇంకెంతకాలం శ్రీశ్రీ పదండి ముందుకు, పోదాం తోసుక' అనే పిలుపు కొరకే అర్రులు చాద్దాం, మనమేం చేస్తున్నాం - ఆ కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి' అని వ్యాసం రాసాను. శ్రీశ్రీ గురించి తెలుగునేలమీదనే కాదు, తెలుగుభాషలోనే కాదు ఈ భూప్రపంచం మీద ఎక్కడ ఏ మాట విన్నా వెతికిపట్టుకునే చలసాని వెంటనే నా హనుమకొండ చిరునామా తెలుసుకొని కార్డు రాసాడు. అది మా మొదటి పరోక్ష పరిచయం. అదే సంవత్సరం చంద్రమండలం మీదికి సోవియెట్ రష్యా లైకా అనే కుక్కపిల్లను పంపింది. దానిమీద 'సోషలిస్టు చంద్రుడు' అనే కవిత 'తెలుగు స్వతంత్ర'లో రాసాను. 'నీ కవిత బాగుంది. కాని సోషలిస్టు చంద్రుడు మసకబారాడు' అని రాసాడు. అంటే ఏమిటో నాకప్పుడు అర్థం కాలేదు.

అప్పటికి ఆయన రెండు యుద్ధాలు చేసి ఉన్నాడు. సాహిత్య రంగంలోను, రాజకీయాల్లోను - శ్రీశ్రీపై జరుగుతున్న దాడి నుంచి శ్రీశ్రీని, కమ్యూనిజాన్ని కాపాడుకునే యుద్ధాలు, ఒకటి - ఆంధ్రా ఉపఎన్నికల్లో (1955) కాలికి బలపం కట్టుకొని కమ్యూనిస్టు పార్టీ ప్రచారానికి తిరిగిన శ్రీశ్రీపై ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వేదికలుగా ఇద్దరు సంపాదకుల నాయకత్వంలో తెలుగు సాహిత్యంలోని ఎందరో ప్రముఖులు చేసిన దాడి. ఆ దాడిని ప్రతిఘటించిన కొ.కు., కెవిఆర్‌లతో పాటు ముఖ్యంగా నార్ల చిరంజీవి, ప్రత్యగాత్మ అనుయాయులుగా చలసాని, హరిపురుషోత్తంతో కలిసి - శ్రీశ్రీని భౌతికంగా కూడ కాపాడాడు. శ్రీశ్రీ ఆఖరి ఎన్నికల ప్రచార ఉపన్యాసం హనుమాన్‌జంక్షన్ దగ్గర ఇస్తూ మతిస్థిమితం కోల్పోయాడు. వెంటనే వీళ్లిద్దరూ ఆయనను తీసుకవెళ్లి మద్రాసులో పిచ్చాసుపత్రిలో చేర్చి చికిత్స చేయించారు. రెండవయుద్ధం - కృశ్చేవ్ శాంతియుత సహజీవన సిద్ధాంతానికి, రివిజనిజానికి వ్యతిరేకంగా వర్గపోరాటయుద్ధం. అది 1956లో ప్రపంచవ్యాప్తంగా మావో నాయకత్వంలో 'మహత్తరచర్చ' (గ్రేట్‌డిబేట్‌గా ప్రారంభమైంది. చలసానికి సాహిత్యంలో శ్రీశ్రీ అంటేఎంత అభిమానమో రాజకీయాల్లో స్టాలిన్ అన్నా అంత అభిమానం (స్టాలినో నీ ఎర్రసైన్యం' పాట గానీ, జంధ్యాల పాపయ్యశాస్త్రి స్టాలిన్‌పై రాసిన కవిత గానీ ఆయన నోట వినవలసిందే). కనుక సోషలిస్టు చంద్రుడు మసకబారడం అంటే అదన్నమాట (మా ఇంట్లో ఉప్పావ వేసుకుంటారా అని అడిగితే 'శాంతియుత విప్లవమా?' అని 'కృశ్చేవ్ ఆవ' అని పేరుపెట్టాడు. అట్లాగే వంగిపోయిన గంటెకు 'లొంగిపోయిన డాంగే' అని పేరు పెట్టాడు. ఎర్రటి ఆవకాయ ఆయనకెంత ఇష్టమో ఇపుడందరికీ తెలుసు. 'మావోకు కూడ అంతే ఇష్టం తెలుసా?' అని అంటే ఈ జులై 5న బొబ్బిలిలో కామాక్షమ్మగారు ఒక చిన్నజాడీలో పెట్టి ఇస్తే జాగ్రత్తగా తెచ్చుకున్నాడు).

ఇంతకన్నా చలసాని రాజకీయ నిబద్ధతకు, కార్యదక్షతకు నా అనుభవానికి వచ్చిన సందర్భం 1964లో సిపిఐ చీలిపోతున్న రోజులు. నేను వాస్తవానికి చలసానిని ప్రత్యక్షంగా చూసింది కూడ అప్పుడే. నేనింకా ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్నాను. అంపశయ్య నవీన్ కూడ ఉన్నాడు. వరంగల్ ఆర్ట్స్‌కాలేజ్ స్నేహం వల్ల, ఆయన మేధోశక్తి వల్ల మేమిద్దరం సి.రాఘవాచారి అనుచరులం. కనుక ఆయన ఉస్మానియా లా కాలెజి విద్యార్థిసంఘం ఎన్నికల్లో అధ్యక్షపదవికి పోటీచేస్తే ప్రచారంచేసి మా స్నేహితులతో కమ్యూనిస్టులమవుతున్నాం అని హెచ్చరికలు పొందినవాళ్లం. అదే రోజుల్లో వెలువడిన శ్రీశ్రీ 'త్రీచీర్స్ ఫర్ మ్యాన్' స్వీయ ఇంగ్లీషు అనువాద కవితల పుస్తకం ఆవిష్కరణ సభ సుల్తాన్‌బజార్ క్లాక్‌టవర్ దగ్గర ఒక మూల మీద హాల్‌లో ఏర్పాటు చేసాం - హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పేరుతో పనిచేస్తున్న సిపిఐ అనుబంధ సంస్థ అధ్యక్షుడు రాఘవాచారి. ఆయన పూనికతో జరిగిన సభ అది. శ్రీశ్రీకి ఉన్న బలహీనత వల్ల వచ్చిన దగ్గరి నుంచి ట్రెయిన్ ఎక్కించే దాకా ఆయనను కనిపెట్టుకునే బాధ్యత తనకుండే ఇతర పనులవల్ల రాఘవాచారి నాకు అప్పగించాడు. సింగరాజు రామకృష్ణయ్య ఎంఎల్‌సి గారి క్వార్టర్‌లో ఆయననుంచారు. 'యువజన' పత్రిక ద్వారా స్నేహమేర్పడిన కె.ప్రతాపరెడ్డి నన్నక్కడ కాపలా ఉండమన్నాడు. సి.రాఘవాచారి, నేను సికిందరాబాదు రైల్వేస్టేషన్‌లో శ్రీశ్రీని మద్రాసు ఎక్స్‌ప్రెస్ ఎక్కించాం. ట్రెయిన్ కదులుతూ ఉంటే

ఒక యువకుడు ఎర్రగా స్ఫురద్రూపిగా ఉన్నాయన మాకు చేయి ఊపాడు. ఆయనే చలసాని ప్రసాద్ అని, అప్పుడు కాజీపేటలోనే రైల్వేలోనో, రీజినల్ ఇంజినీరింగ్ కాలేజిలోనో పనిచేస్తున్నాడని, ఎబికె ప్రసాద్ సంపాదకత్వం వహించిన సిపిఎం తేదల్చుకున్న 'జనశక్తి' స్టాలిన్ సంచికకు స్టాలిన్ మీద సందేశం తీసుకోవడానికి వచ్చాడని తర్వాత తెలిసింది. ఆ తర్వాత 'జనశక్తి' స్టాలిన్ ప్రత్యేక సంచికలో సెంటర్‌స్ప్రెడ్‌లో స్టాలిన్ ఫోటో - కింద 'వ్యక్తిపూజ వద్దంటే అన్నాడేమో కానీ వీరపూజ వద్దనడానికి అతడెవరు కృశ్చేవ్' - శ్రీశ్రీ - అని తాటికాయంత అక్షరాలు. అంటే ఆరోజంతా ఆ ప్రకటన శ్రీశ్రీ నుంచి సాధించడానికి ఆయన ఆరోజు హైదరాబాదు వచ్చి మా కన్నుగప్పి ఆ అవకాశం కోసం కాచుకున్నాడన్నమాట. అంత ఘటనాఘటన సమర్థుడాయన.

శ్రీశ్రీ 'వెలుగునీడలు' సినిమా హైదరాబాద్ ప్యాలెస్ టాకీస్ (అబిడ్స్)లో విడుదలయినపుడు హైదరాబాదు వచ్చాడు - ఎప్పుడు వచ్చినా మైసూర్‌కేఫ్ (గోల్డెన్ థ్రెషోల్డ్)లో ఉండేవాడు. నన్ను కార్లో కూర్చోబెట్టుకొని - తాను నేను లెఫ్ట్‌కు కూర్చుంటాను - ఐ ఆమ్ ఆల్వేస్ ఆన్ లెఫ్ట్‌సైడ్' అన్నాడు. అయితే ఆయనను జీవితమంతా అట్లా వామపక్షంలో ఎప్పటికప్పుడు సరియైన పక్షంలో ఉంచినవాళ్లు మాత్రం నాకు తెలిసి చలసాని - తోడుగా హరిపురుషోత్తం.

శ్రీశ్రీ 1956లో 'ఖడ్గసృష్టి' కవిత మొదలుపెట్టి 66లో పూర్తిచేసాడు. ఆయన ఏ కవిత రాయడానికి కూడ ఇంతకాలం తీసుకోలేదు తెలుసా? అన్నాడొకసారి. అందులో ఆయన మైలమభీముని ఖడ్గసృష్టిని తలచుకోవడం చలసానికి చాలా ఇష్టం. 'అహింస ఆశయమే కానీ, ఆశయం సాధించాలంటే మాత్రం ఆయుధం అలీనం కాదు' అని మళ్లీ వర్గపోరాటాన్ని ఎజెండా మీదికి తేవడానికి దశాబ్దం పట్టింది. ఇదే ఆయన అవగాహన. 1966లో చైనాలో శ్రామికవర్గ విప్లవం మూడవ విప్లవంగా ఈ అవగాహనను విప్లవాచరణలోకి తెచ్చింది.

ఈ అరవైల తొలిరోజులన్నీ హైదరాబాదు, వరంగల్‌లలో చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ చలసాని ఉన్న రోజులే కొండపల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి కూడ గాబ్రియల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రోజులు. వేణుగోపాలరావుగారు అమెరికాపోతే కృష్ణాబాయిగారు కూడ అక్కడ ఉన్నరోజులు. అక్కడ కెఎస్, ఎస్ఎంలతో విద్యార్థి దశ నుంచీ ఉన్న పరిచయం - 1955 ఎన్నికల కాలపు అనుబంధం రాజకీయ చర్చలకు దోహదం చేసిన సంధికాలం. ఈ చర్చల్లో తరువాత కెఎస్‌కు అల్లుడు అయిన డా. కావూరు రమేశ్ కూడా పాల్గొంటుండేవాడు. అప్పుడే వీళ్లందరికీ ప్రజాకవి కాళోజీతో పరిచయమైంది. బండి గోపాలరెడ్డి (బంగోరె) వీళ్లందరినీ పరిచయం చేస్తానని కాళోజీని నక్కలగుట్ట నుంచి కాజీపేటకు తీసుకవస్తూ ఉంటే 'నాకు పరిచయాలంటే స్నేహాలే. స్నేహం మిగిల్చిన గాయాలూ ఉన్నాయి. కనుక ఇంక కొత్తస్నేహాలను భరించలేను' అని కన్నీళ్లు పెట్టుకున్నాడట. చలసానికి కూడ పరిచయమంటే స్నేహమే. ఆయనకు రాజకీయ విశ్వాసాల్లో విభేదాలే తప్ప స్నేహపు తాలూకు గాయాలు లేవు. ఉంటే మరి మాకు చెప్పలేక గుండె బరువెక్కి ఆగిపోయిందేమో తెలియదు.

1967 మే 23-25 నక్సల్బరీ వసంతమేఘ గర్జన కాలానికి, సరిగ్గా శ్రీకాకుళంలో తొలకరి కురిసి దుక్కిదున్నే కాలానికి చలసాని విశాఖపట్నం మిసెస్ ఎ.వి.ఎన్ కాలేజ్‌లో రాజనీతి అధ్యాపకుడుగా చేరుకున్నాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే 'రెస్ట్ ఈజ్ హిస్టరీ'. అదంతా శ్రీకాకుళం చరిత్ర. ఆదివాసీ రైతాంగ పోరాట చరిత్ర. అమరుల త్యాగాల చరిత్ర. విరసం చరిత్ర. చలసాని చరిత్ర. సాహిత్య సాంస్కృతిక రంగంలో ఆ చరిత్రరచన శ్రీశ్రీ షష్టిపూర్తి (1,2 ఫిబ్రవరి 1970) తో మొదలైంది. అప్పటి నుంచే నాకు చలసానితో ప్రత్యక్షస్నేహం. అప్పటికే కాదు హైదరాబాదులో జులై 1970 దాకా కూడ శ్రీకాకుళ ఉద్యమనాయకులు వెంపటాపుసత్యం, ఆదిభట్ల కైలాసం బతికి ఉన్నారని మనం గుర్తుపెట్టుకోవాలి. విశాఖవిద్యార్థులు 'రచయితలారా, మీరెటువైపు?' అని వేసిన ప్రశ్న శ్రీకాకుళ పోరాట అమరుల నుంచి వచ్చిన ప్రశ్న. అప్పటికే అమరులైన సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చినబాబు వంటి ప్రజాకళాకారులు విసిరిన సవాల్. పంచాది కృష్ణమూర్తి, నిర్మల, డాక్టర్ చాగంటి భాస్కరరావు, మల్లికార్జునుడు వంటి అమరులు వేసిన ప్రశ్న. విప్లవం కటక్ (ఒరిస్సా) నుంచి కర్నూలు దాకా ప్రసవనొప్పులు అనుభవించిందని శ్రీశ్రీ అన్నాడు గానీ, ఈ ప్రశ్నను స్వీకరించిన విభజనరేఖను, సందేశాన్ని, ప్రతిజ్ఞను రెండురోజుల శ్రీశ్రీ షష్టిపూర్తిసభల్లో దృశ్యీకరించి ఆ వీడియోను తీసుకొని విశాఖ నుంచి విజయవాడ, వరంగల్‌ల మీదుగా హైదరాబాదు దాకా తిరిగి రచయితలను కూడగట్టినవాడు మాత్రం చలసాని. శ్రీశ్రీ అరవైఏళ్ల సభలోనే శ్రీకాకుళ ఉద్యమాన్ని బలపరిచే రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినవాళ్లు కొడవటిగంటి కుటుంబరావు, జ్వాలాముఖి. దానికి హోంవర్క్ అనండి, గ్రౌండ్‌వర్క్ అనండి చేసినవాడు మాత్రం చలసాని. ఎటువంటి రాజకీయ, సాంస్కృతిక సందర్భంలోనైనా శ్రీశ్రీని ముందుబెట్టి రచయితలను కలుపుకురావచ్చుననేది ఆయన అవగాహన. అందుకు ఆయన మానవ సంబంధాలు ఎంతో కలిసి వచ్చిన దోహదక్రియ.

ఒక సందర్భాన్ని కార్యక్షేత్రంలో, కార్యాచరణగా ఎట్లా చలసాని మలుస్తాడో చెప్పడానికి జులై 3, 1970 ఒక గీటురాయి. అభ్యుదయ రచయితల సంఘం మహాసభలు 1955లో రాజమండ్రిలో జరిగాక, 1956లో కృశ్చేవ్ సిద్ధాంతాన్ని అరసం స్వీకరించాక అరసం శవప్రాయమైపోయింది. లేదా 1955 ఎన్నికలతో దాని చేవ ఉడిగిపోయింది. మళ్లీ అరసం ప్రయత్నాలు - అప్పుడు వాళ్లు బాలారిష్టవర్యగా భావిస్తున్న, దుస్సాహసంగా భావిస్తున్న శ్రీకాకుళ రైతాంగ పోరాటాన్ని రచయితలు, ముఖ్యంగా శ్రీశ్రీ బలపరచకుండా చూడడం. ఆ వివరాలన్నీ చరిత్రలో భాగమే కానీ, అందుకోసం అరసంకు మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేయడానికి ప్రభుత్వం, సినిమా పరిశ్రమ సహకారంతో నక్షత్ర సప్తకాన్ని ముందుపెట్టి రెండురోజుల సదస్సు 1970 జులై 3, 4 తేదీలలో 'అభ్యుదయ సాహిత్య వేదిక' పేరుతో హైదరాబాదులో తలపెట్టారు. శ్రీశ్రీ వాళ్ల ఖర్చులతోనే వచ్చి ద్వారకా హోటల్లో దిగాడు. అరసం కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించాడు. ఆ సాయంత్రం హిందీ మహావిద్యాలయ (విద్యానగర్) వాళ్లు శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీ, ఆరుద్రలను పిలిచి ఉన్నారు. అరసం వాళ్లు ఏర్పాటు చేసిన కారులోనే ఆ ఇద్దరూ అక్కడికి వెళ్లారు. సభ ముగిసి బయటకు వచ్చేవరకు చలసాని, హరిపురుషోత్తం మరో కారు పెట్టుకొని అక్కడ వేచి ఉన్నారు. 'ఆరుద్రగారితో మీరు ద్వారకకు వెళ్లిపొండి.. మేం శ్రీశ్రీని అక్కడికి చేరుస్తాం' అని చెప్పి తమ కారులో ఎక్కించుకొని, దిగంబరకవులు నలుగురు, 'ప్రభంజనం' ఎంవి రమణారెడ్డి, తిరుగబడు కవులు, 'విద్యుల్లత' బృందం ఇంకా ఇటువంటి విప్లవాభిమానులు అప్పటికే చేరి గుమిగూడి వున్న మైసూర్‌కేఫ్‌కు తీసుకవచ్చారు. అయితే శ్రీశ్రీ ఎప్పుడు వచ్చినా మైసూర్‌కేఫ్‌లోనే ఉంటాడని అభిమానులందరికీ తెలుసు గనుక, అక్కడికి అరసం వాళ్లు లేదా వాళ్ల తరఫున ఎవరూ రాకముందే ఆయననక్కడినుంచి మార్చాలని నాంపల్లి స్టేషన్‌దారి మూలమీద వున్న ఇంపీరియల్ హోటల్‌కు తీసుకపోయాం.

జులై 3 అర్ధరాత్రి 4వ తేదీలోకి మారుతున్నపుడు విప్లవ రచయితల సంఘం ఏర్పడినట్లు శ్రీశ్రీ ప్రకటించడాన్ని ఇపుడు కొత్తగా చెప్పనక్కర్లేదు.

శ్రీకాకుళంలో తాను పారించిన నెత్తుటితో తడిసిన చేతుల మీదుగా బ్రహ్మానందరెడ్డి ఇచ్చే రెండువేల రూపాయల సత్కార బహుమానాన్ని తాను స్వీకరించలేనని, తాను శ్రీకాకుళ పోరాట పక్షమే అని శ్రీశ్రీ ఆ రాత్రి ప్రకటించాడు.

1971 ఆగస్టు 2న జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజులను అరెస్టుచేసి పి.డి. చట్టం కింద జైలుకు పంపినపుడు ప్రాసిక్యూషన్ చేసిన ఆరోపణల్లో 'దిగంబరకవులు శ్రీశ్రీని ఎత్తుకపోయారు' (దే హ్యావ్ ఫ్రాడెడ్ శ్రీశ్రీ) అనేది ఒకటి. ఆ పని అక్షరాలా చేసింది చలసాని ప్రసాద్, హరిపురుషోత్తం. అయితే శ్రీశ్రీ 'నన్నెవరూ ఎత్తుకపోలేదు. విప్లవకెరటమే నన్నెత్తుకపోయిందనేది గతితార్కిక చారిత్రక భౌతిక సత్యం.

ఇంక అక్కడి నుంచి నలభై అయిదు సంవత్సరాల విరసం చరిత్రలో ప్రతి క్లిష్టసమయంలోనూ, కీలక సందర్భంలోనూ చలసాని పాత్ర ఉన్నది. శ్రీశ్రీని విరసంతో నిలపడంలోనే ఆయన నిర్వహించిన పాత్ర రెండు సందర్భాలు మాత్రం చెప్పాలి.

1974లో రష్యా ఆఫ్ఘనిస్తాన్ పైకి లక్షసైన్యాన్ని పంపించింది. విప్లవకారులు అది సోషల్ సామ్రాజ్యవాద దురాక్రమణ అన్నారు. సిపిఐ దానిని గతంలో అక్కడ జరిగిన 'ఏప్రిల్ విప్లవం'తో పోల్చింది. ఆమాట శ్రీశ్రీతో అనిపిస్తే తప్ప కొంతమంది రచయితలు, బుద్ధిజీవుల్లోనైనా ఆమోదం రాదు. కనుక అనంతపురంలో ఎఐఎస్ఎఫ్ మహాసభలకు శ్రీశ్రీని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆయన ఆ దురాక్రమణను 'ఏప్రిల్ విప్లవం'తో పోలుస్తూనే ఆ సభలకు ఒకరోజు ముందే వచ్చాడు. కావలి నుంచి కెవిఆర్ ఇంత పెద్ద రాజకీయ తప్పిదాన్ని సహించలేక శ్రీశ్రీని సంజాయిషీ కోరుతూ పత్రికా ప్రకటన చేసాడు. విప్లవ రచయితలం అయిదుగురం (కెవిఆర్ అప్పటికింకా అరెస్టు కాలేదు) సికిందరాబాదు కుట్రకేసులో జైల్లో ఉన్నాం. విశాఖపట్నంలో ఉన్న చలసాని హరిపురుషోత్తంకు పురమాయించాడు. ఆయన ముందురోజు రాత్రే అనంతపురం చేరుకొని శ్రీశ్రీని కలిసి మర్నాటికి ప్రకటన సిద్ధంచేసాడు. 'నేను ఆఫ్ఘనిస్తాన్‌లోకి రష్యా సైన్యం రావడం ఏప్రిల్‌విప్లవం అని భ్రమపడ్డాను గానీ, నేను సాహిత్యంలో ఏమైనా కావచ్చు కానీ రాజకీయాల్లో ఫూల్‌ను' (ఈ మాట ఒక సందర్భంలో లెనిన్‌తో మాగ్జింగోర్కీ స్వీయవిమర్శ చేసుకుంటూ వాడింది) అని చెప్పి సభలకు వెళ్లకుండా హరిపురుషోత్తంతో కలిసి హైదరాబాదు వచ్చేసాడు. ఈ ఏర్పాటంతా చేసినవాడు చలసాని.

1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించాక ఇరవై ఒక్క నెలల కాలం కనీసం ముప్పైమంది విరసం రచయితలు వివిధ జైళ్లలో ఉన్నారు. శ్రీశ్రీ ఎమర్జెన్సీని లెఫ్ట్ డిక్టేటర్‌షిప్ అన్నాడు. ఇరవైసూత్రాలను ప్రశంసిస్తూ రాసాడు. అప్పుడు తానున్న జైలు నుంచి కెవిఆర్, విశాఖ జైలు నుంచి చలసాని ఆయనకు ఘాటైన లేఖలు రాసారు. విరసం కార్యదర్శిగా కె.వి.రమణారెడ్డి జైలు నుంచే శ్రీశ్రీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తూ లేఖ రాసాడు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత విజయవాడలో జరిగిన విరసం సర్వసభ్య సమావేశానికి చలసాని శ్రీశ్రీని తీసుకొని వచ్చాడు. కాని శ్రీశ్రీ బయట మెట్లమీదనే కూర్చొని 'తాను చేసిన రాజకీయ తప్పిదానికి క్షమాపణ కోరుతూ, అధ్యక్ష పదవి అర్హత కోల్పోయినా, సభ్యునిగా చేర్చుకొమ్మ'ని విజ్ఞప్తి పంపాడు. లోపల సుదీర్ఘ చర్చల అనంతరం శ్రీశ్రీకి సభ్యత్వం మాత్రం ఇచ్చారు. శ్రీకాకుళంలో 1997లో కె.వి.ఆర్ అధ్యక్షుడయ్యేదాకా ఇరవైఏళ్లపాటు విరసంకు అధ్యక్షపదవి లేదు. 'దేశానికి అధ్యక్షుడయిన దానికన్నా నేను విరసం సభ్యత్వాన్ని విలువైందిగా భావిస్తాను, విరసం నా శాశ్వత చిరునామా' అన్నాడు శ్రీశ్రీ. శ్రీకాకుళంలో అధ్యక్షుడుగా ఎన్నికయిన కెవిఆర్ విజయవాడకు తన కూతురు డా. వసుంధర దగ్గరికి తిరిగి వచ్చిన మూడు రోజులకే మరణించాడు. అప్పటి నుంచి 1998 చివరి దాకా సహజంగానూ, న్యాయంగానూ చలసాని విరసం అధ్యక్షుడుగా వ్యవహరించాడు.

విరసం సాహిత్యపత్రిక - బులెటిన్‌గా ఆయా సందర్భాల్లో 'నిజం' వంటి ప్రత్యేక సంచికలుగా వెలువడి 'అరుణతార'గా కెవిఆర్ సంపాదకత్వంలో ప్రారంభమయ్యాక 'కావలిపై అరుణతార' అని సాహిత్యలోకంలో ఆయనను పిలుచుకునేవారు. ఆ కాలమంతా ఆయనకు అండగా నిలవడమే కాకుండా 'అరుణతార' కాంతుల్ని నలుదిశలా ఎల్లవేళలా ప్రసరించడానికి తన రక్తమాంసాలను ఇంధనంగా వాడినవాడు చలసాని. బొమ్మారెడ్డి పేరుమీద రిజిస్టర్ అయి ఉన్న 'అరుణతార' టైటిల్‌ను తనపేరుమీదికి మార్చుకొని (సుందరయ్యగారు ఒప్పుకోరుగానీ నీతో స్నేహం వల్ల, ఈ ఒక్క విషయమే ఆయన దగ్గర దాచి నీకిస్తున్నానని ఆయన అవసానదశలో చలసానికి చెప్పాడట) చలసాని చేసిన ఆఖరి సంతకం అరుణతారకు సంబంధించిన కాగితాల మీదనే.

ఈ 4 జులై బొబ్బిలిలో అమరుడు గంటిప్రసాదం సంస్మరణ సభకు వెళ్లి తిరిగి వచ్చాక 6 సాయంత్రం ఎచ్‌బి కాలనీ ఆయన ఇంట్లో విరసం విశాఖ యూనిట్ సమావేశం జరిగింది. అప్పటికి మిగిలివున్న ముగ్గురు వ్యవస్థాపక సభ్యులం కృష్ణక్కతో సహా అందులో పాల్గొన్నాం. జులై 25న విరసం బొబ్బిలి విరసం సాహిత్య పాఠశాలలో వెలువరించిన కొన్ని పుస్తకాల పరిచయసభ పెట్టాలని నిర్ణయించాం. ఆ పనులు చెప్పడానికే ఆయన కన్వీనర్ శ్రీనుకు ఫోన్ చేస్తూ ఉన్నాడు ఆ ఉదయం. అటువంటివే మరికొన్ని ఫోన్లు, సభకు ఆహ్వానాలు. ఆ సభలో పాల్గొనడానికి వచ్చిన విరసం కార్యదర్శి వరలక్ష్మి శ్రీనువెంట చలసాని ఇంటికి చేరుకునేవరకు చలసాని ఇంటికి తాళం. బహుశా మొదటిసారి ఆ ఇంటికి తాళం. తాళాలు లేని ఇల్లు, పరీక్షలు లేని చదువులు, పోలీసులు లేని రాజ్యం కోరుకున్న చలసాని ఆ ఇంటికి భౌతికంగా ఇంక రాడు కాని రాజకీయాల్లో విప్లవస్ఫూర్తి, సాహిత్య వ్యసనం మనుషుల్లో ఉన్నంతకాలం మన మధ్యన ఆయన ఉంటాడు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన అన్న శ్రీనివాసరావు (వాసు)తో పాటు ముగ్గురు కుటుంబసభ్యులు అమరులయ్యారు. దండకారణ్యంలో కూడ నూతన మానవావిష్కరణకు ఆయన రక్తమాంసాలు పంచి ఇచ్చాడు. ఇంత సుదీర్ఘ విప్లవ ప్రస్థానం ఆయనది. తనవంటి కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చిన సహచరి విజయ 2003లో అమరురాలైంది. ఆసుపత్రిలో ఆపన్నులకు మరణానంతర సేవలందించడానికి వెళ్లిన ఆమె దగ్గరికి తానూ నిర్దేశించుకున్న అదే కర్తవ్యంతో వెళ్లాడు.

విశాఖపట్నం వెన్నెల నిశీధం నాకు
వెలలేని, తులలేని వెండిరేకు!
తెలుగుదేశపు తూర్పుసముద్రం ముక్క
కేవలం నా కన్నీటిచుక్క!
అడవుల మీద ఆకాశం తొంగిచూస్తున్నప్పుడు
కొండల్లో ప్రతిధ్వనిస్తుంది నా గుండెల చప్పుడు
తెలుగుదేశంలో ఎక్కడవున్నా నేను
నా తొలియౌవనాన్ని పునర్జీవిస్తాను (శ్రీశ్రీ)

చలసాని ఒప్పుకోడు గానీ ఇది శ్రీశ్రీకన్న చలసానికే చక్కగా సరిపోతుంది.

★



విరసం చరిత్రలో భాగమైన వి.వి. హాస్టల్ (హైదరాబాద్) దగ్గర క్రిష్ణక్క వివి, భుజంగరావులతో

ఎం.టి. ఖాన్ సాబ్‌తో



క్రిష్ణక్క, సి.ఎస్.ఆర్. ప్రసాద్, వరూధిని, కాకరాల, కెవిఆర్‌లతో

విమర్శకుడు చేకూరి రామారావుతో



(కుడి నుంచి) కెవిఎస్ వర్మ, రావిశాస్త్రి, చందు సుబ్బారావు, కాళీపట్నం రామారావులతో ...



గత స్మృతుల తలపోతలు

కృష్ణాబాయి

ఎన్నెన్ని జ్ఞాపకాలు! నలభై ఏళ్ల తీపి గురుతులు! మరపు పొరల్లో ఎన్ని మణిగిపోయాయో! కృష్ణాజిల్లా దివితాలూకా నాదెళ్లవారి పాలెం ప్రసాద్‌ది, ఘంటశాల పాలెం నాదీను. పక్క ఊళ్ల వాళ్లు మమ్మల్ని 'డబుల్ బానిసల'నే వాళ్లట - దేశమంతా బ్రిటిష్‌వాడికి బానిస, జమీందార్ అతని బానిస, జమీందార్‌కి మేం బానిసలమన్నమాట!

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యాక, తెలుగునాట కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం విస్తరించింది. బాలసంఘం దగ్గర నుంచీ రైతుకూలీ సంఘం దాకా ప్రజాసంఘాలు అద్భుతంగా పని చేశాయి. ప్రజా నాట్యమండలి కళారూపాలు జనాన్ని బాగా ఆకట్టుకున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే తెలుగునాడు '40ల నుంచీ '50ల దాకా మహోజ్వల దశాబ్దంగా ఒక వెలుగు వెలిగింది.

నైజాం నవాబుకి వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటం తీవ్రంగా సాగింది. ఆనాటి తెలంగాణ మాకు జన రష్యాగా తోచేది. దొడ్డి కొమురయ్య అమరత్వం దారి చూపించినట్టయింది. తెలంగాణ ఉద్యమ ప్రచారం కోసం రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, రాజబహదూర్ గౌడ్ ప్రసాదు వాళ్లింట వారం రోజులున్నారు. ఆరాధనా భావంతో వాళ్ల చొక్కాల అంచులు పట్టుకుని వాళ్ల వెనకవెనకే నడిచేవాడినని ప్రసాదు చెప్పేవాడు.

ప్రసాదు తండ్రి చలసాని బసవయ్య చల్లపల్లి జమీందారు దగ్గర సముద్దారుగా పనిచేసేవాడు. ఉద్యోగ ధర్మంగా ఆయన రైతుల దగ్గర శిస్తులు వసూలు చేసేవాడేగాని, కుటుంబ సభ్యులందరూ కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేవారు. బసవయ్య తమ్ముడు జగన్నాథరావు, అల్లుడు నాదెళ్ల వెంకటకృష్ణయ్య, కొడుకు శ్రీనివాసరావు కమ్యూనిస్టుపార్టీ పక్షాన జమీందారుకి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారు. పదేళ్లపాటు సముద్దారుగా పనిచేసీ, అవకాశముండీ పైసా వెనకేసుకోని నిజాయితీని చూసి జమీందారు బసవయ్యని ఏమీ అనలేకపోయేవాడు. కాని పరిస్థితి గ్రహించి, కోటలో దస్త్రం (లెక్కల పుస్తకాలు) అప్పగించి బసవయ్య చేతులు దులుపుకుని బయటపడ్డాడు.

నాదెళ్లవారి పాలెంలో సొంత ఇల్లు లేదు. అద్దె ఇంటి మీద ఎర్రజెండా ఎగరేశారు. ఇంటి యజమాని పెత్తందార్ల మనిషి. అందుకని జండా తీసేయించమనే ఒత్తిడికి లొంగి ప్రసాదు తల్లి వెంకట నరసమ్మకి ఆ సంగతి చెప్పాడు. 'ఒరే అబ్బాయ్! ఇవి ఎలెక్షన్ రోజులు గదా? ఓట్ల కోసం కారు అద్దెకి తీసుకుంటే ఆ కారుకి మన జెండా కట్టుకోమా? అలాగే మా అద్దె ఇంటికి మా జెండా కట్టుకున్నాం' అంది నిబ్బరంగా, యజమాని బతిమాలాడు. జండాలేని ఇంట్లో ఉండబోమని మరో కమ్యూనిస్టు కుటుంబం ఉన్న ఇంటికి మారారు. ఇలాంటి కుటుంబ వాతావరణంలో పెరిగిన ప్రసాదు మీద ఈ ప్రభావం లేకుండా ఎలా ఉంటుంది?

చలసాని కోల్పోయిన అన్నయ్య శ్రీనివాసరావు మా వేణుగారి స్కూల్‌మేట్. ఆ అనుబంధంతోనే ప్రసాదుకి వేణు 'అన్నయ్య' అయ్యారు. ఆ రకంగా మా రెండు కుటుంబాలు ఏకభాండంగా 30 ఏళ్లు వర్ధిల్లాయి.

ప్రసాదు ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఏ. చేసి, రకరకాల ఉద్యోగాలు చేసి ఆఖరికి విశాఖ ఎ.వి.ఎన్. కాలేజిలో పొలిటిక్స్ లెక్చరర్‌గా రిటైరయ్యాడు. తనని విద్యార్థులు చాలా అభిమానిస్తారు. అడిగిన వాళ్లకి లేదనకుండా అప్పో సప్పో చేసి ఆర్థిక సాయం అందించడంలో ప్రసాదు దిట్ట. అదే అతని బలహీనత. మనుషుల్ని ఏ అరమరికలు లేకుండా ప్రేమించడం అతన్ని చూసే తెల్సుకోవాలి. ఎందుకూ పనికి రాని (unworthy fellows) వాళ్లని కూడా ఆదరిస్తాడని మందలించేవాళ్లు.

ప్రసాదుకి రుచుల గురించి పట్టింపులేదుగాని, ఆవకాయ ఎర్రగా కలపనిదే ముద్ద దిగేది కాదు. భోజనాల బల్లమీద ఎదురు బొదురు సీట్లు వేణుగారివీ, ప్రసాదవీను. ఎర్రటి ఆవకాయ ముద్దలు చూసి కళ్లెర్ర చేసేవారు వేణు - పొట్ట పాడవుతుందని. ఆయన ఎదురుగా అన్నం పెట్టొమని గునిసేవాడు.

ఎమర్జన్సీలో జైల్లో ఉండగా, డెటిన్యూలు పులిహోర చేసుకుందామనుకున్నారట. పసుపు దొరకలేదట. పసుపుకొమ్ములుంటే వాటిని ప్రసాదు రోట్లో దంచి ఇచ్చాడట. చిన్న నేరానికి జైలు పాలయి వీళ్లకి హెల్పర్‌గా ఉండిన హుసేన్ 'హల్దీ బాబూ!' అని పిల్చేవాడు ప్రసాదుని - పసుపు పేరుతో. హుసేన్‌కి గీతం కాలేజీలో ఉద్యోగమిప్పించాడు.

కమ్యూనిజాన్నీ, రష్యాని భ్రష్టు పట్టించిన కృశ్చేవ్ అంటే మాత్రం పూనకం వచ్చినట్టు ఊగిపోయేవాడు. One man's movement against Krushev అని మిత్రులు అనేవారు. అలాగే అభ్యుదయకవిగా పేరు గాంచిన ఆరుద్ర డిటెక్టివ్ నవలలు రాసినందుకు మండిపడేవాడు.

నాకున్న పాటి critical outlook లేని ప్రసాదూ నేను దేనికో దానికి ఎప్పుడూ వాదులాడుకుంటూండే వాళ్లం - ఇంట్లో వాళ్లు విసుక్కున్నా. కాని ఇద్దరం కలిసి కుటుంబరావు సాహిత్యం, గోపీచంద్ రచనలు లాంటివి ఎడిట్ చేశాం. ఏ వ్యాసం రాసినా ఇద్దరం కలిసి చర్చించుకునే వాళ్లం. ఆఖరికి ఎవరి కన్నా సీరియస్ జాబు రాసినా సరే. నేను రాసిన ఉత్తరంలో చిన్న జాగా మిగిలినా, అందులో ఇరికేవాడు!

నాకు రాసిన ఒకానొక ఉత్తరంలో గతస్మృతులు తలపోతలు-

'హైదరాబాదు గుమాస్తాగిరికి స్వస్తి చెప్పి మద్రాసువెళ్లా - రైల్వేలో ఉద్యోగం ప్రయత్నించమని నాన్న పంపారు. ఆయన కలవమన్న మనిషిని కలవడం తప్ప ఇంకెక్కడికీ వెళ్లేవాడిని కాదు. పాపాయి (ప్రసాదుకి అక్క - ప్రత్యగాత్మ భార్య) మాత్రం చెవిలో రొద - నన్ను సినీ రంగంలో ప్రవేశించమని, 'నీ కిష్టమైన డిపార్ట్‌మెంట్ ఎంచుకో'మనేది. ఆ రంగం మీద నాకు మోజు లేదు.

1963 ఏప్రిల్‌లో కాజీపేటలో కాలుపెట్టా. అప్పటికే జగం (నీ క్లాస్‌మేట్) రైల్వే టీచర్‌గా ఉన్నారు. నేనూ కాజీపేట కౌగిలిలో స్థిరపడ్డాను. గొవెంసు, జగం మీ దంపతుల గురించి చెప్పేవారు. జగం భార్య శ్రీ కృష్ణ నన్ను చాలా ప్రేమగా చూసేది.

అమ్మ, నాన్న, పిల్లలతో మీరు కాపురం పెట్టడం (ఫాతిమానగర్), నేనూ, జగం మీ బాగోగుల గురించి వస్తూండడం, కొండపల్లి సీతారామయ్య, అనసూయక్కలతో మనం గడపడం, కరుణా రమేష్‌ల పెళ్లి - అదంతా గత చరిత్ర.

ఇద్దరం కలిసి కాళోజి ఇంటికి వెళ్లడం - ఎందుకో నాకు లోలోపల నిన్ను (మరిదిలా) వెంటబెట్టుకు వెళుతున్న ఫీలింగ్. ఆ ఫీలింగ్ అలా పెరిగి వటవృక్షంలా ఎదిగెదిగి విశ్వాంతరాళంలో అలముకుంది.

సాహిత్యం, మార్క్సిజం మన కామన్ పాయింట్. బెర్నార్డ్ షా, షేక్స్‌పియర్ గురించి చెప్పేటప్పుడు శ్రద్ధగా వినేదానివి. నా గొప్ప కోసం కాదుగాని, ఎందుకో నీకు చెప్పాలని ఆరాటం. నాటకం, నవల గురించి షా రాసిన వ్యాసం ఊసు వచ్చింది. విని ఎగిరి గంతేశావ్.

షాకి షేక్స్‌పియర్ మీద చాలా ప్రేమ, కాని పైకి అలా కనిపించేవాడు గాదు. నవలనీ నాటకాన్ని పోల్చి, నాటకాన్ని తెగపొగిడేవాడు. మాక్బెత్‌లో ఆఖరి సీన్‌ని నవలగా మార్చి చూపించాడు. గడుసు వెధవ! మార్క్స్ అంటే చాలా గౌరవం. రెండో ప్రపంచ యుద్ధం అయిపోయాక బిబిసివాడు మార్క్సిజం మీద ప్రసంగాలు ఏర్పాటు చేశాడు. ప్రపంచ మేధావుల చేత మాట్లాడించాడు. బెర్నార్డ్ షాది ఆఖరి ప్రసంగం - 'The threads of World History are in the hands of Karl Marx' అని ముగించాడు. ప్రపంచం నివ్వెరపోయింది.

'భారతి' సంపుటాలు షేర్ చేసుకునే వాళ్లం. ఎడతెరిపి లేకుండా ఊసులాడుకునే వాళ్లం. ముగింపు ఉండేది కాదు. అలా ఎన్నో సాయంత్రాలు గడిపాం. ఎన్ని రాసినా తీరదు.

ఇక విజయ పర్వం మొదలు - పెళ్లి మీద నాకు ఉండేది కాదు. మిత్రులెందరు ఒత్తిడి చేసినా ఒప్పుకోలా. మన ఫ్రెండు మరో విజయ, నువ్వు నా అభిప్రాయాన్ని ప్రేమతో మార్చారు.

మన విజయ కుటుంబ నేపథ్యం, వాళ్లన్నయ్య స్నేహం నన్ను మొగ్గు చూపేలా చేశాయి. నువ్వు తనని కలిసి వచ్చి నాకు నచ్చజెప్పావ్.

విజయ, నువ్వు నా గురించి ఎన్నో పంచుకున్నారు. అలా మొదలైన మీ అనుబంధం చిరకాలం వర్ధిల్లింది. అన్నయ్యక్కూడా విజయ నిబ్బరం, ప్రాక్టికల్ ఔట్‌లుక్ అంటే చాలా మురిపెం.

విజయకి కిడ్నీ ట్రబుల్‌కి డయాలసిస్ అవసరమని డాక్టర్లు చెప్పారు. కాని తను ససేమిరా ఒద్దంది. వాళ్ల చిన్నన్నయ్య అనుభవంతో తనకి బాగా అర్థమయింది - దానివల్ల జీవితం సత్ఫలితం పొందదని. తన ప్రాక్టికల్ ఔట్‌లుక్ వల్ల మనం ఏమీ చేయలేకపోయాం. నిస్సహాయంగా ఊరుకోవలసి వచ్చింది...'

ప్రసాదు మంచి హాస్యప్రియుడు. ఎన్నెన్నో సంఘటనలు ఉదహరించేవాడు. 'బావయ్య! ఒంకాయ కూర ఎట్టుందీ?' అని చేతులు తిప్పుకుంటూ చెప్పి నవ్వించేవాడు.

అందరికీ ఉన్న పేర్లు గాక వర్ణనలు జోడించేవాడు. నవతని 'కొండతల్లీ!' అనీ, మమతని మమ్మతల్లి తుల్లిమమ్మ అనీ పద్మినిని రంగం బుంగం కుంగం టుంగం టూరం పిచ్చిపానీ పద్మిని కొడుకు రాహుల్‌ని కుజ్జిబుర్ర అనీ, మేనగోడళ్లని నిప్పుతల్లీ, బొగ్గుతల్లీ అనీ పిల్లలందరిని రకరకాలు పేర్లతో పిలిచేవాడు. అలా తను పిలుస్తూంటే నవ్వుకోలేక చచ్చేవాళ్లం.

చలసానికి నీళ్లంటే ప్రాణం. కాలవల్లో, నదుల్లో, సముద్రంలో తను మునకలేస్తూ ఈదుతూంటే, ఈత రాని మేం ఒడ్డును కూర్చునేవాళ్లం - భయపడుతూ, తను గజ ఈతగాడు. జీవితాన్ని అలాగే పరిపూర్ణంగా ఈదేస్తాడని ఆశపడ్డాం. ఇంత విలువైన వ్యక్తి స్నేహం దొరకడం అపూర్వ వరం.

చలసాని స్నేహం-సాహిత్యం

కాశీం

నేను చలసాని ప్రసాద్‌ను 1998లో దగ్గరగా చూసాను. అదే సంవత్సరం కావలి విరసం సాహిత్య పాఠశాలలో వక్త రాకపోవటం వలన అంబేద్కర్ మీద ఆపధర్మ వక్తగా ఉపన్యాసించాడు. బోర్ ఉపన్యాసమని మా మిత్ర బృందం ఫిర్యాదు. కాని చాలా లోతైన విశ్లేషణ. విప్లవకారులు అంబేద్కర్‌ను చదువలేదని కొందరు దళిత మేధావులు, కార్యకర్తలు హేళనగా మాట్లాడుతుంటారు. చలసాని అధ్యయనమే వారికి సమాధానం. అట్లా చలసాని నాకు పరిచయం. ఆయన ఉద్యమ జీవితమంత వయస్సు కూడా లేని నేను ఏకవచన ప్రయోగంతో రాస్తున్నానని పాఠకులు అనుకోవచ్చు, కాని ఆయనను ఇలా కాకుండా ఇంకోలా సంబోధించేటట్లు ఏనాడు మాతో వ్యవహరించలేదు. ఆయన మనుషుల మధ్య అడ్డుగోడలను బద్దలుచేసాడు. వయసు శరీరానికే తప్ప స్నేహానికి కాదని నిరూపించాడు. ఇరవై ఏళ్ల యువతీ యువకులతో ఎనభై ఏళ్ల మేధావితో ఒకేలా సంభాషించటం ఆయనకే చేతనవును. కనుకనే ఆయనను మూడో జనరేషన్ విరసం సభ్యులం ప్రేమగా సి.పి అని, చలసాని అని పిలుచుకుంటాం. మావోయిస్టు పార్టీ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్చల సందర్భంలో మంజీరా గెస్ట్‌హౌస్‌లో ఇరవై ఏళ్ల గెరిల్లా పార్టీ కార్యదర్శి రామకృష్ణను 'ఆర్కే ఇక్కడికి రావా?' అని పిలిచింది. డ్యూటీలో ఉన్న ఒక పోలీస్ ఆఫీసర్(నా మిత్రుడు) నేను మాట్లాడుకుంటూ నిలబడ్డాము. వెంటనే ఆ ఆఫీసర్ ఆశ్చర్యానికి గురై ఈ పార్టీలో అందరూ ఇట్లా పేర్లు పెట్టి పిలుచుకుంటారా? ఇంత సమానత్వమా అని అడిగాడు. సమానత్వమనేది అన్నింట్లో ప్రతిఫలించాలని కాబోలు...? ఈ స్వభావాన్ని సి.పిలో నేను ఎన్నడో చూసాను.

చలసానికి తెలంగాణ మీద అవిభాజ్యమైన ప్రేమ. నడుస్తున్న తెలంగాణకు అడిగిన వెంటనే వ్యాసాన్ని పంపేవాడు. విరసం తెలంగాణపై తెచ్చిన 'ప్రజా తెలంగాణ' వ్యాసాల పుస్తకానికి అందరి కంటే ముందు వ్యాసాన్ని పంపించింది ఎనభై ఏళ్ల యువకుడు. మీ పత్రికలో నా కవిత వేస్తావా? అని అడిగి పంపించేవాడు. మీ కేసీఆర్ ఎలా ఉన్నాడు? ఏమంటున్నాడు? అని ఫోన్ చేసినప్పుడల్లా అడిగేవాడు. డా॥సి.నారాయణరెడ్డి బాగున్నాడా? అని తప్పక అడిగేవాడు. మేము విరసం కార్యవర్గంలోకి వెళ్లిన కొత్తలో ఎజెండాలోని ఏదైనా విషయం మీద చర్చ వస్తే సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు కలిపి ఒక ఉపన్యాసం చేసేవాడు. సర్వసభ్య సమావేశంలోను అంతే. భుజం మీద చేయివేసి ఎన్ని విషయాలు చెప్పేవాడో. మొదట్లో ఆయన యాసను అర్థం చేసుకోవటం నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఆయన దగ్గరయ్యేకొద్దీ మనస్సు మాట్లాడుతున్నట్లు అన్పించేది. అరమరికలు లేని స్నేహాన్ని పదిహేడేళ్లు పొందగలిగాను. మొదట్లో నన్ను కాశి అనేవాడు. శివసాగర్ అలాగే పిలిచేవాడు. ఎవరైనా ఆయనలా ఉండటం సాధ్యమా? అందరికి సాధ్యం కావాలి. ఆయననే అందరికి అనుసరణీయం. మంచి మానవ సంబంధాలే విప్లవానికి పునాది. ఈ నాలుగు వాక్యాలు నా వైయక్తికాలనుకొని వదిలేయండి.

చలసాని వ్యూహకర్త. పరిశోధకుడు. చరిత్ర, సాహిత్యంలో మంచి పట్టున్న విప్లవ రచయిత. రచయిత ప్రజల పక్షపాతిగా ఉండాలి. విప్లవ రచయిత మరీ. ప్రజల సాహిత్యాన్ని గానం చేసే బాధ్యతను చేపట్టిన వాళ్లే విప్లవ రచయితలు. ప్రజల నుంచి ప్రజలకు అంటే ఇదే. మార్గ, దేశి కవితలు లిఖిత సాహిత్యంలో ఉన్నవే. ఒకటి సంస్కృత సంప్రదాయం. మరొకటి తెలుగు సంప్రదాయం. మరి ప్రజా సంప్రదాయమేది? మౌఖిక సాహిత్యం. జి.కళ్యాణరావు (అంటరాని వసంతం) అన్నట్లు 'మా అయ్య అల్లినదాన్ని' రాసినవాడిదే సంప్రదాయమైతే, అల్లిన వాడి సంగతేంది? అల్లినవాడి గురించి ఆలాపించాలని చలసాని తపన. 1971లోనే 'జానపద కవిత్వం' గురించి రాసిన రచయిత. బహుళ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత మళ్లీ చెరబండరాజు, గద్దర్ వలే మౌఖిక సాహిత్యాన్ని పట్టించుకున్నవాడు చలసానియే కావచ్చు. జానపదాలను కవిత్వంగా వ్యవహరించే సంస్కారం ఆయనకు నక్సల్బరీ-శ్రీకాకుళం-పాణిగ్రాహి ఇస్తే భాషా సంబంధమైన జ్ఞానాన్ని ఆంగ్ల సాహిత్యం ఇచ్చిందనటం కంటే మౌఖిక సాహిత్యం ఇచ్చిందనటమే సమంజసం. అందుకే చలసాని 'శ్రమైక జీవనమే అన్ని కళలకు, కవిత్వాలకు మూలం. సామాజిక జీవితమే ఒక గీతిక' అనగలిగాడు.

చలసాని సాహిత్య శిల్పం సరళమైంది. మనిషి ఎంత సహజంగా ఉంటాడో భాష అంతే. ఎంత ప్రేమాస్పదంగా ఉంటాడో భాషను అట్లే ప్రయోగిస్తాడు. భావాలలో స్పష్టత ఉంటే రచనలో స్పష్టత ఉంటుంది. సిద్ధాంతాన్ని ప్రజల కోణంలో అర్థం చేసుకొని ప్రజల భాషలో వారికే చేరవేయాలనే బాధ్యతతతో రాస్తే భాష-భావం-శైలిలో సరళత్వం ఉంటుంది. శిల్పం విషయంలో చలసాని అభిప్రాయాలు జనాన్ని విడిచి పెట్టలేదు. నేల విడిచి సాము చేయలేనట్లే జనాన్ని విడిచి కవిత్వం ఉండదంటాడు. ప్రజలకు ఉపయోగపడని కవిత శిల్ప సౌందర్యంతో, మరెంత శయ్యా సౌభాగ్యంతో మిరుమిట్లు గొలిపినా నిరర్ధకం. శిల్పం భాష దగ్గర మొదలవుతుంది. భాష అంటే ప్రజలదే. శిల్పంలో పదప్రయోగాలు, ఉపమానాలు, రూపకాలు, ఉత్ప్రేరకాలు, పదచిత్రాలు, భావచిత్రాలు ఉండాలని అలంకారికులు చాలా బరువైన నిర్వచనం చెప్పారు. చలసాని నిర్వచనం చూడండి 'గుండెల్లో వున్న భావానికి సూటి అయిన మాట వాడడమే ఉత్తమశిల్పం' అన్నాడు. చలసాని దృక్పథం దేని మీదనైనా వైయక్తిక స్పష్టత నుంచి వచ్చింది.

ఆయనకు ప్రాచీన సాహిత్య అధ్యయనం విస్తృతంగా ఉంది. పాత సాహిత్యాన్ని అధ్యయనం చేయనివాళ్లు, కొత్త సాహిత్యాన్ని నిర్మాణం చేయలేరు. ఈ అవగాహనతో చలసాని కొత్త పాత మేలు కలయిక కోసం మాత్రమే కాకుండా మార్గ-దేశీ కవితల మధ్య తేడాను చెప్పటానికి తన అధ్యయనాన్ని ఉపయోగించాడు. మార్గకవిత్వం శవప్రాయమైనదని, దేశి కవిత్వం సజీవమైనదని అన్నాడు. అనువాద రొంపి నుంచి తెలుగు కవితను దేశీయ తొలి కోడికూతలా విన్పించిన పాల్కుర్కి సోమనాథుడి మీద చలసాని అపారమైన గౌరవాన్ని ప్రదర్శించాడు. మల్లంపల్లి సోమశేఖరశర్మ మొదలైన పండితులు ప్రాఙ్నన్నయ యుగ విశేషాలను, నన్నయకు ముందే వికసించిన తెలుగు కవితను వివరించిన తీరు పట్ల ముగ్ధుడైన చలసాని ప్రజా దృక్పథంతో తన వ్యాసాల్లో పొందుపర్చాడు. ఆయన పరిశీలనలు చాలా సూక్ష్మంగాను, తర్కబద్ధంగాను ఉంటాయి. మొదటి వాక్యానికి రెండో వాక్యానికి వైరుధ్యం ఉన్నట్లు అన్పిస్తుంది, కాని అదొక ఎత్తుగడ. మొదటి పాదంలో ఒక ఊహను ప్రతిపాదించి రెండో పాదంతో ఘర్షణను సృష్టించి మూడో పాదం నీతిని చెప్పే వేమన ఎత్తుగడను శ్రీశ్రీ చెప్పినట్లు, చలసాని వచన నిర్మాణం వేమనలా ఉంటుంది. మార్గకవితకు, దేశి కవితకు పోటి వచ్చినప్పుడు దేశి కవితను ఎత్తిపడుతాడు. దేశి కవితకు ప్రజా కవిత్వానికి మధ్య చర్చ వస్తే మౌఖిక సాహిత్యం వైపు నిలబడుతాడు. ఈ వాక్యం చూడండి, 'తెలుగులో దేశి కవిత్వం మొదటి నుంచి ఉంది. కాని శివకవులు చేపట్టే వరకు అది వెలుగులోకి రాలేదు' శివకవులు ఎంత ప్రగతి శీలమైనా పండిత సంప్రదాయమే. మౌఖిక సాహిత్యంలోనే మొదటి విత్తనం ఉంటుందని చలసాని అభిప్రాయం. ఈ తరగని గనిని చరిత్రలో అక్షరం నేర్చిన ప్రతి ఒక్కరు తవ్వుకున్నవారే. అయితే తొవ్వుకోవటం ప్రజా ప్రయోజనం కోసమైతే నష్టం లేదు. వాటిని స్వీకరించేటప్పుడు కూడా 'మరీ మరీ మననం చేసి వాటిని నేటి ప్రజా జీవితానికి అనుగుణంగా మలిచి సజీవ కవిత్వాన్ని రాయాలి' ఇది ప్రజా సాహిత్యం పట్ల చలసాని దృక్పథం. దేశి కవితను శివుడు (నరుడో భాస్కరుడా) రెంజిమ్(చెల్లీ చెంద్రమ్మ) విప్లవ కవిత్వం స్థాయికి తెచ్చారని చలసాని నిర్ధారించాడు.

మౌఖిక సాహిత్యాన్ని స్వీకరించడమంటే వస్తు-రూప చర్చ కాదని దాని సామాజిక ప్రయోజనమేమిటనేది చూడాలంటాడు. ప్రజల మాటలను పోగుచేసి, బాణీలను స్వీకరించడం మాత్రమే కాదు, ఆ ప్రజల ఆరాట, పోరాటాలను, కన్నీళ్లు, చెమట, రక్తాన్ని అక్షరాలుగా మార్చే పని విప్లవ కవులు చేయాలని చెప్పాడు. ప్రజల పాటలలో ఉండే రసాత్మక గుణం విప్లవ కవులు నేర్చుకోవాలి. వాటిలో ఉండే చేవ, చతురత, పసందు వీరావేశం పలికించని రచన నిస్సారంగా ఉంటుందని ఎందరో చెప్పి ఉన్నారు. వారి కొనసాగింపు చలసాని.

సాహిత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్న ఇవాళ్టిది కాదు. సాహిత్యమనే మాట అస్తిత్వంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ప్రశ్న ఉంది. అలంకారికులు కూడా సాహిత్యం గూర్చి చర్చించి ఉన్నారు. స్థూలంగా హితం చేసేది సాహిత్యమని నిర్వచించుకున్నారు. 'స' అనే ఉపసర్గ హితం అనే ధాతువును కలిపి సాహిత్యమని అనుకున్నప్పుడు, 'స' అనే ఉపసర్గకు సమాజం అని అర్థం చెప్పుకోవచ్చు. మేలు చేసేది సాహిత్యం అయితే, కచ్చితంగా సమాజానికే అయి ఉండాలి. ప్రపంచంలో ప్రజా పోరాటాలు కింది శ్రేణుల నుంచి వచ్చిన తర్వాత సహజంగానే కొన్ని పదాలకు ఉన్న మునుపటి అర్థాలు మారిపోతూ ఉంటాయి. వ్యవహర్తలు ఏ వర్గానికి చెందిన వారైతే అర్థాలు కూడా ఆ వర్గ దృష్టితోనే ఉంటాయి. ఆధునికత అనే బూర్జువా దృష్టి ఏర్పడిన తర్వాత సాహిత్య ప్రయోజనం తప్పనిసరి సమాజం కోసమే అనే రూఢీ ఏర్పడింది. సాహిత్యం ఎందుకనే ప్రశ్న చలసానికి వస్తే సమాధానం చూడండి 'సమాజ హృదయమే సాహిత్యం.' అర్థాలను వెదికే ముందు దేనినైనా చదవాలి కదా! అధ్యయనమే కొన్నిసార్లు చిక్కు ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. ప్రకృతితో పోరాడే మానవుడు వివిధ సందర్భాలలో పొందే సుఖ, దుఃఖాలను సాహిత్య వస్తువుగా మార్చుకుంటాడు. ప్రకృతి రహస్యాన్ని మనిషి సాహిత్యం ద్వారానే వ్యక్తం చేస్తాడు.

పుస్తకమంటే ఏమిటి? ఈ ప్రశ్న వింతగా అన్పిస్తుంది కదా! ఇట్లాంటి వింత ప్రశ్నలు వేసి విలక్షణమైన సమాధానం చెప్పిన మనిషి చలసాని. అందరికి తెలిసిన విషయాలను, ఎవరు అంతగా పట్టించుకోని విషయాలను చలసాని పట్టించుకుంటాడు. కొన్ని వేల పుస్తకాలు మన చేతుల నుండి జారిపోయి వుంటాయి. కొన్ని లక్షల పేజీలు కళ్లకు తాకి ఉంటాయి. కాని ఆ అక్షరాల వెనుక ఉన్న మనుషుల గురించి మనలో కొందరం ఆలోచించి ఉండకపోవచ్చు. చలసాని ఆలోచిస్తాడు. 'పుస్తకం ఈ ప్రపంచంలో ఒక గొప్ప వింత' అని ఆగిపోకుండా ఆ వింత వెనుక కనిపించని శక్తుల గురించి మాట్లాడుతాడు. మనకు తెలియనివాళ్లు, తెలియని భాషలో, కాగితం మీద కన్నీళ్లతో, చెమటతో, నెత్తురుతో గీసిన చిత్రాలను మన వద్దకు మోసుకొచ్చే తపాల బంట్రోతు పుస్తకం. పుస్తకాన్ని కొందరు నిద్ర

రావటం కోసం చదువుతారు. ఇంకొందరు టైంపాస్ కోసం చదువుతారు. మరికొందరు జ్ఞానం కోసం చదువుతారు. చలసాని ఎందుకోసం చదువుతాడు 'అవి ఒక్కోసారి మనని కన్నీరు కార్పిస్తాయి. మరోసారి మనకు కోపం తెప్పిస్తాయి. ఇంకోసారి స్వప్నసీమల్లో, ఆనంద డోలికల్లో ఊగిస్తాయి'గోర్కీ అభిప్రాయాలను జీర్ణం చేసుకొని స్థానికతను అన్వయించి చెప్పటం చలసానికే సాధ్యం.(విశ్వసాహిత్యం)

సాహిత్య నిర్మాణంలో ప్రధానాలు ఏమిటి? ఈ విషయం మీద చర్చ ఇప్పటికీ ముగియలేదు. ఎవరి దృష్టి కోణం నుంచి వాళ్లు సమాధానం చెబుతున్నారు. కాని వాస్తవం ఒకటి ఉంటుంది కదా. ఆ వాస్తవమేమిటో చలసానికి తెలుసు. సాహిత్యంలో మొదటి అంశం భాష. సాహిత్యంలో భాష తొలిపనిముట్టు. భాష జనం వాడుకలో నుంచి పుడుతుంది. రచనలో పాత్రలు నిత్య జీవితాలైనప్పుడు, వాడుక భాషే ఉండాలి. పాత్రలు వాడుక భాషే మాట్లాడాలి. భాష నిరంతరం మార్పుకు గురవుతుంది. అయితే ఈ మార్పు ఉత్పత్తి శక్తులు మారినప్పుడే వేగంగా మారుతుంది. సాహిత్యంలో రెండో అంశం వస్తువు. వస్తువు రచయితదే. అతడి జీవితానుభవం నుంచి వస్తుంది. సాహిత్యంలో మూడో అంశం చిత్రణ. ప్రజల పరస్పర సంబంధ బాంధవ్యాలు, వైరుధ్యాలు, ఇష్టాయిష్టాల చిత్రణే. అలంకారికులు ఇతివృత్తమే కావ్య శరీరం అన్న, రసాత్మకమైన వాక్యమే కావ్యమైన, వక్రోక్తియే కావ్యమని చెప్పిన గోర్కీ చెప్పిన సాహిత్య నిర్మాణాన్ని చలసాని ఇంత సరళంగా మనకు అందించాడు.

చలసాని ఏదైనా పుస్తకం మీద రాసినా ఆ పుస్తకాన్ని మన కళ్ల ముందు నిలబెడుతాడు. వెంటనే ఆ పుస్తకాన్ని చదవాలనే ఆసక్తిని రేకెత్తిస్తాడు. 'రెక్కవిప్పిన రివల్యూషన్' (శ్రీశ్రీ) గురించి రాస్తూ 'విప్లవం పారిస్‌లో ఓడిపోయినా విశ్వమంతా వ్యాపించి వీర విహారం చేస్తుంద'న్నాడు. పండితులు పుస్తకాన్ని హస్తభూషణం అంటే చలసాని మాత్రం మస్తిష్కానికి పదునుపెట్టే వజ్రం అన్నాడు. ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పుకోవటంలో చలసానికి చలసానియే. ఈ వాక్యం చూడండి. 'రెక్కవిప్పిన రివల్యూషన్ కథా? కావ్యమా? నవలా? నాటకమా? ఏ ఒకటి కాదు. కాని అన్నీను.' జాన తెనుగు అంటే చమత్కారమైన నుడి అని విమర్శకులు చెప్పారు. దేశి వారసత్వ రచన శైలి చలసానిది. అందుకే వాక్యం నిండా చమత్కారం మెరుస్తుంది. తెలుగు సాహిత్యంలో పదాలను సృష్టించి రూఢీ చేయటంలో శ్రీశ్రీ కెవరు సాటి లేరు, తర్వాత చలసాని, 'సంజకెంజాయ పార్టీ' అని ఎవరిని ఉద్దేశించాడో సులభంగానే చెప్పవచ్చు.

మా తరానికి తెలియవల్సిన చాలా విషయాలున్న వ్యాసం 'తూర్పు పవనం వీచెనోయ్-తూర్పు దిక్కెరుపెక్కెనోయ్' ఇది కార్యదర్శి నివేదిక. చరిత్రను రికార్డు చేస్తూనే సాహిత్య విషయాలు చర్చించాడు. రాజ్య నిర్బంధాన్ని బట్టబయలు చేస్తూనే సంస్థ సభ్యులలో ఉన్న నిర్లిప్తతను సూటిగా ఎత్తిచూపాడు. 1986లో శ్రీకాకుళంలో జరగాల్సిన 11వ రాష్ట్ర మహాసభలను(విరసం) తెలుగు దేశం పార్టీ జరగకుండా చేసింది. 1988లో ఒంగోలులో జరిగిన మహాసభల్లో తన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టాడు. అందులో అరుణతారకు సంబంధించిన విషయాలను రాస్తూ అప్పులు తెచ్చి పత్రికను నడుపుతుండిన స్థితి, 'సర్వసభ్య సమావేశంలో అరుణతార గురించి నిజాయితీగా చర్చిస్తారు. విరాళాల వర్షం వాగ్దానాల రూపంలో కురుస్తుంది.' అని సభ్యుల్లో పేరుకుపోయిన అశ్రద్ధే దీనికి కారణమని రాసాడు. ఈ స్థితి ఈ నాటికీ కొనసాగటమే విషాదం.

చలసాని సాహిత్యంలో 'గురజాడ కవిత్వం' మీద రాసిన వ్యాసం పరిశోధనాత్మకమైనది. కొందరి వాదనలను తుత్తునియలు చేసింది. మరికొందరి మధ్యమార్గాన్ని డైనమెట్‌తో పేల్చింది. గురజాడను, అతని భావాలను తెలుగు సాహిత్యంలో యాసిడ్ పోసి తుడ్చివేద్దామని చాలామంది ప్రయత్నం చేసారు. ఆ ప్రయత్నాలన్నీ కె.వి.ఆర్ 'మహోదయం'లో శ్రీశ్రీ 'మన గురజాడ'లో కొట్టుకుపోయాయి. వీరిద్దరి కొనసాగింపుగా చలసాని గురజాడను తలకెత్తుకున్నాడు. గురజాడ బ్రాహ్మణుడు కనుక ఆకాశానికెత్తారని కొందరు అంటున్నారు. ఇది ఎంత అనౌచిత్యపు మాటో వాస్తవాన్ని చూస్తే అర్థమవుతుంది. గురజాడను అకవి అని అన్నది, ఆయన రచనలు వెలుగు చూడకుండా తొక్కిపెట్టింది, కన్యాశుల్కం ప్రభావాన్ని తట్టుకోలేక కుళ్లుకున్నది, దిద్దుబాటు దెబ్బకు కూలిపోయింది బ్రాహ్మలే మరి. దీనిని ఏమందాం. మధురవాణిని ఆకాశమంత ఎత్తున నిలబెట్టింది, అగ్నిహోత్రవధాన్లను చీల్చి చెండాడింది గురజాడనే. కనుక రచనలో వ్యక్తం చేసిన భావాలను బట్టి కవికి కొనసాగింపు ఉంటుందనేది మౌలికం. కులం పాత్ర కూడా ఉన్నప్పటికి ఇతరుల విషయంలో నిజం. గురజాడ విషయంలో పాక్షికమే. ఆయన ఏటికి ఎదురీదడమే ఆనాటి బ్రాహ్మణులకు నచ్చలేదు.

కనుక చలసాని ఆధునిక కవిత్వానికి గురజాడనే యుగకర్త అని రాసాడు. రాశి రీత్యా అతి తక్కువ కవిత్వం రాసిన గురజాడ 'వాసి'కెక్కాడు. 'నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలేతై/ నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే'నని సాధికారికంగా నిరూపించాడు. ఆధునిక యుగ లక్షణాలను ఆకలింపు చేసుకొని నవీన భావాలను తన కవిత్వంలో పొదిగిన గురజాడనే ఆధునిక యుగకర్త అని చలసాని నిశ్చితాభిప్రాయం. గురజాడ తన కాలానికంటే ఎంత ముందు ఉన్నాడో ఊహించటం ఏ పరిశోధకుడి నుంచి కాదు. ఇన్ని పాజిటివ్ విషయాలున్నా గురజాడకున్న పరిమితిని కూడా చలసాని ఎత్తిచూపాడు. వలస దోపిడి స్వభావాన్ని సరిగ్గా అంచనా వేయకపోవటం ఆయన పరిమితి.

చలసాని వాక్య విన్యాసంపై శ్రీశ్రీ ప్రభావం చాలా ఉంది. అలవోకగా సందర్భోచితంగా కవితాపాదాలు దొర్లుతాయి. కొన్ని వాక్యాలు వచన కవితలా నిర్మాణమయ్యాయి. ఈ అలవాటు ఆయనకు విస్తృతమైన అధ్యయనం వలన వచ్చింది. మౌఖిక కవిత్వాన్ని, సంప్రదాయ కవిత్వాన్ని, ఆధునిక కవిత్వాన్ని ఆయన ఎంత లోతుగా చదువుకున్నాడో అతడి వ్యాసాలు చదివితే కాని తెలియదు. వస్తువు విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో వ్యాసం రూపం విషయంలో చాలా సరళంగా రాసాడు. విప్లవ శిబిరంలో రచన శైలికి ఆయన ఆదర్శనం. రెండు తరాలకు వారధిగా సాహిత్య రచన చేసిన చలసాని వస్తువు ఎంపికలోను, వ్యాస నిర్మాణంలోను, వ్యాస శిల్పంలోను నేటి తరానికి అనుసరణీయం.

ప్రజల మనిషి
చలసాని ప్రసాద్‌కు జోహార్లు

పి.వి. రమణ

విప్లవ రచయితల సంఘానికి పునాదులు వేసిన వారిలో ప్రథములు చలసాని ప్రసాద్. 1970లో విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభలలో విశాఖ విద్యార్థులు 'రచయితలారా మీరెటువైపు?' అనే కరపత్రం వేసి మొత్తం తెలుగు సమాజాన్ని ప్రశ్నించారు. అప్పటికే శ్రీకాకుళ పోరాటం అణిచివేయబడింది. విప్లవం గురించి గానీ, విప్లవ సాహిత్యం గురించి గానీ ఎవరూ మాట్లాడడానికి వీలులేని పరిస్థితి కొనసాగింది. అటువంటి స్థితిలో నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతూ చరిత్ర సృష్టించిన విశాఖ విద్యార్థులతో చలసాని ఉన్నారు. విప్లవోద్యమాలను బలపరిచే సాహిత్య ఉద్యమ అవసరాన్ని బలపరిచిన వారిలో ముందు భాగాన చలసాని ఉన్నారు. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కె.వి.ఆర్, వరవరరావు, జ్వాలాముఖిలాంటి ప్రముఖ రచయితలందరినీ కూడగట్టి విప్లవ రచయితల సంఘం ఏర్పాటుకు సంధానకర్తగా పనిచేశారు చలసాని.

కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రు గ్రామంలో 8 డిసెంబర్ 1932న చలసాని జన్మించారు. ఆయన తల్లి వెంకట నరసమ్మ, తండ్రి బసవయ్య. తండ్రి చల్లపల్లి జమీందారి దగ్గర కప్పం వసూలు చేసే గుమస్తాగా పనిచేసేవారు. వారింట్లో అప్పటికే కమ్యూనిస్టు రాజకీయాలు కొనసాగుతుండేవి. 5వ ఏటనే చలసాని కమ్యూనిస్టు జండా పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. విద్యార్థి రాజకీయాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మద్దతుగానూ, జమీందారీ వ్యతిరేక పోరాటాల్లోనూ పనిచేస్తున్న కమ్యూనిస్టుల మీద ఆ రోజుల్లో దారుణమైన మారణకాండలు జరిగాయి. అందులో భాగంగానే చలసాని అన్న శ్రీనివాసరావు, పినతండ్రి జగన్నాథరావు, బావ పాపారావులను పోలీసులు కాల్చి చంపారు. వీటన్నిటి ప్రభావం చలసాని మీద తీవ్రంగా పడింది. అందుకే కార్యాచరణలో దృఢంగా ముందుభాగాన నిలబడ్డారు.

బ్రతుకు తెరువు కోసం కొంత కాలం రాష్ట్ర ప్రభుత్వంలో గుమస్తాగా, కొంతకాలం కాజీపేట రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ రైల్వే కేటరింగ్ మేనేజర్‌గానూ, కొంతకాలం వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. 1965లో సినిమా రంగంలో చేరి 'కలిమి లేములు' చిత్రంలో గోపీచంద్‌కు స్క్రిప్ట్ అసిస్టెంట్‌గానూ, దర్శక నిర్మాత ప్రత్యగాత్మ నిర్మించిన 'చిలకా గోరింక', 'మా వదిన' చిత్రాలకు నిర్మాణ నిర్వాహకుడిగా పనిచేశారు. 1968 నుండి విశాఖలో ఎ.వి.ఎన్. కాలేజీలో రాజకీయ అధ్యాపకుడిగా పనిచేసి, 1992లో పదవీ విరమణ చేశారు. ఆయనకు నవత, మమత అనే ఇద్దరు కుమార్తెలు. ఆయన ఆచరణకు పూర్తిగా సహకరించిన భార్య విజయలక్ష్మి 2003లో మరణించారు. 25-జూలై-2015న సాయంత్రం విశాఖలో జరిగాల్సిన విరసం ఆవిర్భావ సభలో పాల్గొని షహీదా కవిత్వం మీద మాట్లాడటానికి సిద్ధమౌతూ, ఉదయం 11 గంటలకు ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి చలసాని మరణించారు. అంటే చివరి క్షణం వరకూ తను నమ్మిన ఆశయాల ఆచరణలోనే ఉంటూ కన్నుమూశాడు చలసాని. ఆయన కళ్లను ఐ బ్యాంకుకు, శరీరాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీకి 26వ తేదీన దానం చేశారు.

సాహిత్య రంగంలో చలసాని లేని లోటు చాలా పెద్దది. విప్లవ రచయితలే కాకుండా ఇతర రచయితలెవరైనా సాహిత్య పరిశోధనలో ఏదైనా అవసరం అనిపిస్తే చాలు, వారికి కావలసిన సమాచారాన్ని, రచనలను తన మిత్రబృందం సహకారంతో రాష్ట్రమంతటా వెతికి వెతికి పట్టుకుని అందించేవారు. అటువంటి వాళ్లు చాలా అరుదు. తన అసాధారణ కార్యదీక్షతో శ్రీశ్రీ సాహిత్యం 21 సంపుటాలు, కొకు రచనా సర్వస్వం 18 సంపుటాలు, రావి శాస్త్రి సర్వస్వాలను తెలుగు ప్రజలకు

అందించి మహోపకారం చేశారు. గోపిచంద్ రచనా సర్వస్వం 10 సంపుటాలను కూడా అందించారు. చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలు (2003), చలసాని ప్రసాద్ రచనలు (2008) పేరుతో ఆయన రచనలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. సిద్ధాంత పరమైన క్రాంతి ప్రచురణలకు అనేక అనువాద రచనలు చేశారు. శ్రీశ్రీ, రావి శాస్త్రి, కాళీపట్నం రామారావుల నుండి నిబద్ధ సాహిత్యాన్ని వెలువరించడంలో చలసాని అద్భుతమైన పాత్ర వహించారు.

విప్లవ సాహిత్య సంస్థకు ఎలా పునాదులు వేశాడో, అలాగే జననాట్యమండలి లాంటి సాంస్కృతిక కళా సంస్థకు విశాఖలో పునాదులు వేసినది చలసానే. స్వయంగా పాల్గొనడమే కాకుండా తన కుమార్తెలు నవత, మమతలతో ఆంధ్రప్రదేశ్‌లో వందలాది గ్రామాల్లో చరిత్ర సృష్టించిన భూమి భాగోతంతో పాటు అనేక కళా రూపాలు ప్రదర్శించడంలో ముందు భాగాన నిలబడ్డారు. విరసం సభలలో 'ఎత్తినాం విరసం జెండా' ఎప్పుడూ ఆయనే పాడేవారు. 'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే శ్రీకాకుళం వైపు వేలు చూపించాలి' అనే పాట ఆయనకు చాలా ఇష్టం. తను స్వయంగా అనేక సభల్లో పాడారు.

ప్రత్యేకంగా ఆయన గురించి చెప్పుకోదగ్గది ఆయన వ్యక్తిత్వం. చిన్న పిల్లాడిలా ఎటువంటి మనుష్యులతోనైనా సులువుగా కలిసిపోయేవారు. నమ్మిన విశ్వాసాలకు భంగం కలగకుండా తన రాజకీయ విశ్వాసాలకు భిన్నంగా ఉన్న వారితో కూడా స్నేహంగా మెలగడం చాలా మందికి అంతుపట్టని విషయం. ఆయన సంస్మరణ సభలో అటు విప్లవ రాజకీయాలతో ఉన్న వారితో పాటు ఇటు సాంప్రదాయ భావాలు కలిగిన వారు కూడా ఆయనకు నివాళులర్పించడం అందుకు రుజువు.

ఇక విశాఖలో అన్ని ప్రజాసంఘాల కార్యక్రమాలలో చలసాని పాల్గొనేవారు. ఆయన లేని ప్రజాసంఘాల కార్యక్రమాలు లేవంటే అతిశయోక్తి కాదు. చాలా సార్లు నిర్వాహకులకంటే ముందుగానే వచ్చి వారిని ఇబ్బంది పెట్టేవాడు. జైలులో ఖైదీల సమస్య గురించి కూడా నిరంతరం ఆలోచిస్తూ చేయవలసిన పనులు చేస్తూనే ఉండేవారు. 30 వేల పుస్తకాలతో నిండిన ఆయన గ్రంథాలయం భావి తరాలకు పెద్ద వరం లాంటిది. పుస్తకాల గదులకు శ్రీశ్రీ, రావి శాస్త్రి, కొకుల పేర్లు పెట్టడం ఆయనకు వారి మీదున్న ప్రేమకు నిదర్శనం.

విరసం సంస్థాపక కార్యవర్గ సభ్యుడిగా మొదలై తరువాత కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, అరుణతార సంపాదకుడిగా కూడా పనిచేశారు. ఎమర్జెన్సీ కాలమంతా జైలులోనే ఉన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ అనేక మంది అమరుల శరీరాలను వారి కుటుంబాలకు అందజేయడంలో కూడా చాలా ప్రముఖ పాత్ర వహించారు. విప్లవ రచయిత అంటే కేవలం రచనలు చేయడమే కాకుండా ప్రజలతో మమేకమవడం ఎంత అవసరమో చలసాని తన జీవితం ద్వారా నిరూపించారు. ఆయన మరణించినా ఆయన వ్యక్తిత్వం, కృషి మనందరిలో జీవించే ఉంటుంది. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తీకరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుగుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

\- సం.

సాహితీవేత్త - స్నేహశీలి

డాక్టర్ నళిని

నేను విశాఖ నించి రాగానే చలసాని సంగతులన్నీ చెప్పడానికి కొ.కు. భార్య వరూధిని గారికి ఫోను చేశాను. 'ఈ శోకం ఎవరికి వారే అనుభవించాలనిపించి ఇంత వరకు ఎవరితో మాట్లాడలేదు,' అన్నారామె. తొంభయ్యేళ్ళ ఆమెని అంతటి దు:ఖంలో ముంచిన చలసానిలో ఉన్న గొప్పతనం ఏమిటవి ఆలోచించాను. స్నేహశీలత, ఒకసారి పరిచయమైన ఎవరితోనైనా స్నేహంగా ఉండగలడు. వయసుతో పనిలేదు. అందుకే, మా అమ్మ వ్యాస సంకలనం 'సాహిత్య సమాలోచన' వేస్తున్నప్పుడు, ఆమె రాజకీయ వ్యాసాలను మేము ముందుకు జరిపితే, స్నేహం గురించినవి అతను ముందుకు పెట్టేవాడు. మా ఇంట్లో వాళ్ళందరి స్నేహశీలత ఒకోసారి ఊపిరాడనిచ్చేది కాదు. ఇంట్లో ఉండే ఒక్కొక్క సభ్యుని చుట్టూ ఒక్కొక్క సమూహం. ఆ సమూహ వలయాన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి కూడా ఉండేవి. అలా ఇంట్లో ఒక సభ్యునికి మూడు నాలుగు సమూహాలతో సంబంధాలు ఉండేవి. టీచర్లు, రచయితలు, వామపక్షవాదులు, దళితులు, నాస్తికులు, విద్యార్థులు, ఉద్యమకారులు, సంగీతకారులు, శ్రేయోభిలాషులు, ఇరుగుపొరుగులు, చుట్టాలు పక్కాలు - ఇలా ఇంటి నిండా ఎప్పుడూ జనం - వస్తూ పోతూ, లేదా మజిలీలు వేస్తూ. అందుకే నేను మా ఇంటికి ముద్దుగా 'నానా జాతి సమితి' అని పేరు పెట్టుకున్నాను. పరీక్షలకి తయారయ్యే ఏ కాంతం కోసం రెండు మూడు నెలలు హాస్టల్‌కి పారిపోయేదాన్ని. ఇంటికి వచ్చేసరికి రెండు మూడయినా కొత్త ముఖాలు కనిపించేవి. చుట్టపు చూపుగా వచ్చేవారు, హాస్టల్లో చేరే ముందు ఇంటి బెంగ తీర్చుకోవాలనుకునేవారు, ఏదో సభ కోసం వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ ఉండిపోయేవారు, శలవుల్లో తప్పకుండా వేసవి విడిదిగా చొరవగా వచ్చేవారు, విడాకులకి ముందు తలదాచుకునే స్థలం కోసం వెతుక్కుంటూ వచ్చేవారు, తల్లిదండ్రులని ధిక్కరించి పెళ్ళిచేసుకునే ధైర్యాన్ని కూడగట్టుకోవడానికి వచ్చేవారు - అలా ఎప్పుడూ ఎవరో ఒకరు ఉండేవారు. అందుకే, ఒకసారి చలసాని బసవయ్యగారు ఏమన్నారంటే, 'అమ్మా, టర్నర్ చౌల్ట్రీ తర్వాత మీ ఇల్లే విశాఖలో సత్రం.' వెంటనే, 'మీరూ అలానే వచ్చారు కదా!' అని నేనంటే, ఆయన ఆలోచిస్తూ ఉండిపోయాడు.

ఖాజీపేటలో మొదటిసారిగా చలసాని పరిచయమయ్యాడు. అప్పట్లో ఆయన్ని 'అంకుల్' అని పిలిచేవాళ్ళం. ఎనిమిదేళ్ళ ఆడే పాడే వయసులో అందరికీ పేర్లు పెట్టడం, అల్లరి చేయడం, తూనీగల్లా ఎగరడం, ఇంటి చుట్టూ ఉన్న మైదానంలాంటి ఖాళీస్థలంలో పరుచుకోవడం - ఆనందమే ఆనందం. ఆ అంకుల్ పిలుపు కాస్తా 'అంకుల్ కంకుల్ పెంకుల్' అయిపోయింది. కానీ తనకి మాతో చనువు ఏర్పడ్డాక, ఆ ఇంగ్లీషు పిలుపు నచ్చలేదంటూ తెలుగులో హాయిగా బాబాయి అని పిలవమన్నాడు. అప్పటికి తను ఆర్.ఇ.సి. మెస్‌లో పనిచేసేవాడు. పొట్లపల్లి రామారావుగారి అన్న పిల్లలు మాతో కలిసి చదువుకునేవారు. కలిసి అల్లరీ చేసేవాళ్ళు. అలా ఒకసారి మా పెద్ద బావ చీర కట్టుకుని ఆడపిల్లలా సింగారించుకున్నాడు. ప్రసాద్ బాబాయిని ఆటపట్టిదామని తీర్మానించుకున్నాడు. బావ వయ్యారంగా ముందు నడుస్తుంటే, మా పిల్ల మూక తన వెనకాల కోతుల్లా చిందులు వేస్తూ ఆర్.ఈ.సి. హాస్టలు చేరుకున్నాం. ఎవరో ఆడపిల్ల తనని కలవడానికి వచ్చిందని చలసానికి కబురు వెళ్ళింది. చెమటలు కక్కుతూ ఆందోళనగా బయటికొచ్చాడు. వచ్చింది ఎవరో తెలియక తికమకపడ్డాడు. చివరికి బావ ఆగలేక, 'నేనే మామా!' అంటూ వేషం విప్పాడు. 'నన్నే ఆట పట్టిస్తావురా!' అంటూ మొట్టికాయ వేసి చలసాని ఊపిరి పీల్చుకున్నాడు. మేము విశాఖ తిరిగి వచ్చాక, చలసాని పెళ్ళి అని తెలిసింది. ఆడపిల్లలంటే అంతలా భయపడేవాడు పెళ్ళి చేసుకుంటున్నాడని ఆశ్చర్యపోయాం.

కమ్యూనిస్టు కుటుంబం నించి వచ్చిందని విజయని చూసి ప్రసాద్ ఒప్పుకున్నాడని అమ్మ చెప్పింది. అప్పట్లో ధృవ, రాము, మరో విజయ, కేరీ, ఆయన ప్రేయసి, కృష్ణక్క, జగపతిరామయ్యలు, అప్పారావు మామ రాధత్తమ్మలు, ఇంకా ఎంతోమంది స్నేహితులు ఉండేవారు. వారిలో కొందరు చిన్న వయసులోనే చనిపోయారు. అప్పుడే మాకు కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి, కాళోజీ, పొట్లపల్లి రామారావు వంటి ఎందరో గొప్పవాళ్లు కూడా పరిచయమయ్యారు. ఆ పరిచయాలు తర్వాత కాలంలో నాకు ఒక దృష్టిని అలవరిచాయి.

మేము విశాఖ తిరిగి వచ్చిన కొన్నాళ్ళకి చలసాని భార్యతో వచ్చి మాతో కొంత కాలం ఉన్నాడు. కానీ శాశ్వతంగా మా ఇంటికి వచ్చి ఉండిపోయింది మాత్రం నవత మూడేళ్ల పిల్లగా. అప్పటికి మా పెద్దనాన్నగారి పిల్లలు కూడా మాతో ఉండి చదువుకునేవారు. అందరం కలిసి నవతని బొమ్మలా చూసుకునేవాళ్ళం. అప్పటికే మా ఇల్లు థీసిస్ - యాంటీథీసిస్‌లా ఉండేది. సముద్రం వొడ్డున వెన్నెల్లో కూర్చుని ఘంటశాల గీతాలు ఆలపించే విశ్వవిద్యాలయ విద్యార్థులతో కాలక్షేపం ఒక వైపు, మరోవైపు ఇంట్లో, 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా', 'స్టాలినో నీ ఎర్రసైన్యం', 'ఏరువాకా సాగారో', 'ఏటికేతంబట్టి', 'కొంతమంది కుర్రవాళ్ళు', 'కొండలు పగలేసినం', 'ఎన్నాళ్ళీ కాపురాలు' వంటి పాటలు పాడుతూ చిందులు వేసేవాళ్ళం. బయట సిగ్గుగా బిడియంగా ముడుచుకుపోతూ, ఇంట్లో వీరంగం వేసే వయసు.

అప్పట్లో ఇల్లు సరిపోవడం లేదని బీచ్ క్వార్టర్స్ నించి సీశాండ్స్‌కి మారాం. ఇంటి చుట్టూ పెద్ద ఆవరణ. రకరకాల కూరల పళ్ళు పండించేవాళ్ళం. ఇంటి ముందు పెద్ద గోతిలో ఆట స్థలం. ఆ గోతి చుట్టూ రోడ్డు నిడివి ఫర్లాంగు. రోజూ దాని రకరకాలుగా కనిపించేది. రాత్రి పగలు, ఎండలో వెన్నెల్లో, తుఫానుల్లో, సూర్యోదయంలో మనోహరంగా ఉండేది. ఆట స్థలం పక్కన సిమెంటు దిమ్మెల మీద కూర్చుంటే ఎర్రమట్టి దిబ్బలు, దూరంగా క్షితిజరేఖ, దాన్ని చేరుకోవడానికి కదులుతున్నట్టు పడవలు, ఓడలు కనిపించేవి. రాత్రిపూట నక్కల ఊళలు, దుమ్మలగుండు తిరుగుతోందన్న పుకార్లు, దొంగలు భయాలు ఉండేవి. వంతులవారీగా నాన్న, బాబాయితో సహా కాలనీవాళ్ళ పహారా ఉండేది. ఆడపిల్లలం, మగపిల్లలం పోటీగా వేరు వేరు జట్లు కట్టి ఆడుకునేవాళ్ళం. మాకు సంవత్సరానికి ఒక జత బట్టలు మాత్రమే కుట్టించేవారు (పుట్టిన రోజుకి). మిగిలిన బహుమతులన్నీ పుస్తకాలే. ఎవరు వచ్చినా ప్రేమగా పుస్తకాలు అందించేవారు. వాటిని పోగేసి వేసవి శెలవుల్లో ఇంట్లో కూర్చుని చదువుకునేవాళ్ళం. కాలనీలో ఒక గారేజీ ఖాళీ ఉందని తెలిసి, అసోసియేషన్ వాళ్ళని అడిగి ఆడపిల్లలం అక్కడ ఒక లైబ్రరీ ఏర్పాటు చేసుకున్నాం. అందరి పుస్తకాలు అక్కడికి చేర్చాం. వాటిని ఎలా విభజించాలో, నంబర్లు ఎలా వెయ్యాలో చలసాని నేర్పాడు. అలా అందరికీ చింతాదీక్షితులు, గురజాడ, ప్రేంచంద్, కిషన్‌చందర్, టాల్‌స్టాయి, కొకు, మహీధర్ నళినీమోహన్, పిల్లల రష్యన్ సాహిత్యం, బాలల బొమ్మల భారతం రామాయణం వగైరా పరిచయమయ్యాయి. చందమామ కథల ఊహా ప్రపంచంలో విహరిస్తూ చీకూ చింతా లేకుండా ఆడుకునే వాళ్ళం. ధారణశక్తి ఏ వయసుకి ఎలా ఉంటుందో అధ్యయనం చేయడానికి పిల్లల డాక్టరుగా నాకు ఆ జ్ఞాపకాలు ఉపయోగపడ్డాయి.

ఇంట్లో స్వేచ్ఛా వాతావరణం మాకు ఎలాంటి సంకెళ్ళు వేయలేదు. పక్కింటి పిల్లలతో అట్లతద్ది ఆడేవాళ్ళం, రామబాణాలు వేసేవాళ్ళం, జోరుగా సైకిలు తొక్కేవాళ్ళం. పిల్లల్ని పోగేసి 'కొత్తగడ్డ'లోని ఘట్టాలు నటించేవాళ్ళం. చిన్న చిన్న సంవాదాలు డాన్సులో చూసేవాళ్ళం పండగలకి పట్టు పరికిణీలు కట్టుకుని విని ఉండ్రాళ్ళు భోం చేసే వాళ్ళం. శెలవుల్లో తోటపని చేసేవాళ్ళం. రాత్రుళ్ళు అన్నం తిన్నాక వెనకవైపు చప్టా మీద కూర్చుని గొంతెత్తి పాటలు పాడేవాళ్ళం, పద్యాలు చదివేవాళ్ళం. శ్రీశ్రీ ఊళ్ళోకి వస్తే చలసానితో కలిసి మా ఇంటికి వచ్చేవారు. ఆయన్ని విమర్శించే 'పుట్టుకతో వృద్ధులూ' వచ్చేవారు. కథ రాయగానే మొదట మా ఇంటికొచ్చి కథ వినిపించే రావిశాస్త్రి వచ్చేవారు. ఆయన వల్ల మా ఇంట్లో ఆసరా పొంది కూడా ఆయన్ని ఘోరంగా విమర్శించే రంగనాయకమ్మలాంటి వాళ్ళూ వచ్చేవారు. శ్రీకాకుళంలో రాజుకుంటున్న నిప్పుని పొదివి పట్టుకునే ఉద్యమకారులు వచ్చేవారు, శ్రీకాకుళం అంటే నాగరికతలేని సమూహమని అపోహ పడే అమాయకులూ వచ్చేవారు. ఎంతో మంది మేధావులు వచ్చేవారు, చదువు గుదిబండై మతి చెడి, ఆప్యాయత కోసం తల్లడిల్లే వాళ్ళూ వచ్చేవారు. దిగంబర కవులు వచ్చేవారు, వారు నగ్నంగా ఉంటారేమోనని భ్రమపడే సందేహాస్పదులూ వచ్చేవారు.

అలా చర్చలమీద చర్చలు జరిగేవి. మాటల తూటాలు పేలేవి. మళ్ళీ అంతా సద్దుమణిగేది. యధావిధిగా దినచర్య సాగిపోయేది. 'దేవదాసు' కథ మీద చలసానితో నా వాదులాట వారాల తరబడి సాగేది. దేవదాసు పిరికివాడా, కాదా. ఆనాటి సమాజానికి ప్రతినిధి అవునా, కాదా. పార్వతిని మోసం చేశాడా లేదా. తప్పు తెలుసుకుని చేయి అందించినా పార్వతి తిరస్కరించడం సబబేనా? ఆ అమ్మాయి పౌరుషంగా ఉండటంలో తప్పేమిటని వాదులడుకునే వాళ్ళం. మధురవాణికి అంటే ఇద్దరికీ ఇష్టమే. గురజాడ కన్యకని, పుత్తడి బొమ్మని తనే పరిచయం చేశాడు. 'అసమర్థుని జీవయాత్ర'కి, 'అల్పజీవి'కి పోలికలు వెతికే వాళ్ళం. విక్టర్ హ్యూగో 'లేమిజరబుల్స్' (బీదల పాట్లు). అంత పెద్ద గ్రంథం కావడానికి కారణం కథతో పాటు పాత్రల విశ్లేషణ, సమకాలీన పరిస్థితుల ఆవిష్కరణ వివరంగా ఉండటం. అది అవసరమా కాదా అని చర్చ జరిగేది. 'చదువు'లో కూడా ఆ పోకడలని వెతికేవాళ్ళం. ఇంకా అన్నాకెరినినా, క్రూట్జర్ సోనాటా, గుడ్ ఎర్త్, బెండ్ ఇన్ ది గాంజెస్, క్వయట్ ఫ్లోస్ ది డాన్ వంటి నవలలు, బాల్జాక్, విన్సెంట్ వాన్‌గో, చార్లీచాప్లిన్ వంటి వాళ్ల ఆత్మకథలు చదివి చర్చించేవాళ్ళం. చదివిన ప్రతి పుస్తకాన్ని విశ్లేషించడం నేర్పాడు చలసాని. దాని మీద విమర్శగాని, అభిప్రాయంగాని నోట్స్‌గా రాయమనేవాడు. ఆ అలవాటు నాకు పుస్తక సమీక్షలకి ఉపయోగపడింది. అరుణతార కోసం 'పావని' నవల మీద విమర్శ రాసి పంపితే, చలసాని, కె.వి.ఆర్. కలిసి నన్ను తరచుగా సమీక్షలు రాయమనేవారు. నేను వేరే కార్యకలాపాల్లో పాల్గొంటూ విరసానికి సమయం కేటాయించడం లేదని కినుకు వహించేవారు.

నాన్న, బాబాయిలవి విభిన్న వ్యక్తిత్వాలు. వాళ్ళ అలవాట్లు

వేరు, జీవన దృక్పథాలు వేరు. కానీ ఒకే ఇంట్లో కలిసి ఉంటూ ఎవరి జాగా వాళ్ళు పదిలపరుచుకునేవారు. ఎదుటి వారి స్పేస్‌లోకి జొరబడే వాళ్ళు కాదు. నాన్నకి క్రమశిక్షణ ప్రాణం. చలసానికి నియమాలు ఉల్లంఘించడం అలవాటు. వారి మధ్య ఆ ఘర్షణ ఉంటూ ఉండేది. కానీ సాహిత్యంలో, రాజకీయాల్లో చలసాని మాటకి నాన్న విలువనిచ్చే వారు. ఎదుగుతున్న కొద్దీ, ఎప్పుడైనా నేను చలసానిని విమర్శిస్తే, అందులో పాయింటు ఉంటే నాన్న నన్ను సమర్థించేవారు.

తెలుగు మీద పట్టుతో చలసాని మాకు మంచి నుడికారం నేర్పేవాడు. సరళమైన భాష రాయాలని చెప్పేవాడు. చిన్న చిన్న వాక్యాలు రాయాలనేవాడు. ఒకోసారి అవసరమైతే అర్థం దెబ్బతినకుండా పెద్ద వాక్యాలు రాయవచ్చంటే వాటిని కత్తిరించి, నాతో 'చాదస్తం' అనిపించుకునేవాడు. 'ఉప్పెన' అనువాదంలో వాక్య నిర్మాణంలో సలహాలు ఇస్తూ నాకు సహాయపడేవాడు. ఆ తర్ఫీదు 'ఎర్రమందారాలు' అనువాదానికి కూడా దోహదపడింది. 'మూడు తరాలు'పై సమీక్ష నిష్పక్షపాతంగా, ఆబ్జెక్టివ్‌గా రాయగలగడానికి ఆనాటి విశ్లేషణ, తర్వాత కాలంలో పెద్దల రాజకీయ శిక్షణ ఉపయోగపడ్డాయి.

పగలంతా ఎవరి పనులు వాళ్ళకి ఉన్నా, రాత్రి భోజనాలు మాత్రం అందరం కలిసి చేయాలనే నియమం అనుకోకుండా మా ఇంట్లో స్థిరపడి పోయింది. ఆ రోజు జరిగిన విశేషాలు, వార్తలు, మనుషులపై అంచనాలు, సాహిత్యం, జోక్స్, అన్నీ కలిసి మాకు తిండిని మించి ఉండేవి. ముద్దపప్పు, ఆవకాయ, చారన్నం మాత్రమే తిన్న రోజు కూడా విందు భోజనాన్ని తలపించే వాతావరణం అక్కడ ఉండేది. ఇంటికి ఎవరు వచ్చినా ఆ సామూహిక విందు భోజనంలో భాగస్వాములైపోయే వారు. వారి వారి పరిపక్వతనించి ఆ వాతావరణాన్ని విశ్లేషించుకునేవారు. అయితే, రంగనాయకమ్మ లాంటి వాళ్ళు మాకు ఆంక్షలు విధించేవారు. భోజనం చేస్తూ కొన్ని రకాల మాటలు మాట్లాడకూడదనే వారు. అందరం కలిసి కూర్చునే ఆ విలువైన సమయం మీద ఆమె పెత్తనమేమిటని మాకు కోపం వచ్చేది. అలానే ఆమె ఒకసారి చలసానితో పందెం కాసింది. 'పండంటి కాపురం' సినిమా అసలు ఆడనే ఆడదని ఆమె, అది ప్రజల నాడి పట్టింది, కాబట్టి వంద రోజులు ఆడుతుందని చలసాని వాదన. చివరికి చలసాని గెలిచాడు. నాతో సాహిత్యం చదివించినట్టే చలసాని రంగనాయకమ్మతో మార్క్సిజం చదివించాడు. ఆమెకి సులభంగా అర్థమయ్యేలా ఎన్నో విషయాలు చెప్పేవాడు. నక్సల్బరీ శ్రీకాకుళం పోరాటాల నేపథ్యంలో ప్రజా సంఘాలు ఏర్పడవలసిన ఆవశ్యకతని గుర్తిస్తూ ఆనాడు కె.ఎస్. చేసిన ప్రతిపాదనలని ఆమోదిస్తూ పౌరహక్కుల సంఘం, విరసం, జననాట్యమండలి ఏర్పడ్డాయి. ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయి విప్లవోత్తేజకరమైన వాతావరణాన్ని సృష్టించాయి. ఆనాడు అవి ఆవిర్భవించవలసిన చారిత్రక ఆవశ్యకత ఉంది. శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొకు, కె.వి.ఆర్., కారా మాస్టారు వంటి ప్రముఖులు విరసానికి మూల స్తంభాలుగా నిలవడం కూడా ఆనాటి ఆవశ్యకతే. అయితే, వాళ్ళు లేకుంటే విరసం ఏర్పడేది కాదా అనే రంధ్రాన్వేషణలోకి నేను పోదలచుకోలేదు.

వేరు వేరు నేపథ్యాల నించి, భావజాలం నించి వచ్చినవారు సైతం మా ఇంటిని తమ సొంత ఇల్లు అనుకునేంత స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేది. ఎన్. గోపి వంటి వాళ్ళు సైతం మా అమ్మని తమ అమ్మగా భావించేవారు. అత్త, మామ, అక్క, బావ, అమ్మ, నాన్న, చెల్లి, అన్న వంటి పిలుపులు సర్వసాధారణంగా ఉండేవి.

నేను మెడిసిన్ తప్ప చదవనని భీష్మించుకున్నాక సంవత్సరం ఖాళీగా ఉండటంతో చలసాని నేను చదివే కొద్దీ పుస్తకాలు అందిస్తూ ఉండేవాడు. నా జిజ్ఞాసని ఆరనివ్వకుండా నిలిపి ఉంచేవాడు. నేను మెడిసిన్ ఎక్కడ చదవాలనే మీమాంసలో ఉండగా ఎవరో లుమంబా యూనివర్సిటీని ప్రతిపాదించారు. చలసానికి తెలిసిన వాళ్ళ ద్వారా ప్రయత్నించవచ్చనుకున్నారు. కానీ అప్పటికే పతనమైపోయిన రష్యాలో చదువుతావా? అంటూ వాసిరెడ్డి వెంకటప్పయ్య మా ఇంటి ముందు ధర్నా చేస్తానని బెదిరించాడు. ఈలోపు నాకు ఎంట్రెన్సులో సీటు రానే వచ్చింది.

నక్సల్బరీ శ్రీకాకుళం పోరాటల నేపథ్యంలో ఇంటికి వచ్చేవాళ్ల కేటగిరీ మారుతూ వచ్చింది. పాత స్నేహాలు అలాగే కొనసాగినా, ఎమర్జెన్సీకి చాలా ముందు నించే మా అందరి దృష్టి మారుతూ వచ్చింది. మరింత సూటిదనం అలవడింది. ఎమర్జెన్సీలో ఇంటి మీద పోలీసు దాడి జరిగింది. చలసాని, నాన్న, అత్తలూరి నరసింహారావు జైలుపాలయ్యారు. ఇంట్లో ఆడవాళ్ళం మిగిలాం. అంతవరకు ఇంటికి రాకపోకలు సాగించిన చాలా మంది సహజంగానే వెనక్కి తగ్గారు. కాళోజీ వంటివారు కొందరు మాకు చేదోడుగా నిలిచారు. అది ఒక గడ్డుకాలం. ఆనీఫ్రాంక్ డైరీ లాంటి భీభత్సాన్ని అనుభవించిన కాలం. తర్వాత ఎన్నోసార్లు చలసాని అరెస్టయ్యాడు. కానీ నాకు బాగా గుర్తున్నది. విశాఖలో జైలు శిక్ష అనుభవిస్తున్న శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి కె.జి.హెచ్ నించి పరారైన సందర్భం. మా సిరిపురం ఇంటికి కొంచెం దూరంలో పెట్రోల్ పంపు ఉండేది. మేము చూస్తుండగానే చలసానిని అక్కడ అరెస్టు చేశారు. వెంటనే మేము రావిశాస్త్రికి కబురు చేశాం. ఈలోపు మా ఇంటి మీద పోలీసు దాడి జరిగింది. ప్రతి కాగితాన్ని, ప్రతి పుస్తకాన్ని జల్లెడ పట్టి, మూడు నాలుగు గంటల సోదా తర్వాత చలసాని భార్యకి రాసిన ఉత్తరాల కట్టని వాళ్ళు పట్టుకుపోయారు. మేము పడీ పడీ నవ్వుకున్నాం. ఆ బ్రహ్మరాత అర్థం కాక, అవి ప్రేమలేఖలో, రహస్య లేఖలో తెలుసుకోలేక వాళ్ళు పడబోయే తిప్పలు తలుచుకుంటే మాకు నవ్వు ఆగలేదు. అప్పట్లో ఎక్కడ ఏ ఘటన జరిగినా మా ఇంటి మీద ప్రభావం ఉండేది. మా ఫోన్ టాప్ అయ్యేది. ఉత్తరాలు సెన్సారయేవి. మా రాకపోకల మీద నిఘా ఉండేది.

ఎమర్జెన్సీ తర్వాత ప్రజా సంఘాలన్నీ రెక్కలు విదిలించుకుని విజృంభించాయి. విశాఖ జన నాట్యమండలి కూడా కొత్త పుంతలు తొక్కింది. మొదట్లో శ్రీశ్రీ, చెరబండరాజు కవితల్ని, సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్, వంగపండు ప్రసాదరావు పాటల్ని పాడేవాళ్ళం. తర్వాత 'భూమి భాగోతం' నృత్యనాటిక రూపుదిద్దుకున్నాక అది చుట్టుపక్కల ప్రాంతాల్ని ఊపేసింది. అప్పుడు జె.ఎన్.ఎం. ప్రదర్శన ఒక పూర్తి స్థాయి ప్రదర్శనగా రూపాంతరం చెందింది. అప్పటికి వంగపండు కొన్ని ప్రాంతాల వారికే తెలుసు. కానీ ఈ బ్యాలే‌తో ఆయనకి ఎంతో మంచి పేరు

వచ్చింది. ప్రదర్శన కోసం రిహార్సల్స్ వేస్తుండగా అప్పటి రాజకీయ పరిణామాలకి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ తుది రూపు వచ్చేసరికి మా అందరికీ దానితో తాదాత్మ్యకత పెరిగిపోయింది. ప్రధాన గాత్రం వంగపండు, రమణ, చలసాని, పద్మిని, నేను. నటులు నవత, రైల్వే అప్పారావు, శంకర్, నాగేశ్వర్రావు, రాచకొండ నారాయణమూర్తి, పరదేశినాయుడు, దేవరత్నం, సుబ్బారావులు. మిగిలిన వాళ్ళు వస్తూ పోతూ మారుతుండేవారు. డోలక్ వాయిద్యగాళ్ళకి వంగపండు చిడతలు ఊపునిచ్చేవి. అప్పటికి నాటకానుభవం ఉన్న ఈ టీమ్‌కి డాన్సు కొత్త. ఒక్కో పాటకి వంగపండు ఒక్కో అడుగు నేర్పితే, ఎవరికి వారు వారికి తోచిన అడుగులు వేసేవారు. అలా ఒక్కొక్క పాత్రకి ఒక సహజసిద్ధమైన టిపికల్ వ్యక్తీకరణ, క్యారెక్టరైజేషన్ ఏర్పడ్డాయి. అలా ఆ మొదటి ట్రూపు టాపులేపేసింది. చుట్టుపక్కల జిల్లాల్లో గొలుసు కార్యక్రమాలు ఇస్తూ ప్రభంజనంలా తిరిగాం. చలసాని కూడా మాతో పాటు మైళ్ళకొద్దీ నడుస్తూ, ఇసక లారీలు, ఎడ్లబళ్ళు ఎక్కుతూ ప్రయాణాలు చేశాడు. చలసాని, నేను, రమణ ఉంటేనే పిన్ని నవతని పంపేది. రానురానంటూనే చలసాని అన్ని ప్రోగ్రాములకి వచ్చేవాడు. మిగిలిన విషయాలేవీ పట్టించుకోకుండా ఒక మామూలు కార్యకర్తలా పాటలు పాడుతూ మాతో తిరిగేవాడు. దురదృష్టవశాత్తు ఆ టీం ప్రదర్శన ఒక్కటి కూడా రికార్డయిలేదు. ఆ తర్వాత వేరేవాళ్ళు ఆ ప్రదర్శన ఇచ్చినా, మొదటి దళాన్ని ఎవరూ మరిపించలేకపోయారు. వాళ్ళలో ఉన్న నిబద్ధత, సమయస్ఫూర్తి, కళల పట్ల ఆసక్తి తర్వాత వాళ్ళని ఉద్యమకారులుగా మార్చింది. బస్సుల జాతీయకరణ ఉద్యమంలో వారంతా క్రియాశీలపాత్ర నిర్వహించారు. విశాఖలో బస్సులు జాతీయం కావడానికి వాళ్ళు కారకులయ్యారు.

'పట్నవాసం', 'జీతాల తమాషా', 'డప్పు డాన్సు', 'కొండలు పగలేసినం' వంటి నృత్యాలు, 'భూమి భాగోతం' నృత్య రూపకం, మధ్యలో పాటలు - అన్నీ కలిసి మూడేసి గంటల ప్రదర్శన ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేసేది. మేము ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్తుంటే జనం మా వెంటపడి వచ్చి, రెండో గ్రామంలో కూడా ప్రదర్శన చూసి వెనక్కి వెళ్ళేవారు. దారి పొడుగునా 'లాంగ్‌మార్చ్' 'విప్లవాల యుగం మనది' వంటి పాటలు మార్చింగ్ సాంగ్స్‌లా పాడుతూ వెళ్ళేవాళ్ళం. చలసాని, 'ఈ విప్లవాగ్నులు' పాట లేకుండా ప్రదర్శన ముగిసేది కాదు. ఇంట్లో స్టాలిన్ పాట తప్పనిసరి. 'యార్ పటకర్‌డమ్, సూర్‌చర్!' అంటూ తుపాకి పట్టుకుని, గబుక్కున ఒక మోకాలు మీద కూచుని ఫైరింగ్ పొజిషన్ నాటక ఫక్కీలో తీసుకునే చలసాని మాకు కూడా దాన్ని నేర్పాడు. అందరూ కబుర్లు చెప్పుకుంటుంటే మేము హఠాత్తుగా ఆ శబ్దం చేస్తూ పొజిషన్ తీసుకుని నవ్వించేవాళ్ళం.

ఎమర్జెన్సీ తర్వాత రాడికల్ విద్యార్థి సంఘం కూడా విస్తరించింది. కొత్తగా ఉత్సాహంగా వస్తున్న పిల్లలకి విరివిగా రాజకీయ తరగతులు నిర్వహించడం, పత్రికలు పుస్తకాలు చదివించడం, సాంస్కృతిక బృందాలు ఏర్పరచడం, ప్రతిఘటనా పోరాటాలు చేయడం పరిపాటయింది. ఇతర సంఘాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ, ఉమ్మడి సభలు ఆనాటి ఆవశ్యకతగా మారాయి. శత్రువు ఎవరో స్పష్టంకావడంతో అలాంటి ఐక్య కార్యాచరణ అనివార్యమయింది. అలా చలసాని ప్రతి సభకి వక్త. ప్రతి క్లాసుకి టీచర్. ప్రతి ప్రదర్శనలో కళాకారుడు. ప్రతి పోరాటంలో కార్యకర్త.

తుపానులో ఎగిసిపడే అలల మీద తెలియాడుతూ మైమరచి పోయినా, శ్రీశ్రీ కవితలు విరామం లేకుండా వల్లె వేస్తూ పరమానందం పొందినా, స్టాలిన్‌ని మరో కోణం నించి ఆవిష్కరించబోయినా, సాహిత్యంపై సందేహాలని నిముషాల్లో తీర్చినా, శ్రుతిలయ తప్పుతూ కూడా గుర్తుండిపోయే పాటలు పాడినా, తన డొక్కు బండి మీద ఐదుగురు చొప్పున ఎక్కించుకుని మా చిన్నప్పుడు సర్కస్ ఫీట్లు చేయించినా, చెప్పిందే చెప్పి చెప్పిందే చెప్పి చాదస్తం అనిపించుకున్నా, ఇహంపరం పట్టకుండా తన సొంత ప్రపంచంలో విహరిస్తూ 'అయోమయం', 'బాటసారి' అనిపించుకున్నా, చొప్పకట్టలో దూరే ఆవులా పుస్తకాల్లో కూరుకుపోయే పుస్తకాల పురుగే అయినా, 'బంగరు నానీ', 'రంగరు పానీ', 'కుంజుబుర్ర' అంటూ గమ్మత్తు గమ్మతు ముద్దుపేర్లు పెట్టినా, పద్మినికి ఆపరేషన్ అని తెలిసి కంటతడి పెట్టినా - అవన్నీ ఒకే మనిషిలో వివిధ రంగులు, వివిధ వ్యక్తిత్వాలు. అవన్నీ కలిస్తే చలసాని అనే స్నేహశీలి.

మా దారులు వేరయాక అనేక సందర్భాల్లో నేను తనతో ఘర్షణపడినా, నోరారా 'అమ్మా నానీ' అంటూ పిలవడం మాత్రం మానలేదు. ఇంట్లో బాబాయిగా ఉన్నా బయట చలసానిగా మాత్రమే సంబోధించే నా కోపాన్ని అర్థం చేసుకుని దూర దూరంగానే ఉండేవాడు. అలాంటిది, పోయిన సారి వచ్చినపుడు రెండు పూటలు ఉండి కడుపు నిండా ఆవకాయ అన్నం తింటుంటే ముచ్చట అనిపించింది. అప్పట్లోనే చలికాలం ఒక మీటింగుకు వెళ్ళేసరికి పది మంది పోలీసులు, పక్కన చలసాని ఒక్కడు. నేను వెళ్ళిన అరగంట తర్వాత మిగిలిన వాళ్ళు వచ్చారు. ఆ వయసులో సైతం మీటింగు కోసం క్రమశిక్షణ పాటించడం అబ్బురమనిపించింది. విరసం జెండా నీడలోనే తుదిశ్వాస విడవాలని ఆశించిన చలసానికి మంచి సాహిత్యంతోనే నివాళి ఇవ్వగలం. విశాఖ సముద్రం ఉన్నంత వరకు, ఆ అలలు ఎగసిపడుతున్నంత వరకు శ్రీశ్రీ కవిత్వం ఉర్రూతలూగిస్తున్నంత వరకు, రావిశాస్త్రి సాహిత్యం మనల్ని మేల్కొల్పుతున్నంత వరకు చలసాని జ్ఞాపకం సజీవంగానే ఉంటుంది.

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి !

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

చలసాని ప్రసాద్ దారి

శివలక్ష్మి

బొడ్డుతాడు తెగిన దుఃఖం!

- రివేరా

సగం కాలిన వెన్నెల్లో
తోడు లేని ప్రయాణం
ఎక్కడా తెగడం లేదు
తీగ తెగిన జ్ఞాపకాలు
కంకరలా జారడం తప్ప
ఎంతకీ పగలడం లేదు

నడీడు బిడ్డ వస్తే
ఇంట్లోకి పిలిచేవారు లేరు
కాసింత ఉప్పునీట
స్నానం చేయించేవారే లేరు
ఆ ఇల్లులాగే, ఈ సముద్రమూ
ముఖం తిప్పేసుకున్నట్టుంది
సైగల్ పాటల్నే కాదు
చెయ్యార చేరదీసుకొని
కాళ్లు నాకి, కళ్లు తుడిచే
మంత్రశక్తినీ పోగొట్టుకున్నట్టుంది

శూన్య మూకుడును బోర్లించినట్టు
పుస్తకాల దొంతరల్లోంచి ప్రస్థానం
కదిలే పెదాలు, పాదాలు... అంతే
ఏమీ వినిపించవు, వివరించవు
మహా క్రమశిక్షణ గల కాలం
ఆయనలాగే బహిరంగ ప్రేమలను
మనకోసం అట్టిపెట్టేసి
రహస్యాలను మటుకు తనలోకి
తీసేసుకొంది
వెయ్యి హుద్‌హుద్‌లకూ
చెదరని మొక్క, చీల్చుకొచ్చే గాలి రెక్కే
ఆ రహస్య రొదని పగలేసి
బొట్టు నీటిని తోడి బొడ్డు తాడును
తెంచగలవు

జులై 23 న నేను ఫోన్ చేసి ఆరోగ్యం ఎలా ఉందంకుల్ ? అని చలసాని ప్రసాదంకుల్ని అడిగాను. 'భలేదానివే! ఏం మాట్లాడుతున్నావ్? నా ఆరోగ్యానికేమయింది? వరూధిని గారెలా ఉన్నారు? ఆవిణ్ణి బాగా చూసుకోండి. నేనొస్తున్నా, మనిద్దరం కలిసి వరూధిని గారినీ, కామేశ్వరినీ చూసొద్దాం' అని చెప్పారు. జులై 25 న ఈ పిడుగులాంటి వార్త! నేనసలు ఈ కబురు జీర్ణించుకోలేక పోతున్నా!!

నేను సెంట్రల్ యూనివర్సిటీలో 1989 లో ఎం.ఫిల్ రిసర్చ్ కోసం 'శ్రీశ్రీ రేడియో నాటికలు-ప్రయోగవాద ధోరణులు' అనే అంశాన్ని ఎంచుకున్నాను. ఆ రోజుల్లో ఆ నాటికల ప్రయోక్త శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారి దగ్గరకు వెళ్ళాను. వారు తాను చేయగలిగిన సహాయమంతా చేసి 'విశాఖలో కృష్ణాబాయి, చలసాని ప్రసాద్ గారని ఉన్నారు. వారికి శ్రీశ్రీ అంటే ప్రాణం. మరీ ముఖ్యంగా చలసాని ప్రసాద్ గారి దగ్గర శ్రీశ్రీ అముద్రిత నాటికలు కూడా ఉన్నాయి, వెళ్ళమని చెప్పారు. ఒకరోజు ఫోన్ చేసి మాట్లాడాను. ఆ తర్వాత ఫోన్ లోనే చాలాసార్లు ఒకే ఇంట్లో ఉన్న ప్రసాదంకుల్, కృష్ణాంటీతో మాట్లాడుతుండేదాన్ని. అలా మా పరిచయం మొదలైంది. నాటికల కోసం వైజాగ్ వస్తానని చెప్పి వెళ్ళాను. ప్రసాదంకుల్ స్టేషన్ కొచ్చి ఇంటికి తీసికెళ్ళారు. ఇంట్లో వాళ్ళందరూ ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా చూసుకున్నారు.

ఉదయం లేచినప్పటి నుంచి ఒకటే ఆశ్చర్యం నాకు!అన్నీ వివరంగా రాయలేను గానీ తెలుగువారి అందరిళ్ళల్లో లాగా ఆడవాళ్ళు కృష్ణాంటీ, విజయాంటీ వంటగదుల్లో కూరుకుపోకుండా ఎంచక్కా పేపర్లు చదువుకుంటున్నారు. ముఖ్యమైన వార్తల గురించి చర్చిస్తున్నారు. పురుషులిద్దరూ వేణూ అంకుల్, ప్రసాదంకుల్ కాఫీ-టిఫిన్ల పన్లు చేస్తూ చర్చల్లో పాల్గొంటున్నారు. అప్పుడప్పుడూ నలుగురూ కలిసి చేసుకుంటున్నారు. అంతే గానీ మా కొంపల్లోలాగా పురుషులు కాలు మీద కాలు వేసుక్కూచుంటే, తెల్లార్లు లేస్తే స్త్రీలు చెమటలు కక్కుకుంటూ అణకువగా అందివ్వడమనేది లేనే లేదు!నాకదొక అద్భుత దృశ్యం! అప్పటి నుంచి నాకు ఆ కుటుంబంలోని పిల్లలూ, పెద్దలూ అందరి గురించీ సంభ్రమాశ్చర్యాలతో తెలుసుకోవడం, రోజూ మాట్లాడడంతో ఆ కుటుంబం లోని చిన్న పిల్లలు అజంతా, తుషార పాప తో సహా అందరూ ఆత్మీయ బంధువులై పోయారు. అలాంటి ఇంకొక కుటుంబం మళ్ళీ నాకు కనిపించకపోవడం వల్ల ఇప్పటికీ నేను ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు!

అప్పటి టెలికాం, ఇప్పటి బిఎస్ఎన్ఎల్‌లో పనిచెయ్యడం వల్ల అంకుల్‌తో రోజూ చాలా క్లుప్తంగా మాట్లాడేదాన్ని. చేరా మాష్టారు, ధర్మారావు గారు, వకుళాభరణం రామకృష్ణ, సంపత్కుమారాచార్య, వెలగా వెంకటప్పయ్య, బెంగుళూరు బాబయ్య గారు, చెన్నై మురారి గారు, నాగభూషణం గారు, గుర్రం శ్రీనివాస్, ఇండియా గేట్ కృష్ణుడు, పర్స్పెక్టివ్ ఆర్కే, వివి - ఇలా ఎందరెందరికో ఎన్నో మెసేజ్‌లు చెప్పమనేవారు. అందులో ఒక్కటి కూడా తన వ్యక్తిగత అవసరాల కోసం కాదు. శ్రీశ్రీ, కొడవటిగంటి, రావిశాస్త్రి ప్రచురణల కోసమో, విరసం పనులకోసమో మాత్రమే చెప్పేవారు.

రావిశాస్త్రి గారికి బాగా సీరియస్‌గా ఉన్నప్పుడు నేను నా ఉద్యోగ సౌకర్యాన్ని విశేషంగా వాడుకున్నాను. ఎంత వెదికినా దొరకని ఒక టిబెటియన్ డాక్టర్ నంబర్ కోసం ఆరోజుల్లో చాలా కష్టాలు పడ్డాను. బాంబే, ఢిల్లీలోని ఎంక్వైరీలన్నీ శోధించి చివరికి హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో ఉన్న 'డాక్టర్ డోల్మా' నంబర్ కోసం అడిగితే ఆమె చనిపోయారని తెలిసింది. అప్పుడు ఆమె కుమార్తె 'డాక్టర్ డోల్కర్' నంబర్ సాధించాను. ఆమె నాడి, బి.పి మాత్రమే

చూసి మందిచ్చేవారు. కేస్ హిస్టరీ మొత్తం డాక్టర్ కామేశ్వరి వివరించారు. రావిశాస్త్రి గారి కోడలు నాకు పల్స్, బి.పి. వివరాలు చెప్పేవారు. నేను డాక్టర్ డోల్కర్‌కి చెప్పేదాన్ని. వాళ్ళు మందు పంపిస్తే అది వాడుతున్న క్రమంలో రావిశాస్త్రి గారు కొంచెం తెరిపిన పడ్డారు. అలా ఆయన మంచం మీదనుండే ప్రసాదంకుల్‌కి డిక్టేట్ చేసిన 'ఇల్లు' నవల నెల రోజుల్లో సాహిత్య లోకం ముందుకొచ్చింది.

ఇదంతా చేస్తున్నప్పుడు ప్రసాదంకుల్ తో మాట్లాడు తున్నప్పుడు కూడా టెలికాం ఆఫీస్ వాళ్ళు లెక్కలేనన్ని సార్లు నాకు వార్నింగులిచ్చారు. నిజానికి ఉద్యోగులందరికీ కొన్ని ఉచిత కాల్స్ సౌకర్యం ఉంటుంది. కొందరు 15, 20 నిమిషాలు మాట్లాడినా ఫరవాలేదన్నట్లుండేవారు అధికారులు. నేను యూనియన్‌లో పని చెయ్యడం వల్ల ఐదారు సెకండ్లలో ముగించే చిట్టి పొట్టి మెసేజ్‌లకు కూడా మెమో లిచ్చి, చీటికీ మాటికీ ట్రాన్స్ ఫర్ చేసీ వేధించేవారు. ఎన్నోసార్లు అబ్జర్వేషన్స్‌లో పట్టు బడ్డాను. చివరికి అబ్జర్వేషన్ రూంకి పిల్చి 'నా గొంతు నాకే వినిపించారు. 'అది వినండి. అందులో ఏం తప్పుంది. ఒక్క వాక్యం, రెండు వాక్యాలే కదా? ఉద్యోగులకి ఆ మాత్రం సౌకర్యం లేకపోతే ఎలా? ఎవరికైనా సోషల్ రిలేషన్స్ ఉంటాయి కదా?' అని వాదించాను. నిస్వార్థంగా సమాజం కోసం పని చేసే అంకుల్‌ని చూశాకే నాకూ ఏ రకంగా నైనా, ఏ పన్లో నైనా పాలు పంచుకోవాలనిపించేది! ఆ రోజుల్లోని దూర దూరాల్లో ఉండే ఆయన స్నేహితులందరికీ నేను తెలియదు గానీ నా గొంతు తెలుసు! ఈ మధ్య కాస్త తగ్గింది గానీ దాదాపు 20, 25 సం. రాల పాటు కృష్ణాంటీ, ప్రసాదంకుల్ తో ప్రతిరోజూ మాట్లాడేదాన్ని.

ఫోన్లో మాట్లాడడం అంకుల్ కొక అబ్సెషన్! అంతగా ఫోన్లు అలవాటు కాని కాలంలో నేనెక్కువగా తనతో కాంటాక్ట్‌లో ఉండడం వల్లనో ఏమో బాగా కలిసిపోయాం(అప్పట్లో సెల్ ఫోన్లు లేవు). అందుకే 'మనలో ఒకరికి మరొకర్ని ఎవరు పరిచయం చేశారో గానీ పరిచయమైన మరుక్షణం నుంచి భలే అతుక్కుపోయాం రా' అని అంటారు అంకుల్. వాళ్ళ వాళ్ళ ఫోన్ నంబర్లతో సహా ఆయన స్నేహితులందరూ ఇప్పటికీ నాకు గుర్తే!

ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా మా ఇంట్లో ఉండేవారు. ఒక్కోసారి విరసం పనుల మీద మీటింగులకి ముందు వస్తే ఎక్కువ రోజులు ఉండేవారు. మా ఇల్లు ఎంత అలవాటంటే ఏదైనా మర్చిపోతే 'శివగాడా, నా రూంలో నా మంచం మీద' అంటూ ఫలానా పుస్తకం ఉంది. జాగ్రత్త చెయ్యమనో; ఏదో చెప్పేవారు. ఎవరింటికైనా భోజనం సమయానికెళ్తే వాళ్ళు తినమన్నా సరే, 'లేదు లేదు, మా శివగాడు చేసి ఉంచుతాడు' అని ఎక్కడా తినేవారు కాదు.

'నేనొస్తున్నా ఎవరికీ చెప్పొద్దు నాన్నా' అని నాకు చెప్పి, విశాఖ నుంచే నాకు చెప్పినట్లే అందరికీ 'ఎవరికీ చెప్పొద్దు' అని చెప్పి మా ఇంటి నంబరిచ్చేవారు. ఇక చూస్కోండి, ఫోన్ల హోరు మొదలయ్యేది. మేము బయటికి ఫోన్ చెయ్యడానికి లేదు, మాకు ఫోన్ రావడానికి వీల్లేదు. పిల్లలు వేరే ఊళ్ళల్లో ఉన్నప్పుడు ఫోన్ దొరకట్లేదని గోల పెట్టేవారు. ఇలాగైతే ఎలా అంకుల్? అనడిగితే 'మరి నాకు బోలెడు పన్లున్నాయి. ఇప్పుడు మొదలు పెట్టి రోజుకి 60 గంటలు పని చేసినా, ఇంకా నాకు 60 ఏళ్లు పట్టే పన్లున్నాయి, ఏం చెయ్యమంటావు? ఫోన్ లేకుండా నాకు కుదరదు' అనేవారు. ప్రజల కోసం పని చెయ్యడానికి రోజుకి 24 కాదు, 60 గంటలు కావాలనుకునేవారు. ఆ స్ఫూర్తి, సత్తా చూస్తే చాలా దిగ్భ్రాంతి కలిగేది!

ఒకసారి వివి -హేమక్క, ఇంకా మేమందరం ఉండగా మాతోపాటు కూర్చుని మా మాటలు వింటూనే అంకుల్ ఫోన్ నంబర్లు నొక్కుతున్నారు. 'ప్రసాద్ కళ్ళు మూసుకుని ఫలానా నంబర్ అనుకోకుండా ఏ నంబర్ నొక్కినా అందులో ఆయనకొక స్నేహితుడుంటాడు' అని అన్నారు వరవరరావు గారు ! అంత విస్తృతమైన మానవ సంబంధాలాయనవి!

భావజాలాలకతీతంగా ఎక్కడికొస్తే అక్కడి మనుషుల్తో మాట్లాడకుండా, కలవకుండా ఆయనసలు ఉండలేరు. ఆయన ప్రవర్తనలో ఎంత ప్రేమ, ఎంతమందితో విస్తృత పరిచయాలు? ఇంట్లో జబ్బులు చేసిన వాళ్ళ గురించి ఎవరైనా అంకుల్‌కి చెప్తే మంచి డాక్టర్లను చూసి పెట్టేవారు. పిల్లలకు పెళ్ళి సంబంధాలు కావాలంటే ఆయన్ని సంప్రదించేవాళ్ళు. ఆర్థిక ఇబ్బందులుంటే ఆయనకు చెప్పుకునేవారు. ఒకటి కాదు, రెండు కాదు, ఉద్యమాలతో ఏ సంబంధమూ లేనివాళ్ళు కూడా వారి సమస్తమైన ఈతిబాధలు ఆయనకు చెప్పుకునేవారు. 'నీకెందుకు? నువ్వు నిశ్చింతగా ఉండు. నేను చేస్తాగా'అని ప్రతి ఒక్కరికీ భరోసా ఇవ్వడమే కాదు, ఆ పన్లు చేసిపెట్టేవారు. మా ఇంట్లో ఉన్నప్పుడు చాలామంది హైదరాబాద్ వాళ్ళు కలుస్తుండేవాళ్ళు. రావు బాల సరస్వతి గారికి ఎంతో ప్రయత్నించి సిటీలోని మంచి ఏరియాలో ఒక ఇంటి స్థలం ఇప్పించారు. 'మరీ, తలకు మించిన పనులెందుకు నెత్తినెత్తు కుంటారు?'అని నేనంటే 'మన జీన్స్ అంతేరా, డిసెంబర్ 15 లోపల పుట్టినవాళ్ళు జనాని కుపయోగపడతారు. నేను డిసెంబర్ 8న పుట్టాను, నువ్వు డిసెంబర్ 10 న పుట్టావు. నన్నంటావు గానీ నువ్వూ అంతే' అనేవారు!

కృష్ణాంటీ ఏ సందర్భంలో 'ఆర్థిక అరాచకవాది' అని అన్నారో గాని స్వార్థం కోసం వాడుకుంటే అది అరాచకత్వమవుతుంది. పరాయి సొమ్ము ఒక్క రూపాయి కూడా ఆయన కోసం ఖర్చు చెయ్యరు. ఆయన అతి మంచితనాన్ని ఎదుటివాళ్ళు ఎడ్వాంటేజ్ తీసుకుంటే ఆయన్ని అరాచకవాది అంటే నాకెందుకో బాధగా ఉంది. మాకు తిండికి లేక మలమల మాడిపోయే కాలంలో మానాన్నని ఎవరైనా వాళ్ళ దీనమైన పరిస్థితి చెప్పుకుని అప్పడిగితే, మా అమ్మ ఎక్కడ గమనిస్తుందోనని పక్కింటికి దొడ్డిదోవన వెళ్ళి అప్పడిగి తెచ్చి రహస్యంగా ఇచ్చేవాడు మానాన్న. తర్వాత చిక్కుల్లో పడేవారు. అంకుల్ కి కూడా ఈ లక్షణం ఉంది. అందుకని నాకు అంకుల్ ని చూస్తే మానాన్నే గుర్తుకొస్తారు! మా ఇంట్లో చూడడం వల్ల ఆ పరిస్థితి నాకర్థమైంది. అంకులే అన్నట్లు కొన్ని జన్యువులంతే!

'చలసాని సతీమణి విజయక్కయ్యకి చివరి దశలో డయాలసిస్ చేయవలసి వచ్చేది అప్పుడు వారు అలా చేసినట్లు లేరు' అని ఆగస్ట్ 8 ఆంధ్రజ్యోతి వ్యాసంలో మురారి గారు రాశారు. ప్రసాదంకుల్ విజయాంటీ ఆరోగ్యాన్ని చివరి దశలో పట్టించుకోలేదు అనే అర్థం వచ్చేలా రాశారు. ఇది నిజం కాదు. ఎందుకంటే ఆ చివరి రోజుల్లో విజయాంటీ మా ఇంటికే వచ్చి, మా ఇంటి వెనకే ఉన్న కామినేని హాస్పిటల్ లో టెస్ట్ లన్నీ చేయించుకున్నారు. తనకి తన అనారోగ్య పరిస్థితి తెలిసిపోయింది ! తాను ప్రమాద పరిస్థితుల్లో ఉన్నానని తెలిసినప్పటికీ విజయాంటీ డయాలసిస్‌కి ససేమిరా అన్నారు. ఆ డయాలసిస్ వల్ల ఏ మాత్రం సౌకర్యంగా ఉండదనీ, క్వాలిటీ లైఫ్ ఉండదనీ వద్దనుకున్నారు. ఈ మధ్యే చనిపోయిన వాళ్ళ అన్నయ్య నాగభూషణం గారు కూడా అంతే!ఆయనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే మెడికల్ సౌకర్యాన్ని కూడా వద్దనుకున్నారు!

ఒకసారి విరసం సభలు జరుగుతున్నాయి. అంకుల్ బాగా జలుబుతో భారంగా ముస ముస లాడుతూ పొద్దు పోయి వచ్చారు. మా ఆయన చాలా ఘాటు ఘాటుగా, బోన్ సూప్, బిరియానీ, చేపల కూరా చేసి వడ్డించారు. నేనూ, అంకుల్ టేబిల్ మీద కూర్చుని తింటున్నాం. మా ఆయన వడ్డించడం అంకుల్ తింటూ 'ఊ..., రామ్మోహన్, చాలా బాగా చేశావ్, ఎక్కడ నేర్చుకున్నావ్?అని వడ్డించిన ప్రతిసారీ ఆయనతో చెప్తూ, నా భుజం మీద చెయ్యి వేసి 'ఏరా బంగారం, శివగాడా, నా బంగారం, నా కొండా' అని నన్ను ముద్దు చేస్తున్నారు. మా ఆయనేమో నేను వండి వడ్డిస్తుంటే, గారాం మాత్రం నిన్ను చేస్తున్నారని ఉడుక్కున్నారు. ఆడపిల్లలంటే ఎంతిష్టమో! అంకుల్ కి ఒక మంచి స్నేహితురాలైన కామేశ్వరి ఆంటీ ఐతే 'కష్టంలో ఉన్న స్త్రీలను చలం లాగా ప్రసాద్ తన 10 చేతుల్తో ఆదుకుంటాడు'అని అంటారు. ఈ కామేశ్వరి గారైతే చలం గారి దగ్గర దాదాపు 35 సం. రాలు గడిపిన సౌరిస్ శిష్యురాలు. చలం గారిని 'చలం నాన్న' అంటారు. ఆంటీకి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కానీ వాళ్ళ స్నేహానికి అవేవీ అడ్డు రాలేదు. ఒకసారి ఆంటీ సౌరిస్ దగ్గరికి భీంలీ వెళ్తూ నన్నుకూడా తీసికెళ్ళారు. మధ్యలో వైజాగ్ స్టేషన్లో దిగాం. అంకుల్ స్టేషన్ కొచ్చారు. ఇక పెద్ద హడావుడి చేసి విజయాంటీని కష్టపెట్టి బోలెడన్ని వంటలు చేయించారు. మమ్మల్ని భీంలీ వెళ్ళే బస్సెక్కించడానికి బస్ స్టాప్‌కి వచ్చారు. 'కామేశ్వరి ఆంటీ శివ నాతో పాటు భీంలీలో రెండు రోజులుంటుందని అంకుల్ తో చెప్పారు. అంతే, ఆంటిని వాటేసుకుని ఆమె భుజం మీద నుంచి నావైపు చూస్తూ, 'ఆ భక్తి, ఆ సుత్తి, అదంతా మనకి పడదు, నువ్వు భరించలేవు. సాయంత్రానికొచ్చెయ్' అని నాకు చిన్నగా సైగ చేసి చెప్పారు. అభిప్రాయ బేధాలున్నప్పటికీ అంత స్వచ్ఛమైన స్నేహానికి చిహ్నంగా, ఆంటీని నొప్పించకుండా చెప్పిన ఆ విధానం, ఆ దృశ్యం అపురూపంగా నా మనసులో ఎంతో హృద్యంగా నిల్చిపోయింది! కామేశ్వరి ఆంటీ చాలా మంచి మనిషి వేణూ అంకుల్- కృష్ణాంటీ, ప్రసాదంకుల్ - విజయాంటీ, , రావిశాస్త్రి, ఆఖరికి రంగనాయకమ్మ గారితో సహా ఇంకా వాళ్ళ వయసు వాళ్ళెందరికో ఆమె మంచి స్నేహితురాలు. 'మా స్నేహితులందరూ చాలా గొప్పవాళ్ళమ్మా! అలాంటివాళ్ళెవరికీ దొరకరు' అంటూ ఇప్పటికీ వాళ్ళ స్నేహాల గురించి కథలు కథలుగా ఊరిస్తూ చెప్తారు. ఎస్. వి రంగా రావు, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొమ్మూరి పద్మవతీ దేవి, కృష్ణ శాస్త్రి - ఇలాంటి ఎందరో ప్రముఖులు వాళ్ళ స్నేహ బృందంలో ఉండేవారట! ఇప్పుడంతా గ్రూపులు గ్రూపులుగా విడిపోయి కనిపిస్తున్నారు. మనకలాంటి స్నేహాలూ, స్నేహితులూ, వైవిధ్యాలూ లేక ఎడారిలో బతుకుతున్నామనిపిస్తుంది!

సంపత్కుమార, బాబయ్య, చే రా మాస్టారు, హరి పురుషోత్తమ రావులాంటి తన స్నేహితులనేకమందితో అంకుల్ సాహిత్యం, ఇంకా రకరకాల అంశాల మీద మా ఇంట్లో చర్చించేవారు. ఆయన సమక్షంలో నేను చూచిన అనేకమంది గొప్ప రచయితల, మనుషుల జ్ఞాపకాలు నేనెప్పటికీ మర్చిపోలేను!! వివి - హేమక్కల నుంచి మొదలెడితే కాకరాల- కాంతి గార్లు, వరూధిని గారు, నాగభూషణం గారి కుటుంబం, ఆర్ ఎస్ రావు-ముదునూరి భారతి గార్లు, వసంత-సాయిబాబా, చే రా గారు, హరి పురుషోత్తమ రావు అంకుల్, గుర్రం శ్రీనివాస్, కృష్ణుడు, పద్మావతి, నవత, అనూరాధ లాంటి ఎందరో - విలువలున్న మంచి మనుషులు, గొప్పస్నేహితుల్ని పరిచయం చేశారు. అంకుల్ మా దగ్గరున్నప్పుడు వీరందరితో ఆయన కలయికలు మాకు అద్భుతమైన శక్తినిచ్చిన గొప్ప ఉత్సవాలు! అంకుల్ కలిపిన ఎందరో స్నేహితులు ఇప్పటి మా సంపదలు!

కుల, అధికార గర్వాల పట్ల ఆగ్రహం, హాస్యం, వ్యంగ్యం, మనుషుల మీద వల్లమాలిన ప్రేమ ఇవన్నీ సరే, అంకుల్ ఎక్కడుంటే అక్కడ పాటలూ, శ్రీశ్రీ, కొ కు, రావిశాస్త్రిల సాహిత్యాలే కాదు ప్రపంచ సాహిత్యంలోంచి కూడా నిత్య జీవితాని కన్వయించు కోవలసిన బోలెడన్ని కొటేషన్స్ దొర్లుతుంటాయి. 'ఎత్తినాం విరసం జెండా' పాటను ఎన్నిసార్లు పాడినా తనివి తీరేదికాదు. ఎప్పటికప్పుడు కొత్తగా మెస్మరైజ్ చేస్తూనే ఉండేది! ఎవరైనా గాయకులు దాన్ని నేర్చుకుంటూ ఏమాత్రం తప్పు పాడినా చాలా కోపంగా ఆ పాట కేదో అపాయం జరిగిపోయినట్లే విల విల లాడుతూ పాడిన వాళ్ళమీద చిరాకు పడిపోయేవారు!

ఆయనొస్తున్నారంటే ఒక స్కూటర్ సిద్ధంగా ఉంచేవాడు మా రామ్మోహన్. ఒకసారి మాకవసరమై గుర్రం శ్రీనివాస్ ని స్కూటరడిగితే 'నువ్వేమైనా చలసాని ప్రసాద్ వా స్కూటరివ్వడానికి ?' అని అన్నాడు. ఆబిడ్స్ థియోసాఫికల్ సొసైటీ వైపు కెళ్తే చాలు 'ఒరేయ్ నీకు తెలుసా? మీ ఆంటీకి, నాకూ ఇక్కడే పెళ్ళయింది తెలుసా?' అని ఎన్నిసార్లు అటువైపు వెళ్తే అన్నిసార్లూ నిన్న మొన్న పెళ్ళైనట్లే మురిసిపోతూ చెప్పేవారు.

ఈ రోజుల్లో పరిచయమైన కొత్తల్లో కాస్త బాగానే ఉంటారు. కొన్ని రోజుల తర్వాత 'మీకు మీరే-మాకు మేమే' అన్నట్లూ లేకపోతే 'ఎవరే ఎక్కువా? నేనే ఎక్కువా?' అనుకుంటూ మానవ సంబంధాలను తెల్చి పారేస్తున్నారు. కానీ మొదటినుంచీ చివరి వరకూ అదే తాజాతనంతో అందరికీ 'నావాడు' అనే నమ్మకాన్ని కలిగించారు. చలం రాస్తారెక్కడో 'చిరిగిన బట్టలు, చింపిరి జుట్టు, కానీ కళ్ళల్లో అంతులేని పొగరు, ఏం చూసుకునో అనుకుంటున్నారందరూ నన్ను చూసి. వాళ్ళకేం తెలుసు, నాకు నువ్వున్నావనే ధైర్యంతో ఈ పొగరని' అని. నిజంగా నాకు అంకుల్‌ని తలచుకుంటే అంతే భరోసాగా, పొగరుగా ఉండేది!

ఎందుకు ఇంతగా స్మరించుకోవడమంటే ఇప్పుడున్న ఉన్నత విద్యనభ్యసించి అధికారులైన వాళ్ళకు చరిత్రను నిర్మించిన కార్మిక వర్గ చరిత్ర, పట్టదు. రచయితలకు పాఠకులంటే చిన్న చూపు. ప్రసంగించేవాళ్ళకు ప్రేక్షకుల సమయం విలువ తెలియదు. మొత్తంగా మెజారిటీకి వర్గ ప్రయోజనాల పట్ల, శ్రమజీవుల పట్ల, అసలు మనిషి జీవితం పట్ల గౌరవం లేదు. మళ్ళీ తెల్లారి లేస్తే ఒక పేద దిష్టిబొమ్మ లాంటి శ్రమజీవి అనుభవిస్తున్న నరక యాతనలే వీళ్ళందరికీ దిక్కు! అంచులకు నెట్టబడిన మనుషుల మీద కథలూ, కవిత్వాలూ రాసి అవార్డులు తెచ్చుకుని, ఇక ఆ మనుషుల్ని అంతటితో మర్చిపోతున్నారు! కానీ అంకుల్ మాత్రం వాల్ట్ విట్మన్ లాగా ఎక్కడ ఏ పేద జీవికి అన్యాయం జరిగినా తనకు జరిగినట్టుగానే స్పందిస్తారు. ఎవర్నీ చిన్నచూపు చూడరు! అంచులకు నెట్టబడిన దిక్కు లేని జీవులే ఆయన చలనానికి కేంద్రాలు!

నా పుస్తకానికి బాలాంత్రపు రజనీ కాంత రావు గారూ, ప్రసాదంకుల్ ముందు మాట రాశారు. 1968 లో ఫ్రెంచి విద్యార్థుల

ఉద్యమం గురించి Angelo Quattrochi రాసిన "The beginning of the End" అనే గ్రంధాన్ని శ్రీశ్రీ 'రెక్క విప్పిన రివల్యూషన్' అనే పేరుతో అనువాదం చేశారు. అది ప్రచురించినప్పుడు 'ఒరేయ్, నీకు తెలుసా? ఈ పుస్తకంలో ఇద్దరే ఇద్దరు స్త్రీలకు కృతజ్ఞతలు చెప్పాం. ఒకరు వసంతలక్ష్మి, ఇంకొకరు శివలక్ష్మి, ఇద్దరూ నాకు రెండు కళ్ళు'అని అన్నారు. ఆయన ప్రేమ పొందడం తప్ప వసంత లక్ష్మితో పోల్చగల అర్హతలేవీ నాకు లేవు. ఇక అమెరికా వెళ్తున్నప్పుడు బండెడు పుస్తకాల లిస్టిస్తారు ప్రతిసారీ. నాకిచ్చే ప్రతి పుస్తకం మీదా 'నా శివ గాడికి- నీ అంకుల్' అని అపురూపంగా రాస్తారు. ఇక ఉత్తరాల్లో వర్షించే ప్రేమను చదువుతుంటే కళ్ళు మాటిమాటికీ పూడుకుపోతున్నాయి. చివరిగా తెచ్చిన పుస్తకం 'Bury My Heart in Wounded Knee' నా దగ్గరే ఉండిపోయింది! 'నేనొచ్చి తీసుకుంటా, ఎవరికీ ఇవ్వొద్దు'అని చెప్పి తన మాట నిలబెట్టుకోలేదు!!

"Gorilla, My Love" కథా సంపుటి అమెరికన్ రచయిత్రి టోనీ కేద్ బాంబారా (Toni ked baambaara) 'నా ఉద్దేశ్యంలో మనిషి కుండవలసిన ముఖ్యమైన లక్షణాలు రెండు. . ఒకటి 'అన్యాయం పట్ల లావాలా చిమ్మగలగడం', రెండు 'ఎంతటి కష్టాల్లోనైనా నవ్వగలగడం' అంటుంది. ఈ రెండు లక్షణాలూ అంకుల్ సహజ ప్రవృత్తి లోనే ఉన్నాయి.

అనాదిగా ఈ భూమి మీద సూర్య చంద్రులున్నప్పటినుంచి నేలతల్లిని నమ్ముకుని బతికిన మూలవాసులు మొదటి దశలో సంచార జీవులు. వీరు ప్రకృతికి అతి దగ్గరగా ఉండేవారు. అంకుల్ సమాజపు పనుల మీద ఊళ్ళు తిరుగుతూ ఎక్కడంటే అక్కడ రోజులు, నెలల తరబడి సంచార జీవిలాగే అలవాటు పడిపోయేవారు. ఆదివాసుల కున్న ఇంకో లక్షణం పోరాట మనుకుంటే అది వాళ్ళ కుటుంబ సభ్యులు, అన్నయ్యలు పోరాటాల్లో, త్యాగాల్లో ఒకర్ని మించిన వారొకరు. 'ఏమిటండీ మీవాళ్ళు మనుషుల్నిలా చంపుతున్నారు?' అని వ్యవస్థ వైపున్న వాళ్ళెవరైనా మర్యాదగా అడిగితే ఆదివాసులు చేతల్లో చూపించేదాన్ని అంకుల్ మాటల్లో 'ఒక ఘటనకు ప్రతిఘటనే'అని జవాబిచ్చేవారు. ఇక ఇస్త్రీ, ఇంటర్నెట్, టివి లేకపోయినా బతకొచ్చు. ఈ అవసరాలు శరీర సహజమైనవి కావు. కానీ మనం బతకలేం. ఇప్పుడది సాధ్యమా అనే సంగతి పక్కన పెట్టి మన జీవితాలను శాసించే వీటన్నిటికీ వ్యతిరేకంగా అంకుల్ జీవించారు. ఒకసారి రాత్రి భోజనాలప్పుడే 'అన్నం మిగిలితే నాకోసం తీసి పెట్టు. పొద్దున్నే ఆవకాయతో తింటా'నని అన్నారు. అది గుర్తుంచుకుని అంకుల్ స్నానం చేసి వచ్చేసరికి నేను మైక్రోవేవ్ లో అన్నం వేడి చేసేశాను. ఇక చూడండి, పట్టరాని కోపం వచ్చేసింది. 'ఎబ్బెబ్బే! మీకసలు రుచులే తెలియవు' అని తెగ చిరాకు పడి పోయారు. ఆవకాయతో చద్దన్నం తింటానన్నాను కానీ వేడన్నంతో ఎవడిక్కావాలి? అని తిట్టారు. విరసం విరాళాలను ఎంతో బాధ్యతగా చిన్న చిన్న గుడ్డలతో మూట మీద మూట ఎన్నో పొరలలో బంధించేవారు. నేను నవ్వుతూ చూస్తుంటే 'ప్రజల డబ్బు నాన్నా, జాగ్రత్తగా ఉండాలి' అనేవారు. ఇక తాళాలు లేని ఇళ్ళూ, పోలీసులు లేని రాజ్యం, పరిక్షలు లేని చదువులు -ఇవి ఇప్పటికీ ఆదివాసులు పాటిస్తున్న విలువలే! 'ప్రాపర్టీ ఈజ్ ఆర్గనైజ్డ్ రాబరీ' అని జార్జి బెర్నార్డ్ షా అన్నట్లు ఆస్తులు కావాలనీ, అందులోనూ అతి వేగంగా ఆస్తులు పోగులు పడాలనీ, దోపిడీ నిరంతరాయంగా కొనసాగాలనీ ఆరాట పడుతున్న వాళ్ళకీ, వాటిని కాపాడుకోవాలనే రంధి ఉన్న నాగరికులెవరికీ ఈ కోరికలుండవు. జీవితకాలమంతా పాటించిన కొన్ని విలువలూ, ఆకాంక్షలూ గనక గమనించి చూస్తే అంకుల్ లో కొన్ని ఆదివాసుల లక్షణాలు తనలో ఉండిపోయాయా లేక కావాలనే నిలుపుకున్నారా అనే ఆలోచనలొస్తున్నాయి!

యూనియన్లో పని చేస్తున్నప్పటికీ ఆర్థిక పోరాటాలు తప్పించి వివేకమనేదే లేకుండా పరమ మూర్ఖంగా, స్వార్థంగా బతుకుతున్న కాలంలో అంకుల్ పరిచయం నాకు కళ్ళు తెరిపించింది. అంకుల్ రాజకీయ చైతన్యమూ, విశ్వాసాలూ, ఆచరణా చాలా దగ్గరినుంచి చూడడం వల్ల నాకు తెలియకుండానే నేను మారిపోయేలా చేశాయి. అంతకుముందు సులభంగా కనిపించే విషయాల్లోనే ఆలోచనల్ని తికమక పెట్టే క్లిష్టత ఉండేది. ఇప్పుడు అంకుల్ సావాసంతో రాజకీయ నాయకుల ఎత్తుగడలే కాక సంక్లిష్టమైన మనుషులు, వాళ్ళ ప్రవర్తనలు కూడా అర్థమవుతున్నాయి!

అన్నిటి కంటే ముఖ్యంగా విశాల ప్రజానీకంలోని మాములు మనుషుల్ని విప్లవ రాజకీయ పంథా వైపుకి మళ్ళించాలనుకునే వారికి ఎవరిని, ఎక్కడ, ఎప్పుడు, ఏపనికి, ఏవిధంగా ఉపయోగించుకోవాలి? అనే విచక్షణ నాయకత్వానికుండాలి. ఏ రాజకీయ చైతన్యమూ లేని నన్నూ, డాక్టర్ కామేశ్వరి గారినీ ఎంత తెలివిగా సమాజపు పనులకోసం వినియోగించారో తల్చుకుంటే ప్రసాదంకుల్ ఎంత విజ్ఞులో అర్థమవుతుంది!మాకూ అంత మంచి పనిలో పాలు పంచుకోగలిగినందుకు ఎంతో గర్వంగా అనిపించింది! ఎప్పుడు తలచుకున్నా సంతోషంగా ఉంటుంది!!

'ప్రసాద్, అనారోగ్యంగా ఉన్నప్పుడు నీ శరీరం నీతో మాట్లాడుతుంది. దాన్ని విను' అని చెప్పే ఆయన డాక్టర్ స్నేహితురాలు మాట ఎప్పుడూ పట్టించుకునేవారు కాదు అంకుల్. బి పి సంకేతాలు వచ్చే ఉంటాయి కానీ దాని నోరు నొక్కేసి ఉంటారు. జీవిత లక్ష్యాలను నిర్ణయించుకున్న వ్యక్తులు అనారోగ్యాన్ని పట్టించుకోరు!

అంకుల్ నాకు ఒక పెద్ద కిటికీ లాగా ఎడమవైపు నుంచి సవ్యమైన ప్రపంచాన్ని చూపిస్తూ నేను నడుస్తున్న అపసవ్యపు దారులనుంచి నన్ను తప్పించారు. ఆయన నాలాగే ఎందరో స్త్రీలను చేరదీసి ఉండొచ్చు. కానీ ఆయన పూర్తి ప్రేమను నేను పొందగలిగానని గర్వంగా ఉంటుంది నాకు! కానీ ఇప్పుడు చాలా దుఃఖంగా, శూన్యంగా అనిపిస్తుంది. ఒక్క నిమిషం గనక అంకుల్ నాక్కనిపిస్తే 'పిచ్చి అమ్మడూ,' కాల గమనంలో లెక్క కట్టలేని ఒక లిప్త మనిషి జీవితం. వ్యక్తి జీవితానికి అంతం ఉంటుంది, కాని పోరాటం నిరంతర ప్రక్రియ. ఈ పెట్టుబడిదారీ విష సంస్కృతిని ధిక్కరించి సమసమాజం దిశగా నిరంతర విముక్తి పోరాటం కొనసాగించడానికి కృషి చెయ్యాల్సిందే'! అని చెప్తారనుకుని ఊహించుకుని ఊరట పొందుతున్నాను! ఉన్నది 'ఒకే దారి చారుమజుందారి' అన్నట్లు మానవ సంబంధాల్లోనూ, పోరాటాల్లోనూ ఇక మనముందున్న దొకే దారి చలసాని ప్రసాద్ దారి!

Property is organized robbery-George Bernard Shaw.

'తెలుగుకు ఏమీ ఢోకా లేదు'

సామల రమేష్ బాబు, అమ్మనుడి

ఆయన విప్లవ కవి. వ్యక్తిగా సౌమ్యుడు. స్నేహశీలి. నిరంతర అధ్యయనశీలి. అదంతా మార్క్సిస్టు పంథాలోనే. ఆయన ఇల్లు ఒక పెద్ద గ్రంథాలయం. ఎనిమిది గదులూ గ్రంథాలతో నిండి ఉంటాయంటారు.

సాహితీవేత్త. శ్రీశ్రీ, కొ.కు. రావిశాస్త్రిల రచనలపై సాధికారికంగా మాట్లాడగలరు. ఆయన వద్ద ఉన్న పుస్తకాల ఆధారంగానే ఏడెనిమిది మంది పిహెచ్.డి.లు చేశారని అంటారు. 'విరసం'కు మూలస్తంభాల్లో ఒకరు.

ఆయన కుటుంబ నేపథ్యమంతా కమ్యూనిజమే. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జీవితమంతా మార్క్సిస్టు సైద్ధాంతిక ప్రయాణమే. అంకితమే. ఏమి ఆలోచించినా మాట్లాడినా అంతా ముందుచూపుతో ఉంటుంది. పిరికితనం, వెనకడుగు, తాత్సారం ఆయనలో ఏకోశానా లేవు.

సుమారు పన్నెండేళ్లుగా ఆయన 'నడుస్తున్న చరిత్ర'ను చదువుతున్నారు. చందా కట్టి తెప్పించుకొనేవారు. చందా వద్దండీ. మీరు పత్రిక చదవడమే మాకు గౌరవం అంటే అలాంటి మాటలు వద్దు. చందా కట్టి తెప్పించుకొంటేనే నాకు తృప్తిగా ఉంటుంది అన్నారొకసారి. పత్రిక ఆగిపోయి మూడు నెలల తర్వాత ఒకసారి నాకు ఫోన్ చేసేవారు. 'త్వరగా కోలుకొని పత్రికను మళ్లీ తీసుకురండి. తెలుగు కోసం మళ్లీ పత్రిక రావాలి' అన్నారాయన. 'అమ్మనుడి' మార్చి సంచికను అందుకోగానే ఆయన ఎంతో ఆనందించారు. తెలుగు అభివృద్ధి అంటే ఏమిటో సరైన దృక్పథం ఆయనకుంది. తెలుగు భాష, తెలుగు సమాజం ఎలా ఎదిగిందీ చరిత్రలోతుల్లోకి వెళ్లి చర్చించగల అధ్యయనం ఆయనకుంది. ఆయన ఎప్పుడు ఉత్తరం వ్రాసినా అది పోస్టుకార్డే - అయిదారు వాక్యాలు. ఫోన్‌లో ఆయన మాట్లాడింది మనం వినాల్సిందే. ఆయన చెప్పదలచింది చెప్పి ఫోన్ పెట్టేసేవారు. నా అంతట నేను ఫోన్‌చేసి మాట్లాడితే - ఎంత వినిపిస్తుందో తెలియదు. శ్రద్ధగా వినేవారు. తర్వాత ఒక కార్డు వ్రాసేవారు.

కొన్నేళ్ల క్రితం ఒక ఆంగ్లపత్రికలో వచ్చిన ఒక పెద్ద వ్యాసాన్ని 'The efficiency of Languages' ను ఇటీవల నాకు పంపించి దీన్ని అనువాదం చేయించి 'అమ్మనుడి'లో వెయ్యాలి అని చెప్పారు. ఆ వ్యాసం అంతా సాంకేతిక పదజాలంతో కూడి ఉంది. భాషల సామర్థ్యం గురించి చర్చిస్తూ తెలుగు ఒక భాషగా అత్యంత శక్తివంతమైనదని నిర్ధారించే వ్యాసం అది. (సెప్టెంబరు సంచికలో ఆ వ్యాసాన్ని చదవండి). దాని తర్వాత 'ఇంకా రెండు మూడు పుస్తకాలు తీసి ఉంచాను. వాటిలోని అంశాలు మనం పత్రికలో వెయ్యాలి' అన్నారు. నేను జూన్, జూలై నెలల్లో విశాఖపట్టణం వెళ్లి వారితో వీలైనంత సేపు ఉండి వారి సలహాలు తీసుకుందామనుకున్నాను. అయితే ఆ ప్రయాణం సెప్టెంబరుకు వాయిదా పడింది. ఇప్పుడు ఆ అవకాశం ఇక ఎప్పటికీ రాదు.

నేను చూసిన నిబద్ధత గల కొందరు పెద్దలలో వారొకరు. ఆయన తీవ్రవాదీకాదు, పిడివాదీ కాదు, సైద్ధాంతిక నిబద్ధతకూ అధ్యయనానికీ ప్రతిరూపం. 'తెలుగు ఎన్నటికీ చావదు. సంస్కృతాన్నీ, ఆంగ్లాన్నీ తట్టుకొని నిలిచింది. ఇంకా ఎన్ని ఆటుపోట్లయినా తట్టుకోగల శక్తి తెలుగుకుంది. సెంటిమెంట్‌ను పక్కనపెట్టి శాస్త్రీయంగా మనం ముదుకు సాగితే తెలుగు భవిష్యత్తుకు ఢోకా లేదు' అనేవారాయన. ఆయన చిరస్మరణీయులు. ఆయన లేని లోటు తీరదు.

విరసం నేత చలసాని ప్రసాద్ మృతికి జనసాహితి సంతాపం

- దివికుమార్, ప్రధాన కార్యదర్శి, జనసాహితి

విప్లవ రచయితల సంఘం పుట్టుక నుండి చివరికంటా వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర కార్యదర్శిగా, అధ్యక్షునిగా, అరుణతార సంపాదకునిగా తెలుగు సాహిత్య సాంస్కృతికోద్యమ చలనానికి తన వంతు కృషి సల్పిన చలసాని ప్రసాద్ మృతికి (25 జూలై 2015) జనసాహితి సంతాపం తెలియజేస్తోంది.

కృష్ణాజిల్లా, దివి తాలూకా నాదెండ్లవారిపాలెం గ్రామంలో 8.12.1932న, జన్మించి, ముగ్గురు మృతవీరులున్న కుటుంబ వారసత్వం పొందిన చలసాని ప్రసాద్ నక్సల్‌బరీ, శ్రీకాకుళ ఉద్యమాల ప్రభావంతో సాహిత్య ఉద్యమంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు.

చల్లపల్లి హైస్కూలులో చదివే రోజుల్లోనే 'డిటెన్షన్' విధానానికి వ్యతిరేకంగా నిలిచారు. జీవితకాలం శ్రీశ్రీ సాహిత్య అభిమానిగా ఉంటూ ఆయన రచనలకు సంపాదకత్వం వహించి అర్థవంతం చేసే విస్తారమైన పాదసూచికలను పాఠకులకు అందించారు. అలాగే కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని గోపీచంద్ రచనలు సమగ్ర సంపుటాలుగా, వెలువడటానికి కృషి సల్పారు. తాను స్వయంగా రెండు సంపుటాల సాహిత్య వ్యాసాలను, ముందుమాటలను, వ్యాఖ్యలను రచించారు.

సాంస్కృతిక పునరుద్ధరణనీ, కులమతవాదాలన్నీ తలకెత్తుకున్న వర్తమాన కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు లౌకిక ప్రజాస్వామ్య శక్తులపై బరితెగించి పోతున్న సందర్భంలో విరామమెరుగని క్రియాశీలత, మొక్కవోని నిబద్ధత ఉన్న చలసాని ప్రసాద్ మృతి ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమాలకు లోటుగా జనసాహితి భావిస్తోంది.

వారి కుటుంబసభ్యులకు జనసాహితి ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది.



సాంస్కృతిక సేనాని చలసాని

కె.పి. సుబ్బారావు
సభ్యులు - పూర్వ జననాట్యమండలి, విశాఖపట్టణం

నక్సల్బరీ వసంత మేఘ గర్జన నుండి పుట్టిన విరసం వ్యవస్థాపకులలో ఒకరు చలసాని ప్రసాద్. విప్లవోద్యమం లక్ష్యాలని, ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకుపోవడానికి రచయితలు ఎంత అవసరమో కళాకారులూ అంతే అవసరం. రచయితలు సాహిత్యాన్ని అందిస్తే కళాకారులు ఆ రచనలకు, కవిత్వాన్ని ఆట-పాటలతో ప్రచారం చేస్తారు. ఇది రచయితలు - కళాకారులకున్న అవినాభావ సంబంధం.

అవి ఎమర్జన్సీ రోజులు. నేను ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థిగా ఉండేవాడిని. అన్నీ సమయానికి జరిగేవి. పరీక్షలు, తరగతి శిక్షణ, మూల్యాంకనం సరిగ్గా అనుకున్న సమయానికే జరిగేవి ఎమర్జెన్సీ వలన. ఎక్కడ ఏ గదిలో మాట్లాడుకున్నా ఇందిరాగాంధీకి తెలిసి పోతుందనే బూచి చూపించేవారు. ఎమర్జెన్సీ తర్వాత పీపుల్స్‌వార్‌కు అనుబంధమైన జననాట్యమండలిని పునరుద్ధరించారు. దానిని చలసాని ప్రసాద్ గారు పర్యవేక్షించేవారు. నేను మొదటిగా రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, ఆ తర్వాత జననాట్య మండలిలోకి వచ్చాను. ఆ సమయానికి నేను పరిశోధనా విద్యార్థిగా ఉండేవాడిని. విశాఖ పట్టణం కలెక్టర్ ఆఫీస్ దరిలో ఉండే టౌన్‌క్లబ్‌లో గద్దర్ సాంస్కృతిక కార్యక్రమంతో ఉత్తేజితుడునైన నేను మెల్లగా జననాట్యమండలికి దగ్గర అయ్యాను. అప్పుడే చలసాని ప్రసాద్ గారితో పరిచయం. అప్పటికే భూమి భాగోతాన్ని పలుచోట్ల ప్రదర్శించేవారు. ఆ తర్వాత పి.వి. రమణ, కృష్ణ, నేను జననాట్యమండలిలో ప్రొక్షన్‌గా పని చేయమని పార్టీ ఆదేశించింది. పేరుకు మేము బాధ్యులైనా చలసాని ప్రసాద్‌గారే అంతా చూసుకొనే వారు. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూమి భాగోతం నృత్యనాటికలో కొన్ని మార్పులు చేసి ప్రదర్శనలిచ్చే వారం. ఆదిలాబాద్ గోండుల నరహత్య జరిగిన తర్వాత గోండుల జీవితం, పోరాటం ఆధారంగా వ్రాసిన 'రగల్ జెండా' నృత్య నాటకంపై జననాట్యమండలి విశాఖపట్టణంలో నెల బాటు శిక్షణ పొంది అనేక ప్రదర్శనలిచ్చింది. శిక్షణా శిబిరంలో ప్రధాన ప్రయోక్తగా, శిక్షకుడిగా కుమార్ (హైదరాబాద్) మమ్మల్ని తీర్చిదిద్దడమేగాక కొన్ని ప్రదర్శనలను పర్యవేక్షించాడు కూడా. మొట్టమొదటి ప్రదర్శన ఆంధ్రా యూనివర్సిటి అసెంబ్లీ హాల్‌లో ప్రదర్శించాం. ప్రదర్శనకు ముందు చలసాని ప్రసాద్ గారు ఉపన్యసించారు. అలా మొదలైంది చలసాని ప్రసాద్‌గారితో నా స్నేహం, అనుబంధం. మేము ప్రదర్శించే ప్రతి సాంస్కృతి కార్యక్రమానికీ ఆయనిది ముందుమాట ఆ తర్వాతే మా ఆట - పాట. ఉత్తరాంధ్రలోనే గాక మన్య ప్రాంతంలో కూడా అనేక ప్రదర్శనలిచ్చాము.

శ్రీశ్రీ, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొ.కు.ల మీద చలసాని ప్రసాద్‌కు ఎంత అభిమానమో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మీద అంతే అభిమానం. ప్రతీ ప్రసంగంలోను సీతారామరాజు పేరు ఎత్తకుండా ఉండే వారు కాదు. సీతారామరాజు నడయాడిన మన్య ప్రాంతంలోకి మా జన నాట్య మండలి ప్రదర్శనలివ్వడానికి కార్యక్రమం తీసుకుంది పార్టీ. సీతారామరాజు తిరిగిన మంప నుండి అతని సమాధి ప్రదేశమైన కృష్ణదేవిపేట వరకు పాదయాత్రగా వెళుతూ మధ్య మధ్యలో సాంస్కృతిక కార్యక్రమాలివ్వాలి. అదీ కార్యక్రమం. చలసాని ప్రసాద్‌గారు మా టీముకు ముందు పీఠిన ఉండి నడిచేవారు. ఆ మన్యంలో నడవడం కొంచెం ఇబ్బంది అయినా వెనక్కి చూడకుండా ఏకబిగిన ఆయన నడిచేవారు. వయస్సులో చిన్న వాళ్లమైన మేము నడవలేక అక్కడక్కడ సేద తీర్చుకొనే వాళ్లం. ఆయన మాత్రం గమ్యస్థానం వచ్చిన తర్వాతే ఆగి నిలిచేవారు. ఆ సమయంలో ఇంకా బ్రతికున్న కొంతమంది రామరాజు సహచరులను కలిసి మాట్లాడాలనేది ఆయన తాపత్రయం. ఆ కోవలోకి వచ్చే ద్వారబంధాల చంద్రయ్యను ఆయన ఇంటి దగ్గర కలిసాం. అది రాత్రి సమయం కాని వెన్నెల కురుస్తోంది. చంద్రయ్య ఆయన ఇంటి ముందు వేసిన నులక మంచంపై కూర్చొని చాలా కబుర్లు చెప్పారు. మన్యం పోరాటం జరిగేటప్పటికి అతడు చాలా చిన్నవాడినని అతి దగ్గరగా సీతారామరాజును చూసానని చెబుతుంటే మేమే స్వయంగా చూసామనే సంతృప్తి కల్గింది. చలసాని ప్రసాద్ గారు ఆ వెన్నెల రాత్రిలోనే వ్రాసుకొన్నారు చంద్రయ్య అనుభవాలను. బెల్లంతో కాసిన టీని మాకందించారు. అప్పటికది అదే మహాభాగ్యమని సంతృప్తిపడ్డాము. కృష్ణదేవి పేటలోని ఆయన సమాధిని సందర్శించి తర్వాత చలసాని ప్రసాద్‌గారు ఒక చిన్నపాటి ప్రసంగం చేసి నినాదాలు చేసారు. మేమంతా గొంతు కలిపాం. చలసాని ప్రసాద్‌గారు వల్ల విప్లవమూర్తి అల్లూరి సీతారామరాజు పోరాట ప్రదేశాన్ని చూసామనే సంతృప్తికల్గింది.



మా ఇంటికి రాకుండానే వెళ్ళిపోయిన చలసాని

ప్రొ. ఎస్. శేషయ్య

1982లో ఏలూరులో రాడికల్ యువజన సంఘం మహాసభలు జరిగాయి. మొదటిసారి బాలగోపాల్‌ను అక్కడే చూశాను. సాయంత్రం బహిరంగ సభల్లో ఒక అమ్మాయి విప్లవ గీతం పాడుతూ ఉంది. ఆ పాటకు పౌరాణిక గీతంతో పోలికలు ఉన్నాయి. చాలా మధురంగా, ఉత్తేజం పొంగించేలా ఆ అమ్మాయి పాడింది. ఆమె పేరు నవత అనీ, చెలసాని ప్రసాదు గారి కూతురు అని తెలిసింది. తిరుపతి మావో త్రిపురనేని మధుసూదనరావు ద్వారా చలసాని గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తున్న కుటుంబం అనీ, ప్రజా ఉద్యమాలకు కేర్ ఆఫ్ అడ్రసు అని తెలిసింది. విరసం వ్యవస్థాపక సభ్యుడనీ, సంస్థను నడిపించే ప్రధానమైన చోదక శక్తి అని తెలుసుకున్నాను.

1982 జూలైలో సి.ఆర్.రెడ్డి న్యాయ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాను. ప.గో. జిల్లాలో కార్మికుల, రైతు కూలీలు పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఏలూరులో జ్యూట్ మిల్లులో కార్మికులు సమ్మె మొదలు పెట్టారు. దాన్ని గతంలో ఆర్.ఎస్.యు.కు సెక్రటరీగా పని చేసిన విజయకుమార్ నడిపిస్తున్నాడు. స్థానికంగా జరిగే సభలకు, సమావేశాలకు వెళ్ళేవాడ్ని. సమ్మెకు సంబంధించిన చట్టపరమైన అంశాలను చర్చించే వాళ్ళం. చట్టపరంగా ఏం చేయాలో ఆలోచించే వాళ్ళం. ఒకవైపు సమ్మె కొనసాగుతూ ఉంది, మరోవైపు కార్మికులకు, విద్యార్థులకు రాజకీయ అధ్యయన తరగతులను ఏర్పాటు చేసారు. తత్వశాస్త్రం చెప్పడానికి మధుసూదనరావు రావాలి. కానీ, ఆయన రావటం లేదనీ, ఆయన స్థానంలో చలసాని ప్రసాద్ వస్తున్నారని నిర్వాహకులు చెప్పారు. ఆయనతో కలిసి మాట్లాడటానికి అవకాశం దొరికిందని సంతోషం కల్గింది. ఆయన కూడ అత్యవసర కారణం వల్ల రాలేకపోయాడని తెలియడంతో నిరాశ కల్గింది. ప.గోదావరి జిల్లా పెదవేగి ప్రాంతంలో రైతు కూలీల ఉద్యమం ప్రారంభమయ్యింది. అజ్ఞాత సూరీడు వాటిని సమన్వయ పరిచేవాడు. విశాఖ వెళ్ళి చెలసాని మాస్టారును కలవాలనుకున్నాను. కానీ ఎస్.కె. యూనివర్సిటీలో జాబ్ రావడం, వెంటనే అనంతపురం వెళ్లిపోవడం జరిగింది.

పౌర హక్కుల సంఘంలో ప్రధాన బాధ్యతలు తీసుకున్న తర్వాత కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం వెళ్ళినప్పుడల్లా చలసాని ఇంటికి వెళ్ళి కాసేపు ఆయనతో గడిపేవాడ్ని. విశాఖ జిల్లా యూనిట్‌కు సెక్రటరీగా బాలక్రిష్ణ అక్కడే ఉండేవాడు. చలసాని సరదాగా కబుర్లు చెప్పేవారు. జోకులు వేసేవారు. పౌరహక్కులు సంఘంలో బాధ్యుల క్షేమ సమాచారాలు తెలుసుకునేవారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో పౌరహక్కుల సంఘంతో పాటు నిజ నిర్ధారణ కమిటీల్లో పాల్గొనేవారు. యువకులతో పోటీపడి అడవిలో నడిచేవారు. వాస్తవానికి ఏ కష్టమైన పని చేయడానికైనా ఆయనకు వయస్సు ఆటంకం కాలేదు. మానసిక దృఢత్వం, నిజాయితీ, నిబద్ధత ఆయనను ఇంతకాలం నడిపించాయి. చనిపోయే ముందు రోజు కూడ విరసం సభల ఏర్పాట్లలో నిమగ్నం కావడం ఆశ్చర్యం కల్గిస్తుంది.

చలసాని కేవలం పుస్తకాలను సేకరించి భద్రపరచడమే కాదు, వాటిని పరిచయం చేసేవారు. చదవమని ప్రోత్సహిస్తారు. వాటిని చదివిన తర్వాత మన ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి. రిలాక్స్ అవుతాం. ఈ మధ్య ప్రత్యామ్నాయ రాజకీయాలు - జనతన సర్కార్లపై చర్చ జరుగుతూ ఉంది. కొంత మంది విప్లవాభిమానులు, స్నేహితులు జనతన సర్కార్లు నిలదొక్కుకుంటాయా? మున్ముందు కొన సాగుతాయా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై చలసాని గారి స్పందన తెలుసుకుందామని ఆయనతో ప్రస్తావించాను. 'సందేహాలు రావడం సహజమే. ఒక ప్రయత్నం, ప్రయోగం జరుగుతున్నప్పుడు మనం వేచి చూడాలి. విజయం సాధించకపోతే ఢీలా పడకూడదు. మళ్లీ కొత్త మార్గంలో ప్రయత్నించాలి. నా జీవిత కాలంలోనే, నేను బతికుండగానే విప్లవం విజయవంతం అవుతుందని గ్యారంటీ ఇస్తే ఉద్యమంలో ఉంటాను, లేకుంటే తప్పుకుంటాను అనడం ఎంత వరకు కరెక్టు' అని సమాధానం ఇచ్చారు. కొంచెం సేపు ఆలోచించిన తర్వాత ఒక పుస్తకం గురించి చెప్పారు. రష్యాలో విప్లవం విజయవంతం అయిన తర్వాత పార్టీ, ప్రజలు

సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా, ఎంతో విశ్వాసంతో, త్యాగాలకు సిద్ధపడిన పరిణామాల గురించిన పుస్తకం అది. అమెరికా జర్నలిస్టు అన్నా లూయిస్ స్ట్రాంగ్ రాసింది. The First Time in History: Two years of Russian's New Life (August 1921 - December 1923). ఈ పుస్తకానికి ట్రాట్స్కీ ముందుమాట రాశారు. ఈ పుస్తకాన్ని చలసాని చాలా సంవత్సరాల క్రితం చూశాడట. నేను అమెరికా వెళ్తున్నాని తెలిసి ఆ పుస్తకాన్ని సేకరించి పంపమని ఆదేశించారు. అన్నా లూయిస్ స్ట్రాంగ్ పుస్తకం చాలా చిన్నదే. అయినా మనకు విలువైన సమాచారాన్ని ఇస్తుంది. రష్యాలో పార్టీ, ప్రజలు కొత్త వ్యవస్థలను నిర్మించుకోవడానికి ఎలా ఆలోచించారో, కష్టపడ్డారో రచయిత్రి అద్భుతంగా వివరించింది. పుస్తకం చదివిన తర్వాత క్రాంతికారీ జనతన సర్కార్లు నిలదొక్కుకుంటాయనే భరోసా కల్గింది. విప్లవ సిద్ధాంతం, రాజకీయాల గురించిన ఏ సమాచారాన్ని అడిగినా అలవోకగా వాటికి సంబంధించిన పుస్తకాలను పరిచయం చేసే జ్ఞాన భాండాగారం చలసాని.

జింకిభద్రలో అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆ కార్యక్రమానికి తప్పక రావాలని పట్టుపట్టారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ గోరు మాధవరావుగారు పర్యవేక్షిస్తున్నారు. వావిలాల గోపాల క్రిష్ణయ్య ముఖ్య అతిథిగా వచ్చారు. సభలు ముగిసిన తర్వాత నేను, చలసాని రాత్రి తిరుగు ప్రయాణమయ్యాం. మాకు రిజర్వేషన్ లేకున్నా రైలు ఎక్కాం. కిక్కిరిసిన జనరల్ కంపార్టుమెంటులో కూర్చున్నాం. ఆయన మాట్లాడుతూనే ఉన్నాడు. ప్రత్యేకించి గోరుమాధవరావుగారు నివాసం ఉంటున్న ఇల్లు కూలడానికి సిద్ధంగా ఉంది. ఒంటరిగానే ఉంటున్నారు. వయోభారంతో బాధపడుతున్నా అన్ని బాధ్యతలు తనమీద వేసుకొని పని చేస్తున్నాడు. విప్లవానికి అంకితమైన వారు అలాగే ఉంటారా? ఉండాలా? అనిపించింది. వారికి ఉన్న ఓర్పు, పని మీద శ్రద్ధ అందరికీ వంటబట్టదు. అలాంటివారు అరుదుగానే కనిపిస్తారు. వారిలో చలసాని ఒకరు.

తర్వాత మా మాటలు పౌరహక్కుల ఉద్యమం మీదికి వెళ్ళాయి. విప్లవోద్యమం పట్ల బాలగోపాల్‌కు ఉన్న సందేహాలు విమర్శల మీద, ప్రత్యేకించి పౌరహక్కుల సంఘంలో అవగాహనకు సంబంధించిన చర్చ మీద మాట్లాడుకున్నాం. 'బాలగోపాల్ ఎందుకిలా అయ్యాడంటావ్' అని చలసాని అడిగారు. 'నాకేం తెలుసు మీరే చెప్పాలి' అన్నాను. కొంతసేపు ఆగి 'విప్లవ హింస మీద ఇంత రాద్ధాంతం అవసరమా? బాలగోపాల్‌కు చరిత్ర మీద మంచి అవగాహన ఉంది. పట్టు ఉంది. అతని వాదన కరెక్టు అనిపిస్తుంది. కానీ, వాస్తవానికి చరిత్ర పరిణామంలో హింస అనివార్యం అయ్యింది. మార్పు సదాసీదాగా జరిగితే ఎవ్వరొద్దంటారు. రాజ్యం ఊరుకోదు కదా?' అని కాసేపు మౌనంగా ఉన్నారు.

'వావిలాల గారు ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఉన్నారు. అక్కడికి పోదాం పదా అన్నారు. రైలు పక్క స్టేషనులో ఆగగానే అక్కడికి వెళ్ళాం. వావిలాల గారితో కాసేపు ముచ్చట్లు. రాష్ట్ర రాజకీయాల మీద చర్చ. ఆయనలో మాటలు ఆపేసి నావైపు తిరిగి 'పెట్టుబడిదారీ సమాజంలో చట్టం, కోర్టుల పాత్ర గురించి ఒక మంచి పుస్తకం ఉందయ్యా' అన్నారు. వావిలాల గారితో మాట్లాడుతున్నాడేగానీ, ఆయన ధ్యాసంతా పౌరహక్కుల సంఘంలో జరుగుతున్న చర్చపైనే ఉందనిపించింది. ఆ చర్చ మంచి చేస్తుందా? లేక ఇబ్బంది పెడుతుందా? అని ఆలోచిస్తున్నట్టుంది. పుస్తకం పేరు గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. 'ది లా అండ్ రైజ్ ఆఫ్ కాపిటలిజం' పుస్తకమేనా అన్నాను. 'అదే కావచ్చు' అన్నారు. వాస్తవానికి కన్నాబిరాన్‌గారు ఆ పుస్తకం గురించి చెప్పారు. చట్టం గురించి, న్యాయ వ్యవస్థ గురించి, పీపుల్స్ లాయర్సు గురించి, ఉద్యమాలను సమర్థించడానికి చట్టం ఏ విధంగా తోడ్పడుతుంది, ఏ విధంగా అడ్డంకిగా మారుతుందనే విషయాలు చాలా వివరంగా ఉన్నాయి. సమాజంలో ఉపరితల అంశాల్లో అన్నింటికి చరిత్ర ఉన్నట్టే చట్టానికి సంబంధించిన 10 శతాబ్దాల చరిత్రను, బూర్జువా శక్తులు ఫ్యూడలిజాన్ని కూలదోయడానికి న్యాయ సంబంధమైన భావజాలాన్ని ఎలా ఉపయోగించుకున్నారో రచయిత చర్చించాడు. ఆ పుస్తకం 1977లో మార్కెట్టులోకి వచ్చింది. మళ్లీ 2003లో రెండవ ఎడిషన్ వచ్చింది. అది అందుబాటులో లేదని అనగానే ఆ పుస్తకం వివరాలు తెలుసుకొని అమెరికాలో ఉన్న స్నేహితుల ద్వారా ఒక వారం లోపే నాకు పంపించారు. ఆ పుస్తకం బాలగోపాల్‌గారి వాదనలను ఎదుర్కోవడానికి ఉపయోగపడింది. పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే కార్యకర్తలు ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి. ఎందుకంటే, చట్టం, కోర్టులు, నేర న్యాయ విచారణ వ్యవస్థ ఎలా పని చేస్తాయో తెలుసుకోవచ్చు. చట్టం, కోర్టుల ప్రస్తావన లేకుండా పౌరహక్కుల కార్యక్రమాలు ప్రజల దగ్గరికి తీసుకుపోలేము. చట్టపరమైన భాష అవసరం. పౌరహక్కుల ఉద్యమంలో విప్లవ పరిభాష నిషిద్ధం కాదు గానీ, దాని అవసరం అంతగా ఉండదు.

చట్టానికి, విప్లవానికి మధ్య గతితార్కిక సంబంధం ఉంది. సమాజంలో మనిషి ప్రవర్తన ఎలా ఉండాలో చట్టం నిర్దేసిస్తుంది. నియంత్రిస్తుంది. చట్టం యొక్క భావజాలం మన దైనందిన సామాజిక, రాజకీయ సంబంధాల్లో చొరబడుతుంది. ఈ సంబంధాల్లో ఏర్పడే వైరుధ్యాలు, ఫలితంగా తలెత్తే ఘర్షణలు చట్ట సంబంధమైన వివాదాలుగా, విషయాలుగా వ్యక్తీకరించబడతాయి. సామాజిక ఉద్యమాలు, వాటి ఆకాంక్షలు చట్టంలో పరివర్తన చెందుతాయి. ఉదాహరణకు ఇవ్వాళ భూసేకరణ చట్టం, నష్ట పరిహారం, పునరావాసం సంబంధించిన చట్టంపై చర్చ జరుగుతూ ఉంది. యుపిఎ ప్రభుత్వం తెచ్చిన చట్టానికి ఎన్‌డిఎ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వాదిస్తున్నారు. యుపిఎ ప్రభుత్వం తెచ్చిన చట్టం కంటే మెరుగైన చట్టం తెస్తున్నామని ఎన్‌డిఎ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ చట్టాలు రావడానికి ప్రధానంగా ప్రజలు పోరాడారని, ప్రాణాలు త్యాగం చేశారనే విషయం మరుగున పడేస్తున్నారు. అయితే చట్టాల ద్వారా విప్లవాలు రావు. వాటికి చాలా పరిమితులున్నాయి.

పౌర హక్కుల సంఘమన్నా, సంస్థ కార్యకర్తలన్నా చలసానికి చాలా అభిమానం. గౌరవం. పౌరహక్కుల సంఘాన్ని స్థాపించడంలో, దాన్ని ప్రోత్సహించడంలో చలసాని పాత్ర చాలా ఉంది. పార్వతీపురం కుట్ర కేసుకు సంబంధించిన వివరాల కోసం ఆయన లైబ్రరీలో వెతకాను. రెండు పెట్టెల నిండా కేసుకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఉన్నాయి. వాటన్నింటిని ఇక్కడ చదవడం సాధ్యం కాదనీ, ఇంటికి తీసుకువెళ్ళి, చదివి ఇస్తానంటే ససేమిరా అన్నారు. ఎవరైనా, ఏ విషయం మీదైనా పరిశోధన చేయాలనుకునే వారికి ఆయన గ్రంథాలయం ఒక గొప్ప విజ్ఞాన గని.

పౌరహక్కుల సంఘం కార్యక్రమాల్లో భాగంగా విశాఖ వెళ్లినప్పుడల్లా చలసానిని కలవకుండా రాలేదు. ఆయన దగ్గర కాసేపు ఉన్నా ఒక గొప్ప అనుభూతి కల్గేది. రాత్రికి బస కూడా ఆయనింట్లోనే. నా కోసం పక్క సరిచేయడం, తలగడ ఉందా లేదా అని అడగడం, లైటు తీసేస్తే నిద్ర పడుతుందా అంటూ, మంచినీళ్ళు అక్కడే పెట్టాను' అని చెప్పి వెళ్ళేవారు. చలసాని ఎక్కడ? నా స్థాయి ఎక్కడ అని ఆలోచించేవాడ్ని.

ఆయనకు చిన్న, పెద్ద అనే తేడా లేదు. స్థాయి భేదాలు లేవు. ఎవరినైనా ప్రేమించే వ్యక్తి చలసాని. మా అబ్బాయి అరుణ్ విశాఖలోనే ఎం.టెక్ చేసాడు. కొద్ది రోజుల్లోనే చలసాని స్నేహితుడయ్యారు..

నిర్మలత్వానికి నిర్వచనం చలసాని ప్రసాద్

హేమ పరిమి

పిల్లలు బడి చదువులు మొదలయ్యే వయసుకి పుట్టి పెరిగిన ప్రాంతానికి తరలి రావాలన్న ఆలోచన మిత్రులు రంగానాథబాబు గారు చెప్పగా, వేణు మాష్టారు అంటే తుమ్మల వేణుగోపాలరావు గారిని కలిసి విజయవాడలో ఇంజనీరింగ్ కాలేజీలో పరిమి, పిల్లల వైద్యంలో నేను అడుగుపెట్టాం.

వేణు మాష్టారి చుట్టూ రచయితలూ, కవులూ, విమర్శకులూ, సభలూ, సమావేశాలు మా చైతన్యానికి ఉత్సాహానికి కొత్త ఊపిరి పోసినట్లయింది.

అంత మంది ఆలోచనాపరులైన మంచి మనుషులకి దగ్గరగా నిజంగా బతకటం అమెరికా నించి ఇండియా వచ్చేయటం వల్లనే సాధ్యమయింది మా వరకు.

అలా మొదలయింది చలసాని ప్రసాద్ గారి పరిచయం. అమ్మణ్ణి మేడలో పిల్లల ఆరోగ్యం కోసం కింద జాబిల్లితో నేనుంటే, పైన అమ్మణ్ణి ఇంటికి చలసాని ఎప్పుడూ వస్తూ, పోతూ ఎన్నెన్నో కబుర్లూ, పుస్తకాలు తెచ్చేవారు.

ఎప్పుడూ శ్రీశ్రీ గురించి ఏదో ఒకటి చెపుతూ ఏదైనా లేదంటే మళ్ళీసారి తెచ్చిపెట్టటం ఒకటైతే, పిల్లల చదువులు, పెంపకం గురించి సోవియట్ పుస్తకాలు మకరెంతో బుక్ ఫర్ పేరెంట్స్ ప్రత్యేకంగా ఇచ్చి అనువాదం చెయ్యటం గురించి అనేవారు.

శ్రీపాదని చదవలేదంటే ఆ పుస్తకాలన్నీ తెచ్చిపెట్టగా పరిమికీ, నాకూ చాలా ఇష్టంగా చదువుకోగా - మా పిల్లలకి నచ్చిన సాహిత్యంగా అయినై.

కొకు సైన్సు వ్యాసాలతో మొదలై - కొకు సర్వస్వంతో మాకూ మరెందరో మిత్రులకీ మంచి పుస్తకాలు చేరాయి.

'టివి' భూతాన్ని ఈసడించుకునే తీరు ఒక్క చలసానికే చెల్లింది. ఈ రోజుల్లో టివి మాయలో పడకపోవడం మాటలేం కాదు.

మా దగ్గరకు రాబోయేముందు, వచ్చి వెళ్ళాక ఎన్నో సందర్భాల్లో గుర్తుకొచ్చినప్పుడు రాసిన ఉత్తరాలు, కార్డులు, ఇన్‌లాండ్ లెటర్స్. వాటిలో కలిసి చెప్పుకుందామనుకునే కబుర్ల కలలు - తన రాత అర్థం చేసుకునేందుకు మళ్ళీ మళ్ళీ కలిసి చదువుకోవటం - చలసానితో ముడిపడిపోయిన జ్ఞాపకాలు.

కారా మాష్టారి 'కథా నిలయం' చూడాలంటే స్టేషన్‌లో నన్ను రిసీవ్ చేసుకుని యెగళ్ళ రామకృష్ణ గారింటికి కథానిలయం వార్షికోత్సవాలకీ అటునించి తన లైబ్రరీకి - ఎన్నెన్నో కబుర్లూ చెప్తూ చలసాని.

వికాస విద్యావనం పేరు చలసాని పెట్టినదే. అపురూప గాయని రావు బాలసరస్వతి దేవి గారు వికాస విద్యావనం పొదరింటికీ మా జీవితంలోకీ అడుగు పెట్టడానికి చలసాని పూనికే కారణం.

తన అన్న మనుమరాలు మా మరిది కోడలవుతున్న పెళ్ళికి వచ్చి రెండు రోజులు గడపటం చివరి కలయిక.

వరూధిని గారిని మేం కలిసి తీరాలన్న చలసాని కోరిక తీరకుండానే వెళ్ళిపోయారు.

వేణు మాష్టారు, పరిమి ఎంసెట్ వద్దంటే ఒప్పుకోరని మళ్ళీ మళ్ళీ ప్రస్తావించే వారు చలసాని.

పరిమితో మొన్న పెళ్ళిలో (జూన్ 8న) 'నాకో ఆలోచన కలిగింది. నేను 'జీవన వికాస విద్యావనం'లో వచ్చి ఉండిపోదాం అనుకుంటున్నాను. మీరూ ఆలోచించండి' అనటం జీవన వికాసం విద్యావనానికి చలసాని ఆశీర్వచనమే.

అమెరికాలో ఉన్నవాడు చలసాని మరణం విషయం తెలిసిన వెంటనే ఫోన్ చేశాడు. ఎప్పుడు, ఎలా జరిగిందని అడిగాడు. వాళ్ళిద్దరూ ఏ మాట్లాడుకునే వారో చెప్పాడు. చలసాని నాకు ఎప్పుడు ఫోన్ చేసినా అరుణ్, శశి క్షేమ సమాచారం అడిగేవారు.

చలసాని చలనశీలి అంటూ, అతను గొప్ప హాస్య ప్రియుడని ఆయన స్నేహితుడు పిచ్చి బాబి (ప్రొఫెసర్ బాబయ్య, బెంగుళూరు) అరగంట సేపు ఫోన్లో మాట్లాడాడు. వాళ్ళు చేసిన అల్లరి, చిలిపి చేష్టల గురించి చెప్పాడు. ఒకసారి కలకత్తా వెళ్ళారట. కలకత్తాలో కాళీమాత విగ్రహాన్ని చూడడానికి పోయారు. కలకత్తా కాళీమాత విగ్రహంలో ఆమె నాలిక ఎర్రగా ఉండేదట. అది తెల్లగా మారిందని గమనించారు. అక్కడ ఉన్న దేవాలయ సంరక్షకులతో తెలుసు కుందామని ప్రయత్నించారు. ఎర్రని రంగు తెల్లగా ఎలా మారిందో వాళ్ళు చెప్పలేదట. వారిలో గొడవ పడ్డారు. వారి భాష తెలియక వారు చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందలేదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కమ్యూనిస్టులు ఎర్ర రంగు తుడిచేసుకుని తెల్లరంగు వేసుకున్నట్టే కాళికామాత నాలిక రంగు కూడా మారిందని నవ్వుకున్నారట. ఒకసారి ఇద్దరూ కలిసి పాట్నా వెళ్ళారట. సాయంత్రం గంగానదిలో స్నానానికై వెళ్లారు. చలసానికి ఈత కొట్టడం చాలా ఇష్టమని పిచ్చి బాబీ చెప్పాడు. నదిలోకి దిగారు. బాబయ్య గట్టునుంచి కొంచెం దూరంలో ఉన్నాడు. చలసాని చాలా దూరం వెళ్ళిపోయాడు. బాబయ్య స్నానం చేస్తున్న చోటు శవాలు తగిలాయట. భయం వేసి చలసానిని రమ్మని కేక వేశాడు. విషయం చెప్పగానే చలసాని పగలబడి నవ్వి 'శవాలు తగిల్తే ఏమిటి? బయట బతికున్న శవాలు చాలా ఉన్నాయం'టూ, నవ్వుతూ మళ్ళీ ఈదటం ప్రారంభించాడని చెప్పాడు. చలసాని గురించిన చాలా విషయాలు చెప్తూనే నవ్వుతున్నాడు, ఏడుస్తున్నాడు పిచ్చి బాబీ. చాలా సేపు మాట్లాడి 'చలసాని ఎక్కడికీ పోలేదు. వాడు ఇక్కడే ఉన్నాడు. మనతోనే ఉన్నాడని' ఫోను పెట్టేశాడు.

మా ఇంటికి వచ్చి ఒక వారం రోజులుండమని చలసానిని చాలా సార్లు అడిగాం. 'నేను బెంగుళూరుకి వెళ్ళాలి. అక్కడ చాలా పనులున్నాయి. బాబి దగ్గర కూడా ఉండాలి కదా. మీ దగ్గర మూడు రోజులుంటా' అన్నారు. మా ఇంటికి రాకుండానే వెళ్ళిపోయారు.

విప్లవ సిద్ధాంతాన్ని, రాజకీయాలను ఒడపోసి ఉపన్యాసాలు ఇచ్చేవారున్నారు. వాటి గురించి ఏమీ తెలియకుండానే ఉద్యమం ఇచ్చే ప్రేరణతో విప్లవ బాట పట్టిన వారున్నారు. ఉద్యమంలో చేరి పరిణతి పొందిన వారున్నారు. బయట మేము విప్లవకారులమంటూ ఒక ప్రత్యేక తెగలాగా ఇతరులతో కలవకుండా కాలం గడిపే వారున్నారు. భిన్న రాజకీయాలున్న వ్యక్తులతో పరిచయం అన్నా, మాట్లాడాలన్నా ఇష్టపడని వారున్నారు. అందరిలో కలిసిపోతే అనుమానపడే వారున్నారు. ఈ జాడ్యాలన్నింటినీ అధిగమించి స్వచ్ఛంగా, నూతన మానవుడిగా చలసాని సంతృప్తికరంగా జీవించారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవడం, ఆచరించడం అంత సులభం కాదు. అది కొంత మందికే సాధ్యం.



చలసాని ప్రసాద్ వ్యక్తిత్వం -సాహిత్యం

కాత్యాయనీ విద్మహే

చలసాని ప్రసాద్ స్నేహ వాత్సల్య పరివేషంలో ముప్పై అయిదేళ్లుగా పరిభ్రమిస్తూ, పరిమళమై కమ్ముకున్న ఆయన సాంస్కృతిక వ్యక్తిత్వ మేరు నగ సౌందర్యానికి, ఔన్నత్యానికి అబ్బుర పడుతూ, ప్రభావితమవుతూ వస్తున్ననేను జూలై 25న (2015) శ్రీకాకుళం నుండి మా చెల్లెలు మైథిలి ఫోన్ చేసి ఆయన మరణించారన్నవార్త చెప్పినప్పుడు పెద్ద దిక్కును కోల్పోయిన పెద్ద బాధకు లోనయ్యాను. విశాఖ పట్నం అంటే ప్రసాద్ కదా!సముద్రం లేని విశాఖను ఊహించటం కష్టం గా అనిపించింది.

ఈ సంవత్సరం లో రెండు సార్లు- మార్చ్ 5న ఒకసారి, ఏప్రిల్ 11 న మరొకసారి విశాఖవెళ్లి ప్రసాద్ గారిని కలిసాను. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో తెలంగాణా సాహిత్యం పై ఉన్నప్రాజెక్ట్‌కు సేకరించాల్సిన పుస్తకాల కోసం మీ లైబ్రరీ చూడాలి రానా అని ఫోన్ చేసి అడిగితే భలే దానివే నన్నడగాలా? ఈ మర్యాదలు ఎక్కడ నేర్చావ్ అని కోప్పడి, వస్తున్నానని చెప్పాలి వచ్చెయ్యాలి అంతే ఎప్పుడైనా నువ్విక్కడికి రావచ్చు అన్నారు. ఇది మర్యాద కొరకు అడగటం కాదు, ఆ రోజుల్లో మీరుంటారో లేదో తెలుసుకోటానికి అడిగానని నేను ఎంత చెప్పాల్సి వచ్చిందో ... అయిదో తారీకున మల్లీశ్వరితో కల్సి వెళ్లాను. మొహమంతా పాకే నవ్వుల వెన్నెల పలకరింపుతో ఏకకాలం లో నన్ను మల్లీశ్వరిని చెరొక చేత్తో దగ్గరకు తీసుకొని ఈ మల్లిగాడి తో ఎలావేగుతున్నావ్ అంటూ మల్లీశ్వరి సహచరుడు చందూను పలకరించి, ఇదిగో నీకు కావలసిన తెలంగాణ పుస్తకాలన్నీ ఇక్కడే ఉన్నాయి అని ఆ వరండా గదిలోనే ఒక బీరువా నాకు చూపించాడు. పుస్తకాల కోసం మేడమీది లైబ్రరీలో వెతుక్కొనటానికి సిద్ధమై ఉన్న నేను మొత్తం తన లైబ్రరీ లోని తెలంగాణ పుస్తకాలన్నీ ఈ కింద బీరువాలోకి చేర్పించాడని తెలిసి ఆశ్చర్య పోయాను. ఇప్పుడివే కదా అందుబాటులో ఉండవలసినవి అని అన్నాడు. అదీ చలసాని ప్రసాద్ అంటే. సమకాలపు చరిత్ర గతి క్రమాన్నిగమనిస్తూ ప్రగతి శీల శక్తుల వైపు ఉండటానికి తనను, తన అధ్యయనాలను ఎప్పటికప్పుడు సంసిద్ధం చేసుకొనటంలో ఒక ఆదర్శ నమూనా ప్రసాద్. అపురూపమైన అరుదైన పుస్తకాలు నేనక్కడి నుండీ తెచ్చుకొన్నాను.

రెండవసారి వెళ్లిందీ అదే పని మీద. ఈ సారి నాతో నా సహచరుడు వెంకటేశ్వర్లు ఉన్నాడు. ఆ రోజు సంభాషణలో అరుణతార పత్రిక టైటిల్ విరసానికి తాను ఎలా సాధించుకు వచ్చిందీ చెప్పుకు వచ్చాడు.

ఆ తరువాత నేను పుస్తకాలు చూసుకొంటూ ఉంటే చలసాని వెంకటేశ్వర్లుతో మాట్లాడుతూ కూర్చున్నాడు. ఏం మాట్లాడుకున్నారు మీరిద్దరూ అని కుతూహలం కొద్దీ నేను ఆ తరువాత వెంకటేశ్వరును అడిగాను. సమాజం లో రోజు రోజుకీ పెరిగిపోతున్న ఆర్థిక మోసాలు, నేరాల గురించి తమ సంభాషణ మొదలైందని, ప్రైవేట్ ప్రాపర్టీ స్వభావమే అది అంటూ ఒక చిన్నపిట్ట కథ చెప్పి ప్రైవేట్ ప్రాపర్టీ ని మనం చంపక పోతే అది మనల్ని చంపుతుందని ప్రసాద్ చెప్పాడని తను నాతో చెప్పాడు. మెలకువలోనూ నిద్ర లోనూ సభలలోనూ సాధారణ సంభాషణలోనూ కూడా వర్గ సమాజానికి మూలమైన ప్రైవేట్ ప్రాపర్టీ గురించిన నిత్య జాగరూకత, వ్యక్తిగత ఆస్తిని రద్దు చేసేఉద్యమాభినివేశం చలసాని వ్యక్తిత్వం లో ఎంత సహజం గా ఇమిడిపోయి ఉన్నవో కదా అని అనుకున్నాను.

అదే ప్రసాద్‌తో నా చివరి కలయిక అవుతుందని ఆ నాడు నాకు తెలియదు. ఎన్నిసార్లో చలసాని దగ్గరకు వెళ్ళాను కానీ ఫోటోలు తీయించు కుందామన్నఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు. అప్పుడు మాత్రం ఎందుకో చలసాని, వెంకటేశ్వర్ల పక్కపక్కన కూర్చుని ఉంటె నేను కూడా వెళ్లి వాళ్ళ సరసన కూర్చుని ఫోటో తీయించుకున్నాను. మూడు నెలలు తిరిగే సరికి, నాకు తన ఆత్మీయ

ప్రపంచంలోచోటు ఇచ్చి, కనిపెట్టుకొని ఉండి, కర్తవ్యాలను గుర్తు చేస్తుండే అత్యంత స్నేహశీలి, అచ్చమైన మరో ప్రపంచపు మనిషి అవిశ్రాంత అధ్యయన పరుడు, విప్లవోద్యమ పథికుడు అయిన చలసానిని మాటా పలుకూ లేకుండా గాజు పెట్టెలో మౌన ముద్ర లోఉండగా చూడాల్సి రావటం కన్నా మించిన దుఃఖం ఏముంది?

1

1978 జగిత్యాల జైత్రయాత్ర తరువాత వరంగల్ ఒక ఉజ్వల విప్లవ పోరాటానికి సైద్ధాంతిక సాంస్కృతిక సంభాషణకు, నిర్మాణానికి కేంద్రం అయిన కాలంలో నాకు పరిచయమై, నన్ను నడిపించిన వ్యక్తులలో చలసాని ప్రసాద్ ఒకరు. జగిత్యాల జైత్రయాత్రకు పురిటి నొప్పులు పడుతున్న ఉత్తర తెలంగాణ ఉద్విగ్న సందర్భంలో నేను 1977లో తెలుగు ఎమ్మే పూర్తి చేసుకొని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరాను. అక్కడ విద్యార్థులు నాకు అధ్యాపకులై సామాజిక పరిణామాల వైపు నా చూపు తిప్పారు. సామాజిక వైరుధ్యాలను గురించిన తపన వేదన రగిలించారు. అది నన్ను మార్క్సిస్టు సైద్ధాంతిక సృజన సాహిత్య అధ్యయనం వైపు, ఊళ్ళో తత్సంబంధమైన సభలు ఏవి జరిగినా హాజరై వినటం వైపు నన్ను తరిమాయి. అట్లాగే నేను 1979 లో వరంగల్‌లో జరిగిన విరసం సాహిత్యపాఠశాలకు హాజరయ్యాను. అక్కడే మొదటిసారి చలసాని ప్రసాద్ ను చూసాను. విరసం రచయితలకు కథ గురించి ఆయన పాఠం చెప్తుంటే ఆసక్తిగా విన్నాను. కథ, నవల నాకు ఇష్టమైన ప్రక్రియలు. ఆ ఇష్టం తోటే 'చివరకు మిగిలేది' నవలపై పరిశోధన మొదలుపెట్టాను. ఆ దశలో చలసాని ప్రసాద్ ఉపన్యాసం కథ నవలల అధ్యయనానికి నాకు ఒక దిక్సూచీ అయింది.

చలసాని ప్రసాద్‌తో నా అనుబంధం గురించి మా నాన్న రామకోటి శాస్త్రి ప్రసక్తి లేకుండా మాట్లాడటం అసాధ్యం. ఎందుకంటే వాళ్ళిద్దరిదీ అంత చిక్కటి సన్నిహిత స్నేహం. ప్రారంభంలో నాన్నదీ ఆయనదీ గురుశిష్య సంబంధం. చలసాని గుడివాడ ఎ ఎన్నార్ కళాశాలలో బిఏ చదువుతున్న 1953-1955 కాలంలో నాన్న అక్కడ తెలుగు లెక్చరర్‌గా చేరాడు. ఆయనతో పాటు జూనియర్‌గా ఉన్న సత్య మూర్తి, ఇంటర్ చదువుతున్న త్రిపురనేని మధుసూదన రావు నాన్నకు అక్కడ విద్యార్థులే. నాన్న పాఠం చెప్పిన తీరును వాళ్ళు ఎంత ఆనందించారో విద్యార్థులతో నాటకాలు వేయించే నాన్నకు అంతగా సన్నిహితులు అయ్యారు. వాళ్ళు ఏ వామపక్ష భావజాలంతో విద్యార్థి సంఘాలలో పని చేస్తున్నారో ఆ భావజాలాన్ని అంత సానుభూతితోనూ అర్థం చేసుకొనే ప్రయత్నం నాన్న చేసాడు. వాళ్ళతో కలిసి ఏటుకూరి బలరామమూర్తి గారి తత్వ శాస్త్ర పాఠాలు వినటం వరకూ నాన్న వాళ్ళతో ప్రయాణించాడు. ఆ నాటి ఆ సంబంధాన్ని 50 వ దశకపు రెండవ భాగంలో హైదరాబాద్‌లో నాన్నను వెతికి పట్టుకొని 'అభ్యుదయ' పత్రిక కు చందా కట్టించి చలసాని పునరుద్ధరించాడు. 'విరసం' దశకంలో ఇద్దరి మధ్య మళ్ళీ సంభాషణ మొదలైంది. విరసం కేంద్రంగా ఉద్దేశాలను, ఉద్వేగాలను కలబోసుకొనటం 80 వ దశకంలో ముమ్మరమైంది. జీవితకాలం కొనసాగింది.

1979 విరసం సాహిత్య పాఠశాలలో కలసిన ప్రసాద్‌తో నా సాన్నిహిత్యం కూడా ఆ క్రమంలోనే పెరుగుతూ వచ్చింది. ఆయన నన్ను చెల్లెలు అనుకున్నాడు. కలిసినప్పుడు ఏరా, ఏమ్మా అన్నవి పలకరింపు సంబోధనలు కాగా ఉత్తరాలు మాత్రం చెల్లీ అనో చెల్లాయ్ అనో సంబోధిస్తూ రాసేవాడు. కింద నీ అన్న ప్రసాద్ అని సంతకం చేసేవాడు. మా అనుంగు చెల్లాయ్ కాత్యాయని కి అని రాసి తాను నాకు ఇచ్చిన 'చలసాని ప్రసాద్ రచనలు' పుస్తకం నాకు ఎప్పటికీ అపురూపమే. ఈ ముప్పై ఆరు సంవత్సరాల స్నేహ సంబంధాల నుండి నాకు ఆయన సాంస్కృతిక వ్యక్తిత్వం కొంతవరకు తెలుసు. జూలై 25 న ప్రసాద్ మరణించినది మొదలు ఈ ఇరవై అయిదు రోజులుగా ఆయన సాహిత్యం రెండు సంపుటాలు చదువుతూ వచ్చాను. వీటిలో కొన్ని ఇదివరకు పత్రికలలో, పుస్తకాలలో చదివినవే అయినా అన్నీ కలసి ప్రసాద్ సాహిత్య గుణం ఏమిటో నాకు తెలియ చెప్పాయి. 2008 సెప్టెంబర్ 8న నాకు రాసిన ఉత్తరం లో 'మనది సాహిత్య సామాజిక ప్రపంచం. సాంస్కృతిక సముద్రం. అలసట ఎరగకుండా నిలువీత ఈదుదాం' అన్నాడు ప్రసాద్. ఆ నిలువీత గాడికి నివాళిగా ఆయన సాంస్కృతిక వ్యక్తిత్వం నుండి, సాహిత్య కృషి నుండి మనం పొందవలసిన స్ఫూర్తి గురించి మాట్లాడుకుందాం.

2

చలసాని ప్రసాద్ పుస్తక ప్రేమికుడు. జీవితాన్ని, మనుషులను ప్రేమించిన వాళ్ళు పుస్తకాలను ప్రేమించకుండా ఉండలేరు. పుస్తకం అంటే మనుషుల అనుభవాల, భావోద్వేగాల, భావజాల సంఘర్షణల చరిత్రే కదా! మనిషి తనకున్న స్థల కాల జీవిత పరిమితులను అధిగమించి విశ్వ మానవులతో సంభాషించటానికి, తన కాలాన్ని అర్థం చేసుకొనటానికి, అర్థవంతం చేసుకొనటానికి పుస్తకం నేస్తం అవుతుందని తెలిసిన ప్రసాద్ వెతుకులాట, కలవరింత పుస్తకమే అయింది. మా నాన్నకు రాసిన ఉత్తరాలలో నైనా, నాకు రాసిన ఉత్తరాలలో నైనా ఏదో ఒక పుస్తకం పేరు చెప్పి సంపాదించి పంపమనో, ఫలానా పుస్తకం చూసారా అనో, ఈ పుస్తకం చదవండి అనో తరచూ సూచనలు, హెచ్చరికలు ఉండేవి. ప్లెఖనోవ్ సాహిత్య విమర్శ రచనల నుండి విశ్వనాథ సత్యనారాయణ రచనల వరకు ఆయనకు అక్కరలేని పుస్తకం లేదు. చదవని పుస్తకం లేదు. ప్లెఖనోవ్ 'ఆర్ట్ అండ్ సోషల్ లైఫ్' పుస్తకం, అందులో అందం గురించి చారిత్రక సామాజిక కోణాల నుండి విస్తృతంగా ఆయన చేసిన చర్చ చలసానికి చాలా ఇష్టం. నాన్నకు, నాకూ కూడా అది చదవమని ఆయన ఉత్తరాలలో రాసాడు. 1996 లో బెంగుళూర్ లో అందాలపోటీల కు వ్యతిరేకంగా దేశమంతటా వెల్లువెత్తిన ప్రజా ఉద్యమ సందర్భంగా జ్యోతిరాణి, శోభ లతో కలసి రాసి ప్రచురించిన 'అందాలపోటీలు - అవగాహన పత్రం' చదివి మమ్మల్ని అభినందిస్తూరాసిన ఉత్తరం (2 మే 97) లో ప్లెఖనోవ్ అందం గురించి రాసినదానిని ప్రస్తావించి 'మీరు ముగ్గురూ చదివి తీరాలి. మీరు చదవకపోతే నాకు నిద్రపట్టదు. వెలితిగా ఉంటుంది సరేనా?' అని చెప్పాడాయన. సామాజిక అవసరాలు, ప్రయోజనాల రీత్యా సాహిత్య సంభాషణను ఒక బాధ్యతగా మలచుకొన్న కార్యకర్త ప్రసాద్.

వాత్స్యాయన కామసూత్రాలు, మనుస్మృతి వంటి ప్రాచీన రచనలు కూడా వాటికి ఉన్న సామాజిక ప్రాధాన్యత దృష్ట్యా చదవవలసిన పుస్తకాలని ఆయన అభిప్రాయం. ఆవిషయంలో కూడా మేము ఇచ్చిపుచ్చుకున్నవి ఎన్నో ...! కమ్యూనిస్ట్ రాజకీయాలలో

పుట్టి పెరిగి, కాలం తో పాటు కదులుతూ, కొత్త నిర్మాణాలను ఆహ్వానిస్తూ విరసం ఏర్పాటులో ముందుబడి పనిచేసిన చలసాని ప్రసాద్ చివరి వరకూ విరసం కార్యకర్తగా తన ప్రథమ ప్రాధాన్య రంగం సాహిత్యం అన్నట్లుగా పనిచేసాడు. విరసం తెలుగు సాహిత్యానికి కొత్త రక్తం, కొత్త చూపు ఎంతగా ఇచ్చాయో చెప్పటం పైనే కాక విరసానికి బయట వస్తున్న సాహిత్యాన్ని విరసం ప్రయోజనాల రీత్యాఅధ్యయనం చేసి అంచనా వేయాల్సిన అవసరాన్ని గుర్తించి చెప్పిన వాడు చలసాని. ఆ చారిత్రక దృష్టి కారణం గానే ఆయన ఒకవిధమైన సాహిత్య సంచయన వ్యసనంతో బతికాడు. పుస్తకాల కోసం స్నేహం చేసాడు. తన స్నేహ సంబంధాల ద్వారా పుస్తకాలు సంపాదించాడు. ఆయన ఇల్లోక పుస్తక సముద్రం. సముద్రాన్ని ఔపోసన పట్టిన అగస్త్యుడిని మించి జ్ఞాన చైతన్యాల వికాసానికి ఉమ్మడి వనరుగా దానిని వినియోగంలోకి తెచ్చాడు.

తెలుగు సాహిత్య అధ్యయన పరిశోధనల గురించి ఒక స్పష్టమైన దృక్పథం మాత్రమే కాదు, ఒక నిర్దుష్ట కార్యక్రమం కూడా ఉంది చలసానికి. అధ్యయనాలకు పరిశోధనలకు కేంద్రాలు విశ్వవిద్యాలయాలు కనుక ఆ కేంద్రాలను గురి చూసి నిశ్శబ్దంగా ఆయన చేసిన పని చిన్నది కాదు. నా దగ్గరి నుండి నా దగ్గర పరిశోధన చేసిన విద్యార్థుల వరకు ఎందరికో ఆయన అవసరమైన సలహాలు, సూచనలు సమాచారం ఇచ్చి సహాయం చేసాడు. నేను బుచ్చిబాబు చివరకు మిగిలేది నవలపై పరిశోధన చేస్తున్నప్పుడు బుచ్చిబాబు కు సంబంధించిన పుస్తకాలు పేపర్ల ప్రసాద్ లైబ్రరీ నుండి ఎన్ని వాడుకున్నానో...! బుచ్చిబాబు అభిమాని, గొప్ప పరిశోధకుడు అయిన బంగోరె (బండి గోపాలరెడ్డి) అప్పుడు విశాఖలో ఉంటే ఆయనతో నాకు ఇంటర్వ్యూ ఏర్పాటు చేయటానికి ఎన్ని ప్రయత్నాలు చెసాడో ...! కానీ ప్రసాద్ కు దొరక కుండా బంగోరె ఎక్కడెక్కడో తిరుగుతూ సట్లెజ్ నదిలో దూకి మరణించటం తో నాకు ఆయనను ఇంటర్వ్యూ చేసే అవకాశం దొరకలేదు. అది వేరే విషయం.

నా దగ్గర రాచకొండ విశ్వనాథ శాస్త్రి బుక్కులు కథల పై ఎమ్.ఫిల్‌కు పరిశోధన చేసిన(1989) మార్క యాదయ్య ను ఆదరించి తన ఇంట్లో ఉంచుకొని చర్చలతో అతని అవగాహన ను మెరుగు పరచటమే కాదు, రావిశాస్త్రి తో ఇంటర్వ్యూకు ఏర్పాటు చేసి మూడుగంటలు కదలకుండా కూర్చుని రావి శాస్త్రి మంచి ఇంటర్వ్యూ ఇచ్చాడని మురిసాడు చలసాని. ఆ తరువాత అతను 'రావిశాస్త్రి నవలలు- రాజకీయార్థిక దృక్పథం'అనే అంశం మీద పిహెచ్.డి.కి పని చేస్తుంటే ఎలా చేస్తున్నాడు, యాదయ్యా కు రాజకీయ అర్థ శాస్త్రం ఒంట బట్టిందా అంటూ విచారిస్తూనే ఉన్నాడు. రావిశాస్త్రి అంటే ఆయనకు ఇష్టం కదా అందువల్ల యాదయ్యా పనిలోఇలా ఆసక్తి చూపాడు అనుకోనటానికి వీల్లేదు. ఏదైనా అధ్యయనం అంటే ఆయనకు ఇష్టం. ఆ అధ్యయనాలు సమగ్రంగా, శాస్త్రీయంగా ఉండాలన్నది ఆయన తపన. అందువల్ల ఈ అంశం మీద పరిశోధన చేస్తున్న వాళ్ళయినా ఆయన చెవిన ఆ విషయం వేస్తే చాలు. వాళ్ళు మరచిపోయినా తాను గుర్తుంచుకొని ఆ అంశానికి సంబంధిన సమాచారం ఏది తనకు దొరికినా వాళ్లకు చేరవేయటం ఆయన ప్రవృత్తి అని నాకు చాలా సందర్భాలలో అర్థం అయింది.

నాన్నకు రాసిన ఉత్తరాలలో తెలుగు సాహిత్యంలో మనపరంగా మనం ఇంకా చాలా కృషి చేయవలసి ఉంది అంటూ తన ఆరాటాన్ని తరచు వ్యక్తం చేసేవాడు. చేయవలసిన పరిశోధనల గురించి నిర్దుష్టం గా కూడా సూచించటం, పరిశోధనలకు రెచ్చగొట్టే ప్రశ్నలు వేయటం ఆయన లోని విశిష్టత. తెలుగు కథ కవిత ఎప్పటికప్పుడు సమాజంతో పాటు, ఒక్కొక్కప్పుడు ముందుగా కూడా నడిచాయి... నవల ఎందుకు వెనుక బడిందో తరచి చూడాలని రాసాడు. విశ్వనాథ వచన సాహిత్యాన్ని బాగా అధ్యయనం చెయ్యాలని పదేపదే చెప్తూ వచ్చాడు. విశ్వనాథ రాసిన 'పరీక్ష' నవలను కొడవటిగంటి రాసిన 'చదువు' నవలతో పోల్చి చూడాలని, వేయిపడగలు, వీరవల్లడు ప్రత్యేక శ్రద్ధతో చూడాల్సిన నవలలని సంప్రదాయ దృష్టితో రాసినా వాటిల్లో వలస వ్యతిరేకత, గ్రామీణ జీవిత చిత్రణ తరచి చూడవలసినవని చెప్తూ విశ్వనాథ ప్రోజ్ మీద గట్టిగా దిట్టంగా పరిశోధన చేయించమని రాస్తుండేవాడు.

విశ్వనాథ రచనల మీద పరిశోధనలు చేయించమని ఇంతగా నాన్న వెంట పడ్డందుకు చలసానిని విశ్వనాథ అభిమాన సంఘంలో చేరిపోయాడనో, విశ్వవిద్యాలయాల మీద భ్రమలు పెంచుకొన్నాడనో, విరసం ప్రణాళిక కు భిన్నంగా పోయినాడనో ఎవరైనా సంబర పడి విమర్శించవచ్చు. కానీ అది సాహిత్యంలోగుడ్డి ఆరాధన, సంపూర్ణ తిరస్కారం రెండూ సరిఅయినవి కావు అన్న ఆయన అవగాహనకు, వస్తుగత విమర్శ దృష్టికి సంబంధించిన విలువల వ్యక్తీకరణ అని, సారం లో విరసం సంస్కృతి అని నిదానించి చూస్తే ఎవరికైనా అర్థం అవుతుంది. త్రిపురనేని మధుసూదనరావు రాసిన 'విశ్వనాథ తిరోగమన సాహిత్యం' పుస్తకానికి రాసిన ముందుమాట (1995) ఇందుకు నిదర్శనం. విశ్వనాథ ను ఎందుకు చదవాలో, ఎందుకు ఖండించాలో ఇందులో స్పష్టంగా చెప్పాడు చలసాని. జీవిత చిత్రణ వలన పాలనలోని ఫలితాలు, మనవ్యవస్థలోని మెట్టపల్లాలు, వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు తెలుసు కొనటానికి అయన నవలలు చదవాలని, అటు సాహిత్య విమర్శ కోసం, ఇటు సాహిత్య చరిత్ర కోసం ఆయన నవ్యసాహిత్య పరిషత్తు అధ్యక్షోపన్యాసం (1940), సాహిత్యరూపకాలు తప్పకుండా చదవాలి అంటాడు. అదే సమయంలో జాతీయత నుండి ఫాసిసజానికి ప్రయాణం చేసినందుకు, కొత్తని కాలదన్ని పాతను నెత్తిన పెట్టుకున్నందుకు, అన్ని రకాల అసమానతలను సాంద్రీకరించే భావజాల ప్రచారానికి తన సాహిత్య శక్తిని మీదు కట్టినందుకు అంతే నిష్కర్షగా విశ్వనాథను తిరస్కరించాడు. మనం పద్య వ్యతిరేకులం కాము (2-2-94 ఉత్తరం) అంటూనే పద్య పునరుద్ధరణ వెనకాల ఉన్నది మాత్రం కోటి నాగుల విషసంస్కృతే అని చెప్పగలగటం ఆ రకమైన నిశిత పరిశీలన వల్లనే సాధ్యం అయింది. రూపం దానంతట అది పేచీ పడవలసిన అంశం కాకపోవచ్చు కానీ భావజాలం విషయంలో ఎంత హెచ్చరికతో ఉండాలో, స్వీకరించటానికి అయినా తిరస్కరించటానికి అయినా ఎంత అధ్యయనబలం కావాలో ప్రసాద్ ఎప్పటికప్పుడు నిరూపిస్తూ వచ్చాడు.

విశ్వవిద్యాలయ పరిశోధనల లో ఈ వస్తుగత విమర్శ భాగం కావాలన్న తపనతోనే దొరికిన ఏ చిన్న అవకాశాన్నయినా ఆయన వదులుకోలేక పోయాడు. యూనివర్సిటీలో చేయించవలసిన

పరిశోధనల గురించి చలసాని ఇంతగా నిరంతర సంభాషణ సాగించింది అయినా, పరిశోధక విద్యార్థులను అంతగా ఆదరించినది అయినా జ్ఞాన కేంద్రాలలో విప్లవానుకూల పవనాలకు కిటికీలు తెరవటానికే. విప్లవ సాహిత్య సంస్కృతీ బీజాలను వెదజల్లటానికే.

పరిశోధనలో చారిత్రకతకు ప్రసాద్ చాల ప్రాధాన్యతను ఇస్తాడు. ఒకసారి తేదీ వెయ్యకుండా ఉత్తరం రాసానని కోప్పడుతూ రాసిన ఉత్తరంలో ఆయన 'నీ డేట్ లెస్ లెటర్ చూసి నీ మీద చిరు కోపం వచ్చింది. డేట్స్ చరిత్ర సారం కాదు కాని, చరిత్ర రూపానికి వాటి అవసరం చాలా ఉంది' అని రాసాడు. ఉత్తరం విషయంలోనే ఇంత పట్టింపు ఉన్న ప్రసాద్ పరిశోధనల సంబంధంలో చరిత్ర గురించి పట్టింపుతో ఉండటంలో ఆశ్చర్యం ఏముంది? 1994లో 'ప్రజా సాహితి'లో నేను చలంపై రాసిన వ్యాసం చదివి నేపథ్యం బాగా వివరించావ్ అంటూనే ఒకటి రెండు అంశాలు సరిచూసు కోమని ఆయన సూచించినవి చరిత్రకు సంబంధించినవే.

చివరిసారి నేను ఆయన ను కలసినప్పుడు బందగీ చనిపోయిన తేదీ తెలుసా నీకు అంటూ ఎంతసేపు మాట్లాడాడో ... 1955 ఎన్నికల చరిత్ర చెప్పాలన్నా, విరసం చరిత్ర చెప్పాలన్నా ఎంత ఉత్సాహమో ... జీవితకాలం చరిత్ర కు కాపలా కాసిన అరుదైన వ్యక్తిత్వం ప్రసాద్‌ది.

విరసం పనులను విస్తరించటంలో, విరసం పనులలోకలసివచ్చే మనుషులపట్ల ఇష్టాన్ని చూపటంలో, విరసం లక్ష్యాలకు తగిన పనులు చేసే వాళ్లకు అండగా ఉండటంలో ప్రసాద్ నిత్యోత్సాహి. నాన్నను విరసానికి అవసరమైన మనిషిగా గుర్తించి ఆంతర్యంలోకి తీసుకున్నాడు. విరసం ప్రచురించాల్సిన, ప్రచారం చేయవలసిన పుస్తకాల గురించి నాన్న తో నిరంతర సంభాషణలు చేసాడు. 'మరీ మరీ మనం మనం ఒక్కటై పోతున్నాం' (6-7-1981) అని భావసారూప్యతకు సంతోషపడి పోయేవాడు. శ్రీశ్రీ పుస్తకాల ప్రచురణ ఆలోచనను తనబుర్రలో ప్రవేశపెట్టింది మీరే అంటూ దానిని వాస్తవీకరించటానికి తాను పడ్డ తపన, ప్రయత్నం ప్రతిదీ నాన్నతో పంచుకున్నాడు. ఒక్కొక్క పుస్తకం వచ్చినప్పుడల్లా చిన్నపిల్లవాడిలా మురిసిపోతూ నాన్నకు రాసే వాడు. 'మనది ఉమ్మడి కృషి' (19-11-85) అని, 'మన గమ్యం ఒకటే కలిసే ప్రయాణం చేద్దాం' (12-12-1985) అని ఉద్విగ్నుడయ్యే వాడు.

వరంగల్ మిత్రుల నుండి శ్రీశ్రీ ప్రచురణలకు చందాలు కట్టించి, ఒక్కొక్క పుస్తకం వచ్చినప్పుడల్లా వాళ్లకు అందచేసే బాధ్యత తీసుకున్న నాన్న 1991 అక్టోబర్‌లో మరణిస్తే ఆ తరువాత ఆ బాధ్యత నేను తీసుకున్నందుకు సంతోష పడ్డాడు. మనం అని ఉభయాత్మక సంబోధన తప్ప మేము, మీరు అన్న వేర్పాటు మాట నేనెప్పుడు ఆయన నోట వినలేదు. ఉత్తరాలలో చూడ లేదు. 1994 లో ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు విభాగం పింగళి లక్ష్మీకాంతం గారి శతజయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఉపన్యాస కార్యక్రమాలలో భాగంగా నన్ను విప్లవ కవిత్వం మీద మాట్లాడ మన్నారు. నేను దానికి సిద్ధమవుతూ ఇక్కడ నాకు దొరకనివి ప్రసాద్ గారి లైబ్రరీలో చూసుకొని దానిని సమగ్రం చేసుకోవాలనుకొని ఒక రోజు ముందు వస్తానని చలసానికి రాస్తే 'విప్లవ కవిత మీద మన దగ్గర బోలెడు matter వుంది. సిద్ధంగా వుంచుతా. నువ్వొచ్చి కలుపుకుని ముద్దలు మింగటమే' అని తిరుగు సమాధానం రాసాడు. నేను, నాది అన్న భావనలను రద్దు చేసుకొంటూ బతకటం ఎట్లాగో అలవోకగా బతికి చూపిన మహా మనిషి చలసాని ప్రసాద్.

ప్రసాద్‌కు మనుషులపట్ల, అందులోనూ విరసం ప్రయోజనాలకు నిలబడే మనుషులపట్ల అంతు లేని ఆపేక్ష. అది ఆరాధన స్థాయిలో కనబడవచ్చు. కానీ విరసం విలువలు ప్రాతిపదికగా వాళ్ళపట్ల విమర్శనాత్మకంగా ఉండటంలో మాత్రం ఎక్కడా ఏమరుపాటు ఉండదు. సందర్భం ఏమిటో కానీ నాన్నకు రాసిన ఒక ఉత్తరంలో శ్రీశ్రీ ని చడామడా తిట్టివచ్చానని రాసాడు. నాన్న రాయప్రోలు మీద రాసిన వ్యాసం చదివి కంటెంట్ చక్కగా చిక్కగా వుంది అంటూనే ఇంకా మీరా గ్రాంథికం వదలరా? కనక form ఏమీ బాగోలా అని నిర్మొహమాటంగా రాసాడు. గ్రాంథికం నుంచి బయటకు రండి అని పిలుపు ఇచ్చాడు విమర్శించటమే కాదు విమర్శను స్వీకరించి ఆత్మవిమర్శతో తనను తాను నిర్మించుకొనే కమ్యూనిస్ట్ సంస్కృతి వంట బట్టిన వాడు ప్రసాద్. 1983 జనవరి 3న నాన్నకు రాసిన ఉత్తరం ఇందుకు నిదర్శనం. 1982 చివర సృజన లో అచ్చయిన ప్రసాద్ వ్యాసం లోని లోపాలను చూపిస్తూ నాన్న రాసిన ఉత్తరానికి జవాబు అది. మీరు పేర్కొన్న లోట్లు నా వ్యాసంలో వున్నాయి అని ఒప్పేసుకొని ఆదరాబాదరా హడావిడి గా ఆ వ్యాసం ముగించా. . సృజన స్థాయిలో ఆ వ్యాసం లేనందుకు చాలా సిగ్గుపడుతున్నా అని అంగీకరించాడు. మనస్ఫూర్తిగా తీరిక లేనిదే ఇక నుంచి ఏదీ రాయను అని తాను నిర్ణయం తీసుకున్నట్లు కూడా రాసాడు.

ప్రసాద్‌కు తెలంగాణ చాలా ఇష్టం. అందుకు 1947 నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతోనూ, ఆనాటి కమ్యూనిస్ట్ నాయకత్వంతోనూ తన కుటుంబానికి ఏర్పడిన గాఢమైన సంబంధ ప్రభావం కారణం కావచ్చు. 60 లలో కొంతకాలం వేరువేరు బతుకు తెరువులు చూసుకొంటూ వరంగల్, హైదరాబాద్ నగరాలలో ఉంటూ ఏర్పరచుకొన్న అనుబంధం కారణం కావచ్చు. వరంగల్‌లో కాళోజి తో పరిచయం కూడా అప్పటిదే. వరంగల్‌ను తలపుకు వస్తే ఆయన కవి అయిపోతాడు. 'దూరదూర తీరాలలో మేము ఓరుగల్లు దారుల్లో మీరు ... అంటూ కవిత్వంలోకి జారిపోతాడు (14-2-93) ఓరుగల్లుతో స్నేహ సంబంధాలు సరే, ప్రజాస్వామిక ఆకాంక్షగా ప్రత్యేక తెలంగాణ ఊసు గాలిలో వ్యాపించే నాటికే ఆయన దానికి మద్దతు పలికాడు. 1997లో వరంగల్‌లో జరిగిన చారిత్రాత్మక ప్రజా తెలంగాణ సదస్సుకు వచ్చాడు. 'ఓరుగల్లు పోరుగల్లు' అని గౌరవంతో అభిమానిస్తాడు. ఇక హైదరాబాద్ సంగతి సరే సరి. 1965 ల నాటి పాతబస్తీ కాపురం ఆయనకు ఒక చక్కటి జ్ఞాపకం. తన పెద్ద బిడ్డ నవత ను పాతబస్తీలో గొల్లలు, ముస్లిం రిక్షావాళ్ళు కలిసి పెంచారని చెప్పి 'మతసామరస్యం జీవిత వాస్తవం. మతవిద్వేషం పాలకుల సృష్టి' అంటాడాయన (14-6-91) నిజానికి ఆయన మూలాలు క్రిష్ణాజిల్లావి. విశాఖ కాలేజిలో ఉద్యోగం చేస్తూ ఉత్తరాంధ్రాను తనదిగా చేసుకొన్నాడు. 'ఉత్తరాంధ్ర ఉత్తేజం/తెలంగాణ మాగాణం / సుస్తీ పడ్డకోస్తా' అనగలిగిన వస్తుగత వర్గ చైతన్యం ఆయనది. కోస్తా తో వైరుధ్యాల విషయంలో ఆయన తెలంగాణ పక్షం. 'తెలంగాణకు నీరు లేకపోయినా

నోరుంది. ఉత్తరాంధ్రకు అదీ లేదు ఇదీ లేదు' అన్నది ఆయన బాధ. తెలంగణ ప్రత్యేక రాష్ట్ర భావన తోటి, ఉద్యమం తోటి ఆయన ఎంతగా మమేకం అయినాడంటే 2005లో నేను సాహిత్య అకాడెమీ కోసం రావిశాస్త్రి రచనల సంకలనం ఒకటి తయారుచేస్తూ ప్రసాద్ సలహా కోసం రాస్తే దానిలో తప్పని సరిగా రావి శాస్త్రి1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమం గురించి రాసిన వ్యాసం ఉండేట్లు చూడమని సూచించాడు. 2009 లోఆయన రాసిన 'మనకు మార్గదర్శి తెలంగాణ' అనే వ్యాసం తెలంగాణను భావోద్వేగాలతోనే కాదు భావజాలపరంగా కూడా ఎంతగా ఆయన స్వంతం చేసుకో గలిగాడో చూపిస్తుంది. 'తెలంగాణ ప్రజలు కష్టజీవులు, కర్షకులు, గని పనివాళ్ళు, తెలంగాణ చరిత్రనీ, మన దేశ చరిత్రనీ తిరగరాస్తారు' అని గొప్ప విశ్వాసంతో ప్రకటించాడు. తెలంగాణ సాహిత్యం విషయం లోనూ చలసానిది అదే విశ్వాసం. 1953 లో ఆరుద్ర దాశరథికి రాసిన ఉత్తరంలోని 'రానున్న పదేళ్ళలో తెలంగాణ సాహిత్య ప్రపంచానికి మార్గదర్శి అవుతుంది. తెలంగాణ నుండి భావి ఉద్యమాలు తలెత్తుతాయి. ననలెత్తుతాయి. కోస్తాజిల్లాలు సుస్తీ పడుతున్నాయి'. అన్న మాటలు అక్షర సత్యాలైనాయని దిగంబర కవులను, తిరగబడు కవులను, మార్చ్ కవులను ప్రస్తావిస్తూ 1971 లో ప్రసాద్ రాసిన 'ఈ తరం కవులు' వ్యాసంలో ఆ విశ్వాసాన్నే మనం చూడవచ్చు.

3

చలసాని ప్రసాద్ నిర్మించిన, నిర్వహించుకు వచ్చిన సాహిత్య సాంస్కృతిక సంబంధాలు తెలిసినంతగా ఆయన సాహిత్య కృషి గురించి పెద్దగా తెలియని మాట వాస్తవం.

శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు రచనల ప్రచురణను కృష్ణా బాయి గారితో కలిసి ఒక మహా యజ్ఞంగా నిర్వహించిన చలసాని రచనలు 2008 వరకు సంపుటంగా రానేలేదు. అప్పుడు వచ్చిన ఆ పుస్తకం 'సాహిత్యవ్యాసాలు' ఆతరువాత రెండేళ్లకు 2010 లో 'చలసాని ప్రసాద్ రచనలు' పేరుతో మరొక పుస్తకం వచ్చింది. మొత్తం 424 పేజీలు.

1932 లో పుట్టిన చలసాని ప్రసాద్ 1947 లో కవిత్వ రచనతో తన సాహిత్యరంగంలోకి ప్రవేశించాడు. పదిహేను ఏళ్ల నూనూగు మీసాల నూత్న యవ్వనం లో చాలా మందిలాగా ప్రేమ కవిత్వంతో ఆయన ప్రారంభం కాలేదు. 'ఓ విద్యార్థి సోదరుడా సమ్మెయే మన ఆయుధమోయ్'అంటూ ఒక నిశ్చితాభిప్రాయం తో 'హక్కులను పొంద గాను-ఒక్కటిగ అందరము /ఏక బాటనే సాగిపోదమూ' అని వ్యష్టిని సమష్టిగా పరివర్తింప చేసే కార్యక్రమంలోకి రమ్మని పిలుపునిస్తూ కవిత్వం లో తొలి అడుగులు వేశాడు. మళ్ళీ పదమూడేళ్ళ కు 1962 లో కవిత్వంలో మలి అడుగులు వేయటమే కాక వ్యాస రచన ప్రారంభించాడు. ఆ సంవత్సరం ఆయన రాసిన వ్యాసాలు రెండు. అవి ఒకటి 'గోపీచంద్ జ్ఞాపకాలు', మరొకటి 'తెలుగు సినిమాలు- కథల చిత్రీకరణ' మొదటిది దానంతట అది స్వతంత్రం. రెండవది కులగోత్రాలు సినిమా మీద కొడవటిగంటి రాసిన సమీక్ష పై ప్రతిస్పందన. ఎనిమిదేళ్ళవిరామం తరువాత 1971 నుండి విరసం సంస్థాగత అవసరాలలో, చరిత్రలోభాగంగా ప్రసాద్ సాహిత్య ప్రస్థానం అలుపెరుగక సాగింది.

చలసాని ప్రసాద్ సాహిత్య రచనలలో వివిధ వ్యక్తులకు సంబంధించిన జ్ఞాపకాలు ప్రత్యేకమైనవి. అవి ఆయనకు వున్న విస్తృత స్నేహ సంబంధాలను మాత్రమే కాదు, తెలుగు సామాజిక చరిత్రను కూడా తెలుపుతాయి. ప్రసాద్ రాసిన గోపీచంద్, శ్రీశ్రీ, కాళోజి రావిశాస్త్రి, భూషణం మొదలైన వాళ్ళ జ్ఞాపకాలు మనకు తెలిసిన సాహిత్య లోకాన్ని ఆయన అనుభవ కోణం నుండి, దృక్పథం నుండి కొత్తగా, కొంత విశేషంగా చూపిస్తాయి. చటర్జీ, కాశీ, కె. బి. కృష్ణ, పాత్రికేయ జంట, తెనాలి అనువాదకద్వయం, కుమారి మొదలైన వాళ్ళ జ్ఞాపకాలు సైద్ధాంతిక చారిత్రిక రచనలతోనో, సాహిత్య సాంస్కృతిక భావజాల వ్యాప్తికయిన వ్యాపకాలతోనో నేను సైతం అన్నట్లుగా తెలుగునాట కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రను వెలిగించిన వ్యక్తుల కృషిని శకలాలు శకలాలుగా పరిచయం చేస్తాయి. చరిత్రను, ఒక జాతి అనుభవాలను చలన చైత చైతన్యాలతో రుచి చూపి ఆయా వ్యక్తులకు, చరిత్ర కు సంబంధించిన సమాచారం మరింత సేకరించి తెలుసుకోమంటాయి ఆ రచనలు.

1960 వ దశకంలో చలసాని కొంతకాలం సినిమారంగంలో పని చేసాడు. అందువల్లనే కావచ్చు 1962 లో కుటుంబరావు సినిమా వ్యాసం పై ప్రతిస్పందనగా ఒక వ్యాసం రాసాడు. సినిమాలలో అన్నీ ప్రేమ పెళ్లిళ్ళే కావటం సామాజిక వాస్తవికతకు వ్యతిరేకమని, సినిమాలలో పాత్రల మధ్య సంఘర్షణ తెచ్చిపెట్టుకోన్నదే కానీ సహజం కాదని కొకు చేసిన అభియోగాలతో ఆమోదించక ప్రసాద్ తన వాదం వినిపించిన వ్యాసం ఇది. ఆ తరువాత కాలంలోఆయన రాసిన ఇలాంటి ప్రతివిమర్శవ్యాసాలు చలసాని రచనల సంకలనంలో ఆరు ఉన్నాయి. ఎప్పుడైనా ఒక రచనకు మరొకరు ప్రతిస్పందించి రాయటం ఎందుకు జరుగుతుంది?

ఆవ్యాసంలో చెప్పవలసిన అంశాలు మిగిలి ఉన్నాయని అనిపించినప్పుడు.

ఆ వ్యాసంలోని అంశాలు సరిచేయవలసినవి అనిపించినప్పుడు.

ఆ వ్యాసంలోని అంశాలకు కొంత వివరణ అవసరమని పించినప్పుడు.

ఆ వ్యాసంలోని అంశాలతో విభేదిస్తున్నప్పుడు.

అసలు వాస్తవాలు ఏమిటో చెప్పదలచు కొన్నప్పుడు

ప్రసాద్‌కు శ్రీశ్రీ అంటే తగని అభిమానం. శ్రీశ్రీ మీద రాసినంతగా మరొక కవిని, రచయితను గురించి ఆయన రాయలేదంటే అది అతిశయోక్తి కాదు. 1955 ఎన్నికలప్పటి నుండి శ్రీశ్రీ ని ప్రతీప శక్తుల నుండి కాపాడటానికి నిత్య జాగరూకుడై ప్రయత్నిస్తున్న ప్రసాద్ అందులో భాగం గానే ఆరుద్ర, తన రచనలలో శ్రీశ్రీ పై చేసిన దాడిని తిప్పికొట్ట టానికి ప్రతి విమర్శ రాసాడు. ఆరుద్ర చేకూరి రామారావు గారి 'రెండు పదుల పైన' కవితా సంపుటిని సమీక్షిస్తూ, చేరా శ్రీశ్రీ పై రాసిన కవితను నెపంగా చేసుకొని శ్రీశ్రీ ని దూషించటానికి దిగినప్పుడు ఆయన రాసినవి అబద్ధాలని నిరూపిస్తూ ప్రసాద్ 1984 లో ఒక రచన చేసాడు. మరొకటి శ్రీశ్రీ, ఆరుద్ర సంబంధాల గురించి కె. రామలక్ష్మి (ఆరుద్ర గారి భార్య) 92 మే 24 ఆంధ్రజ్యోతిలో రాసినవి అబద్ధాలు అనీ, ఆ నాటి నిజాలు ఇవాళ సాహిత్య లోకానికి తెలియాలంటూ

అదే సంవత్సరం జూన్ 14 న రాసాడు. రెండింటి లోనూ 1953 నుండే ఆరుద్ర శ్రీశ్రీ నుండి దూరం అవుతూ పాలక పక్ష ప్రయోజనాలకు కొమ్ముకాసే సాహిత్య రాజకీయాలకు దిగజారి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ పక్షాన ప్రచారానికి దిగిన శ్రీశ్రీ పై పత్రికలు చేసిన దాడికి మౌన ప్రేక్షకుడుగా వుండి పోయిన చారిత్రిక వాస్తవాలను విప్పి చెప్పాడు.

2009 అక్టోబర్ 26 ఆంధ్రజ్యోతిలో వివినమూర్తి రాసిన వ్యాసం లోని 'పొరపాటు' గురించి చెప్పటానికి ప్రతి విమర్శ రాసాడు. 1971 మే 28 ఆంధ్రజ్యోతిలో రావిశాస్త్రి రాసిన వేతన శర్మ కథ వస్తే ఏటుకూరి బలరామమూర్తి అదే సంవత్సరం నవంబర్ 28 న విశాలాంధ్ర పత్రికలో దానిని దుయ్యబడుతూ రాసాడు. వివిన మూర్తి దానిని ప్రస్తావిస్తూ 'అప్పటి కమ్యూనిస్ట్ పార్టీ, ఆనాటి ప్రధాన సాహిత్య సంఘమూ ... శత్రువైఖరి ప్రదర్శించాయి' అని రాసాడు. అరసాన్ని అప్పటి ప్రధాన సాహిత్య సంఘం అనటం పొరపాటని చలసాని అభిప్రాయం. 1955 కె అరసం పని అయిపోయిందని, 1971 నాటికి విరసం ఏర్పడింది అని ఆ పొరపాటును సవరిస్తూ ఈ చిన్న రచన చేసాడు చలసాని. ఇందులో ఏటుకూరి వ్యాసం మీద అప్పుడేతాను ప్రతివిమర్శ రాసినట్లు (1972 మార్చ్, సృజన) పేర్కొన్నాడు. కానీ ఆ వ్యాసం చలసాని రచనల సంకలనాలలో చేర లేదు. శ్రీశ్రీకే కాదు, రావిశాస్త్రికి కూడా రక్షణ వలయం అయినవాడు చలసాని.

సుప్రభాతం పత్రిక (1992 మే 5) లో విరసం మీద వెలువడిన అభిప్రాయాలను, వల్లంపాటి వారి విమర్శ గ్రంథం మీద బి. తిరుపతిరావు సమీక్ష(2003 ఆగస్ట్ 25 ఆంధ్రజ్యోతి) లోని అవకతవకలను, ప్రజాతంత్ర సాహిత్యసంచిక (2002) లో వెల్చేరు నారాయణరావు రాసిన 'సాహిత్యాన్ని సాహిత్యంగా చూసేవాళ్ళు కావాలి' వ్యాసం లోని అభిప్రాయాలను వ్యాఖ్యానాలను విమర్శించి సవరించటానికి చలసాని రాసిన మరో మూడు ప్రతి విమర్శలు ఉన్నాయి. అవి అటు విరసం సాహిత్య దృక్పథాన్ని వివరించటానికి ఇటు విప్లవ సాహిత్య విమర్శ సూత్రాలను నిరూపించటానికి ఏక కాలంలో ఉపయోగ పడ్డాయి. 1980 నాటికి విప్లవ కవిత్వం బాగా నీరసించింది అన్నమాటను తిప్పికొట్టటానికి ఆతరువాతికాలం లో వచ్చిన సముద్రుడు వంటి ప్రసిద్ద ఉద్యమకారుల కవిత్వాన్నే కాక వుయ్యూరు రామకృష్ణ శ్రీనిధి వంటి పెద్దగా తెలియని వాళ్ళ కవిత్వాన్ని కూడా ఉదాహరించాడు. 80 నుండి 90 దాకా వచ్చిన కవితా సంకలనాల సంపుటాల జాబితా చూస్తేనే అది పసలేని మాట అని తెలిసిపోతుందని సాధికారంగా ప్రకటించాడు. ఈ మూడు ప్రతి విమర్శలలోనూ ప్రసాద్ చేసినవాదనలను చూస్తే మార్క్సిస్ట్ దృక్పథం నుండి సాహిత్య అధ్యయన విమర్శల విషయంలో ఆయన ఎంత నిర్దుష్టంగా వున్నాడో స్పష్టం అవుతుంది.

విమర్శ వ్యక్తిగత పరిధులు దాటి వస్తుగతంగా వికసించాలి.

సమాజానికి దూరంగా, భిన్నంగా సాహిత్యం స్వతంత్ర ప్రతిపత్తి గల అంశంగా ఉండదు. సాహిత్యాన్ని సాహిత్యంగా చూడటం అసంబద్ధం. అశాస్త్రీయం.

తెలుగు సాహిత్యానికి రాజకీయాలకు తొలి నుండి ఉన్న సంబంధాన్ని గుర్తించాలి.

సాహిత్యంలో కమిట్ మెంట్ ఫాషన్‌గా తీసి పారేయదగినది కాదు. దాని వెనక విశ్వాసాలు ఉన్నాయి. దానికి చరిత్ర ఉన్నది. అందులో ఘర్షణ ఉన్నది అన్న స్పృహ కలిగి ఉండాలి.

మార్క్సిస్ట్ విమర్శ రూపవాదాన్ని కాదంటుంది కానీ రూపాన్ని కాదు. శిల్పాన్ని శిల్పం కోసమే హర్షించదు, ఆమోదించదు కానీ వస్తువుకీ వ్యక్తీకరణకు మధ్య వారధిగా శిల్పానికి ఉన్న ప్రాధన్యతను గుర్తిస్తుంది. గౌరవిస్తుంది.

విరసం స్త్రీవాద, దళిత, మైనారిటీ తదితర ఉద్యమాల పట్ల వ్యతిరేకం కాదు. ఇవన్నీ అన్యాయాలకీ అసమానతలకీ, వివక్షలతకీ గురవుతున్నవారి ఆర్తికీ ఆవేదనకీ ఆక్రోశాలకీ అద్దం పడతాయని భావిస్తుంది. ఈ రకమైన వివిధ సామాజిక అంశాలని తనలో ఇముడ్చుకొని మరింత విశాలమైంది.

అయితే అదే సమయంలో(2003లోనే) స్త్రీలు, దళితులు సాహిత్య రంగంలోకి తెచ్చిన ప్రశ్నల సామాజిక అవసరాన్నితరచి చూసి మంచి చెడ్డలను బేరీజు వేసే విమర్శనాత్మక బాధ్యత విరసానికి ఉన్నదన్న స్పృహ సంపూర్ణంగా వుంది ప్రసాద్‌కు. 'విప్లవ సాహిత్యం -ఎదురవుతున్న ప్రశ్నలు' అనే ప్రసంగ పాఠంలో అది కనబడుతుంది. ఫెమినిజం గురించే కాదు పోస్ట్ మోడర్నిజం గురించి కూడా ఈ ప్రసంగ పాఠం సూక్ష్మ పరిశీలనలతో తాత్విక స్థాయిలో చర్చించింది.

4

చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలలో కీలకమైన అంశం సామాజిక రాజకీయ ఆర్థిక చరిత్రతోకలిపి సాహిత్యాన్ని, సాహిత్య చరిత్రను అధ్యయనం చేయటం. సాహిత్యంలో తిరోగమనం - పురోగమనం (1988) తెలుగునాట పెరిస్త్రోయికా (1990) ఆంధ్రలో 1955 ఎన్నికలు పూర్వాపరాలు (2005) - ఈ మూడు వ్యాసాలలో అందుకు ప్రాతిపదికలు ఉన్నాయి. తెలంగాణ రైతాంగ పోరాటం వంటి ప్రజా పోరాటాల వ్యాప్తి వల్ల వచ్చే ప్రమాదాల గురించిన భయానికి, బ్రిటిష్ వలసపాలకులు భారత దేశానికి స్వాతంత్ర్యం ఇయ్యటానికి అంతర్గతం గా వున్న సంబంధం గురించి, తెలంగాణా ధనిక రైతాంగానికి కాంగ్రెస్ కు వున్న వర్గ స్వభావ సంబంధాన్ని గురించి, తెలుగు నాట ప్రభుత్వ పాలనా పగ్గాలు చేపట్టవలసింది కమ్యూనిస్ట్ లా కాంగ్రెస్సా అటో ఇటో తేలిపోవాలి అన్న స్థాయిలో జరిగిన 1955 ఎన్నికలను గురించి, వాటి పరిణా మాలను (తెలుగు నాట పెరిస్త్రోయికా) గురించి చలసానిది కార్యకారణ సంబంధాలతో కూడిన నిశిత రాజకీయ అవగాహన. అందువల్లనే ఆయన '1955 లో కాంగ్రెస్ పార్టీ ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. ఆర్థిక రాజకీయ రంగాల్లో ఆ విధానాలకే కట్టుబడి ఉంది. ' అని స్పష్టంగా 2005లో చెప్పగలిగాడు. ఈ అంశాన్ని ఈనాటి ఆర్థిక సామాజిక రంగాల్లో ఎవరం విస్మరించగూడదు అని హెచ్చరిక కూడా చేసాడు. దీనిని గీటురాయి గా తీసుకునే మన విశ్లేషణ సాగాలి అని సూచించాడు. అలాగే విశ్లేషణ అనేది సామాజిక రాజకీయ ఆర్థిక చరిత్ర పరిణామాలతో పాటు సాంస్కృతిక సాహిత్య రంగాల గతిక్రమాన్ని నిరూపించటానికి కూడా అవసరమైంది.

సాహిత్యానికి అన్వయిస్తూ ఆ రకమైన విశ్లేషణకు నమూనాలు అనదగిన వ్యాసాలు చలసాని రాసాడు. 'సాహిత్యంలో తిరోగమనం - పురోగమనం' వ్యాసం అందుకు మంచి ఉదాహరణ. 1955 ఎన్నికలు జరిగిన తీరు, ఎన్నికల సమయంలో సాహిత్య కళా సాంస్కృతిక

రంగాలలో చెలరేగిన గాలిదుమారం - వీటి నుంచి నేర్చుకోవలసిన పాఠాలు, అవి సాహిత్య రంగాన్ని ఏయే మార్పులకు గురిచేసిందీ తెలియ చెప్పటం లక్ష్యంగా ఆయన ఈ వ్యాసం రాసాడు. 1955లో రాజకీయ సాంస్కృతిక వాతావరణాన్ని వివరించి ఆ నేపథ్యంలో సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు మాత్రమే రాజకీయాలకు సాహిత్యానికి ఉన్న పరస్పర సంబంధం'అర్థమవుతుంది అని చెప్పటమే కాక ఇది ఆంధ్ర మహాభారత అవతరణ నాటి నుంచి కొన సాగుతున్నదే అని దానికి ఉన్న దేశీయ మూలాలను ప్రస్తావించాడు. 1955 నుండి 1960 వరకు సాహిత్య రంగంలోముఖ్యం గా కవిత్వంలో తిరోగమన ధోరణి చోటు చేసుకున్నదని, దానిని వెనక్కు నెడుతూ దిగంబర కవులు, తిరగబడు కవులు వచ్చారని, వచనంలో నవల కథ ప్రక్రియలలో ఈ పురోగమనం కాస్త ముందే మరింత బలంగా రావిశాస్త్రి సారా కథలతో కాళీపట్నం రామారావు యజ్ఞం కథతో మొదలైందని వివరించాడు. ఆ పురోగమనానిదే పైచేయి అని గొప్ప విశ్వాసంతో ప్రకటించాడు.

'గిరిజన గుండె చప్పుడే శ్రీకాకుళ ఉద్యమం' (1991) వ్యాసంలో శ్రీకాకుళ ఉద్యమ ప్రత్యేకత అర్థం కావాలంటే దానికి ముందు వెనకలుగా వచ్చిన జై తెలంగాణా జై ఆంధ్రా ఉద్యమాలతో పోల్చిచూడాలని ప్రసాద్ చెప్పిన పద్ధతి సకల దేశీయ ఉద్యమాల విలువను నిర్ధారించటానికి ఒక ప్రమాణంగా పనికి వస్తుంది. ఏ ఉద్యమ సాహిత్య విలువల నిరూపణ కైనా గీటురాయిగా దానిని స్వీకరించవచ్చు. అలాగే రచనలను, రచయితలను గురించి చెప్పుకునేప్పుడు ఆర్థిక రాజకీయ చారిత్రిక స్థితిగతుల సంబంధంలో అధ్యయనం చేస్తే ఎంత అర్థవంతంగా ఉంటుందో చలసాని శ్రీశ్రీ సాహిత్య సంపుటాలకు రాసిన ముందుమాటలు చూస్తే స్పష్టమవుతుంది.

ప్రసాద్ సాహిత్య విమర్శ వ్యాసాలలో తప్పక పేర్కొనదగినవి 'ఈ తరం కవులు', 'కథ- నవల-జీవితం' . ఈ తరం కవులు వ్యాసం 1971 నాటిది. ఇందులోనూ ఆయన 1947 తెలంగాణాలోని నైజాం వ్యతిరేక పోరాట కవిత్వాన్ని నేపథ్యంగా చెప్పి 1965 లో వచ్చిన సి. విజయలక్ష్మి 'విషాద భారతం' కవితాకాశంలో గొప్ప మెరుపు అని ప్రశంసిస్తూనే విప్లవ భారతాన్ని వీర భారతాన్ని చూచిన, చూపించిన కవిత్వం రాసిన 'తిరగబడు' కవులను, 'మార్చ్' కవులను, 'ఝంఝ' కవులను, 'లే' కవులను ఈ తరం కవులలో ముందు వరసలో నిలబడతారు అని అభిప్రాయపడ్డాడు. 'ఒక పక్క ఇంగ్లీష్ వాడి ఆస్తులకు కాపలా, మరో పక్క దేశవాళీ దోపిడీ దార్లకు మద్దతు. ఇది భారత పాలక వర్గాల ద్వంద్వ స్వరూపం. ' అని నిర్ద్వందం గా చెప్పిన చలసాని దానిని తెలిసి ఎండగట్టటానికి ఒక రాజకీయ చర్య గా కవిత్వం రాయటం లో ని విలువల దృష్ట్యా విప్లవ కవులే ఈ తరం కవులని అన్నాడు.

కవిత్వ వస్తువు గురించి ఎంత నిబద్ధత ఉన్నదో, అది శ్రామిక వర్గ ప్రయోజనాల కోసం కనుక శ్రామిక వర్గపు నోట ఆడదగిన భాషాభివ్యక్తులు కవిత్వంలో వుండాలని ఆశించాడు ప్రసాద్. అందుకనే జానపద బాణీలను పట్టుకొనటం పై విప్లవకవులకు శ్రద్ధ వుండాలని చెప్పాడు. కళ రూపంలో జాతీయం గానూ సారం లో సామ్యవాదతత్వం తోనూ ఉండాలని చెప్పిన స్టాలిన్ నానుడిని ప్రచారం చేసాడు.

కవిత్వం గురించిన ఈ వ్యాసం వచ్చిన ఎనిమిదేళ్ళకు 'కథ -నవల - జీవితం' వ్యాసం వచ్చింది. బాధ కవిత్వానికి పర్యాయ పదమని శ్రీశ్రీ అన్నమాటను విస్తరించి కథ వ్యథా మూలం అంటాడు ప్రసాద్. మనచుట్టూ వున్న జీవితంలో కథలకు కావలసిన ముడిసరుకు బోలెడు వుందని చెప్తూనే జీవితంలోని సంఘటనలకు కథారూపం ఇచ్చేటప్పుడు వాటిని రచయితలు ఏ దృక్పథం నుండి చూచి వ్యాఖానిస్తున్నారనేది ముఖ్యం అని హెచ్చరిస్తాడు. రచయితలు సమాజంలోని ఆర్థిక రాజకీయ చరిత్ర పరిణామాల గురించిన అవగాహన పెంచుకొనాలని సూచించాడు. అనుభవ విస్తృతి కథకులకు వన్నె తెస్తుందని భావించాడు. కారా, రావిశాస్త్రి, శ్రీపాద, చలం, కొడవటిగంటి మొదలైన వాళ్ళ కథలను ప్రస్తావిస్తూ వస్తువు ఎంపిక, శిల్ప విధానం, శైలి మొదలైన కథాంగాల గురించి అలవోకగా వివరించాడు. ఈ సందర్భంగా ప్రసాద్ ప్రతిపాదనలు, వ్యాఖ్యానాలు ప్రత్యేకంగా ఆయా రచయితల మీద మొత్తంగా కథాసాహిత్యం పైనా కొత్త పరిశోధనలకు పురికొల్పేవిగా ఉన్నాయి.

ఈ వ్యాసంలో ప్రసాద్ యజ్ఞం కథ గురించి - 'ఈ యజ్ఞం నిజస్వరూపం ఏమిటి? ఒక వైపు మారిన ఉత్పత్తి శక్తులు, కొత్తగా గద్దెకెక్కిన నల్లదొరలు -మరొకవైపు మారని ఉత్పత్తి సంబంధాలు, మరింత కుంగిపోయిన నేలతల్లి బిడ్డలు -వీటిని ఒకరకంగా యజ్ఞం ఎక్స్‌రే ఫోటో తీసింది' అని సూత్రీకరించాడు. ఈ విధమైన సూత్రీకరణలు రాజకీయార్థిక దృక్పథంతో సాహిత్యంలో జరగవలసిన అధ్యయనాలకు దిక్సూచీలు. పోరాట పూర్వ రంగాన్ని యజ్ఞం కథ చిత్రిస్తే భూషణం రాసిన అడివంటుకుంది పోరాట క్రమాన్ని చిత్రించింది అని శ్రీకాకుళ పోరాటం - సాహిత్యం (1974) వ్యాసంలో అంటాడు. అంటే ఈ రెండు కథలను కలిపి అధ్యయనం చేస్తే ఒక సామాజిక చరిత్ర గతిక్రమం తెలుస్తదన్నమాట.

సాహిత్య ప్రక్రియల స్వభావాన్నిఅలవోకగా పట్టేసి, వాటి మధ్య వుండే సూక్ష్మమైన భేదాలను గుర్తించటంలో చలసాని మహా చతురుడు. కోట్లకొలది పల్లెపాటలను వెనక్కి నెట్టేసి కవిత్వం ముందుకు దూసుకు వచ్చిందని శివలక్ష్మి పుస్తకానికి రాసిన ముందు మాటలో చెప్పిన చలసాని 'వచనంలో కవి తేటతెల్లగా తెలిసి పోతాడు. తొడుగులు వేయటానికి వీలు కాదు' అని కవిత్వానికి వచనానికి ఉన్న మౌలికమైన తేడా గురించి శ్రీశ్రీ వ్యాసాలు పుస్తకం ముందు మాటలో పేర్కొన్నాడు. 'కేవలం స్పందనతో కవిత్వం అల్లవచ్చును గానీ రక్త సంబంధం లేనిదే కథలు రాయలేరు' అని శ్రీకాకుళ పోరాటం- సాహిత్యం వ్యాసంలోనే చెప్పాడు. ఒక పాశ్చాత్య విమర్శకుడు అన్నాడు అంటూ కవులు కదిలించ గలరే గాని నూతన వ్యవస్థకు కావలసిన కట్టడాలు కట్టలేరు. ఆ పని కథకులు నవలాకారులే చేయగలరు అన్న వాక్యంతో 'జరుగుబాటు - తిరుగుబాటు' వ్యాసాన్ని ప్రారంభిస్తాడు. శాంతి, చావు, జీవధార కథల ద్వారా కాళీపట్నం ఆ పని ఎంత సమర్థవంతంగా చేసాడో ఈ వ్యాసంలో నిరూపిస్తాడు. వేలాది ఏళ్లుగా బతుకుతో పెనవేసుకు పోయి ప్రజలకు చేరువగా తమ మనుగడ సాగించిన జానపద దృశ్య కళా రూపాలెన్నిటినో మింగేసి 'సామాజికుల' నాటకం తలెత్తిందని శ్రీశ్రీ రేడియో నాటకాల పైన శివలక్ష్మి సిద్ధాంత గ్రంథానికి రాసిన ప్రస్తావనలో సూత్రీకరించాడు. ఇలా అక్కడక్కడా ఆయనచేసిన సూత్రీకరణల వెలుగులో తెలుగు సాహిత్యవిమర్శను మరింత పదునెక్కించటానికి ఉన్నఅవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించు కొనటం మనమిప్పుడు చేయవలసిన పని.

☆

తరమెళ్లిపోతున్నది.... త్యాగాల తరమెళ్లిపోతున్నది

డేవిడ్

ప్రతి ఒక్కరికి ఎప్పుడో ఒకప్పుడుడు, ఏదో ఒక సందర్భంలో కొంతమంది గొప్ప వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయ కాలంలో వాళ్లను అర్థం చేసుకునే కొద్ది అనేక విషయాలు తెలుసుకోవడంతో పాటు, ఒక జనరేషన్‌తో మనకు సాన్నిహిత్యం ఏర్పడుతుంది. చలసాని ప్రసాద్ (సిపి) గారితో పరిచయం నా జీవితంలో కూడా అలాంటిదేనని చెప్పవచ్చు.

ఎన్నో ఏండ్లుగా విరసం సాహిత్య పాఠశాలల్లో సిపి గారిని చూస్తూ వస్తున్న నాకు శ్రీకాకుళం జిల్లా లక్ష్మింఎట గ్రామంలో దళితులపై కాపు కులస్తులు దాడిచేసిన సందర్భంలో ఆ గ్రామానికి విరసం బృందంతో (ఆ బృందంలో ఆకుల భుమయ్యసార్, రవిచంద్ర సార్, కాశీం అన్న, రామ్రెడ్డి సార్, ఉదయభాను, జగన్, నేను) వెళ్లిన సందర్భంలో మొదటిసారి ఆయనను కలవడం, ఆయనతో కాసేపు మాట్లాడే అవకాశం దొరికింది. వాస్తవానికి అయనతో వున్న సమయం కొద్దిదైనా అనేక విషయాలను తెలుసుకునే అవకాశం రావడంతోపాటు ఒక తరానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవాలనే కుతుహలాన్ని నాలో కలిగించింది. లక్ష్మింపేట గ్రామానికి వెళ్లినప్పుడు ఆ వయసులో కూడా ఆయన విశాఖ పట్నం రైల్వేస్టేషనుకు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకోవడమే కాకుండ ఒక వెహికిల్ మాట్లాడి మమ్మల్ని లక్ష్మింపేటకు పంపించి అక్కడ కూడా ఒక మనిషిని ఏర్పాటు చేసి మాకు ఏ ఇబ్బంది రాసుండా చూసుకున్నాడు. ఆ వయసులో కూడా ఆయన పడే తపనను చూస్తుంటే సిపి గారిని విప్లవకారులమీద, విప్లవ సానుభూతిపరులమీద ఎంత ప్రేమో అర్థమవుతుంది. 'మీకు ఎందుకు సార్ ఈ రిస్క్, మేం వెళ్తాం కదా' అని కాశీం అంటే, మీకు తెలియదయ్యా చిన్నపిల్లలు, నేను చెప్పినట్లు వినండి అంటూ మా అవసరాలను తీరుస్తూ పసిపిల్లలుగానే చూసుకున్నాడు. తిరిగి వైజాగ్ వచ్చాక ఆయన ఇంట్లో కాసేపు ఉండి ఆయనతో మాట్లాడుతుంటే ఎన్నో విషయాల పట్ల ఆయనకు అవగాహన ఉందో కదా అనేది అర్థమయింది.

అప్పటివరకు పుస్తకాల్లో శ్రీశ్రీని చదువుకున్న నాకు శ్రీశ్రీతో సిపి గారు చాలా సన్నిహితంగా ఉండేవాడని తెలిసాక అయనను అనేక ప్రశ్నలు అడిగినా కూడా ఏ మాత్రం నొచ్చుకోకుండా అమాయకమైన నా ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం చెప్పాడు. మొదటిసారి అప్పుడే తెలిసింది ఆయన్ని వైజాగ్ శ్రీశ్రీ అంటారని. మీకు ఈ పేరు ఎందుకొచ్చింది సార్ అంటే, ఎంతో మొహమాటపడుతూ 'ఎప్పుడూ శ్రీశ్రీ గురించి మాట్లాడేవాన్ని కదా, అయనతో సాన్నిత్యం ఉన్నందుకూ, ఆ విప్లవ తరానికి చెందిన వ్యక్తిని ఈ ప్రాంతంలో నేనే మిగిలినివాన్ని కదా' అంటూ విషయాలు చెప్పుకొచ్చాడు. నా జీవితంలో లైబ్రరీలో తప్ప అన్ని పుస్తకాలు ఒకరి దగ్గర ఉండటం ఆయన ఇంట్లోనే చూసాను. వేలాది పుస్తకాలతో నిండిపోయిన ఆయన ఇల్లు, వాటిమధ్య ఎక్కడో ఒక దగ్గర కూర్చునే ఆయన్ని చూస్తుంటే ఆయనే ఒక నడిచే గ్రంథాలయంలా కనిపించేవాడు. బహుశా సాహిత్యానికి సంబంధించి ఆయన దగ్గర దొరకని పుస్తకం లేకపోవచ్చు అంటే అతిశయోక్తి అవుతుందేమో. కాని అది నిజం.

ఇన్ని పుస్తకాలు ఉన్నాయికదా సార్, వీటిని ఏం చేస్తారు? మేము కొన్ని తీసుకుపోవచ్చా అంటే? అట్లా కుదరదయ్యా ఈ పుస్తకాల్ని, ఈ ఇల్లును విరసానికి ఎప్పుడో ఇచ్చేశాను కదా, మీరు చదువుకోవాలనిపిస్తే ఇక్కడికి వచ్చి చదువుకోండి అంటూ కల్మషంలేని నవ్వు నవ్వాడు. మళ్ళీ ఒకసారి ఇక్కడకు వస్తాను సార్, మీతో ఒక నేల రోజులు ఉంటాను, మీకు సంబంధించిన విషయాలు, మీరు విరసం ను ఎందుకు ప్రారంభించారు, మీకు శ్రీశ్రీతో ఎలా పరిచయం ఏర్పడింది అనే విషయాలు చెప్పండి. నేను ఒక డాక్యుమెంటరీ తీస్తాను, మా తరానికి మీ తరం గురించి తెలియాలి కదా అంటే 'ఎందుకయ్యా ఆ విషయలు. అంతా, ఐనా నేను ఏమి చెప్పగలను' అంటూ తెగ మొహమాటపడ్డాడు. బలవంతాన ఆయన నుండి అనుమతి తీసుకొని బయలుదేరిన నాలో అనేక ప్రశ్నలు ఉదయించాయి.

ఎంతో మంది గొప్ప వ్యక్తులు మన కళ్లముందే తిరుగుతున్నా వాళ్ల జీవితాలు ఈ తరానికి చెందిన చాలా మందికి తెలియడం లేదు. తెలిసిన వాళ్లు, సంఘాలకు చెందిన వ్యక్తులు వీళ్ల జీవితాలను, వీళ్ల అనుభవాలను రికార్డ్ చేస్తే ఎంతో బాగుంటుంది కాదా అనిపించింది. సంఘాలు ఆ పని చేయకపోతేనేం ఒక మంచి పని కదా ఆ పని నేనే ఎందుకు మొదలెట్టకూడదూ అనే ఆలోచన కూడా వచ్చింది. హైదరాబాద్ వచ్చాక వెంటనే ఒక నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. ముందుగా ఎవరెవరిని కలుసుకోవాలి, ఎవరి అభిప్రాయాలు ముందుగా తీసుకోవాలి అని ఒక రఫ్ వర్క్ తయారు చేసుకొని వరవర రావు సార్ (వివి) దగ్గరకు వెళ్ళి చర్చిస్తే చాలా మంచి పని అంటూ కొన్ని సలహాలు కూడా ఇచ్చాడు. ఇంటర్వ్యూ తీసుకోవాల్సిన వ్యక్తుల నుంచి ఎలాంటి విషయాలు తెలుసుకోవాలి, ఎలాంటి విషయాలను రాబట్టాలో మీరు కూడా కొన్ని సూచనలు చేయండి సార్ అంటే వివి సార్ కూడా కొన్ని విషయాలను చెప్పడంతో పాటు ముందుగా వీళ్లను ఇంటర్వ్యూ చేస్తే బాగుంటుంది కదా, కొంతకాలం ఐతే వీళ్లు మరిచిపోయే అవకాశం కూడా ఉంటుందని సలహా ఇచ్చాడు. ఇలా మొదట ఇంటర్వ్యూ చేయమన్న పేర్లలో ఎం.టి.ఖాన్ ప్రొ.కేశవరావు జాదవ్, చలసాని ప్రసాద్ గార్లే. తర్వాతి పేర్లు గంటి ప్రసాదం, ఆకుల భుమయ్య సార్ తదితరులు వున్నారు.

ఇంటర్వ్యూ చేయాల్సిన వ్యక్తులకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించే పనిలో వున్న క్రమంలోనే గంటి ప్రసాద్ సార్ హత్యకు గురికాబడ్డాదు. కొంతకాలానికి ఆకుల భుమయ్య సార్ అనుమానాస్పదంగా చనిపోయాడు. ఎం.టి.ఖాన్ సార్ అనారోగ్యంతో మరణించాడు. ఒక తరాన్ని ప్రభావితం చేసిన వ్యక్తులు ఇలా అర్ధాంతరంగా వెళ్లిపోతే సమాజానికి జరిగే నష్టం పూడ్చలేనిదైతే, బతికున్నప్పుడు వీరికి సంబంధించిన పూర్తి సమచారాన్ని, వారు సమాజం కోసం పనిచేయడానికి స్ఫూర్తి కలిగించిన పరిస్థితులను గురించిన విషయాలను వారు చెబుతుంటే రికార్డ్ చేయలేకపోయానే అనే బాధ జీవితాంతం వెంటాడుతూనే వుంటుంది.

విప్లవోద్యమానికి చోదక శక్తులుగా పనిచేసిన ఆ తరం మన కళ్లముందే రాలిపోతున్న సమయంలోనే ఇక ఆలస్యం చెయకూడదని, కనీసం చలసాని ప్రసాద్‌గారితో కొన్ని రోజాలుండి అయననైనా ఇంటర్వ్యూ చేద్దామని మొన్న బొబ్బిలిలో జరిగిన విరసం సాహిత్య పాఠశాలలో ఒక కెమెరాను తీసుకొని వెళ్లినప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆయనతో ఇంటర్వ్యూ కుదరలేదు. అంతలోనే ఇలా చలసాని గారు కూడా అమరుడు కావడం జీర్ణించుకోలేని విషయం.

మా తరానికి ప్రియమైన సీపీ

క్రాంతి

ఆ పెద్దాయనను గుర్తు చేసుకుంటే ముందు ఆయన పసితనం గుర్తుకు వస్తుంది. కల్మషమెరుగని ఆయన మాటలు గుర్తుకు వస్తాయి. మళ్లీ ఎప్పుడు కనిపిస్తాడో అనిపిస్తుంది. ఎనిమిది పదుల వయసు. కానీ.. ఆయన నిత్య యువకుడు. సరిగ్గా పదేళ్ల క్రితం విశాఖ విరసం సభలో తొలిసారి చూశాను చలసానిని. చూడ్డానికి పెద్దమనిషి కానీ యువకులకంటే చలాకీగా కనిపించాడు. చలసాని గురించి అప్పటి వరకు వింటున్న నేను తొలిసారి చూశాననుకుంట. అప్పుడు పెద్దగా మాట్లాడలేకపోయినా... నేను విరసంలో చేరాక ఆయనతో అనుబంధం పెరిగింది.

'ఎత్తినాం విరసం జెండా... అలలలలుగ ఉరకలెత్తు పోరు పోరు జెండా' అంటూ చలసాని ఆర్ద్రతతో పాడుతుంటే అందరిలో విప్లవోత్తేజం ప్రవహించేది. ఆయన నిత్యచైతన్యశీలి. సాహితీ రంగంలో ఆయన ఓ మజిలీ. శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రి సాహిత్యాన్ని ఏర్చికూర్చి తెలుగు సమాజానికి విలువైన సంపదగా అందించారు. చలసానిలాంటి మనుషులు అరుదుగా కనిపిస్తారు. ఆయన ఏనాడూ పేరు కోసం పాకులాడలేదు. గుర్తింపు ఆశించలేదు. ఆయన రచనలు చేయడం కంటే.. ఇతరుల రచనల్ని ప్రపంచానికి అందించడంలోనే ఆనందాన్ని పొందారు. అది శ్రీశ్రీ సాహిత్య సర్వస్వమైనా... కొకు రచనా ప్రపంచమైనా... రావిశాస్త్రీయమైనా. అది ఆయనకు మాత్రమే సాధ్యమైన పని అనేలా చేసి నిరూపించారు. అంతగా ఆయన సాహిత్యంతో మమేకమయ్యారు.

ఆయనకు మనుషులంటే ఎంత ప్రేమో.... పుస్తకాలంటే కూడా అంతే ప్రేమ. తమను తామే మర్చిపోతున్న కాలంలో ఆయన మనుషుల్ని ప్రేమించాడు. తాను తిరిగిన చోటల్లా తనకు స్నేహితులుంటారు. ప్రతి ఒక్కరినీ ప్రేమగా పలకరిస్తారు. ఆయన స్నేహానికి చిన్నా, పెద్ద, కులం, మతం, ప్రాంతం, వర్గం లాంటి ఏ భేదాలు ఉండవు. అందుకే ఆయన పిల్లల్లో పిల్లవాడు. పెద్దల్లో పెద్దవాడు. విరసం యువ బృందానికి చలసాని అంటే అమితమైన ప్రేమ. ఎందుకంటే.. ఆయన నిత్య యువకుడు కనుక. మాలో ఒకరిగా మా భుజాలపై చేతులు వేసి.. ఎన్ని సంగతులు చెప్పేటోడో. ఆయనకు బహువచనం అంటే గిట్టదు. మా అందరికీ సిపియే. అంత పెద్దాయన్ని పేరు పెట్టి పిలవడానికి ఇబ్బందనిపించినా ఒప్పుకునేవాడు కాదు. ఒరే గడుగ్గాయ్... ఒరే బడువాయ్... ఒరేయ్ సున్నపురాయి అంటూ ఎప్పుడూ మమ్మల్ని ప్రేమగా పిలిచే సిపి ఇంకలేడంటే నమ్మలేకుండా ఉంది.

సిపికి శ్రీశ్రీ అంటే వల్లమాలిన అభిమానం. ఆయన మీద ఈగ వాలనిచ్చేవాడు కాదు. శ్రీశ్రీ సమగ్ర సాహిత్యాన్ని అచ్చువేయడంలోనే కాదు.. శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా పట్టుబట్టి విశాఖలో విరసం మహాసభను నిర్వహించాడు. 75ఏళ్ల వయసులో ఆ పెద్దమనిషి. ఎంత ఉత్సాహంగా శ్రీశ్రీ జ్ఞాపకాల్లో మునిగిపోయారో అప్పుడు.

శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా రచయితలారా మీరెటువైపు అంటూ విద్యార్థులు సంధించిన ఒక ప్రశ్న విరసం ఆవిర్భావానికి పునాది వేసింది. అలా ఏర్పడిన విరసం 1975లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభల్ని బహిష్కరించింది. ఆ సందర్భంగా శ్రీశ్రీ సహా పలువురు విరసం కార్యకర్తలు హైదరాబాద్‌లో అరెస్టయ్యారు. తిరిగి 2014లో మరోమారు అలాంటి సందర్భం. తిరుపతిలో ప్రభుత్వం తలపెట్టిన ప్రపంచ 4వ తెలుగు మహాసభల్ని బహిష్కరించాలని విరసం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా తిరుపతి వెళ్తున్న చలసాని ప్రసాద్, వరవరరావు, పాణిలను మార్గమధ్యంలోనే కర్నూలు రైల్వేస్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. తాను నమ్మిన రాజకీయాల కోసం తుదవరకు చలసాని ఎంత ఖచ్చితంగా నిబద్ధుడో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు.

ఆయనకు అధ్యయనం అంటే ప్రాణం. హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా రోజుల తరబడి స్టేట్ ఆర్కైవ్స్‌లో కూర్చొని పాత పత్రికలు తిప్పేసేవాడు. ఏవో పాత సంగతులు వెలికితీసేవాడు. ఆయన నిరంతర అన్వేషి. అలాంటి అన్వేషణలోంచే శ్రీశ్రీ అసలైన జయంతి ఏప్రిల్ 30 అని ఆధారాలతో వెలికితీశాడు.

విరసం 20వ మహాసభ ఏర్పాట్ల కోసం హైదరాబాద్‌కు వచ్చిన సి.పి. ఎస్ఆర్ నగర్‌లోని బంధువుల ఇంట్లో ఉన్నారు. మహాసభల వివరాలు వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేఖరు సమావేశానికి సిపిని తీసుకురావడానికి వెళ్లాను. నేను వెళ్తానన్న సమయానికి కాస్త ఆలస్యమైంది. అప్పటికే ఆయన నాకోసం ఎదురుచూస్తున్నారు. 10గంటలకే వస్తానన్నావని చూస్తూ ఉన్నాను.. అన్నారు. ఆ వయసులో ఆయన క్రమశిక్షణకు ఆశ్చర్యమేసింది. ఆయన ఎంత కచ్చితమైన మనిషో చెప్పే ఉదాహరణ. నా ద్విచక్రవాహనం వెనక కూర్చొని మాట్లాడడం మొదలు పెట్టారు. ఎస్ఎస్ఎస్ చేరుకునేలోపు హైదరాబాద్ కథ వినిపించారు. అప్పట్లో ఎక్కడెక్కడ సాహిత్య సమావేశాలు జరిగేవి, ఏయే మీటింగులు ఎప్పుడు జరిగాయి మొదలు.. ఏ దారి ఎటు వెళ్తుంది.. ఇలా ఎన్ని ముచ్చట్లో. అప్పటికి నేనింకా ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్నాను. మా వసంత ఎలా ఉంది? చాలా మంచి అమ్మాయి... శ్రీశ్రీ సాహిత్యం వేసేటప్పుడు చాలా పనిచేసింది అంటూ చెప్పుకొచ్చాడు. ఆయనకు పిల్లలు.. పెద్దలు.. తేడా లేదు. మనుషులు కనిపిస్తే చాలు.. మా అమ్మాయి ఎలా ఉంది? మా గడుగ్గాయ్ ఎలా ఉన్నాడు? అంటూ ఆరా తీస్తారు.

బొబ్బిలి విరసం 'సాహిత్య పాఠశాల'లో చివరిసారి కలిసిన సిపి చాలాసేపు ముచ్చటపెట్టాడు. ఈ సారి విప్లవ పార్టీ సంగతులు. అంతే ఆర్ద్రతతో మాట్లాడాడు. విప్లవ రాజకీయాల ప్రచారమే ప్రథమ కర్తవ్యంగా స్వీకరించిన ఆయన చివరి వరకు ఆ రాజకీయాల కోసమే నిలబడ్డాడు.

2013 సెప్టెంబర్ 17 న హైదరాబాద్ వచ్చిన సిపి గారు ఓయులోని ఆర్ట్స్ కాలేజీలో మేము 'సెప్టెంబర్ 17 తెలంగాణ విలీనమా? విమోచనా? విద్రోహమా?' అనే అంశంపై చర్చ పెట్టినప్పుడు వివి సార్ తో పాటు అక్కడికి వచ్చి విద్యార్థులతో పాటు కూర్చొని వారితో సంభాషించిన జ్ఞాపకం ఇంకా నా కళ్లముందే తిరుగాడుతోంది. మేము సిపి గారిని తెలుగు డిపార్ట్‌మెంట్ హెడ్ ఎస్వీ సత్యనారాయణ సార్ రూంకు తీసుకుపోయినప్పుడు విద్యార్థులందరితో సరదాగా మాట్లాడుతూ, అడిగిన ప్రతివారితో ఫొటోలు దిగి మాలో చిన్నపిల్లడిలా కలిసిపోయినా సిపి గారిని ఏ విద్యార్థీ మరచిపోలేదు.

తమ జీవితాన్ని సమాజం కోసం అర్పించి, చరిత్రలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న వ్యక్తులతో మనకు పరిచయం ఉందని సంతోషించాలో, అటువంటి వాళ్లు నడిచిన దారిలో నడవలేక పోతున్నామని బాధపడాలో తెలియని పరిస్థితి. ఏది ఏమైనా ఒక కవి అన్నట్లు 'తరమెల్లి పోతున్నదో...త్యాగాల తరమెల్లిపోతున్నదో..'. నేడు మనం వారి దారిలో నడవాల్సింది, వారి జెండాను ఎత్తిపట్టు కోవాల్సిందే.

స్నేహమే ఉద్యమం, ఉద్యమమే ప్రాణం!

అవ్వారి నాగరాజు

సి.పి అని ఎంతో సన్నిహితంగా పిలుచుకొనే చలసాని ప్రసాద్ గురించి రాయగలిగిన వాళ్ళూ, మాటాడగలిగిన వాళ్ళూ కోకొల్లలు. ఈ జాబితా తెలుగు నేలను దాటి సుదూరాలకు వ్యాపించి ఉంది. దాదాపుగా నిండు జీవితమని పిలుచుకోగలిగినన్నాళ్ళూ జీవించిన తను ఈ రోజు మన మధ్య లేడని, ఇక భౌతికంగా తన పలకరింపు, నింపాదితనంతో కూడిన తన చిరునవ్వు ఇక ఉండబోవని అనుకోవడం తీరని దుఃఖాన్ని కలిగిస్తుంది. బహుశా కొన్ని సార్లు మరణం కూడా ఒక సందర్భంగా మన మధ్య వచ్చి నిలబడుతుంది కాబోలు. పుట్టుక లాగే మరణం కూడా అతి సహజంగా భావించి , దాని గురించి ఏనాడూ ఇసుమంత జంకు కూడా ప్రదర్శించని వ్యక్తి మరణం గురించి ఈనాడు దుఃఖించడం వెనుక ఆయన బతికిన రోజుల నిండుదనమే ఉంది.

వయసు రీత్యా ఆయన విరసంలో ఎంత పెద్దవాడో చురుకుదనంలోనూ, కలగొలుపుదనంలోనూ అంత బాలకుడు. ఉమ్మడి కమ్యునిస్టు ఉద్యమం నుండి నక్సల్బరీ- మావోయిస్టు ఉద్యమాల దాకా ఎంతో విస్తృతమైన ఆచరణ, అనుభవం ఉన్న తనను, అన్ని విధాల అల్పులమైన మేము ఏక వచన ప్రయోగం చేసినా, చిన్నా పెద్దా తేడా లేకుండా సి.పి. అని సంబోధించినా అది ఆయన మా మీద చూపించిన ప్రేమ వల్లే సాధ్యమైంది. కొత్తగా సాహిత్య, సాంస్కృతిక వాతావరణంలోకి వచ్చిన మాబోటి వాళ్ళతో ఆయన భుజాల మీద చేతులు వేసి నడిచేవాడు. బాబూ అని పిలుస్తుండేవాడు.

ఇప్పుడు - చలసాని గురించి తారీకులూ గట్రా వివరాలు లేకుండా, కేవలం చెదురు మదురు జ్ఞాపకాల మీద ఆధార పడి ఆయన గురించి తలపోస్తున్నప్పుడు దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉండే ఆయన రచనా విధానమే గుర్తుకొస్తున్నది. సి.పి ఏది రాసినా దాని పుట్టుపూర్వోత్తరాల ప్రస్తావన లేకుండా ఉండదు. వ్యక్తులను ప్రస్తావించినా, సంఘటనల గురించి రాసినా దేశ కాలాలను తప్పకుండా ప్రస్తావించేవాడు. ఇట్లా సవివరంగా రాసేందుకు ఆయన మేధ సదా సంసిద్ధంగా ఉండేది. ఈ శక్తితోనే ఆయన కృష్ణాబాయిగారితో కలిసి శ్రీశ్రీ , కొకుల సమగ్ర సంపుటాలను పాఠకుల ముందుకు తేగలిగాడు.

అయితే ఆయన చివరి దశకాల్లో వయసు రీత్యా ఈ శక్తి కొద్దికొద్దిగా మందగిస్తూ వచ్చింది. విరసం మహాసభల్లోనూ, సాహిత్య పాఠశాలల్లోనూ విరసం పతాక గీతం 'ఎత్తినాం విరసం జెండా' పాటతో కార్యక్రమాలను ప్రారంభించడం ఆనవాయితీ. ఈ పాటను ఎప్పుడూ చలసానే పాడేవాడు. లయబద్ధంగా ఆయన పాడుతుంటే మిగిలిన వాళ్ళు ఆయనను అనుసరించేవాళ్ళు. అయితే ఒకసారి విశాఖపట్నంలో జరిగిన సభల్లో అనుకుంటాను. పాటలోని ఒక చరణంలో కొన్ని పాదాల దగ్గర ఆయన తడబడ్డాడు. ఆ తర్వాత వెంటనే సరి దిద్దుకున్నా, పతాకావిష్కరణ కార్యక్రమం అయిపోగానే ఆయన తన్జాపక శక్తిని పరీక్షించుకోవడం కోసం, సీరియస్‌గా కలం, కాగితం తీసుకొని పతాక గీతాన్ని మొదటి పాదం నుండి చివరి దాకా తడబాటూ లేకుండా రాసి చూసుకొని సంతృప్తి పడ్డాడు.

మాటల సందర్భంలో ఏదైనా కవిత్వమో, కథో, నవలో, విమర్శో చర్చకు వచ్చినప్పుడు, వాటికి సంబంధించిన వాచకంలోని పంక్తులూ, విడి భాగాలనూ ఆయన స్పష్టంగా, ఖచ్చితంగా గుర్తు పట్టేవాడు. అవసరమైతే వాటిని నిర్ధారించుకోవడం కోసం వాటి గురించి తెలిసి ఉంటుందనుకున్న వ్యక్తులతో వెంటనే ఫోన్ ద్వారాగానీ, ఉత్తరం ద్వారా గానీ సంప్రదించి నిర్ధారణ చేసుకొనేవాడు. నికోలాయ్ ఓస్త్రావ్‌స్కీ- కాకలు తీరిన యోధులు నవలలోని కొన్ని పంక్తులను నిర్ధారించుకోవడం కోసం ఆయన నాకు ఓసారి ఇలాగే ఉత్తరం రాసాడు.

వ్యక్తిగతమైన పనులు, ఇష్టాలు, ఇతరేతరాలూ ఎన్ని ఉన్నా ఉద్యమావసరాలే ఆయనకు ప్రథమ ప్రాధాన్యం. ఒకసారి అరుణతార పనుల మీద నేను రెండు రోజుల పాటు విజయవాడలో ఉండాల్సొచ్చింది. ఇతర పనుల మీద ఆయన కూడా సరిగ్గా అప్పుడే విజయవాడకు వచ్చాడు. అక్కడ నేనున్నానని తెలుసుకొని, తన పనులు త్వరత్వరగా ముగించుకొని నాకు తోడుగా ఉండడం కోసం మిగిలిన సమయం అంతా ఆ రెండు రోజుల పాటూ ప్రెస్ లోనే గడిపాడు.

కొన్ని ఉద్విగ్నక్షణాల మధ్య...

బాలసుధాకర్

మౌనంగా పిడికిళ్లెత్తి
జోహార్లు చెబుతున్న దృశ్యమే కళ్ల ముందు -
ఏ స్వప్నాలు
కెరటాల్లా ఎగిసివస్తున్నాయో
ఏ దుఃఖాలు
లావాలా ఉబికి వస్తున్నాయో
ఆత్మీయులు
భుజం భుజం కలిపి కొత్త వారధిని నిర్మిస్తున్నవాళ్లు
ఏం కాకపోయినా
కన్నీళ్లు కార్చినవాళ్లు
ఎక్కడ నుంచో
పిడికెడు స్థైర్యాన్ని పొందినట్టు
అక్కడికక్కడే కాసింత స్ఫూర్తిని పొందినవాళ్లు
అంతా ఒక దగ్గరే
అమరుని దేహం చుట్టూ చేరి
రేపటిని వాగ్దానం చేస్తున్నారు

2

తీరం వెంబడి నడుస్తున్నాను
ఒక దిగులును దిగమింగుకుంటూ
గొంతెత్తి
అమరత్వాన్ని గానం చేస్తున్న
ఒక సమూహాన్ని
అలల ఘోషలో పోల్చుకుంటున్నాను
ఇసుకపర్రల మీద
పాదాల గమ్యాన్ని వెతుక్కుంటున్నాను
చుట్టూ జనసమూహం
సముద్రంతో
తమని తాము విభిన్న రూపాల్లో
వ్యక్తం చేసుకుంటూ...

3

సముద్రానికా శక్తి ఎక్కడినుంచొస్తుందో...
ఊయలలూపుతుంది
లాలిస్తుంది
అట్నుంచి యిటు
ఇట్నుంచి అటు తోస్తూ
పిల్లని నిలబెడుతున్న తల్లి ఆవులా
అచ్చం
విప్లవాగ్నిలా...

4

వెళ్తూ వెళ్తూ
కొన్ని ఉద్విగ్నక్షణాల్ని
రక్తనాళాల్లోకి ఊదుకుంటున్నాను -

(కా. చలసాని ప్రసాద్ అంతిమయాత్ర నుంచి....)

తొంభై ఐదు తర్వాత విరసంలో సభ్యులుగా చేరిన మాకు ఒక వైపు విప్లవోద్యమాన్ని సమర్ధిస్తూనే, మరో వైపు వివిధ అస్తిత్వ ధోరణులనూ, సామాజిక మార్పులనూ సమన్వయం చేసుకోవడంలో సందేహాలు కలుగుతుండేవి. ఇట్లాంటి సందర్భాల్లో ఏ రకమైన జంకూగొంకూ లేకుండా మాటాడుకునేందుకు చలసానిని మించిన మనిషి మరొకరు ఉన్నట్టుగా మాకు అనిపించలేదు. చర్చించడానికీ, అభిప్రాయాలను వ్యక్తపరచడానికీ, అవి ఎలాంటి స్వరంతో ఉన్నా చలసాని సదా ఆహ్వానించేవాడు.

వ్యక్తుల అభిప్రాయాలనూ, అనుభవాలనూ, పరిమితులనూ గౌరవిస్తూనే, అవసరమైనప్పుడు వాటిని విభేదించేవాడు. అది కూడా మనుషులు తమ పట్ల ఎలాంటి సున్నితత్వాన్ని కోరుకుంటారో, అదే సున్నితత్వంతో తన అభిప్రాయలను చెప్పేవాడు. భిన్నాభిప్రాయాలను ప్రకటించినందుకో, తీవ్ర స్వరంతో విమర్శించినందుకో, వ్యక్తిగతమైన పరిమితులు, బలహీనతల కారణంగా, ఆయన- మనుషులను పక్కన పెట్టినట్టుగా నేనెప్పుడూ వినలేదు.

ఇట్లాంటి జీవితం వల్లనే ఆయన పరిచయాలు, మానవసంబంధాలు కళ్లు చెదిరేంత విస్తృతంగా మారి ఉంటాయి. ఉమ్మడి కమ్యునిస్టు ఉద్యమం మొదలుకొని ఇప్పటిదాకా, వివిధ సామాజిక చలనాలకు గురుతులుగా నిలబడ్డ అసంఖ్యాక వ్యక్తులతో ఆయనకు సంబంధాలు ఏర్పడి ఉంటాయి. ఇట్లాంటి మానవ సంబంధాల వల్లనే ఆయన విరసానికీ, ప్రగతిశీల, పౌరహక్కుల ఉద్యమాలకూ ఎనలేని సేవలు అందించగలిగాడు. ఆయా పోరాటాల మీద నిర్బంధం విరుచుక పడినప్పుడు తనకున్న వేల చేతులతో పాలక వర్గాల కుట్రలను ప్రజల్లోకి తీసుక పోగలిగాడు.

ఆయన ఇంటి ముఖ ద్వారానికి మార్క్స్, బుద్ధుడు, అంబేద్కర్ చిత్తరువులు తగిలించి ఉండేవి. వీరు ముగ్గురూ భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి అత్యావశ్యక మార్గదర్శులు అని ఆయన మాతో అన్నాడు. వలసవాదం ఏ రూపంలో ఉన్నా ఆయన తీవ్రంగా అసహ్యించుకొనేవాడు. గూగీవాధియాంగో ఒక సారి తన ఇంటికి తన కోసం ఫోన్ చేయడాన్ని అపురూపంగా ఆయన చెప్పడం నేను స్వయానా రెండు మూడు సార్లు విన్నాను. వీర స్టాలినిష్టుగా పిలవబడడాన్ని ఇష్టపడే తను స్టాలిన్ బలహీనతల గురించి ప్రస్తావించినప్పుడు సావధానంగా వినేవాడు. అన్నింటికీ మించి మనుషుల జీవితాల్లో సంక్షోభాలు ఏర్పడినప్పుడు అందరికీ మించిన ఆర్తిని ఆయన ప్రదర్శించేవాడు. ఆర్థికంగా ఇబ్బందులు వచ్చినా, ఉద్యోగ సమస్య అయినా, కుటుంబ సమస్యలయినా అనేక మంది ఆయన వైపు చూడడం నాకు తెలుసు. ఆయనవి గరుత్మంతుని రెక్కలు. ఇలాంటి సందర్భాల్లో ఆయన ఇల్లు సొంత ఇంటిని మించి తలుపులు చాచుకొనేది.

ఇంత గొప్ప సామాజిక సంబంధాలు ఉన్నప్పటికీ వాటిని ఆయన తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం, విలాసాల కోసం వాడుకున్న సందర్భం నాకు తెలిసి ఒక్కటి కూడా లేదు. నిరాడంబరత, కార్యశీలత కలగలిసిన అపురూపమైన మనిషి చలసాని.



మరో ప్రపంచపు మనిషి

ప్రొ. జి. హరగోపాల్

చలసాని ప్రసాద్‌తో నా స్నేహాన్ని వెనక్కి తిరిగి చూస్తే, దాదాపు మూడు దశాబ్దాలుగా ఏ వివాదాస్పదమైన చర్చల లేకుండా ఎక్కడ ఒడుదుడుకులు లేకుండా ఇంత సాఫీగా ఎలా సాగిందో ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ప్రసాద్ చాలా బలమైన, లోతైన రాజకీయ విశ్వాసాలున్నవాడు. విప్లవ రాజకీయాలలో తలమునకలైనవాడు. తెలుగు సమాజం ఈ మూడు, నాల్గు దశాబ్దాలలో విపరీతమైన వాడి, వేడి చర్చలో నుండి తీవ్రమైన వివాదాల నుండి ప్రయాణం చేసింది. సైద్ధాంతిక అవగాహనలో విభేదాలు, మానవ ప్రవృత్తి మీద మౌలికమైన అనుమానాలు, అభిప్రాయ బేధాలు విప్లవ పార్టీల ఆచరణ మీద వాళ్ల చర్యల మీద దుమారాలు పౌరహక్కుల సంఘంలో హింస మీద జరిగిన చర్చా... ఒకటి కాదు ఈ కాలమంతా వివాదాల, విబేధాల మధ్య గడిచింది. ఇక అస్తిత్వ రాజకీయాలు విప్లవ సంస్థల పునాదుల దాకా పాకాయి. వీటన్నింటిలో దేనితో సంబంధం లేనట్లు మా స్నేహం కొనసాగింది. ఇది ఎలా సాధ్యం. నేను విశాఖపట్టణం వెళ్లితే నగరంలో ఉంటే తప్పక కలిసే వాళ్ళం. అప్పుడప్పుడూ రైల్వే స్టేషన్‌కు వచ్చేవాడు, ఒకటి రెండు సార్లు ఎయిర్‌పోర్టుకు కూడా వచ్చాడు. బహుశా ఆయన చర్చలలో విభేదాల కంటే, జీవిత ఆచరణ మీద ఎక్కువ దృష్టి పెట్టాడనుకుంటాను. ప్రసాద్ ఇల్లు, ప్రసాద్ సంభాషణ తీరు, ప్రసాద్ నడిచే పద్ధతి ఈ ప్రపంచంలో ఏం సంబంధం లేనివాడుగా కనిపించేవాడు.

జీవితంలో సీరియస్ రాజకీయాలతో సంబంధమున్నవాడు, ప్రపంచ మార్పు కొరకు స్వప్నం కన్నవాడు, జీవితం ఒకేసారి వస్తుందని నమ్మినవాడు, ఒక సమగ్ర ప్రాపంచిక దృక్పథమున్నవాడు, జీవితాన్ని, ప్రపంచాన్ని నిశితంగా చూసేవాడు. పైకి అగుపించడానికి ఈ ప్రపంచంతో సంబంధం లేనివాడుగా ఎలా జీవించాడు అని ఆలోచిస్తే ప్రసాద్ జీవితం మీద అంచనా వేయడానికి కొన్ని భిన్న ప్రమాణాలు కావాలేమో.

ప్రసాద్ తెలిసిన ఏ వ్యక్తినైనా ఆయన గురించి అడిగితే ముందుగా చెప్పేది ప్రసాద్ అందించిన అమృతమయమైన స్నేహాన్ని, వాత్సల్యాన్ని, ప్రేమను, ఒక ఆత్మీయతను గురించే ఎక్కువ మాట్లాడతారు. బాలగోపాల్‌తో ప్రసాద్ గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో 'ఆయన ఒక మనిషిని ఇష్టపడితే ఆ మనిషిలోని లోపాలను, పరిమితులను పట్టించుకోడు అని అంటూ శ్రీశ్రీ గొప్ప కవే కావచ్చు, కానీ శ్రీశ్రీ చేసిన ప్రతి పనిని ఆరాధనా భావంతో చూడడం, ఆయన రాసిన ప్రతి వాక్యాన్ని విలువైనదనుకోవడం ఎందుకు' అని అన్నాడు. ఇది ఒక శ్రీశ్రీ విషయంలోనే కాదు. బహుశా చాలా మంది స్నేహితుల విషయంలో ప్రసాద్ ప్రవర్తన అలాగే ఉండేది. బాలగోపాల్ ఎన్ని మౌలికమైన అంశాలు చర్చకు పెట్టినా, దాని గురించి మాట్లాడకుండా ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లల్లో, సభల్లో మాట్లాడిన అంశాలు ఏ వార్తా పత్రికల్లో వచ్చినా వాటిని జాగ్రత్తగా కత్తిరించి భద్రపరచాడు. కొంత నా విషయంలో కూడా అలాంటి పనే చేసాడు. శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొకు ఇలా కొందరి రచనల పట్ల ఆయన మమకారమే వేరు. వాళ్ల రచనలనే కాక వ్యక్తులుగా కూడా వాళ్లను అభిమానించి ప్రేమించాడు. వీళ్ల రచనలు భవిష్యత్ తరాలకు భద్రంగా అందించే బాధ్యత తన భుజస్కందాల మీదే ఉన్నట్లు భావించి, దాని కొరకు అహోరాత్రులు శ్రమించేవాడు.

ప్రసాద్‌ను కలిస్తే ముందు కుటుంబ సభ్యుల గురించి అడిగేవాడు. ముందుగా నా సహచరి వనమాల ఎలా ఉంది అని అడిగేవాడు. తర్వాత ఇతర స్నేహితుల గురించి వాకబు చేసేవాడు. కొందరు స్నేహితుల విషయంలో ఆ గాడిద ఎట్లున్నాడు, ఈ దున్నపోతు ఏం చేస్తున్నడు అని చాలా ఆత్మీయంగా అడిగేవాడు. ప్రసాద్ ఆ గాడిద ఎలా ఉన్నాడంటే వినేవాడికి గాడిద మీద గౌరవం పెరిగేలా ఉండేది. అప్పుడప్పుడు కార్డు ముక్క రాసేవాడు. కార్డులో ఏదైనా సభకు రమ్మనో, ఏదైనా వ్యాసం రాయమనో రెండు వాక్యాల్లో ముగించి, మిగతా అంతా కుటుంబ సభ్యుల, స్నేహితుల క్షేమ సమాచారాల గురించే ఉండేవి.

ఇంతకు ప్రసాద్ వ్యక్తిత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అని ఆలోచిస్తే, ఆయన విప్లవానంతర సమాజానికి చెందినవాడుగా అనిపిస్తాడు. అంటే మరో ప్రపంచం మనిషేమో అనేలా జీవించాడు. నిష్కల్మషంగా,

చలసాని ప్రసాద్‌తో నా అనుబంధం

జె.ఎస్. ప్రకాశ్‌రావు

శ్రీ చలసాని ప్రసాద్ ఆంధ్రా యూనివర్సిటీలో హిస్టరీ & పొలిటిక్స్ విభాగంలో 1957లో బి.ఎ. చేశాడు. నాకంటే రెండు సంవత్సరాలు సీనియర్ ప్రసాద్ మిస్సెస్ ఎవిఎన్ కాలేజీలో హిస్టరీ, పొలిటిక్స్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పొలిటిక్స్ విభాగంలో 1968లో అధ్యాపకునిగా చేరాడు. అప్పుడే మా మొదటి పరిచయం ప్రసాద్‌తో స్నేహం నా అదృష్టం.

ప్రసాద్ అజాత శత్రువు. స్నేహశీలి. అందరికీ సాయం చేసేవాడు. సాయం అడగని వాడిదే. పాపం. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవాడు. 1973 వరకూ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటిక్స్ ఒకే డిపార్ట్‌మెంటుగా ఉండేవి. 1973 హిస్టరీ, పొలిటిక్స్ కొత్త డిపార్ట్‌మెంట్స్‌గా ఆవిర్భవించాయి. ప్రసాద్ రాజనీతిశాస్త్రం (పొలిటికల్ థియరీ) అంతర్జాతీయ సంబంధాలు (ఇంటర్‌నేషనల్ రిలేషన్స్) ఆధునిక భారత రాజకీయాలు (మోడర్న్ ఇండియన్ పొలిటిక్స్) పార్మాంశాలుగా బి.ఎ. విద్యార్థులకు బోధించేవాడు కాలేజీకి వచ్చిన రోజుల్లో ఒక్క క్లాసు అయినా వదలలేదు. ప్రసాద్ ఉపన్యాసాల వల్ల విద్యార్థులు విస్తృతంగా ప్రభావితులైనారు.

ప్రసాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి ఎప్పుడు అంటూ ఉండేవాడు. "My head is in History, My heart is in Literature and the Soul is in Philosphy".

1974లో తెలుగు అకాడమీ 'రష్యన్ విప్లవం' మోనోగ్రఫి రాయమని కోరింది. తెలుగులో రాయడం నాకు అసలు అలవాటు లేదు. పోస్టుకార్డు అయినా తెలుగులో రాయలేదు అని చెప్పి బాధపడ్డాను. సరళమైన తెలుగులో రాసే విధానాన్ని చెప్పి దిశా నిర్దేశం చేశాడు. రచనా విధానం స్పష్టంగా, క్లుప్తంగా సరళంగా ఉండాలని సలహా ఇచ్చాడు. వ్యవహారిక భాషలో సరళమైన శైలిలో రాయడానికి దిశా నిర్దేశం చేశాడు.

ప్రసాద్ సలహాననుసరించే తెలుగు అకాడమీకి, ఓపెన్ యూనివర్సిటీకి, ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కి డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ క్లాసులకు పుస్తకాలు రాసేను. తెలుగులో రాసిన పుస్తకాలు అన్నీ ముందు ప్రసాద్‌కి చూపించాను. ఆ విధంగా ప్రసాద్ నాకు గురువు. ప్రసాద్ నన్ను ఎంతో అభిమానించాడు. ప్రసాద్ ఆప్యాయతను ఎన్నడూ మరవలేను. ఆయన లేనిలోటును ఊహించడమే కష్టంగా ఉంది.

ప్రసాద్ వ్యక్తిత్వం నా మనస్సుపై చెరగని ముద్ర వేసింది.

సాహిత్యపిపాసి, పుస్తక ప్రియుడు, మహా విద్వాంసుడైనా పామరులతో మమేకమయ్యాడు. మేధావి అయినా మూర్ఖులను అమాయకులను సమతా దృష్టితో చూచిన మహితాత్ముడు. లక్షల కొద్దీ డబ్బు ఆయన చేతులు దాటినా చంచలమైన డబ్బు ఆయన మనస్సును చలింపచేయలేదు.

సమతా మమతా దృష్టి కల్గిన ప్రేమస్వరూపి ద్వంద్వాలకు అతీతుడై అమరుడైన చలసాని ప్రసాద్ - నవతరానికి చెందిన మహారుషి

నిరాడంబరంగా, నిజాయితిగా, నిబద్ధతతో, తనదేమీ కాదని, అంతా తనదేనని జీవించిన మనిషి భవిష్యతుకు చెందినవాడు కాక మరేమవుతాడు. నిజానికి విప్లవాలంటే హింస అని విప్లవం తర్వాత ఉండేదంతా విధ్వంసమే అని అనుకునే వాళ్లతో వాదించే బదులు చలసాని ప్రసాద్ లాంటి మనుషుల జననం కొరకు మానవ సమాజం పడుతున్న ప్రసవ వేదనే విప్లవం అని చెప్పవలసి ఉంటుంది. ప్రసాద్‌ను ఒక సజీవ సాక్షంగా చూపవలసి ఉంటుంది.

ప్రసాద్‌తో చాలా అనుభవాలున్నా, ఒకటి రెండు సంఘటనలను ప్రస్తావించాలి. గంటి ప్రసాదం హత్య తర్వాత ఆయన శవ పేటికకు తల కొట్టుకుంటూ గంటీ, గంటీ అన్ని గట్టిగా ఏడుస్తున్నప్పుడు నీళ్ళు కట్టలు తెంచుకొని ప్రవహించాయి. గంటి ప్రసాద్‌కు చలసాని ప్రసాద్‌కు పేరులోనే కాక ప్రవృత్తిలో కూడా చాలా పోలికలున్నాయి. ఇద్దరు విప్లవ శిబిరానికి చెంది వాళ్ళు కాబట్టి వాళ్ళ బంధం భవిష్యత్తు సమాజ స్వప్నంలో ఏర్పడిన అరుదైన బంధం కావచ్చు.

అలాగే మరొక సంఘటన నోం ఛాంస్కీ హైద్రాబాదుకు వచ్చిన సందర్భం. ఛాంస్కీ వస్తున్నాడు అని తెలిసినప్పటి నుండి చిన్న పిల్లవాడిలో చూసే ఉత్సాహం కనిపించింది. ఎవ్వరిని కలిసినా ఛాంస్కీ వస్తున్నాడని, ఎవరో మిత్రుడు ఆ రోజుల్లో తాను హైద్రాబాద్‌లో ఉండకపోవచ్చు అని అంటే ఎలాంటి కార్యక్రమమున్నా దాన్ని మానుకోవాలని ఛాంస్కీని చూడడం, వినడం ఎంత విలువైనదో వివరించారు. చేసే ప్రతి పనిలో ఒక నిరంతర (passion) ఉద్వేగం ప్రసాద్‌కుండే ఒక విలక్షణమైన గుణం.

మానవ చరిత్రంతా సమాజంలోని స్వార్థానికి, పశుత్వానికి, హింసకు, దౌర్జన్యానికి, దుర్మార్గానికి ఒకవైపు, మరోవైపు ప్రేమకు, స్నేహానికి, నిరాడంబరతకు, నిస్వార్థానికి, సమిష్టితత్వానికి మధ్య జరుగుతున్న పోరాటమే. మానవత్వానికి అమానుషత్వానికి మూలాలు ఎక్కడున్నాయి అన్న ప్రశ్న నుండే మార్క్స్ దాన్ని అస్తి సంబంధాలలో చూసాడు. భౌతిక పునాది మౌలికంగా అన్ని సామాజిక సంబంధాలను నిర్దేసిస్తుందని సూత్రీకరించాడు. భౌతిక పునాదిని మార్చే క్రమంలో నూతన మానవుడి ఆవిష్కరణ కూడా జరుగుతుందని చాలా బలంగా ప్రతిపాదించాడు.

మానవ ప్రవృత్తి నిరంతరంగా పరిణామం చెందుతూ ఉన్నది. మానవ ప్రవృత్తిలోని మనిషి సహజమైన మానవీయమైన మనిషిగా రూపాంతరం చెందే క్రమంలో జరిగే ఘర్షణలో సమాజాలు నిరంతరంగా ఆటుపోటులకు గురౌతున్నవి. మనుషుల అవగాహన తాము జీవిస్తున్న కాలం బట్టి, పరిస్థితుల బట్టి ఏర్పడుతుంది. కాని తామున్న కాలాన్ని, పరిస్థితులను దాటి ఒక చారిత్రక స్పృహతో, ఒక ప్రాపంచిక దృక్పథంతో మారుతున్న ప్రపంచాన్ని చూస్తే అవగాహనకు ఒక విశాలమైన భూమిక ఏర్పడుతుంది. అయితే చాలా మంది ఆ కొత్త సమాజం వస్తుందా చస్తుందా, ఈ మనుషులతో ఏం నూతన ప్రపంచాన్ని నిర్మిస్తాం అనే నిరాశావాదం ఒకటి ఈ మధ్యకాలంలో విస్తృతంగా కనిపిస్తున్నది. అలాంటి సందేహాలున్న ప్రపంచానికి మరో ప్రపంచం మనిషి ఉన్నాడు, ఉంటాడు అని మరో ప్రపంచ సృష్టి జరుగుతుందని విశ్వాసంతో మాట్లాడడానికి ఒక చలసాని ప్రసాద్ లాంటి మనిషే మనకుండే సజీవ సాక్షాధారం.



చరిత్రప్రవాహంలో చలసాని

అట్టాడ అప్పల్నాయుడు

యే వ్యక్తిని తలచుకున్నపుడు ఆ తలపుల్లో చరిత్రప్రవాహం కదలుతుందో ఆ వ్యక్తి ఆ చరిత్రప్రవాహంలో మునిగితేలినవాడనీ, చరితార్థుడనీ, సార్థకజీవనీ అంటారు! చాలామందికి కుటుంబచరిత్ర మాత్రమే వుంటుంది. ఆ కుటుంబీకుల తలపుల్లో మాత్రమే వాళ్లు మిగులుతారు! కానీ సామాజికచరిత్రప్రవాహంలో ఈదులాడినవాళ్లు... సమాజమందరి తలపుల్లోనా మిగులుతారు. అలా యెందరో తలపుల్లోన మిగిలినవాడు చలసాని! చరిత్రప్రవాహంలో ఈదులాడివ వాడు. చలసాని ప్రసాద్‌గారిని నేను మొదట... తిరుపతి విరసం మహాసభల్లో (1979) కలిసేను. అంతకముందర ఆయనను చూసేను... దూరం నుంచీ, దగ్గరనుంచీ!

మా ప్రాంతంలో జరిగిన జననాట్యమండలి ప్రదర్శనలపై (హైదరాబాద్ భూపాల్ దళం) 1975 ఎమర్జెన్సీకి కొద్దినెలల ముందర కేసు మోపబడినపుడూ, తర్వాత ఎమర్జెన్సీపోయిన కొన్నాళ్లదాకా కోర్టులో కేసు నడుస్తున్నపుడూ, అంతకముందర శ్రీశ్రీ, ఐ. వి వగైరాలతో పార్వతీపురం నవరత్నటాకీస్ గ్రౌండులో బహిరంగసభ జరిగినపుడూ, వంగపండు ప్రసాద్‌తో పాటలు కోరస్ పాడుతుండగా.. చలసానిని చూసేను. భూషణంగారి ద్వారాచలసానిగురించి విన్నాను (భూషణం, గంటిప్రసాదం, నేనూ మరికొంతమందిమీ జననాట్యమండలి కేసులో ముద్దాయిలం!) జననాట్యమండలికేసు విచారణ విశాఖపట్నంలో జరుగుతున్నపుడు ముద్దాయిలకు వసతి (టర్నర్‌చౌల్ట్రీ) యేర్పాటూ, విశాఖలో అక్కడక్కడా జననాట్యమండలిప్రదర్శనలూ... తద్వారా జోలెపట్టుకుని చందాలు వసూలు చేసుకొనే యేర్పాటూ... చలసాని చేయగా చూసిన నాకు భూషణంగారిద్వారా విన్నది ధృఢపడింది. విశాఖలో విప్లవసాహితీ నౌకకు చుక్కాని-చలసాని అని బోధపడింది. అప్పటికి నేను కథలుగానీ, కవితలుగానీ వ్యాసాలుగానీ యేవీ రాసిన రచయితను కాదు. కానీ కొన్ని కరపత్రాలు రాసేనంతే! అంచేత చలసానితో పరోక్షపరిచయమే ఆనాటికి! కానీ సాహిత్యం చదివేను. వేడిరగిలించే దిగంబర కవుల దిక్కుల్నీ, సి. విజయలక్ష్మి కవితల్నీ, సృజన పత్రికనూ, భూషణంగారి కథల్నీ బాగా యిష్టపడేవాణ్ణి! బహుశా మా ఊరిలో యువజనసంగం నడపడం, నాటకాలు వేయడం, నక్స లైట్‌రాజకీయ సంబంధికావటం, అరుణాతో ప్రేమ, వివాహం, బతుకుతెరువుకోసం రకరకాల ఉద్యోగాలు చేసిన క్రమంలోనాగావలి (దుప్పల క్రిష్ణమూర్తి, నక్సలైట్, జైలునుంచి విడుదల అయి. పత్రిక పెట్టేడు) పత్రికలో పనిచేయడం వలన రచనలు చేయాలన్న ఆలోచన కలిగింది. కొద్దినాళ్లకే నాగావలి ఆగిపోయినా రచనలు చేయాలన్న ఆలోచన నాలో ఆగలేదు. అలా నేను నా తొలికథ 'పువ్వులకొరడా' రాయడం, సృజనలో ప్రచురణగావడం, ఆ ఊపులో మరికొన్ని కథలు రాయడం, ఇదే ఊపు తిరుపతి విరసం సభలకు రావడం జరిగింది! విరసంలో సభ్యత్వానికి సిఫార్సు సంతకాన్ని చలసాని చేయడం... అదీ తొలిసారిగా చలసానితో మాటాడ్డం, చలసాని కౌగిలింపులోని స్నేహమాధుర్యాన్ని రుచిచూడడం ! ఇకక్కడినుంచీ ఆయనే అన్నట్టు రెస్ట్ ఈజ్ హిస్టరీ... ! శ్రీకాకుళ విప్లవాగ్నులలోంచి విరసం పుట్టిందని శ్రీశ్రీ అనేవారని చలసాని అంటుంటారెపుడూ! అటువంటి శ్రీకాకుళం నుంచి భూషణం విరసానికి రాజీనామా చేసాక కొన్నాళ్లకు శ్రీకాకుళం నుంచి విరసంలో చేరింది నేనే! ఒక్కడితో యూనిట్ వీలుగాదని నన్ను, విజయనగరం రాంబాబునీ కలిపి విశాఖయూనిట్లోనే వుంచేరు. అపుడు మాకు దిశానిర్దేశం చలసానే! మరోమూడునాలుగేళ్లకు (1984) మాకివలసలో విరసంమహాసభలు జరపడం, నక్సలైట్ నాయకుడు మామిడి అప్పలసూరి, గుమ్మడి లచ్చయ్యల స్వగ్రామం.. కోమర్తిలో విరసం బహిరంగసభ, (కోమర్తి గ్రామంలో అప్పలసూరి ఇంటికి దగ్గరలో ఒక చెరువుంది. ఆ చెరువులో చలసాని ఈత, స్నానం.. ఆ గ్రామప్రజలు యిప్పటికీ ఊసులాడుకుంటుంటారు) , గద్దర్, సంజీవి, సుబ్బారావు (ఇపుడు ఆంధ్రాయూనివర్సిటీ ప్రొఫెసర్) ఆట, పాట, జననాట్యమండలి ప్రదర్శనల

యేర్పాట్లూ... దిగ్విజయంగా మహాసభల నిర్వహణా చలసాని నాతో ఆవహించి జరిపించేడు! ఆ సభల్లో శ్రీకాకుళంజిల్లానుంచి మరో అయిదుగురు సభ్యులు చేరడం శ్రీకాకుళం విరసం యూనిట్ యేర్పాటుచేసాం. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మూడుజిల్లాల కళింగాంధ్రలో విరసం యూనిట్లు చురుకుగా పనిచేయడంలో చలసాని పాత్ర ముఖ్యమయినది. మూడు జిల్లాల్లో సభలకూ వక్తగా చలసాని విరివిగా తిరిగేవారు. నిర్వాహకులకు చలసాని కొండంత అండ! విజయనగరంలో సభలు, విశాఖలో సభలూ, వర్క్‌షాప్‌లూ... బడ్డపాడులో పాణిగ్రాహివర్ధంతి యిలా కార్యక్రమాల పరంపరగా వుండేవి రోజులు! వంగపండు భూమిభాగోతం, పాటలూ, చలసాని 'ఈ విప్లవాగ్నులూ ఎచటవని...' పాట కళింగాంధ్రా అంతటా మార్మోగేవి. మరోసారి శ్రీకాకుళంజిల్లాలో సభలనిర్వహణ తలచటం, పలాసలో జరపాలనుకోవటం-ఉద్దానం జీడిపంటల ధరలకోసం రైతుల పోరాటం, పలాస జీడిపరిశ్రమల కాలుష్యానికి వ్యతిరేక పోరాటం, నీటిసమస్యల పరిష్కారపోరాటాలు... ప్రజాపోరాటాల జ్వాలా పలాసలో విరసం సభల నిర్వహణకు రాజ్యం భయపడింది. అనుమతి నిరాకరించింది. నిర్వాహకులనరెస్టు చేసింది. సభలను వాయిదా వేసకోవటం జరిగింది, ఆసరికి.

మళ్లీ 1998లో రెండోసారి శ్రీకాకుళంలో విరసం మహాసభల నిర్వహణ జరిగింది. (ఈ మహాసభల నుంచి తిరిగి వెళ్లేకనే కేవీయార్ అమరులయ్యేరు) ఈ సభలదాకా చలసానితో నా ప్రయాణమంతా విప్లవ సాహిత్య సాంస్కృతిక చారిత్రకప్రవాహమే! ఎన్‌కౌంటర్లు, (కొపర్‌డంగ్ ఎన్‌కౌంటర్ జరిగిన కొండలమీదకి వర్షపుముసురు రాత్రివేళ, ధైర్యంగా ముందు నడచిన వాడు చలసాని!) పౌరహక్కుల నేతల (వారణాసినారాయణరావు, పేడాడ పరమేశ్వరరావు, కిడ్నాపులు... రాజ్యసర్పపు పడగ విసురులు... చీమలదండు వెంట నడవడం, చీమలకొరకు నిలవడం నేర్పినవాడు చలసాని, నడిపినవాడు చలసాని! రెండోసారి విరసం మహాసభలు శ్రీకాకుళంలో జరిగిన యేడాది తర్వాత నేను విరసానికి దూరంకావడం... అయినా, యెపుడు కలిసినా కౌగిలింత, భుజమ్మీద చేయి వేయడం చలసాని మాత్రమే చేసే అసంకల్పిత చర్యలు! ఆయన, నా తొలికథాసంపుటం 'పోడు-పోరు'కి రా.వి. శాస్త్రిగారి చేత ముందుమాట రాయించేరు. రావిశాస్త్రిగారు ముందుమాట రాయడానికి అంతగా అంగీకరించరు. నాకేమో రావిశాస్త్రిగారితో పరిచయంలేదు. ఏమి చెప్పి రాయించేరోమరి! ఇక శ్రీకాకుళంలో విరసం మహాసభలకోసం చందాలు వసూలుచేయడానికి నా రెండుభుజాలూ చలసానివే! రెండుసార్లు మహాసభలు నిర్వహించగలగటానికి... చలసానిగారి పూర్తి సహకారం కారణం! విరసం సభల నిర్వహణ, విరసం వ్యవహారాల వరకూ నాతో పూర్తిగా కలసిపోయేవారు. చనువుగా మాటాడేవారు. చందా యిచ్చేవారి సంపాదనలగురించీ, వారి రాజకీయాలగురించీ యేవేవో జోక్‌లు చెప్పేవారు. సభల నిర్వాహకసంఘం నుంచీ బహిరంగసభ వక్తలుదాకా యెవరె వర్ని నిర్ణయించాలో తన అనుభవాలను చెప్పి సలహాలిచ్చే వారు. విరసం పరిధివరకూ మా యిద్దరి ఉమ్మడి కర్తవ్య నిర్వ హణకు ఆటంకం కాని రీతిలో మా సంబంధాల్ని నడిపేవాడు. కొంత దూరమూ, కొంత దగ్గరా వుండేవాడు...!

చలసానికి విప్లవరాజకీయాల గురించి స్పష్టమయిన అభిప్రాయాలున్నాయి. అందులోనూ విప్లవ శిబిరాల పట్ల. ఆయన ఒక విప్లవశిబిరానికి చెందిన రాజకీయాలను ఇష్టపడినవాడు. శ్రీకాకుళం నుంచి విరసం సభ్యుడు తన శిబిరానికి చెందివుంటే బాగుణ్ణని కోరుకునివుంటాడు. కానీ నేను మరో శిబిరానికి చెందినవాణ్ణి! బహుశా భూషణం నాలా కాదు. అప్పటికి శిబిరాల గోల లేదనుకుంటాను. విరసంలో నేను సభ్యుణ్ణయ్యేనే కానీ విరసం ప్రణాళికను అంగీకరించినవాణ్ణి కాను, మెజారిటీ ఆమోదానికి కట్టుబడి వున్నవాణ్ణి మాత్రమే! అలాగే ఒక సర్వసభ్యసమావేశంలో వి.వి. జైలుకి సరెండరయినందుకు కొందరు సభ్యులు పెద్దయెత్తున విమర్శచేస్తుంటే, కేవీయార్ బాధపడి పెద్ద వివరణ యివ్వగా... చర్చ విరసం ప్రణాళిక, ఆచరణలమీద జరగాలని కోరినవాణ్ణి. విరసం ప్రయాణంనుంచీ విప్లవోద్యమ ప్రయాణందాకా నా ఆలోచనలు వేరూ, చలసాని ఆలోచనలు వేరు! గమ్యం.. ఒకటే, కాకపోతే గమనమే వేర్వేరు! ఇంతే విభేదం! ఈపాటి విభేదమూ విరోధపాత్రమయిన కాలమూ గడచింది. గానీ మా మధ్య అటువంటి విరోధ సంఘటన యేదీ జరుగలేదు. నేను విరసంలో వున్నపుడుగానీ, విరసం నుంచి బయటకు వచ్చేసినపుడుగానీ మామధ్య యెటువంటి వాదవివాదాలూ జరుగలేదు. అంతే దగ్గరగా, అంతే దూరంగా... నేను విరసం నుంచి బయటకు వచ్చేకగూడా విరసంలో వున్నపుడున్నట్టే చలసాని వున్నాడు! సమీప రాజకీయభావజాల మిత్రులతో యే సమంజసపూర్వక సరిహద్దులు కలిగివుండాలో, ఆ సరిహద్దుల్లో వుంటూనే యెలా స్నేహపూర్వక సహప్రయాణం చేయాలో - అలా చేసినట్టుంది చలసాని నాతో!

చలసానికి కొందరిపట్ల, కొన్ని విషయాలపట్ల నిశ్చితాభిప్రాయాలుంటాయి. సాధారణంగా యెవరో చెప్పగా, యేదో జరగ్గా వెంటనే అభిప్రాయాల్ని మార్చుకోడు (కొందరిలా). తన పరిశీలనా, తన తర్కం తాను చేసి నిర్ధారణకొచ్చి తన దారి తానెంచుకుంటాడు. అలా అని తనను విభేదించే వారితో ఊరకే విరోధం పెంచుకోడు! కనీస స్నేహధర్మాల్ని పాటిస్తాడు. స్నేహం స్నేహమే.. అభిప్రాయాలు అభిప్రాయాలే! అక్కడ రాజీపడడు. అభిప్రాయాల్ని ధృఢంగా కలిగివుండడం, వాటికోసం అంకితం కావడం.. అదే సమయంలో సంయమనంతో అభిప్రాయభేధాల్ని సహించడం, స్నేహపూర్వక బంధాలను కొన సాగించడం.. చలసాని నుంచి నేను గమనించేను. అంచేత, యిటువంటి వ్యక్తి-ఒక విశాలసాహితీవేదిక (ప్రజా పోరాటాలకు సాహితీమద్దతు) నిర్మాణానికి పూనుకుంటే బాగుణ్ణుకదా అనుకునేవాణ్ణి. బహుశా అటువంటి విశాలవేదికనేది చలసాని ద్వారా మాత్రమే సాధ్యమేమో! శ్రీశ్రీని అరసం సభనుంచి విరసంలోకి తేవడమో, విరసంలో ఉంచగలగడమో, విరసం వ్యవస్థాపనలో కీలకపాత్ర పోషించడమో చలసాని చేసిన చరిత్రాత్మకమయిన చర్యలయితే కావచ్చుగానీ అంతకుమించిన చారిత్రక అవసరం- (కాలంగడచేకొద్దీ నేర్పుతున్న పాఠం) విరసంతో పాటూ - విశాల వేదిక! శ్రీకాకుళపోరాటమెంతటి తొందరపాటో - అంతటి తొందరపాటు విరసంయేర్పాటు. మున్నెన్నటికంటే... యివ్వేళ విప్లవ పరిస్థితులున్నవి. ప్రజలు పోరాడక తప్పని పరిస్థితుల్లో వున్నారు. భూముల్నీ, గనుల్నీ, కొండల్నీ, అడవుల్నీ, నదుల్నీ కోల్పోతున్నారు. అభివృద్ధి పేరిట జరిగే విధ్వంసానికి గురవుతున్నారు. తమ అన్నిరకాల అస్తిత్వాల కోసం ప్రజలు పోరాడుతున్నారు. కొన్నిచోట్ల తమంతట తాము పోరాడుతున్నారు (సోంపేటలా), మరికొన్ని చోట్ల విప్లవపార్టీలూ, పార్లమెంటరీకమ్యూనిస్టుపార్టీలూ, స్వచ్ఛందసంస్థల నాయకత్వంలో పోరాడుతున్నారు. వీటిని అనుసంధానం చేసే

కామ్రేడ్ చలసానికి లాల్‌సలాం

రాజ్‌కిశోర్
ప్రధాన కార్యదర్శి, రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్.డి.ఎఫ్)

ఈనాడు కామ్రేడ్ చలసాని మనమధ్య లేకపోవచ్చు. కానీ ఆయన వ్యక్తిత్వం, విప్లవకర ఆలోచనావిధానం ఎప్పుడూ భవిష్యత్ తరానికి ఒక విప్లవకర కాగడాలా వెలుగునిస్తుంటుంది.

కామ్రేడ్ చలసాని తన విద్యార్థి జీవితం నుండే అన్యాయం, అణచివేతలు ఉన్న ఆర్థిక సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పు కోసం పోరాడారు. నక్సల్బరీ సాయుధ విప్లవ రైతాంగ తిరుగుబాటు సిద్ధాంత గొప్పదనాన్ని ఆత్మగతం చేసుకున్నారు. ఈ దశలో రచయితల్ని సంఘటితం చేసి సాహిత్య సాంస్కృతిక రంగాల్లో సాంస్కృతిక పోరాటాన్ని ప్రారంభించారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడుగా ఉంటూనే చుట్టూ ఉండేవాళ్లకు నాయకుడుగా కాకుండా ఆత్మీయమైన కార్యకర్తగా వ్యవహరించేవాడు.

ప్రస్తుతం మావోయిస్టు ఉద్యమానికి ఆయన ఒక ప్రబల ప్రవక్త. నక్సల్బరీ పంథాలో శ్రీకాకుళ రైతాంగ పోరాటం జరిగినప్పుడు తాను విశాఖపట్నంలో ఉంటూ శ్రీశ్రీ షష్టిపూర్తిని నిర్వహించి విప్లవ రచయితల సంఘం ఏర్పడటానికి ఒక నేపథ్యాన్ని ఏర్పాటు చేసినవాడాయన. విరసం స్థాపించడమే కాకుండా శ్రీశ్రీ, రావిశాస్త్రి లాంటి రచయితలను అందులోకి తెచ్చినవాడు కూడా ఆయనే.

దేశంలో నక్సల్బరీ పోరాట సైద్ధాంతిక గొప్పదనం వేరువేరు రూపాల్లో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి చెందుతున్నప్పుడు వాటిని ఏకం చేయడానికి కామ్రేడ్ చలసాని అఖిల భారత స్థాయిలో సాహిత్య సాంస్కృతిక రంగాల్లోని తన విప్లవకర కామ్రేడ్స్‌తో కలిసి అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి (ఆల్ ఇండియా లీగ్ ఫర్ రెవల్యూషనరీ కల్చర్) ఏర్పాటులో ప్రముఖ పాత్ర వహించారు. 1983లో ఢిల్లీలో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి ఆవిర్భావ మహాసభ ఐ.వి.సాంబశివరావు (ప్రకాష్) చలసాని ప్రసాద్‌ల పాత్ర లేకుండా సాధ్యమై ఉండేదే కాదు. ఆయనతో మా బీహార్‌కు చెందిన క్రాంతికారీ సాంస్కృతిక మంచ్, బుద్ధిజీవి సంఘ్ సభ్యులకు పరిచయం, కలివిడితనం ఈ సందర్భంలోనే ఏర్పడింది. ఆయనకు హిందీ రాకపోయినప్పటికీ చాలా స్నేహశీలంగానూ, ఆత్మీయం గానూ ఉండేవాడు. అక్కడి నుండి రెండు దశాబ్దాల పాటు సింధీ, కలకత్తా, త్రిశూర్, హైదరాబాద్ మొదలైన చోట్ల జరిగిన మహాసభల్లో ఎన్నో సమస్యలపై ఏర్పాటు చేసిన సెమినార్లలో మేం కలుస్తుండేవాళ్లం. మాకట్లా గాఢానుబంధం ఏర్పడింది. ఆయన మా వలెనే ఇంగ్లీష్ మాధ్యమంగానూ, అనుసంధాన భాషగానూ, అధికార భాషగానూ ఏ రూపంలో ఉండడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించేవాడు. పాట్నాలో జండర్ సమస్యపై ఏఐఎల్ఆర్‌సి సదస్సు ఏర్పాటు చేసి అవగాహనా పత్రం రూపొందించింది. అప్పుడు ఉన్న రెండు రోజులూ ఆ సదస్సులో ఆయన ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా గంగానదిలో ఈదడమనేది మేమిప్పటికీ మరిచిపోలేదు.

నిర్మాణరీత్యా ఏఐఎల్ఆర్‌సి ఉన్నప్పటికీ ఏఐపిఆర్‌ఎఫ్ సభలకూ, సమావేశాలకూ అఖిలభారత స్థాయిలో ఏర్పడిన అన్ని ప్రజాసంఘాల సభలకు, సమావేశాలకు వచ్చేవాడు. చాలా కాలంపాటు విశాఖపట్నం నుండి కలకత్తాదాకా మాకాయన సాంస్కృతిక ప్రతినిధిగా వ్యవహరించాడు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం దృష్టికోణంలో దేశవ్యాప్తంగా భావాలను ప్రచారం చేయడంలో ఆయన సూటియైన, సరళమైన పద్ధతిలో మాట్లాడేవాడు. విప్లవపార్టీల ఐక్యత తర్వాత విప్లవం ద్వారానే ప్రజాస్వామ్యం సాధ్యమనే లక్ష్యంతో ఏర్పడిన రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు కూడా ఆయన పెద్దదిక్కుగా వ్యవహరించాడు. ఐక్య మావోయిస్టు పార్టీ ఏర్పడిన పదేళ్ల సందర్భంలో పదేళ్ల విప్లవోద్యమాన్ని చర్చించి, సమీక్షించడానికి ఏర్పడిన ప్రత్యామ్నాయ వేదికలో ఆయనయున్నాడు. ఆ సభలో పాల్గొనడానికి హైదరాబాదు కూడా వచ్చాడు. ఆ విధంగా జీవితాంతం కమ్యూనిస్టుగా, నక్సల్బరీ శ్రీకాకుళ కాలం నుండి దండకారణ్య, బీహార్, బెంగాల్, ఝార్ఖండ్ పోరాటాల దాకా విప్లవోద్యమంతో మమేకమైన కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు నేను మా సంస్థ పక్షాన విప్లవాభివందనాలు తెలుపుతూ లాల్‌సలాం చెబుతున్నాను.

విప్లవోద్యమమూ, విశాల ఐక్యసంఘటనా లేవు. సాహిత్య సాంస్కృతిక రంగంలో కూడా యీ ఐక్యతను కలిగిన విశాలవేదిక లేదు. (తెలంగాణా సాధనలో అక్కడి సాహితీసాంస్కృతిక సంస్థలు ఆ విధమైన పని చేసాయి) ఈ అన్ని పోరాటాలకూ, ఆందోళనలకూ మద్దతు తెలిపే, పోరాటాలను గానంచేసే, కథనం చేసే సాహితీ సాంస్కృతిక ఐక్యవేదిక కొరకు చలసాని శ్రమనంతటినీ కాకున్నా కొంతయినా ఖర్చు చేస్తే బాగుణ్ణని వుండేది. అందుకుతగ్గట్టుగా... తను విశ్వసించే విప్లవపార్టీ ఉద్యమాలనేగాక, సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్ వ్యతిరేక ఉద్యమాలకుగానీ, పరవాడ, గంగవరం, విశాఖనగరం పలుప్రాంతాల్లో ప్రజలజీవనాలతో చలగాటమాడే పాలకవర్గ వ్యతిరేక పోరాటాలకుగానీ... వాటికి నాయకత్వం వహించే విప్లవ శిబిరాలకే గాక, స్వచ్ఛంద సంస్థలకూ, పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలకూ తన బిగించిన పిడికిలిని మద్దతుగా యేత్తేవాడు. అందుకే చలసాని హఠాన్మరణానికి కళింగాంధ్రా గుండెలు దడదడా కొట్టుకున్నాయి. బహుశా తెలుగునేలంతటా గూడా కావచ్చు! పాములకు వ్యతిరేకంగా పోరాడే చీమలవేపు నిల్చోవడంలో చలసాని అందరికీ ఆదర్శమే! మధ్యతరగతివాడూ, మేధావీ చలసాని. కానీ సాదాసీదా జనంతో కలిసిపోయేవాడు. అంచేత అటు మేధావివర్గానికీ, యిటు సాదాసీదా జన సామాన్యానికీ యిష్టుడయినాడు. చలసాని మరణానికి స్పందించిన, రోదించిన, అనేకుల్ని... అనేక భిన్నరాజకీయాభిప్రాయల వారినీ చూసినపుడు- బహుశా అందరూ తమఉమ్మడి శక్తిని దేనినో కోల్పోయిన బాధకు గురయినారు! చీలికలు పేలికలవు తోన్న ఉద్యమాల దశలో యిలా ఉమ్మడి శక్తిగా కనిపించే వ్యక్తులు కనుమరుగవుతోంటే దిగులుగా వుంటుంది! విశాల ఐక్యవేదికల అవసరం మరింతగా కనబడుతుంది. కానీ.. చ్.. !

సాహిత్యం, స్నేహం, ప్రేరణ

అరవింద

ప్రసాద్ మావయ్య మా మేనత్త విజయ కి భర్త, అలా నాకు ఆయనతో ఉన్న పరిచయం మొదలు. ఐతే, ఆ పరిచయం కూడా బహుశా నాకు పదేళ్ళు వచ్చిన తరువాతే అనుకుంటా. నిజానికి నాకు మావయ్య తెలిసింది నేను ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్ళి రాజకీయాల్లో ఆసక్తి పెంచుకున్న తరువాత. నాన్న నుంచి నాకూ వచ్చిన స్టాలిన్ అభిమానం, శ్రీశ్రీ అంటే పిచ్చి, కన్యాశుల్కం అంటే విపరీతమైన ఇష్టం– బహుశ ఇవే నాకు ప్రసాద్ మావయ్యకి మధ్య అనుబంధం పెరగడానికి తోడ్పడ్డాయి. నాకు ఎప్పుడు డిప్రెస్డ్ గా అనిపించినా శ్రీశ్రీ మహాప్రస్థానం ఒక మందుగా పని చేసింది. 1982 లో శ్రీశ్రీ హైదరాబాద్ వచ్చినప్పుడు నాన్న తో పాటు మీటింగ్ కి వెళ్ళాను, అదే శ్రీశ్రీ ని మొదటి సారి, ఆఖరి సారి చూడడం. శ్రీశ్రీ పోయినప్పుడు నా బాధంతా మావయ్య కి ఉత్తరం లో రాశాను. అది తనకి మాత్రమే చెప్పుకోవాలనిపించింది. ఆ రోజుల్లో నవత అనేది - నీకు, నాకు ఉన్నది వర్గ సంబంధం, రక్త సంబంధం కాదు అని. అప్పట్లో నాకా మాట అంత బాగా అర్థం కాలేదు, తరువాతే దానిలో అర్థం తెలిసింది. 1982 - 86 మధ్య నేను వైజాగ్‌కి, విరసం మీటింగులకి వెళ్ళే క్రమంలో ఏర్పరచుకున్న రాజకీయ దృక్పథం, పరిచయాలే ఇంత కాలం నన్ను వెన్నంటి ఉన్నాయి, నన్నేదో రకంగా నిలబెట్టాయి. 1983 లో ఏ.ఐ.ఎల్.ఆర్.సి. మీటింగుకి ఢిల్లీ వెళ్ళడం ఇవన్నిట్లో ఒక గొప్ప అనుభవం. ప్రసాద్ మావయ్య, విజయ, నవత, మమత మీటింగుకి వెళ్తున్నారని తెలిసి నేనూ వెళ్తానని నాన్నకి చెప్తే నన్ను వరంగల్ లో వీ.వీ. వాళ్ళ ఇంట్లో దించి నాన్న వెళ్ళిపోయారు. మొత్తం వీ.వీ కుటుంబం, వసంతక్క, వేణు, జగన్, చిన్ని, చుక్కు అందరు తెలిసింది అక్కడే. గద్దర్‌ని మొదటి సారి చూసి విన్నది, ప్రసాద్ మావయ్య 'ఎత్తినాం విరసం జెండా' పాట పాడడం విన్నది, కే.వీ.ఆర్‌ని, శ్యామలక్కని చూసింది అక్కడే. ఆ మీటింగులో నేను చూసిన రాజకీయ కామ్రేడరీ, విన్న విశ్లేషణలు, పాటలు నన్ను ఎంతగానో ఉత్తేజ పరిచాయి.

1980ల లోనే వైజాగ్‌కి వెళ్ళినప్పుడు ఒక సారి మావయ్య నాకు మోపెడ్ నేర్పే ప్రయత్నం కూడా చేసాడు. తను పొద్దున్నే లేస్తాడు, ఇంట్లో ఇంకెవరూ లేవకపోయినా. నాక్కూడా పొద్దున్నే లేచే అలవాటు ఉండడంతో నన్ను బీచ్‌కి తీసుకు వెళ్ళడానికి ఎప్పుడు రెడీగా, ఉత్సాహంగా ఉండేవాడు. బీచ్‌కి తీసుకు వెళ్ళి ఈత కొట్టడం నేర్పే ప్రయత్నం కూడా తనే చేసాడు. ఎప్పుడూ మా నాన్న వాళ్ళ ఇంటి పేరు మీదా, వాళ్ళ కుటుంబ సభ్యుల మీదా వేళాకోళమాడుతూ మమ్మల్ని ఉడికిస్తూ ఉండేవాడు.

80 ల లో, నేను వైజాగ్ కి తరచు వెళ్ళే కాలం లోనే మావయ్య కొన్ని మంచి పుస్తకాలని నాకు పరిచయం చేసాడు. విక్టర్ హ్యూగో 'లే మిసరబుల్స్' గురించి, రోమా రోలా 'జాన్ క్రిస్టఫ్' గురించి తను చెప్తేనే తెలిసి చదివాను. తను చెప్పిన ఎన్నో ఏళ్ళకి కాని చదవడం అవ్వలేదు కాని చదివినప్పుడు మాత్రం అంత గొప్ప పుస్తకాల గురించి చెప్పినందుకు మావయ్యకి థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేక పోయాను. అట్లాగే డికెన్స్ అంటే తనకి ఎందుకు ఇష్టమో చెప్తూ డికెన్స్‌లాంటి రచయితలు ఎట్లా వాళ్ళ కాలంలోని సమాజ పరిస్థితులని వాళ్ళ రచనలలో చిత్రీకరించారో, దాని మీద వాళ్ళ విశ్లేషణని, అభిప్రాయాలని వ్యక్త పరిచారో వివరించాడు. పుస్తకాలని చదివేటప్పుడు కథ వెనుక ఉన్న ఇటువంటి విషయాలని ఎట్లా పట్టుకోవాలో తను నేర్పితేనే తెలిసింది. ఇవే విషయాలని నాన్న కూడా చెప్పేవారు కాని ఇంత విపులంగా మాత్రం కాదు. బాల్జాక్ కుడా ఇటువంటి రచయిత కనుకే మార్క్స్‌కి బాల్జాక్ అంటే ఇష్టమని నాన్న చెప్పేవారు. మావయ్య దగ్గర తీసుకునే నేను తారిక్ అలి 1960 ల గురించి రాసిన పుస్తకం చదివాను, అట్లాగే, స్టాలిన్ గ్రాడ్ యుద్ధం మీద పుస్తకాలు కూడా. అసలు వైజాగ్ వెళ్ళడమంటేనే పుస్తకాల కోసం, బీచ్ కోసం వెళ్ళడంలాగా ఉండేది. కవిత్వం, నవల, కథ - తెలుగు, ఇంగ్లీషు - ఇవన్నిటి గురించి ఎంతో ప్రేమతో చెప్పేవాడు. ప్యాసా, దేవదాసు, మాయాబజార్ సినిమాల గురించి చాలా మురుసుకుంటూ చెప్పేవాడు. సైన్స్ గురించి నాన్నని ఎన్ని ప్రశ్నలడిగేవాడో, తరువాత రోజుల్లో అక్క కొడుకు బన్నిని ఫిజిక్స్ గురించి అట్లాగే అడుగుతూ ఉండేవాడు. తనది సైన్స్ సబ్జెక్ట్ కాకపోయినా అందులోనూ తెలుసుకోవాలనే కుతూహలము, ఉత్సాహము ఉన్నాయి.

ఈ సంవత్సరం మార్చ్ నెలలో నేను పాడేరు వెళ్తున్నానంటే తనే నాకు కారు మాట్లాడి నాతో, బాలకృష్ణ తో పాడేరు వచ్చాడు. అలసి పోతావేమో రావద్దంటే మా ఇద్దరి మీదా కోపం తెచ్చుకున్నాడు. పొద్దున పాడేరు వెళ్తున్న మూడు గంటలు చాలా సంతోషంగా, ఉత్సాహంగా పాటలు పాడుకుంటూ, డ్రైవర్ తో కబుర్లు చెప్తూ వచ్చాడు. పాడేరు నుంచి జీపు ఎక్కి దగ్గరి ఊళ్ళకి వెళ్ళిన తర్వాత జీపులోనే కూర్చోమంటే కూర్చోకుండా తను కూడ నడవ గలిగినంత వరకు మాతో పాటు నడుచుకుంటూ ఊళ్ళ లో తిరిగాడు. సాయంత్రం వెనక్కి వస్తున్నప్పుడు నేను అలసి పోయి మాట్లాడకుండా కూర్చున్నాను కాని తనలో మాత్రం అలసటలో కూడా అదే ఉత్సాహం. మర్నాడు బీచ్‌కి వెళ్దామా అని అడిగితే వెంటనే పరమోత్సాహంగా పొద్దున్నే 6కి వస్తానని, తయారుగా ఉండమని, బస్‌లో బీచ్‌కి తీసుకువెళ్తానని అన్నాడు. నేనే బద్ధకించి ప్రోగ్రాం మానుకున్నాను. పాడేరు ప్రయాణం లోనే మానవ ప్రవృత్తి గురించి మార్క్స్ రాయలేదని, పట్టించుకోలేదని అనడం తప్పని నాకు చెప్పి, మర్నాడు వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు కొన్ని పుస్తకాలు రెడీగా తెరిచి పెట్టుకుని తన కిందటి రోజు ఆర్గ్యుమెంట్స్ కి మద్దతుగా ఆ పుస్తకాల్లోంచి చదివి వినిపించాడు. ఏ పుస్తకం లో, ఏ పేజీలో లెనిన్, మార్క్స్ ఏమి రాసారో కోట్ చేస్తూ తన వాదనని వినిపించాడు. 83 ఏళ్ళ వయసున్న ఆ మనిషి జ్ఞాపక శక్తికి, ఉత్సాహానికి, మనుషుల పట్ల ఉన్న ప్రేమకి, ఔదార్యానికి జోహార్లనుకుని తిరిగి వచ్చాను. అదే ఆఖరి చూపు అవుతుందని తెలిస్తే ఇంకొన్ని గంటలు మావయ్యతో గడిపేదాన్నేమో. ప్రసాద్ మావయ్య నాకు చాల తక్కువ తెలుసనే చెప్పాలి. కాని ఆ తెలిసిన కొంచెంలోనే తన నుంచి నేర్చుకున్నది చాలా ఉంది. ఇన్ని ఏళ్ళ పరిచయంలో తను ఇంకా బాగా తెలిస్తే ఎంత బావుండేదో, ఇంకెన్ని నేర్చుకో గలిగేదాన్నో అనే రిగ్రెట్ మిగిలి పోయింది.



చలసాని ప్రసాద్ గారితో గడిపిన కొన్ని మధుర క్షణాలు

పి. శాంతకుమారి

మా నాన్నగారు పి.వి. రాజుగారు తరువాత నేను అత్యంతగా అభిమానించే వ్యక్తి చలసాని ప్రసాద్‌గారు. ఆయనతో మాకున్న అనుబంధం పరిచయం ఈనాటిది కాదు. మా స్వస్థలం బరంపురం. అక్కడ నాన్నగారిది ఒక బుక్ షాప్ ఉండేది. దాని పేరు 'యువర్ బుక్ షాప్'. అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యంకి మా షాప్ కెరాఫ్ అడ్రస్. అప్పటి నుంచి ప్రసాద్ గారితో నాన్నగారికి పరిచయం. 40 సంవత్సరాల క్రితం 1974లో వైజాగ్‌లో రాతిమేడలో విరసం మహాసభలు జరిగాయి. అక్కడికి బరంపురం నుంచి 10 మంది వరకు అటెండ్ అయ్యాం. అక్కడే నవతగారు, నళినిగారు పరిచయమయ్యారు.

వైజాగ్‌లో మా చెల్లి అలహాబాద్ బ్యాంక్‌లో పని చేస్తుండేది. వైజాగ్ వెళ్లిన ప్రతీసారి ప్రసాద్‌గారితో కలవకుండా నాన్న వచ్చేవారు కాదు. నాన్నగారు సుబ్బారావు పాణిగ్రాహి గారిపై ఉన్న అభిమానంతో ఆయన రాసిన పాటలు కొన్ని ప్రసాద్ గారి సహాయంతో 'కళలు - కవిత్వం' అనే పుస్తకాన్ని వెలువరించారు.

కొన్ని అనారోగ్య కారణాల వలన మా చెల్లి 14 ఏప్రిల్ 2001లో కన్నుమూసింది. సీరియస్‌గా ఉంది అని నాన్న ఫోన్ చేసిన అరగంటలోనే ప్రసాద్‌గారు హాస్పిటల్‌కి వచ్చి చెల్లి దగ్గరే చెయ్యి నిమురుతూ అలా కూర్చుండి పోయారు. మా చెల్లి ఆఖరు శ్వాస విడిచింది ఆయన చేతిలో. ఆ రోజు సాయంత్రం వరకూ నాన్నని విడవకుండా అలా ఉండిపోయారు. ఆయనకి మాపై అంత అభిమానం.

నాలుగు సంవత్సరాల క్రితం మేం హైదరాబాద్ వచ్చేసాం. ఇక్కడకు వచ్చిన తరువాత 2013, మే 1న మా నాన్నగారు పోయారు. ఆ సంగతి ఆయనకి నేను తెలియ చేసాను. చాలా బాధపడ్డారు. నాన్నగారి పుస్తకాలు అన్నీ ఏం చేసావమ్మా అని అడిగారు. ఏదైనా గ్రంథాలయానికి ఇవ్వాలని ఉంది, మీ సలహా ఏవిటి అని అడిగాను. దానికి ప్రసాద్ గారు నేను వచ్చి నాకు కావలసిన పుస్తకాలు తీసుకుంటానని అడిగేరు. తప్పకుండా ఇస్తాను అని అన్నాను. వెంటనే ఆయన జూన్‌లో బి.అప్పారావు అనే మిత్రునితో బరంపురం వచ్చి పుస్తకాలు చూసి చాలా మురిసిపోయారు. కావలసిన పుస్తకాలు తీసుకున్నారు. మా ఇంటిలో రావిశాస్త్రిగారిది 'రత్తాలు - రాంబాబు' నాలుగో భాగం విడిగా ఉండేను. ఆ పుస్తకం ఆయన దగ్గర లేదు. పుస్తకం చూసి చాలా టెంప్ట్ అయిపోయారు. ఇది నాకు ఇస్తావా? అమ్మా, దాని బదులుగా నీకు నాలుగు భాగాలు కలిసి ఉన్న 'రత్తాలు - రాంబాబు' పుస్తకం ఇస్తానన్నారు. అవసరం లేదు మీరు తీసుకుని వెళ్లండి అని చెప్పినా, వినక నేను హైదరాబాదు ఎప్పుడు, ఏ ట్రెయిన్‌కి వెళ్తానో అన్నీ నోట్ చేసుకుని విశాఖపట్నం వెళ్లిపోయారు.

అనుకున్నట్లు మేము బరంపురం నుంచి హైదరాబాద్ తిరిగి వచ్చాము. వైజాగ్ చేరే సరికి రాత్రి 9.30 గంటలు అయింది. నా కంపార్ట్‌మెంట్ దగ్గరికి నా పేరు పిలుస్తూ ఆయన వచ్చారు. ప్రసాద్ గారు వస్తారని నేను అనుకోలేదు. ఆయన నాకు చెప్పినట్లుగా 4 సంపుటాలు ఉన్న 'రత్తాలు - రాంబాబు' పుస్తకాన్ని ఇచ్చారు. ఇది ఒక్కటి చాలు ఆయనకి పుస్తకాలు మీద ఎంత అభిమానమో.

ప్రసాద్ గారి గురించి ఎంత చెప్పినా అది చాలా తక్కువె అవుతుంది. విప్లవానికి, సాహిత్యానికి ఆయనే ఒక చిరునామ. ఆయన మరణం విరసంకి, విప్లవ సాహిత్యానికి తీరని లోటు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని నిర్బంధాలను ఎదుర్కొనిన తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వర్గ విబేధాలను అంతం చేయడానికి, పేదల కోసం తన జీవితాంతం అలుపెరగకుండా పోరాడిన మహోన్నత వ్యక్తి అందరినీ దుఃఖసాగరంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఎక్కడ ఉన్నారో, బహుశా శ్రీశ్రీ గారితోనో, రావిశాస్త్రిగారితోనో ప్రస్తుత భారతావనిలో విప్లవ పరిస్థితుల పై చర్చిస్తూ ఉంటారేమో. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకి మనమిచ్చే ఘన నివాళి.



ఒక అసాధారణ పట్టకం చలసాని ప్రసాద్

ఎన్ వేణుగోపాల్

చలసాని ప్రసాద్ ఇక లేరన్న విషయాన్ని గ్రహించడానికీ అంగీకరించడానికీ మనసింకా సిద్ధంగా లేదు. అటువంటి మానసిక స్థితిలో వ్యక్తిగత అనుబంధపు దుఃఖపు స్థాయిని దాటి ఆయనను చరిత్రలో నిర్దిష్ట స్థలకాలాలలో పెట్టి, నిర్మమంగా అంచనా కట్టడం మరింత కష్టమైన పని. నలభై మూడు సంవత్సరాల పరిచయంతో, ముప్పై ఐదు సంవత్సరాలకు పైగా సాన్నిహిత్యంతో, ఆయన కురిపించిన అపారమైన, అవ్యాజమైన వాత్సల్యంతో, కొన్ని పనుల్లోనైనా సాహచర్యంతో చలసాని ప్రసాద్ నా హృదయంలో అవిభాజ్యమైన భాగం. ఆ పరిచయం, సాన్నిహిత్యం, వాత్సల్యం, సహకార్యాచరణ ఆత్మీయ అనుబంధాల వల్ల ఆయన గురించి ఎన్ని చెప్పినా సంతృప్తి కలగదు. ఆ వ్యక్తిగత అనుబంధాన్ని పక్కనపెట్టి, ఆయన సుదీర్ఘ సువిశాల సామాజిక జీవితాన్నీ, సంకీర్ణ, బహుముఖ వ్యక్తిత్వాన్నీ ఎంత చెప్పినా ఆయనను సమగ్రంగా చిత్రించడం సాధ్యం కాదు.

ఆయన ఒక తెల్లని మనిషి. తేటతెల్లమైన మనసున్న మనిషి. మనుషులందరూ తనలాంటి మంచివాళ్లే అని అమాయకంగా నమ్మిన మనిషి. అంత విస్తృతమైన సామాజిక జీవితం, అధ్యయనం, రాజకీయ అవగాహన ఉన్న మనిషి అంత అమాయకంగా, పారదర్శకంగా, పసిపిల్లవాడిలా ఎలా ఉండగలడా అని చాలసార్లు ఆశ్చర్యం కలిగేది. ఆయనది సువిశాల సంకీర్ణ వ్యక్తిత్వమే గాని సంక్లిష్ట వ్యక్తిత్వం కాదు. ఒక పట్టకంలోంచి ప్రవహించి ఏడురంగులుగా వ్యక్తమైనప్పటికీ, తెలుపు కాంతి కిరణం ఒకటే అయినట్టు ఆయన వ్యక్తిత్వంలో అనేక దశల, రంగాల, స్థాయిల, కోణాల విశాల జీవితం కలగలిసిపోయినా ఆయన మనసు మాత్రం తెల్లని వెలుగు కిరణం. అందువల్లనే చలసాని ప్రసాద్ ను అర్థం చేసుకోవడం ఎంత సులభమనిపిస్తుందో అంత కష్టం కూడ. ఎంత బోళా, సాదాసీదా అనిపిస్తాడో అంత లోతైన మనిషి కూడ. ఆయనలోని అన్ని రంగులూ రంగాలూ కలిసిపోయిన తెలుపు తెలుస్తుంది. విడివిడిగా ప్రతి రంగంలోనూ ఆయన సాగించిన అపారమైన కృషి, అసాధారణమైన విజయాలు ఎక్కడికక్కడ అయిపోయి, సన్నిహితులకు కూడ ఆయన పూర్తిగా అర్థం కాని స్థితి ఉంటుంది. పైగా ఆయనకు భిన్న రంగాల వారిలో, పరస్పర వ్యతిరేక రంగాల వారిలో, పూర్తి వ్యతిరేక భావాలున్న వారిలో కూడ పరిచితులూ సన్నిహితులూ ఉండేంత విశాల మానవసంబంధాలు ఉండేవి గనుక కూడ ఆయనను సమగ్రంగా అర్థం చేసుకోవడం కష్టమవుతుంది.

ఆయన జీవితమంతా ప్రసరించిన స్వచ్ఛమైన కాంతి తెల్లనిది గనుక ఆ కాంతిలో కలగలిసిన ఏడు రంగులనూ వింగడించి చూడాలి. అవి, జీవితం, సామాజిక, సాహిత్య చరిత్రలో పాత్ర, విప్లవ రచయితల సంఘం, రచనలు, అధ్యయనం, వైతాళికుల సంప్రదాయం కొనసాగింపు, వ్యక్తిగతం అని ఏడు విభాగాలుగా చెప్పుకోవచ్చు. వీటిలో కొన్ని బహిరంగంగా అందరికీ తెలిసినవీ ఉన్నాయి, కొన్ని ఆయా రంగాలలో ఆయనకు సన్నిహితులైనవారికి మాత్రమే తెలిసినవీ ఉన్నాయి. ప్రతి ఒక్క రంగంలోనూ ఆయన వందలాది మందితో ఆత్మీయమైన, ఉద్వేగపూరితమైన సంబంధాలు నెరిపారు గనుక వాళ్లందరూ తమ తమ అనుభవాలు చెప్పుకున్నప్పుడు మాత్రమే ఆయన వ్యక్తిత్వం సంపూర్ణంగా అవగతమవుతుంది.

జీవితం చలసాని ప్రసాద్‌కు చాల విలువైన, అరుదైన నేపథ్యాన్నీ, వారసత్వాన్నీ, స్థానాన్నీ ఇచ్చింది. వ్యక్తిగా ప్రసాద్ కూడ ఆ వారసత్వాన్ని కొనసాగించడంలో, ఆ స్థానాన్ని సమాజానికి ఉపయోగించడంలో అపురూపమైన కృషి చేశారు. సమాజం-వ్యక్తి అనే ద్వంద్వంలో ఆ రెండూ ఒకదానినొకటి ఎలా ప్రభావితం చేసుకుంటాయో, ఒకటి మరొకదానికి ఎలా దోహదం చేస్తుందో, ఒకటి మరొకదానిలో ఎలా సంలీనమవుతుందో చూపే గతితార్కిక సత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన జీవితమే ఒక

ఉదాహరణ.

ఆయన పుట్టిన కృష్ణా జిల్లా, ప్రత్యేకించి ఆయన బాల్యం గడిచిన చల్లపల్లి జమీందారీ (దేవరాకోట ఎస్టేట్) ప్రాంతం గొప్ప రాజకీయ చైతన్యంతో తొణికిసలాడుతుండింది. తండ్రి చలసాని బసవయ్య చల్లపల్లి జమీందారు దగ్గర సమద్దార్ గా ఉద్యోగం చేస్తూ, కుటుంబాన్ని భట్ల పెనుమర్రు నుంచి, చల్లపల్లి సమీపంలోని నాదెళ్లవారిపాలెంకు మార్చారు. అంటే అటు జమీందారీ అంతర్గత వ్యవహారాలూ, ఇటు చుట్టూ సమాజంలో జమీందారీ వ్యతిరేకతా రెండూ అనుభవంలోకి వచ్చే అరుదైన అవకాశాన్ని జీవితం ప్రసాద్ కు సమకూర్చింది. ప్రసాద్ పుట్టడానికి పది పదిహేను సంవత్సరాలకు ముందు నుంచే పనిచేస్తున్న కృష్ణా మండల మహాసభ, భారత జాతీయ కాంగ్రెస్, జమీందారీ కిసాన్ మహాసభ, 1934లో పుట్టిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలతో పాటు రహస్యంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ అక్కడి రైతాంగంలో జమీందారీ వ్యతిరేక, వలసవాద వ్యతిరేక భావాలనూ, మార్క్సిస్టు భావాలనూ ప్రచారం చేస్తున్నాయి. ప్రసాద్ బాల్యం, ఊహ తెలిసే వయసు నాటికి ఆ చారిత్రక సందర్భం మరింత పదునెక్కింది.

ప్రసాద్ పుట్టుకకు నాలుగు సంవత్సరాల ముందే అప్పటి చల్లపల్లి రాజా యార్లగడ్డ అంకినీడు మరణించి, ఆయన కొడుకు శివరామప్రసాద్ అధికారానికి వచ్చాడు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో 1920-21 పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని అతి క్రూరంగా అణచివేసిన డిప్యూటీ కలెక్టర్ జంపాల వెంకటేశం ను ఏరి కోరి తనకు దివాన్ గా 1930లో నియమించుకున్నాడు. ఆ దివాన్ నేతృత్వంలో చల్లపల్లి జమీందారీలో జరిగిన అక్రమాలు, దుర్మార్గాలు, నిర్బంధ విధానాలు చరిత్రకెక్కాయి. ఆ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సాగించిన వీరోచిత పోరాటాలలో దివాన్ ను తొలగించాలనే డిమాండ్ తలెత్తి 1934లో ఫలించింది. అదే సమయంలో తనకు వ్యతిరేకంగా సాగుతున్న రైతాంగ పోరాటాన్ని ఎదిరించడానికి జమీందారు జస్టిస్ పార్టీ నాయకుడుగా మారాడు. మద్రాస్ ప్రెసిడెన్సీలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ రాజకీయ పార్టీగా పుట్టి, భూస్వాముల రాజకీయ పార్టీగా మారిన జస్టిస్ పార్టీ అభ్యర్థిగా 1937 ఎన్నికల్లో చల్లపల్లి జమీందారు కాంగ్రెస్ అభ్యర్థి గొట్టిపాటి బ్రహ్మయ్య మీద పోటీ చేసి దౌర్జన్యంతో, దొంగ వోట్ల లెక్కతో గెలిచాడు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని కమ్యూనిస్టు పార్టీ బలపరిచింది. అప్పటికే కుటుంబంలో కమ్యూనిస్టు భావాలు ప్రవేశించి ఉండడంతో కుటుంబ సభ్యులతో పాటు ఐదు సంవత్సరాల వయసులో ఆ ఎన్నికల ఊరేగింపులో పాల్గొన్న జ్ఞాపకం తన మొదటి జ్ఞాపకమని చలసాని ప్రసాద్ చెప్పుకున్నారు.

ఆయన పినతండ్రి చలసాని జగన్నాథరావు 1930-31 సత్యాగ్రహోద్యమంలో పాల్గొని అరెస్టయి రాజమండ్రి జైలులో నిర్బంధంలో ఉన్నారు. అంటే ప్రసాద్ పుట్టడానికి ఒకటి రెండు సంవత్సరాల ముందరే కుటుంబంలోకి రాజ్య నిర్బంధ అనుభవం కూడ వచ్చింది. అదే సమయంలో ఆ జైలులోనే ఉండిన లాహోర్ కుట్రకేసు ముద్దాయిలు విజయకుమార్ సిన్హా, బటుకేశ్వర దత్, జయదేవ్ కపూర్ లాంటి వాళ్లతో జగన్నాథరావుకు స్నేహం కుదిరి వాళ్ల ద్వారా కమ్యూనిస్టు భావాలు, సాహిత్యం పరిచయమయ్యాయి. తొలితరం తెలుగు కమ్యూనిస్టు నాయకుడు, రైతు నాయకుడు, భట్ల పెనుమర్రు గ్రామానికే చెందిన చలసాని వాసుదేవరావు కూడ, మొట్టమొదటిసారి కమ్యూనిస్టు భావాల గురించీ, సాహిత్యం గురించీ రాజమండ్రి జైలు నుంచి చలసాని జగన్నాథరావు రాసిన ఉత్తరాల ద్వారానే తెలుసుకున్నానని తన ఆత్మకథాత్మక వ్యాసంలో రాశారు. అంటే చలసాని ప్రసాద్ పుట్టుక సమయానికి ఆయన పినతండ్రి కమ్యూనిస్టుగా మారుతున్నారు. ఆ ప్రభావం కుటుంబమంతా వ్యాపించి ప్రసాద్ బాల్య, కౌమార దశల్లోనే కమ్యూనిస్టు భావాలు, ఆచరణ ఆయన అనుభవంలోకి వచ్చాయి. ఈ మధ్యలో 1934 జూలై నుంచి కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం అమలుకావడంతో కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరి పనిచేయడం ప్రారంభించారు. జగన్నాథరావు కృష్ణా జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులయ్యారు.

ఆ గ్రామంలోనూ, ప్రాంతంలోనూ తొలిరోజుల్లో జమీందారీ వ్యతిరేక పోరాటాలు నడిపి, కమ్యూనిస్టులతో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేసిన కాంగ్రెస్ ఆ తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ శాసనసభలో మారిన రాజకీయ సమీకరణాలలో ఆ జమీందారుతోనే దోస్తీ కట్టింది. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కూడ 1940 మార్చ్ లో తనలో ఉండిన కమ్యూనిస్టులందరినీ బహిష్కరించింది. అలా కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల రాజీబేరాలు, దివాళాకోరు రాజకీయాలు ఒకవైపు, అకుంఠిత దీక్షతో కమ్యూనిస్టులు సాగిస్తున్న జమీందారీ వ్యతిరేక పోరాటాలు మరొకవైపు ఆ ప్రాంత యువతరాన్ని మరింతగా కమ్యూనిస్టుల ప్రభావంలోకి తీసుకువచ్చాయి. ఈలోగా రెండో ప్రపంచ యుద్ధం గురించి కమ్యూనిస్టుల వైఖరి మారడంతో 1942 జూలైలో పార్టీ మీద నిషేధం రద్దయి, కమ్యూనిస్టులు బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది. ఆ యుద్ధ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా మేధావులనూ ప్రజలనూ ఆకర్షించిన ఫాసిస్టు వ్యతిరేకత తెలుగుసీమలో కూడ వ్యాపించింది. స్టాలిన్ గ్రాడ్ నుంచి నాజీ సైన్యాలను తిప్పికొట్టిన ఎర్రసైన్యపు విజయాల గురించి 'స్టాలినో నీ ఎర్రసైన్యం, ఫాసిజం వినాశ సైన్యం' అనే పాట ప్రతి ఒక్కరి నోట వినిపించింది. పది పదకొండు సంవత్సరాల బాలుడిగా ప్రసాద్ ఆ పాట విన్నాడు, పాడాడు, జీవితమంతా పాడుతూనే ఉన్నాడు. ఫాసిజం వ్యతిరేకత ఆయన స్వభావంలో భాగమైపోయింది.

ఆ ప్రజా ఉద్యమాల వెల్లువలోనే కమ్యూనిస్టుల నాయకత్వంలోని అఖిల భారత కిసాన్ సభ మహాసభలు 1944లో బెజవాడలో జరిగాయి. ఆ సభలకు స్వామీ సహజానంద, సర్దార్ పృథ్వీ సింగ్, రాహుల్ సాంకృత్యాయన్, బాబా గురుముఖ్ సింగ్, జెడ్ ఎ అహ్మద్, పి సి జోషి వంటి రైతాంగ, గదర్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, మేధావులు ఎందరో హాజరయ్యారు. ఎనిమిది లక్షల మందితో బహిరంగ సభ జరిగిందనీ, మద్రాస్ ప్రెసిడెన్సీ లోని తెలుగు ప్రాంతాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యానికి అది అద్దం పట్టిందనీ చరిత్రలో నమోదయింది. ఆ సభలకు హాజరయిన గదర్ వీరుడు పృథ్వీ సింగ్ ను రైతు సంఘ నాయకులు చల్లపల్లి తీసుకువచ్చి సభ నిర్వహించారు. ఫాసిజాన్ని, బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని, జమీందారీ విధానాన్ని తుదముట్టించేంతవరకూ

భారతీయులలో ఏ ఒక్కరికీ విశ్రాంతి తీసుకునే అవకాశం లేదని ఆ సభలో మాట్లాడుతూ పృథ్వీ సింగ్ అన్నాడని నమోదైంది. ఈ సభ గురించి ప్రసాద్ ఎప్పుడూ ప్రస్తావించలేదు గాని అప్పటికి పదకొండు, పన్నెండు సంవత్సరాల బాలుడిగా ఆ సభకు హాజరయ్యే ఉంటారు. ఆ సభకు హాజరైనా కాకపోయినా ఆ లేత వయసులోనే ఆయన మనసులో కమ్యూనిస్టు భావాలు, కాంగ్రెస్ వ్యతిరేకత, భూస్వామ్య వ్యతిరేకత, వలసవాద వ్యతిరేకత, ఫాసిజం వ్యతిరేకత నాటుకున్నాయి.

మరొక మూడు సంవత్సరాలకు, 1947లో తొమ్మిదో తరగతి విద్యార్థిగా, స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యుడిగా విద్యార్థి సమ్మెలో చేరమని తోటి విద్యార్థులను ఉద్బోధిస్తూ ఆయన రాసిన పాట, ఆయన తొలి రచన నవయుగ పత్రికలో అచ్చయింది. తర్వాత మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ పాలన దుర్మార్గం, కృష్ణా జిల్లాలో పోలీసు అత్యాచారాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, తన పినతండ్రినీ, బావనూ, అన్ననూ పోలీసులు కాల్చిచంపడం ఆయన భావాలను మరింత స్థిరపరచాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, రాజ్ బహదూర్ గౌర్ లు రహస్య జీవితంలో తమ ఇంట్లో ఆశ్రయం పొందడం గురించీ, గుడివాడలో తనతోపాటు సినిమా చూసి వెళ్లిన పార్టీ కొరియర్ కొన్ని గంటల్లోనే పోలీసుల చేత చిక్కి హత్యకు గురికావడం గురించీ ఆయన చెపుతుండేవారు. ఈ అనుభవాలన్నీ ఆయన ఇంకా ఇరవైల్లో ప్రవేశించకముందే జరిగాయి. ఆ తరవాత ఆరు దశాబ్దాలకు పైగా ఆయన జీవిత గమనం ఎలా సాగాలో ఆ అనుభవాలే నిర్దేశించాయి.

అవి పునాది అనుభవాలైతే, ఆ తర్వాత జీవితంలో కూడ స్థలకాలాలవల్ల ఆయనకు అందినవి గాని, ఆయన ఉద్దేశపూర్వకంగా ఎంచుకున్నవి గాని మరికొన్ని అనుభవాలు ఆయన జీవితాన్ని మరింత ప్రజానుకూలంగా, ప్రజాపోరాట భాగస్వామిగా మార్చాయి. అవి అభ్యుదయ రచయితల సంఘ సభ్యుడిగా 1955 ఎన్నికల ప్రచారంలో శ్రీశ్రీ వెంట తిరగడం, అంతర్జాతీయంగా గ్రేట్ డిబేట్ జరుగుతున్న దందహ్యమాన దశాబ్దంలో కోపోద్రిక్త యువతం రగులుతున్న కాజీపేటలో కొండపల్లి సీతారామయ్య, కె జి సత్యమూర్తిల సాహచర్యంలో ఉండడం, శ్రీకాకుళ పోరాటం నక్సల్బరీ పంథాలోకి ప్రవహిస్తున్న సమయంలో పొరుగున విశాఖపట్నంలో ఉండడం, శ్రీశ్రీ అరవయో పుట్టినరోజు నెపంతో తెలుగు మేధో లోకంలో సంచలనం సృష్టించిన యువతరానికి సన్నిహితంగా ఉండడం వంటి అనుభవాలు. ఆ నేపథ్యమూ జీవితమూ ఇచ్చిన అవకాశాల్ని సంపూర్ణంగానూ సృజనాత్మకంగానూ ప్రవాహశీలతతోనూ గ్రహించి అభివృద్ధి చేయడం, ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన ఉండి సామాజిక, సాహిత్య చరిత్రలో తన వంతు పాత్ర నిర్వహించడం ప్రసాద్ వ్యక్తిగత దోహదం.

'రచయితలారా మీరెటువైపు' సవాల్ తర్వాత ప్రసాద్ జీవితమంటే విప్లవ రచయితల సంఘంలో అవిభాజ్య భాగమైన జీవితమే. 1970 ఫిబ్రవరి 1న ఆ సవాల్ వెలువడితే, వెంటనే శ్రీశ్రీతో సహా ఎందరో కవులు, రచయితలు ప్రజల పక్షమే ఉంటామని ప్రకటించినప్పటికీ, అలా ప్రకటించినవారందరినీ ఒక సంఘటిత నిర్మాణంలోకి సమీకరించడం అనే బృహత్తర చారిత్రక కర్తవ్యం తలకెత్తుకున్న వారిలో ప్రసాద్ ఒకరు. సమాజ చలన సూత్రాలు తెలియనివారూ, ప్రణాళికాబద్ధ ఆచరణకూ అనూహ్య మలుపులకూ మధ్య గతితార్కిక సంబంధం తెలియనివారూ ఎటువంటి మొరటు, యాంత్రిక సూత్రీకరణలైనా చేయవచ్చు గాని, నక్సల్బరీ శ్రీకాకుళ ప్రజాపోరాటాలను సమర్థించే ఒక బుద్ధిజీవుల సంఘం ఏర్పాటు చేయాలనే ప్రణాళికాబద్ధ అవగాహనతోనే ప్రసాద్ బయలుదేరారు. నక్షత్ర సప్తకాన్ని ముందుపెట్టి, అభ్యుదయ సాహిత్య సదస్సు పేరుతో శ్రీశ్రీని లొంగదీసుకోవాలని రాజ్యమూ, సినిమా రంగమూ, అభ్యుదయ రచయితల సంఘమూ, మొత్తంగా వ్యవస్థా సమర్థకులూ మొదలుపెట్టిన ప్రయత్నాలు ఒక అనూహ్య మలుపు. పాలకవర్గాలు సృష్టించిన ఆ మలుపును ప్రజల పక్షాన ఎదుర్కొని మరొక అనూహ్య మలుపును సృష్టించడం వర్గపోరాటంలో భాగమే. శత్రువు ఎత్తుగడ ఏమిటో దానికి ప్రతి ఎత్తుగడ ఏమిటో ఏ క్షణానికి ఆ క్షణాన వీధిలో నిర్ణయించవలసిందే గాని ఇల్లుకదలని మేధావుల బుర్రలో పుట్టిన బ్లూప్రింట్లు పనిచేయవు. అప్పటికి గడిచిన జీవితంలో ఇటువంటి వర్గపోరాట ఆకస్మిక, అనూహ్య వ్యక్తీకరణలను ఎన్నిటినో చూసి ఉన్నారు గనుక ప్రసాద్ అయినా, ఆయన సహచరులైనా అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అంటే ప్రసాద్ నిర్వహించిన పాత్ర అటు ప్రణాళికాబద్ధమైనదీ, ఇటు ఆకస్మికమైనదీ, రెంటి మధ్యా గతితార్కిక సంబంధానికి నిదర్శనమైనదీ.

ఆ తర్వాత నలభై ఐదు సంవత్సరాలలో కూడ ప్రణాళికాబద్ధమైన కృషిలోనూ, అనూహ్యమైన, అసాధారణమైన పరిస్థితులలోనూ ప్రసాద్ తన శక్తిసామర్థ్యాలన్నిటినీ విరసం కోసం వాడాడు. సూక్ష్మమైన వివరాలతో విరసం సమగ్ర చరిత్ర రచన జరిగినప్పుడు అటువంటి సందర్భాలెన్నో స్పష్టం అవుతాయి గాని, బహిరంగంగా చరిత్రకెక్కిన ఘటనలు, సందర్భాలు నాలుగైదు ఉన్నాయి. శ్రీశ్రీతో రాజకీయ, సైద్ధాంతిక సమస్యలు వచ్చినప్పుడల్లా, శ్రీశ్రీని విప్లవ శిబిరంలో కాపాడడంలో ప్రసాద్ గణనీయమైన పాత్ర నిర్వహించారు. ఆట, పాట, మాట బంద్ అనే తీవ్ర నిర్బంధ కాలంలో కార్యదర్శి జైలుకు వెళ్లినప్పుడు, రాజ్యం మహాసభలను భగ్నం చేసి, సంస్థ ఉనికినే రద్దు చేయదలచినప్పుడు ఆయన కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. ఎన్నికైన అధ్యక్షుడు హఠాత్తుగా మరణిస్తే, ఆయన స్థానంలో ఆ అధ్యక్ష బాధ్యతలను నిర్వహించారు. సంస్థ మీద నిషేధం విధించబడి, సంస్థ నాయకులను హత్య చేస్తామని మాఫియా బెదిరింపులు వస్తున్నప్పుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంలో, సంస్థకు అనుకూలంగా విస్తృత ప్రజాభిప్రాయాన్ని, మేధావుల, రచయితల సంఘీభావాన్ని కూడగట్టడంలో ఆయన కృషి అనితర సాధ్యమైనది. సంస్థ అధికార పత్రిక నిర్వహణలో ఒడిదుడుకులు వచ్చినప్పుడల్లా సంస్థ ఆయనవైపే చూసింది. సంస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన శ్రీశ్రీ, కుటుంబరావు సమగ్ర సంపుటాల బాధ్యతను ఆయనే ఒంటిచేతి మీద నిర్వహించారు.

చలసాని ప్రసాద్ సమగ్ర వ్యక్తిత్వంలో మరొక కోణం ఆయన రచనలు, ఉపన్యాసాలు, పాటలు. తొమ్మిదో తరగతి విద్యార్థిగా మొదటి రచన చేసినప్పటి నుంచి తర్వాత ఏడు దశాబ్దాల పాటు ఆయన రాస్తూనే ఉన్నారు. ఆయన రచనలు ఇప్పటికి రెండు సంపుటాలు మాత్రమే ప్రచురణ అయ్యాయి గాని, మిత్రులకు

ఉత్తరాల్లో రాసిన కవిత్వం, సైద్ధాంతిక విషయాల దగ్గర ప్రారంభించి ఎన్నో పత్రికల్లో రాసిన ఉత్తరాలు, వ్యాసాలు, తెలుగు సీమ అంతటా ఇచ్చిన ఉపన్యాసాలు, విప్లవోద్యమంలో భాగంగా మార్క్సిస్టు తత్వశాస్త్రం, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, విప్లవోద్యమ చరిత్ర, సాహిత్యం వంటి అనేక అంశాల మీద చెప్పిన పాఠాలు ఒక్క చోటికి తెస్తే అద్భుతమైన, ప్రేరణాత్మకమైన సాహిత్య సంపద అవుతుంది. మొదటి కవిత 1947లో, రెండో కవిత 1962లో చాల ఎడంతో రాసినప్పటికీ, విప్లవ సాహిత్యోద్యమం ప్రారంభమయ్యాక ఆయన విరివిగా కవితలు రాశారు. సాంఘిక చరిత్రనూ సాహిత్య చరిత్రనూ మిళితం చేస్తూ ఆయన రాసిన వ్యాసాలు తెలుగు సామాజిక సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఉపకరించే అద్భుతమైన ఆకరాలు. పుస్తకాలకు ముందుమాటలు, సమీక్షల రూపంలో కూడ ఆయన సాహిత్య చరిత్రనూ, సాహిత్య విమర్శనూ అలవోకగా ప్రకటించారు. ఎందరో వ్యక్తుల అక్షరచిత్రాలు రచించారు. ఏది రాసినా సూటిగా, సరళంగా, తెలుగు నుడికారంతో ఉండడం ఆయన రచనలన్నిటి సాధారణ లక్షణం.

తన రచనల్లో విస్తృతమైన సామాజిక సాహిత్య చరిత్రను భాగం చేయడానికి ఆయనకు ఉపయోగపడినది ఆయన సాగించిన అపారమైన అధ్యయనం. దాదాపు ఆరున్నర దశాబ్దాల పాటు ఆయన చదవకుండా గడిపిన రోజు ఒక్కటి కూడ లేదంటే అతిశయోక్తి కాదు. చదవడం అంటే ఊరికే చదవడం కూడ కాదు, తనకు నచ్చిన పంక్తుల కింద గీతలు గీయడం, అంచులలో వ్యాఖ్యలు రాయడం, పుస్తకం మొదటి పేజీలోనో చివరిపేజీలోనో ఆ పుస్తకంలోని ముఖ్యమైన అంశాలు ఉన్న పేజీ నంబర్లు రాసి పెట్టడం ఆయన ఎంత నిశితంగా, సూక్ష్మంగా, ప్రేమగా అధ్యయనం చేసేవారో చూపుతాయి. సాహిత్యం మీద అంత ప్రేమ ఉన్న అధ్యయనపరులు తక్కువమందే ఉంటారు. ఈ విశాల అధ్యయనానికి సమాంతరంగానే ఆయన పుస్తక సేకరణ కూడ జరిగింది. ఎక్కడ ఏ మంచి, చదవవలసిన పుస్తకం ఉన్నదనుకున్నా ఆ పుస్తకం సంపాదించడానికి శతవిధాల ప్రయత్నించేవారు. ఒక్కోసారి చాదస్తంగా, పట్టువదలని విక్రమార్కుడిలా పుస్తకాల కోసం అదేపనిగా వెంటపడేవారు. ఆయన తమను పుస్తకాలు అడిగాడని, పంపించేంతలో ఆయన మరణవార్త తెలిసిందని ఆయన మరణానంతరం ఇద్దరు అమెరికా మిత్రులు చెప్పారు. దేశంలోనూ రాష్ట్రంలోనూ అలా ఆయన పుస్తకాలు అడిగి, ఇంకా పంపించవలసిన వారు ఎందరుంటారో. అలా సంపాదించిన, కొన్న, రచయితలు పంపించిన దాదాపు ముప్పైవేల పుస్తకాల గ్రంథాలయాన్ని ఆయన నిర్మించారు. బహుశా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ అతి పెద్ద సొంత గ్రంథాలయం ఆయనదే కావచ్చు.

ఈ పుస్తక సేకరణకు అనుబంధంగానే పత్రికల సేకరణ, ప్రత్యేక సంచికల సేకరణ, నిర్దిష్టంగా కొందరు రచయితల రచనల సేకరణ కూడ ఆయన విస్తృతంగా జరిపారు. తెలుగు సమాజ సాహిత్య రంగాలలో ప్రభావశీలురైన మేధావుల రచనలు పదిలపరచాలనీ, భవిష్యత్ తరాలకు అందించాలనీ ఆయన పడిన తపన ఈ సేకరణలో కనబడుతుంది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, కెవిఆర్, బాలగోపాల్ వంటి వారి రచనలు మాత్రమే కాదు, గోపీచంద్, విశ్వనాథ సత్యనారాయణ వంటి వారి రచనలు కూడ ఆయన చాల జాగ్రత్తగా సేకరించారు. అయినా శ్రీశ్రీ, కొకు సమగ్ర రచనల సంపుటాలు తేదలచుకున్నప్పుడు వేటపాలెం సారస్వత నికేతనం, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంతో సహా ఎన్నో గ్రంథాలయాలు గాలించారు. శ్రీశ్రీ రచనలకు పాదసూచికలు రాయడానికి ఆయన సాగించిన కృషి ఎన్నో పి ఎచ్ డి పరిశోధనలకన్నా మిన్న.

ఈ సామాజిక, సాహిత్య రంగాల కృషి అంతా ఒక ఎత్తు అయితే ఆయన నెరపిన మానవ సంబంధాలు మరొక ఎత్తు. ఆయన తన పరిచయంలోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రేమించిన విశ్వమానవుడు. ఎవరి గురించి మాట్లాడినా, లోపాలు తెలిసినప్పుడు, చెపుతున్నప్పుడు కూడ 'మంచాడే' అనడం ఆయన మంచితనానికి, స్నేహశీలతకు నిదర్శనమే. మనుషులందరూ సహజంగా మంచివాళ్లుగానే ఉంటారని, వ్యవస్థ కలిగించిన స్వార్థ ప్రయోజనాల వల్ల, అంతరాల వల్ల, అభిజాత్యాల వల్ల, న్యూనతల వల్ల వాళ్లలో అవలక్షణాలు పొడసూపుతాయని విశ్వసించే తాత్విక దృక్పథం ఆయనది. ఆయన జీవితంలో రెండో సగం మొత్తం, నలభై ఐదు సంవత్సరాలు విప్లవోద్యమంతోనే గడిచాయి గనుక ఆయన మిత్ర బృందంలో ఆయన వయసు వాళ్లు తక్కువ మందే ఉండేవారు. ఎక్కువమంది తనకన్న పదేళ్ల చిన్నవాళ్ల నుంచి అరవై ఏళ్ల చిన్నవాళ్లు. వాళ్లందరికి కూడ ఆయన సమానస్థాయిలో స్నేహ వాత్సల్యాలు అందించారు. ప్రతి ఒక్కరినీ తనవైన ముద్దుపేర్లతో పిలిచేవారు. అత్యంత ఆత్మీయంగా కౌగిలిలోకి తీసుకునేవారు. గొప్ప ప్రేమాభిమానాలు నిండిన ఉత్తరాలు రాసేవారు (ఆయన చేతిరాతే ఆయన లోని లోపం. పెద్ద పెద్ద బండ అక్షరాలు, విడివిడిగా రాసినా పోల్చుకోవడానికి ఇబ్బంది అయ్యేవి. మొదట్లో కాస్త తెలిసేట్టే ఉండేవి గాని కాలం గడిచిన కొద్దీ ఆ అక్షరాలు అర్థం చేసుకుని వాటిలో దాగిన ప్రేమను ఆస్వాదించడం ఒకింత కష్టమే అయ్యేది).

ఈ ఏడు రంగులూ చలసాని ప్రసాద్ అనే అసాధారణ పట్టకం నుంచి ఒకే తెల్లని, చల్లని, ప్రేమమయమైన వ్యక్తిగా, విశాల అనుభవంతో విజ్ఞానవంతుడూ వివేకవంతుడూ అయిన మేధావిగా మూర్తీభవించాయి. ఆయన ఒక పిత్రు సమానుడైన గ్రామీణ వృద్ధుడిలా తెలుగు సమాజానికీ సాహిత్యానికీ చేయగలిగినదంతా చేశారు. ఎనిమిది పదులు దాటినా ఎన్నడూ వృద్ధుడిగా భావించుకోలేదు సరిగదా, యువకులతో సమానంగా యువకుడిలా ప్రవర్తించేవారు. కులం, మతం, ప్రాంతం, వయసు, జ్ఞానం, అనుభవం వంటివి ఇచ్చే ఆధిక్యతను ఎన్నడూ దరి జేరనివ్వకుండా ఆ అంతరాలన్నిటినీ చెరపడానికి ప్రయత్నించారు. అంతరాల వ్యవస్థలో వేరువేరు స్థానాలలో ఉన్నవారి మధ్య వారధిగా పనిచేశారు. సుదీర్ఘ చరిత్ర సాక్షిగా, చరిత్ర వ్యాఖ్యాతగా, చరిత్ర రచయితగా, చరిత్ర నిర్మాతగా నిండు జీవితం గడిపారు. ఆయన ప్రారంభించిన, కొనసాగించిన, అసంపూర్ణంగా వదిలివెళ్లిన కృషిని కొనసాగించడమే ఆయనకు నివాళి. ఫాసిజం మీద ఎర్రసైన్యం సాధించిన విజయం గురించి పదో ఏట విన్న పాటను ఎనభై మూడో ఏటి దాకా ఆయన బహిరంగంగానూ, తనలో తానూ అనేకసార్లు పాడారు, పాడుకున్నారు. అన్ని రకాల దోపిడీల మీదా, పీడనల మీదా ఎర్ర సైన్యం, ప్రజాసైన్యం విజయం సాధించేదాకా ఆయన నోటిపాట నిలిచే ఉంటుంది, ఆయనా నిలిచే ఉంటారు.

చలసాని చిరంజీవి

ప్రొ. బి.వి. సుబ్బారావు

చలసాని ఒక వ్యక్తి కాదు. ఒక శక్తి. మానవత్వం మూర్తీభవించిన మహాశక్తి. ఓ కార్యసాధనకు నలుగురిని కూడగట్టగలిగిన కార్యదక్షుడు అలుపెరుగని నిత్య శ్రామికుడు. 1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి నిద్రాహారాలు మాని నిర్విరామ కృషి చేశాడు. ఆర్.ఇ.సి. అధ్యాపకుల నుంచి గరిష్ఠ స్థాయిలో విరాళాలు సేకరించవల్సిందిగా కోరాడు నన్ను. ఒక రకంగా ఆదేశించాడని చెప్పొచ్చు. నేనడిగిన నా సహచరులందరూ సంతోషంగా విరాళాలు అందజేశారు. సనాతన ధర్మాలను పాటించేనా సీనియరు సోమయాజులు గారు కూడా 100 రూపాయిలిచ్చినప్పుడు ఆశ్చర్యపోయాను. ఆ రోజుల్లో అది పెద్ద మొత్తం. శ్రీశ్రీ భావజాలంతో ఏకీభవించనివారు కూడా తెలుగు సాహిత్యంలో ఆయన్ని ఒక విశిష్ట మహాకవిగా గుర్తిస్తున్నారనే విషయం అర్థమైంది నాకప్పుడు. నేను సేకరించింది తక్కువ కాకున్నా, చలసాని సంతృప్తి చెందలేదు. ఇంకా సేకరించమన్నాడు. దీన్ని బట్టి షష్టిపూర్తి సభను జయప్రదం చేయాలని ఎంత తపన పడ్డాడో తెలుస్తుంది.

స్వపర భేదాలు లేని నిస్వార్థ మానవుడు ప్రసాద్. సంసార బంధాల సంకెళ్ల నుంచి బయటపడ్డ విశిష్ట వ్యక్తిత్వమున్న మనిషి. తన కుటుంబ సభ్యులు విజయక్క, నవత, మమతలతో సమానంగా కృష్ణక్క, రాణి, నాని, పాణి, క్రాంతి, ప్రగతి లాంటి వందలాది మందిని ఆప్యాయంగా ఆదరించేవాడు. ఇటువంటి మహోన్నత వ్యక్తిత్వం ఇంకెవ్వరిలోనూ చూడలేదు నేను.

కల్లాకపటం తెలియని నిష్కల్మష హృదయుడు చలసాని. కలుపుగోలు తనమున్న స్నేహశీలి. అందరికీ స్నేహ హస్తాన్ని అందించి అక్కున చేర్చుకునేవాడు. కమ్యూనిస్టు వ్యతిరేక భావాలున్న వారితో కూడా వ్యక్తిగత మానవతా దృక్పథంతో స్నేహంగా, సన్నిహితంగా ఉండేవాడు. కాని ఎట్టి పరిస్థితుల్లో కూడా యిసుమంత బెసక్కుండా తన మార్క్సిస్టు దృక్పథాన్ని చెక్కు చెదరకుండా, మొక్కవోకుండా కాపాడుకునేవాడు. ఒక రకంగా మేరునగధీరుడని చెప్పొచ్చు. కరుడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులతో, కుహనా మేధావులతో అంత సాన్నిహిత్యమెందు కనేవాడ్ని, కాని చలసాని అజాత శత్రువు.

సాదాసీదాగా నిరాండబర జీవితాన్ని గడిపేవాడు ప్రసాద్. ఓసారి వరంగల్ వచ్చినప్పుడు మా ఇంట్లో వారం రోజులున్నాడు. అతడు విడిచిన బట్టలు ఉతికించి ఇస్త్రీ చేయించింది నా భార్య రాణి వేసుకోమని ఆ బట్టలిస్తే 'ఇదేంటమ్మా! నా బట్టలు ఇస్త్రీ చేయించావు, నేనెప్పుడూ ఇస్త్రీ బట్టలు వేసుకోను' అన్నాడు. ఆ మాటలు విని అవాక్కయ్యాను. భోజనం విషయంలో కూడా అది ఇది అని అడిగేవాడు కాదు. ఏది పెట్టినా ఇష్టంగా, సంతృప్తిగా తినేవాడు. ఊరగాయ పచ్చళ్లంటే చాలా ఇష్టం. రెండు మూడు పచ్చళ్లు అన్నంలో కలుపుకుని ఆబగా తినేవాడు. ప్రసాద్ స్త్రీ పక్షపాతి. అన్ని విషయాల్లోనూ మా ఆవిడ పక్షానే ఉండేవాడు. నేను స్నానం చేయడానికి చాలా ఎక్కువ టైము తీసుకుంటున్నానని అన్నకు చెప్పినట్టుంది. 'ఏయ్ బండ సుబ్బూ! రోజా పురిటి స్నానం చేస్తున్నావంట, ఇక నుంచి ఐదు నిమిషాల్లో ముగించు' అన్నాడు. దానిక్కారణం నాకున్న పేస్ మేకరని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

1962లో కృష్ణక్కను చూడ్డానికి కాజీపేట వెళ్లాను. వేణు అమెరికాలో ఉన్నప్పుడు పిల్లల్ని చదివిస్తూ ఫాతిమా నగర్‌లో ఉండేది అక్క. అక్కడే ఉంటున్న ప్రసాద్‌ని పరిచయం చేసింది. ప్రసాద్‌ని చూడ్డం అదే మొదటిసారి. ఆర్.ఇ.సి. హాస్టల్స్‌లో మెస్సు మేనేజరుగా ఉన్నాడప్పుడు. ఆ రోజు అతడితో కలిసి మెస్సులో భోం చేశాను. ఆర్.ఇ.సి. ప్రాంగణంలో నేను తొలి అడుగులు వేసింది ఆ రోజే.

1963-65లో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో నేను ఎమ్.ఇ. చదువుతున్నప్పుడు ప్రసాద్‌ని రోజూ కలిసి మాట్లాడే అవకాశం దొరికింది. తన జీవిత భాగస్వామి విజయక్కతో పాటు కృష్ణక్క వాళ్లింట్లో ఉండేవాడు. ఇంజినీరింగ్ కాలేజికి దగ్గర్లో డెయిరీఫాం రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో నేను నా భార్య ఉండేవాళ్లం. పేరుకి మాత్రమే మాది వేరే కాపురం, ఎక్కువ కాలం ఉన్నది మాత్రం కృష్ణక్క వాళ్లింట్లోనే. ఆ ఇల్లు ఓ విజ్ఞాన కేంద్రం, సాహితీ నిలయం, రాజకీయ పాఠశాల. అక్కడెప్పుడూ చర్చోపచర్చలు, వాదోపవాదాలు, సమాలోచనలు, సమావేశాలు జరుగుతూ ఉండేవి. ఈ కార్యక్రమాలన్నిటికీ సూత్రధారి, పాత్రధారి ప్రసాదే. అతడో విజ్ఞాన ఖని. అంచనాలకందని అద్భుతమేధావి. అపారమైన జ్ఞాపక శక్తి అతని సొంతం. మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, స్టాలిన్, మావో, ఇంకా ఎందరో మేధావులు రాసిన సిద్ధాంత గ్రంథాలు, తెలుగు పుస్తకాలు ముఖ్యంగా అభ్యుదయ రచనలు ఆపోసన పట్టిన అఖండ ప్రతిభాశాలి. ఏ విషయంపై చర్చ జరుగుతున్నా, సందర్భానుసారంగా పైన చెప్పిన గ్రంథాల నుంచి ఎన్నో విషయాలను అలవోకగా ఉటంకించేవాడు. అతని విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్యపోయేవాడ్ని. ఆ రోజుల్లో చలసాని నన్ను ప్రగాఢంగా ప్రభావితం చేశాడు.

1965లో ఆర్.ఇ.సి. వరంగల్‌లో లెక్చరర్‌గా చేరాను. వరంగల్ ఎప్పుడొచ్చినా, కాళోజీ, వరవరరావు, రామకోటి శాస్త్రిగార్లను తప్పకుండా కలిసేవాడు ప్రసాద్. వీలైనప్పుడు నేను కూడా తనతో వెళ్లేవాడ్ని. కాళోజీని 'విశ్వమానవుడు' అనేవాడు. వరవరరావుగారన్నా, ఆయన కుటుంబమన్నా మాటల్లో చెప్పలేని ప్రేమాభిమానాలుండేవి ప్రసాద్‌కి. తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసి, ప్రాణాలను సైతం పణంగా పెట్టి పీడిత ప్రజల పక్షాన పోరాడుతున్న విప్లవ సాహితీ యోధుడు వరవరరావు అనేవాడు. విశ్వనాథ సత్యనారాయణకు వీరాభిమానిగా ఉండే రామకోటి శాస్త్రిగారు క్రమంగా విప్లవ భావజాలం వైపు మరలడానికి వరవరరావు ప్రభావమే ప్రధాన కారణమనేవాడు ప్రసాద్.

1973-76లో ఐ.ఐ.టి., మెద్రాస్‌లో పిహెచ్.డి. చేస్తున్నప్పుడు అడయార్‌లో కాపురముండేవాడ్ని. ప్రసాద్ మద్రాసు ఎప్పుడొచ్చినా మా ఇంటికొచ్చేవాడు. ఒకసారి శ్రీశ్రీని కలవడానికి వెళ్లాం. బస్సు

దిగి మేము నడిచి వెళ్తుంటే రిక్షాలో ఎదురుపడ్డాడు శ్రీశ్రీ. రిక్షా నిండా బిందెలు, కడవలు, గిన్నెలు, కంచాలు ఉన్నాయి. మేము రిక్షా ఆపగా 'చేతిలో చిల్లిగవ్వ లేదు, వీటిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకోవడాని వెళుతున్నా' అన్నాడు. 50 రూపాయలు ఆయన చేతిలో పెట్టి రిక్షాని వెనక్కి మళ్లించాం. శ్రీశ్రీని కలవడం అదే మొదటిసారి నాకు. అంత సింపుల్‌గా ఉంటాడని ఊహించలేదు. పసి పిల్లాడిలా మాట్లాడాడు. మద్రాసులో ప్రసాద్ పరిచయం చేసిన రెండో వ్యక్తి హరిపురుషోత్తం. ఆ ఇద్దరి శరీరాలు వేరైనా హృదయం మాత్రం ఒక్కటే. అటువంటి అపూర్వ స్నేహ బంధం వాళ్లది. తాను కొన్న పుస్తకాలన్నిటి మీదా 'హరి ప్రసాద్' అని రాసుకునేవాడు ప్రసాద్. ఆ రోజుల్లో హరి ఆత్రేయకు అసిస్టెంటుగా సినిమాలకు సంభాషణలు రాసేవాడు. ప్రసాద్ పుస్తకాల పురుగు. మద్రాసు వచ్చినప్పుడల్లా మూర్ మార్కెట్‌కి నన్ను కూడా తీసుకెళ్లేవాడు. అదో పాత పుస్తకాల పాతర, దొరకని పుస్తకమంటూ ఉండేది కాదు. గంటల తరబడి పుస్తకాల్లో మునిగిపోయి నాలుగైదు కొనేవాడు. రెండేళ్ల క్రితం నేను వాషింగ్టన్‌లో ఉంటున్న మా అమ్మాయి ప్రగతి దగ్గరకు వెళ్లినప్పుడు రెండు అరుదైన పుస్తకాలు కొనుక్కురమ్మని వివరాలిచ్చాడు. వాషింగ్టనంతా గాలించినా దొరకలేదా పుస్తకాలు.

1996-2002లో తిరుపతికి దగ్గర్లో ఉన్న శ్రీ విద్యానికేతన్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా నేను పని చేస్తున్నప్పుడు మా ఇంటికి రెండు మూడు సార్లొచ్చాడు ప్రసాద్. వచ్చినప్పుడల్లా తిరుపతి బైరాగి పట్టెడలో ఉంటున్న త్రిపురనేని మధుసూదనరావుగారింటికి నన్ను కూడా తీసుకెళ్ళేవాడు. ఆయన తన దగ్గరెప్పుడో తీసుకున్న నాలుగు పుస్తకాలు తిరిగిమ్మని మరీ మరీ అడిగేవాడు. ప్రసాద్‌కి పుస్తకాలంటే పంచప్రాణాలు. అవే అతని ఆస్తిపాస్తులు. అవిపోతే గిలగిలలాడి పోయేవాడు. పుస్తకాలడిగినప్పుడల్లా అది ఎక్కడో ఉన్నాయి. ఎవ్వరో తీసుకున్నారు తరువాత తప్పకుండా పంపుతాననే వాడు మధుసూదనరావు గారు. వాటిని రాబట్టే బాధ్యత నాపై పెట్టాడు ప్రసాద్. పైగా వాళ్లమ్మాయికి నేను పని చేసే కాలేజీలో ఏదైనా ఉద్యోగం ఇవ్వాల్సిందిగా పట్టుబట్టాడు. ఇచ్చేవరకు పట్టువదలని విక్రమార్కుడిలా నన్ను విడిచిపెట్టలేదు. ఒకసారి నన్ను వెంటబెట్టుకుని తిరుపతి వెళ్లి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సినిమానటుడు కాకరాలను పరామర్శించాడు. కమ్యూనిస్టు విప్లవ భావాలున్న ఎవ్వరికి కష్టమొచ్చినా విలవిలలాడిపోయేవాడు. కొండంత అండగా నిలబడేవాడు.

ఈ సంవత్సరం జూన్‌లో ఫోన్ చేసి జూలై చివరలో హైద్రాబాద్ వస్తున్నాను వారం రోజులు మా ఇంట్లో ఉంటానన్నాడు. మా ఇంట్లో ఉంటానని నాకు చెప్పాలా అన్నాను. జూలై చివరి వారంలో రాణి, నేను ప్రసాద్ రాక కోసం ఎదురు చూస్తున్నాం. 25న టివి చూస్తుంటే మధ్యాహ్నం 12 గంటలకు పిడుగులాంటి వార్త. గతుక్కుమన్నాను. కళ్లు బైర్లుకమ్మాయి. చలసాని ఇకలేడన్న వార్తను జీర్ణించుకోలేక పోయాను. నమ్మబుద్ధి కాలేదు. కాసేపటికి తేరుకుని చకచక అన్ని ఛానల్స్ చూశాను. అన్నిటిలోనూ అదే దుర్వార్త. ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుని 'రాణీ! రాణీ! ఇదేమిటి? ఇదేం వార్త?' అంటూ అరిచా. పక్క గదిలో ఉన్న మా ఆవిడ ఏమిటి? ఏమైంది? అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది. నోటితో చెప్పలేక చేత్తో టివి వైపు చూపించా. ఏమిటీ వార్త? అన్నయ్య పోయాడా అంటూ కట్టలు తెంచుకుంటూ వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేసింది.

'అమ్మా రాణీ! బాగున్నావా? క్రాంతిగాడు ఎట్లా ఉన్నాడు?' అని ఆప్యాయంగా పలకరించే అన్నయ్య ఇక లేడా అంటూ మంచం మీద కూలబడింది. మేమెక్కడున్నా ఇంటికి వచ్చి నాలుగు రోజులుండి ఎంతో కలివిడిగా ఆప్యాయంగా మనసారా మాట్లాడే ఇద్దరి ఆత్మీయుల్లో ప్రసాద్ ఒకడు. ఇంకో వ్యక్తి తుమ్మల వేణుగోపాలరావు గారు. వాళ్లిద్దరికి నాతోకన్నా నా భార్యతో అనుబంధమెక్కువ. నేను వివరించి చెప్పలేని విషయాలను ముఖ్యంగా కమ్యూనిస్టు సిద్ధాంతాలను తనకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పేవాళ్లు. ఇప్పుడు మాకు ఆ ఇద్దరు ఆత్మీయులూ లేరు. ఈ వెలితిని ఇంకెవ్వరూ పూడ్చలేరు. మాకు తగిలిన ఈ మానసిక గాయాన్నెవరూ మాన్పలేరు.

ప్రసాద్ మరణంతో ఒక మహోన్నత విప్లవ సాహితీ శిఖరం కూలిపోయింది. కాని ప్రజల మనస్సులో మాత్రం చలసాని చిరంజీవి.

అక్షర నివాళి

- మెట్టు రవీందర్

కన్వీనర్, వరంగల్ రచయితల ఐక్యవేదిక
ఆంధ్రజ్యోతి 28.07.2015

గతంలో సంభవించిన తొలితరం నాయకులు కె.వి.ఆర్, కాళోజీ, ఎం.టి.ఖాన్, కన్నబీరన్ మొదలైన వాళ్ల మరణం వలెనే, విరసం వ్యవస్థాపక సభ్యులు చలసాని ప్రసాద్ ఆకస్మిక మరణం కూడా ఒక పెద్ద దిక్కును కోల్పోయామన్న దుఃఖాన్ని, ఒక రకమైన భయాన్ని ఏకకాలంలో కలిగిస్తున్నది. ఎందుకంటే - సైద్ధాంతిక, తాత్త్విక విషయాల్లో వారి వారి నిబద్ధతలను సడలనీయకుండానే, విస్తృత పౌర, ప్రజా సంబంధాలు నెరిపే విషయంలో వారికున్న సంయమనశీల స్వభావాలు, అత్యంత ప్రభావశీలమైన బహుముఖీన వ్యక్తిత్వ లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. విశాల ప్రజాశ్రేణులకు సంబంధించిన సకల వ్యక్తిగత, భిన్న భావ వైరుధ్యాలను సంయమనంతో అర్థం చేసుకొని, వాటిని తమ ప్రకటిత లక్ష్యాల వైపు మళ్లించి, ఘర్షింప జేయడంలో, ఆ మేరకు మరింత అభివృద్ధికర మార్పును సాధించడంలో వాళ్లు ప్రదర్శించిన నేర్పు అసమానమైనది, సాహసోపేతమైనది. ఇక చలసాని గారి విషయానికొస్తే - భిన్నమైన, మార్క్సిస్టేతర అభిప్రాయాలు కలిగిన వ్యక్తులతో సైతం మానవీయ స్నేహ సంబంధాలు నెరపడం ద్వారా హృదయాలను గెలుచుకొని వారిని తన లక్ష్యం వైపు సుముఖుల్ని చేయడంలో చలసానికి సాటిరాగలవారు చాలా అరుదుగా ఉంటారు. శ్రీశ్రీ, రావిశాస్త్రి లాంటి రచయితల్ని ప్రేమించడమే కాదు. మొత్తంగానే సమస్త పీడిత ప్రజారాశులను ప్రేమించడమెలాగో చలసాని వ్యక్తిత్వం నుంచే నేర్చుకోవాలి. వర్తమాన నాయకత్వ శ్రేణుల్లో ఇలాంటి వ్యక్తిత్వ లక్షణాలు నిర్మితం కావాలని ఆశిస్తూ, చలసానికి నా ఈ నాలుగు మాటల్ని అక్షర నివాళులుగా అర్పిస్తున్నాను.

విలక్షణ బుద్ధిజీవి

పాణి

వృద్ధాప్యం వల్ల చివరి రోజుల్లో చెప్పిందే పదే పదే చెప్తుండే చలసాని చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. చాలా కష్టం. ఆయన లేడనుకోవడం. ఈ మధ్య ఒకటి రెండు విరసం సభలకు ఆయన రాలేకపోతేనే ఎంత వెలితి అనిపించిందో. సభల్లో ఆయన వక్తగా లేకపోయినా, సర్వసభ్య సమావేశాల్లో సహితం ఇటీవల చాలా వరకు మౌనంగానే కూర్చుంటున్నా ఆయన ఉనికే నిండుదనం. గొప్ప ధైర్యం. ఉజ్వల వారసత్వపు వెలుగు. ప్రజా పోరాటాల్లో నిగ్గుదేలిన విలువల శిఖరాగ్రం. ఆయన ఇక అసలే రాడనుకోవడం, లేడనుకోవడం దు:ఖకరం.

విప్లవంలో ఉండేవాళ్లకు ఈ ఫీలింగ్స్ ఏమిటి? మనిషి ఎప్పుడైనా చనిపోతాడు కదా? ఇవి ఫీలింగ్స్ మాత్రమే కాదు. చలిస్తున్న వాస్తవ చరిత్రకు సంబంధించినవి. 'అంతరంగం అట్టడుగున అంత మందిమీ మానవులమే..' అంటాడు ప్రసాద్. ఆయన ఇలా చెప్పేవీ, రాసేవీ ఆయన వ్యక్తిత్వాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో సన్నిహితులు చెప్పాల్సిందే. ఏ గాఢమైన వ్యక్తిత్వపు లోతుల నుంచి ఈ మాటలు వచ్చేవో తెలుసుకోవడం వల్ల ఆయనను నిర్మించిన చరిత్రలోకి తొంగి చూసినట్లవుతుంది.

ఆయనలో రూపొందిన వ్యక్తిత్వం, చరిత్ర వల్ల ఆయనకు దొరికిన స్థానం కలిపితే చలసాని ప్రసాద్. ఆ చరిత్రను అర్థం చేసుకోవడంలో, దానిలోని పురోగామి శక్తులను చాలా ముందుగా గుర్తించడంలో, దానితోపాటు కలిసినడవడంలో ఆయన ప్రదర్శించిన చైతన్యం, సంసిద్ధతే చలసాని మూర్తిమత్వం.

ప్రసాద్ మరణవార్త విన్నప్పటి నుంచి ఎందరెందరో ఆయనతో తమ ఆత్మిక బంధాన్ని తలపోసుకుంటున్నారు. అందులో తాము మానవులుగా ఓలలాడిన తీరును పునర్దర్శించుకుంటున్నారు. ఆయన వ్యక్తిత్వపు వెలుగులో జ్ఞాపకాలతో, కన్నీళ్లతో తడిసిపోతున్నారు. అక్షరాలకు ఆ చెమ్మ అంటించారు. ఆయనకున్న విస్తృత సామాజిక జీవితం అలాంటిది. వ్యక్తిగతంగానేకాదు, కమ్యూనిస్టుగా కూడా ఆయనది పరిపూర్ణ జీవితం. అసలు ఆ రెండు అభేదం కావడం వల్లే అది పరిపూర్ణమైంది. ఈ మాట ఒక పరమ ప్రమాణమవుతుంది కదా? దాని వల్ల ఇబ్బందులు ఉండవా? అసలు పరిపూర్ణమనే మాట అనవచ్చునా? తాత్వికార్థంలో సబబేనా? అనే సందేహాలు నాకూ ఉన్నాయి.

నిజమే.. పెట్టుబడి వల్ల విధ్వంసమైపోతున్న మనిషిని(అసలైన మాట మానవ సంబంధాలు) పరాయికరణలో చూచి మార్క్స్ ఖేదపడ్డాడు. ఒక స్వేచ్ఛామానవుణ్ని ఆయన కలగన్నాడు. కేవలం కల కాదు. అసలైన చారిత్రక ప్రభాతోదయంలో మనిషి ఎలా ఉండవచ్చునో చెప్పాడు. మానవసారం ఎలా వెల్లివిరుస్తుందో చెప్పాడు. ఈ విషయాలు బాగా తెలిసిన చలసాని ... 'మనిషి పొద్దున పూట వ్యవసాయం చేసి, మధ్యాన్నం కవిత్వం రాసుకొని, సాయం కాలం పూట చేపలు పట్టుకొని, రాత్రి నాటకాలు ఆడుకోవాలి... మనిషి ఇలాంటి స్వేచ్ఛావర్తనంతో జీవించాలని, అది కమ్యూనిజంలోనే సాధ్యమని మార్క్స్ రాశాడు బాబూ...' అని ఎప్పుడో చెప్పాడు. సరిగ్గా ఈ మాటలే కాకపోవచ్చుగాని .. విషయం ఇదే. కమ్యునిజంలోని సమిష్టిలో భాగంగా స్వేచ్ఛా మానవుడు, మానవి పరిపూర్ణంగా రూపొందే క్రమానికి సంబంధించిన విషయం అది. సుదూర తీరాల్లోని ఒక జెండాగా విప్లవ కార్యకర్తలను పరవశం చేసి, నిత్యం దారి చూసే భావన అది. చారిత్రకంగా ఈ భావన ఎలా నిజం అవుతుందో చెప్పగల శాస్త్రీయ సిద్ధాంతమే మార్క్సిజం.

ప్రసాద్ జీవితాన్నంతా ఆ భావన నడిపించిందనిపిస్తుంది. దాన్ని నిజం చేయగల చారిత్రక పరిణామంపట్ల, దాన్ని నడిపే మానవకర్తృత్వంపట్ల ఆయనకున్న శాస్త్రీయ వైఖరే మనకు చలసానిని అందించింది. లేకపోతే ఎందరో సాహిత్యకారుల్లో, ఉద్దండ పండితుల్లో, అపార అధ్యయనపరుల్లో, భాషావేత్తల్లో, కమ్యూనిస్టు విశ్వాసుల్లో ఆయనా ఒకడైపోయేవాడు. శ్రీశ్రీ నుంచి మావోయిస్టుపార్టీ దాకా, అక్కడి నుంచి మానవజాతి సాధించుకోగలిగే కమ్యూనిజం దాకా ఆయన వైఖరులు కొందరికి భక్తిగా, మొండి నమ్మకంగా

కనిపించవచ్చు. ప్రసాద్ మరణానంతరం అట్లా రాస్తున్న వారు కూడా ఉన్నారు. బహుశా తమలా 'లౌక్యం'గా కాక చారిత్రకంగా మాత్రమే ఆలోచిస్తున్నందు వల్ల అలా అనిపించడం సహజమే.

ఈ సంగతి పక్కన పెడితే.. మార్క్స్ చెప్పినట్లు అత్యున్నతమైన సమిష్టిలో అంతర్భాగమైన స్వేచ్ఛా మానవుడి లక్షణాలు చలసానిలో ఉన్నాయనిపిస్తుంది. పరమ ప్రమాణాల జోలికి వెళ్లకుండా, వాటికి అపవాదు రాకుండా మన కాలంలో మన మధ్య జీవించిన ఈ మానవుడిని అర్థం చేసుకోలేమా? అనే ప్రశ్న కూడా వేసుకుందాం. ఆయనే తరచూ అన్నట్లు రాజకీయాలకు అతీతంగా మానవ సంబంధాలను చూడాలనే మాటకు కూడా అప్పుడే సరైన అర్థం చెప్పుకోగలమేమో. ప్రసాద్‌కున్న విస్తారమైన మైత్రీ సంబంధాల్లో ఆయన సమ వయస్కులు ఉన్నారు. ఇరవై పాతికేళ్ల వాళ్లూ ఉన్నారు. ఆయనకు పరిచయం కావడమంటేనే విశాలమైన ఆయన స్నేహ ప్రపంచంలో భాగం కావడమే. ఇక అక్కడ మనకు శాశ్వత చిరునామా ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా ప్రసాద్ మానవ సంబంధాలు కొనసాగించేవాడనే మాట నిజమే. అయితే వినియోగంలో ఈ మాట ఏ దురర్థం పలకడం లేదా? కనీసం బహుముఖీనమైన చలసానిలోని స్నేహం, మానవ సంబంధాలు అనే కోణాన్నయినా ఈ మాట సంపూర్ణంగా ప్రకటిస్తుందా? రాజకీయాతీత స్నేహాల్లో ఆరాజకీయం ఉందనుకోవడం కంటే అందుకో ఒక విలువ ఉందనుకుంటేనే ప్రసాద్ కొంచెమైనా అర్థం అవుతాడనిపిస్తోంది. ఆ విలువ .. ఉద్యమాల కంటే, నిర్మాణాలకంటే, రాజకీయాలకంటే విలువలను ఉన్నతంగా భావించే విలువలవాదులు చెప్పే విలువ కాదు. ఇలాంటి వాళ్ల విలువల్లో తెలిసిగాని, తెలియకగాని నైతిక కోణం ఉంటుంది. నైతికత ప్రాధాన్యతను తక్కువ చేయడానికి లేదుగాని, విలువలను వాటి సామాజిక అర్థంలో గుర్తించడమే మంచిది. సరైంది. చలసాని మైత్రీ సంబంధాల్లోని విలువ సామాజికమైనది.

ఆయన తన కంటే చిన్నవాళ్లను ఏరా అమ్మడూ అనో, బాబూ అనో.. పిలవడం వెనుక సామాజికమైన ఏ తేడాలు, అధికారాలు, గుర్తింపులు, పెద్దరికాలు, వివక్షలు లేకపోవడం, సొంత ప్రయోజనం లేకపోవడం, పరిస్థితులు, అవసరాలతో నిమిత్తం లేకుండా హృదయం లోంచి సంబంధాలు కొనసాగించడం దానికదే ఒక సామాజిక విలువ. చలసాని తదనంతరం ఇంతగా అన్ని రకాల వాళ్ల ఆయన స్నేహానుభవంగా మాట్లాడుతున్నది ఆ విలువ గురించే. జీవితమంతా కమ్యూనిస్టు ఉద్యమానికి ధారపోసిన వ్యక్తి మరణానంతరం ఇంతగా ఆయన స్నేహాన్ని తలపోసుకోవడం చాలా ప్రత్యేకం. చాలా సహజం. సీపీ మానవ సంబంధాల్లోని విలువ సామాజికమైందేగాక సుదీర్ఘ కమ్యూనిస్టు ఉద్యమ సంస్కృతితో ముడిపడింది. ఆ ఉద్యమం లోపలా, బైటా ఎందరి చైతన్యంలోనో, ఆచరణలోనో వ్యక్తంగా, అవ్యక్తంగా ఉండిన, ఉంటున్న విలువ చలసాని వ్యక్తిత్వంలోని విశిష్టత వల్ల కూడా అద్భుతంగా వికసించి మానవ సంబంధాల పరిమళం వెదజల్లింది. అది ఆయన వ్యక్తిత్వంలో భాగం. ఎంతగానంటే ఆయన ప్రతి సంబంధాన్నీ దాని పూర్తి అర్థంలో సామాజికంగానే చూశాడనడానికి 06-05-2015న తన సహచరి విజయ వర్ధంతి సందర్భంగా రాసిన 'కడసారి ఊసులు' అనే కవిత కూడా ఉదాహరణ. అందులో ఇలా అంటాడు.

ఏనాటి చుట్టరికాలో
మళ్లీ మళ్లీ తిరుగాడుతున్నాయి
పాత చుట్టాల కొత్త గొంతుకలు
మనసుని ద్రవింపజేస్తున్నాయి

దూరదూర తీరాల
బాంధవ్యాలు, పిలుపులు
మన ఇంట్లో కొత్తవాళ్లు
సరికొత్త పాతవాళ్లుగా
కనిపిస్తున్నారు

పేర్లు రాసి నిన్ను ఖంగారు పెట్టను
కళ్లారా చూద్దువుగాని
మనసారా మాటాడుదువుగాని
ఎగతాళి, ఎకసక్కెం లేనేలేవు
తరతరాల కమ్యూనిస్టు బాంధవ్యం
సామ్యవాదపు అనురాగ రాగాలు

జగమంతా సమానత వెల్లివిరియాలి
ఆధోలోకపు జనావళి గొంతు పెగల్చాలి
సామ్యవాద మానవులే
చిరస్థాయిగా నిలుస్తారు.. అని రాశాడు.

అలాగే విజయ కోసమే 18-05-2015 రాసినదాంట్లో Human Association అజరామరం

...After all what is life? It is nothing but human association. ..

అన్నాడు. తన జీవన సహచర్యాన్ని కూడా ఆయన సామాజికంగా చూశాడు. ఆమెతో తన అనుబంధాన్ని తలుచుకునేటప్పుడు కూడా ఆయన తన మార్క్సిస్టు విలువలను, మిత్రులను, మనుషులను కలిపి స్మరించుకున్నాడు. సామ్యవాద మానవులు చిరస్థాయిగా నిలుస్తారని ఆమెతో సంభాషిస్తాడు.

సంబంధాలన్నిటినీ సామాజికంగా చూడటం వల్ల ఆయన అపారమైన స్వేచ్ఛ అనుభవించాడు. వ్యక్తిగతం, సామాజికమనే విభజన లేకపోవడంలోని స్వేచ్ఛావర్తన, ఆనందం ఎలా ఉంటాయో ఆయనకు తెలుసు. ఆ ఆనందాన్ని ఆయన పూర్తిగా సొంతం చేసుకున్నాడు. మనుషులు, కళా సాహిత్యాలు, విప్లవంలోని సామాజికం, స్వేచ్ఛా భావన ఆయన ఆయన వ్యక్తిత్వంలో భాగమైపోయాయి. ఈ మూడింటి గురించి ఆలోచించకుండా, మాట్లాడకుండా ఉండటం దుర్లభం అనేంతగా ఆయనలో కలగలిసిపోయాయి.

విరసంపై నిషేధం ఎత్తేశాక విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు ఆ కాలమంతా ఉద్యమపరంగా, వ్యక్తిగతంగా ఎన్ని గాయాలను, ఒత్తిళ్లను, ఆరాటాలను, అమరత్వాలను, వీరులకు చెయ్యెత్తి జోహార్లు చెప్పజాలని కన్నీళ్లను అన్ని ప్రాంతాల నుంచి మోసుకొని వచ్చారు. ఇద్దరు నాయకులు అప్పటికి ఇంకా జైల్లోనే ఉన్నారు. అంత ఉద్విగ్నభరితమైన సమావేశంలో చలసాని ఈ విప్లవాగ్నులెచటివని అడిగితే.. అని ఎప్పటిలా తన్మయోద్వేగాలతో పాడాడు. ఆ రోజు రాత్రి నిద్రపట్టక క్రిష్ణక్కతోపాటు కూర్చున్నప్పుడు పాత సాహిత్యం మీదికి చర్చ వెళ్లింది. చలసాని... విశ్వనాథ కిన్నెరసాని పాటలు కూనిరాగాలు తీసి వినిపించాడు. 'బాబూ...ఆయన ఎంత

రియాక్షనరీ అయినా, పాషాణ పద్యాలు రాసినా.. మంచి తెలుగులో ఈ పాటలు ఎంతబాగా రాశాడో చూడు..' అన్నాడు.

కన్నీళ్లను, సౌకుమార్యాలను, బాధలను, విశ్వాసాలను ఒక విశాలమైన ఆవరణలో ఆయన గుర్తించాడు. స్వీకరించాడు. సంస్థను, పార్టీని, ఉద్యమాన్ని, వాటి నిబంధనలను, లక్ష్యాలను ఆయన జీవితమనే, సమాజమనే, చరిత్ర అనే మొత్తంలో విడదీయలేని భాగాలుగా చూశాడు. అన్నిటినీ కలిపి మొత్తంగా ఎలా చూడాలో, విడిగా వాటి మధ్య సంబంధం ఎలా ఉంటుందో ఆయనకు ఒక అవగాహన ఉండేది. నిజానికి ఈ అవగాహన ఆయన రాతల్లోకంటే, మాటల్లోకంటే జీవితంలో ఘనంగా ప్రతిబింబించేది. దీనివల్ల ఆయనకు సంస్థపట్ల నిర్మాణబద్ధంగా తప్ప ఇంకోలా వ్యవహరించడం అంటే ఏమిటో తెలియకుండాపోయింది. నిర్మాణ, ఉద్యమ ప్రయోజనాలు తప్ప ఇంకోటి ఉంటుందనే ఊహ కూడా వచ్చి ఉండదు. కానీ నిర్మాణాలకు నేరుగా అవసరం ఉన్నట్లు కనిపించని స్నేహాలు, పనులు కూడా ఆయన్ను పరిగెత్తిస్తుండేవి. వాటిలో కూడా ఆయన అంతే బాధ్యతగా ఉండేవాడు. అంతకు మించి ఆనందం అనుభవించేవాడు. ఇందులో స్వేచ్ఛాభావన ఉంది. ఇండివిజువల్ ఉన్నాడు. సాహిత్యం, కళల్లో కూడా ఆయనకు తనదైన అభిరుచులు ఉండేవి. వాటిని ఆస్వాదించడానికి వెనుకాడేవాడు. జానపదాల్లోని సౌందర్యాన్ని, వివేకాన్ని, జీవితాన్ని పారవశ్యంగా పాడి చెప్పినట్లే అప్పుడప్పుడు తనకిష్టమైన పద్యాలను చెప్పి ఆనందించేవాడు.

చలసాని చాలా సాదా మనిషి. మరణానంతరం ఆయన గురించి వస్తున్న ప్రతిస్పందనలు చూస్తోంటే .. చాలా మందికి ఆయన ప్రముఖ మార్క్సిస్టు మేధావి, ఒక గొప్ప పోరాట చరిత్రకు వారసుడు, దానిలో భాగస్వామి, అపార అధ్యయపరుడు కాక తమకిష్టమైన మామూలు మనిషిగానే అనిపించాడు. ఒకసారి పరిచయంలోకి వెళితే ఇక ఆయన ప్రతివాళ్లకూ సొంతం తెలిసిపోయినట్లు ఉండేవాడు. ఆయన అలా ఉండటమేకాదు... తన చుట్టూ ఉండే వేలాది మంది మిత్రులు, కార్యకర్తలకు అలా మనసార అనిపించేలా ఉండటమే ఆయన ప్రత్యేకత.

ఉద్యమాలతో సంబంధమున్న వాళ్లకైతే ఎలాంటి పనైనా చేసిపెట్టగల, ఎలాంటి జటిలమైన సమయంలోనైనా అండగా నిలబడగల నాయకుడిగా, అంతకంటే కార్యకర్తగా కనిపిస్తాడు. అందులో కూడా ఆయన సాదా మనిషే. చలసాని ప్రసాద్ అనే వ్యక్తిత్వాన్ని ఏ ప్రత్యేకతా కప్పేయనంత సాదాగా ఎందుకు ఉంటుందంటే... ఆయన తానుగా ఏ ప్రత్యేకతా కోరుకోకపోవడం, సమాజం ఆపాదించే ప్రత్యేకతపట్ల మోజుపడకపోవడం. కొందరు వ్యక్తులు తాము ఏ ప్రత్యేకత కోరుకోకపోయినా అనేక కారణాల వల్ల సమాజం కొన్ని ప్రత్యేకతలను లేదా గుర్తింపులను ఆపాదిస్తుంది. చాలా మందికి అవి మోయక తప్పని పరిస్థితి ఉంటుంది. సీపీ వాటితో కూడా తానుగా ఎంగేజ్ కాలేదు. దీనికి కారణం.. ఆయనది 'నేను' కేంద్రక వ్యక్తిత్వం కాకపోవడం. 'నేను' కోసం ఏ తపనా, ఆరాటం లేకుండా సమిష్టికి అర్థవంతంగా, పూర్తిగా కట్టుబడి, దాని ప్రయోజనాల కోసమే పని చేస్తూ, దానికి దాదాపు ఇబ్బంది కలగని రీతిలో వ్యక్తిగా ఆయన స్వేచ్ఛాయుత జీవితం గడిపాడు. ఈ స్వేచ్ఛావర్తన వల్ల పరిపూర్ణ జీవితం అనేదానికి ప్రసాద్ ఒక నమూనాగా మిగిలిపోయాడు.

* * *

ఇలాంటివెన్నో చెప్పుకుంటూపోతే సీపీని అర్థం చేసుకోవడం, అంచనా వేయడం చాలా తేలికనిపిస్తుంది. అంత సరళంగా, సాదాగా ఉంటాడు. వాస్తవానికి చాలా తేలికగా అర్థమవుతున్నట్లుండే చలసానిని మొత్తంగా తెలుసుకోవడం, అంచనా వేయడం చాలా కష్టమైన పని. ఆయన పోషించిన పాత్ర కూడా అలాంటిదే. సామాజిక జీవితంలో ఆయన నిర్వహించిన పాత్రను, దాని ప్రభావాలను, దాని పర్యవసానాలను, ఫలితాలను సమగ్రంగా గుర్తించి ఒక అంచనాకు రావడం అంత సులభమేమీ కాదు. ఆయన స్నేహాలు, ప్రేమలు, అభిమానాలు ఈ మొత్తం సామాజిక ఆచరణలో విడదీయలేని ఒక చిన్న భాగం. 1937 నుంచి 2015 దాకా ఎన్నో చారిత్రక సందర్భాల్లో, భిన్న రంగాల్లో, భిన్న రూపాల్లో సాగిన ఆచరణలన్నిటినీ కలిపి ఎలా చూడాలి? వాస్తవానికి తాను చేసిన పనులను... ఆలోచనలను అర్థం చేసుకోగల ఆనవాళ్లను ఆయన ఎంత వరకు వదిలి వెళ్లాడో చెప్పడం కూడా కష్టమే. 1947లో ఏకబాట అనే పేరుతో రాసిన కవిత దగ్గరి నుంచి అన్నీ కలుపుకుంటే ఆయన రచనలు ఐదు వందల పేజీలు కూడా మించవు. తనను తాను వ్యక్తం చేసుకోడానికి రచన కూడా అట్టే చేయని మనిషి. ఇక ఇతరేతరంగా మనకు ఏ ఆనవాళ్లు ఇచ్చి వెళ్లిపోయాడు? ఆయన సాదా వ్యక్తిత్వానికి ఇదే ఒక ఉదాహరణ.

ఎందరో సాహిత్య, ఉద్యమ మూర్తులను సర్వ సమగ్రంగా పునర్నిర్మించి మనకు ఇచ్చాడు. వాళ్ల రచనా, జీవిత విశేషాలకు సంబంధించిన చిన్న ముక్కను కూడా గుదిగుచ్చి వాళ్లపట్ల తనకు నిర్విమర్శా వ్యామోహం ఉందని విమర్శలకు కూడా గురయ్యాడు. కానీ తన గురించి మనకు పెద్దగా ఏమీ నమోదు చేసిపెట్టకుండానే వెళ్లిపోయాడు. ప్రసాద్ అంతర్భాగమైన తెలుగు సమాజ కమ్యూనిస్టు ఉద్యమ, విప్లవోద్యమ ఘట్టాలను చెప్పిన చోట కూడా తను అంతగా మనకు కనబడడు. వాటన్నిటిలో అంతర్లీనమైపోయిన మనిషి కదా.. వాటిలో తాను ఎక్కడెక్కడ ఎలా ఉన్నాడో, ఎలా రూపొందాడో ఆనాటి అనుభవాల నుంచి, ఇంప్రెషన్స్ నుంచి, ఆ చారిత్రక ఆవరణలోంచి చాలా కొంచెమే చెప్పాడు, రాశాడు. ఇది చలసాని సాదా వ్యక్తిత్వానికి రెండో ఉదాహరణ. వీటి వల్ల ఆయనను అంచనా వేయడం కష్టమైన వ్యవహారం.

ఇవాళ ఆయన లేడు. ఆయన చేసిన పనులు ఉన్నాయి. రాతలు ఉన్నాయి. ఆలోచనలు ఉన్నాయి. వీటన్నిటినీ కలిసి కమ్యూనిస్టుగా, రచయితగా, మేధావిగా, నాయకుడిగా, కార్యకర్తగా ఆయనను సమగ్రంగా పునర్నిర్మించడానికి సాధ్యమేనా? దానికి ప్రాతిపదికలు ఏమై ఉండాలి? ఏ దృష్టి కోణం ఉండాలి? ఈ మాటలు ఒక్క చలసానికే గాదు. ఎందరికో వర్తించవచ్చు. అసలు చరిత్రలో భాగంగా రూపొందిన ఒక మూర్తిమత్వాన్ని ఎన్నటికైనా సమగ్రంగా అర్థం చేసుకోగలమా? ఏవో కొన్ని ప్రత్యేకతలు, కొన్ని జీవన పార్శ్వాలు, కొన్ని విశిష్టతలు తప్ప సమగ్రంగా చిత్రించడం సాధ్యమేనా? చలసానికంటే ఇంకా విస్తారమైనా సామాజిక, ఉద్యమ, మేధో జీవితం ఉన్న వాళ్ల విషయంలో ఈ ప్రశ్న మరింత జటిలంగా మనల్ని వేధించదా? ఒక మనిషిని అర్థం చేసుకోవడంలో సాటివాళ్లకు ఈ పరిమితి ఉంటుందనుకోవడం ఎందుకైనా మంచిది. దాని వల్ల మనం నిరంతరం అప్రమత్తంగా ఉండొచ్చు. దానికదే జ్ఞానదాయకం.

చలసాని వ్యక్తిత్వం, ఆయన భాగమైన చరిత్ర అనే రెండు ముఖ్యమైన ప్రాతిపదికలపై నుంచి ఆయనను అర్థం చేసుకోడానికి బయల్దేరాలి. ఆ చరిత్రలోని పురోగామి శక్తులను ముందుగానే గుర్తించడంలో, వాటితో కలిసి నడవడంలో, నాయకుడిగా.. కార్యకర్తగా వాటికి దోహదకారి కావడంలో ఆయన చైతన్యవంతమైన ఆలోచనలు, ఆచరణ రూపాలు ఉన్నాయి. ఇవన్నీ కలిపి చూస్తేనే సీపీ కొంచెమైనా

అర్థమవుతాడు.

* * *

చలసాని ప్రసాద్ యుద్ధ కాలపు శిశువు. పుట్టి బుద్ధి ఎరగడమంటాం కదా... అది ఆయనకు కమ్యూనిస్టు రాజకీయాలతో, ముఖ్యంగా ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సంచలనాలతో మొదలైంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో, తన ఐదేళ్ల వయసులో ఒక ఊరేగింపులో పాల్గొనడం గురించి ఎన్నోసార్లు చెప్పేవాడు. తన బాల్యస్మృతి అక్కడ మొదలయ్యేది. అందుకే ఆయన స్టాలిన్ గురించి ఎంత చెప్పేవాడో.. హిట్లర్, నీషేల గురించి కూడా అంతగా చెప్పేవాడు. నిన్ను స్టాలినిస్టు అంటారు కదా? అని అభిప్రాయం అడిగితే ముసిముసిగా నవ్వేవాడు. అందులో కించిత్ గర్వం కూడా ఉందా అనిపించేది. బాలల సంఘంలో పని చేస్తున్న రోజుల్లో ఒక పిల్లవాడ్ని తిట్టినందుకు కొన్ని రోజులపాటు సస్పెండ్ చేశారని కూడా గుర్తు చేసుకునేవాడు.

అంతర్జాతీయ స్థాయిలో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వామిక పోరాటం, కోస్తా ప్రాంతంలోని జమిందారీ వ్యతిరేకపోరాటాలు అనే ప్రపంచవ్యాప్త, స్థానీయ ప్రజా సంచలనాల్లోని అంతర్జాతీయత, సామ్యవాదం, ప్రజాస్వామ్యం అనే భావనల దినుసు సీపీ వ్యక్తిత్వంలో కలగలసిపోయింది. దివి తాలూకాలోని జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాటాలనే నిర్దిష్టస్థలకాల ఆచరణ, చైతన్యం నుంచి ఫాసిజం ప్రమాదం నుంచి మానవాళిని కాపాడుకోవడం, సోవియట్ సామ్యవాద వ్యవస్థను పటిష్టపరుచుకోవడం అనే సుదూరమూ, సామీప్యమూ అయిన విశాలమైన చారిత్రక రంగ భూమిపై రూపొందిన తరానికి చలసాని ప్రతినిధి. మన దగ్గర ... చలసాని ఎప్పుడూ చెప్పే చలం, కవిరాజు, గోరాల ప్రభావం నుంచి కమ్యూనిస్టు శక్తుల వికాసం, తెలంగాణలో ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమాల పూర్వ రంగం నుంచి సాయుధ రైతాంగ పోరాటం అనే చరిత్ర రూపొందించిన తరం ఆయనది. ఈ చరిత్రలోని ప్రతి ఘట్టంలో, దశలో ఆయన ఇన్‌సైడర్.

చలసాని ముందు తరం కమ్యూనిస్టు నాయకుల్లో చాలా మంది పాత్ర తెలంగాణ సాయుధ పోరాట విరమణతో ముగిసిపోయింది. ఆ తర్వాత కూడా వర్గపోరాటం కోసం ఆరాటపడి, దానికి దోహదపడే అంశాలు ఎక్కడైనా ఉన్నాయా? అని ఎదురు చూసిన తరంలో చలసాని ఉన్నాడు. నిజానికి వ్యక్తిగా సీపీ పరిణత దశకు చేరుకొని, వర్గపోరాటంపట్ల తీవ్రమైన అభినివేశం పెంచుకున్నది తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాతే కావచ్చు. ఆ రోజుల్లో ఇలా ఆలోచించిన తన మిత్రులెందరి గురించో చలసాని చెప్పేవాడు. వాళ్లలోనూ చాలా మంది అనేక కారణాల వల్ల మధ్యలో ఎక్కడో ఆగిపోయారు. చలసాని ఇవాల్టి దండకారణ్యా పోరాటం దాకా విస్తరించాడు. అందుకే ఆయన గత కాలపు ఉజ్వల చరిత్రకు వారసుడిగానే ఎన్నడూ కనిపించలేదు. సీపీ మాట్లాడుతోంటే వర్తమానంతో సంబంధం లేని గత జ్ఞాపకాల తలపోత అనిపించదు. ఆయన చెప్పే చారిత్రక విషయాల మీద వర్తమాన ప్రయాణంలోంచి మానవజాతి భవిష్యత్ లక్ష్యమనే కాంతి దీపం వెలుగులు ప్రసరిస్తుండేవి. ఆ అర్థంలో అసలైన చరిత్ర అది.

తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత కూడా వర్గపోరాటాన్ని కాంక్షించిన తరానికి అంతర్జాతీయంగా ఎన్నో సానుకూల, ప్రతికూల సందర్భాలు ఎదురెక్కి వచ్చాయి. వాటన్నిటి నుంచి వర్గసామరస్యం, పార్లమెంటరీ విధానం కొందరు పుణికిపుచ్చుకుంటే, ప్రసాద్‌లాంటి వాళ్ల వర్గపోరాట ఆవశ్యతను ఎంచుకున్నారు. సోవియట్ యూనియన్‌లోని సోషలిస్టు నిర్మాణ క్రమం, ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా వర్గపోరాట అవగాహన పెంచిన సందర్భాలు మూడు, నాలుగు ఉన్నాయి. 1936లోనే మొదలై 1939 మార్చిలో జరిగిన సోవియట్ పార్టీ పద్దెనిమిదో కాంగ్రెస్‌లో 'సోవియట్ సమాజంలో వైషమ్యపూరిత వర్గాలు, శత్రువర్గాలు లేవు. దోపిడీ వర్గాలు నిర్మూలించబడటమే పెట్టుబడిదారీ వ్యవస్థకంటే సోవియట్ సమాజపు ప్రత్యేక లక్షణం..' అని స్టాలిన్ నివేదిక ప్రవేశపెట్టాడు. ఉత్పత్తి శక్తులను వేగంగా అభివృద్ధి చేయడం మీద ప్రభుత్వం కేంద్రీకరించింది. మావో దీన్ని సవరించాడు. సోషలిస్టు నిర్మాణ క్రమం పొడవునా వర్గాలు ఉంటాయి, వర్గపోరాటం నడుస్తుంది. నడవాలి అని సోవియట్ రాజకీయార్థిక వ్యవస్థ మీద మావో లోతైన విశ్లేషణ ఇవ్వడం, చైనా విప్లవ విజయం, సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ ముఠా శాంతియుత పరివర్తన సిద్ధాంతానికి వ్యతిరేకంగా చైనా పార్టీ గ్రేట్ డిబేట్ నడపడం, చైనాలో రివిజనిజానికి వ్యతిరేకంగా సాంస్కృతిక విప్లవం... అనే అతి ముఖ్యమైన సందర్భాలు సోషలిస్టు శిబిరంలో వర్గపోరాట ఆవశ్యకతను ప్రతిబింబించాయి. భారత దేశంలో కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటరీ మార్గంలోకి వెళ్లిపోయినా వర్గపోరాటంపట్ల గురి ఉన్న తరం ఆ తర్వాతి కాలంలో ఈ అంతర్జాతీయ సోషలిస్టు శిబిరంలో జరిగిన తీవ్ర సంఘర్షణకు ప్రభావితం అయింది. చలసాని దానికి ఎంతగా గురయ్యాడో, వర్గపోరాటంపట్ల ఎంత అనురక్తి పెంచుకున్నాడో ఇప్పుడు చాలా అద్భుతమనిపిస్తుంది.

పైన చెప్పిన నాలుగు సందర్భాల్లో కూడా ముఖ్యంగా గ్రేట్ డిబేట్‌లో, సాంస్కృతిక విప్లవంలోని రివిజనిస్టు వ్యతిరేకత ప్రసాద్ రక్తమాంసాల్లో, చైతన్యంలో వేరు చేయలేనంతగా కలిసిపోయాయి. నక్సల్బరీ శ్రీకాకుళాలను ఆ కాలంలోని మిగతా సాహిత్యకారులకంటే చాలా ముందు గుర్తించడంలోనేగాక, ఆ తర్వాత భారత విప్లవోద్యమంలో జరిగిన అనేక పరిణామాల్లో ఆయన సాయుధ వర్గ పోరాట పంథాలోనే కొనసాగడం ఆయన విశిష్టత. అది రివిజనిస్టు వ్యతిరేకత, వర్గపోరాట ఆకాంక్ష. వీటి వల్లే శ్రీకాకుళపోరాటంలో సత్యం, కైలాసాలను, చారుమజుందారును, ఆ తర్వాత కేఎస్ నాయకత్వంలోని సీవోసీని, పీపుల్స్‌వార్‌ను సమర్థించగలిగాడు. కలిసి నడవగలిగాడు. అంతేకాదు కేఎస్‌కు...తాను శ్రీశ్రీ తర్వాత ఇష్టపడే కవి శివసాగర్‌కు మధ్య రాజకీయ నిర్మాణ విభేదాలు వస్తే సత్యమూర్తిని కాదని కెఎస్ పక్షాన నిలబడ్డాడు. చివరికి సీతారామయ్యకు.. పార్టీకి మధ్య సమస్య వస్తే మిగతా నాయకత్వాన్ని సమర్థించాడు. ఈ వైఖరుల వెనుక వర్గపోరాట ఆకాంక్ష, రివిజనిస్టు వ్యతిరేకత మాత్రమే పని చేశాయి. రాజకీయాలకు అతీతంగా మానవ సంబంధాలు ఉండాలని చెప్పే చలసాని ఈ అన్ని సందర్భాల్లో (తనకు బాగా సన్నిహితమైన ఉమ్మడి పార్టీ నాయకత్వం దగ్గరి నుంచి కూడా) వ్యక్తులతో తనకున్న మానవ సంబంధాలను పక్కనపెట్టి రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఇందులో ఆయన రవ్వంత తటపటాయింపుకు గురి కాలేదు. ఎవరు, ఏ నిర్మాణం వర్గపోరాటం చేసే అవకాశం ఉందో గుర్తించడంలో ఆది నుంచీ ఆయన పరిణతి పొందిన మార్క్సిస్టుగా వ్యవహరించాడు. బహిరంగంగా సాయుధ వర్గపోరాట పక్షాన నిలబడుతూ వచ్చాడు. నక్సల్బరీ లాంటి మార్గం కోసం ఎదురు చూస్తూ వచ్చిన ఆయన తరంలో చాలా మంది మార్క్సిస్టు లెనినిస్టు నిర్మాణంలో, ఉద్యమంలో ఎదురైన వాంఛనీయ, అవాంఛనయ పరిణామాలకు తట్టుకోలేక, అర్థం చేసుకోలేక మధ్యలో ఎక్కడో ఆగిపోయారు. చలసాని దండకారణ్యా

విప్లవోద్యమం దాకా మునుముందుకే సాగడానికి నక్సల్బరీ నాటికే ప్రపంచ విప్లవ శిబిరంలో వర్గపోరాటం కేంద్రంగా జరిగిన సంఘర్షణను జీర్ణం చేసుకోవడమే ప్రధాన కారణం.

పార్టీ హెడ్ క్వార్టర్‌లోనే ప్రతీఘాతుక శక్తులు తిష్ట వేశాక తిరిగి కార్మిక వర్గం మరోసారి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవాల్సిన ప్రత్యేక పరిస్థితి చైనాలో వచ్చింది. దాని కోసం మావో సాంస్కృతిక విప్లవానికి పిలుపు ఇచ్చాడు. సోషలిస్టు పరివర్తనా క్రమంలో ఉన్న సమాజంలో, ప్రభుత్వంలో, పార్టీలో సహితం ఉన్న పెట్టుబడిదారీ శక్తులను తుదముట్టించి కార్మికవర్గం అధికారం చేజిక్కించుకోడానికి జరిగిన రెండో రాజకీయ విప్లవం అది. అంటే సీరియస్ వర్గపోరాటం.

ఫాసిస్టు వ్యతిరేక పోరాట కాలంలో పుట్టిన ప్రసాద్ గ్రేట్ డిబేట్‌లోని వర్గపోరాటంతో ఎంత ప్రభావితమయ్యాడో, చైనా సాంస్కృతిక విప్లవంతో అంతకంటే ఎక్కువ ప్రభావితమయ్యాడు. ఆ కాలమంతా చలసాని ప్రత్యేకంగా తెలుగు సాహిత్యరంగంలో తానుగా వర్గపోరాట సన్నాహానికి ఎంత చేశాడో అదే ఒక చరిత్ర. బైట జరుగుతున్న పరిణామాలకు చలసాని ఊరక ఆలోచనాపరంగా ప్రభావితం కావడమే కాదు. తాను ఉన్న సాహిత్యరంగాన్ని వర్గపోరాటానికి సిద్ధం చేయడానికి ఆయన పడిన తపన, చేసిన కృషి ఆ కాలంలో ఆయన రచన కంటే విశిష్టమైనది. చారిత్రాత్మకమైనది. చలసాని అనగానే కార్యకర్త అనిపించడానికి అప్పటి నుంచే ఆయన కార్యకర్తృత్వం కారణం. అందులోనూ నక్సల్బరీకి ముందు చేసిన ప్రయత్నం ఒకలాంటిదైతే ఆ తర్వాత మరింత స్పష్టమైన దృక్పథంతో పని చేశాడు. ఆ విషయంలో ఆయనకు ఎంత మమేకత ఉందంటే శ్రీశ్రీ ఇటువైపు రాకపోయి ఉన్నా విరసం ఏర్పడేదని ఓసారి అన్నాడు. 'అయితే గురువుగారు రావాలని కేవీఎస్‌తో సహా అందరం అనుకున్నాం. ఆయన వరల్డ్ జీనియస్ బాబూ.. చరిత్ర ఎలా నడవబోతోందో ప్రజల వైపు నుంచి ఇట్టే పట్టేయగలడు. అందుకే ఒక ఉద్యమ కెరటమే నన్ను లాక్కెళిపోయిందని అన్నాడు...' అని చెప్పేవాడు.

ఈ చరిత్రలో నేరుగా ప్రసాద్‌కు వ్యక్తిగత భాగస్వామ్యం ఉంటే, అలాంటి సంబంధం లేని అంతక ముందటి ప్రపంచవ్యాప్త కార్మికవర్గ ఉద్యమాల సామ్యవాద భావజాల ప్రపంచం ఆయనకు చారిత్రక నేపథ్యంగా పనిచేసింది. 1830-40ల కల్లోల కార్మికవర్గ తిరుగుబాట్లు, విప్లవాలు, 1847 కమ్యూనిస్టు లీగ్, 1848లో కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటన, పారిస్ కమ్యూన్, మొదటి ప్రపంచయుద్ధం, బోల్షివిక్ విప్లవం మొదలైనవి విడుదల చేసిన భావజాలం ప్రపంచ మానవాళిని సోషలిస్టు ఆలోచనల వైపు, సామ్యవాద లక్ష్యంతో ఉద్యమాల వైపు నడిపించింది. ఒక రకంగా చెప్పాలంటే ప్రపంచ మానవ చరిత్రలో ఆధునిక యుగారంభం, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మిక వర్గ ఉద్యమాలు, మార్క్సిజం రూపొందడం... అనే స్థూల చరిత్రలోని ఆదర్శాలు, విలువలు, ఆ కాలంలోని కళలు సాహిత్యం, రచయితలు.. మేధావులు పోషించిన పాత్ర మొదలైనవన్నీ కలిసి విడుదల చేసిన భావజాల ప్రభావం వల్ల కూడా చలసాని వ్యక్తిత్వం రూపొందింది. సోషలిజంలోనే మానవత వెల్లివిరుస్తుందనే భావన సహజంగానే ఆ తరం కమ్యూనిస్టుల్లో ప్రగాఢంగా ఉండింది. మానవతను, సోషలిజాన్ని అభేదంగా చూడటం వల్ల చలసాని వ్యక్తిగా, కమ్యూనిస్టుగా కూడా ఆయన అరుదైన ఉదాహరణ అయ్యాడు. దాన్నుంచే ఆయనకు వ్యక్తిగతం, సమాజికం మధ్య తేడా లేకుండాపోయింది. ఉన్నా చాలా చాలా తక్కువ. ఆ స్థాయిలో ఆయన వ్యక్తిత్వంలో అంతరాలకు, తేడాలకు చోటు లేకుండాపోయింది.

* * *

చలసాని ప్రసాద్ తొలి రోజుల నుంచి పార్టీ కామ్రేడ్‌గా సాహిత్య రంగంలో పని చేశాడు. తాను అరసంలో ఎప్పుడూ నిర్మాణపరంగా సభ్యుణ్ని కాదని, బాలల సంఘంలో, ప్రజానాట్యమండలిలో తన సోదరితో కలిసి పని చేస్తూ విద్యార్థిగా స్టూడెంట్ ఫెడరేషన్లో ఉండేవాడినని చెప్పేవాడు. కమ్యూనిస్టుగా సాహిత్యాన్ని అమితంగా ప్రేమించడం వల్ల చదివేవాడినని, తాను ఎదిగి వచ్చే నాటికల్లా అరసం క్రియాశీల పాత్ర ముగిసిపోయిందని అనేవాడు. అయితే కేవీఆర్ మాటల్లో అరసానికి కాయకల్ప చికిత్స చేయడానికి జరిగిన ప్రయత్నాల్లో మాత్రం చలసాని ఉన్నాడు. తాను సభ్యుడు కాకపోయినా దాన్ని బాగు చేసే పనిలో పాలుపంచుకోవడం... అభ్యుదయ సాహిత్యం పట్ల ఆయనకున్న ప్రేమ, నిర్మాణాలపట్ల గురి తెలియజేస్తుంది.

అప్పటి నుంచి చివరి దాకా చలసాని సాహిత్య వ్యక్తిత్వంలో రచనతోపాటు రచయితల నిర్మాణాలు, సాహిత్య సాంస్కృతికోద్యమాలు విడదీయరాని భాగమయ్యాయి. అందువల్ల చాలా మందిలాగా సాహిత్యకారుడిగా చలసాని ఏమిటి? అనే ప్రశ్నకు ఆయన రచన నుంచి మాత్రమే సమాధానం వెతుక్కోవడం, అంచనా వేయడం కుదరకపోవచ్చు. విడివిడిగా రచయితలను, రచనలను ఎంతగా ఇష్టపడిగా ఆయన దృష్టిలో సాహిత్యమంటే సాహిత్యోద్యమమే: ఉద్యమప్రాయంగా సాహిత్య రచన సాగడమంటే అది నిర్మాణయుతంగా ఉండటమే. ఈ స్పృహ ఆయనకు పార్టీ నిర్మాణ పద్ధతుల నుంచే వంటబట్టింది. నక్సల్బరీలో తాను ఎదురు చూస్తున్న వర్గపోరాటాన్ని పసిగట్టి దాని పక్షాన రచయితలు నిలబడటం, రచన చేయడం వంటి వాటికి ఒక నిర్మాణం ఉండాల్సిందే అనే నిశ్చయానికి వచ్చాడు. విప్లవోద్యమం పక్షాన రచయితల ఉండటం అంటే విడి విడిగా సంఘీభావం ప్రకటించడం, రచన చేయడం అని కాకుండా అది సాహిత్యోద్యమంగా ఉండాల్సిందే అనే స్పష్టమైన వైఖరితో పని చేశాడు.

ఈ మాటలో ఆయన సాహిత్యకార్యకర్త, లేదా సాహిత్యోమ నాయకుడు అనే నొక్కు ఎక్కువ ఉండొచ్చు. జీవితమంతా ఈ పాత్ర పోషించినందు వల్లనే చలసాని విలక్షణ సాహిత్యకారుడయ్యాడు. రచయితగా, సంపాదకుడిగా తన సమకాలికుల్లో ఎవరిలోనూ లేని వైవిధ్యమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నాడు. ఆ మాటకొస్తే సమకాలికుల్లోనే కాదు.. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలోనే కమ్యూనిస్టు, విప్లవోద్యమాల్లో పుట్టిపెరిగి, నిర్మాణాల్లో, సాహితోద్యమాల్లో రాటుదేలి, వాటికి నాయకత్వం, కార్యకర్తృత్వం వహించి విలువైన రచనలు చేసిన ఆయనలాంటి మూర్తిమత్వం ఇప్పటికీ అరుదైనదే. మార్క్సిస్టు సిద్ధాంతం, రాజకీయాలు, చరిత్ర, సంస్కృతి అనే వాటిలో తీవ్ర అభినివేశం ఉండి, దెబ్బై ఏళ్లుగా అన్ని దశల్లోనూ 'తీవ్రవాద' ప్రజా ఆచరణలో భాగమై ఆ చారిత్రక వారసత్వాన్ని మోసుకుంటూ రచనారంగంలో నిలబడ్డ వాళ్లలో నిస్సందేహంగా ఆయనలాంటి వ్యక్తి ఆయనే.

కాబట్టి రచయితగా చలసాని ఏమిటి? అనే ప్రశ్నకు కేవలం ఆయన రాసిన అక్షరాల్లోనే సమాధానం ఎలా దొరకదో, ఆయన సాహితోద్యమ కార్యకర్త, లేదా నాయకుడని కుదించినా సమగ్రం కాజాలదు. సాహిత్యానికే పరిమితమైనా ప్రసాద్ రాయకుండా చెప్పినవే ఎక్కువ. సాహిత్యాన్ని ఆయన ఉద్యమం అనుకోవడం వల్ల రాయడానికంటే చెప్పడం ఆయన దృష్టిలో చిన్న పనేం కాదు. ఆ రూపానికీ అంతే

ప్రాధాన్యత ఇచ్చాడు. ఏదైనా విషయం మీద కూర్చొని అలా సాహిత్య సిద్ధాంతం, విమర్శ, సాహిత్య చరిత్ర వంటి వాటిపై మాట్లాడుతోంటే.. 'ఇవన్నీ రాయవచ్చు కదా?' అని అడిగితే ఆయన దానికి సమాధానం ఇవ్వకుండా ఆ సంగతులు గతంలోనే ఏ మీటింగ్‌లో మాట్లాడిందీ, ఏ వర్క్‌షాపులో పాఠం చెప్పిందీ గుర్తు చేసేవాడు. 'ఇవన్నీ చెప్పాను' అనేవాడు. అట్లని రాత ప్రాధాన్యత తెలియని వాడు కాదుగదా. రాయడం, మాట్లాడటం అనే ప్రక్రియలను సమాదరించినవాడు ఆయన. ఇది ఆయన దృక్కోణంలో, జీవన సాంస్కృతిక వ్యక్తిత్వంలో భాగం. అందువల్ల కూడా రాయనిదే చాలా ఎక్కువ.

అయినా మన ముందున్న రచనల నుంచే సాహిత్యకారుడిగా చలసాని కృషిని అంచనా వేయవచ్చు. కవిత్వం, సాహిత్య-సామాజిక వ్యాసాలు, చర్చా వ్యాసాలు, ముందుమాటలు, సంకలనకర్తల మాటలు, వ్యక్తుల జ్ఞాపకాలు, అనువాదాలు ఆయన రచనల్లో ఉన్నాయి. సాహిత్య వ్యాసాల్లో సాహిత్య చరిత్రకు అవసరమైన విలువైన సమాచారం ఎంతో ఉంటుంది. అంతేకాదు చరిత్ర రచనా పద్ధతికి ఉండాల్సిన అప్రోచ్‌ను కూడా ప్రసాద్ అందించాడు. వాస్తవానికి కెవిఆర్ చరిత్ర వైపు నుంచి, త్రిపురనేని మధుసూదనరావు తత్వశాస్త్రం వైపు నుంచి ఈ ప్రయత్నం చేశారు. ప్రసాద్ ఆధునిక యుగంలోని ప్రజాపోరాటాల నేపథ్యంలో సాహిత్యంలోని పురోగమనం, తిరోగమనం చర్చించారు. తెలుగు సమాజాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలకు అంతర్జాతీయ నేపథ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకొని సాహిత్యంలో వచ్చిన ధోరణులను పరిశీలించారు. ఈ రెంటికీ తెలుగునాట పెరిస్త్రోయికా, సాహిత్యంలో తిరోగమనం-పురోగమనం అనే రెండు వ్యాసాలు చాలా విలువైనవి. అరసం పతన దశ మొదలైనప్పటి నుంచి నక్సల్బరీ దాకా సాగిన సామాజిక చరిత్ర వెలుగు నీడల్లోంచి సాహిత్యాన్ని విశ్లేషించాడు. సామాజిక, ఉద్యమ పరిణామాలు సాహిత్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలిపాడు. చాలా విలువైన సమాచారంతోపాటు చరిత్ర రచనకు అవసరమైన అప్రోచ్ బాగా కనిపిస్తుంది. శ్రీకాకుళ పోరాటం-సాహిత్యం, విరసం చరిత్ర, కొండగాలి, జరుగుబాటు-తిరుగుబాటు, కొండల్లోంచి గుండెల్లోంచి, తూర్పు పవనం వీచెనోయ్.. తూర్పు దిక్కెర్రపెక్కనోయ్, గిరిజన గుండెచప్పుడే శ్రీకాకుళ ఉద్యమం, సామాజిక మార్పు - నక్సలైట్ ఉద్యమం, 'సుప్రభాతం' నేల విడిచిన సాము, తెలుగు కవిత్వం ఆగిపోలేదు.. సాగిపోతోంది, సమాజంలో సాహిత్యం, వక్రీకరణల సమన్వయం, విప్లవ సాహిత్యం-ఎదురవుతున్న ప్రశ్నలు .. లాంటి పెద్ద, చిన్న వ్యాసాలను ఒకసారి మరోసారి చూడండి. చలసాని సాహిత్య విమర్శకు, తెలుగు సాహిత్య చరిత్ర రచనకు ఎంత వెలుగు నింపిదీ తెలుస్తుంది. ఈ వ్యాసాలు ప్రధానంగా 1970ల నుంచి ఇప్పటి దాకా తెలుగు సమాజ, విప్లవోద్యమ పరిణామాల నేపథ్యంలో విప్లవ సాహిత్యాన్ని... మొత్తంగా తెలుగు సాహిత్యాన్ని ఒక చరిత్ర క్రమంలో అంచనా వేస్తాయి. అట్లాగే అభిప్రాయాలు, అంచనాలు ఏవైనా సరే వాస్తవాలను వాస్తవంగా చూడాలి.. అని ప్రసాద్ తరచూ అనేవాడు. ఆ రకంగా పైన చెప్పిన కాలానికి సంబంధించిన తేదీలు, పేర్లు, ఘటనలు, వాటి తర్వాత తిరిగిన మూల మలుపులు ఎన్నో ప్రోది చేశాడు. వాటిని వాటి నిజ చరిత్రలో భాగంగా గుర్తించి సారం ఏమిటో చెప్పాడు.

అలాగే విప్లవ సాహిత్యం-ఎదురవుతున్న ప్రశ్నలు అనే వ్యాసం ప్రసాద్ లోతైన అధ్యయనాన్ని తెలియజేస్తుంది. విరసం పాఠశాలలో చేసిన ప్రసంగానికి సంక్షిప్త రూపమే అయినా గత ఇరవై ఏళ్లలో తెలుగు సాహిత్యంలోని కొత్త గాలులను ఒక సామాజిక తాత్విక నేపథ్యంలో విరసం ఎలా పరిశీలిస్తున్నదీ ఒక అవగాహనను ఇచ్చాడు. 1971లోనే జానపద కవిత్వం అనే వ్యాసంలో చలసాని కొన్ని అద్భుత సూత్రీకరణలు చేశాడు. అభ్యుదయ సాహిత్యోద్యమం తర్వాత కూడా ఇంకా వెంటాడుతున్న మార్గ పద్ధతిని పూర్తిగా తుత్తినియలు చేశాడు. నన్నయ ఆదికవి పీఠాన్ని దళిత, తెలంగాణ సాహిత్య ధోరణుల నేపథ్యంలో ప్రశ్నించారు. వాస్తవానికి దిగంబర కవిత్వమే ఆ పని చేసింది. ఆ తర్వాత విప్లవ సాహిత్యోద్యమానికి మార్గదర్శకం చేస్తూ ప్రసాద్ నన్నయ పీఠాన్ని ప్రశ్నించడమేగాక దేశీ సంప్రదాయంలోని పాల్కురి సోమనాథుడి గురించి మాట్లాడాడు. అక్కడితో ఆగక సమస్త వృత్తుల సమస్త చిహ్నాల శ్రమ జీవుల కళా సాహిత్యాలే ప్రత్యామ్నాయ మార్గమని, వాటిని పుణికి పుచ్చుకోవాలని గట్టిగా విశ్లేషించాడు. పలు ప్రాంతాల మాండలిక భాషా సంపద ఎంత విలువైందో చెప్పాడు. ప్రజానాట్యమండలి బాగ బతికిన కాలంతో సంబంధం ఉన్నందున ఈ అవగాహన ప్రసాద్‌కు ఉండటం చాలా సహజం. స్వతహాగా గాయకుడు కావడం వల్ల దేశీ, జానపద, ప్రజా సంప్రదాయాల గురించి పలవరించాడు. 1979 మార్చిలో రాసిన వ్యాసం కథ-నవల-జీవితం అనే వ్యాసం దగ్గరి నుంచి పనిపిల్ల కథపై జరిగిన చర్చా వ్యాసాల సంకలనానికి రాసిన ముందుమాట దాకా కల్పనా సాహిత్యంపై చలసాని రాసిన వ్యాసాలు చాలా విలువైనవి. అందులోనూ కథ నవల జీవితం వ్యాసం ఎంత పాతదైనా ఇప్పుడు కథలు రాస్తున్న వాళ్లకు, కథా విమర్శ చేస్తున్న వాళ్లకూ బాగా ఉపయోగపడుతుంది. ప్రసాద్‌కు కవిత్వం బాగా ఇష్టం. కానీ ఆయన గురుత్రయంలో ఇద్దరు కథా, నవలా రచయితలు కావడం వల్ల వాళ్ల వ్యక్తిత్వాలను, రచనా పద్ధతులను దగ్గరగా గమనించడం వల్ల ప్రసాద్‌కు వచన రచనను ఎలా చదవాలో, ఎలా విశ్లేషించాలో బాగా తెలుసు. అసలు కథ, నవల ప్రక్రియలు రూపొందే తీరు, వాటిలో జీవితం, సాహిత్యం వ్యక్తమయ్యే తీరు లోతుగా పట్టించుకుంటాడు. నిజానికి కొకు, రావిశాస్త్రి కథలు, నవలల గురించి రాసిందానికంటే విరసం వర్క్‌షాపుల్లో, సమావేశాల్లో చెప్పిందే చాలా చాలా ఎక్కువ.

పనిపిల్ల కథ ఎంత చర్చనీయాంశమైందో అందరికీ తెలుసు. దీని మీద చలసాని రాస్తూ చిన్న కథ స్వభావానికి సంబంధించిన శిల్ప ప్రత్యేకతల గురించి కూడా చెప్పాడు. అసలు అంత్యంత సంఘర్షణాయుతమైన స్థలకాలాల్లోని వస్తువు కథల్లోకి ఎలా వచ్చేదీ మనకు అనేక ఆలోచనలు స్ఫురించేలా కొన్ని ప్రస్తావనలు చేశాడు. ఈ వ్యాసం చలసాని విమర్శ పద్ధతికి మంచి ఉదాహరణ. ఓపెన్ ఎండెడ్ ఆలోచనలు చేసి మనకు ఒక అంచనా స్ఫురించేలా రాసేస్తారు. అదే విశ్వనాథ తరహా రచయితల మీద ఎంత కరాఖండిగా ఉంటారో త్రిపురనేని వ్యాసాల సంకనానికి రాసిన ముందు మాట తిరుగులేని ఉదాహరణ. ఇక శ్రీశ్రీ, కొకు సాహిత్య సర్వస్వ సంపుటాలకు రాసిన ముందుమాటలు, ఫుట్‌నోట్స్ చలసాని విస్తృత అధ్యయనాన్నేగాక సాహిత్యాన్ని సమజమనే మొత్తంలో భాగంగా ఎలా చూడాల్సిందీ ఉద్బోధిస్తుంది. అలాగే సాహిత్య చరిత్రకు అవసరమైన సరంజామా ఆయన ఆ సంపుటాలకు రాసిన ఫుట్‌నోట్స్‌లో, ముందుమాటల్లో ఉంది. సాహిత్యం సమాజంలో భాగమే అయినా అది కళా సంబంధమైనదనే ఎరుక చలసానికి పుష్కలంగా ఉంది. అసలు చలసాని సాహిత్యంతో దాని సామాజిక తలంలో, కళా తలంలో ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తాడు. సాహిత్యాన్ని తనవితీరా అనుభవిస్తాడు, ఆనందిస్తాడు.

దాని సామాజికతను నిష్కర్ష చేస్తాడు.

ఈ పరిశీలనా పద్ధతి వల్లే చలసానికి విశాలమైన సాహిత్య ప్రపంచం సొంతమైంది. వర్గపోరాటమే చోదకశక్తి అని, అది సాహిత్య కళారంగాల్లో కూడా ఉంటుందనే అపారమైన స్పష్టత, విశ్వాసం ఉన్న చలసాని సాహిత్యాన్ని విశాలమైన చారిత్రక ప్రపంచంలో భాగంగా చూస్తాడు. మానవ జీవితావిష్కరణగా చూస్తాడు. పాఠకుడిగా, విమర్శకుడిగా, కమ్యూనిస్టుగా, ఆది నుంచి పార్టీ మనిషిగా చలసాని సాహిత్యంతో వ్యవహరించే తీరులో ఒక ప్రత్యేక అవగాహన ఉందని చెప్పవచ్చు. ఆయన సాన్నిత్యం నుంచి, రచనాధారాల నుంచి కూడా చాలా మందికి ఈ సంగతి తెలిసిందే. అదేమంటే హిట్లర్ ఫాసిజాన్ని ఎదురొడ్డిన స్టాలిన్ ఆయన హృదయంలోని బాల్య చిత్తరువు. అది ఎంత ఉద్వేగపూరితంగా, వర్గపోరాట కాంక్షగా చలసానిలో వ్యక్తమవుతుందో చెప్పలేం. యాంటీ స్టాలినిస్టులు చివరికి యాంటీ కమ్యూనిస్టులుగా ఎలా మారిపోయారో టకటక డజన్లకొద్దీ పేర్లు చెప్పేస్తాడు. అదే సమయంలో స్టాలిన్ ఏ ఏ చారిత్రక, సామాజిక ప్రత్యేక పరిస్థితుల్లో సోషలిస్టు నిర్మాణ ప్రయత్నం చేసిందీ చలసానికి ఓ స్పష్టత ఉండేది. ఇదంతా ఎందుకంటే స్టాలిన్ 'వీరారాధకుడి'గా పేరు మోసిన చలసానికి ఆయన చేసిన ఓ సాహిత్య సూత్రీకరణపట్ల అపారమైన గురి. 'కవులు, కళాకారులు మానవ హృదయ నిర్మాతలు అని స్టాలిన్ చెప్పాడు' అని చలసాని ఎన్నిసార్లు కోట్ చేసేవాడో. సమాజ పరివర్తనలో సాహిత్యం కళల పాత్రను చలసాని ఇలాగే అర్థం చేసుకున్నాడు. సాహిత్యంలో వర్గపోరాటం జరగాలని, ఉద్యమప్రాయంగా సాహిత్య రచన జరగాలని, సాహిత్యాన్ని సాహిత్యోద్యమంగా, నిర్మాణయుతంగా సాగాలని ఆకాంక్షించినా, ఆ పనుల్లో పాలుపంచుకున్నా... వీటన్నిటి లోతుల్లోకి వెళితే స్టాలిన్ చేసిన సూత్రీకరణతో ఆయనకు పూర్తి మమేకత ఉన్నది. ఆయన సాహిత్యాన్ని అలాగే చదివాడు, విశ్లేషించాడు. ఇంకోపక్క తరచూ కోట్ చేసే సాహిత్యం సమాజ హృదయం అనే గోర్కీ వాక్యం కూడా ఉంది. సాహిత్యం సమాజ హృదయం ఎలా అవుతుందో వివరిస్తూ గోర్కీ సాహిత్య వ్యాసాలను చాలా సులభశైలిలో, గాఢంగా, క్లుప్తంగా పరిచయం చూశాడు. చలసాని సాహిత్య విమర్శ, చరిత్ర రచనా సంబంధమైన వ్యాసాలకు గోర్కీ వ్యాసాల్లోని భావజాలం నేపథ్యంగా పని చేసి ఉండొచ్చు.

అభ్యుదయ సాహిత్య సంప్రదాయం నుంచి వచ్చిన చలసాని ఒక పొలిటికల్ రప్చర్‌లో రాటుదేలినందు వల్ల 1980ల నుంచి వచ్చిన స్త్రీవాద, దళితవాద, ముస్లిం మైనారిటీ, తెలంగాణ తదితర సాహిత్యాలను పైన చెప్పిన మానవ హృదయ నిర్మాణమనే అవగాహన ఉన్నందున స్వాగతించాడు. వాటిలోని ప్రత్యేకతలను, విశిష్టతలను ఇష్టపడ్డాడు. అంతేకాదు.. సాహిత్యంలోని ఏ కొత్త జీవన వ్యక్తీకరణనైనా ఇష్టపడేలా ఆయన నిరంతరం ఎక్స్‌టెండ్ అవుతూ వచ్చాడు. కొత్త సవాళ్లను, కొత్త ప్రశ్నలను ఓపెన్‌మైండ్‌తో స్వాగతించడం, సొంతం చేసుకోవడం వల్ల ఆయన విశాలమవుతూ వచ్చాడు. మిత్ర శిబిరం నుంచి ఎలాంటి కంఠస్వరంతో వచ్చే ప్రశ్నలైనా ముందు సానుకూలంగా స్వీకరించి నిష్కర్ష చేయడం ఆయనలోని పార్టీ ఒరవడి. కమ్యూనిస్టు ఉద్యమంలోని ప్రతి దశలో రాడికల్‌గా ఉంటూ వచ్చిందు వల్ల చలనంలో ఉండటం ఆయనకు సహజ స్వభావం. మారుతున్న సమాజాన్ని, ప్రపంచ పరిస్థితులను, కొత్త భావజాల సంఘర్షణలను ఆకళింపు చేసుకోగల దినుసు ఆయనలో పుష్కలంగా ఉండటం, దానికి తగినట్లు ప్రపంచస్థాయిలోని సాహిత్యం, సిద్ధాంతాల అధ్యయనం ఎప్పటికప్పుడు ఉండటం వల్ల ఆయన ఎక్కడా ఒక్క సందర్భంలో కూడా తడబడలేదు. నిలబడలేదు. ఆయనకు తెలుగు సమాజాల్లోని వివిధ ఆలోచనాపరుల బృందాలతో, సాహిత్య బృందాలతో సాన్నిత్యం, వాళ్లందరికీ కావాల్సిన వాడవ్వడం దీని వల్లే సాధ్యమైంది. రాడికల్‌గా, సంయమనంగా, సమన్వయంగా ఉండటం ఆయన ఆలోచనా రీతిలో భాగం. అలాగే ప్రతి అవగాహనను విస్తరింపజేయడం కూడా ప్రసాద్‌కు అలవాటు. అది ఒక సమాచారంతో కావచ్చు, నేపథ్యాన్ని సమకూర్చడంతో కావచ్చు, భిన్నంగా ఇంకా ఎలా చూడవచ్చో ఒక ఆధారం, లేదా అనుభవం ముందు పెట్టడంతో కావచ్చు..లేదా ఒక అపోహను, తప్పుడు ఉటంకింపును, వక్రీకరణను సవరించడంతో కావచ్చు...వాదనలోకి సున్నితంగా ప్రవేశించి తనదైన చేర్పును అందించేవాడు. ఆ పని రాత రూపంలో చేశాడు. అంత కంటే కూడా వివిధ బృందాల మధ్య సంభాషణల్లో సాగించాడు. విశ్వనాథ సాహిత్య సభలకు వెళ్లి, ఆయన పద్య రచనలను కాదు.. వచన రచనలను పట్టించుకోండని, విశ్వనాథ ప్రతిభ వాటిలో ఉందని చెప్పిరాగలడు. 'ఒకసారి ఆ గొడవ మనకెందుకండీ' అని అంటే.. 'భలేవాడివే.. విశ్వనాథ ఎంత రియాక్షనరీ అనేది మనం చెప్పాలంటే ఆయన వచన రచనల మీదే చర్చ జరగాలి'..అనేవాడు.

చలసాని గానశైలి వలె వాక్య శైలి విభిన్నమైనది. ఒక చోట చలం ఆత్మాశ్రయంగా రాస్తాడని, కొకు పరిశీలనతో నిర్లిప్తంగా రాస్తాడని చెబుతూ ఈ రెండూ రావిశాస్త్రిలో, ఆళ్వారుస్వామిలో, ఉప్పల లక్ష్మణరావులో ఉంటాయనే పరిశీలన చేశాడు. అట్లా చలసాని ప్రసాద్ వాక్యం ప్రత్యేకమైనది. గాఢమైన పరిశీలనలతో, అక్కడక్కడా కవితాత్మకంగా, ఉద్రేకశైలి కనిపించినా సాదాగా, సరళంగా, మంచి తెలుగు వాక్యం రాస్తాడు. ఒక్కోసారి ఆయన ఒక రచన గురించో, రచయితల గురించో .. వస్తు, దృక్పథాల సంగతి కూడా పట్టించుకోకుండా మంచి వచనం ఉందని ప్రశంసించేవాడు. వాక్యం బాగా లేకపోతే తీవ్ర అసహనానికి గురయ్యేవాడు. ఓసారి వ్యాస ప్రక్రియ మీద జరిగిన విరసం వర్క్‌షాపులో మంచి వాక్యం ఎలా రాయాలో గొప్పగా వివరించాడు.

అయితే చలసాని వాక్యంలో ఒక ఇబ్బంది కూడా ఉందని నా అభిప్రాయం. ఏదైనా సంక్లిష్టంగా, జటిలంగా రాస్తే అందులో ఏముందో వెతుక్కోవాల్సి వస్తుంది. అట్లాగే సంక్లిష్టమైన భావనను, పొరలు పొరలుగా అర్థం చేసుకోవాల్సిన అంశాలను సరళ వాక్యంలో చెప్పడం కోసం సాపు చేస్తే దాని గాఢత, తీవ్రత, లోతు అందకుండా పోతుంది. అసలు పాయింట్ ఏదో అందడం లేదని వెతుక్కోవాల్సి వస్తుంది. విషయంలోని సంక్లిష్టత దెబ్బతినకుండా తేలిగ్గా, సరళంగా చెప్పడానికి ఉదాహరణ అనుకునే కుటుంబరావు వాక్యంలో కూడా ఈ సమస్య ఉంది. వాక్య రచనలో, వ్యక్తీకరణలో జటిలం, సంక్లిష్టం ఎలా సమస్యో సరళత కూడా అంతే సమస్య అవుతుంది. చలసాని రచనలు చదువుతోంటే ఆయన ఏ గాఢమైన విషయం చెప్పదల్చుకున్నాడో తెలుసుకోడానికి వాక్యాల వెనక్కి తొంగిచూడాల్సి వస్తుంది. అట్లాగే కుప్తత కూడా చలసాని ప్రత్యేకత. ఇప్పటి దాకా ప్రస్తావించిన వ్యాసాల్లో ఆయన పాటించిన కుప్తత వల్ల వాటికి విస్తారమైన వివరణ అవసరం అవుతుంది. ముఖ్యంగా కొత్త వాళ్లకు ఆయన ఏ చారిత్రక, ఉద్యమ, భావజాల సంబంధమైన విషయాలను చెప్పదల్చుకున్నాడో వ్యాఖ్యాత కావాలి. క్లుప్తత కొత్త పాఠకులకు, ముఖ్యంగా దినపత్రికల పాఠకులకు బాగా ఉంటుందనిపిస్తుందిగాని అదే అలాంటి

వాళ్లకు ఎన్నో ఖాళీలను మిగుల్చుతుంది.

చలసాని ప్రసంగంలో కూడా ఈ లక్షణం ఉంటుంది. చాలా గాఢంగా, హేతుబద్ధమైన వాదన ద్వారా శ్రోతలను ప్రభావితం చేయాల్సిన చోట క్లాసిక్స్‌లోంచి ఒక కొటేషన్ లేదా శ్రీశ్రీ కవితా పాదం ఉటంకించి ముందుకు వెళ్లిపోతాడు. వాదనలో నిరూపణ చాలా ముఖ్యం. ప్రసాద్ చాలా సార్లు వాదనకు అవసరమైన సామాగ్రి, అప్రోచ్ ఇచ్చి వదిలేస్తాడు. నిరూపణ లేకపోవడం, ఉద్వేగం అనేవి జనరంజకత్వంలోని ముఖ్య లక్షణాలు. నిరూపణ తక్కువగా ఉండే ప్రసాద్ ప్రసంగశైలిలో జనరంజకత్వం లేకపోవడం ఆయనకు ఎంతో మేలు చేసింది.

* * *

ప్రసాద్ విరసం ఏర్పాటు వెనుక పని చేయడమేగాక, ఆ తర్వాత కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సంస్థకు అనితర సాధ్యమైన సేవలు అందించాడు. మొదటి నుంచీ నిర్మాణ, రాజకీయ, నిర్బంధ సమస్యలు, సంక్షోభాలు ఎప్పుడు వచ్చినా సంస్థ ఆయన దిక్కే చూసేది. ఇదంతా తొంభైల దాకా స్థూలంగా ఒక రకమైన చరిత్ర. కానీ 2000 నుంచి సంస్థలో కొత్త తరం నాయకత్వంలోకి వచ్చాక, తాను కార్యవర్గం నుంచి తప్పుకున్నాక, రాజకీయ ఉద్యమపరంగా, నిర్బంధంపరంగా విప్లవ సాహిత్యోద్యమం పూర్తి కొత్త పరిస్థితుల్లోకి వచ్చాక ఎన్నో ఇబ్బందులు, సంక్షోభాలు ఎదురయ్యాయి. వాటిని పరిష్కరించడానికి, ఆదుకోడానికి చలసాని వేయి చేతులతో అండగా నిలబడ్డాడు. కొత్త నాయకత్వం చొరవ, ఆలోచనాశక్తి, నిర్ణాయకత ఏ మాత్రం దెబ్బ తినకుండా ఆయన ఆ పనుల్లో పాలుపంచుకునేవాడు. విరసం ఎదుర్కొన్న నిర్బంధమేకాదు, ప్రజలు, ప్రజాసంఘాలు దారుణ నిర్బంధం, హత్యలు, బెదిరింపులు ఎదుర్కొన్న కాలంలో, నిరంతరం కొందరి మెడ మీద కత్తులు వేలాడుతున్న కాలంలో, విరసం నిషేధ కాలంలో, వరుస అరెస్టుల పరంపరలో, సభ్యులు ఊళ్లలో, జిల్లా కేంద్రాల్లో ఉండటం ప్రాణాపాయంగా మారిన దుర్దినాల్లో.. మధ్య మధ్యలో చిన్న సడలింపు మినహా దశాబ్దంపైగా నిప్పులు చెరిగిన ఆ రోజుల్లో చలసాని సంస్థను ఎలా కాపాడాడో, ఎందరి మనసుల్లోకి దూరి ధైర్య వచనమై నిలబెట్టాడో, వ్యక్తుల సొంత అవసరాల దగ్గరి నుంచి కేసులు, కోర్టుల అవసరాలు తీర్చాడో ఎప్పుడైనా ప్రత్యేకంగా నమోదు చేయకపోతే చరిత్ర చేతికి అందకుండాపోయినట్లే. ఆ కాలంలో కార్యదర్శిగా నేను ఎన్ని పనులు పురమాయించినా వాటి అవసరం గుర్తించి అలా చేసుకపోయావాడు అంతే. విరసం చరిత్రలోనేగాక, మొత్తంగా విప్లవోద్యమ చరిత్రలో కూడా అవి దారుణమైన రోజులవి. రోట్లో తలపెట్టాక రోకటి పోటుకు వెరిస్తే ఎలా అని బైటి రచయితలు కొందరు వెక్కిరించిన రోజులు. ఒక ఆశయం కోసం, విశ్వాసం కోసం అలా నిలబడటం అందరూ ఇష్టపడకపోవచ్చు... వాటి కోసం రచయితలు పడే యాతనతో సంబంధం లేకుండా సాహిత్యం గురించి, నిర్మాణ లోటుపాట్ల గురించి మాట్లాడే సంస్కృతి అప్పుడే పెచ్చరిల్లిపోయింది. ఆ గడ్డు కాలంలో మనుషుల కలయిక కోసం, సాహిత్యం మీద శ్రద్ధ పెట్టడం కోసం వివిధ సాహిత్య ప్రక్రియల్లో వర్క్‌షాపులు, అధ్యయన తరగతులు విరివిగా జరిగాయి. ఇతర పనుల్లో సుడిపడ తిరుగుతూనే చలసాని ప్రసాద్ ఈ సమావేశాలు ఎక్కడ జరిగినా విధిగా హాజరయ్యేవాడు. తన అపార అధ్యయనానుభవాన్ని, విశ్లేషణలను పంచుకొనేవాడు. సంస్థలో సాహిత్య వాతావరణం సజీవంగా నిలబెట్టేందుకు కృషి చేసేవాడు. కొత్త తరం సభ్యుల రచనాశక్తి ఇనుమడించడానికి దోహదపడేవాడు.

తన ప్రతిష్ట వల్ల, వయసు వల్ల ఆయననేమీ చెయ్యరని మా విశ్వాసమేమోగాని, అత్యంత ప్రమాదకరమైన పనుల్లోకి ఆయనను తోసేసేవాళ్లం. ఆయన ఒక క్షణం కూడా తన గురించి ఆలోచించకుండా నాయకత్వం చెప్పింది చేసుకపోవడమే తన పని ఉన్నట్లుండేవాడు. ఆయన అపార అధ్యయనం, విస్తృత జీవితం, అనుభవ సంపద, పెద్దరికం ముందు నేనెపాటి? లెక్కలోకి తీసుకోనవసరం లేదు. కానీ ఆయన కమ్యూనిస్టుపార్టీతో పేగుబంధం పెనవేసుకొని పుట్టి జీవితాంతం ఆ బంధాన్ని కొనసాగించినవాడు. నిర్మాణ క్రమశిక్షణతో తప్ప ఇంకోలా రాజకీయ ఉద్యమ జీవితంలో వ్యవహరించవచ్చని ఆయనకు బహుశా తెలియనే తెలియదేమో. పని చేయాల్సిన సమయంలో కార్యదర్శి చెప్పిన మాట స్వీకరించడం ఆయన నైజం. అదీ నిర్బంధ సమయాల్లో ఇక తిరుగులేని ఆచరణవాదిగా వ్యవహరించేవాడు. ఒంగోలు, వరంగల్ నిర్బంధాలు, విరసం నిషేధం, కోబ్రాల బెదిరింపులు... ఒక్కటనేమిటి చలసాని ప్రసాద్ మహా మేరువులా నిలబడి కార్యకర్తలను ఆదుకున్నాడు.

ఆయన క్రమశిక్షణ ఎలాంటిదంటే... పరిస్థితులు తెరిపిచ్చాక మాత్రమే తన అభిప్రాయాలు చర్చించేవాడు. రోజువారి పనుల్లో కూడా ఏదైనా పని చెబితే, బాబూ నిర్ణయం అయిందా, కావాలా? అని అడిగేవాడు. నిర్ణయం అయితే తన అభిప్రాయాలు పని అయ్యాక వీలైతే చెప్పేవాడు. ఇంకా నిర్ణయం కాకపోతే విలువైన సూచనలు, సలహాలు ఇచ్చేవాడు. ఆపద్ధర్మంగా మీటింగ్‌లకు వెళ్లడం, అప్పటికప్పుడు ప్రయాణాలకు సిద్ధం కావడం, మాట సాయంతో పనులు సానుకూలం చేయడం... ఇవన్నీ చేస్తూనే కొత్త నాయకత్వం, సభ్యుల అవగాహన, ధైర్యం, చొరవకు ఏ ఇబ్బందీ కలగకుండా ఆయనకు తనదైన పని పద్ధతి ఉండేది. ఆ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండేవాడు. సంస్థ బాధ్యుల వయసు, జ్ఞానం, అనుభవాల హెచ్చుతగ్గుల గురించి ఆలోచించేవాడే కాదు. విరసం సభ్యుల విషయంలోనేకాదు.. ప్రజా సంఘాల సభ్యులు, నాయకుల విషయంలో కూడా ఆయన విధానం ఇదే. మనుషులందరితోనూ ఆయన స్నేహశైలి ఇదే.

ఆయన అరుదైన కమ్యూనిస్టు, ఆలోచనాపరుడు, ఆచరణశీలి, అపార అధ్యయనపరుడు, రచయిత, నాయకుడు, కార్యకర్త, గాయకుడు, అనువాదకుడు, విప్లవోద్యమ వ్యాఖ్యాత. ఇవన్నీ కలిసిన మానవుడు.

ఒక సంస్థ చారిత్రక అవసరం గుర్తించి పూర్వ రంగంలో కీలకంగా పని చేసి, చివరంటా దానితో కలిసి నడిచి, దాని కోసమే జీవితాన్నంతా వెచ్చించి, దాని ప్రాసంగికతను నిరంతర పునర్నిర్వచనం చేస్తూ విస్తరించిన ఒక కాగడాలాంటి నిత్య జాజ్వల్యమానమైన నాయకుడు, మార్గదర్శి చరిత్రలో ఏ సంస్థకైనా ఉన్నారా? ఏమో నాకు సరిగా తెలియదు. అయితే ఒక్కటి మాత్రం నిజం. 20వ శతాబ్దంలో విప్లవ విజయాన్ని సాధించిన నిర్మాణాల్లో మనకు అలాంటి నాయకులు కనిపిస్తారు. పూర్తి ప్రత్యేక పరిస్థితుల్లో, అనేక ఆటుపోట్ల మధ్య, దెబ్బతిని దెబ్బకాచుకుంటూ సుదీర్ఘ ప్రయాణంలో ముందుకు సాగుతున్న మన దేశ విప్లవోద్యమంలో, విప్లవ సాహిత్యోద్యమంలో చలసాని ప్రసాద్‌ను మాత్రమే అలాంటి సంఘ నిర్మాతగా, క్రాంతిదర్శిగా, నాయకుడిగా, విలక్షణ సాహిత్యకారుడిగా చూస్తాం. ఆయన జీవించి, రచించి, గానం చేసి, మానవ సంబంధాలు నెరిపిన కాలంలో, ఆయనలాంటి కలనే కని, దాన్ని నిజం చేసేందుకు ఆయనతో కలిసి నడిచే అరుదైన అవకాశం మనకు చరిత్ర కల్పించింది.

☆

ఒక గుండెతడి మనిషి

పి.మోహన్

'మీ రాయలసీమ వాళ్లు మీరూ, గారూ అని పిలవరు కదా. మరి నువ్వేమిటోయ్ నన్ను మీరూ, గీరూ అంటావు? చక్కగా మీ కడపోళ్ల మాదిరి నువ్వు అనో, లేకపోతే అందర్లా సీపీ అనో ఏకవచనంలో పిలవబ్బాయ్!'

చలసాని ప్రసాద్ పదేళ్ల కిందట వాళ్లింట్లో నాతో అన్నమాటలివి. అప్పటికి ఆయన వయసు 73, నా వయసు 26. చలసాని స్నేహం, ప్రేమానురాగాలు ఎంత కమ్మనివో ఈ ఒక్క ఉదాహరణ చాలనకుంటా. అలాంటి చలసాని శాశ్వతంగా దూరం కావడం తెలుగు సాహిత్య ప్రేమికులకు, వ్యవస్థలో మార్పు కోరేవాళ్లకు తీరని లోటు. అదృష్టంపై నాకు నమ్మకం లేదు కాని, ఆయన ప్రేమానురాగాలు పంచుకున్న వాళ్లంత అదృష్టవంతులు ఈ లోకంలో ఉండరు. ఆ అదృష్టం నాకు కాసింతే దక్కింది.

కాలేజీ రోజుల్లో శ్రీశ్రీ సాహిత్య సర్వస్వ సంపుటాలపై చలసాని, కృష్ణాబాయిల పేర్లు చూసి వాళ్లను కలవాలని ఆరాటపడేవాడిని. వాళ్లు విరసం సభల్లో పరిచయమైన కొత్తలో నాకు మామూలుగానే తొలుత వయోవృద్ధుల్లా కనిపించారు. అందుకే గౌరవంతోనే కాకుండా కాస్త భయంతోనూ ఉండేవాడిని. తర్వాత అర్థమైందేమంటే వాళ్లు కల్మశం లేని చిన్నపిల్లలని, మా తరానికంటే ఆధునికులనీ. అప్పట్లో కృష్ణక్కకు రాసే ఉత్తరాల్లో కృష్ణాబాయి గారూ అని రాసేవాడిని. ఆమె 'నాపేరు 'కృష్ణాబాయి గారూ' కాదు కృష్ణాబాయి మాత్రమే. అలాగే రాయి' అని రాసింది. చలసానికి కూడా ఉత్తరాలు రాసేవాడిని కానీ చాలా తక్కువ. ఆయన ఉత్తరాలు బ్రహ్మరాతలో ఉండేవి. అందుకే అవసరమైతే ఫోన్లో మాట్లాడేవాడిని.

2004లో పుస్తకాల పనిపై విజయవాడ వెళ్లినప్పుడు ఆయన కూడా అక్కడికి వచ్చాడు. ఎవరిదో స్కూటర్ పై వాళ్లింటికీ వీళ్లింటికీ తిప్పాడు. 2006లో విరసంపై నిషేధం ఎత్తేశాక విజయవాడలో సర్వసభ్య సమావేశం జరిగింది. నిర్బంధపు పచ్చి గాయాలు, హాస్టల్ తిండి తెచ్చిన అల్సర్‌తో వెళ్లాను. సమావేశం తర్వాత మిత్రుల సలహాపై చికిత్స కోసం విశాఖ వెళ్లాను. చలసాని ఇంట్లో వారం రోజులున్నాను. చలసాని నన్ను స్కూటర్ పై మూడు, నాలుగు రోజులు వరుసగా కేజీహెచ్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్లకు, తెలిసినవాళ్లకు ఫోన్లు చేశాడు. ఆస్పత్రిలో వార్డువార్డూ తిప్పి ఎండోస్కోపీ, రక్తపరీక్షలు వగైరా చేయించాడు. ఓ పక్క పరీక్షలు.. మరోపక్క వెయింటింగ్ బల్లపై కూచుని ఏవోవో ఎర్ర పాటలు పాడుతూ ఆయన. మధ్యలో మందులు తీసుకొస్తూ, మా వాణ్ని జాగ్రత్తగా చూడాలని డాక్టర్లతో చెప్పిందే చెబుతూ. నాకు కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. ఆయన నాకు పెద్ద రచయితలా, నాయకుడిలా కాకుండా మనసెరిగి మసలుకునే బాల్యమిత్రుడిలా కనిపించాడు. అప్పట్లో నేను కావాలని దూరం చేసుకున్న నాన్న, అన్నయ్యలు ఆయన రూపెత్తినట్లు అనిపించింది.

చలసాని ఇంట్లో ఉన్నవారం రోజులూ ఆయన తెచ్చిపెట్టే టిఫిన్లు, ఇంటి భోజనంతోపాటు ఆయనింట్లోని పుస్తకాలతో విందుభోజనం చేశాను. ఇల్లంతా ఎక్కడ చూసినా పుస్తకాలే. మేడ అయితే లైబ్రరీనే. వేలాది ఇంగ్లిష్, తెలుగు పుస్తకాలు. ఆర్ట్ అంటే పిచ్చి కనుక ఆ పుస్తకాల కోసం అరలన్నీ గాలించి 15 ఆర్ట్ పుస్తకాలు, 10 చరిత్ర, రాజకీయాల పుస్తకాలు ఏరుకున్నాను. ఒక అరలో కొక్కోకం వంటి పుస్తకాలు కనిపించాయి. 'ఇవేంటి, ఇక్కడా?' అని ఆశ్చర్యంగా అడిగితే, 'ఏం, వాటిలో జ్ఞానం లేదా?' అంటూ నవ్వాడాయన. ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చాక మేడపైకెళ్లి లైబ్రరీని గాలించేవాడిని. నేను అక్కడ ఉన్నప్పుడు చలసాని అక్కగారు వచ్చారు. ఆమెతో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ముచ్చట్లు చెప్పించుకోవడం మరో ముచ్చట.

తిండిలో, బట్టల్లో చలసాని నిరాడంబరత గురించి అప్పటికే కొంత విన్న నేను ఆ వారం రోజులూ ప్రత్యక్షంగా చూశాను. రచయితలంటే మడత నలగని ఖద్దరు బట్టలు వేసుకునేవాళ్లని అనంతపురంలో ఓ వెటకారం ఉండేది. ఇప్పుడూ ఉందేమో. ఇస్త్రీ చేయని బట్టల చలసానిని చూస్తూ ఉంటే ఆ రచయితలు కళ్లముందు కదిలేవారు. వస్త్రధారణ వ్యక్తిగతం కావొచ్చు కానీ, వ్యక్తిగతానికి, రాజకీయాలకు అణువంత తేడా చూపని చలసాని నిబద్ధత గురించి చెప్పడానికే ఈ పోలిక.

ఆస్పత్రిలో చూపించుకున్న తర్వాత తిరిగి అనంతపురం బయల్దేరాను. దాదాపు 30 పుస్తకాలను కర్రల సంచిలో సర్దుకున్నాను. పుస్తకాల విషయంలో చలసాని గట్టి లెక్కల మనిషి. 'పుస్తకాలతో పనైపోయాక తిరిగి పంపిస్తేనే తీసుకెళ్లు. ముందు ఆ పుస్తకాల పేర్లు, రచయితల పేర్లు ఓ కాగితంలో రాసివ్వు' అని అడిగాడు. సరేనని రాసిచ్చాను. మందులు కొనిచ్చి, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి, చేతిలో ఐదొందలు డబ్బు పెట్టాడు. తర్వాత స్కూటర్ పై ఎక్కించుకుని రైల్వే స్టేషన్కు తీసుకెళ్లి, తనే టికెట్ కొని, రైల్లో కూర్చోబెట్టాడు. రైలు కదులుతుండగా టాటా చెప్పాడు. నేనూ టాటా చెప్పాను. ఆయన ఫ్లాట్ ఫామ్ పై కనుమరుగు అవుతూ ఉంటే అప్పటి వరకు ఉగ్గబట్టుకున్న కన్నీళ్లు మౌనంగా గట్లు తెంచుకున్నాయి.

తర్వాత ఆయనను హైదరాబాద్ సభల్లో చూశాను కానీ మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం లేకపోయింది. తన పుస్తకాలు తనకివ్వలేదని అలిగాడు కూడా. అలక తీర్చడానికి ఆ పుస్తకాలను సీతమ్మధార ఇంటి అడ్రసు పంపించాను. నేను గతంలో ఇస్తానని చెప్పిన నా సినిమా ఎన్సైక్లోపిడియా పుస్తకాలను ఇవ్వలేదని చాలాసార్లు నిష్ఠూరమాడాడు. సెట్టి లక్ష్మీనరసింహం 'రవివర్మ చిత్రమాలికలు' పుస్తకం జిరాక్సు కాపీని ఆయనకు గత ఏడాది పంపించాను. దాన్ని పునర్ముద్రిస్తే ఎలా ఉంటుందని, మీరు టీకా టిప్పణీ రాస్తారా అని అడిగాను. ముందు పుస్తకం చూద్దామని, సెట్టి వారసులు విశాఖలో ఉన్నారని, వారి సాయం తీసుకుందామని అన్నాడు. నెలకిందట ఆ పుస్తకం గురించే ఆయన కృష్ణక్కతో మాట్లాడాడట. కృష్ణక్క ఫోన్ చేసి.. 'నువ్వు చలసానితో ఏదో పుస్తకం గురించి చెప్పావుట. ఏంటా పుస్తకం? తనకు గుర్తుకురావడం లేదు' అని చెప్పింది.

ప్రేమానురాగాలకు కొనసాగింపు ఇవ్వని పరమయాంత్రికతలో కొట్టుకుపోవడం వల్ల చలసానితో కలిసి తిరిగే భాగ్యం దక్కలేదు. కృష్ణక్క పుస్తకావిష్కరణ సభలో ఆయనను చివరిసారిగా చూసి, నా 'డావిన్సీ' పుస్తకం ఇచ్చాను. జాగ్రత్తగా సంచిలో వేసుకున్నాడు, భిక్ష అందుకునే బౌద్ధసన్యాసిలా.

బతుకు తెరువు సుడిలో కొట్టుపోతూ ఆయనను కడసారి చూసుకునే భాగ్యానికి కూడా నోచుకోలేకపోయాను. వీలైతే ఇప్పుడే ఆయన మరీమరీ కోరిన సినిమా ఎన్సైక్లోపిడియా పుస్తకాలను విశాఖ తీసుకెళ్లి ఆయన చెంత ఉంచాలనిపిస్తోంది. దేని విలువైనా అది ఉన్నప్పటికంటే లేనప్పుడే బాగా తెలుస్తుంది. చలసాని కూడా అంతే. ఆయన విలువేమిటో విరసానికి, తెలుగు సాహిత్యలోకానికి, సమాజానికి ఇకపై మరింత బాగా తెలుస్తుంది. చలసాని పేరుప్రతిష్ఠల కోసం పాకులాడలేదు. శ్రీశ్రీ, కొ.కు. సాహిత్యసర్వస్వాల కోసం తన రచనావ్యాసంగాన్ని త్యాగం చేసి, విరసం, ప్రజాపోరాటాల కోసం తన జీవితాన్ని కొవ్వొత్తిగా కరిగించుకున్నాడు. ఆ పని చేస్తే నాకేంటి లాభం? అని ఆలోచించే వర్తమానంలో చలసాని లాంటి వ్యక్తులు అరుదు. చలసాని విరసం నాయకుడు, కార్యకర్త, దాహం తీరని సాహిత్యపిపాసి. ఇంకా ఏమిటేమిటో కావచ్చు. కానీ తొలుత ఆయన సాటిమనిషిని ప్రేమగా దగ్గరికి తీసుకునే గుండెతడి మనిషి. ఇప్పుడు ఆయన లేరు. కానీ ఆయన నన్ను వెంటేసుకుని తిరిగిన కేజీహెచ్ ఆస్పత్రి జ్ఞాపకాలు మాత్రం నిత్యనూతనంగా ఉన్నాయి.

ప్రసాద్‌గారు ఇక పల్కరించరు!

నిఖిలేశ్వర్

కొందరి వ్యక్తుల వ్యవహారశైలీ, సానుకూల దృక్పథం, పట్టుదల వల్ల మన జీవిత కాలంలో మరచిపోలేము. అలాంటి వ్యక్తుల్లో అరుదైన వారు కామ్రేడ్ చలసాని ప్రసాద్.

1968లో ఆయనతో పరిచయం మొదటిసారి, విశాఖపట్నంలో మా దిగంబర కవుల మూడో సంపుటి ఆవిష్కరణ సందర్భంగా అని గుర్తు. ఆ తర్వాత 1970లో విశాఖలో సంచలనం సృష్టించిన శ్రీశ్రీ షష్టిపూర్తి ఉత్సవాలతో మా గాఢానుబంధం మొదలైంది.

హైద్రాబాద్‌లో 1970 జూన్‌లో విరసంకు బీజారోపణ జరిగినపుడు శ్రీశ్రీ, రావిశాస్త్రి, కెవిఆర్ లాంటి సీనియర్లను సమీకరించిన వారిలో చలసాని ప్రసాద్ ప్రముఖ పాత్ర వహించారు. ఆయనతో పాటు విరసం సంస్థాపక సభ్యుల్లో నలుగురు దిగంబర కవులు కూడా ఉన్నారు.

ఆ తర్వాత 1970-75 మధ్య చోటు చేసుకున్న విరసం చారిత్రక పరిణామ దశల్లో - నేను, మిత్రులు జ్వాలాముఖి, చెరబండరాజు విశాఖ వెళ్లినపుడల్లా కృష్ణాబాయి - ప్రొ.వేణుగోపాలరావు - ప్రసాద్ ఇంట్లో, మాకు స్నేహపూర్వకమైన ఆతిథ్యం లభించింది.

కమ్యూనిస్టు కుటుంబం వారసత్వంగా వచ్చిన ప్రసాద్‌గారికి అంతటా మిత్రులే - విభేదించినా ఆయా వ్యక్తులతో ఆయన స్నేహ సంబంధాలు కొనసాగేవి. 1975లో మేము అనంతపూర్ విరసం మహాసభల్లో రాజీనామా చేసిన తర్వాత సంస్థాపరంగా - సాహిత్య రాజకీయాల పరంగా మాకు కొన్ని చేదు అనుభవాలున్నా - నాకు జ్ఞాపకమున్నంతవరకు ప్రసాద్‌గారు మాతో ఎప్పుడూ పరుషంగా మాట్లాడలేదు.

ఆయన నిరంతర అధ్యయనశీలి. మార్క్సిస్టు మేధావిగా నూతన పరిణామాలను ఆకళింపు చేసుకున్నా, చారుమజుందార్ రాజకీయ పంథా పట్ల ఆయనకు ఎందువల్లనో విశ్వాసం సడలలేదు.

శ్రీశ్రీ పట్ల ఆయనకున్న ఆరాధనాభావం అందరికి తెలిసిన విషయమే! కొ.కు., శ్రీశ్రీ, త్రిపురనేని గోపిచంద్ సంపుటాలకు సంపాదకత్వం వహించి, సవివరంగా ఎంతో సమాచారయుక్తంగా నోట్స్ ఇవ్వడం ఆయనకే చెల్లింది.

స్వయంగా ఒక సాహిత్య పిపాసిగా, గ్రంథాలను సేకరిస్తూ కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో ఉపన్యాసాలు ఇస్తూ క్రియాశీలంగా ఉన్న వ్యక్తి. పౌరహక్కుల ఉద్యమంలో తమవంతు పాత్ర నిర్వహించారు. రెండు మూడు సందర్భాలలో ప్రసాద్‌గారి ఉపన్యాసాలు విన్నప్పుడు, ఆయనలోని విశ్లేషణాశక్తి, అన్వయం ఆశ్చర్యపరిచాయి. అయితే గత ఐదారు సంవత్సరాల కాలంలో ప్రసాద్‌గారి రచనల్లో, అభిప్రాయాల్లో కొంత గందరగోళం చోటుచేసుకుంది.

వ్యక్తిగతంగా ఆయన, ఎవరు మంచి రచన చేసినా ఆహ్వానించే వారు. నాలుగు నెలల క్రితమే, నా కొత్త కవితా సంపుటి 'కాలాన్ని అధిగమించి' వెలువడిందని తెలుసుకొని, ప్రత్యేకించి రెండు సార్లు ఫోను చేసి ఆ సంపుటిని పంపించమన్నారు. ఎప్పుడు ఫోను చేసినా మా శ్రీమతి యామినిని ఆప్యాయంగా పల్కరించి, బాగోగులు అడిగేవారు. మానవ సంబంధాల పట్ల ఆయనకు ఎంతో నమ్మకం.

ఇక గతంలో విప్లవ రాజకీయాల గురించి జ్వాలాముఖి తీవ్రంగా విభేదిస్తూ విమర్శించినా, ప్రసాద్‌గారు నవ్వుతూనే నచ్చజెబుతూ తమ అభిప్రాయాన్ని వెల్లడించేవారు.

ప్రజా సాహిత్య - సాంస్కృతిక రంగంలో వచ్చిన పరిణామాలతో పాటు, నూతన తరాల వెంబడి నడిచిన ప్రసాద్ గారు ఒక సార్థక జీవి. ఏదో సందర్భంలో ఏదో ఒక పుస్తకం గురించి లేదా ఏదో ఒక వివరణ కావాలని అడిగే ప్రసాద్‌గారు ఇక పల్కరించరు.

నువ్వులేవు, నీ అవసరం ఉంది

పి. రామకృష్ణ

ఒక్కో మరణం గురించి తెలిసినప్పుడు, మనకు విషాదం కంటే ముందు ఆశ్చర్యం కలుగుతుంది. ఆశ్చర్యం తర్వాతనే క్రమక్రమంగా విషాదం ఆవరిస్తుంది. ఎటువంటి మనిషి అయినా మరణించక తప్పదని మనకందరికీ తెలుసు. మరి ఆశ్చర్యం ఎందుకు కలిగినట్టు? ఆ మరణించిన మనిషి ఎప్పటికీ బతికి ఉంటాడనుకుంటూ, బతికే ఉండాలని మనకు తెలీకుండానే కోరుకుంటూ ఉండిపోయామని, ఆ ఆశ్చర్యానికి అర్థం. చలసాని మరణం అటువంటిది, జీవితం అటువంటిది.

మనకు తెలీకుండానే ఉండిపోయిన ఆ కోర్కె ఆ మనిషి మరణించాక ఏమవుతుంది? అది కూడా మరణిస్తుందా? నిజం చెప్పవలసి వస్తే, ఎవరితోనైనా స్నేహం చేయగలిగిన చలసాని ప్రసాద్ 'కమిట్‌మెంట్'ను కొందరం కొంచెం సందేహంతో చూసాం. మోతాదు మించిన ఆయన 'మూఢభక్తి'ని చూసి, నవ్వుకున్నాం. మొత్తం మీద చలసాని ప్రసాద్ అన్నమాటను తల్చుకున్నా, విన్నా మన ముఖంలో ఒక చిరునవ్వు విరిసేది. ఆ నవ్వులో ఆయన మీద ప్రేమ ఉన్నా, 'అమాయకుడు' అన్న భావమూ ఉండేదనిపిస్తుంది.

ఇప్పుడు ఆలోచిస్తూ ఉంటే, ఆయన అమాయకుడా, ఆయన్ని అలా అనుకున్న వాళ్లు అమాయకులా అనిపిస్తోంది. ప్రజల కోసం పనిచేసే ఉద్యమాలు వేటికవి వేరుపడి బలహీనమైపోయి, ఆ ఉద్యమాలకు భావజాల బలాన్నివ్వవలసిన సాహిత్యోద్యమాలూ సన్నగిల్లి, ఏదీ ప్రజామోదం పొందలేని దశలో ఉన్నప్పుడు, కనీసం ఉదార భావాలు కూడా కనిపించని పరిస్థితిని చూస్తున్నప్పుడు, ఉద్యమంలో మనిషినీ, మనిషిలో ఉద్యమాన్నీ చూడవలసిన అవసరం ఉందా, లేదా? అనివార్యంగా ఉంది. అందుకే, చలసాని ప్రసాద్‌లు ఉండాలి. ఉన్నప్పటి కంటే లేనప్పటి అవసరం ఇంకా ఎక్కువ ఉండటం అంటే ఇదే.

అందరికీ బాబాయ్ ఓ విజ్ఞాన గని

స్వాతి వారపత్రిక

వెళ్ళిపోయినవాళ్ళని గుర్తుపెట్టుకోవడం ఒక వేడుక కాదు ఒక యాగం, ఒక సుదీర్ఘ యుద్ధాన్ని కొనసాగించడం అన్నారు ఓ కవి!

ఎనిమిది దశాబ్దాల్లో ఎనలేని కోణాల్లో పోరాటాల్లో, సాహిత్యంలో, సాయంలో ఎటు చూసినా తానే అన్నట్లు సాహితీ లోకంతో అల్లుకుపోయిన అందరి 'బాబాయ్' చలసాని ప్రసాద్ భౌతికంగా లేరు. కాని, ఆయన ఆరంభించిన, సుదీర్ఘ యుద్ధానికి ముగింపు లేదు.

సాహితీప్రియులకు చలసాని అందించిన అక్షర కానుకలకు గతం లేదు, ఉండదు. ఎక్కడ ఉద్యమం జరిగినా, పేదలకు, కార్మికులకు కష్టాలు ఎదురైనా వారి వెన్నంటి పోరాటంలో చేయి అందించిన చలసాని స్ఫూర్తి ఎందరికో ఊపిరిగా నిరంతర శ్వాస తీసుకుంటూనే ఉంటుంది. ఆయన జననమే కమ్యూనిస్టుల ఇంట జరిగింది.

1932లో కృష్ణాజిల్లా భట్ల పెనుమర్రులో బసవయ్య, వెంకట నరసమ్మ గార్లకు జన్మించిన చలసాని ప్రసాద్ అసలు ఊరు నాదేళ్ళవారి పాలెం. ఉగ్గుపాలతోనే వామపక్ష భావాల్ని ఒంట పట్టించుకున్నారు.

ఈ క్రమంలోనే అన్నయ్య, బాబాయి, బావలు అమరులవగా, ఆయన ఉద్యమాల్లో మరింత ముందుకెళ్ళారు.

చిన్నతనం నుంచి శ్రీశ్రీ అంటే ప్రాణం. భూకంపం వచ్చినప్పుడు అందరూ ప్రాణాలరచేతపట్టి పరుగులు పెడితే, ఆయన శ్రీశ్రీ పటాన్ని పట్టుకుని పరిగెట్టారంటే ఎంతిష్టమో అర్థమౌతుంది.

చలసాని వారి స్ఫూర్తి విప్లవ రచయితల సంఘం పుట్టుకకు కారణమయింది.

పి.జి. చేసిన ఆయన ప్రభుత్వ ఉద్యోగాలు చేశారు. సినిమా రంగంలో పనిచేశారు. ఆయన పెంచిన పుస్తకాల తోట ఇంటిని 'సాహితీ నిలయం' చేసింది.

ఇంట్లోని గదులన్నింటినీ గ్రంథాలయంగా మార్చేసి ఒక్కో గదికి శ్రీశ్రీ, కొడవటిగంటి, రావిశాస్త్రిల పేర్లు పెట్టిన సాహితీవేత్త. పుస్తక ప్రియులతో, రిఫరెన్సుల కోసం వచ్చిపోయే విద్యార్థులతో ఇల్లంతా ఎప్పుడూ పుస్తకాల పండుగే!

ముప్పయ్ వేలకు పైగా పుస్తకాలున్న ఈ ప్రపంచాన్ని ఈ మధ్యనే కంప్యూటరీకరణ చేయడం మొదలుపెట్టారు.

గత నాలుగున్నర దశాబ్దాల్లో ఆయన చెయ్యి విశ్రమించనే లేదు. నిరంతరం అక్షరాల్ని పరుగులు పెట్టించింది. శ్రీశ్రీ సమగ్రసాహిత్యం ఇరవై సంపుటాలు, కొడవటిగంటి కుటుంబరావుకు సంబంధించి పద్దెనిమిది సంపుటాల్ని ఏకబిగిగా ఓ చేతిపై ప్రచురించారు.

విశాఖలో ఏ సాహితీ సమావేశం జరిగినా పాల్గొనాల్సిందే, మంచి వక్త. పోరాట యోధుడు, స్నేహశీలి. ఆయన ప్రేమకు, స్నేహానికి కులం, వయస్సు ప్రాంతం వంటి భేదాలు లేవు.

మరణం పేరిట ఆ చెయ్యి విశ్రమించినా, ఆ గొంతు మూగబోయినా ఆయనకు గత చరిత్ర లేదు - అంతా వర్తమానమే. ఆయన నిక్షిప్తం చేసిన పుస్తకాల గని, అనంతసాగరం, నిరంతర వాహిని. ఆ సాగరం గలగలల్లో ఆయన గొంతు వినిపిస్తూనే ఉంటుంది. ఆయనిచ్చిన స్ఫూర్తి తాలూకు శ్వాస ఆయన సన్నిహితులకు, సాహితీ ప్రియులకు, తెలిసిన వారందరికీ వెచ్చగా తగులుతూనే ఉంటుంది.

ఆ జ్ఞాపకాల అరల్లో, ఆ పుస్తకాల్లో చలసాని ప్రసాద్ సజీవుడు, కలం పరుగు ఆగినా చెదిరిపోని అక్షర సంపదను ప్రపంచానికి అందించిన విజ్ఞానగని. 14.08.2015

అగ్నిజ్వాల మన 'చలసాని'

షేక్ అహ్మద్ వలీ

నిత్య వర్తమాన నిరంతర చలనశీలీ
నిన్నెన్నడూ మర్చిపోలేము మా చలసానీ
అయిదేళ్ళ చిరుప్రాయంలో అరుణపతాక ఎగరేసావు
అంతిమ శ్వాసవరకూ ఒక అగ్ని జ్వాలగా వెలిగేవు
జనం హృదయంలో సజీవమై నిలిచావు
అనునిత్యం సమాజ జాగృతినే కాంక్షించావు
ప్రజాశ్రేయస్సు పోరులో అలుపెరుగని యోధునిలా
జన పోరాటాలలో బిగించిన పిడికిలివయ్యావు
బడుగు, బలహీన వర్గాల ఉద్యమ నినాదం నువ్వు
ఆశయాల, ఆవేశాల ఆచరణ శీలివి నీవు
విప్లవ భావాలు రగిలిస్తు విరసం కిరీటానివయ్యావు
అణగారిన వర్గాల అభ్యున్నతి పోరుకు సారధి నీవు
మావోయిస్టు విప్లవోద్యమం వరకు వారధి నువ్వు
ప్రజా సంఘాలకు కొండంత అండగా నిలిచావు
ప్రపంచ సామాజిక మార్పులపై నీది నిరంతర చింతన
సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణపై నీకెంతో అవగాహన
ఓ నడిచే ఎన్సైక్లోపీడియా అంతులేని నీ జ్ఞానం
నల్లేరు మీద బండి నడకలా సాగే నీ ప్రసంగ ప్రవాహం
పసివాని బోసినవ్వును తలపించే నీ దరహాసం
అందర్నీ మనసుతో ప్రేమించిన
అజాత శత్రువువు నీవు
నిన్నెవరమూ మరువలేము...
నీ ఆశయాల
బాటలోనే నడుస్తాం...
అందుకో మా
విప్లవ నివాళులు
అందుకోవయ్యా!

గ్రీన్‌క్లైమేట్, ఆగస్టు 2015

చలసాని ప్రసాద్ జ్ఞాపకాలు కొన్ని...

సజ్జా వెంకటేశ్వరు

మూడు పదులు పైబడిన కలిపి ప్రయాణం మాది. శ్రీశ్రీ, కొకుల సాహిత్య సర్వస్వమే మా ప్రపంచంగా పరుచుకున్న అనుబంధం మాది. ఆటుపైన త్రిపురనేని గోపి చంద్ గారి సాహిత్య సర్వస్వం పూర్తి చేయడంలోను సహకారం. ఇంకా చలసాని ఉండివుంటే, తుమ్మల వారి సర్వస్వం కూడ వుంది.

సరిగ్గా తేది గుర్తు లేదు. 80వ దశకం. ఒక ఎండకాలం. చీరాల మునిసిపల్ హైస్కూల్. 'మార్క్సిస్టు తత్వశాస్త్రం' అనే అంశం పై విరసం ప్రకాశం యూనిట్ క్లాసులు నిర్వహించింది. అప్పటికి నా వయస్సు 17 ఏళ్ళు వుండవచ్చు. స్కూలు చదువులు మధ్యలోనే వదిలేసి మగ్గం గుంటకు చేరిన తొలి రోజులు అవి. అప్పటికే ఏవో కొన్ని రచనలు చేయడం, శ్రీశ్రీ మహాప్రస్థానం చదవడం మూలంగా కవిత్వం పట్ల, కవుల పట్ల విపరీతమైన ఆకర్షణ వుండేది. మా ఇంటి దగ్గరలో అరుణోదయం అనే కవి వుండేవారు. ఆయనే ప్రకాశం జిల్లా తొలి విరసం సభ్యులు. ఆ తర్వాత రుద్రజ్వాల మిగతావారు అంతాను. రుద్రజ్వాల, అరుణోదయం పరిచయాలు వుండడం వల్ల వారు నిర్వహించిన క్లాసులకు హాజరు అయ్యాను. అక్కడ చాలా మంది వున్నారు.అందులో నేను ఒక్కణ్ణి. మార్క్సిస్టు తత్వ శాస్త్రం మాకు బోధించినవారు చలసాని ప్రసాద్ గారు. అదే మా మొదటి కలయిక. ఆయన పాఠం చెప్పిన తీరు చాల ప్రభావితం చేసింది. క్లాసు రూము నుండి చలసాని గారు బయటకు రాగానే, తెలుగులో దొరికే తత్వ శాస్త్రానికి సంబంధించిన ఒక లిస్టు ఆయన చెప్పగా రాసుకున్నాను. అప్పటికి నేను విరసం లో చేరలేదు. ఆయన ఉపాధ్యాయుడు, నేను విద్యార్థిని.

మరికొద్ది రోజులకు పర్చూరులో మళ్ళీ క్లాసులు కనకయ్య మాస్టారు గారి స్కూల్లో. చలసాని ఉత్తరం వచ్చింది పర్చూరు రమ్మని. మళ్ళీ అక్కడ కలుసుకున్నాం. నా రచనలు కొన్ని చూపించాను. అవి చూసి సూచనలు-సలహాలు. మరి అలాగే, కవిత్వానికి సంబంధించిన పుస్తకాల లిస్టు ఇచ్చారు. ఆ తరువాత 1982 విరసం ప్రకాశం యూనిట్‌లోకి వచ్చాను. 1984 మాకివలస విరసం రాష్ట్ర మహాసభలకు హాజరయ్యాను. సర్వసభ్య సమావేశంలో నా సభ్యత్వం ఖరారు అయింది. అక్కడ చలసాని గారికి నేను శ్రీశ్రీ రచనల నా నోట్స్ అందజేశాను. దాదాపు అన్నీ కే.వి.ఆర్ గారు కూర్చిన 6 సంపూటలకు బయటఉండినవే అవి. వాటిని కళ్ళకద్దుకున్నారు చలసాని. మా అనుబంధం అలా ఏర్పడింది.

సరిగ్గా 2 యేళ్లకు శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం కూర్పు బాధ్యత, అలాగే కొకు వ్యాస ప్రపంచం చలసానికి విరసం అప్పగించింది. ఈ పని మొదలు పెట్టి అనంతంతో ఆరంభించారు. ముఖ్యంగా సిప్రాలి నుండి నాపని మొదలైంది. శ్రీశ్రీ రచనలు దాదాపు చలసాని ముందే పోగేసుకుని ఉండడం వలన ఏ వడుదుడుకులు లేకుండా అవి సంపుటాలుగా వెలువడ్డాయి. కొన్ని అనువాద కథలు, నేరము, శిక్షా లాంటి అసంపూర్ణంగా వదిలివేసిన నవలలు, అలాగే కొన్ని తాడు-బొంగరం లాంటి ప్రత్యేక శీర్షికలు, కొన్ని వుత్తరాలు, మరికొన్ని కవితలు, శ్రీశ్రీ నిర్వహించిన పజిల్సు ఇలా అన్నీ ఒక్కొక్కటిగా లైబ్రరీలు, ఆయా వ్యక్తులు సహకారంతో చలసాని శ్రీశ్రీ సాహిత్య సర్వస్వాన్ని 20 సంపుటాలుగా విభజించి అందించారు.ఈ పని సీనియర్ ఇంజనీర్ ఒక డ్యామ్ నిర్మాణాన్ని తలపించే అద్భుతమైన పని విధానం.

కుటుంబరావు గారి రచనలు శోధించి, సాధించి బయటకు తీస్తున్నాం. ఇక్కడ కొన్ని విషయాలు చెప్పుకోవాలి. అందులో ముఖ్యంగా సినిమా వ్యాసాలు. తెలుగు స్వతంత్ర వారపత్రికలో వారం వారం 'తారాపథం' శీర్షికలో ఎవరి సంతకం అచ్చులో లేకుండా కొన్ని సంవత్సరాలు నడించింది. వీటిని గురించి వివరంగా చెప్పడానికి విశాఖ నుండి చలసాని వచ్చారు. లైబ్రరీ వాళ్ళతో మాట్లాడి వాటిని జిరాక్స్‌కు బాధ్యతగా అప్పగించడం జరిగింది. ఇద్దరం కలసి వాటిని కొన్ని అట్టపెట్టెలలోకి నింపి జిరాక్స్ కోసం చీరాలకు వెళ్ళాం. తారాపథం తీస్తున్నకొద్దీ పెరుగుతున్న చందంగా వస్తున్నాయి. సగం తీయించాక చలసానికి ఒక్క పెద్ద అనుమానం పట్టుకుంది. చేస్తున్న వర్కు మధ్యలోనే ఆపేసి ఆరోజుల్లో సెల్‌ఫోన్స్ అందుబాటులోకి రాలేదు గనుక, టెలిఫోన్ బూత్‌కు

వెళ్ళి కె.రామలక్ష్మి గారికి ఫోన్ చేసారు చలసాని. అవతల ఆరుద్ర గారు అందుకుని మాట్లాడారు. కుశల ప్రశ్నల అనంతరం ఈ ఫోన్ రామలక్ష్మి గార్కి అన్నారు చలసాని. ఆవిడ వెంటనే లైన్‌లోకి వచ్చారు. తెలుగు స్వతంత్రలో మీరు పనిచేసారు కదా, అందులో తారాపథం శీర్షికను ఎవరు నిర్వహించారో చెబుతారా అన్నారు చలసాని. ఆమె చాలా వివరంగా చెప్పారు, ఆ శీర్షికను గోరాశాస్త్రిగారు కుటుంబరావు గారికే ఇచ్చి రాయించారు అని చెప్పారు. సమస్య తీరిపోయిందని చలసాని చాల ఆనందపడ్డారు. ఫోన్ పెట్టేసి తిరిగి మళ్ళీ ఫొటోస్టాట్ సెంటర్‌కు బయలుదేరాము. నాకు ఆరుద్ర గురించి దారిలో చాలా విషయాలు చెప్పారు. రాజ్యలక్ష్మి ఫౌండేషన్ సన్మానం. శ్రీశ్రీని ఆరుద్ర నుండి విరసం ఏర్పాటులో భాగంగా తాను హరి గార్లు ప్లాను ప్రకారం తీసుకొచ్చింది, మరికొన్ని సంఘటనలు చెప్పుకుంటూ నవ్వుకుంటూ జిరాక్స్ సెంటర్‌కు వచ్చాం. చలసాని ఈ కబుర్లు పంచుతున్నప్పుడు తెలుగు సాహిత్య చరిత్ర, దాని పరిణామం, ప్రజా పోరాటాలు వాటిలో సాహిత్య భాగస్వామ్యం, ఆయా సంస్థల పుటుక అర్థమైంది.

మళ్ళీ జిరాక్స్ తీయడం మొదలైంది. కొన్ని వందల పేజీలు కొన్ని గంటల తరబడి కెనాన్ జిరాక్స్ మిషను మీద అలా నడిచి వచ్చాయి. మొత్తానికి జిరాక్స్ పని రాత్రి ఒంటిగంట తర్వాత పూర్తి అయింది. ఆ అబ్బాయితో మధ్య మధ్యలో చలసాని చేసిన సంభాషణ పని పూర్తి చేయడంలో, ఆ తర్వాత మాతో సహకరించడంలో అది ఉపయోగపడింది.జిరాక్స్ అబ్బాయి ఆ అర్ధరాత్రి దాకా మాతోపాటు కూడా నీళ్ళు లేకుండా పని చేయడం, అలాగే మాకు భోజనాలు ఏర్పాటు చేయడం, మేము భోంచేయటం పూర్తి అయింది. అన్ని సర్దుకుని చాలా సంతృప్తిగా చెక్క రిక్షాలో ఆ రాత్రి వేటపాలెం బయలుదేరాం. పుస్తకాల పెట్టెలు కదలకుండా కట్టేశాము వెనుక మేము ఇద్దరం కూర్చున్నాం. చలసాని చల్లగాలికి నిద్రలోకి చల్లగా జారిపోయాడు, నా భుజం మీద తన భారం వేసాడు. 8 కి.మీ. దూరం అలా కొంత దూరం ప్రయాణించాక పెట్రోలింగ్ పోలీస్ వ్యాన్ మాముందు ప్రత్యేక్షం. మా రిక్షా ఆపడం వివరాలు అడగడం, పెట్టెల్లో ఏముందో చూడటం, చూసింది అయ్యాక వారు వెళ్ళి పోవడం పూర్తి అయింది. అయినా చలసాని మంచి నిద్రలోనే ఉన్నారు. అలా వూరు చేరాం, మా ఇల్లు చేరాం. అప్పుడు కళ్ళు తెరచి అడుగు పెట్టారు మాఇంట్లోకి. ఎదురుగా మాబావి కనిపిస్తుంది. అంతే స్నానానికి రెడీ అయిపోయారు. హాయిగా పావుగంట బావి నీళ్ళతో స్నానాలు ముగించారు. అన్ని సర్దుకుని పక్క అరుగుమీదనే ఏర్పాటు చేసుకున్నాం. ఇలా కనీస సౌకర్యాలు లేనిచోట కూడా కలిసిపోవడం, ఇబ్బందులను కూడా సంతోషంగా అస్వాదించటం ఎవరికి సాధ్యం. ఒక్క చలసానిలాంటి పసివాళ్ళకు తప్ప.

ఇక్కడ మరో ముఖ్య సంఘటన చెప్పుకోవాలి. అలా కష్టపడి సంపాదించిన కొకు. సినిమా వ్యాసాలు ఏ కారణానైనా సరే కొంత జాప్యం జరిగింది. తిరిగి చూసుకొనే సరికి పెద్ద నష్టం జరిగిపోయింది. ఆ సీడీలు మొత్తం వైరస్ సోకి ధ్వంసం అయ్యాయి. చలసాని ఈ కబురు చెప్పి, వాటిని 'మళ్ళీ' ఎలానైన నువ్వే పంపాలి అన్నారు. తీసిన కాపీలు ఏమయ్యాయి అడిగాను. వాటికో కథ ఉంది అన్నారు నాకు కొండంత భారం పెట్టి, ఒంటరిగా ఆ పని చేయించారు.ఇలా మళ్ళీ మళ్ళీ జిరాక్స్‌లకు పాత పుస్తకాలు ఇచ్చిన యాజమాన్యానికి ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేం. అందుకే విరసం ప్రచురించిన శ్రీశ్రీ కొకు.సాహిత్యసర్వస్వాలను రెండేసి కాపీలు కాంప్లిమెంటరీగా అందజేసారు చలసాని. అలానే త్రిపురనేని గోపీచంద్ గారి సాహిత్య సర్వస్వం కూడా.

ఇక్కడ లైబ్రరీవాళ్ళ అభిప్రాయం చెప్పాలి. చాలామంది రచయితలు, పరిశోధన విద్యార్థులు లైబ్రరీని వినియోగించుకుని వారు పుస్తకాలుగా అచ్చు వేసుకొని, వాటిని లైబ్రరీకి పంపుతూ వీటి ఖరీదు ఇంతా చెల్లించాలని అనే వాళ్ళు ఎందరో ఎదురయ్యారు.ఈ రోజుల్లో విరసం చలసాని ప్రసాద్ లాంటి మంచి మనుషులు ఎదుపడడం సంతోషాన్ని కల్గించే అంశంగా ఆయా సందర్భాల్లో వారు చెబుతూనే ఉన్నారు. సారస్వత నికేతనంతో చలసానికి ఉన్న అనుబంధం వెల కట్టలేనిది. విడదీయలేనిది.

ఇక దొంగ దాడి కథ పుస్తకాన్ని గురించి.ఇది బయటకు రావడం చాలా కష్టమైంది. ఎందరో పాత కమ్యూనిస్టుల చిరకాల స్వప్నం. 1955 మధ్యంతర ఎన్నికలు, శ్రీశ్రీ మీద కువిమర్శకుల అవాకులు చవాకులు. తెలుగు జర్నలిజం సాక్షిగా రోడ్డున పడి నగ్నంగా పత్రికలు నడిచిన తీరుకు తొలి నిదర్శనం. శ్రీశ్రీకి పిచ్చిపట్టించిన విషాద సందర్భం ఇదే. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ కాశీనాథుని నాగేశ్వరరావు, నార్లవెంకటేశ్వర రావులు శ్రీశ్రీ వ్యతిరేక రాతలకు కమ్యూనిస్టు వ్యతిరేక ఉద్యమానికి వేదిక ఏర్పరిచిన సందర్భం. బాపు, వాసులు చెరో పత్రికలో వారి ఎడిటర్ల ప్రోత్సాహంతో వికృత గీతలు గీసిన రోజులు అవే. విశాలాంధ్ర దిన పత్రిక ఒంటరిగా అటు శ్రీశ్రీని, ఇటు కమ్యూనిస్టు పార్టీని ఆ రెండు పత్రికల దాడి నుంచి దీటుగా ఎదుర్కొన్న కాలం అది. నడిచే గ్రంథాలయంగా ఆయన శిష్యులు అభివర్ణించుకునే శ్రీరాంభట్ల కృష్ణమూర్తి అదే సందర్భంలో కార్టునిస్టుగా పై ఇద్దరు కార్టున్స్‌కు జవాబుగా బొమ్మల కాలం అదే. ఐదు విడతల (11-2-55) నుండి (27-2-55) వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. పై ఇద్దరు సంపాదకులు లబ్ది పొందారు. నార్లవెంకటేశ్వరరావు గారు రాజ్యసభకు ఎంపికయ్యారు. ఇది జర్నలిజం కొత్త పుంతలు తొక్కిన దానికి తొలి నిదర్శనం. ఈ గొడవ పత్రికల్లో మూడునెల్ల ముచ్చటగానే ముగించేసారు.

ఇదంతా అప్‌టుడేట్ సేకరించడానికి లైబ్రరీ వాళ్ళను పదేపదే ప్రాధేయపడటం దినచర్య అయ్యింది. రోజుల తరబడి ఆ పత్రికల కోసం వేధించటం విసిగించటం జరిగిపోయాయి. ఆ పత్రికల స్థితి ముట్టుకుంటే ధ్వంసం అయ్యేలా ఉన్నాయి. ఇది నిజం. విలువైన సమాచారం అందులోనే దాగి ఉంది. ఇదీ నిజం. లైబ్రరీ యాజమాన్యం నా పోరు పడలేక ఒప్పుకుంది. బైండు చేసిన వాటిని ఓపన్ చేయడం, ఏ నష్టం జరగకుండా అంతే జాగ్రత్తగా జిరాక్స్ తీయించడం. మళ్ళీ నాలుగువైపులా క్లోజుడ్ బైండింగ్ చేయించడం, లైబ్రరీ వాళ్ళకు తృప్తినిచ్చింది. ఈ మొత్తం గొడవంతా చేతికొచ్చాక అర్జంట్ మీటింగ్ చలసానితో డా. కరుణ గారి ఇంట్లో మిద్దెపైన. జిరాక్స్‌లతో కూర్చున్నాం. వాటిని చలసాని ఆబగా చుశారు. వీటిని డి.టి.పి. చేయించాలంటే, తీయటం ఎంత కష్టమైందో అంతే కష్టం ఉందని భావించాం. మనం దీన్ని పుస్తకంగా ఎంత కష్టమైనా వేద్దాం అన్నారు. ఒక పట్టరాని ఆనందంతో ఒక ఆలింగనం. అది మా ముగింపు సన్నివేశం.

కొద్దికాలం తర్వాత సాహితి మిత్రులు విజయవాడ వారి తరపున ఈ దూషణ భూషణల పర్వం కొంత ఎడిట్‌కు గుర్తై పుస్తకరూపంలో వచ్చింది. అయినా చలసాని పూనిక లేకుంటే అది అలానే పడిఉండేది. అయితే అది విరసం వేస్తుందని నేను ఎదురుచుశాను. ఇలా బయటి మిత్రులు ఎందుకు చేరారో నేను చలసానిని అడగలేదు. ఆయన చెప్పలేదు. నాకు ఇదో అసంతృప్తి. విరసమే పూర్తి స్థాయిలో పుస్తకంగా తెచ్చి ఉంటే ఆ సంతోషమే వేరు.

ఇలాంటిదే మరో సందర్భం. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వాన్ని శత జయంతి సందర్భంగా మనసు ఫౌండేషన్ తరపున 3సంపుటాలు ఒకే

బౌండ్‌గా వెలుగు చూడడం మరో బాధాకర సందర్భం. శ్రీశ్రీసాహిత్య సర్వస్వం కోసం ఊర్లు పట్టుకుని దుమ్ములో ధూళిలో నిద్రాహారాలు మానుకుని, సొంతపనులు వదిలేసి ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా, ఆర్థికాన్ని వెచ్చిస్తూ లైబ్రరీల చుట్టూ తిరిగి, ఆయా వ్యక్తుల చుట్టూ తిరిగి ఎంతో కష్టంతో పోగేసిన సర్వస్వం, ఎవరో బయట వ్యక్తులు డబ్బు కుమ్మరించి విరసం లోగోను తొలగించి శ్రీశ్రీని స్వంతం చేసుకొనే రోజు వస్తుందని నా ఊహకు కూడా అందని విషయం. ఇదో మానని గాయం.

చలసాని దీని కోసం పిలిచారు. విజయవాడ ఎగ్జిక్యూటివ్ క్లబ్‌కు రమ్మనారు. అక్కడ కొత్త వ్యక్తిని పరిచయం చేసారు. అతనే మనసు ఫౌండేషన్ అధినేత యం.వి.రాయుడు. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం ఇవాళ ఈయన స్వంతం అన్నారు. మొత్తంగా విన్నాక షాక్ అయ్యాను. ఎందుకో కె.వి.ఆర్.గారు గుర్తుకొచ్చారు. ఎందుకిలా శ్రీశ్రీ సాహిత్యానికి మనం దూరం అవుతున్నామో తెలీదు. నాకే ఇంత బాధగా ఉంటే చలసానికి ఎలా ఉంటుంది, ఇదే విషయాన్ని బయటకు వచ్చాక చలసానిని అడిగేశాను. ఆమె (శ్రీశ్రీగారి భార్య) ఈయనకు అమ్ముకుంది అన్నారు. దుఃఖం తన్నుకొచ్చింది. ఇన్నేళ్ళుగా పడిన శ్రమ గుర్తుకువచ్చి అది ఇంకా ఎక్కువైంది. కె.వి.ఆర్.బతికి ఉంటే ఇలా జరగనిచ్చేవారా? అన్నాను. చలసాని కళ్ళల్లో అప్పుడు నీళ్ళు చుశాను. గట్టిగా గాలిపీల్చి వదిలారు. అదే సమాధానంగా నేను తిరిగిప్రయాణం.

మనసు ఫౌండేషన్ నుంచి తయారైన శ్రీశ్రీ సర్వస్వం పట్టుకుని, శ్రీశ్రీని కించపరిచే ఆవిష్కరణలకు సిద్ధపడ్డారు. దొంగదాడి కథలో శ్రీశ్రీపై రాళ్ళు వేసిన గుంపులో కె.రోశయ్య తెనాలిలో అప్పుడు ఉన్నారు. ఇవాళ అదే పెద్దమనిషి శ్రీశ్రీ సర్వస్వాన్ని ముఖ్యమంత్రి హోదాలో శతజయంతి సందర్భంగా మనసు ఫౌండేషన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇంతకన్నా శ్రీశ్రీని అవమాన పరచడంలేదు.

ఇలాంటి తుపాన్లు ఎన్నింటినో జీవితంలోను, సాహిత్యంలోను చూసిన చలసాని ఎంతగా మానసికంగా కృంగిపోయి ఉంటారో తెలియదు. దీనిమండి చిన్న మరుపులాగ త్రిపురనేని గోపీచంద్ సర్వస్వం పనిమొదలు పెట్టారు. అది చాలా క్రమబద్ధంగా పుస్తకాల రూపంలో వెలుగు చూశాయి. అయితే ఇవి సంస్థ పనులు కావు. ఆ వ్యత్యాసం ఉంది.

ఒక్కొక్కసారి నాసెల్‌కు అపరిచితుల నుండి ఫోన్స్ వస్తుంటాయి. అవి హలో అని మనం అనగానే సార్ మీ నెంబరు చలసాని గారు ఇచ్చారండి అంటూ మొదలవుతాయి. మీరు ఫ్రీగా ఉన్నారండీ. ఒక చేనేత కార్మికుడు ఫ్రీగా ఉండటం ఎప్పుడూ జరగదు. మనం అలవాటు ప్రకారం విషయం చెప్పండి సార్ అంటాం. ఇక అవతల నుండి చలసాన్ని కలవడం జరిగింది. ఆయనతో నా రచన ఒకటి మిస్ అయ్యింది అని చెప్పానండి. ఆయన వెంటనే మీనెంబరు ఇచ్చారండి. అందుకే మీతో ఇలా మాట్లడుతున్నానండి అంటారు. మళ్ళీ అలాగే అలవాటు ప్రకారం వారు చెప్పే వివరాలు రాసుకోవడం, వారి రచనలు లైబ్రరీ నుండి వెతికి పట్టుకోవడం, పోస్టు చేయడం నా జీవితానికి చలసాని ప్రసాదించిన ప్రసాదం. అలా పనులు చేయించుకున్న వారిలో రంగనాయకమ్మ గారు కూడా ఉన్నారు.

ఈ మధ్యన ఆమె తొలి నవల విడుదలయ్యింది అది 'కృష్ణవేణి'. అది కూడా ఈ జాబితాలో పనిపూర్తి చేసి అందించిందే. ఆమె అభిమానులకి ఇదో పండుగ, రంగనాయకమ్మ గారికి తీరని కోరిక తీరింది. అంతా సంతోషమే. కాని, ఆ పనిని చేసింది నేనే అయినా నా చేత చేయించింది చలసాని. ఇది అందరు గుర్తుపెట్టుకోవలసింది. ఇలాంటి పనులు వాటి వివరాలు రాసుకుంటూ పోతే జర్నలిస్టులు, పి.హెచ్.డి. విద్యార్థులు, రచయితలు, రచయిత్రులు ఇంకా అనేకులు వారివారి పనుల కోసమైన చలసాని వలనే పరిచయ్యం అయ్యారు. ఒక్కనాడు కూడా మీరు ఇలా చేస్తే నాకు ఇబ్బంది కల్గుతుందని నేను ఏనాడు అనలేదు. ఆయన నేను ఫలానవారికి మీ నెంబరు ఇచ్చానని ఎప్పుడు చెప్పలేదు. నాపై ఆయన అంత నమ్మకం ఉంచారు. అది చివరిదాక కొనసాగించారు.

విశాఖ అంటే చలసానికి చాలా ఇష్టం. అది శ్రీశ్రీ వల్ల కలిగిన ప్రేమకూడా. రావిశాస్త్రి వల్ల బలపడిన బంధం కూడా. అబ్బూరి వలన ఆంధ్రా యూనివర్సిటీ వలన కూడా. ఇలాంటి అనుబంధలన్నీ ఒక్కొక్కటిగా కలగలిసి విశాఖలో జీవించారు. ఈ అనుబంధాలన్ని ఒక్కొక్కటిగా వెళ్ళిపోతూ వచ్చాయి. నిన్న చివరిగా హుద్‌హుద్ వలన కలిగిన ప్రకృతి భీభత్సం విశాఖను చిన్నా భిన్నం చేసింది. హుద్‌హుద్ తర్వాత ఫోన్ చేసి మాస్టారు ఎలా ఉన్నారని అడిగాను. జవాబు ఇలా చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో చెట్లన్నీ కూలిపోయాయి. యారాడకొండ ఎండిపోయింది. విశాఖ యుద్ధం తర్వాత మిగిలే భీతావహాన్ని తలపిస్తుందన్నారు. నేను మాస్టారును పలకరిస్తే ఆయన విశాఖకు వచ్చిన కష్టాల్ని పలవరించారు. ఇంకా వారం రోజుల ముందు ఫోన్ చేసి బాబూ కలము కాగితం తీసుకో అన్నారు. ఊ....చెప్పండి మాస్టారు అన్నాను.1947 సెప్టెంబరు 16 తెలుగు స్వతంత్రలో 'బృహస్పతి' పేరుతో, 'బూతుకన్నా ఎస్కేపిజం చాలా ప్రమాదకరం' అనే వ్యాసం వచ్చిదంట. అది అర్జంటుగా కావాలి' అన్నారు. ఈ బృహస్పతి ఎవరు అని అడిగాను. కుటుంబరావు గారేనని చెప్పారు. అయితే, అదేపేరుతో అదే పత్రికలో గతంలో నేను అనేక వ్యాసాలు చూశాను. వాటి సంగతి ఏమిటి? మనం కొకు మారుపేర్ల లిస్టు గతంలో తయారు చేసుకున్నాం. అందులో ఈ పేరు లేదు. ఇప్పుడు కొత్తగా వెతకాల్సివస్తే వాటిని ఏం చేయాలి? అన్నాను. 'బాబూ ముందుగా ఈ వ్యాసం తీసిపంపు. మిగితావి మనం కలిసినప్పుడు మాట్లాడుకుందాం' ఇవీ మా మధ్యన చివరి సంభాషణలు.

నన్ను ఇలా వదిలేసి వెళ్ళిపోయారు. ఇప్పుడు నేనేం చేయాలి.

విప్లవ రచయిత చలసాని ప్రసాద్‌కు విప్లవ జోహార్లు

- వాయిస్ ఆఫ్ న్యూ డెమోక్రసీ

విప్లవ రచయితల సంఘం నాయకులు, ప్రముఖ విప్లవ రచయిత, కవి, విమర్శకుడు, సంపాదకుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్ 25.7.2015న ఉదయం 11-30 గంటలకు విశాఖలోని తన స్వగృహంలో గుండె పోటుతో మరణించారు. ఆయన వయసు 83 సంవత్సరాలు. ఆయన విరసం వ్యవస్థాపక సభ్యుడు. విరసం అధ్యక్షుడిగానూ, కార్యదర్శిగానూ తన సేవలందించారు. కామ్రేడ్ చలసాని ప్రసాద్ శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథ్ శాస్త్రిగారలకు సన్నిహిత సహచరులు. శ్రీశ్రీ, కొడవంటిగంటిల సాహితీ సంపుటాలకు చలసాని సంపాదకత్వం వహించారు. ఆయన అనేక విప్లవ కవితలు, వ్యాసాలు రచించారు. జీవితమంతా విప్లవ సాహిత్యోద్యమానికి, విప్లవోద్యమానికి ఎనలేని సేవ చేసిన కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు సి.పి.ఐ. (ఎం.ఎల్.) న్యూడెమొక్రసీ తెలంగాణా రాష్ట్ర కమిటీ, 'వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ' సంపాదక వర్గం విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

చలసాని ప్రస్థానం

సంచలన వార్తాపత్రిక లీడర్

26-07-2015, విశాఖపట్నం

మందగమనంతో సాగే ద్విచక్రవాహనాన్ని నడిపిస్తూ, పరిచయస్తుల అభివాదాలకు ప్రతిస్పందిస్తూ మామూలుగా కనిపించే ఆ వ్యక్తిలో ఇంతశక్తి దాగి ఉందంటే తెలియని వారు నమ్మడం కష్టమే. కానీ ఆయన గురించి తెలిసిన వారికి చలసాని ప్రసాద్ చైతన్య స్వరూపం ఆశ్చర్యమనిపించదు. పధ్నాలుగేళ్ల కష్టపడి ఇరవై భాగాలుగా శ్రీశ్రీ సాహితీ సర్వస్వాన్ని ప్రచురించినా అదే తరగని ఉత్సాహంతో రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల సాహిత్యమంతటినీ సంపుటాలుగా వెలువరించినా అది చలసానికే చెల్లింది. 1970లో విప్లవ రచయితల సంఘాన్ని స్థాపించిన నాటి నుంచి విరసంతో ఆయన అనుబంధం కొనసాగుతోంది. వాడీవేడి గల సంస్థగా ఆవిర్భవించిన విరసాన్ని అదే బాటలో ఉరకలు వేయించడంలో చురకైన పాత్ర నిర్వహించడం ఆయనకే సాధ్యమైంది. అయితే చలసాని ప్రసాద్ అక్కడితో ఆగిపోలేదు. ఉద్యమ సూరీడులాగ ఆవిర్భవించిన విరసాన్ని ఉజ్వలంగా వెలిగేలా చేయడంలో ఆయన నిర్వహిస్తున్న పాత్ర అద్వితీయమైనది. అయితే అక్కడితో ఆగిపోతే అది చలసాని ప్రసాద్ ఎందుకవుతారు? ఆయన ఆశ అనంతం. ఆయన దృష్టి అఖండం. ఆయన చూపు రేపటి ప్రపంచం వైపు. మహాకవి మాదిరిగానే ఆయనకూ రేపటి సూర్యోదయంపై అంతులేని విశ్వాసముంది. శ్రామిక లోకపు కళ్యాణం సాధ్యపడే ఆ మరో ప్రపంచం అరుదెంచే రోజు చేరువవుతోందన్న కొండంత భరోసా ఉంది. ఆ విశ్వాసమే ఆయన్ను నేటికీ పరుగులు తీయిస్తోంది.

కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి మార్క్సిస్టుగా పెరిగి, మావోయిస్టుగా స్థిరపడ్డ చలసాని జీవితం శ్రీశ్రీ సాహిత్యమంత విస్తారమైనది. ఆయన ఆలోచన, కృషి రావిశాస్త్రి రచనల్లోని పాత్రలంత విస్తృతమైనవి. ప్రజా సాహిత్యమన్నా, శ్రామిక విప్లవమన్నా ఆయనకు అంతులేని మమకారం. ఆ ప్రేమాభిమానాల కారణంగానే కష్టజీవికి అటూ ఇటూ నిలబడ్డ శ్రీశ్రీ, రావిశాస్త్రి ఆయనకు పంచ ప్రాణాలయ్యారు. విప్లవ పోరాటాలకు ప్రజలను కార్యోన్ముఖులను చేసే సాహితీ సృజన కోసం ఆయన విరసం ఉద్భవించే చారిత్రాత్మక పరిణామంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. 1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి సభను ఇందుకు వేదికగా మలచారు. ఆ రెండు మహత్తర సంఘటనలూ శ్రీశ్రీకి, చలసానికి అత్యంత ఇష్టమైన విశాఖలోనే జరగడం విశేషం.

అదే ఉత్సాహం : విరసం ఏర్పడి నాలుగు దశాబ్దాలయినా చలసాని ఉత్సాహం అప్పటికీ, ఇప్పటికీ ఝురీపాత సమానమే. ఉత్తరాంధ్రలో విప్లవోద్యమ కార్యకారణ పరిణామాలు ఏవి చోటు చేసుకున్నా చలసాని మద్దతు ఉండనే ఉంటుంది. ప్రజా సాహిత్య సంబంధమైన రచనా వ్యాసంగంతోనో, పుస్తకాల ప్రచురణతోనో ఆయన ఆగిపోరు. విప్లవ యోధుల సరసన కలం యోధుడిగా ధీటుగా నిలుస్తారు. విప్లవోద్యమానికి సంబంధించి ఏ ఉద్యమకారుడు కారాగారం పాలైనా, ఏ అమాయకులు పోలీసుల దమనకాండకు గురైనా మొదటి పరామర్శ చలసానిదే. ఏ కీకారణ్యంలో కూంబింగ్ వేటలో ఏ విప్లవకారుడు నేలకొరిగినా రాలే తొలి కన్నీటి బొట్టు చలసానిదే. ఎక్కడ పోరు పాట వినపడ్డా, ఎక్కడ ఎవరు సమరశంఖం పూరించినా ఆయన పరుగున తరలివెళ్తారు. ఉద్యమాలలో అగ్రపీఠిన నిలబడతారు. ఉద్యమానికి, సాహిత్యానికి మధ్య వంతెనలా ఇంత భారాన్నీ మోస్తూ అంతర్లీనంగా ప్రవహించే చైతన్య స్రవంతితో నవయువకుడిగా పరుగులు తీస్తూనే ఉంటారు. ఆయన వాహనం నేటికీ ఏ నాటికీ పంచకళ్యాణి. ఆయన అలుపూసలుపూ లేని నవ్యోత్సాహ వాహిని.

పుస్తక నిలయం : ఎవరైనా ఇల్లు నివసించడానికి కట్టించు కుంటారు. చలసాని మాత్రం పుస్తకాలను కొలువు తీర్చడానికి ఇంటిని కట్టుకున్నారు. మేడమీద ఓ గది వేసినా, ఇంటిని ఇంకాస్త పొడిగించినా అది పుస్తకాల కోసమేనంటారు. అందరిళ్లలో దేవుడి గది, భోజనాల గది వగైరా ఉంటే ఆయన ఇంటో శ్రీశ్రీ గది, రావిశాస్త్రి గది, కొకు గది అని ఉంటాయి. ఇంట్లోని ఎనిమిది గదుల్లోనూ పుస్తకాలే ఉంటాయంటే చలసాని పుస్తకాభిమానం ఎటువంటిదో అర్థమవుతుంది. ఆయన పుస్తకాలయంలో ఇరవై వేల పుస్తకాలున్నాయంటే ఆ మమకారం ఏపాటిదో అవగతమవుతుంది. ఆయన దగ్గర పుస్తకాల ఆధారంగా ఏడెనిమిది మంది పీహెచ్‌డీలు చేశారు. ఎందరో పఠనాభిలాషులు వచ్చి నిత్యం ఏదో సమాచరం సేకరించుకుని పోతూ ఉంటారు. పోలీసులెవరికైనా పార్వతీపురం కుట్రకేసుపై ఏవైనా సందేహాలు తలెత్తితే హోంశాఖ ప్రచురించిన 22 భారీ సంపుటాల కోసం చలసాని ఇంటికి రావాల్సిందే అని ఆయన సన్నిహితులు ఛలోక్తి విసురుతారు.

అడ్డపాగ ఇష్టం : విశాఖపట్నం అంటే ఉత్తరాంధ్ర మహిళా లోకమంటే చలసానికి చాలా అభిమానం. ఉత్తరాంధ్ర మహిళలు శ్రమజీవులు. కల్లాకపటం లేనివారు అంటారాయన. వారి నిష్కపట వ్యవహారం, శ్రమజీవనం, వినయం గొప్ప విషయాలని చెబుతారు. ఇక్కడి గ్రామీణ మహిళలు అడ్డపాగ కాల్చడం నచ్చుతుంది అంటారు చలసాని. విశాఖ అంటే శ్రీశ్రీ. విశాఖ అంటే రావిశాస్త్రి. జీవితమంతా విశాఖే. అందుకే ఆ ఊరంటే ప్రత్యేక మమకారం అని చెబుతారు.

అందరికీ బాబాయ్: ఆ మధ్య అమరుడైన మావోయిస్టు నేత ఆజాద్ నుంచి వర్ధమాన రచయితల వరకు అందరికీ ఆయన బాబాయ్‌గా చిరపరిచితుడు. ఎవరు బాబాయ్ అని పిలిచినా చలసాని మహాకవికి మాత్రం ఆయన వేరే వరస! చలసానిని శ్రీశ్రీ సరదాగా నా మూడో భార్య అని వ్యవహరించేవారట మరి!

ఎన్నో అవతారాలు : కృష్ణాజిల్లాలోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చలసాని ప్రసాద్ బాల్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూస్తూ ఆస్వాదిస్తూ పెరిగారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన కుటుంబం ప్రత్యక్షంగా పాలుపంచుకుంది. ఉద్యమంలో ఆయన కుటుంబ సభ్యులు ముగ్గురు నేలకొరిగారు.

ఏయూలో ఎమ్మే చేసిన తర్వాత జీవిక కోసం రకరకాల ఉద్యోగాలు చేశారు. కొంతకాలం సినీమాయా జగత్తులో సహాయ దర్శకుడిగా, రచయితగా కొనసాగారు. చివరికి ఏవీఎన్ కళాశాలలో అధ్యాపకుడిగా స్థిరపడ్డారు.

తెలుగుకు ఢోకా లేదు : కొందరు భయపడుతున్నట్టు తెలుగు కేం ఢోకా లేదు. గతంలో సంస్కృతాన్ని, ఇప్పుడు ఇంగ్లీషును ఎదిరించి నిలిచిన భాష తెలుగు. ఏ భాషా పదాన్నయినా తనలో కలుపుకొని ఎదిగే శక్తి తెలుగుకు ఉంది. అందుకే 'తెలుగు అజరామరం. తెలుగు భవిష్యత్తు ఉజ్వలం' అని చలసాని చెబుతారు.

పోరాటశీల సాహితీ స్వరం

రామతీర్థ

ఆంధ్రభూమి, 27-7-2015

ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్యంతో రక్త సంబంధం గలవాడు... ఉద్యమాలకూ, అక్షరోద్యమాలకూ తేడా లేనివాడు... ఎక్కడ ఏ ఎదురుకాల్పుల్లో ప్రజలు, ప్రజా సంఘర్షణ ఆచరణశీలురు అమరులైనా అక్కడ ప్రత్యక్షం అయినవాడు... ఎనభై మూడేళ్ళ వయస్సులో కూడా ఈ నెల 25న జరగాల్సిన విరసం సభ కోసం కరపత్రాలు పంచిపెడుతూ విశాఖపట్నం సభలలో మొన్నమొన్ననే కదలాడినవాడు... ఆయనే చలసాని ప్రసాద్. చదువుతూ చదువుతూ పుస్తకాన్ని కాసేపు మడిచినట్టు... మాట్లాడుతూ మాట్లాడుతూ కాసేపు పక్కకి తిరిగినట్టు... సులువుగా అందరినీ విడిచి వెళ్ళిపోయాడు. గురజాడ కన్యాశుల్కాన్ని క్షుణ్ణంగా చదవడం అంటే ఎంత లాగా, ఆ నాటకంలో రంగస్థలం పైకి రాని పాత్రలు దాదాపు నలభై ఉన్నాయని చెప్పగలిగినవాడు, తన ఇంటిలోని సొంత లైబ్రరీలో నడుస్తున్న పుస్తకం చలసాని. ఉత్తరాంధ్రలో ఏ పుస్తకం కావాలన్నా చలసాని ఒక అక్షరాల నిధి, పుస్తకాల గని.

శ్రీశ్రీ కైకగా ఆయనకి అత్యంత సన్నిహితుడు. శ్రీశ్రీ సమగ్ర రచనలను సంకలనం చేస్తున్నాము కానీ వీటిని చదివి నిగ్గుతేల్చుకోవలసింది రాబోయే తరాలే అని చెప్పగలిగిన సంయమనం గల సాధుస్వభావి. విశ్వనాథ వేయి పడగలలో ఆనాటి సమాజ చిత్రణ కనబడుతుంది. అందుకోసం అది తప్పక చదువదగ్గ పుస్తకంగా పేర్కొనే ప్రజాస్వామికుడు. విశాఖలో మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహించిన శ్రీశ్రీ శత జయంతి కార్యక్రమాలలో పలుమార్లు ముఖ్య ఉపన్యాసాలు ఇచ్చి, చిన్న సభ, పెద్ద సభ అని చూడకుండా తన సాహిత్య, సమాజ జ్ఞానాన్ని నలుగురితో పంచుకునే ఉబలాటంలో చిన్న పిల్లలను మించిపోయిన వాడు చలసాని ప్రసాద్. భావ కవిత, అభ్యుదయ కవిత, విప్లవ కవిత, దళిత కవిత, స్త్రీవాద కవిత్వ ఉద్యమాల స్వభావం, తెలుగు కథ, నవల వీటి క్రమ పరిణామ వికాసాలను, ప్రయోగ వైచిత్రి, ప్రయోగశీలత ఎరిగి, తన ప్రసంగాలలో విడమర్చి చెప్పగల వక్త. విశాఖ సాహితీ లోకంలో ఒక చిరపరిచిత వ్యక్తిత్వం చలసాని. రాష్ట్రవ్యాప్తంగా విరసం నాయకులలో ఒకరు. వామపక్ష సామాజిక చింతనను పతాకగా చేతబట్టి, అరుణతార సంపాదక బాధ్యతలు కూడా దశాబ్దాలుగా నిర్వహించి ఎన్నో ప్రామాణికమైన రచనలు వెలుగులోకి రావడానికి కారణభూతుడైనవాడు చలసాని. ఇరవయ్యో శతాబ్దపు ప్రజల పోరాట శీలత గురించి చెప్పగల ఒక సాధికార స్వరం. ఎక్కడ ప్రజలు పోరాడుతూ ఉంటే అక్కడకు వెళ్ళి సంఘీభావం ప్రకటించడం, ఎనభై మూడేళ్ల వయసులో కూడా అలుపెరుగని పట్టుదల గల వ్యక్తి:

శ్రీశ్రీ శత జయంతి (2010లో) సందర్భంలో శ్రీశ్రీకి నూరు, విరసానికి నలభై అని గుర్తు చేసుకుంటూ, రాజ్యపు అణచివేత గురించి చాలా ప్రాక్టికల్‌గా మాట్లాడే మనిషి. ఎప్పుడూ ఒక దీర్ఘకాల సంఘర్షణకు సిద్ధపడ్డ వ్యక్తికి ఉండే పరిపక్వత ఆయనలో నిరంతరం కనిపించేది. ఒక శ్రద్ధాళువుగా తన సాహిత్య సాంగత్యాలు అలవరిచిన అభ్యుదయాత్మకమైన విప్లవాంశను ఎప్పుడూ ధ్వనిస్తూ ఉండేవారు. విరసం ఆవిర్భావంతో ప్రత్యక్ష సంబంధం గల కీలక వ్యక్తిని ఇవాళ తెలుగు సాహిత్యం కోల్పోయింది. నిరసన ఒక ప్రజాస్వామిక సంస్కృతిగా జీవించిన అసమ్మతిదారు, ఒక డిస్సెంటర్. మార్కెట్ శక్తులు రాను రానూ బలపడుతూ, మతం, అధికారం, ఐశ్వర్యం, ఆయుధ సంపత్తి, రాజకీయం, అన్నీ తమ తమ అస్తిత్వ వాదాలతో ఒకదానితో ఒకటి కుమ్మక్కు అవుతున్న కాలంలో చలసాని వంటి వివేకవంతుల అవసరం సమాజానికి చాలా ఉన్నది. తనవంటివారు నలుగురు తయారు కావాలన్న ఒక సార్వత్రిక ఆకాంక్షతో అందరినీ ప్రోత్సహిస్తూ, తన గొప్పదనం ఏమిటో అసలు ఎరుగకుండానే జీవించిన నిరాడంబరుడు చలసాని ప్రసాద్. ఆయన మన సామూహిక, ప్రజాగ్రహాల వనరు. ఏ సాహిత్యం నుంచైనా ప్రగతిశీల అంశను స్వీకరించగల ఉదారవాది. తనకు ఏదైనా సందేహం వస్తే, ఆ వక్తను సభ తరువాత, నేరుగా కలసి అడిగి తెలుసుకునే ఓపిక కల మంచి శ్రోత. వీరి సభలు, వారి సభలు అని గీతలు గీసుకోకుండా, హాజరై విని, అవసరం అయితే తన అభిప్రాయాన్ని పంచుకునే ఉత్తమ క్రమశిక్షణా శీలి. భీమిలిలో చలం జయంతి సభలకు వచ్చి సౌరిస్ ఆశ్రమంలో చలంగారి గురించి ఎన్నో విషయాలను చలసాని చెప్పిన సభలో నేను సహవక్తను. ఆయన, ఆ భీమిలీ సభలు నాకు ఇప్పటికీ వెచ్చని జ్ఞాపకాలే.

ఈతరం రచయితలు నేర్చుకోవలసిన ఎన్నో ఉత్తమ లక్షణాలకు జీవిత కాల గురువు. పాఠాలు బోధించింది విశాఖలోనే ఏ.వి.ఎన్. కళాశాలలో రాజనీతి శాస్త్రంలోనైనా తన జీవితం అంతా, సాహిత్య మాధ్యమం ద్వారా, పాలకులు - యంత్రాంగం మధ్య నలిగిపోయే ప్రజల గురించి మానవ నాగరికతలో తనకు అందిన శతాబ్దాన్ని అధ్యయనం చేసిన నిత్య విద్యార్థి.

ప్రజలను ప్రేమించాడు కాబట్టే విరసంలో ఉన్నాడు. పేదల పక్షం వహించాడు కాబట్టే కమ్యూనిస్టుగా బతికాడు. తాను రాసిన దానికన్నా, మహారచయితల సహవాసి. అంతేవాసిగా ఎక్కువ నేర్చుకుని, అది అందరికీ తెలియచేసిన మన చలసాని అక్షరాలా అందరి నేస్తం. ఎంత తక్కువ రాశాడో అంత ఎక్కువ చదివాడు. ఎంత ఎక్కువ చదివాడో, అంతకన్న ఎక్కువగా ప్రజల మనిషిగా కలసిపోయాడు. చలసాని లేని విశాఖ - నిండుగా పలకరించే నవ్వుని కోల్పోయింది. సందడి చేసే సముద్ర కెరటం తక్కువై కళ తగ్గిపోయింది. సాహితీ సభలు ఒక నిప్పుల నిమ్మగ జాడ లేక కొంత మసకబారిపోతాయా అనిపిస్తోంది. భుజం మీద చరుపూ, వెంటనే పెద్దగా నవ్వూ, ఎవరిని పలకరించడానికి, ఎవరికి పంచడానికి వెళ్లాడో చలసానీ?

అతడిప్పుడు లేదు... అతడెప్పుడూ ఉన్నాడు

చందు సుబ్బారావు

కలవకుండా ఓ నెల రోజులుంటే చాలును... 'చందయ్యా... ఏమయిపొయ్యావయ్యా - నిన్ను తగలెయ్యా' అంటూ కొంచెం మెల్లగా మెట్లెక్కుతూ తెల్లజుట్టు మనిషి వాకిట్లోకొస్తాడు. 'అమ్మా, నిర్మలా బావున్నావా'... అంటూ పలకరించి వచ్చి కూచుంటాడు. 'కొత్త పుస్తకం వచ్చింది కొ.కు. రచనల్లో - ఇచ్చి వెళ్దామని వచ్చా' అంటూ సంచిలోంచి తీస్తాడు... ఎప్పుడో రెండు వేలు ఇచ్చాను కాబోలు. కొ.కు. ఎడిషన్స్‌లో చివరి వాల్యూమ్ కూడా ఇంటికొచ్చి ఇచ్చి వెళ్ళాడు పెద్ద మనిషి.

ఓ పుస్తకం కావాలంటే, ఇంటికి తీసుకొచ్చి ఇచ్చే వాళ్లు ఈ భూ ప్రపంచంలో ఉన్నారా? మళ్ళీ ఓ నెలపోయింతర్వాత తిరిగి తీసుకెళ్ళటానికి ఇంటికొచ్చేవాళ్ళు ఈ విశ్వాంతరాళంలో ఉంటారా? 'ఆ పుస్తకం పోయింది. నా దగ్గర కనపడటం లేదు' అంటే మొహం పగల గొట్టకుండా ఊరుకునే వాళ్ళు ఎంతమందుంటారు? పోనీ, నీ దగ్గర ఏదో సాయం ఆశించి అలా చేస్తున్నాడయ్యా... అంటారా. పండక్కి - పబ్బానికీ విరసానికి విరాళం... ఆ పుస్తకం కొనటం... ఈ పత్రిక్కు చందా... ఆ సభకు సాయం... ఈ సదస్సుకు ఊతం... అంతే గదా... ఇన్ని దశాబ్దాల స్నేహంలో ఏనాడైనా వ్యక్తిగత స్వార్థం కాని... సొంత లాభం కోసం చర్చగాని... కుటుంబం కోసం చెయ్యి చాచటం కాని... పేరు కోసమో... పిసరంత కీర్తి కోసమో ప్రలోభం కాని కనిపించలేదు... ఆ మనిషిలో...

మనుషులంటే ప్రేమ అతనికి - పేదవాళ్ళంటే అభిమానం అతనికి - (జాలి అనే పదం వాడకూడదు) ఆడపిల్లలంటే ఆనందం అతనికి - అసహాయత అంటే ఆదరణ అతనికి. మార్క్స్ కొటేషన్ 'I like the weakness of Woman - and the strength of man' అన్న సహజ సిద్ధ ప్రాకృతిక ధర్మం, అత్యంత గౌరవనీయం ఆ మనిషికి.

ఆడంబరాలంటే అతి ద్వేషం... ఆర్థిక శక్తుల పెత్తనం అంటే అమిత కోపం... 'ఇది కేవలం కలవారి మార్కెట్ స్వేచ్ఛ...' అని ఈ ప్రజాస్వామ్యానికి చలసాని ప్రసాద్ ఇచ్చే నిర్వచనం. విప్లవం అడవుల్లోనే ఉంటుందని అతను అనలేదు. ఎక్కడైనా ఉంటుంది. అన్నిచోట్లా ఉంటుంది. సి.పి.ఐ.లోనూ ఉంటుంది. సి.పి.ఎం.లోనూ ఉంటుంది. కాకపోతే అడవుల్లో ప్రాణాలొదిలే పోరాటవాదులతో అతనికి పూర్తి మమేకం! అదే సరైన మార్గమని చిత్తశుద్ధితో విశ్వాసం!!

ఎక్కడైనా మార్పుకు బీజం ఉంటుంది. భూమిపై ప్రతి అంగుళం ఉన్న 'స్థితి' నుండి 'గతి'కి మార్పు చెందుతుంది. ప్రతి వ్యక్తిలోనూ ఘర్షణ పొదుగుతుంటుంది. ఈ సమాజం రింగు మాదిరి తిరుగుతున్నా, స్ప్రింగు మాదిరి ఎదుగుతుంటుంది.... అని ప్రసాద్ స్థిర విశ్వాసం.

మతం మీద అతనికి విశ్వాసం లేదు. మత విశ్వాసుల మీద అగౌరవం లేదు. తన సంపాదన మీద అతనికి గురి లేదు. ధనవంతులతో సైతం స్నేహం చేయగలరు. వాళ్ళచేత ఓ చిన్న మంచి పని చేయించగలడు. ఇతర రాజకీయ నాయకులపై అతనికి ద్వేషం లేదు. వారి విశ్వాసాలు వారివి. వారిని తన ధర్మం వేపు మళ్ళించాలన్న ఆసక్తి ఉంది. ఆశ ఉంది. విప్లవం సామాజిక సామూహిక సద్వర్తన. శ్రీశ్రీ చెప్పిన సదసత్సంశయాలకు సాల్వెంట్. అది ఎప్పుడు ఎలా వస్తుందో జ్యోతిషం చెప్పాలన్న కుతూహలం లేదు ప్రసాద్‌కు. దానిపై తనకు patent చైతన్యం ఉందన్న అహంకారమూ లేదు!

'నిరహంకారి... నిర్మోహి... నిరాడంబరుడు. నిలువెత్తు నిజాయితీపరుడు. నిస్వార్థపరుడు' అనే ఈ పదాలన్నీ తరచూ misuse and abuse చేస్తుంటాం. ఇన్నాళ్లకు ఒక్కసారి చలసానికి వాడి correct use చేసామని సంతోషంగా ఉంటుంది.

నేనంటే ప్రేమ... Left polemicsతో అతనితో వాదిస్తుంటానని, నేనంటే గౌరవం... రాయగలనని- మాట్లాడ గలనని... నేనంటే అభిమానం - వేణూ, కృష్ణాబాయి, నవత, మమత, విజయ, పద్మిని, నళిని అందర్నీ ప్రేమపాత్రంగా భావిస్తానని. నేనంటే ఇష్టం. పెద్ద స్వార్థపరుణ్ణి కానని, విరసం లైనుతో విభేదిస్తూ అరసం లైనును సమర్థిస్తూ మాట్లాడినా, రాసినా నేనంటే చిరు కోపం 'ఎప్పుడైనా పనికొస్తానని' నేనంటే చిన్న ఆసక్తి!

నేనంటే లోలోపల చికాకు - ఆరుద్రనూ, సోమసుందర్‌నూ, మల్లారెడ్డినీ, రాంభట్లనూ అనుసరిస్తానని... వీరిపట్ల ప్రసాద్‌కు పరిమితికి మించిన ద్వేషం కూడదన్నానని - పెద్ద పెద్ద పత్రికల్లో ప్రసాద్‌ను విమర్శిస్తూ వ్యాసాలు రాసానని - కోపమే తప్ప ద్వేషం లేదు - విభేదమే తప్ప శత్రుత్వం లేదు. ఎందుకంటే అతనికి sense of purpose ఉంది. అది పెద్దది. greater and larger గమ్యం ఉంది. ఆ మరో ప్రపంచ యజ్ఞంలో, యాత్రలో - ఊరేగింపులో అందరం భాగస్వాములమే. మనుషులంతా మరబొమ్మల్లా. పోతపోసిన లోహ బొమ్మల్లా ఉంటే ఇంక సమాజామేమిటి? ఆశయాలేమిటి? కర్తవ్యాలేమిటి? సైన్సు ఎప్పుడో మార్చి పారవేసేది... దాని అంతర్గత వైరుధ్యాలే దాని ఆకర్షణ... దాన్ని మార్చటమే మనకు సవాలు... ఆ గొప్ప కర్తవ్యమే గమ్యం... అందులో చలనమే మన చైతన్యం... అంటూ ఎన్నోసార్లు చలసాని స్పష్టంగా నా చెవిలో చెప్పేవాడు... కాస్త నేను మౌనం వహించి వింటే చాలు! పుల్ల విరిచి ఎదురు మాట్లాడకుండా వుంటే... 'నీ పని నువ్వు చెయ్... మా పని మేం చేస్తాం...' అంటుండేవాడు!! ఊరికే జనాలకు దణ్ణాలు పెడుతున్నాడు కదా, అని అమాయకుడనుకుంటే పొరపాటు... అందరితో మాట్లాడుతున్నాడు కదా అని ఉత్తి బోళా శంకరుడు అనుకుంటే... పొరపాటు పొరపాటు. సినిమాల దగ్గర్నుండి సాయుధ పోరాటాల దాకా... ఒబామా దగ్గర్నుండి సాయిబాబా దాకా - విశ్వనాథ నుండి విశ్వనాథశాస్త్రి దాకా - శ్రీశ్రీ నుండి శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిపతి దాకా... అందర్నీ పరిశీలిస్తాడు... పలకరిస్తాడు... పరిచయం చేస్తాడు... పరవశిస్తాడు... జీవన పరిమళాల్ని ఆస్వాదిస్తాడు... ఏ మంచికి రవంత సాయం చేయగలం... ఏ వంచనను ఎదిరించగలం... కొవ్వొత్తిలాగ కాలుతూ ఈ సమాజానికి ఏపాటి వెలుగు ప్రసాదించగలం... అని క్షణ క్షణం తపిస్తూ ఎనభై ఏళ్ళు జీవించిన ఏకైక వ్యక్తి... నాకు తెలిసి... నేనెరిగినంతలో... ప్రసాద్ మాత్రమే...!

ఆ నవ్వులో అరుణతార వెలుగు

పద్మకుమారి

2004 జనవరిలో కావలి విరసం సభల్లో చలసాని ప్రసాద్‌ను మొదటిసారి చూశాను. అంతకు ముందు అజ్ఞాతంలో, జైల్లో పుస్తకాల ద్వారా ఆయన నాకు తెలుసు. మొదటిసారి ఆ సభల్లో పరిచయం కాగానే 'ఏరా అమ్మడూ - ఎప్పుడు బైటికి వచ్చావు? ఎక్కడ ఉంటున్నావు?' అని భుజం మీద చేయి వేసి తలకు, తల ఆనించి ఆప్యాయంగా అడిగాడు. అంతలో ఎవరో పిలిస్తే చకచకా వెళ్లిపోయాడు.

అది మా మొదటి పరిచయం.

అది మొదలు ఆయన మరణానికి ముందు జూలై 4న కామ్రేడ్ గంటి ప్రసాదం గారి వర్ధంతి సభకు బొబ్బిలి కలిసి వెళ్ళి వచ్చే దాకా ఆయన అట్లాగే ఆప్యాయంగా పలకరించేవాడు. కలిసి నడుస్తున్నామంటే అందరిలాగే నా భుజం మీద చేయి వేసి నడిచేవాడు. ఎప్పుడూ అదే పిలుపు ఏరా అమ్మడూ... అని ఇంకా ప్రేమ ఎక్కువైతే 'ఏరా బోడీ...' అని పిలిచేవాడు. ఆ రోజు వైజాగ్‌లో నేనూ, వీవీ దిగే సరికి రైల్వే స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు.

కావలిలో మొదటిసారి ఎంత చురుగ్గా ఉండేవాడో చివరిసారి కలిసినప్పుడు కూడా అంతే చురుగ్గా కనిపించాడు.

బొబ్బిలి సభలో గంటి గురించి మాట్లాడుతూ 'గంటి ప్రసాదం కోసం ఎందరో కన్నీళ్లు కారుస్తున్నారు. కన్నీళ్లకే మనిషిని బతికించే శక్తి ఉంటే అమృతంలాగా అదీ కరువయ్యేది' అన్నాడు.

మీటింగ్ అయిపోయాక కూడా అదే మాట తనలో తను మననం చేసుకుంటున్నట్లు బైటికి అన్నాడు. అప్పుడు నేను 'చలసానీ అదే నిజమైతే నీ అమృతం శ్రీశ్రీకే ఇచ్చేవాడివి కదా' అన్నాను. దానికాయన నవ్వుతూ 'ఎందుకు అట్లా చేస్తానురా బోడీ...' అని నా తలకు తన తల ఆనించాడు. అప్పుడు కూడా శ్రీశ్రీ పేరు వినగానే ఆయన ముఖం ఎంత వెలిగిపోయిందో.

నేను ఊరుకోకుండా 'ఏం కాదు చలసానీ... వేరే వాళ్ల అమృతాన్ని కూడా శ్రీశ్రీ కోసం లాక్కునేవాడివి' అన్నాను. అప్పుడు చూడాలి ఆయన కళ్లలో కాంతి జలపాతాలు. చలసాని కోసం కూడా ఎందరు కన్నీళ్లు కార్చారు. ఎవరి కన్నీటికీ ఆయన్ను బతికించే శక్తి లేదు కదా.

* * *

చలసాని విప్లవ జీవితంలో నేను ఎరిగిన పది పన్నెండేండ్ల కాలం ఎక్కువేం కాదు. అయితే చాలా అపురూపమైనది. అట్లే చాలా నిర్బంధకాలం, పోరాట కాలం. అమరుల కుటుంబాల పోరాటం మొదలైన కాలం. 2004 మధ్యలో ఎన్నికలు జరిగి, ప్రభుత్వాలు మారాయి. విప్లవ పార్టీలకు ప్రభుత్వానికి చర్చలు మొదలయ్యాయి. మొగిలిచర్ల స్థూపావిష్కరణతో మొదలైన సంస్మరణ సభలు, స్థూపావిష్కరణలు రాష్ట్రమంతా వందలాదిగా జరిగాయి. అలాంటి ఒక స్థూపావిష్కరణకు నేను, చలసాని ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఒక సంస్మరణ సభకు వెళ్లాల్సి వచ్చింది. మొదటిసారి ఆయనను అతి దగ్గరిగా అర్థం చేసుకొనే అవకాశం కలిగింది. నేను ఉత్తరాంధ్ర అని అంటున్నాను కాని ఆ సందర్భంలోనే ఆయన 'అమ్మడూ... ఉత్తరాంధ్ర కాదు, కళింగాంధ్ర అనాలి' అని నన్ను సవరించాడు.

ఆ సభకు తెల్లవారుజాము నాలుగు గంటలకే లేచి వైజాగ్ నుంచి బయల్దేరాం. జీపులో పోతోంటే కుండపోత వర్షం. తార్రోడు మీద పోతున్నంత సేపు ఫర్వాలేదు. ఆ తర్వాత గతుకుల రోడ్డు. ఈ పెద్దాయన ఎంత ఇబ్బంది పడతాడో అనుకున్నాను. అయితే ఆయన ఆ ప్రాంతపు అమరవీరుల గురించిన మాటల్లో పడ్డాడు. 'ఇక్కడ ఎక్కువ మంది ఆదివాసీ అమరులు ఉన్నారు' అని తనకు తెలిసినవన్నీ చెప్పాడు.

కాసేపయ్యాక వర్షం పెరిగింది. రోడ్డు మీద బురద గుంటలు, గతుకుల్లో ప్రయాణం అసౌకర్యంగా తయారైంది. నేను వానలో తడుస్తున్న అడవి అందాలను చూస్తూ అయిదు నిమిషాలయ్యాక చలసాని వైపు చూశాను. ఆయన సుబ్బరంగా నిద్రపోతున్నాడు.

నేను 'చలసానీ నిద్రపోతున్నావా?' అని పిలిచాను. 'లేదురా అమ్మడూ...' అని కళ్లు తెరిచి చూసి మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు. కాసేపటి తర్వాత కోడి కునుకు నుంచి బయటపడి ఎక్కడి దాకా వచ్చాం అని డ్రైవర్‌ను అడిగాడు.

నాకు ఓ సందేహం వచ్చింది.

'చలసానీ.. మనం వెళ్లేది ఆదివాసీ ప్రాంతానికి కదా. వాళ్ల భాష నీకు వచ్చా? మనం తెలుగులో మాట్లాడితే వాళ్లకు అర్థం కాదు కదా?' అన్నాను.

దానికి ఆయన 'మన వాళ్లకు మన సంగతి తెలిసే పిలిచారు కదరా అమ్మడూ?' అన్నాడు.

అట్లా మా ప్రయాణం ఆరు గంటలు సాగింది.

పట్టణాలు, పల్లెలు, గూడేలు దాటుకుంటూ గమ్యానికి దగ్గరయ్యాం. దరిదాపుల్లోకి వచ్చాక జీపు దిగబడిపోయింది. నేను కిందికి దిగాను. బురదలో రెండు కాళ్లూ దిగబడిపోయాయి. చలసానీ అని పిలిచాను. ఆయన డ్రైవర్ భుజమ్మీద చెయి వేసి ఏం బాబూ జీపు తోయాలా? అని అడిగాడు.

జీపు తొయ్యాలంటే ముందు నీవు దిగాలి కదా చలసానీ! అన్నాను. ఆయన దిగి ప్యాంటు మోకాళ్ల దాకా మడుచుకొని సిద్ధమయ్యాడు. అక్కడికి వంద గజాల దూరంలో హాస్టల్ బిల్డింగ్ కనిపించింది. అప్పటికే ఆ దారిలో మీటింగ్‌కు వస్తున్న వాళ్లు చూసి ఆ గ్రామానికి వెళ్లి చెప్పారు. సభ నిర్వహిస్తున్న వాళ్లు వచ్చి మమ్మల్ని కలిసారు. మమ్మల్ని ఆ హాస్టల్లోకి భోజనానికి తీసుకెళ్లారు. అప్పటికింకా పిల్లలు కూడా తినలేదు. మాకు ముందు వడ్డించబోయారు. మా చుట్టూ మూగిన పిల్లల్ని చలసాని పలకరించాడు. వాళ్లతో మాట్లాడుతూనే 'పిల్లలతో కలిసే తింటాం...' అన్నాడు.

అప్పుడాయన పిల్లల గుంపులో కింద కూచోని అన్నం తిన్నాడు. ఆ రోజు గుడ్లు ఉడికించారు. చలసానికి ఆ పక్క ఈ పక్క కూర్చున్న ఆదివాసీ పిల్లలు తమ ప్లేట్లలోంచి గుడ్లు తీసి చలసాని పళ్లెంలో వేశారు. ఆయన మళ్లీ తీసి వాళ్లకే ఇచ్చాడు. చలసాని మేధావి, విరసం నాయకుడు కదా, కానీ ఆదివాసీ పిల్లలతో ఇలా ఎంత తొందరగా కలిసిపోయాడు? వాళ్లు ఎంతో నమ్మకం, విశ్వాసం అనిపిస్తే తప్ప దగ్గరికి రారు. ఆ రోజు ఆ దృశ్యం నాకు అపురూపంగా అనిపించింది.

అక్కడి నుంచి స్థూపావిష్కరణకు వెళ్లాలనుకున్నాం. కానీ అక్కడ బురద ఎక్కువగా ఉంది. కాలు తీసి కాలు పెట్టడానికి వీల్లేకుండా ఉంది. ఎలా వెళ్లాలి? అనుకుంటూ ఉంటే చలసాని మళ్లీ ప్యాంటు మోకాళ్ల దాకా మడిచి, చెప్పులు చేత పట్టుకొని కసపిస బురద తొక్కుకుంటూ ముందుకు కదిలాడు. ఆయన వెనక పిల్లలు, జనం కదిలారు. అంత వరకు స్థూపం దగ్గర కొద్దిమందే ఉన్నారు. సన్నగా వాన పడుతోంది.

స్థూపం దగ్గరికి వెళ్లి తలెత్తి చూస్తే అటూ ఇటూ అడవి దారులు గుండా వేలాది మంది ఆదివాసులు తరలివస్తున్నారు.

ఆదివాసీ అమరుల తల్లిదండ్రులు స్థూపావిష్కరణ చేశారు. ఆదివాసీ కామ్రేడ్స్ తమ భాషలో జెండా పాట పాడారు. అదయ్యాక వేదిక దగ్గరికి వెళ్లాలి. అది కొంచెం దూరంలో ఉంది. ఎందుకిలా దూరంలో స్టేజీ ఏర్పాటు చేశారో నాకు అర్థం కాలేదు. స్టేజీ అడవిని ఆనుకొని ఉంది. ఆ వాతావరణం చాలా అద్భుతంగా ఉంది. స్టేజీ అంటే మామూలు స్టేజీ కాదు. నాలుగు మూలల కర్రలు పాతి వాటి మీద దుంగలు పరిచి భుజాల ఎత్తున ఏర్పాటు చేశారు. దుంగలపైన చెట్టు కొమ్మలు, మట్టి పరిచారు. దాని మీద ఆకులు వేశారు. దానికి ఉన్న కర్ర నిచ్చెన మీద చలసాని చకచక ఎక్కేశాడు. దాని మీద వానకు తడిసి బురదగా ఉంది. మళ్లీ వాన మొదలైంది. వెంటనే ఆదివాసీ ప్రజలందరూ తమ చేతుల్లోంచి గొడుగులు తీసి పట్టుకున్నారు. మా ఇద్దరికీ ఒక గొడుగు ఇచ్చారు. ఇంతలో డప్పుల చప్పుడుతో ఇరవై మంది సాయుధ జననాట్యమండలి కళాకారులు స్త్రీ పురుష కామ్రేడ్స్ వేదిక మీదికి వచ్చారు. వాళ్లందరి భుజాలకు తుపాకులు ఉన్నాయి. సాయుధ జెఎన్ఎంను చూసి క్షణ కాలం గుండె జల్లుమన్నది. కానీ వాళ్లు రావడంతోనే స్టేజీకి కొత్త అందం వచ్చేసింది.

నేను చలసాని వైపు చూశాను.

ఆయన పట్టలేని ఆనందంతో 'మనవాళ్లు వచ్చేశారా?' అన్నాడు. వాళ్లు ముందు చలసానికి చేతులు కలిపి లాల్‌సలాం చెప్పారు. ఆయన వాళ్లందరినీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. వాళ్లు వేదిక మీద ఒక మూల తుపాకులన్నీ పెట్టి తడవకుండా పాలిథీన్ కవర్ కప్పేసి పాటలు అందుకున్నారు.

వాన హోరు తగ్గి పాటల జోరు మొదలైంది. ఎంత చర్చల సమయమైనా.. శత్రువును నమ్మడానికి లేదు కదా? అని నేను చుట్టూ చూస్తున్నాను. కానీ చలసాని ఇవేవి ఆలోచించకుండా కళాకారుల్లో కలిసిపోయి కోరస్ ఇస్తున్నాడు. కొంచెం సేపటికి సాయుధ జననాట్యమండలి వాళ్లతో పాటు లయబద్ధంగా చిందులు వేయడం కూడా మొదలుపెట్టాడు. నా గొడుగు కింది నుంచి ఆయన వెళ్లిపోవడంతో నేను దాన్ని తీసి పక్కన పడేశాను. ఆయన ఆ క్షణాన ఎంతగా ఆటపాటల్లో కలిసిపోయాడంటే.. డెబ్బై ఏళ్ల చలసాని ప్రసాద్ ఇరవై ఏళ్లలోకి మారిపోయినట్లు చిత్రంగా తోచింది. ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల వయసున్న కళాకారులు వేదిక మీద బురదలో కాళ్లు దిగబడి పోతుంటే కూడా ఉధృతంగా ఎగురుతూ, గంతులేస్తుంటే అది ఎక్కడ కూలిపోతుందో అని నాకు భయం పట్టుకుంది.

అది నా జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఘటన.

ఇది జరిగిన పదిహేను రోజులకు అనుకుంటాను... బంధు మిత్రుల సంఘం తరపున విశాఖపట్నం జిల్లా అమరవీరుల సంస్మరణ సభ వైజాగ్‌లో జరపాలనుకున్నాం.

జిల్లా అమరవీరుల గురించి మా దగ్గర లిస్టు కూడా లేదు. చలసానితో మాట్లాడుతుంటే ఎన్నో పేర్లు తెలిశాయి. వాళ్లలో ఎక్కువ మంది ఎక్కడెక్కడి నుండో వచ్చి విశాఖ పట్టణ, గ్రామీణ ఉద్యమాల్లో పని చేసి అమరులైన వాళ్లే. విశాఖపట్టణానికి దగ్గర్లో స్థానిక అమరులు ఒకరిద్దరు ఉన్నారు. చలసాని ఆ వివరాలు మాకు చెప్పాడు.

విశాఖపట్నం ఉద్యమంలో అమరులైన వాళ్లు స్థానిక ఆదివాసీ కామ్రేడ్సే. వాళ్ల వివరాలు మాకు తెలియలేదు. అక్కడ ఒకటి రెండు కుటుంబాలు మాత్రమే పరిచయంలోకి వచ్చాయి.

ఇక ఈ క్రమంలో అమరుల బంధుమిత్రుల సంఘం జిల్లా కమిటీ ఏర్పాటుకు, సంస్మరణ సభకు సంబంధించిన పనులన్నీ చలసాని సాయంతోనే జరిగాయి.

ఈ సందర్భంగా కమిటీ పెట్టడానికి తగినంత మంది లేరని అర్థమైపోయింది. సభకు ముందు రోజు సాయంకాలం ఈ సంగతే చలసానితో అన్నాను.

దానికాయన 'ఏరా... నన్ను కమిటీలోకి తీసుకోవా? మా ఇంట్లో ముగ్గురు అమరులున్నారు కదా?' అన్నాడు.

నేను తెల్లబోయాను.

ఆయన ముఖంలోకి చూశాను. సరదాగా అంటున్నాడేమో అనుకున్నాను. అట్లా ఏం లేదు. ఒక అవసరం తీర్చగలనా? అనే తాపత్రయం మాత్రమే కనిపించింది.

అప్పటికి నాకు ఆ విషయాలేవీ తెలియవు. ఆయన చెప్పలేదు కూడ. చలసాని ఆయన అల్లుడు బాలకృష్ణ తప్ప నాకు ఎవ్వరూ తెలియదు. అప్పుడే అడిగి తెలుసుకున్నాను.

అంతా అయ్యాక... 'మరి నన్ను కమిటీలోకి తీసుకుంటావా?' అని మళ్ళీ అడిగాడు.

కమిటీ పెట్టలేమనే నా దిగులు పోగొట్టి నన్ను ఉత్సాహపరచడానికి అడుగుతున్నాడని అప్పటికీ అనుకున్నాను.

'భలే వాడివే. చలసాని అంటే విరసం చలసాని కదా. నిన్ను ఇంకో సంఘంగా ఎవరైనా ఎట్లా చూస్తారు?' అన్నాను.

దానికాయన 'ఏరా బోడి...! అంతేనంటావా? నీవు ఎట్లంటే అట్లే-' అని నిండుగా అన్నాడు. చలసాని నిర్మాణ నిబద్ధత గల నాయకుడైన కార్యకర్త అదీ సాహిత్య రంగంలో అపారమైన గుర్తింపు పొందిన రచయితగా. అయితే ఆయన బంధుమిత్రుల సంఘం సభ్యుడు కాదని ఏనాడూ మాకు అనిపించలేదు. బంధు మిత్రుల సంఘం చేస్తున్న పనులు అంతక ముందు విరసం చేసి ఉన్నందు వల్ల, ఇప్పటికీ పనుల్లో భాగమవుతున్నందువల్ల కూడా ఉత్తరాంధ్ర నుంచి ఒడిషా వరకు చలసాని మా సంఘానికి పెద్ద దిక్కు. ఆయన అండదండలు లేకుంటే మాకు ఎంత కష్టంగా ఉండేదో. ఏవోబీ ప్రాంతంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా బయల్దేరే ముందు చలసానికి ఫోన్ చేసి చెప్పేవాళ్లం. మేం రైలు దిగేసరికి చెప్పులు వేసుకుని సిద్ధంగా ఉండేవాడు. తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో కష్టభరితమైన ప్రాంతాలకు వెళ్లేటప్పుడు చలసాని ఉంటే నిశ్చింతగా ఉండేది.

అలాంటి అనుభవాలు ఎన్ని ఉన్నాయో సమగ్రంగా చెప్తేనే ఆయన అమరుల కుటుంబాలకు చేసిన సేవ మాత్రమేగాక చలసాని వ్యక్తిత్వం కూడా అర్థమవుతుంది. వయసు రీత్యా శవ స్వాధీనానికి వెళ్లే ప్రయాణాల్లో ఆయనకు ఎక్కడైనా ఇబ్బంది కలుగుతుందేమో అని మేం అనుకోవాల్సిందే కాని ఆయన ఏ మాత్రం ఇబ్బంది పడేవాడు కాదు. లోపల ఇబ్బంది పడుతూ బైటపడకుండా దాచుకోవడం కాదు. అదే నిజమైతే దాగదు కదా? చలసాని తన స్వభావం వల్లనే చాలా కష్టభరితమైన, తీవ్ర అసౌకర్యమైన పరిస్థితుల్లో కూడా కొంచెం కూడా ఇబ్బంది పడేవాడు కాదు. ఎండను మాత్రం చలసాని భరించలేకపోయేవాడు. అయినా మిగతా పనులకంటే అమరుల పనుల్లో ఎండ సమస్యను కూడా అధిగమించేవాడు. విప్లవానికి, అమరులకు సంబంధించిన ఏ పని అయినా అట్లా చేయడం ఆయన విలువ. దీంతో మేం ఆయన మీద అంతగా ఆధారపడేవాళ్లం. బహుశా వయసు, ఆరోగ్యం రీత్యా ఈ తిరుగుళ్లేమిటని ఆయన్ను అదుపు చేసే వాళ్లు ఇంట్లో ఎవరూ లేపోవడం వల్ల కూడా ఆయన చివరి రోజుల్లో కూడా ఈ విలువ పాటించగలిగాడు.

చలసాని పక్కన ఉంటే ఎలా ఉంటుందో ఒక ఉదాహరణ చెప్పాలి.

* * *

నాలుగేళ్ల కింద విశాఖ లోతట్టు ఏజెన్సీలో ఎన్‌కౌంటర్ జరిగింది. ముగ్గురు విప్లవకారులు అమరులయ్యారు. మృతదేహాలు నర్సీపట్నం మార్చురీలో ఉన్నాయి. అప్పుడు గంటి ప్రసాదం గారు కోరాపుట్ జైల్లో ఉన్నారు. ఆయన్ను కలవడానికి చలసానితో పాటు రెండు రోజుల కిందే వెళ్లి వచ్చాం. మేం హైదరాబాద్ వెళ్లే సరికల్లా ఈ ఎన్‌కౌంటర్ వార్త. దీంతో మేం మళ్లీ బయల్దేరాం. వైజాగ్‌లో చలసాని ఒక జీపు మాట్లాడి సిద్ధంగా ఉన్నాడు.

అది తెలంగాణకు వ్యతిరేకంగా సమైక్య ఆందోళనలు ఉధృతంగా జరుగుతున్న కాలం. మేం నలుగురం చలసానితో కలిసి వైజాగ్‌లో బయల్దేరాం. ఆ రోజు సమైక్యవాదుల రాస్తారోకో నడుస్తోంది. దారి పొడవున వాహనాలు ఆగిపోయాయి. మేం భయపడిపోయాం. ఆ పరిస్థితిలో నర్సీపట్నం వెళ్లగలమా! అప్పటికి ఎన్‌కౌంటర్ మృతులు ఎవరో కూడా తెలియదు. బంధువులకు తెలిసి వచ్చే వరకు శవాలను భద్రపరచమని పోలీసులకు చెప్పి, తగిన ఏర్పాట్లు చేయాలి. అప్పటికే రెండు రోజులైంది. ఈ రోజు గడిస్తే పోలీసులే ఖననం చేయవచ్చు. ఎలాగైనా వెళ్లి డీఎస్పీని కలిసి శవాలను స్వాధీనం చేసుకోవడమో, లేక కుటుంబాలు వచ్చే వరకు ఎదురు చూడటమో చేయాలి. మరో పక్క అనాథ శవాలని ఇవ్వమని కోర్టులో పౌరహక్కుల సంఘం వాళ్లతో పిటీషన్ వేయించే ప్రయత్నం చేస్తున్నారు.

గంట ప్రయాణమయ్యాక ఓ మండల కేంద్రానికి చేరుకున్నాం. రోడ్డు మీద మా వాహనాన్ని ఆపేశారు. ఇక ముందుకు పోగలమనే ఆశ నశించింది. జై సమైక్యాంధ్ర అంటూ జనాలు మా జీపును చుట్టుముట్టారు. చలసాని కిందికి దిగి కొంచెం దూరంలో ఉన్న వాళ్ల నాయకుల దగ్గరికి వెళ్లి తన పేరు చెప్పి, 'మేం ప్రత్యేక తెలంగాణకు అనుకూలం. మీరు సమైక్య రాష్ట్రం కోరుకోవచ్చు. అది మీ హక్కు. అయితే అక్కడ పోలీసులు ముగ్గురు నక్సలైట్లను అన్యాయంగా కాల్చేశారు. వాళ్లు మీ కోసం, మా కోసం, తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమల కోసం ప్రాణ త్యాగం చేశారు. ఆ శవాలను స్వాధీనం చేసుకోవడానికి మేం పోతున్నాం. మేం చివరి చూపు చూడాలనుకుంటున్నాం. మాకు దారి ఇవ్వండి...' అన్నాడు.

రెండు నిమిషాలకల్లా మేం అక్కడి నుండి బైటపడ్డాం.

మాలో చలసాని, అంజమ్మ తప్ప మిగతా వాళ్లది తెలంగాణ. 'చలసానీ... మనం తెలంగాణకు అనుకూలం అని చెప్పడం దేనికి?... వాళ్లకు కోపం వస్తుంది కదా?' అని నేను అన్నాను. 'ఏరా అమ్మడూ... ఏమైనా తప్పు మాట్లాడానా? మనం ఎవరమో చెప్పకపోతే వాళ్లకు ఎలా తెలుస్తుంది?' అని, అమాయకంగా అడిగాడు. అప్పటికి ఆ సంగతి వదిలేశాం. ఆయన మాత్రం సమైక్యవాదం మీద చిర్రుబుర్రులాడుతూనే ఉన్నాడు.

ఇంకో అరగంటకు ఇంకో ఊళ్లో సమైక్యాంధ్ర వాదులు ఆపేశారు. చలసాని దిగిపోయి, సరిగ్గా ఇంతకు ముందు చెప్పిందే చెప్పాడు. జీపు ముందుకు కదిలాక 'చలసానీ... నీవు అన్ని చోట్ల మనం తెలంగాణకు అనుకూలం అని చెబితే వాళ్లకు కోపమొచ్చి మీదపడి కొట్టినా కొట్టొచ్చు...' అన్నాను. దానికాయన సీరియస్‌గా 'కమ్యూనిస్టులు అభిప్రాయాలు దాచుకోకూడదురా' అన్నాడు.

ఆ రోజు నాలుగైదు చోట్ల చలసాని ప్రసాద్ అనే పేరే మాకు దారి ఇప్పించింది. చివరికి నర్సీపట్నం చేరుకున్నాం. అక్కడ డీఎస్పీ కూడా చలసానిని గుర్తు పట్టాడు. ఆయన తనకు ఎలా తెలుసో, ఎవరెవరి ద్వారా తెలుసో చెప్పడం మొదలు పెట్టాడు. చలసాని మొదట తల ఊపి ఒకటి రెండు మాటలు కలిపినా, ఆ తర్వాత డీఎస్పీ ఇంకా మాటలు కొనసాగిస్తుండటంతో .. మధ్యలో చలసాని జోక్యం చేసుకొని ఆ శవాలను భద్రపరిచారా? మృతదేహాలను టీవీలో క్లోజప్‌లో చూపించండి, మెయిన్ పేపర్లలో అచ్చేయించండి అని అడగడం మొదలు పెట్టాడు. అదంతా వేరే కత. ఆయన పేరు ప్రతిష్టలను, ఆయనలోని పసిపిల్లవాడ్ని కలిపి అర్థం చేసుకునే అరుదైన అనుభవం ఇది.

అట్లాగే మహబూబ్‌నగర్‌కు చెందిన కామ్రేడ్ రాములు ఒడిషా విప్లవోద్యమంలో పనిచేస్తూ బూటకపు ఎన్‌కౌంటరైనప్పుడు, అనంతపురానికి చెందిన కా.సంజీవప్ప, ఖమ్మం జిల్లాకు చెందిన కా.మంగన్న అమరులైనప్పుడు కూడా బంధుమిత్రుల సంఘం సభ్యులతో చలసాని వెళ్లి వచ్చాడు. ఆ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు ఏవి జరిగినా, సంస్మరణ సభలు జరిగినా

చలసాని సహాయం, భాగస్వామ్యం లేకుంటే మా సంస్థ ఇన్ని పనులు చేయగలిగేదా అనిపిస్తోంది. ఈ మాట అంటే చలసాని ఒప్పుకోడేమో.

చలసాని ఎప్పుడూ అనేవాడు... 'మనమెంతరా .. బేడా పరకగాళ్లం...' అని. ఇందులో ఆయన వినయం ఉంది. పేద ప్రజల దుస్థితి ఉంది. శవాల స్వాధీనానికి, సంస్మరణ సభలకు వెళ్లినప్పుడు కూడ చలసాని తాను నాయకుడిలా ప్రవర్తించేవాడు కాదు. ఎలాంటి ఇబ్బంది, అవసరం వచ్చినా తనే ముందుండేవాడు. అది ఎలాంటి పనైనా చేయడమే తన బాధ్యత అనుకునేవాడు.

ఏదైనా 'ఇలా చేద్దాం... చలసానీ' అంటే 'అంతేనా అమ్మడూ...!' అనేవాడు. ఆయన తనను తాను నాయకుడు అనుకోని నాయకుడు. అందుకే ఎంత చిన్న పని అయినా, పెద్ద పని అయినా, ప్రమాదకరమైన వ్యవహారమైనా వెనకా ముందూ చూసుకోనేవాడు కాదు. అందులో ఏ గుర్తింపూ కోరుకోనేవాడు కాదు. అందుకే ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నదో, అంత గుర్తింపు లేని నాయకుడు. చలసాని ప్రసాద్‌తో కలిసి తిరిగేటప్పుడు ఇవి రెండూ నేను చూశాను. ఉనికిగా ఆయన నాయకుడు. చలనంలో, ఆచరణలో ఆయన కార్యకర్త. అన్నిటి పట్ల ఆయన నిబద్ధత చూసి ముచ్చటనిపించేది. ఈ పన్నెండేళ్లలో ఆయనతో కలిసి ఎన్నో పనులు చేసినా అంత పెద్ద మనిషి పక్కన ఉన్నాడనే ఫీలింగ్ కలగలేదు. ఆయన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఏర్పాటు చేయాలని ఎన్నడూ అనిపించలేదు. అలాంటి వాళ్లు కోరుకోకపోవచ్చు కూడా. కానీ మనకు అనిపించకపోవడమే చలసాని ప్రత్యేకత. విశిష్టత. ఆయనతో ఉంటే ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదు. గొప్ప భరోసా ఇచ్చే పెద్ద మనిషి మనకున్నాడనే నమ్మకంతో పాటు పసిపిల్లవాడితో ఉన్నంత ఆహ్లాదంగా కూడా ఉండేది.

ఆయన అమరుడు కావడానికి ఇరవై రోజుల ముందు కూడా బంధుమిత్రుల సంఘం పనిలో భాగమయ్యాడు. కా. సూర్యం శవాన్ని పోలీసులు పాడేరు దగ్గర ఖననం చేశారని తెలిసి మా సంఘం సభ్యులు, అమరుడి కుటుంబ సభ్యులు కలిసి వెళ్లారు. సూర్యం తల్లిదండ్రులు, మేనత్తతోపాటు అంజమ్మ, పౌరహక్కుల సంఘం వాళ్లు, స్థానిక మిత్రులు బయల్దేరుతున్నట్లు తెలియగానే చలసాని సిద్ధంగా ఉన్నాడు. పాడేరు వెళ్లి శవాన్ని తవ్వించి తీసుకొని వచ్చారు. ఆ సంగతి కా.సూర్యం మేనత్త చెప్తూ... 'నాలుగు రోజుల పాటు మట్టిలో ఉన్న శవాన్ని బైటకి తీసేటప్పుడు ఆ దుర్గంధానికి మేమే అక్కడ ఉండలేకపోయాం. ఆ పెద్దాయన అట్లే నిలబడి దగ్గరుండి అన్నీ చేయించాడు...' అన్నది.

పురుగులు పడ్డ, సగం మట్టిలో కలసిపోయిన మృతదేహమని చలసాని అనుకుంటాడా? జీవితమంతా విప్లవానికి వెచ్చించిన మనిషికి అక్కడ ఓ అమరవీరుడి త్యాగమే కనిపిస్తుంది. తుఫానుకు తడుస్తూ, బురద గుంటలు దాటుకుంటూ ప్రజా సంఘాలతో చలసాని అక్కడికి వెళ్లాడు. అది బహిర్భూమి కావడం వల్ల చిత్తడికి భరించలేని దుర్గంధంగా ఉంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిలో చలసాని ఎక్కడ జారిపడతాడో అని మా సంఘం వాళ్లు ఆయన్ను పట్టుకోబోయారు. కానీ వాళ్లెక్కడ పడిపోతారని చలసాని ఆసరా ఇచ్చాడట. అక్కడ వారు ఎవరికి ఎవరు ఆసరా ఇచ్చారోగాని చలసాని ఈ వయసులో కూడా అమరుల కుటుంబాలకు మాత్రం ఆసరాగానే నిలిచాడు.

ఆ అనుభవం చెప్తూ అంజమ్మ 'సూర్యం శవాన్ని తవ్వి తెచ్చినప్పుడు చివరి దాకా చలసాని మనతోనే ఉన్నాడు...' అని మళ్లీ తనే సవరించుకుంటూ 'చలసాని మనతో రాలేదక్కా! మనమే చలసానితో వెళ్లాం' అన్నది. చలసానికి అమరుల బంధుమిత్రుల సంఘానికి ఉన్న అసలు అనుబంధం ఇది.

అమరవీరుల్లో కొద్దిమందికి తప్ప అనేక మందికి బైటి సమాజంలో ఏ గుర్తింపూ ఉండదు. అజ్ఞాతంలో ప్రాణత్యాగం చేసి రాలిపోతారు. వాళ్ల రక్తసంబంధీకుల పరిస్థితీ అంతే. చదువు, హోదా, గుర్తింపు, మాటకారితనం ఏమీ ఉండవు. బిడ్డ చనిపోయాక పుట్టెడు దుఃఖం తప్ప ఎక్కడికి పోవాలో, ఎలా శవం తెచ్చుకోవాలో తెలియదు. పైగా పోలీసుల భయం. సంఘ సాయకత్వానికి కూడా ఏ నైపుణ్యాలు లేవు. చదువు, వ్యవహారాలు పెద్దగా తెలియవు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా తోసుకొని ముందుకే వెళ్లడం మాత్రం తెలుసు. అంత వరకే. ఒక రకంగా ఇది కాటికాపరుల సంఘం. ఈ పని చేస్తున్నందుకు చైతన్యం పొందిన అమరుల కుటుంబాలు గర్వపడుతున్నాయి. దీనికి ఉత్తరాంధ్ర నుండి ఒడిషా దాకా చలసాని ఆలంబన అయ్యాడు. ఆయన చివరి రోజుల్లో కూడా అమరుల కుటుంబాల కోసం పని చేశాడని చెప్పడం చలసాని వ్యక్తిత్వానికి గొప్ప ఏమీ కాదు. ఇప్పుడు చెప్పకపోతే మళ్లీ చెప్పే అవకాశం వ్యక్తిగా నాకు, అమరుల బంధుమిత్రుల సంఘానికి వస్తుందో లేదో. గోరు మాధవరావు, గంటి ప్రసాదం, చలసాని ప్రసాద్ అమరుల కుటుంబాలతో చేయి చేయి కలిపి నిలబడ్డారు. ఈ ముగ్గురూ లేకపోవడం ఉత్తరాంధ్ర విప్లవోద్యమానికేగాక అమరులు బంధుమిత్రుల సంఘానికి కూడా పూడ్చలేని నష్టం. బొబ్బిలిలో గంటి ప్రసాదంగారి శవంపై పడి చలసాని 'గంటయ్యా...లే... గంటయ్యా లే...' అని రోదించడం నాకు ఎప్పటికీ గుర్తు ఉంటుంది. ఆయన చెప్పినట్లు కన్నీళ్లకు మనిషిని బతికించే శక్తి ఉంటే చలసాని కన్నీళ్లకు గంటయ్య బతికేవాడే. చలసానిని కూడా మన కన్నీటితో బతికించుకునే వాళ్ళమే... కానీ ఇవేవీ నిజం కాదు. అందుకే కన్నీటితో 'మీరెత్తిన ఎర్ర జెండా ఎత్తిపడతాం' అనే నినాదం ఇస్తాం. దాన్ని ఆచరిస్తాం.

చలసానిలాగా తమకంటూ ఏమీ ఉంచుకోకుండా, దాచుకోకుండా సమాజపరం అయిన కామ్రేడ్స్ ఎందరో ఉన్నారు. కానీ చలసాని ఏ గుర్తింపు కోరుకోలేదు. గుర్తింపు కోసం ఏమీ చేయలేదు. నేను, నాది అనే ఆలోచనే లేకపోవడం వల్లే చలసానికి అట్లా జీవించడం సాధ్యమైంది.

* * *

సరిగ్గా ఈ వ్యాసం రాస్తున్న టైంకి మల్కాన్‌గిరి మార్చురిలో ఓ కామ్రేడ్ మృతదేహం ఉన్నట్టు తెలిసింది. జూలై 31వ తారీకున సుకుమా-మల్కాన్‌గిరి సరిహద్దులోని పాడియా అనే గ్రామం దగ్గర, ఇరవై మంది జాయింట్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టి కాల్పులు జరిపారు. ఇందులో ముగ్గురు మహిళా కామ్రేడ్స్ చనిపోయారు. ఇద్దరు ఆదివాసీ కామ్రేడ్స్‌తో పాటు హైదరాబాద్‌లోని నాగమయ్యకుంటకు చెందిన కవిత కూడా అమరురాలైంది. ఆదివాసీ కామ్రేడ్స్ శవాలను వాళ్ల రక్త సంబంధీకులు తీసుకెళ్లారు. కవిత శవాన్ని తీసుకురావడానికి మా సంఘం సభ్యులు బయల్దేరారు. చలసాని ఉన్నప్పుడు మా సంఘం నుంచి ఎవరం ఆ ప్రాంతానికి వెళ్లినా దారి కోసం తడుముకోలేదు. ఈ క్షణాన విశాఖపట్నం చేరిన బంధుమిత్రుల సంఘం సభ్యులు, రక్తసంబంధీకులు ఎటువైపు వెళ్లే దగ్గరో తెలుసుకోడానికి ఇబ్బందిపడాల్సి వచ్చింది.

విప్లవోద్యమం కోసమే కాదు చలసానీ!

చదువు రాని, దారులు కూడా తెలియని అమరుల బంధు మిత్రుల సంఘం సభ్యులు, కార్యకర్తలు, రక్త సంబంధీకుల కోసమైనా నీవు వందేళ్లు బతక కూడదా చలసానీ... అంటూ పదే పదే వలపోసుకుంటూ మా ప్రియమైన చలసానికి అమరుల రక్త సంబంధీకుల అశ్రు నివాళి.

అరమరికలు లేని ఉద్యమ నేత

శిఖామణి

ఈ నెల 10, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం, అకడమిక్ స్టాఫ్ కాలేజీ ఆడిటోరియం, సమయం సాయంత్రం 5 గంటలు కావొస్తోంది. నిర్వాహకులు కంగారుగా అటూ ఇటూ తిరుగుతున్నారు. విషయం ఏమిటంటే సాయంత్రం 6 గంటలకు ముఖ్య అతిథిగా వచ్చి గ్రంథాలను ఆవిష్కరించవలసిన ఉపాధ్యక్షులు అనివార్య కారణాల వల్ల ఒక గంట ముందే వస్తున్నారని వార్త. ఎలా? ఈలోగా రానే వచ్చారు. తప్పదు సభ మొదలుపెట్టాలి! ముందు వరుసలో మౌనిలా చేతులు కట్టుక్కూచున్న వ్యక్తిని ఆపద్ధర్మ అధ్యక్షునిగా పిలిచారు. ఆయన వచ్చి సభను నడిపారు. ఆయన పేరు చలసాని ప్రసాద్. అది నా గ్రంథాల ఆవిష్కరణ సభ. ఒక రకంగా అది నాకు దక్కిన అదృష్టం. జూలై 25, విజవాడలో వుండి, ఖాదర్ మొహియుద్దీన్‌కు ఫోను చేస్తే ఎవ్వరూ మాట మాత్రానికైనా ఊహించని దుర్వార్త.

ఉదయం చలసాని ప్రసాద్ గారు చనిపోయారనే మరణవార్త! ఆయనతో గడిపిన పది పదిహేను రోజులకే ఇలాంటి వార్త వినవలసి రావడం దురదృష్టం కాకమరేమిటి? తెలుగులో ఒకే పేరుతో ఉన్న రచయితలు నలుగురైదుగురు ఉండొచ్చు. కానీ ఇంటి పేరుతో సహా ఒకే పేరు గలిగే వారు ఇద్దరే ఉన్నారు. ఒకరు చలసాని ప్రసాదరావు. సీనియర్ జర్నలిస్టు. కళపత్రిక సంపాదకులు, ఇలా మిగిలేం రచయిత. మరొకరు విరసం నేత చలసాని ప్రసాద్. ఇద్దరితోనూ నాకు అంతో ఇంతో పరిచయం ఉండటం అదృష్టంగా భావిస్తారు.

80వ దశకంలో నేను ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థిగా ఉన్నప్పటి నుండీ చలసాని ప్రసాద్ గారితో పరిచయం. అప్పట్లో 5/37 ఆంధ్రా యూనివర్సిటీ స్టాఫ్ క్వార్టరు కవులకు కళాకారులకూ కేంద్రంగా ఉండేది. ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తుమ్మల వేణు గోపాలరావు గారి నివాసం అది. వారి అల్లుడైన మా మాష్టారు అత్తలూరి నరసింహారావు గారిని కలుసుకోవడానికి మేం సాయంకాలం అక్కడికి చేరే వాళ్లం. బహుశా పై పోర్షన్‌లో చలసాని ప్రసాద్‌గారి కుటుంబం ఉండేదనుకుంటాను. కృష్ణక్క అని ఆప్యాయంగా అందరితో పిలువబడే కృష్ణబాయి గారి గురించి ప్రత్యేకించి చెప్పేదేముంది. ఆ ఇంట్లో నేను తెలుగు సాహిత్యంలో ఎందరో మహామహులను ప్రత్యక్షంగా చూసాము. అదిగో అక్కడ పొట్టి చేతుల చొక్కాతో, వాడిగా వేడిగా జరిగే సాహిత్య గోష్ఠుల్లో పాల్గొనే వారు ప్రసాద్ శ్రీశ్రీ వీరాభిమాని! రావి శాస్త్రిగారు కాబోలు విరసంతో వీరశైవులు అని ఒక వ్యాసం రాసినట్టు గుర్తు! శైవులు శివారాధకులు. కానీ ప్రసాద్ తానే ఒక బోళాశంకరుడు. ఇది గుణార్థమే కాని నిందార్థం కాదు. శత్రువైరుధ్యాలతో పోరాటం చేస్తూనే మిత్ర వైరుధ్యాలను ఆయన ఎంతో సంయమనంతో అధిగమించడానికి ప్రయత్నించారు. ఇప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. విరసంలో చేరే నాటికి రచయితగా ఇంకా వెన్నెముక గట్టిపడకపోవడం వల్లనేమో, విప్లవ రచయితల సంఘంలో రచయితలు లేరు అనే మాటను చాటుమాటుగానైనా ప్రసాద్‌ను ఉద్దేశించి అనేవారు. దళిత సాహిత్య ఉద్యమం ఉరకలెత్తిన కొత్తలో కవుల నోటిదురుసుతనం ఎంతమంది సానుభూతిపరులను దూరం చేసుకుందో చూసిన మౌనసాక్షిని నేను. కానీ ప్రసాద్ అలా కాదు. తన వాదన వినిపిస్తూనే ఇలా కూడా ఆలోచించవచ్చేమో అని సూచించేవారు. రాష్ట్ర విభజన సమయంలో విభజనను సమర్థిస్తూనే, మిగిలిన ఆంధ్రప్రదేశ్ గురించి సూచనలను ఉత్తరాల రూపంలో పత్రికలకు రాసేవారు. విశాఖ నుండి ఫోన్ చేసి పఠాభిది ఫలానా కవిత దొరికింది. అది నీ పరిశోధనలో చేరిందా అని అడిగేవారు. లేదంటే కాపీ పంపుతాను చేర్చు అనేవారు. అలాగే తిలక్ కవిత పేరు ఒకటి చెప్పి విశాలాంధ్ర వారి పుస్తకంలో ఉందో లేదో చూసి చెప్పమనేవారు. పఠాభి, తిలక్‌ల అముద్రిత కవితల గురించి పత్రికలో వ్యాసం కూడా రాసారు. మొన్నటికి మొన్న నా తెలుగు మరాఠీ దళిత కవిత్వం పరిశోధన పుస్తకాన్ని ఏకబిగిన చదివేసి, కారంచేడుపై నేను రాసిన కవిత నువ్వు చూళ్లేదా అన్నారు. లేదూ అంటే, దళిత మేనిఫెస్టోలో ఉంది చూడు. దొరక్కపోతే కుసుమ సత్యనారాయణ అందిస్తాడు అన్నారు. విరసంలో ఎంత మంది లేరు లోపలా బయటా! బహుశా అంతటా అందరిలో ఉన్నవాడు ప్రసాద్ ఒక్కడే! నిబద్ధత గల సంస్థల్లో బహుశా ప్రసాద్‌లా అంత ఫ్లెక్సిబిలిటీ ఉన్నవారు చాలా అరుదుగా కనిపిస్తారు. పైకి ఆవేశపరుడిలా కనిపించినా లోపల ఉన్న మెత్తని సంస్పందన (సెన్సిబిలిటీ) ఆయన్ను అందరివాడిని చేసిందనుకుంటాను. సిద్ధాంతాలకు, భావ జాలాలకు అతీతంగా ప్రసాద్‌ని అందరూ తమ వాడిగా భావించారంటే, చట్రాలకు లొంగని గొప్ప హ్యూమన్ చట్ ప్రసాద్‌లో ఉండబట్టే! శ్రీశ్రీ, చలసానిల సంబంధం గురించి ఇవాళ కొత్తగా చెప్పుకోనవసరం లేదు. కానీ శ్రీశ్రీ సాహిత్యం సంపుటాలకు ఆయన వద్ద శ్రమ, పెట్టిన శ్రద్ధ పది విశ్వవిద్యాలయాలు, అయిదు అకాడెమీలు కలిసినా చెయ్యలేని గొప్పపని. నిజంగా ప్రసాద్ సేకరించిన ఫుట్ నోట్స్ వివరాలు ఒక డాక్టరేట్ పట్టాకు అర్హమైనవి. కాళిదాసుకు భారవి, జాన్సన్‌కు బాస్వెల్, శ్రీశ్రీకి చలసాని అని తెలుగు సాహిత్యం ఏనాడో నిర్ధారణకు వచ్చేసింది. పూర్వం సొంత గ్రంథాలయాలు ఉన్న వ్యక్తులు గురించి చెప్పేటప్పుడు నార్ల వెంకటేశ్వరరావు, కొంగర జగ్గయ్య వంటి వాళ్ల పేర్లు వినబడేవి. మళ్లీ ఈ తరంలో అంత గొప్ప గ్రంథ సంచయాన్ని సేకరించిన గ్రంథ సంగ్రాహకుడిగా చలసాని పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. విశాఖలోని పౌర గ్రంథాలయానికి చలసాని ప్రసాద్ పేరు పెట్టేలా ఆయన మిత్రులు, అభిమానులు చొరవ తీసుకుంటే బాగుంటుంది. తెలుగు సాహిత్యకారులు, రచయితల సంఘాలు, ఉద్యమకారులూ చలసానిని రోల్ మోడల్‌గా తీసుకుంటే తెలుగు సాహిత్యంలో అందరూ కూచుని మాట్లాడుకునే ఒక ఉమ్మడి వేదిక ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. అరమరికలు లేని ఆత్మీయ మిత్రునికి సాహిత్యాంజలి!

సాహితీ సేనాని చలసాని

కె.వి.ఎస్. వర్మ

నిబద్ధతకు నిలువుటద్దం చలసాని ప్రసాద్. చలసాని మృతితో విరసం ఓ పెద్ద దిక్కును కోల్పోయింది. విరసం వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన ప్రతిభా పాటవాల గురించి నేను కొత్తగా చెప్పడానికేమీ లేదు. చలసానితో పరిచయం, అనుబంధం గురించి కాస్త చెబుదామనిపించింది. కాళీపట్నం రామారావు మాస్టారి యజ్ఞం కథల సంపుటి ఆవిష్కరణకు జ్వాలాముఖి, చెరబండరాజులతో కలిసి విశాఖపట్నం వెళ్లినప్పుడు మొదటిసారి శ్రీశ్రీనీ, చలసానినీ చూసాను. విరసం సభల్లోనూ పాల్గొన్నాను. పల్లెటూళ్లలో చేసేటంతగా ఆయన అతిథి మర్యాదలు చేశారు.

తర్వాత కొన్నాళ్లకు నేను జగదాంబ జంక్షన్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్నప్పుడు... ప్రసాద్‌ను చూసి, పలకరించాను. నేను సీతమ్మధార వెళ్తున్నానని మాటల్లో తెలుసుకుని, ఈ ప్యాకెట్ ఈనాడు ఆఫీసులో ఇవ్వగలరా... అని అడిగారు. అలాగే ఇస్తానని తీసుకున్నాను. అది ఏవో పుస్తకాలు రివ్యూ కోసం. కొన్నాళ్లకు నేను ఈనాడు విశాఖపట్నం ఎడిషన్‌లో చేరాక... ఆయన్ను అప్పుడప్పుడూ కలిసేవాడిని.

1984లో నా 'యుద్ధం' కథల సంపుటిని రావిశాస్త్రి అధ్యక్షతన కాళీపట్నం రామారావు ఆవిష్కరించారు. చలసాని ప్రసాద్, చందు సుబ్బారావు కథల బాగోగుల గురించి మాట్లాడారు. శిక్ష కథను సమీక్షిస్తూ... 'చెల్లీ చంద్రమ్మా' గేయం స్ఫూర్తితో రాశారనిపిస్తోందన్నారు. నేను మాత్రం జరిగిన ఓ సంఘటన ఆధారంగా రాశాను. విప్లవోద్యమంలో ఉంటూ, ఏదో ప్రలోభంతో జనజీవన స్రవంతిలో కలిసిన ఓ వ్యక్తి కథ గురించి మాట్లాడుతూ... కథ పేరు 'రోత' అని కాకుండా వేరే పేరు పెడితే బావుండేదన్నారు.

ఓ రోజున టర్నల్ చౌల్ట్రీకి ముందు జంక్షన్‌లో బస్సు కోసం నేనూ మా ఆవిడ, పిల్లలు ఎదురు చూస్తుంటే... చలసాని అటే వస్తూ ఆగారు. 'ఆకలి రాజ్యం' సినిమా చూసి వస్తున్నాం. చాలా బావుంది. శ్రీశ్రీకి మనం రుణపడి ఉంటే, గణేశ్ పాత్రోకు శ్రీశ్రీ రుణపడి ఉన్నాడు' అన్నాను. తప్పకుండా చూడండి అంటే, చిన్నగా నవ్వేసి, 'శ్రీశ్రీని బాగా ఉపయోగించుకున్నారని విన్నాను. వీలు చూసుకుని చూస్తాను' అన్నారు.

ఇద్దరం సీతమ్మ ధార ఏపీ హెచ్ బీ కాలనీలో ఉండేవాళ్లం. సహజీవనం అనే మాట పెద్దగా తెలియని రోజుల్లోనే, చలసాని విజయలక్ష్మితో సహజీవన తొలి అడుగు వేశారు. కడవరకూ వారు అన్యోన్యంగా ఉన్నారు. తన ఇద్దరు కూతుళ్ల నవత, మమతలను వాళ్ళ ఇష్ట ప్రకారం పెంచారు. నేను ఈనాడుకు రిజైన్ చేసి, రాజమండ్రి నుంచి సొంతంగా ఈవినింగ్ డైలీ తేదలిచానని తెలిసి, కొందరు మిత్రుల్లాగే ఆయన కూడా నన్ను ప్రోత్సహించలేదు. చేతులు కాలాక వాళ్లే కరెక్టు అని తెలుసుకున్నాను. శ్రీశ్రీ పుస్తకాల ప్రచురణకు సంబంధించి, ఆయన రాజమండ్రి వచ్చినప్పుడు మిత్రులు స్మైల్ ఇంట్లో దిగారు. తరచూ కలుసుకునేవాళ్లం. మా ఇంట్లోనూ ఉన్నారు. చదవడం, రాయడం... నిత్యం అందే పని. సాహిత్య పని రాక్షసుడాయన.

శ్రీశ్రీ సాహిత్య సారస్వం విషయంలో చలసాని చేస్తున్న కృషిని చూసి నేను ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోయేవాడిని. ముఖ్యంగా ఫుట్‌నోట్స్ రాయడానికి ఆయన ఎంత శ్రమ పడి ఉంటారో వాటిని చదివినప్పుడు అర్థమయ్యేది. విరసం తరఫున ఆయన సంకలనం చేసిన కొన్ని శ్రీశ్రీ పుస్తకాలను నేను ఆంధ్రభూమి, వార్త పత్రికల్లో సమీక్షించాను. వార్త దినపత్రికలో నేను పని చేస్తున్నప్పుడు చలసాని ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా... దర్శకుడు కె. వాసు ఇంటికి వెళ్లి, ఆయనను స్కూటర్ మీద మా ఇంటికి తీసుకెళ్లేవాడిని. అక్కడే మొదటిసారి ప్రముఖ దర్శకుడు ప్రత్యగాత్మతో మాట్లాడాను. ఒకటి రెండు సాహిత్య సభలకూ తీసుకెళ్లాను. చలసాని దారి చెబితే, మొదటిసారి వరవరరావు ఇంటికీ తీసుకెళ్లాను. బాగ్ అంబర్‌పేటలోని ఆర్కే ఇంటికీ మొదటిసారి ఆయనతో వెళ్లాను.

రావిశాస్త్రికి నివాళిగా ఆయన రచనల్లోని ఒక్కో వాక్యం తీసుకుని నేను రాసిన ఆరు కథల సంపుటి 'నేను నేనే'కు చలసాని చేతే ముందు మాట రాయించుకున్నాను. వెనుక మాట కె.ఎన్.వై. పతంజలి రాశారు. 'ఆంతర్యం, అంతరార్థం 'పేరుతో''... ఇదంతా రావిశాస్త్రిమయం. సర్వస్వం అనంగానీ సర్వం శాస్త్రిగారే' అని మొదలుపెట్టారు చలసాని. తర్వాత... 'ఇక అంతరార్థానికి వద్దాం. ఈ పుస్తకంలో 'వలస' గురించిన 'ఊసులు'న్నాయి. ఇవి అలనాటి తెల్లవాళ్లవీ, పడమటి వాళ్లవీ కావు - ఈనాటివి' అన్నారు. విశాఖపట్నానికి ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరు వచ్చి, ఏం చేశారో వివరిస్తూ... 'ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే 'మా తెలంగాణ', 'మా తెలంగాణా' అంటూ మూసీ, మంజీరా, మున్నేరు, మానేరు రొద పెడుతున్నాయి. మనం పెడచెవిని పెడుతున్నాం. అందాకా ఎందుకు? మూసీ ఒడ్డున ఉన్న భాగ్యనగరంకి కనీసం ఒక మానవీయ విలువ ఉంది. ఆ తరువాతి ప్రభువులు దానిని హైదరాబాద్‌గా మార్చేశారు. అది ఇవాళ హైదరా'బాధ'గా మారింది. మన గాలి మనల్ని పీల్చనివ్వరు. మన నీరు మనల్ని తాగనివ్వరు. మన నేలన మనల్ని నడవనివ్వరు. పైగా వీటికి అందమైన ముసుగులు తొడుగుతారు. ఈ ముసుగు కప్పుకుని మన ముందుకు వచ్చిందే 'రేగడి విత్తులు'. దీనిలో 'వలస' ముద్ర పూరాగా ఉంది. అయితే, ఈ ముద్ర మీద 'శరీర శ్రమ' అనే అక్షరాలు రాసి, మనందరి కళ్లు కప్పుతున్నారు. చూశారా మరి? మోసం, దగా, దోపిడిలో కూడా కొత్త కొత్త ముసుగులు తగిలించుకుంటున్నాయి. మంది కళ్లు తెరిచిన కొద్దీ మాయగాళ్లు మరింత తెలివి మీరుతున్నారు. మీ మాయలు, మంత్రాలు మందికి తెలియజెప్పి వ్యథాబీజాలు ఎలా మొలకెత్తుతున్నాయో చూపించాలి' అని రాశారు. ప్రతి సమస్యనూ చలసాని అదే విధంగా విశ్లేషిస్తారు.

ఏదైనా విషయం వస్తే... వేదికపై మాట్లాడినట్టే మాట్లాడతారు చలసాని. నవ్వుతూనే చెప్పాల్సింది స్పష్టంగా చెప్పేస్తారు. మరో విరసం (విశాఖ రచయితల సంఘం)లోనూ రావిశాస్త్రి, కారాలతో పాటు ఆయనా చురుకుగా ఉండేవారు. విరసం ప్రారంభంలో చేరిన వాళ్లు తర్వాతి కాలంలో ఎలా మారినా... ప్రసాద్ వారి పట్ల పాత అభిమానమే చూపించడం నేను గమనించాను. శ్రీశ్రీ, రావిశాస్త్రి వంటి వారిని చలసాని ఎంత గాఢంగా అభిమానించారో, ఆరుద్ర వంటివారిని అంతే తీవ్రంగా అభిశంసించారు. వ్యక్తిగా, సాహితీపరునిగా కడదాకా నిత్య యవ్వనుడిగా ఉన్న చలసాని చిరస్మరణీయుడు.

కా. విజయ సంస్మరణలో చలసాని ప్రసాద్

కడసారి ఊసులు

వీడని జాడలు
మరవని మమతలు
నిత్య నూతన కాంతులు
వెదజల్లే
మా విజయకి
-మేమందరం-

విజయా!
నువ్వు విడనాడిన జగత్తు అలాగే ఉంది
సూర్యరశ్మిలో
చంద్రకాంతిలో
చుక్కల మెరుపులో

చిరుగాలి వీవనలో
నేలతల్లి పిలుపులో
జ్ఞాపకాల దొంతరలో

కాలగమనములో
ఊహాల వెల్లువలో
కలల విలుపులో
మెలకువ తలపుల్లో

మన ముంగిట తిరుగాడే
మానవులు నిన్ను మరవలేదు
నీ జ్ఞాపకాలు వారిని వీడలేదు

మానవుల మనుగడ
సామాజిక చైతన్యం
సహజీవన మాధుర్యం
మానవతా పరిమళాలు
మనలని విడనాడవు
మనకు మరపురావు

ఏనాటి చుట్టరికాలో
మళ్లీ మళ్లీ తిరుగాడుతున్నాయి
పాత చుట్టాల కొత్త గొంతుకలు
మనసుని ద్రవింపజేస్తున్నాయి

చూపుల, పిలుపుల
పరంపరలు ఎదలో ఊడలు దింపుతున్నాయి
మన మనసులు మారకపోయినా
మానవత మరింత చిక్కనౌతుంది

తుషార ఉషార వెల్లువలో
ఈదులాడుతుంది
బుజ్జితల్లి మరీ బెంగల తల్లి
అయిపోయింది, కుజ్జి బుర్ర కూడా

దూరదూర తీరాల
బాంధవ్యాలు, పిలుపులు
మన ఇంట్లో కొత్తవాళ్లు
సరికొత్త పాతవాళ్లుగా
కనిపిస్తున్నారు

పేర్లు రాసి నిన్ను ఖంగారు పెట్టను
కళ్లారా చూద్దువుగాని
మనసారా మాటాడుదువుగాని
ఎగతాళి, ఎకసక్కెం లేనేలేవు
తరతరాల కమ్యూనిస్టు బాంధవ్యం
సామ్యవాదపు అనురాగ రాగాలు

జగమంతా సమానత వెల్లివిరియాలి
అధోలోకపు జనావళి గొంతుపెగల్చాలి
సామ్యవాద మానవులే
చిరస్థాయిగా నిలుస్తారు

నీకోసం
ఎదురు చూసే నీ జనం

(విజయ సంస్మరణ దినం 06-05-2015

విజయని స్మరిస్తూ

(విజయ సంస్మరణ దినం 18-05-2015)

మా విజయా!
Art of life is better than anything అన్నాడొక రచయిత. అక్షరాలా, నూటికి నూరుపాళ్లు నిజం.
'నిజం నిజం నీవన్నది నిజం' అన్నాడోసారి శ్రీశ్రీ. మానవ మనుగడకి ఏడుగడ - అంటే రక్షణ - ప్రకృతేనన్నాడు కూడా శ్రీశ్రీ. ఇది అక్షరసత్యం. దీనికి ఢోకాలేదు.
ఎన్నెన్ని కొత్త సంగతులు తలెత్తినా పాతవి మరపురావు. మనం మరిచిపోం. మరిచిపోలేం కూడా.
అంతరంగం అట్టడుగున అంత మందిమీ మానవులమే. వారిలో మానవోత్తములుంటారు, మానవాధములూ ఉంటారు. మనం వింగడించుకుని అడుగు ముందుకి వేయాలి.
మన కీర్తి (మన కుజ్జి బుర్ర భార్య)కి ఇక్కడ జాబ్ వచ్చింది. బహుశా కుజ్జిబుర్ర కూడా ఇక్కడే సెటిల్ కావచ్చు. ఫ్యామిలి రీయూనియన్ అనుకోవడానికి ఆనందంగా ఉంది.
సాగర తీరాన సైకతసీమలో
అలల తాకిడిని తట్టుకుంటూ
నిన్ను తలుచుకుంటూ మాలో మేమే
నిన్ను ఆవాహన చేసుకుంటున్నాం
మన విశాఖ - In spite of హుద్ హుద్ - మన ఎదలో భద్రంగానే ఉంది. మన Human Association అజరామరం. నువ్వు, మా అన్నయ్య తెరవెనక ఉండిపోయారు. కాని మీ మాటలు, చేతలు, మీ ఇద్దరి Correctness మరపురావు. మన కుటుంబ శకటాన్ని ఒడుపుగా నడిపి, సమతుల్యం చెడకుండా నడిపింది మీరే inspite of us. ఇది

మరపురాని చలసాని

లోచన్

చలసాని ప్రసాద్ లేరు అనే వాస్తవాన్ని ఒప్పుకోవాలనిపించడం లేదు. హఠాత్తుగా చాలా డిస్టర్బ్ చేసి వెళ్లిపోయారాయన. స్నేహాన్ని మించిన ఏదో మానవ అనుబంధమిది. నిశ్శబ్దంగానే మనస్సుల్లోకి తీగలా పాకుతూ పోయే ప్రాకృతిక స్వభావం తనది. ఇంత నిండైన మనిషిని మనం చాలా అరుదుగా చూస్తాం. మనుషుల్లో కూడా కొన్ని మాస్టర్ పీస్‌లుంటాయి. ఒక కె.వి.ఆర్. ఒక బాలగోపాల్, ఒక చలసాని - వీళ్ళని ఎలా మరచిపోగలం?

ఆయన ఆప్యాయత అయస్కాంతమేదో మనల్ని పట్టేసేది - సమాజ వైరుధ్యాల, వైవిధ్యాల తెలిసి ఎటు వెళ్ళాలో అటు నడిచిన యాత్రికుడు.

రచయితలారా మీరెటువైపు అని విశాఖ విద్యార్థుల ప్రశ్న రాకముందు నుండే తాను పీడితుల వైపే అని ఆయన జీవిత క్రమాన్ని గమనిస్తే తెలుస్తుంది. ఎందరిలో ఎన్నెన్ని జ్ఞాపకాలు విడిచి వెళ్ళారో ప్రసాద్. ఆ ప్రసన్న వదనంలో నిత్యం ప్రతిఫలించిన వెన్నెల. శ్రీశ్రీ చెప్పిన ఆసుపత్రి రోగుల పాలిపోయిన కపోలాలు స్పృశించడం మరచిపోని చల్లని వెన్నెల కిరణాలు తనవి.

త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన తనకి సొంత సుఖపు ఆరాటమంటూ ఏమీ లేదు. మావో అన్నట్టు స్పష్టమైన రాజకీయ దృక్పథం లేనివాడు ఆత్మలేనివాడితో సమానమని ప్రసాద్‌కి బాగా తెలుసు - నక్సల్బరీ శ్రీకాకుళ సాయుధ పోరాటాల వెలుగులో మనిషే తన ఆలోచనల కేంద్రంగా, అట్టడుగు జన సంక్షేమమే ధ్యేయంగా జీవించిన అక్షర యోధుడు.

విప్లవం తన ప్రేమ. తన రక్తగీతం. 'మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి? అని ఎవరైనా అడిగితే మనం చలసానినే చూపించాలి.

మార్క్సిజాన్ని దాని సూక్ష్మ విస్తృతార్థాల్లో జీర్ణించుకుని విశాల మానవ సంబంధాలు పెట్టుకొన్న అసలైన కమ్యూనిస్టు.

ఆరోగ్యం బాగుందా? అని ఎవరైనా అడిగితే తనకి బహుశా కోపం వచ్చేది. అనారోగ్యం ఏదైనా తన ఆలోచనలకి సరిపడని విషయం.

'మనిషికి సరైన నిర్వచనం కాళోజి' అని నేనెప్పుడో రాసిన మాటలు ప్రసాద్‌కీ వర్తిస్తాయి.

శ్రీశ్రీకీ చలసాని ప్రసాద్‌కీ ఉన్న సంబంధం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. డాక్టర్ జాన్సన్‌కీ బాస్వెల్‌కీ ఉండిన సంబంధాన్ని మించిన సంబంధం అది.

'శ్రీశ్రీ సమగ్ర సాహిత్యం', 'కొడవటిగంటి రచనా ప్రపంచం', 'రావి శాస్త్రీయం' చలసాని ప్రసాద్, క్రిష్ణాబాబు అక్కయ్య కలిసి వెలువరించిన అత్యంత విలువైన సంపుటాలు తెలుగు సాహిత్య చరిత్రలో మణిదీపాలు. వీటి వెనక ఎన్ని వేల అహోరాత్రుల శ్రమ ఉందో ఊహించలేం. ఈ సంపుటాలకి ఉపకరించే ఎంత చిన్న చిరిగిపోయిన కాగితమైనా సరే దేశంలో ఏ మారుమూలలో దొరుకుతుందని తెలిస్తే దూరభారాలు లెక్క చెయ్యకుండా కాలికి బలపం కట్టుకుని తిరిగి సేకరించిన సాహితీ నిబద్ధత చలసానిది.

కాళోజీ జీవిత చరిత్ర 'ఇదీ నా గొడవ' రావడం వెనక అతని పూనిక, చొరవ, కృషి ఉందనే విషయం చాలా మందికి తెలియదు.

ప్రసాద్ మనుషుల్ని ప్రేమించినంతగా పుస్తకాలనీ ప్రేమించారు. పుస్తకాన్ని హస్తానికి కాక మనసుకు హత్తుకున్న పిపాస తనది. ఆయనది వేల పుస్తకాల విలువైన లైబ్రరీ - పుస్తక సేకరణ తన వ్యసనం - మొన్నటికి మొన్న, అంటే నాలుగు నెలల క్రితం నేను అమెరికా వెళ్తున్నాని తెలిసి 'విలియం ఆర్చర్' 'చార్లెస్.డి.బ్రౌన్' అనే రచయితల పుస్తకాలు 'ఎన్ని దొరికితే అన్ని పట్టుకురా' అని వరంగల్‌లో ఉన్న నాకు ఫోన్ చేసి చెప్పారు. అయితే నేను పుస్తకాలతో తిరిగి వెళ్ళకముందే తాను శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోవడం నాకొక షాక్.

మా అమ్మాయి పెళ్ళి కుదరడం కొంత ఆలస్యమౌతుంటే 'ఏమైంది అమ్మాయి పెళ్ళి' అని ఎన్నో మార్లు ఫోన్ చేసి ఒకటి రెండు సంబంధాలు కూడా సూచించి నా ఫీలింగ్స్‌ని పంచుకున్న ఆత్మీయత తనది.

వయసులో చలసాని నా కన్నా నాలుగేళ్ళే పెద్ద. కాని సామాజిక నిబద్ధతలో, విప్లవ కార్యాచరణలో ఎంతో పెద్ద.

విశాఖలో ఆది శ్రీశ్రీ శతజయంతి జరిగిన సందర్భం. శ్రీశ్రీ ప్రసిద్ధ కవిత 'భిక్షువర్షీయసీ'కి కారణమైన ముగ్గుబుట్ట తల ముసలవ్వ కూర్చుండిన స్థలంలో ఆ కవితనూ, మూడు నిమిషాల్లో మహా ప్రస్థాన గీతం రాసిన 'టర్నల్ చౌల్ట్రీ'లో ఆ గీతాన్నీ అందరితో కలిసి చదివి చలసాని ఆనందించిన తీరు ఇంకా గుర్తుకొస్తున్నాయి.

విరసానికి జవ జీవాలు కూడగట్టిన వారిలో చలసానిది పెద్ద పాత్ర.

చుట్టూ ఎందరు వ్యతిరేకించినా న్యాయమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని తాను గట్టిగా సమర్థించాడు.

విశాఖ సముద్ర తీరంలో చలసాని తన అడుగు జాడలనీ, ఆ విశాల సాగరం అలల మీద తన కలలనీ వదిలి వెళ్లాడు. శ్రీశ్రీ పోయినపుడు ఆయన కోసం నేను రాసిన 'విశాఖ సముద్రం హోరున రోదిస్తోంది. తనను చదువుకున్నవాడు వెళ్లిపోయాడు' అనే మాటలు ప్రసాద్‌కూ వర్తిస్తాయి.

ఎర్రజెండా కింద ఎలుగెత్తిన ఆ రెడ్ క్రూసేడర్ కంఠం మనకు వినిపిస్తూనే ఉంటుంది.

ముమ్మాటికి నిజం. After all what is life? It is nothing but human association. పానీ బంగారుతల్లి నిత్యం మదిలో నుంచి తొంగి తొంగి చూస్తూంటుంది.

నీకో కొత్త పాత్రని పరిచయం చేయాలి.

పేరు సునీత.

ఊరు తెలంగాణ.

అత్తవారి ఊరు మన దివిసీమ - నారే పాలెం - సాలేపాలం పంచాయితీ, కోడూరు మండలం. అతని పేరు గౌతమ్ - అమరుడయ్యాడు.

ఆమె ప్రోద్బలం వల్లనే ఈ కాగితాలు నలుపవుతున్నాయి. ఇది మాత్రం గుర్తించుకో. మరపు మానవాళి గర్భ శత్రువు. మానవ జ్ఞాపకాలు అజరామరం.

మన డైలాగ్ కొనసాగుతూనే ఉంటుంది. ముగింపు కాదు. ముగింపు లేని ఆవేదన, ఆక్రందన మనది.

ఇది సత్యం, ఇది సత్యం

నీ

ప్రసాద్



ఆత్మీయ జ్ఞాపకం

వకుళాభరణం రామకృష్ణ

మనకు తెలియని వాళ్ల గురించి ఏం రాయలేమో, బాగా తెలిసిన వారి గురించీ అంతే! ప్రసాద్ లేడన్న కబురు అందినప్పటి నుండి నిత్యం గుర్తొస్తూనే ఉన్నాడు. మనల్ని వదిలిపెట్టి వెళ్లి పోయాడని తెలిసీ, ఆ కఠోర సత్యాన్ని జీర్ణించుకోలేక పోతున్నాం.

కెవిఆర్ చనిపోయినప్పుడు నాకు మతిపోయింది. ప్రసాద్‌లాగ ఆయన మరణమూ ఆకస్మికమే! మనసు సిద్ధంగా లేదు. కెవిఆర్ లేని లోటును జీర్ణించుకోవడానికి కొన్నాళ్లు పట్టింది. ఇప్పుడూ, ప్రసాద్ విషయంలోనూ అంతే!

దూరంగా ఉంటున్నా తరచూ కావల్లో ఉన్నప్పుడు, తర్వాత హైదరాబాద్ వచ్చాక గూడ ప్రసాద్, హైదరాబాద్ వచ్చినప్పుడు, ఇంటికి రాకుండా, మాతో గడపకుండా వెళ్ళేవాడు కాదు. సాన్నిహిత్యం అలాంటిది. భోళా భోళాగా కన్పించేవాడు ప్రసాద్ పైకి. ఆ నవ్వులో, పలకరింపులో, వీపు తట్టడం వెనకాల మరో రూపం ఉండేది. ఏ పని చేసినా, ఏ విషయం గూర్చి మాట్లాడినా, ముందు ఆలోచనతో, ఒక ప్రణాళిక ప్రకారం చేసేవాడు. వైజాగ్ నుండి వచ్చే వారం ముందే ఫోన్ చేసి, స్కూటర్‌ను సరైన కండిషన్‌లో పెట్టి ఉంచుమనీ, ఒక వారం రోజులు నేను తిరగడాన్కి కావాలని హెచ్చరించేవాడు.

విశాఖలో, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాకు సీనియర్. అప్పటికి పరిచయం లేదు. కానీ, అప్పటికే (1957-59) ప్రసాద్ కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అంకితమైంది. కుటుంబంలోని ముగ్గురు అమరులయ్యారు. ఈ వివరాలు అప్పట్లో నాకు తెలియవు. 1955లో నేను విజయవాడలో చదువుకుంటున్నప్పుడు, అరసం పునరుజ్జీవన మహాసభలు (1955 ఎన్నికల తర్వాత) జరిగినప్పుడు, ప్రసాద్ వాటిలో పాల్గొన్నాడో లేదో నాకు తెలీదు. ఆ తర్వాత కూడా చాలా సంవత్సరాలు పరిచయం లేదు. కెవిఆర్ సహాధ్యాపకుడుగా ఉద్యోగంలో చేరి, 1967 తర్వాత, వామపక్ష రాజకీయాలు కీలక మలుపు తిరిగి, శ్రీకాకుళ ఉద్యమం మొదలయ్యే సరికి, ప్రసాద్ నా ఎరుకలోకి వచ్చాడు. ముఖ్యంగా శ్రీశ్రీ షష్టిపూర్తి సభలు, విశాఖ విద్యార్థులు సంధించిన సూటి ప్రశ్న, ఆ తర్వాత పరిణామాలు - నన్ను ప్రసాద్‌కి సన్నిహితం చేశాయి. నిజానికి కెవిఆర్‌కు గూడా అప్పుడే సాన్నిహిత్యం పెరగనారంభించింది. కావల్లో ఉన్న మాకు, చకచకా జరిగిపోతున్న మార్పుల ప్రాధాన్యాన్ని, సిపిఎం రాజకీయాలను అవగాహన చేసుకొనేందుకు కొంత వ్యవధి పట్టింది. అప్పుడే, ఏమీ తోచని స్థితిలో, ఒకసారి సుందరయ్య గారు నెల్లూరు వచ్చినప్పుడు, మేము ఆయన్ను కలుసుకున్నాం గూడ. కెవిఆర్‌కి సిపిఎంతో సంబంధాలు పోయాక (పాణిగ్రాహి అమరత్వంపై రాసిన కవిత ప్రచురించికపోవడంతో కెవిఆర్‌లో మార్పు పూర్తయింది). ఇవి జరిగాక, ప్రసాద్‌తో వారితో పాటు, నాకు పరిచయం స్నేహంగా మారింది.

విరసం పుట్టుకకు కొన్ని సంవత్సరాల ముందే, 1962లోనే ప్రసాద్, కెవిఆర్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. 'అడుగుజాడ గురజాడది', ఆధునిక కవితా సంకలనం కెవిఆర్ సంపాదకత్వంలో వెలువడింది. ఈ గ్రంథం కొన్ని పరిమితులకు ఆర్థిక వగైరా - లోబడి వెలువరించాల్సి వచ్చింది. ప్రసాద్ విమర్శకు గురైంది. కెవిఆర్ ఘాటుగా (మరో విధంగా కెవిఆర్ రాయరు) సమాధానం రాశారు. ఆ తర్వాత ఒకర్నొకరు తెలుసుకొని సర్దుకొన్నారు. 'మీరెవరో, మీ సంగతి సందర్భాలేవో నాకు తెలియదు. అనేక పర్యాయాలు పొరబడ్డాను' అని కెవిఆర్ రాశారు.

1962 తర్వాతనే ప్రసాద్‌తో దగ్గర పరిచయం. విశాఖ విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నే, దాని పర్యవసానమే విరసం పుట్టుక. దీనికి పూర్వరంగం శ్రీశ్రీకి హైద్రాబాద్‌లో తలపెట్టిన సన్మానం. ఈ సభకు శ్రీశ్రీని రాకుండా చేయాలనీ, నక్సల్‌బరీ, శ్రీకాకుళ ఉద్యమాల నేపథ్యంలో, వాటి స్ఫూర్తితో, భావజాలంతో, ఒక రచయితల సంఘాన్ని స్థాపించాలన్న సంకల్పం ఇదంతా తెలిసిందే! సరిగ్గా, అదే సమయంలో, కెవిఆర్,

ప్రసాద్‌కు ఒక ఉత్తరంలో ఇలా రాశాడు.

'శ్రీశ్రీ, కుటుంబరావు గార్లు ఉంటే మనం తలపెట్టిన సంఘ నిర్మాణానికి, ఒకటికి, రెండు పెద్ద తలకాయలున్నట్లు. నా అంతట నేను మిగతా రచయితలను సమీకరించే పని పెట్టుకోలేను. దానికి మరెవరైనా ముందుకు రావాలి. ప్రసాద్ మహాశయా, తమరు ఈ పనికి బాగా సరిపోగలరు. హైదరాబాద్‌లో నాకు ఎవరూ ఏదీ బాగా తెలియదు. మనుషులనూ, స్థలాలనూ తెలిసిన వాళ్ళొకరుండి, మందిని పోగుచేసి, ఒక స్థలాన్ని ఏర్పాటు చేయగలిగితే, మనం సంఘటితం కావచ్చు. ఇప్పుడు గనక ఇది జరక్కపోతే, సమీప భావిలో జరుగుతుందనే ఆశగానీ, నమ్మకం గానీ నాకు లేవు' (తే.23.6.70)

ఇది రాశాక, ప్రసాద్ కావలి వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్రాసుకెళ్ళారు. కావలి రైల్వే స్టేషన్‌లో కూడా కొత్తగా స్థాపించబోయే రచయితల సంఘం గురించే చర్చలు. ఏర్పడబోయే సంఘానికి, 'సామ్యవాద రచయితల సంఘం' (సారసం) అని పేరు పెట్టాలా, లేక 'విప్లవ రచయితల సంఘం' (విరసం), అని చర్చించుకోవడం, కెవిఆర్, నేనూ 'సారసం' వైపు మొగ్గు చూపినా, ప్రసాద్ మాత్రం 'విరసం' పేరు వైపే మొగ్గుచూపాడు.

మరో సందర్భంలో శ్రీశ్రీకి ఇవ్వదలచిన అకాడమీ పురస్కారాన్ని తిరస్కరింపచేసే ప్రయత్న సందర్భంలో, ప్రసాద్‌కు మరో పెద్ద ఉత్తరం కె.వి.ఆర్. రాశారు, ప్రసాద్ మాత్రమే ఈ కార్యం నెరవేర్చగలరన్న గట్టి నమ్మకంతో - 'ఈ ప్రయత్నాలన్నిటికీ ఒక సారథి కావాలి గదా! మీరు (ప్రసాద్) త్వరలో మద్రాసు వస్తారని చెప్పాను. మీరేమో విశాఖలో కూర్చుని మీసం తిప్పుతున్నారు. అదేమీ లాభం లేదు. కష్టమో, నష్టమో, వ్యయమో, ప్రయాసో, మీరు వెంటనే మద్రాసు వెళ్ళాలి. వెళ్ళి శ్రీశ్రీని టాకిల్ చేస్తూ, మరోవైపు నుంచి విరాళాలు పోగు చెయ్యాలి.'

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే, ప్రతి సంక్షోభ సమయంలో, మరేదైనా ముఖ్యమైన పని నిర్వర్తించాల్సినప్పుడు, ప్రసాద్‌నే ముందు వెళ్లమని పురమాయించారు. ప్రసాద్ తనకప్పచెప్పిన బాధ్యతలను తు.చ. తప్పకుండా నెరవేర్చాడు.

ఇలా రాసుకుంటూ పోతే, ప్రసాద్ కార్యదీక్షత గూర్చి ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. శ్రీశ్రీతో ప్రసాద్‌కున్న అనుబంధం అందరికీ తెలిసిందే! శ్రీశ్రీ జీవిత చరిత్ర రాద్దామనుకున్న (రాయలేదు) కెవిఆర్‌కు శ్రీశ్రీపై మనస్తాపం కలిగినప్పుడల్లా, ఆ బాధను ప్రసాద్‌తో పంచుకొనేవారు. ఇందిరాగాంధీ విధానాలను (ఎమర్జెన్సీ కాలం), 'వామపక్ష నియంతృత్వం'గా శ్రీశ్రీ చెపుతున్నాడని తెలిసి ప్రసాద్‌కు ఇలా రాశారు.

'ఇందిరా గాంధీది వామపక్ష నియంతృత్వమట! ఒప్పుకొంటే మొదటికే మోసం వస్తుంది. అలా జరగడాన్కి వీల్లేదు. ఇక్కడ మనవాళ్ళందరితో సంప్రదించి శ్రీశ్రీకి ఉత్తరం రాస్తున్నా. తన్ను తాను సరిదిద్దుకుంటే సరేసరి. లేకపోతే సరికాదు... మీకాయనంటే చాల ప్రేమని నాకు తెలుసు. కానీ విరసం అంతకంటే ముఖ్యమైంది. ప్రజల పోరాటాలు, వారి విముక్తి మనకు ముఖ్యం'. ఆ తర్వాత ప్రసాద్ శ్రీశ్రీని కలిసి మాట్లాడినా ప్రయోజనం లేకపోవడం వేరే విషయం.

ప్రసాద్ మౌనంగా ఉన్నట్టుగా ఉంటూ, విరసం, నిర్మాణం, పెరుగుదల, ఉనికిలో ఎంత కృషి చేశాడో తెలుస్తుంది. దాదాపు దశాబ్దానికి పైగా 'అరుణతార'కు సంపాదకత్వం నెరపి, అలసిపోయి, డస్సిపోయాక, కెవిఆర్ సంపాదవర్గానికి రాజీనామా చేయాలని నిశ్చయించుకొని, ఇదే విషయాన్ని కృష్ణాబాయి, ప్రసాద్‌లకు రాశారు. దానికి వాళ్ల బాధపడో, మరేదో ఉత్తరం రాస్తే, కెవిఆర్ దానికి స్పందించిన తీరులో ప్రసాద్ గూర్చిన ప్రస్తావన ప్రశంసనీయం.

'ఎంత నిషాలోనైనా నీ నిగ్రహం పోలేదు, ప్రసాద్!... నాకంటే ఎన్నో త్యాగాలు చేసిన వాళ్లు మీరు. మీ కుటుంబమే అంత. ఈ చారిత్రక కర్తవ్య దీక్ష సడలగూడదు!'

ప్రసాద్ నిత్య చదువరి. చదివినంతగా రాయలేకపోడాన్కి, అతను నిర్వర్తించాల్సి వచ్చిన సంస్థల కార్యకలాపాలే! సాహిత్యంలోని మెలకువలను విడమర్చి చెప్పగల సమర్థుడు. నిరాడంబరుడు. రాజకీయాలను, స్నేహాలను విడదీసి చూడగల సహృదయుడు. స్నేహాల్ని తుదిశ్వాస దాకా నిలుపుకొన్నాడు. కమ్యూనిజం భావజాల మహోన్నత మానవ విలువల్ని పుణికి పుచ్చుకొన్న కొద్ది మందిలో ఒకడు ప్రసాద్! కె.వి.ఆర్. మాటల్లో ప్రసాద్‌తో ఈ జ్ఞాపకాల్ని ముగిస్తాను. కెవిఆర్ నాతో అనేక సార్లు అనేవాడు. నాకు ఇద్దరు లీడర్స్. సైద్ధాంతికంగా మార్గదర్శకుడు వివి కాగా, ప్రసాద్ సంస్థ బాగోగుల్ని చూసుకొనే కార్యదక్షుడు'.

(ఇందులో ఉదహరించిన ఉటంకింపులు అన్నీ కెవిఆర్ సాహిత్య లేఖల నుండి)

చలసాని ప్రసాద్

- భూపాల్

విరసం జెండా - పైపై కెత్తిన
విప్లవ ధీరుడు - చలసాని...

విప్లవాగ్నులను - జనంలో విత్తిన
సత్యం దారిలో - చలసాని...

సాగరతీరం - ఎర్రని బింబం
సాహితి శిఖరం - చలసాని...

స్నేహం విలువల - కలువలు పూసిన
కమ్మని పాట - చలసాని...

పిల్లల హృదయం విప్లవ దీపం
విరుల నవ్వులతో - చలసాని...

'అరుణతార'కై - అహర్నిశలుగా
పరితపించిన - చలసాని...

జనతన సర్కార్ - జాడలు తెలిసిన
జయకేతనమే - చలసాని...

సాయుధ విప్లవ - జీవి అసాంతం
సాగిన కిరణాల చలసాని...

శ్రీశ్రీ పరిశోధక మహాశక్తి

సింగంపల్లి అశోక్‌కుమార్

సమాజాన్ని మార్చే కృషిలో సాహిత్యానికి ఎంతో కొంత పాత్ర ఉంటుంది. అలాంటి సాహిత్యంతో నాకు అనుబంధం ఉంది. ఉద్యమాలు లేకుండా సాహిత్యం నిర్ణయాత్మకమైన పాత్ర నిర్వహించలేదు. తెలుగులో మొదటి నుంచి రాజకీయ ఉద్యమాలు సాహిత్యవ్యాప్తికి దోహదం చేశాయి. ఇది ఎవరూ కాదనలేని సత్యం. ప్రజా రాజకీయాల ప్రభావంతో సాగే సాహిత్య ఉద్యమంలో నేను భాగస్వామిని. ఉద్యమం ఆరోగ్యవంతంగా కొనసాగాలంటే సాహిత్యంపట్ల ఆసక్తి ఉండి నిజాయితీతో పనిచేసే వ్యక్తులు కావాలి.

అలాంటి వ్యక్తుల్లో నేనొకణ్ణి' అంటూ సాహిత్యరంగంలో తన కృషి గురించి చెప్పుకున్న చలసాని ప్రసాద్- కవి, రచయిత, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, విప్లవ సాహితీ కార్యకర్త.

1957లో ఎమ్.ఏ.పట్టభద్రుడైన చలసాని ప్రసాద్, బతుకు తెరువుకోసం కొంతకాలం స్టేట్ గవర్నమెంటు గుమస్తాగానూ, కొంతకాలం కాజీపేట రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ రైల్వే కేటరింగ్ మేనేజరుగానూ, కొంత కాలం వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ సూపరింటెండెంట్‌గానూ పనిచేశారు. తరువాత 1965లో సినిమా రంగంలో చేరి 'కలిమి లేములు' చిత్రానికి ప్రముఖ రచయిత గోపీచంద్‌కి స్క్రిప్ట్ అసిస్టెంటుగా, ప్రముఖ దర్శక నిర్మాత కె.ప్రత్యగాత్మ నిర్మించిన 'చిలకా గోరింక', 'మా వదిన' చిత్రాలకు నిర్మాణ నిర్వహకుడిగా. పనిచేశారు. 1968 నుండి విశాఖపట్నం ఏ.వి.యన్ కళాశాలలో పాలిటిక్స్ అధ్యాపకుడిగాచేరి, అందులో స్థిరపడి అక్కడే 1992లో ఉదవీ విరమణ పొందారు.

1955 మధ్యంతర ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ తరపున ఎన్నికల ప్రచార సభకు సాంస్కృతిక సైనికుడిగా మహాకవి శ్రీశ్రీ హనుమాన్ జంక్షన్ వచ్చారని తెలిసి, గుడివాడ నుండి 12 మైళ్లు సైకిలు తొక్కుకు వెళ్లి శ్రీశ్రీని మొట్టమొదటిసారి చూశాననీ, అది తన జీవితంలోని ఒక గొప్ప మధురానుభూతని చెప్పుకునే చలసాని ప్రసాద్, మహాకవి శ్రీశ్రీకి వీరాభిమాని. తలపండిన నిలువెత్తు శ్రీశ్రీ సమాచారం. ఆయన శ్రీశ్రీ గురించి అటు సాహిత్యంలోనూ, ఇటు జీవితంలోనూ ఎటువంటి ప్రశ్నయినా సరే, అడిగేవారినోట పూర్తిగా రాకుండానే సమాధానం చెప్పగల ఒకే ఒక్కడు. శ్రీశ్రీపై అయన భక్తి, అనురక్తి, అక్షరాలకు అందనిది. మహాకవి శ్రీశ్రీపై చలసాని ప్రసాద్‌ది శ్రీశ్రీ విరోధులు ద్వేషించేంత అనురాగం. శ్రీశ్రీ అభిమానులు ఈర్ష్యపడేంత అనుబంధం.

02-01-1910గా, అప్పటి వరకు చలామణి అవుతున్న మహాకవిశ్రీశ్రీ జన్మదినాన్ని, శోధించి, 1910 ఏప్రిల్ 30గా కచ్చితమైన ఆధారాలతో సాధించిన, అసహాయ శ్రీశ్రీ సహాయ శూరుడు. శ్రీశ్రీ అంటే చలసాని ప్రసాద్‌కే కాదు, చలసాని ప్రసాద్ అన్నా శ్రీశ్రీకి ఎంతో అభిమానం. చలసాని ప్రసాద్ శ్రీశ్రీకి అత్యంత సన్నిహితులు,. స్నేహితులు. శ్రీశ్రీ - తన మొదటి భార్య రమణమ్మ గారిని కౌసల్య అనీ, రెండో భార్య సరోజగారిని సుమిత్ర అనీ, చలసాని ప్రసాద్‌ని 'నా ఏకైక కైక' అనీ ముద్దుగానూ, అభిమానంగానూ, ప్రేమతోనూ పిలుచుకొనేవారు.

జాతీయోద్యమం కమ్యూనిస్టు ఉద్యమంగా ఎదిగిన నేపథ్యమున్న కుటుంబంలో చలసాని జన్మించారు. అందువలన ఉద్యమ సమయంలో ఇంటిపై తరుచూ దాడులు జరుగుతుండేవి. అలా జరిగిన కాల్పుల్లో ఆయన బాబాయి, బావ, అన్నయ్య ప్రాణాలు కోల్పోయారు. అటువంటి అమర వీరుల కుటుంబ నేపథ్యం కలిగిన చలసాని ప్రసాద్ తొలి జనరల్ ఎన్నికల సంరంభంలో రాజకీయాలలో కళ్లు తెరిచారు. హైస్కూలు దశలోనే ఎర్రజెండా చేతబట్టి మరణించే దాకా తెలుగునాట ప్రజా ఉద్యమాలతో కొనసాగారు. ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ సభ్యులు. కమ్యూనిస్టు పార్టీ 1964 చీలికలో సి.పి.ఎం వైపూ, 1969 చీలికలో ఎం.ఎల్‌వైపూపనిచేశారు.విరసం. సంస్థాపక కార్యవర్గ సభ్యులు.1986-88లో ప్రధాన కార్యదర్శిగానూ, కె.వి.ఆర్. మరణానంతరం 1998-2000లో విరసం అధ్యక్షులుగానూ పనిచేశారు. ఎమర్జెన్సీకాలంలో అరెస్టయి జైలుజీవితం అనుభవించారు. ఇక లెక్కలేనన్ని బూటకపు ఎన్‌కౌంటర్లను జీవిత కాలం నిరసిస్తూనే ఉన్నారు. నిరసిస్తూ లెక్కలేనన్ని సార్లు అరస్టయ్యారు.

విరసం ఆవిర్భావంలో చలసాని ప్రసాద్ ముఖ్య పాత్ర నిర్వహించారు. విరసం ప్రచురించిన 'శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం' 21 సంపుటాలకు (అనుబంధ సంపుటితో కలిపి) సంపాదకత్వం వహించారు. దానికి తను చేసిన కృషి. 'శ్రీశ్రీ సాహిత్యం' (1970) ఆరు సంపుటాలకు (ఆంగ్ల సంపుటంతో కలిపి) కె.వి.ఆర్ చేసిన కృషికి కొనసాగింపేనని వినయంగా చెప్పు కొన్నా, 'శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం'ను అత్యంత బాధ్యతాయుతంగానూ, అతి విలువైన ఫుట్‌నోట్స్‌తోనూ, అనన్య సామాన్యంగానూ అందించి తెలుగుజాతికి మహోపకారం చేశారు. వాటికి ప్రసాద్ ఇచ్చిన పాద సూచికలు తెలుగు సాహిత్య విషయ వీచికలు. వాటికి ఆయన రాసిన ముందు మాటలు - మును ముందు మాటలు, పదండి ముందుకు బాటలు.

విరసం ప్రచురణలు 'కొకు వ్యాస ప్రపంచం' (ఆరు సంపుటాలు)కూ, 'కొకు రచనా ప్రపంచం' (18 సంపుటాలు)కూ, త్రిపురనేని 'గోపీచంద్ రచనా సర్వస్వం' (10 సంపుటాలు)కూ తుమ్మల కృష్ణాబాయితోనూ, 'కె.వి.ఆర్. సాహిత్యలేఖలు'కు ఎన్.వేణుగోపాల్ తోనూ, మహాకవి శ్రీశ్రీ శతజయంతికి మనసు ఫౌండేషన్ ప్రచురణ 'శ్రీశ్రీ ప్రస్థానత్రయం' (3 సంపుటాలకు)కు యం.వి.రాయుడు (బెంగుళూరు) తోనూ కలిసి సంపాదకత్వం వహించారు.

సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై ప్రతి అవసరంలోనూ స్పందిస్తూ చలసాని ప్రసాద్ అందించిన రచనలు 'చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలు' (2008) 'చలసానిప్రసాద్ రచనలు' (2010). పేరున రెండు సంపుటాలు విరసం ప్రచురించింది.

చలసాని ప్రసాద్ జీవితకాలంలో శ్రీశ్రీ గురించిన రచనలు, మహాకవి శ్రీశ్రీపై చలసాని సాహిత్య సర్వస్వంగా 'చిరంజీవి శ్రీశ్రీ' అనే పేరున శ్రీశ్రీ సాహిత్యనిధి సంస్థ తన 24వ ప్రచురణగా వెలువరించింది. ఆ పుస్తకాన్ని 'మేరువంతటి మహాకవి నిధులని

శ్రీశ్రీ చలసాని

అసి

అతను
చలసాని ప్రసాద్
కాదు
శ్రీశ్రీ ప్రసాద్
కాదు
విరసం ప్రసాద్ !
శ్రీశ్రీ-విరసం
అతనికి రెండు కళ్లు !
కళ్లు రెండైనా చూపు ఒక్కటే !

చలసాని అంటే
మాకు ఇష్టం !
శ్రీశ్రీ సాహిత్యాన్ని
21 గ్రంథాలుగా
అట్టల మధ్య
బంధించిన వాడని కాదు-
శ్రీశ్రీ సాహిత్యాన్ని
21 ఆయుధాలుగా
సంధించినవాడని
తెలుగు జాతికి అందించిన వాడని !

చలసాని అంటే
మాకు ఇష్టం !
అతనికి
వేలమంది
విప్లవ సాహితీ అభిమానులు
పరిచయమని కాదు-
వేలమంది
విప్లవ సాహితీయోధులతో
అతనికి సహచర్యమని !

చలసాని అంటే
మాకు ఇష్టం !
అతను
శ్రీశ్రీని
అమితంగా
ప్రేమించినవాడని కాదు-
శ్రీశ్రీయే
అమితంగా
ప్రేమించినవాడని !

చలసాని అంటే
మాకు ఇష్టం
అతడు
శ్రీశ్రీ భావాలను పోగు చేసిన కార్మికుడు
అతడు
శ్రీశ్రీ భావాలను సాగు చేసిన కర్షకుడు
అతడు
శ్రీశ్రీ సాహిత్య సత్య శ్రామికుడు
అతడు
శ్రీశ్రీ సాహిత్యనిధి నిత్య ప్రేమికుడు !

అతను
చలసాని ప్రసాద్
కాదు
శ్రీశ్రీ ప్రసాద్
కాదు
విరసం ప్రసాద్ !
శ్రీశ్రీ-విరసం
అతనికి రెండు కళ్లు !
కళ్లు రెండైనా చూపు ఒక్కటే !

నిర్విరామంగా కూర్చి,పేర్చి, ఏర్చి తెలుగు సమాజ హృదయంలో నిక్షిప్తం చేస్తున్న శ్రీశ్రీ సాహిత్యనిధికి' అంటూ ప్రేమతో శ్రీశ్రీ సాహిత్య నిధికి అంకిత మిచ్చారు.

చలసాని సాధించిన మరో ముఖ్య విజయం ఆయన వ్యక్తిగత గ్రంథాలయం. ఎన్నో అద్భుతాలు ఉన్న విశాఖలో చలసాని ప్రసాద్ గ్రంథాలయం ఒక అద్భుతం. ఒకప్పుడు ప్రత్యేకంగా చెప్పుకునే నార్ల, ఆరుద్ర, జగ్గయ్యల గ్రంథాలయాలను ప్రమాణంలో మించిన గ్రంథాలయం. ప్రజల యుద్ధాలూ... ప్రభుత్వ నిషిద్ధాలూ... చోటు చేసుకున్న గ్రంథాలయం. ఆ గ్రంథాలయం గదులకు శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొడవటిగంటి పేర్లు పెట్టడం విశేషం.

'సాహిత్యాన్ని చరిత్రపరంగా, సామాజిక పరంగా, రాజకీయ ఉద్యమపరంగా విశ్లేషించాలని నా అభిలాష' అని చెబుతూ, అలానే విశ్లేషిస్తూ- విరసాన్నీ, శ్రీశ్రీని రెండు కళ్లుగా భావించే చలసాని ప్రసాద్, 1932 డిశంబరు, 8వ తేదీన కృష్ణాజిల్లా, నాదెళ్లవారి పాలెంలో జన్మించారు, 2015 జూలై, 25న విశాఖపట్నంలో గుండెపోటుతో మరణించారు. ఆయన కళ్లనూ, కాయాన్ని ఆయన కోరిక మేరకు ఆయన మిత్రులు, బంధువులు మెడికల్ కాలేజీకి అందించారు.

చలసాని బసవయ్య, వెంకట నరసమ్మ ఆయన తల్లిదండ్రులు. ఆయన భార్య విజయలక్ష్మి 2003లో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు విప్లవోద్యమంలో పనిచేస్తున్న నవత, మరొకరు కాలేజి లెక్చరర్‌గా పనిచేస్తున్న మమత.

('విశాలాంధ్ర' దినపత్రిక 27-07-2015-మార్పులూ చేర్పులతో)

చలసాని జ్ఞాపకాలు

సమతా కోటేశ్వరరావు

చలసాని ప్రసాద్‌ని 1973 నుండి సభలలో చూసే వాడిని. మిత్రుడు సి.వి. సుబ్బారావు (సురా) చలసాని బహుముఖ కృషి గురించి, వ్యక్తిత్వాన్ని గురించి వివరంగా చెప్పేవాడు. '78లో బెజవాడ పాతబస్తీలోని భ్రమరాంబా గ్రంథాలయం నుండి శ్రీశ్రీ రచనలు కాపీ చేసుకోవడానికి వెళుతూ కృష్ణక్కతోబాటు చలసాని మా ఇంటికి వచ్చాడు. అదే తొలి ప్రత్యక్ష పరిచయం.

83లో బెజవాడలో జరిగిన విరసం సాహిత్య పాఠశాల ఆహ్వాన సంఘంలో నేనుండడం వల్ల చలసానితో సన్నిహితంగా మెలిగే అవకాశం కలిగింది. ద్రోణవల్లి అనసూయమ్మ ఇల్లు ఆహ్వానసంఘ కార్యాలయంగా ఉండేది. ఖాళీ సమయంలో మా ఇద్దరి అభిమాన విషయాలు - కన్యాశుల్కం నాటకం, మాయాబజార్ సినిమా, ఎస్వీరంగారావు నటన - గురించి చాలా చెప్పేవాడు. అప్పటి నుండి మరణించే వరకు మా అనుబంధం బలపడుతూ వచ్చింది.

'విరసంలో లేకపోయినా, విరసంతో వున్నవారి'గా అశోక్ (శ్రీశ్రీ సాహిత్యనిధి) గురించి, నా గురించి నాలుగైదు వేదికల మీద చలసాని పేర్కొన్నాడు. 'బెజవాడ వస్తే అక్కాయ్ (అనసూయమ్మ)ని, వసు (కెవిఆర్‌గారి అమ్మాయి డా॥వసుంధర)ని, నిన్నూ కలవకుండా వెళ్ళను అనేవాడు. (ప్రాధాన్యతా క్రమం అదే). తన సొంత గ్రంథాలయంలోని శ్రీశ్రీ పుస్తకాలు అశోక్‌కి, కొకు పుస్తకాలు నాకూ తన తదనంతరం చెందేలా రాస్తాననేవాడు.

కిందటి సంవత్సరం మా అమ్మాయి పెళ్ళి ఫలానా రోజునని చెప్పి, విశాఖ నుండి పెళ్ళి కోసం శ్రమపడి రావద్దన్నాను. వెంటనే 'నీ కూతురి పెళ్ళికి నేను రాకపోతే ఎలా?' అన్నాడు. అన్నట్లుగానే ఆ రోజు చాలా ముందుగా వచ్చి చివరిదాకా ఉండి వెళ్ళాడు. కొ.కు. రచనా ప్రపంచం ప్రూఫ్ చూసిన వాళ్ళలో నేనొకణ్ణి. నాకు మొత్తం సెట్ కాంప్లిమెంటరీగా ఇస్తానని చలసాని వాగ్దానం చేసాడు. వాటిలో ఒక సంపుటం తప్ప అన్నీ అందాయి నాకు. 'నేను మాట తప్పను. నా సొంత కాపీ ఐనా నీకు ఇస్తాను' అన్నాడు. సరిగ్గా చనిపోవడానికి పది రోజుల ముందు అరసవిల్లి కృష్ణతో ఆ పుస్తకం పంపించాడు. 'నీ బాకీ తీర్చేసాను' అని ఫోన్ చేసి మరీ చెప్పాడు.

ఆయన అతిపెద్ద పర్సనల్ గ్రంథాలయం నిర్వహించడమే కాదు, దానికి చాలా అరుదైన పుస్తకాలు సేకరించాడు. బెజవాడ, హైదరాబాద్, చెన్నైలలో ఖాళీ దొరికినప్పుడు పాత పుస్తకాల కోసం వేటాడే వాడు. సాహిత్య రాజకీయ, చారిత్రక అంశాలపై పరిశోధన చేసే విద్యార్థులకు ఆయన లైబ్రరీ పెద్ద వనరు. నిజానికి ఆయనే సంచార రిఫరెన్స్ లైబ్రరీ లాంటివాడు. సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా తన ఇల్లు విరసం కార్యాలయంగా, తన లైబ్రరీ విరసం గ్రంథాలయంగా ఉండాలని కోరుకొనేవాడు.

ప్రసాద్‌ది పసిపిల్లవాడి మనస్తత్వం. నిష్కల్మషంగా నవ్వుతూ మాట్లాడేవాడు. భుజం మీద చేతులేసి నడిచేవాడు. తిరుపతిలో జరగని గ్రీన్‌హంట్ వ్యతిరేక సభకు ముందు రోజు నన్ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి 16 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారు. ఆ విషయం చలసానిలో చెప్పగానే నవ్వుతూ భుజం మీద చేతులేసి 'దూల తీరిందా?' అని హాస్యమాడాడు. వివి అన్నట్లు చలసానికి ప్రేమించడానికి మనిషి అయితే చాలు. తనని మోసం చేసిన వాళ్ళ గురించి గూడా చెడుగా చెప్పేవాడు కాదు. ఎవరి గురించి అడిగినా, 'మనోడే, మంచోడే' అనేది దాదాపు ఆయన వూతపదం. పీకాక్ క్లాసిక్స్ గాంధీ ఎప్పుడు చలసాని ప్రసక్తి వచ్చినా 'భోలా శంకరుడు' అని 'ఎనభై యేళ్ళ యువకుడు' అనీ అంటాడు. చలసాని ఎనభై యేళ్లు దాటిన తర్వాత కూడా బెజవాడ సిటీబస్సుల్లో నిలబడి ప్రయాణం చేసేవాడు.

ఆహార పదార్థాలు వృథా చేయడం ఆయనకు అసలు ఇష్టం ఉండదు. ఎక్కడకి వెళ్ళినా చద్దన్నం, మిగిలిపోయిన కూరలలాంటివి అడిగి మరీ తినేవాడు. పప్పు, ఆవకాయ, పెరుగు ఉంటే చాలు ఆయనకి. ఇస్త్రీ బట్టలు, టివి, సెల్‌ఫోన్‌లకు పూర్తిగా వ్యతిరేకి. (చివరి యేళ్ళలో సెల్‌ఫోన్ వాడాల్సి వచ్చింది) తన బట్టలు తనే ఉతుక్కునేవాడు.

వరవరరావు అన్నట్లు 'చలసాని మతిమరుపుకు మరో అంచు జ్ఞాపక శక్తి.' కొన్ని విషయాలు ఎన్ని సార్లు చెప్పినా మర్చిపోయేవాడు. మరికొన్ని ఎన్నేళ్ళయినా గుర్తుండేవి. ప్రాచీన సాహిత్యం మీద మంచి పట్టు ఉండేది. అసాధారణ ధారణశక్తి ఉండేది. తిక్కన, ధూర్జటి పద్యాలలాంటివి పొల్లుపోకుండా చెప్పేవాడు. శ్రీశ్రీ గురించి ఐతే చెప్పనే అక్కరలేదు. ఏ రచన, ఏ తేదీన, ఎక్కడ రాసిందీ ఎప్పుడు ప్రచురితం అయిందీ తడుముకోకుండా చెప్పేవాడు.

చలసాని ప్రసాద్, సిఎన్ఆర్ ప్రసాద్, నేను బెజవాడ పాతబస్తీలోని గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులం. 1984లో ఆర్‌వైఎల్ ప్రాంతీయ మహాసభలు బెజవాడలో జరిగాయి. బహిరంగసభ ఆ స్కూల్‌లో జరిగింది. దానిలో అనురాధ గాంధీ, చలసాని ప్రసాద్, అనసూయమ్మలు వక్తలు. నేను మా స్కూల్ గురించి అనురాధ గాంధీకి చెబుతుంటే, చలసాని తానూ అక్కడే చదివానని, అప్పటి టీచర్ల గురించి చాలా జ్ఞాపకాలు చెప్పాడు.

చలసాని ప్రతిభ ఎక్కడ ఉన్నా గౌరవించేవాడు. విశ్వనాథని చాలాసార్లు మెచ్చుకొనేవాడు. నా సహచరి జటావల్లభుల పురుషోత్తం (విశ్వహిందూ పరిషత్ ప్రారంభకుల్లో ఒకరు) గారికి సొంత అన్న కూతురు. ఆ విషయం తెలిసిన చలసాని చాలాసార్లు ఆయన పాండిత్యాన్ని మెచ్చుకొనేవాడు. ఆయన కొడుకు కమ్యూనిస్టని నేను చెబితే చాలా ఆసక్తిగా వివరాలడిగే వాడు.

ఎనభై యేళ్ళు పైబడిన వయసులో గూడా కన్యాశుల్కం పూర్తి నిడివి నాటక ప్రదర్శన కోసం చాలా కృషి చేసాడు. ఆ నాటకంలో చిన్న పాత్ర ఐనా వేయాలని చీట్లపేక దృశ్యంలో నటించాడు. సినిమాలు చూడడం అరుదు. ఆ మధ్య 'మర్యాద రామన్న' సినిమా చూసి రాజమౌళి తీసిన విధానాన్ని మెచ్చుకున్నాడు. ప్రూఫ్ రీడింగ్ విషయంలో చిత్రమైన వాదన చేసేవాడు. 'పుస్తకం సకాలంలో తీసుకురావడం ముఖ్యంగాని అక్కడక్కడా తప్పులుంటే ఏమవుతుంది? పాఠకులే సవరించుకుంటారు.... వదిన (కృష్ణక్క)ని మించిన చాదస్తం నీది' అనేవాడు.

నాకు ప్రియమైన తమ్ముడు ప్రసాద్

అనసూయమ్మ

మృతజీవులు, జీవన్మృతులు అని రెండు కోవల మనుషులు ఉంటారు. వారిలో మా తమ్ముడు చనిపోయి కూడా బతుకుతూనే ఉండే మృత్యుంజయుడు. తాళాలు లేని ఇళ్ళు, పరీక్షల్లేని చదువు, పోలీసుల్లేని వ్యవస్థ కోసం కలలు కన్న ఆశాజీవి. అందరిలో మంచే చూసినవాడు. అజాత శత్రువు. ఎవరైనా తనతో విబేధించేవారు ఉన్నా, వాళ్ళని కూడా తనకి అనుకూలంగా మలుచుకుని పనులు చేయించుకునేవాడు.

ప్రసాద్ కుటుంబం జాతీయోద్యమంలో రాటు దేలింది. వాళ్ళ నాయనమ్మ ఆ రోజుల్లో జైలుకెళ్ళింది. చిన్న నాయనమ్మ కొడుకు బ్రిటిషు కాలంలో బళ్ళారి జైల్లో చనిపోయాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో కృష్ణా జిల్లాలో రైతాంగ పోరాటాల్లో, లంక పోరాటాల్లో, జమీందారీ వ్యతిరేక పోరాటాల్లో ప్రసాద్ కుటుంబం చురుగ్గా పాల్గొనేది. ఆ విప్లవాచరణలో భాగంగా ప్రసాద్ బావ, బాబాయి, అన్న అమరులయ్యారు. చిన్నప్పటి నుంచి ఉత్తేజంగా రాజకీయాల్లో పాల్గొన్న ప్రసాద్ విప్లవకారుడిగానే పుట్టి విప్లవకారుడిగా వెళ్ళిపోయాడు.

ఉమ్మడి పార్టీ చీలిపోయక అభివృద్ధి నిరోధకులని వ్యతిరేకిస్తూ, అభివృద్ధికరమైన మేధావులతో నడిచాడు. కె.ఎస్., సత్యమూర్తిలకు బాసటగా నిలిచాడు.

'విరసం మేధావుల సంఘంగా ఉంటోంది. మీరు జనంలోకి వెళ్ళాలి' అని నేను సలహా ఇస్తే, మరో నలుగురిని కలుపుకుని వచ్చి చలసాని మాతో పాటు విలేజి క్యాంపెయిన్‌కు వచ్చాడు.

ఐలూరు, గురివిందపల్లి రైతాంగ పోరాటాల్లో 475 ఎకరాలు మేము రైతు కూలీలకి పంచిన నేపథ్యంలో, రైతు కూలీ మహా సభలు పెడితే, గంజి రామారావుగారికి, నాకూ ప్రసాద్ ఎంతో సహకారాన్ని అందించాడు.

ఆ నర్సు చదివి ఖాజీపేట స్టేషన్ క్యాంటీన్‌లో కారప్పూస పొట్లాలు అమ్మడం ఏమిటని నేను ఆ ఉద్యోగం మాన్పించి ఆర్.ఈ.సి.లో ఉద్యోగం ఇప్పిస్తే, సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం మాన్పించినందుకు అందరూ నన్ను కోప్పడ్డారు. నా పిల్లలకి అతను అసలైన మేనమామ, జోనీ మెడిసిన్ చదువుకి ఎంతో సహాయం చేశాడు. అరుణతార కోసం ఎంతో కష్టపడ్డాడు. పత్రికని తన పేరు మీద మార్పించే సందర్భంగా దగ్గర రెండేళ్ళ పాటు ఉండి నాకు ఎంతో సంతోషాన్ని కలిగించాడు. మా అనుబంధాన్ని వివరించడానికి నాకు మాటలు చాలడం లేదు.

ప్రేమ, అనురాగం, మమతలకి మారు పేరైన చలసాని మార్క్సిజాన్నే సంస్కృతిగా మానవ సంబంధాలే ఊపిరిగా స్వీకరించాడు. అలాంటి చలసాని ప్రసాద్ ఆశయాలని విప్లవకారులు కొనసాగిస్తారని ఆశిస్తాను.

ప్రసాద్ కోపం పాలపొంగులాంటిది. చాలా తేలికగా కోపం వచ్చేది. అంతే త్వరగా పోయేది. మనసులో ఉంచుకొనేవాడు కాదు. ఏదైనా పని చేస్తానని చెయ్యకపోయినా, టైము పాటించకపోయినా కోపం వచ్చేది. 'నేను ఎప్పుడూ కమ్యూనిస్టును కాను' అని వంగపండు ఒకసారి 'సూర్య' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడు. నేను అది చలసానికి చూపించాను. 'కమ్యూనిస్టు కానివాడు 'యంత్రమెట్లా నడుస్తు ఉందంటే' పాట, 'సంఘం పెడదాము' పాట రాయగలడా?' అంటూ చాలా మండిపడ్డాడు.

ఒకసారి చలసానీ నేనూ ఒక సాహితీ మిత్రుడి షష్టిపూర్తి సభకు వెళ్ళాము. అక్కడ భోజనం మనిషికి 500 రూపాయలు అవుతుందని విని ఆశ్చర్యపోయి, 'ఒక్క పూట తినే తిండికి ఐదువందలా? ఈ డబ్బుతో ఎన్ని పుస్తకాలు కొనుక్కోవచ్చు!' అన్నాడు. ఒకసారి చలసాని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెద్ద కూతురు నవత (ఈ పేరు శ్రీశ్రీ పెట్టాడని మురిసిపోతూ చెప్పేవాడు) ఢిల్లీలో జర్నలిస్టుగా పని చేస్తుందని చెప్పాడు. దాని గురించి నేను ఆయన్ని అడిగితే 'ఇంటి నుంచి వెళ్ళిపోయేటప్పుడు ఆమె నాకు చెప్పిన మాట అదే. అదే చెబుతాను ఎవరికైనా' అన్నాడు.

చలసాని విరసం చరిత్ర రాయడం మొదలుపెట్టాడు గానీ అసంపూర్ణంగా ఉండిపోయింది. శ్రీశ్రీతో తన అనుభవాలు, ఇప్పటివరకు ఎక్కడా రికార్డ్ కానివి చాలా చెప్పేవాడు. వాటిని గ్రంథస్థం చేయమంటే అదీ మొదలు పెట్టాననేవాడు. తన పేరిట ఉన్న 'అరుణతార' డిక్లరేషన్‌ను మార్పించడానికి చాలాసార్లు తిరిగి, అందుకు అవసరమైన చివరి సంతకం చేసి, కొరియర్‌లో పంపిన మరునాడే మరణించాడు - దానికోసమే బతికున్నట్లుగా. పత్రిక నిరాటంకంగా రావాలని తపించేవాడు.

రాబోయే విరసం మహాసభలు బెజవాడలో జరగాలని ఆయన కోరిక. ఆ మధ్య ప్రత్యేకంగా ఫోన్ చేసి, 'మన జిల్లాలో సభలు జరిగి చాలా ఏళ్ళయింది. ఈసారి బెజవాడలోనే ఉంటాయి. నేను నెలరోజుల పాటు అక్కడే ఉంటాను. నువ్వు, అశోక్ - మీ ఇద్దరి సంపూర్ణ సహాయ సహకారాలు కావాలి' అని చెప్పాడు. మళ్ళీ అయిదు నిమిషాల్లోనే ఫోన్ చేసి, 'ఇందాక చెప్పింది ఆఫ్ ది రికార్డ్. మా కార్యవర్గం నిర్ణయించాలి. మా కార్యదర్శి ప్రకటించాలి. అప్పటి దాకా ఖాయమయినట్లు కాదు' అన్నాడు.

శివారెడ్డి అన్నట్లు 'ఒక గొప్ప ఆశ, గొప్ప పోరాట ఉత్సాహం, ఎల్లలులేని ఆత్మీయత - ఎక్కడ దొరుకుతాయి - చలసాని లాంటి వాళ్ళదగ్గర కాకపోతే?' ప్రసాద్ లేని లోటు మొత్తం సాహిత్యలోకానిది. నాలాంటి మిత్రులందరికీ అది తీరనిలోటు. ముఖ్యంగా కృష్ణక్క, వరవరరావులు తమ ఆత్మలో భాగాన్ని కోల్పోయినట్లే.

'అరుణతార' పత్రికని నెలనెలా సకాలంలో తీసుకురావడం, ప్రసాద్ రాసినంతవరకైనా శ్రీశ్రీ జ్ఞాపకాలను ప్రచురించడం, ప్రసాద్ మధ్యలో ఆపేసిన విరసం చరిత్రను కృష్ణక్కగాని, వరవరరావుగాని పూర్తి చేయడం, రాబోయే మహాసభలు బెజవాడలో 'చలసాని ప్రసాద్ ప్రాంగణం'లో నిర్వహించడమే ఆయనకు విరసం అర్పించగల నివాళి.



అరుదైన కార్యకర్త

సి.ఎస్.ఆర్. ప్రసాద్

నిత్యజీవితంలో మనకెదురయ్యే అనేకానేక మంది వ్యక్తులలో కొందరిని ప్రేమిస్తాం. కొందరిని గౌరవిస్తాం. అతికొద్ది మందిని నమూనాగా స్వీకరిస్తాం. ఈ ప్రేమించడం కానీ, గౌరవించటం కానీ నమూనాగా భావించటం గాని కేవలం వాళ్ళ వయస్సును బట్టీ, వాళ్ళ విజ్ఞానాన్ని బట్టి మాత్రమే ఉండదు. అంతకంటే ఎక్కువగా వాళ్ళ స్వభావం మీద, వాళ్ళ వ్యక్తిగత జీవిత ఆచరణ మీద, సామాజిక ఆచరణ మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. నాకు సంబంధించి నేను అమితంగా ప్రేమించిన గౌరవించిన నమూనాగా స్వీకరించిన అతికొద్ది మందిలో చలసాని ఒకరు.

1967లో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. చదవటానికి విశాఖపట్టణం వెళ్ళేటప్పటికి నాకు బహుశా నా స్వభావాన్ని బట్టి వచ్చిన కొన్ని ఆలోచనలేగాని ఎటువంటి భావజాలాల ప్రభావం లేదు. అక్కడ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐ.వి. నాకు సహ విద్యార్థి కావడం నా ఆలోచనా పరిధిని గుణాత్మకంగా మార్పు చేసింది, విస్తృతపరిచిందీ ఆయన. ఆయన ద్వారా అక్కడి మిత్రుల పరిచయం నాకొక వ్యక్తిత్వాన్ని సంతరింప జేసింది. అలా ఐ.వి. ద్వారా పరిచయంలోకి వచ్చిన వ్యక్తుల్లో కారా మాష్టారు, రావిశాస్త్రిగారు, చలసాని ముఖ్యులు. ఈ ముగ్గురిలోనూ చలసానితో పరిచయం ప్రగాఢ స్నేహంగా మారింది. ఇందుకు కారణం ఆయనలో ఉన్న అరమరికలు లేని స్వచ్ఛమైన స్నేహాన్ని అందించగల స్వభావమే.

చలసాని చాలా లోతైన మనిషి. సుదీర్ఘమైన ప్రసంగాలు, పుంఖానుపుంఖంగా రచనలు సాగించిన మనిషి కాదు. కాని ఆయన ప్రతి పలుకులోనూ, రాసిన ప్రతి పదంలోనూ ఒక చారిత్రకత, ఒక గతితత్వం, ఒక నేటివిటీ ప్రస్ఫుటంగా ఉన్నట్లు నాకనిపించేది. వీటికంటే ముఖ్యంగా మనలో చాలా మందికున్నట్లు చలసాని జీవితానికి రెండు ముఖాలు లేవు. మనకు వ్యక్తిగత కౌటుంబిక జీవనం ఒక రీతిలో ఉంటే మన సామాజిక జీవితం దానికి కొద్దిగా ఎడంగా, భిన్నంగా సాగుతుంటుంది. అంటే ఒకే మనిషిలో రెండు రకాల మనుషులు కన్పిస్తారు. చలసానిది దీనికి పూర్తిగా భిన్నమైన జీవితం. తాను బయట మిత్రులతో ఎలా ఉన్నాడో కుటుంబంతోనూ అలానే ఉన్నాడు. బయటవారికి ఎలా అర్థం అయ్యాడో కుటుంబానికి అలానే అర్థమయ్యాడు. ఇలాంటి ఏకరూప వ్యక్తిత్వం ఉండటం చాలా అరుదైన విషయం.

చలసానికి తాళం లేని ఇల్లు, జైల్లు లేని రాజ్యం అంటే ఇష్టమని చాలా మంది అంటున్నారు. ఆయన ఊహించని సమాజంలో మరొకటి కూడా కోరుకునేవాడు. అది గుడి లేని సమాజం. ఆయనకు దైవమన్నా, భక్తి అన్నా (దైవం పట్లే కాదు, వ్యక్తుల పట్ల కూడా) చాలా తీవ్ర నిరసన ఉండేది. ఈ దేశంలో హిందుత్వ ఫాసిజంగా మారే ప్రమాదాన్ని గురించి పదే పదే సంభాషణలో ప్రస్తావించేవాడు. ఫాసిజం అన్నా, రివిజనిజం అన్నా ఆయనకు పరమ అసహ్యం. రివిజనిజం సోషల్ ఫాసిజంగా మారిపోతుందని ఆయన భావన. ఫాసిజానికి ఎదుర్కొని నిలచి దాన్ని మట్టి కరిపించాడు కాబట్టే ఆయనకు స్టాలిన్ పట్ల అపారమైన అభిమానం. కొందరు ఆయనను స్టాలినిస్టు అంటారు గాని నిజానికి ఆయన కమ్యూనిస్టు. చాలా మంది రాజకీయాల ద్వారానే సాహిత్యం ద్వారానో కమ్యూనిజంలోనే ప్రవేశిస్తారు. కాని చలసాని కమ్యూనిస్టు ఉద్యమ వడిలో పెరిగిన నెల బాలుడు. అందుకనే ఆయన జీవితం అంతా కమ్యూనిజం విజయం పట్ల అసాధారణమైన నమ్మకంతో ఉండేవాడు.

చలసాని జీవితాన్ని విరసం చరిత్రలో భాగంగా రికార్డు చేయడానికి నాలుగు రోజులు చెంచయ్య తో కలసి ఆయనతో గడిపిన అనుభవం చాలా విలువైంది. ఆయన వ్యక్తిత్వ వికసనం ఎట్లా రూపుదాల్చిందో అప్పుడే పూర్తిగా అర్థమయ్యింది. పుట్టింది కృష్ణాజిల్లా కమ్మ కుటుంబంలోనైనా బతకటం కోసం తల్లీతండ్రితో కలసి కన్న ఊరు వదలి వెళ్ళాల్సి రావడం, తాను దూరంగా ఉండి చూస్తుండంగానే తన తల్లిని మలబార్ పోలీసులు విపరీతంగా కొట్టి హింసించడం, ఎప్పటికప్పుడు చదువుకు ఆటంకాలేర్పడటం, బాలసంఘం, విద్యార్థి సెడరేషన్‌లో సభ్యత్వం, స్కూలు విద్యార్థి దశలోనే ఫెడరేషన్ పత్రిక సంపాదకవర్గంలో సభ్యుడిగా

అతని వెనుక నడవడం

అరసవిల్లికృష్ణ

అతని సంభాషణలో
అతని గానంలో
గొంతు కలపేడం-
చల్లని గాలి ఏదోఅదృశ్యమయింది
జెండాలను అలంకరిస్తున్నప్పుడు
స్తూపం నిర్మాణమవుతున్నప్పుడు
మిగిలిన తెల్లవారుజాములలో
అతనిచేతులుకనబడవు
రంగులతెరలో
అతని రూపం కలగల్సింది-
ఎరుపురంగు మెరిస్తే
చిర్నవ్వు వాన కురుస్తుంది
చూస్తున్నదేదీ తనదగ్గరకురాదు-
గాలిసవ్వడికి తలవూపే వేణువు
గానం అతని కంఠంలో కాదు
నాభి నుండి ఉబికేజలపాతం

మనిషి కనబడుటలేదు

సముద్రం ఇసుక రేణువుల్లో
జైలు గదిలోఖైదీల ముఖాలలో
నగరము విడిచిన కుబుసములో
సగం చదివిన పుస్తక ముఖచిత్రంలో
అమరుని దేహం తాకిన చేతులలో
అతని గొంతు నెత్తుటి స్వరమవుతుంది-

సముద్రం కాళ్ళ దగ్గర వున్నా
సెలయేరు తవ్వకం చేసి
వెదురును పినలగ్రను చేశాడు-
ఈ దేశపు రహదారులలో
వంతెనలపై నడిచి
స్త్రీలు ఏడుస్తుంటే ఆదివాసులచేతుల్ని, దళితుల కంఠనాళాల్ని
నరుకుతుంటే
రెండు చేతుల్ని పైకి ఎగరేసి
విశాఖ సముద్రంలో పోరాటవిత్తులను నాటాడు-

ఏటి పాయలా విప్లవ ప్రవాహాన్ని చూశాడు
ప్రజల నుండి ప్రజల దాకా నడిచి
జనతన కలగా -
అతనికి తెలుసు
జెండా నెత్తుటిలో మునిగినా

జనం చేతులలోమొలకెత్తు తుందని.

ఉండటం, బాల్యం నుండే సాంస్కృతిక గళాలతో కలసి చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగానూ, తదనంతరం ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగానూ ప్రచారం చేయడం - ఇవన్నీ చలసాని వ్యక్తిత్వాన్ని రూపుదిద్దిన చిత్రాలు.

చలసాని ప్రజల్ని అమితంగా ప్రేమించేవాడు. అనేక సందర్భాలలో ఆ ప్రేమకు హద్దులుండేవి కావు. అందుకనే చాలామంది ఆయనను ఉదారవాది అనేవాడు. అయితే ఆయన ఎవరిని ఎంత ప్రేమించినా ద్వేషించాల్సిన వాళ్ళను తీవ్రంగా ద్వేషించేవాడు. అందువల్లనే ప్రేమించాల్సిన వాళ్ళను అమితంగా ప్రేమించే వాడు. ఎవరిపట్ల ఎంత ప్రేమ ఉన్నా సైద్ధాంతిక అంశాల విషయంలో మాత్రము ఎప్పుడూ రాజీపడేవాడు కాడు. అక్కడ పట్టుబట్టి అవతల వాళ్ళను ఒప్పించే ప్రయత్నం చివరికంటూ చేసేవాడు. కొందరాయనను బోలా మనిషిగా చెబుతారు. కానీ చలసానికి వ్యక్తుల పట్ల ఖచ్చితమైన అంచనా ఉండేది. ఆ అంచనాకి పునాది వర్గ ప్రయోజనంతో కూడిన దృక్పథం.

చలసానికి తన జీవిత లక్ష్యం పట్ల, అందుకు అనుసరించాల్సిన మార్గంపట్ల, ఆ క్రమంలో ఎదురయ్యే వ్యక్తుల స్వభావంపట్ల, వాళ్లతో అనుసరించాల్సిన తీరు పట్ల చాలా స్పష్టత ఉన్నది. అందుకే ఆయనకు ఎప్పుడూ తడబడాల్సిన అవసరం రాలేదు. తెలంగాణా పోరాటం విద్రోహానికి గురైనప్పుడు గాని, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు వెనుకపట్టు పట్టినప్పుడుగాని, రష్యా, తూర్పు యూరోప్ పరిణామాల సందర్భంలో గాని అయన విప్లవ విజయం పట్ల అందరిలాగా వుగిసలాటకు గురి కాలేదు.

మార్క్సిజం అంటే, కమ్యూనిజం అంటే వర్గపోరాటం, శ్రామిక వర్గ నియంతృత్వం, వర్గాల రద్దు - అనే సూత్రీకరణ చట్రంలో మాత్రమే చలసాని అర్థం చేసుకోలేదు. ఆయన దృష్టిలో కమ్యూనిజం అంతకంటే లోతైంది. విస్తృతమైంది... అదొక జీవిత విధానం. ఆయనే చెప్పినట్లు మార్క్సిజాన్ని విశ్లేషణా శాస్త్రంగా, ఒక పోరాట శాస్త్రంగా తాను స్వీకరించాడు. అలా స్వీకరించాడు గనుకనే, దాన్ని తన జీవన విధానంగా ఎంచుకున్నాడు కాబట్టే చలసాని జీవితానికి, ఆచరణకి మధ్య ఎక్కడా ఎలాంటి వైరుధ్యం లేకుండా కమ్యూనిస్టుగా జీవించగలిగాడు.

వీటన్నింటితో పాటు చలసానిలో నన్నాకట్టుకున్న మరొక ముఖ్యమైన లక్షణం ఆయనలో ఉన్న నిరాడంబరత. ఈ నిరాడంబరత రూపానికి మాత్రమే పరిమితమైంది కాదు. ఆయన స్వభావం కూడా నిరాడంబరమే. ఎప్పుడూ దేని మీద ఆధిపత్యాన్ని కోరుకున్నాడు కాదు. అన్ని ఆధిపత్యాలను సదా వ్యతిరేకించిన వాడు. ఆయనకు ఎటువంటి భేషజాలు లేవు. ఆయనది అభిజాత్యం లేని వ్యక్తిత్వం. విరసం వ్యవస్థాపక పత్రం మీద నీ సంతకం ఎందుకు లేదని అడిగితే చాలా తేలికగా నేను రచయితను కాదు గదా అని సమాధానం చెప్పాడు. తన్ను తానొక నాయకుడుగా ఏనాడూ భావించలేదు. ఒక కార్యకర్తగా గుర్తింపు పొందడంలోనే గౌరవం ఉందనుకున్నాడు. చలసాని మరణం విప్లవోద్యమానికి ఒక గొప్ప కార్యకర్తలేని లోటును తెచ్చి పెట్టింది.

చలసాని నాకెలా తెలుసంటే...

బొప్పూడి సాగర్

చలసానిని ప్రత్యక్షంగా చూడటానికంటే ముందు నుంచి నేను ఆయన గురించి పరోక్షంగా వినడం వల్ల చలసాని మీద ఆసక్తి, అభిమానం పెంచుకున్నాను. మొదటిసారి పదో తరగతి చదివేటప్పుడు చలసాని గురించి, ఆయన ఇంట్లో ఉండే పుస్తకాల గురించి, శ్రీశ్రీ స్మృతుల గురించి వినటం వల్ల ఒక్కసారి అయిన ఇల్లు చూడాలని అనుకున్నాను. ఆ తరువాత విశాఖలో శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా విరసం మహాసభలకు వెళ్ళినపుడు చలసాని ప్రసాద్‌ని, ఆయన ఇంటిని చూడాలని అనుకున్నాను. ఆ సభలకు వచ్చిన మిత్రులందరినీ శ్రీశ్రీ మరో ప్రస్థానం రాసిన ప్రదేశానికి చలసాని ర్యాలీగా తీసుకువెళ్ళాడు. ఆ సమయంలో అక్కడ ఏదో అభ్యుదయ సంఘం వాళ్లు శ్రీశ్రీ శత జయంతి సభను భారీ ఎత్తున జరుతున్నారు. వాళ్లకూ మనకూ సంబంధం లేదని సీపీ నిష్కర్షగా చెప్పాడు. ఆ తర్వాత నాతో పాటు ఉన్న కొంత మంది మిత్రులం శ్రీశ్రీ మరో ప్రస్థానం ఎక్కడో కొండ మీద రాసి ఉంటే సీపీ మనల్ని అక్కడి దాకా నడిపించేవాడు కదా అని నవ్వుకున్నాం.

చలసాని చరిత్రకు, ఉద్యమానికి సంబంధించిన ప్రతి దానిని ఎంత అపురూపంగా చూస్తాడో, ముందు తరాల వారికి ఎలా అందించ గలుగుతాడో చూస్తే అర్థమౌతుంది. మహాసభల అయిపోయిన రోజు చలసాని బంధుమిత్రుల సంఘం పద్మకుమారి దగ్గరకు వచ్చి ఎంతో వాత్సల్యంగా తన తలతో పద్మ తలకు ఢీ కొట్టి 'ఏరా బోడి ఎప్పుడు వెళ్ళేది?' అని అడిగాడు. ఇంకా రిజర్వేషన్ కాలేదని తెలుసుకుని అక్కడ ఉన్న అమరుల కుటుంబాల దగ్గరికి తీసుకువెళ్ళాడు. ఆ పని ఏబీఎంఎస్‌కు అవసరం అని భావించాడు. ఉద్యమాన్ని అభిమానించే వారిని, ఉద్యమం కోసం పనిచేసే ఎవరిని ఎవరినైనా తన సొంత వారిలానే చూసేవాడు. అందుకే కాబోలు చలసాని ప్రసాద్‌తో పరిచయం ఉన్న ఎవరైనా ఆయన గురించే చెప్తున్నట్టు ఆనందంతో చలసాని ప్రసాద్ జ్ఞాపకాలు చెప్తుంటారు. ఆయన మనుషులను అంతలా ప్రభావితం చేశాడు. బంధుమిత్రుల సంఘం వారితో కలసి ఉత్తరాంధ్ర వైపు వెళ్ళటం మొదలుపెట్టాక, చలసాని ప్రసాద్ కూడా వస్తున్నాడా అని అడగడం నాకు అలవాటైంది. నా మీద చలసాని ప్రసాద్ ప్రభావం అలా పడింది. నేను చలసాని ఇంటికి వెళ్ళినపుడు బెరుకుగా ఉండటం గమనించి ఆయనే నా దగ్గరికి వచ్చి నవ్వు మళ్ళీ మళ్ళీ ఇక్కడికి రావలసి ఉంటుంది కదా! అన్నాడు. నేను మరలా అక్కడికి వెళ్తానో లేదో నాకే తెలియదు. కాని చలసాని ప్రసాద్ మాత్రం అలా నాలో ఉన్న బెరుకుతనాన్ని పోగొట్టాడు. చలసాని ప్రసాద్ ఇంటికి ఎవరు వచ్చినా అది తమ ఇల్లే అనే భావనను వారిలో కలిగించాడు. ఒకసారి పౌరహక్కుల సంఘం నాయకుడు సుగునాథం, తిలక్ అనే ఆదివాసీ మిత్రులను మావోయిస్టులతో సంబంధం ఉన్నాయని నిర్బంధంలోకి తీసుకోవాలని చూడగా, వారు తప్పించుకొని సీపీ ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు చలసాని ఇంటిని చుట్టుముట్టారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో, విషయం తెలుసుకొన్న మీడియా వాళ్లు హైదరాబాదులో ఉన్న చలసానిని ఈ విషయం అడిగారు. అప్పుడు ఆయన 'అవును.. వాళ్లిద్దరూ నా మిత్రులు. వాళ్లు మా ఇంటికి వస్తారు. వాళ్లకు ఆ హక్కు ఉన్నది..' అన్నాడు. చలసాని మామూలప్పుడే కాదు నిర్బంధ సమయాల్లో కూడా ఒకే విధంగా ఉండేవాడు. రాజకీయంగానే సంబంధాలు చూసేవాడు.

సెప్టెంబర్ 21 అరెస్టులు జరిగిన తరువాతి రోజు చలసాని ప్రసాద్ మా దగ్గరికి వస్తే మిమ్మల్ని కూడా అరెస్ట్ చేశారనుకున్నాను... అని అన్నాను. ఇక్కడ నేనెవరికి తెలుసు? విశాఖ అయితే చేసేవారేమో అన్నాడు.

చలసాని ప్రసాద్ అందరిలో కలిసిపోయాడు. అందేకే విరసంలో ఉన్న పాత సభ్యుడి దగ్గర నుంచి కొత్తగా చేరిన మా తరం వారితో కూడా ఆయన అదే అనుబంధాన్ని కొనసాగించాడు. చలసాని ప్రసాద్‌కి వయసు రీత్యా ప్రయాణాలు చేయటం కష్టమైనప్పటికీ ఎన్‌కౌంటర్లు జరిగినపుడు ఎన్ని పనులున్నా వారి అమరత్వాన్ని ఎత్తి పట్టడానికి ముందుడేవాడు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దాన ప్రాంతం అక్కుపల్లిలో కామ్రేడ్ పూర్ణిమ సంస్మరణ సభకు రావాలని చలసానిని పద్మ అడుగుతున్నప్పుడు నేను పక్కనే ఉన్నాను. దానికి చలసాని నాకు అదే రోజు సాయంకాలం హైదరాబాదుకు రిజర్వేషన్ ఉంది. నన్ను త్వరగా పంపిస్తావా నాన్నా అని అడిగాడు. రాను పోను ఏడు గంటల ప్రయాణం ఎలా సాధ్యమని పద్మ అడిగితే.. తప్పదు కదా, అమరుల సభ కదా? పైగా ఆ కుటుంబంతో నాకు పరిచయం ఉంది. రెండు పనులూ ముఖ్యమే... అని ఆ సభకు వచ్చాడు. అమరత్వం-మాతృత్వంపై వచ్చిన కాంత పున్నం వెన్నెల కథను ఆవిష్కరించి పూర్ణిమ జీవితాన్ని అందులోంచి వివరించాడు. ఆ సభలో మాట్లాడి మళ్లీ వెంటనే హైద్రాబాద్‌కి బయలుదేరి వెళ్ళాడు. నిజానికి ఆయన వయసు రీత్యా అది చాలా కష్టంతో కూడినది. చలసాని ప్రసాద్‌కి అమరుల మీద ఉన్న ప్రేమ అలాంటిది. గత జూన్ నెలలో కామ్రేడ్ సూర్యం ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు బంధుమిత్రుల సంఘం వారు చలసాని ప్రసాద్ వయసు దృష్ట్యా చెప్పకపోయినప్పటికీ, వారు విశాఖకు వేకువ జామున 4 గంటలకే వస్తారని తెలుసుకుని మెలకువ వస్తుందో రాదో అని రాత్రంతా మేలుకుని సూర్యం కుటుంబాన్ని, బంధుమిత్రుల సంఘం వారిని కలుసుకుని, సూర్యం మృతదేహాన్ని వారికి అప్పగించే వరకు వారితోనే ఉన్నాడు. విరసంలో ఉన్న అన్ని తరాల సభ్యులు కూడా చలసాని ప్రసాద్‌తో ఉండటానికి ఎంతో ఇష్టపడుతుంటారు. నిజానికి కొత్తగా విరసంలో చేరిన నాలాంటి వారికి ఇక మీదట చలసాని ప్రసాద్‌తో కలిసి ఉండటం, పనిచేసే అవకాశం ఉంటుందని ఎంతో ఆనందపడ్డారో. కాని వారికి మాత్రం దుఃఖం ఎదురైంది. చలసాని ప్రసాద్ తన సహచరి విజయ భౌతిక కాయాన్ని హాస్పిటల్‌లో వదిలేసి వచ్చినపుడు ఎంత బాధపడ్డాడో బివిఎన్ అప్పారావుగారు చెప్పినప్పుడు మాకు చాలా బాధ కలిగింది. చలసాని ప్రసాద్ మృతదేహాన్ని కూడా అలాగే వదిలి పెట్టి వచ్చేటప్పుడు అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఎంత కన్నీరు పెట్టారో అలా విడిచి రావాల్సి వచ్చినందుకు. అంతగా చలసాని ప్రసాద్ అందరిలో ఒక్కడిగా, అందరివాడుగా భావించబడ్డాడు. ఈ రోజు సోషల్ మీడియాలో హీరోల, రాజకీయ నాయకులు జీవిత విధానాలని చూపిస్తూ యువతకు వీరే ఆదర్శం అని తప్పు దారి పట్టిస్తున్నారు. కాని చలసానితో కొన్ని పరిచయమే ఉన్నా ఎవరికైనా ఎలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలో అర్థవుతుంది. ప్రజలకు, ప్రజా సంఘాలలో పని చేసే అందరికి కూడా చలసాని ప్రసాద్ జీవితం, ఆయన పాటించిన విలువలు ఎంతో ఆదర్శప్రాయమైనవి.

మూడు తరాల నేస్తానికి ప్రేమతో...

చిన్ని చుక్కు (అనూరాధ సుధ)

కొందరికి బాబాయి, సి.పి. చలసాని అయినట్లు విరసం వ్యవస్థాపక సభ్యుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్ మా ఇద్దరికి మామయ్య. మా కుటుంబంలో మూడు తరాల వారిని తాతయ్య కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్యా, మా నాన్న రమేష్ బాబు, అమ్మ కరుణ, మమ్మల్ని అమితంగా ప్రేమించిన వ్యక్తి. మా అమ్మానాన్నలే కాదు వి.ఎస్. కృష్ణ (ఆయన మాటల్లో కిష్టిగాడు) తల్లిదండ్రులు వాసిరెడ్డి వెంకటప్పయ్య, పుష్పగార్లంటే కూడా ప్రాణం. అత్తమ్మని (పుష్ప) వారానికి ఒకసారైనా కలిసి స్వాతి పత్రికలు కాసేపు కబుర్లు చెప్పనిదే ఆయనకు సంతృప్తి ఉండేది కాదు. కొన్ని మమకారాలు అక్షరానికి లొంగనివి. అత్తమ్మ చనిపోయే ముందు రోజు ఆమె, మామ హాయిగా కబుర్లు చెప్పుకుని మామ వెళ్లిపోయేటప్పుడు అత్తమ్మ పైనుండి చేయి ఊపుతూ ఉల్లాసంగా నవ్వుతున్న దృశ్యం ఎప్పటికీ చెదిరిపోదు. ఆ స్నేహం అలా ముగిసింది. ఉండండి. అది ముగిసిందకుందామా? ముగిస్తే మా జ్ఞాపకాల్లో అంత నిక్షిప్తంగా ఎలా ఉండిపోయింది?

తాతయ్యతో ఆయన అనుబంధం గురించి విన్నదే కాని ప్రత్యక్షంగా చూసింది చాలా తక్కువ. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో మృతి చెందిన చలసాని జగన్నాధరావుగారి అన్న కొడుకు, చలసాని శ్రీనివాసరావు తమ్ముడైన ప్రసాద్ మామయ్యతో తాతయ్యకి వరంగల్ వెళ్లిన తర్వాతే బాంధవ్యం పెరిగింది. వ్యక్తిగత జీవితంలో రకరకాల సంక్షోభాల్లో కూరుకుపోతున్న తాతయ్యను తిరిగి విప్లవోద్యమంవైపు మళ్లించిన వారిలో మామయ్య పాత్ర కూడా ఉంది. మనుషుల్లో మంచితనాన్ని నిలపడం తెలిసిన వ్యక్తి ప్రసాద్ మామ.

ప్రసాద్ మామకు ఎవరో ఒక పెళ్లి సంబంధం తెస్తున్నారని తెలిసి అర్ధరాత్రి వేళ తాతయ్య కంగారుగా ప్రసాద్ మామ ఇంటి తలుపు తట్టి నిద్రలేపి పెళ్లి గురించి నీ అభిప్రాయమేమిటని అడిగాడట. నిద్ర కళనున్న మామకు ఈయన ఏమడుగుతున్నాడో ఓ క్షణం బోధపడలేదట. అప్పటి వరకు ఆ ధ్యాసలేని మామకు పొట్లూరి సుదర్శనం, సీతామాలక్ష్మమ్మగారి అమ్మాయి విజయలక్ష్మి పెళ్లి ప్రతిపాదన పెట్టాడట. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో రహస్య జీవితం గడుపుతున్నప్పుడు విజయత్తమ్మ పసిపిల్ల. తనని తాతయ్య గుండెలపై ఎత్తుకుని ఆడించేవాడని మురిపెంగా చెప్పేవాడు మామ. సీతామాలక్ష్మమ్మ గారు గుడివాడ తాలూకాలోనే గొప్ప వక్తని, మహిళా సంఘం కార్యకర్తని మా అమ్మమ్మ ఎప్పుడూ చెబుతూ ఉండేది. ప్రసాద్ మామ, విజయత్తమ్మ పెళ్లి కుదిర్చి మా తాతయ్య 'మావిడాకుల' సీతారామయ్య అనే పేరుని సార్థకనామధేయం చేశాడు. మా తాతయ్య చేసిన మంచి పనుల్లో ఇదొకటని చెప్పుకోవచ్చు. విజయత్తమ్మ మామకు దొరికిన ఒక అరుదైన వరం. నవత పుట్టినప్పుడు ఎందుకో తెలీదు సుబ్బమ్మ పుడుతుందనుకుంటే అప్పలమ్మ పుట్టిందని తాతయ్య నిండుగా పకపకా నవ్వుతూ చెప్పేవాడు.

ఇక మా నాన్న రమేష్ విషయానికి వస్తే విద్యార్థి దశలో మా నాన్న ఎప్పుడో తన వద్ద ఒక పుస్తకం తీసుకున్నాడట. కనిపించినప్పుడల్లా చెప్పేవాడు. మా అమ్మాయి కరుణని జాగ్రత్తగా చూసుకోమని, ఖబడ్దార్ అన్నట్లు మాట్లాడేవాడు. వరంగల్‌లో ఉండగా సాయం సంధ్యవేళల మామ పనిచేసే రైల్వే కార్యాలయం వద్దకు వెళ్లి తనతో గడిపిన క్షణాల గురించి నాన్న డైరీలో ప్రస్తావించాడు. మామ ఉప్పొంగే ఝరైతే, మా నాన్న నిశబ్ద ఉష్ణసరస్సు. నవ్వి ఊరుకునేవాడు. ఉండుండి ఒక్క మాటనే వాడు. అది పరిహాసమైనా కావచ్చు. ఘాటైన విమర్శయినా కావచ్చు. విజయత్తమ్మ, మా నాన్నల స్పందనలు అలాగే ఉండేవి. వ్యక్తిగత, వృత్తి, సామాజిక జీవితాల్లో తొలి అడుగులు వేసే ఇరవయ్యవ పడిలో ఉన్న అమ్మ, నాన్న వరంగల్‌లో తాతయ్య, ప్రసాద్ మామ, కృష్ణత్త, కె.జి.సత్యమూర్తి గారితో అతి విలువైన కాలం గడిపారు. ఎవరికివారే విశిష్టమైన వ్యక్తులు. విశిష్టమైన జీవితాలు వారివి. ఒకర్ని ఒకరు ఉత్తేజపర్చుకునే ఆంగ్రీ సిక్సీస్ (angry sixties) కాలమది. ఆ గడిచిన రోజుల ప్రభావం వారి జీవితాలపై చెరగని ముద్ర వేసాయి. వారి జీవితాల మీదే కాదు నళినక్క, పద్మినక్క, నవత, మమత, మా జీవితాలపై కూడా.

☆

మా అమ్మా నాన్నల వివాహం కృష్ణత్త, ప్రసాద్ మామ సహకారం లేనిది జరిగేది కాదు. ఉద్యమరీత్యా తాతయ్య జన్నారం, ఉద్యోగరిత్యా కృష్ణత్త, ప్రసాద్ మామల కుటుంబాలు విశాఖతీరానికి, మా అమ్మానాన్నలు బస్తరు అడవుల్లో కొండగ్రావ్, తర్వాత దేశరాజధాని ఢిల్లీకి పయనమయ్యారు. ఎవరి రాజకీయ, సాహిత్య ప్రస్థానం వారిది. ప్రతి ఏడాది వేసవి సెలవులు అమ్మావాళ్లూ, ప్రసాద్ మామ, కృష్ణత్తలతో గడపాల్సిందే. మమ్మల్ని 1973 వరకు బెజవాడలో అమ్మమ్మవద్దో, రాణివారిపాలెంలో నాయనమ్మ తాతయ్యలవద్దో జమచేసి, అమ్మానాన్న విశాఖపట్నం వెళ్లేవారు. ఎన్.ఎస్.ప్రకాశరావుగారు చనిపోయిన సంవత్సరం మొదటిసారి మమ్మల్ని విశాఖపట్నం తీసుకుని వెళ్లారు. ఊహ ఎరిగిన తర్వాత వారిని చూడటం అదే మొదటిసారి. వేణుమామ సహా అందరూ క్రమశిక్షణ మహానిష్టగా పాటించేవారు. ఆ విషయంలో వారి నిష్ట చూస్తే ఇప్పటికీ కూడా కించిత్తు భయమేస్తుంది. క్రమశిక్షణ పాటించినా ప్రసాద్‌మామ వారందరిలో వేరుగా ఉండేవాడు. మమ్మల్ని మొదటిసారి లాసెన్స్‌బేలో సముద్రతీరానికి తీసుకుని వెళ్లాడు. అంగోస్త్రం మినహాయించి మరే ఆచ్ఛాదనా లేకుండా హాయిగా సముద్రంలోకి దిగిపోయి చిన్నపిల్లాడిలా ఈతకొట్టడం మొదలెట్టాడు.బెంగాలీ మొషాయిలాంటి మా నాన్నని బనీను లేకుండా కూడా ఏనాడూ చూడని మేము మామని అవాక్కయి చూస్తూ ఉండిపోయాం. బిడియమన్నది ఎరుగడు కద మామ. మమల్ని ఆడించాల్సింది పోయి ఆయనే ఆడుకున్నాడు. ఇక మామంటే మాకెందుకు భయముండాలి చెప్పండి. తనంటే ఆనాటి నుండి ఈనాటి వరకు ఏనాడూ భయం కలగలేదు. భయపెట్టే గుణం తనలో బొత్తిగా లేదు. అది ఒక విలువైన మానవ లక్షణం. ఈ రకంగా మమ్మల్నే కాదు భీమేశ్వరరావు అంకుల్, పద్మ అంటీ పిల్లలు మధు, జ్యోతి, జయశ్రీలను కూడా మొదటిసారి సముద్రతీరానికి తీసుకుని వెళ్లింది మామే.

చిన్నప్పుడు సీసాండ్స్, సిరిపురం, 15 ఎల్.ఐ.జి. క్వార్టర్స్‌లో జరిగే రాజకీయ వాదోపవాదాలు చూస్తే భయం వేసేది కాదు. అంత మంది జనం ఉంటే అన్నం మటుకు అతి చిన్న పాత్రలో ఉండేది. రోజంతా ఆడి నకనకలాడిపోయే మాకు ఆ చిన్న పాత్రలో అన్నం చూసి ఎక్కడ లేని భయమేసేది. ఈ అన్నం ఏమూలకొస్తుందని అనిపించేది. ఈ భయాన్ని తర్వాత జె.ఎన్.ఎం. దివాకరన్న, గద్దర్, భీమేశ్వరరావు అంకుల్ పిల్లలు కూడా మాతో పంచుకున్నారు. అంటే అది మా సమస్యే కాదు. అది సార్వజనీనమైనదనీ మాకు తర్వాత అర్థమైంది. ఆ రెండు కుటుంబాలు ఆరోగ్య సూత్రాలకు ఎంత మంది బలయ్యారో! నాకు తెలిసింది వీరే. ఆ చిన్న పాత్రలో కూడా వారికి అన్నం మిగిలేది!! మిగిలిన శేషం, ఇతర పాత్రల్లోని శేషాలన్నీ కృష్ణత్త, విజయత్తమ్మ మామ పళ్లెంలో వేసేవారు. అదో గురుతర బాధ్యతగా తినేసేవాడు మామ. తెలుగు సాహిత్యం ఆ మూడు ఇళ్లల్లో సేద తీరింది. సాహితీమిత్రులు మరింత బాగా చెప్పగలరు ఆ విషయాన్ని. ముప్పాళ్ల రంగనాయకమ్మగారి లాంటి వారు ప్రత్యక్ష సాక్షులు. సముద్రంలో ఎన్ని తుఫానులు చెలరేగాయో కాని ఆ ఇంట్లో మటుకూ నిత్యం రాజకీయ తుఫానులు చెలరేగుతూ ఉండేవి.

మా నాన్న రమేష్ చనిపోయిన తర్వాత మా జీవితాల్లో ప్రసాద్ మామ, కృష్ణత్తల పాత్ర పూర్తిగా మారిపోయింది. విజయవాడకు వచ్చేసిన మా అమ్మను కాపాడుకోవడమే వారి పరమావధి అయిపోయింది. మాకు ఊహ తెలిసేనాటికి మా మేనమామ కొండపల్లి చంద్రశేఖర్ ఆజాద్ చనిపోయాడు. మాకు తెలిసిన మా అమ్మ 'అన్న' ఎవరంటే ప్రసాద్ మామే. అమ్మను అంత అమితంగా ప్రేమించిన వారిని వేళ్లపై లెక్క పెట్టవచ్చు. మా నాన్న చనిపోయినప్పుడు అమ్మ విశాఖలో మామని, కృష్ణత్తని వెతుక్కుంటూ పోయింది. ఆ తర్వాత పదేళ్లపాటు మా అమ్మని గాజుబొమ్మని కాపాడినట్లు కాపాడారు వాళ్ళిద్దరు. అమ్మ పోయిన తర్వాత తిరిగి మేము సేద తీరింది విశాఖపట్నం 15 ఎల్.ఐ.జి. ఇంట్లోనే. వారి ద్వారానే విరసం, విప్లవ రాజకీయాలు మా జీవితాల్లోకి ప్రవేశించాయి. 1980ల్లో విజయవాడలో మా ఇల్లు మరో సాహితీ రాజకీయ కేంద్రమైంది. అదొక జీవితం. ఉగాది పచ్చడిలాంటి జీవితం. కొన్ని మంచి జ్ఞాపకాలు. కొన్ని చేదు అనుభవాలు. మామ చల్లని స్పర్శ మటుకూ ఎప్పుడూ ఉండేది. మామ అమ్మ చెయ్యి ఎన్నడూ విడిచిపెట్టలేదు.

1989లో అమ్మ చనిపోయిన కొన్ని సంవత్సరాలకే పీపుల్స్‌వార్ పార్టీలో రెండవ చీలిక వచ్చింది. ఆ చీలికలో తాతయ్య ఒకవైపు మిగిలిన వారు ఒకవైపు.

అందరూ ఎప్పుడూ 'politics in command'గా బ్రతికిన వాళ్లు. ఈ మూడు పదాలు జీవితాలను ఎంత ఛిద్రం చేస్తాయో ఆ పదాల 'విలువ' తెలిసిన వారందరికీ అర్థమవుతుంది. నిన్నటి వరకు ప్రాణానికి ప్రాణం పణం పెట్టే స్నేహితులు ఒక్కసారే బద్ధశత్రువులై పోవడం. మనం నిగడదన్ని ఆనుకునే గోడలు ఒక్కసారి కుప్పకూలిపోవడం, అదృశ్యమవడం... అటువంటి సమూహ ఏకాంతాలు, ఏకాంత సమూహాలు ఎన్నటిని దాటుంటాడు పాపం మామ. మనుషుల మధ్య, మనుషుల హృదయాల్లో ఒక్కసారిగా మొలుచుకుని వచ్చే గోడలలో కొన్ని ఇటుకలను పక్కన పెట్టి పసిపిల్లవాడిలా స్నేహహస్తం జాపే వాడు మామ. కొందరితో మెంబరు ప్రేమైతే కొందరితో మెంబరేతర ప్రేమ. ఆ మమకారమే మామని ప్రతి ఊరిలో ఒక్క స్కూటరు వెతుక్కుని మనుషుల చుట్టూ తిప్పేది. బెజవాడ వస్తే అనసూయమ్మ 'అక్కాయ్' ఇంటో బస. నారాయణమూర్తి బాబాయి, డాక్టరు వసుంధర, పరకాల పట్టాభి రామారావుగారు, నవోదయ రామ్మోహనరావు, వేగుంట మోహనప్రసాద్, కరుణలను కలవకుండా వెళ్లేవాడు కాదు. ప్రజాశక్తినగర్, మొగల్‌రాజపురం అంతా చుట్టుపెట్టుకుని వచ్చేవాడు. అరసం పరకాలతో విరసం చలసాని ప్రసాద్ చుట్టరికం ముచ్చట పదేపదే చెప్పేవాడు. తాను సీతామాలక్ష్మమ్మగారి అల్లుడు, విజయ భర్త అన్న విషయం తెలిసిన తర్వాతే పట్టాభిగారు తనతో ఆప్యాయంగా మాట్లాడ్డం మొదలుపెట్టారట. అప్పటి వరకు పాపం మామ తస్మదీయుడే. ఈ మాట చెప్పినప్పుడల్లా మామ కళ్లలో మెరుపు. చెద్దరని చిలిపి నవ్వు. ఒక గుండెలో మొలిచిన గోడని కూల్చాననే ఆనందమేమో. మనిషిని మనిషి ప్రేమించలేకపోతే ఇక మనం చెప్పేది దేనికి పనికొస్తుందని చెప్పుకుపోయేవాడు.

అమ్మ చనిపోయిన తర్వాత అండర్‌గ్రౌండ్‌లో ఉండగా తాతయ్య తన స్వగ్రామం జొన్నపాడు వెళ్తానని మొండిపట్టు పట్టినప్పుడు ఆ ప్రమాదాన్ని తన మెడలో వేసుకుని తాతయ్యని గుడివాడకు తీసుకుని వచ్చాడు. కొన్నాళ్లకి 'politics in command' అడ్డమొచ్చి వారి స్నేహానికి హద్దులు ఏర్పడ్డాయి. ఎవరి మతి చెదిరిందో, ఎవరి మతి స్థిమితంగా ఉందో చెప్పలేము. అవి మతి చెడే రోజులే మరి. ఇప్పుడు ఎవరిని తప్పు పట్టి ఏం లాభం? ఎవరి రాజకీయ విశ్వాసాలు వారివి. ఆఖరుకి మిగిలింది మానవ సంబంధాల శిధిలాలు. ఆ శిధిలాల నుండి పైకి లేచి తిరిగి స్నేహహస్తం జాపే ప్రయత్నం చేసిన వారిలో ప్రసాద్ మామ మొదటి వ్యక్తి.

తను అమితంగా ప్రేమించే, ఆరాధించే వ్యక్తులను ఎవరైనా విమర్శిస్తే అసలు సహించలేకపోయేవాడు. ముఖ్యంగా స్టాలిన్, శ్రీశ్రీ, రావిశాస్త్రిలను. కృష్ణ ఎప్పుడు స్టాలిన్ చర్యలను విమర్శిస్తూ మాట్లాడినా చాలా కోపగించుకునేవాడు. అవన్నీ సామ్రాజ్యవాద ప్రచారాలని, వాటిని పట్టించుకోకూడదని బలంగా నమ్మేవాడు. స్టాలిన్ మీద వాళ్ళిద్దరి చర్చ ఎప్పటికీ తెగలేదు. అలాగే శ్రీశ్రీ గురించి అమ్మ చాలాసార్లు ప్రసాద్

కార్యశీల మహా స్వాప్నికుడు

జనజ్వాల

నిన్నకాక మొన్ననే కాద తడి ఆరని గొంతుతో కవిత్వం మీద ఎర్రజెండాను ఎత్తి పట్టుకొని, నలభై అయిదు ఏళ్ల సుదీర్ఘ ప్రయాణ పాటను పాడుతు పాడుతు, లోకానికి బాసటగా 'రచయితలారా మీరు ఎటువైపు' అదే చరిత్ర ప్రశ్నను మండిస్తూ అగ్ని పునీతంతో మళ్ళీ ఒక్కసారి ప్రతిజ్ఞ పూనింది చలసాని ప్రసాద్ సార్ చేసిన సంతక వసంతం.

ప్రసాద్ సార్ అంటేనే విశాఖ సముద్రం తల ఎత్తి విప్లవాల ధైర్యాన్ని ఇచ్చింది. అప్పుడప్పుడు ఏదో దారికి మసక మసక పొరలు కమ్మినప్పుడు, విశాఖ సముద్ర అలమీది తలనేకాద తల పండిన అనుభవాల ధనస్సు మండించి కాగడా అందించింది.

ఇంటికి పెద్ద దిక్కులా విప్లవాలకు తూర్పు దిక్కుల కోడై రాసిన ఏనభైమూడు ఏళ్ల యవ్వన బాల్యాన్ని చిలికి చిలికి వృద్ధాప్యానికి అధ్యయన యవ్వనం తొడిగించి, మనిషి జీవితానికి కొత్త ఊపిరి ఊదిన ధన్యజీవి ప్రసాద్ సార్. తన పేగు బంధం విప్లవానికి కొలిమై మండుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం అది. జై తెలంగాణకు గొంతు ఎక్కుపెట్టిన తొలితరం ధనస్సు అది.

జైళ్లు అంటే ఏదో మీటింగ్‌లకు పోయేంత సునాయసంగా, చేతిలో పుస్తకం చదువుతున్నంతా తేలికగా, జైళ్ల అర్థం మార్చినవాడు.

అందుకే చలసాని ప్రసాద్ కాదు చెరసాల ప్రసాద్ అనీ గర్వంగా పిలుచుకునేవారు మిత్రబృందం.

దొడ్డి కొమురయ్య అమరత్వం (అమెరికా స్వాతంత్ర్యం) అదిమి పుచ్చుకుని 4 జూలై 70 మీద సంతకం చేసిన బడబాగ్ని హస్తాలలో సారధి కూడా చెదరని చరిత వెంటా చివరికంటూ నిలిచిన హస్తక సంతకం.

ఆంధ్రజ్యోతి వివిధ సాహిత్య పేజి ఇంకను వారం గతించను లేదు. సార్ వ్యాస అక్షర పిల్లలు పావురాలతో ఆట ముగించను లేదు. కానీ అమరత్వ కొండలను తొవ్వడానికి సార్ సాహిత్య ప్రియులకు పని పెట్టిండు.

ఈ పెద్ద తలకాయలు ఏమి మాట్లాడుకున్నవో ఏమో, సరిగా చేరా మాస్టార్ ప్రథమ వర్ధంతికి సార్ అమరత్వం మనముందు ఉంచిండు. శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రి ఇలా పెద్ద తలకాయలన్ని ఏదో అమరత్వ వ్యూహం రచించుకున్నారో ఏమో. ఈ తరం చావు మీరే చావండి అంటు ఏదో something wrong.

వాళ్లంతా విప్లవ రక్త సముద్రాన్ని నింపుకొని, ఇల్లంతా పుస్తకాల ఇటుకలతో కట్టుకున్న గొప్ప స్వాప్నికుడు, అయిదేళ్ల పాయాన్నే అనివార్యమైన మార్క్సిజాన్ని సముద్రం పాయగా చేసుకున్న కలం యోధుడు. కార్యశీల మహాస్వాప్నికుడు.

సముద్రం మీద వాలిపోతున్న సంధ్యపొద్దు అమరత్వం సాక్షిగా అక్షర విప్లవ అర్పణం చేస్తూ...

ఒక చేతితో కన్నీటిని తుడ్చుకుంటు, మరో చేతిలో ఎత్తి పట్టుకుంటాం నీవు చేసిన సంతకం జెండా.

☆

మామతో తగువు వేసుకునేది. నిజానికి తను కూడా శ్రీశ్రీ వీరాభిమానే అయినా స్త్రీల పట్ల ఆయన ధోరణి గురించి ఒక రోజు తీవ్రంగా విమర్శిస్తూ రంగనాయకమ్మ వాదనను సమర్థిస్తూ పెద్ద చర్చే జరిగింది. అవి శ్రీశ్రీ 'అనంతం' అచ్చయిన రోజులు. 'అనంతం'లోని కొన్ని బూతు పురాణాలను ప్రస్తావిస్తూ అమ్మ, రచయిత పి.రామకృష్ణారెడ్డిగారు శ్రీశ్రీని విమర్శిస్తుంటే మామకు ఎక్కడ నుండో ఫోన్ వచ్చింది. ఫోన్ అందుకున్న మామ నిశ్చేష్టుడై ఒక్క మాట మాట్లాడకుండా వింటున్నాడు. మేమంతా ఏమైందా అని కంగారుగా విన్నాము. ఫోను రిసీవర్ పెట్టేసి 'Sri Sri is no more' అని చాలా కసిగా, కోపంగా ప్రకటించాడు. 'మీకు ఇప్పుడు సంతృప్తిగా ఉందా' అన్న మాట ఒక్కటే అనలేదు కాని ఆ ధ్వని అందరికీ కలిగింది. వాదనలను పక్కనపెట్టి ఆ రోజు విజయవాడ వీధుల్లో శ్రీశ్రీ కవితలు పాడుతూ, నినదిస్తూ అందరం పెద్ద ఊరేగింపు తీసాము. మామ మాత్రం ఇంట్లో ఎర్రజెండా, విరసం జెండాలు సమకూర్చుకుని శ్రీశ్రీపై అరుణ పతాకం కప్పి వీడ్కోలు చెప్పడానికి బయలుదేరి వెళ్లిపోయాడు. శ్రీశ్రీ రాసిన ఉత్తరాలు, ఆయన సిగరెట్ పెట్టె పక్కన పెట్టుకుని రోజు వాటివి చూసుకుంటూ పడుకునేవాడు. ఆఖరు వరకు.

ఇక రావిశాస్త్రిగారి విషయంలో అత్తమ్మతో (పుష్పగారితో) ఎప్పుడైనా వాదోపవాదాలు జరిగేవి. ఆమెకు పౌరుషంగా మాట్లాడే అలవాటు లేదు గనక అంతగా కోపగించుకోకపోయినా ఆయన్ని అన్ని విధాలా సమర్థిస్తూనే ఉండేవాడు. అలా ఆయన గురువుల మీదకు దూసుకువచ్చే బాణాలన్నిటిని ఎదుర్కొనేవాడు. వారికి ఆయన పెట్టని కోట.

బండి తొక్కగలిగినన్నాళ్లు అత్తమ్మను, మా ఇద్దర్ని, అమ్మమ్మను తరచు కలుసుకుని వెళ్లేవాడు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా మమత, రఘు, బాలకృష్ణలు బండి అమ్మేసిన తర్వాత ఎవరినో ఒకర్ని బెదిరించో, బ్రతిమాలుకునో తనకి కావలసిన వారిని కలిసి వచ్చేవాడు ఆ ప్రేమసంచారి. అది అర్థం లేని తిరుగుడని కొందరికి అనిపించవచ్చు. తనకీ, మాకూ మటుకు ఒక ఊరట. రాజకీయ రాగద్వేషాలతో బహుశా తనూ, మేము కూడా విసిగి వేసారి పోయినట్లు ఉన్నాం. ఈ నగరంలో తనంత ఆత్మీయంగా ఎవరూ అనిపించేవారు కాదు. తను సవాళ్లు విసిరే స్థితిలో లేడు కాబట్టా? మా మధ్య ప్రేమ తప్ప పంచుకోవడానికి మరొకటి మిగలలేదు కాబట్టా? మాకే తెలీదు.

రాజకీయ భేదాలున్నప్పటికీ స్నేహాన్ని సజీవంగా, అంతే గాఢంగా కొనసాగించవచ్చని మామ చూపించాడు.

మామకు నచ్చిన కార్ల్‌మార్క్స్ ప్రేమ గురించి మాట్లాడుతూ 'If you love without evoking love in return, i.e., if you are not able, by the manifestation of yourself as a loving person, to make yourself a beloved person, then your love is impotent and a misfortune'

ఈ విషయంలో మామ చాలా అదృష్టవంతుడు. తను ప్రేమించిన వారి ప్రేమను పొందగలిగాడు. ఆఖరు వరకు తనకు నచ్చిన పనులు చేసుకుంటూ, నచ్చిన మనుషులతో మెసులుతూ, వారినే అంటిపెట్టుకుని గడిపేసాడు. చెయ్యాలనుకున్న పనులన్ని చేశాడు. ఇంకేం కావాలి జీవితానికి. మామకు బోలెడన్ని ముద్దులతో

☆



రేపటి మనిషికి నమూనా

నల్లూరి రుక్మిణి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రచయితలను, సాహిత్యాభిమానులను చూస్తుంటే, చలసాని ప్రసాద్ మరణానికి చెమ్మగిల్లని కళ్ళు లేవేమోననిపిస్తోంది. ఎవరిని పలకరించినా ఏవేవో అనుభవాలూ, జ్ఞాపకాలూ దొంతర దొంతరలుగా విప్పుతున్నారు. చలసాని జీవితంలో వ్యక్తిగతం, సాహిత్యం, విప్లవోద్యమం ముప్పేటలా పెనవేసుకుపోవడం వల్లనే ఇంతటి అభిమానం సాధ్యమయింది.

అలాంటిది ఆయనతో నలభై ఏళ్ళపైగా పరిచయమున్న మాకు ఇంకెన్ని జ్ఞాపకాలో!

అది 1983 ఢిల్లీలో ఎఐఎల్ఆర్‌సి ప్రథమ మహాసభలు. ఆ సభలకు ఆంధ్రప్రదేశ్ నుండి యాభై మంది దాకా వెళ్ళాం. సభలయ్యాక హరిద్వార్, రుషికేష్ ట్రిప్పు పెట్టారు. అప్పటికి మా పిల్లలు చిన్నవాళ్లు, వాళ్ళెక్కడ తప్పిపోతారోనని రెండు చేతులా కాపలా కాస్తుండేదాన్ని. హరిద్వార్ దగ్గర గంగానది 100 అడుగుల లోతు ఉంటుందన్నారు. మేమంతా ఒడ్డున నిల్చోడానికే భయపడుతున్నాం. గంగా నది వురవడి వినడానికే భయంకరంగా ఉంది. అట్లాంటి చోట గంగానదిలో చలసాని ఎంత ఆనందంగా ఈత వేశారో ఇప్పటికీ కళ్ళముందు కన్పిస్తోంది. మేమంతా ప్రసాద్‌ని బయటకు రమ్మని కేకలు వేస్తుంటే - ఆయన మాత్రం చిద్విలాసంగా ఎంత సేపో గంగను వదిలి రాకపోయారు. (అనసూయమ్మగారు ఎంత తిట్టారో! పాపం). అదిగో అప్పుడు చలసానిని చూసిన మా పిల్లలకు ఆయనో హీరో! చలసాని స్కూటర్ నడపడం కూడా మా చిన్నోడికి ఎంత ఇష్టంగానో ఉండేది, 'స్టాలిన్, స్టాలిన్' అనేవాడు. మీరంతా ఇట్టా అనే ఆయన్ను చెడగొట్టారనేది విజయ. చలసానికి నీళ్ళంటే ప్రాణం. నీళ్ళు కనబడితే 'ఈత' వెయ్యకుండా ఉండేవాడు కాదు. 'భారతదేశంలో అన్ని నదుల్లో ఈదానని, ఏవో రెండు నదులు తప్ప' అనే వాడు. మరి తరువాత కాలంలో ఆ కోరిక తీరిందో లేదో! మరి. ఇట్టాంటి జ్ఞాపకాలు ఎన్నో!

ఆయనతో మా తొలి పరిచయం 1972 జూన్ రెండో వారమనుకుంటాను. మా పెళ్ళి 'మే' 28న. ఐ.ని. లయోబాలో లెక్చరర్‌గా చేస్తూండేవాడు. మా పెళ్ళి చేసి - మమ్మల్ని విశాఖ రమ్మని, ఆయన శెలవులకు విశాఖ వెళ్ళారు. మేం ఓ పదిరోజుల తరువాత బయలుదేరాం. మేం వెళ్తున్న రైలుకే బెజవాడ రైల్వేస్టేషన్‌కు ఎక్కడి నుండో చలసాని కూడా వచ్చాడు. అమ్మణ్ణి ఇచ్చిన ఆయకాయ టిఫినూ, మామిడికాయల బుట్టా, సుబ్బారావు (తొలిసారి)ను తీసుకుని ఆగబడ్డాడు. ఆయనతో పాటూ మేమూ వాళ్ళింటికే వెళ్ళాం!. అప్పుడే కృష్ణక్క వాళ్ళ పరిచయం కూడా!

చలసానితో అట్టా ప్రారంభమయిన మా పరిచయం ఉద్యమంలోనూ వ్యక్తిగతంగానూ కలిసే పంచుకున్నాం. నిజానికి మాకుగానీ, చలసానికీ గానీ, ఇంకా మరికొందరికిగానీ, ఆ రోజుల్లో ఈ రెండింటికీ పెద్ద తేడా లేకుండానే బతికాం. ముఖ్యంగా 1972ల నుండి 82 దాకా, పదేళ్ళ కాలంలో సొంత వసతుల్లేని సంస్థలు, ప్రజా సంఘాలను కొత్తగా ఏర్పాటు చేసుకోవడం - ఈ దశలో ఇళ్ళే ఆఫీసులుగా వ్యవహరించిన కాలం. అలాంటప్పుడు ఏది వ్యక్తిగతం, ఏది ఉద్యమమని విడదీయగలరు.

ఇందుకు ఓ ఉదాహరణ చెప్పాలి.

అప్పటికి శ్రీకాకుళోద్యమం సెట్‌బ్యాక్ అయింది. చారుమజుందార్ చంపబడ్డారు. నాయకులు కొందరు జైల్లో ఉన్నారు. కొందరు ద్రోహం చేశారు. మరికొందరు రాజకీయాలతో విభేదించారు. ఎందరో అమరులయ్యారు. ఈ స్థితిలో తెలుగు నేల మీద నిర్బంధం రాజ్యమేలింది.

ఈ సమయంలో ఎం.ఎల్. పార్టీ (కె.ఎస్. గ్రూపు) మిగిలి ఉన్న ఒకరిద్దరిని కూడదీసుకుని, ప్రజా సంఘాలు లేకుండా ప్రజాయుద్ధం సాధ్యం కాదని ఆత్మవిమర్శ చేసుకుంది. ముందుగా తెలంగాణా సాయుధ పోరాట అమరులకు నివాళులర్పించడం ద్వారా బహిరంగ కార్యక్రమాలకు నాందీ పలికింది. ఆ క్రమంలో గుంటూరు జిల్లా తుమ్మలపాలెం దగ్గర ఉన్న అమరుల స్థూపాలకు నివాళులర్పించి, సభ జరపాలనుకుంది.

ఈ సభకు వంగపండు, పి.వి. రమణ, నళిని, పద్మినినీ తీసుకుని చలసాని గుంటూరు వచ్చాడు. అప్పటికే ఊళ్ళో తీవ్రమైన ప్రచారం జరుగుతోంది. పాత రివిజనిస్టులు, నయా రివిజనిస్టులని మిగతా వాళ్ళను విమర్శించి ఉండటంతో, మిగిలిన పార్టీలు కోపం పెంచుకొన్నారు. అలా అన్న ఎం.ఎల్. పార్టీ కొత్తగా ప్రజా సంఘాలను ఏర్పాటు చేయడం, బహిరంగంగా విమర్శించడం వారికి నచ్చలేదు. పైగా 'పోరాడే వానిదే ఎర్రజెండా' - అంటున్నారు. దానితో 'రండి, పోరాడదాం' అని ఎర్ర చొక్కాలు తొడిగించి, కర్రలిచ్చి, కదం తొక్కించారు. మేమంతా తుమ్మలపాలెం దగ్గర బస్సు దిగేటప్పటికి యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. సరే, మేం! పాటలు ప్రారంభించడం - వాళ్ళు కర్రలతో దంచడం - మేం పొలాలల్లో కంపలు దూకుతూ చిలకలూరిపేట దాకా పరిగెత్తడం - అదో ఎపిసోడ్. ఆ ఘటనలో 'హుస్సేన్' అనే కామ్రేడ్‌కు బలమైన దెబ్బలు తగలడంతో చనిపోయాడు కూడా. ఆ రాత్రి చిలకలూరిపేటలో మాకప్పటికి పేరు కూడా తెలియని డాక్టరు కొల్లా రాజమోహన్ గారి దగ్గరున్నాం. ఈయన కొల్లా వెంకయ్యగారి కొడుకు. వెంకయ్యగారు కొండపల్లి అంటే మండిపడేవారు. అయినా చలసాని స్నేహం వల్లనే మేం అక్కడికి పోగలిగింది. ఆ రాత్రి గడపగలిగాం.

ఇదంతా ఎందుకంటే - మేం పడ్డ ఇబ్బందులూ, కష్టాలూ - అందరం కలిసే పడ్డాం. వాళ్లు కొట్టడం, మేం పరిగెత్తడం కథలు, కథలుగా చెప్పుకుని ఓదార్చుకున్నాం, నవ్వుకున్నాం. ఈ సంఘటన 1974 తొలి రోజుల్లో రాష్ట్రంలో పార్టీకి 'షెల్టర్స్' కూడా దొరకని రోజుల్లో జరిగింది. ఇందులో గుర్తించాల్సిన విషయం ఇది.

ఈ సందర్భంగా మేం వ్యక్తిగతంగానూ కొంత ఇబ్బంది పడ్డాం. ఆ ముందురోజు రాత్రి చలసాని ట్రూప్‌తో మా ఇంట్లో దిగాక - పాటల ప్రాక్టీసు మొదలుపెట్టాం, కంజెర మోతలు. కింద ఇంటివాళ్ళు, పైన మేం! అసలు ఇంటివాళ్లు ఏమన్నా అంటారనీ... పైన చేసే మోతలు కిందివాళ్ళకు డిస్టబెన్స్‌గా ఉంటాయని స్పృహ కూడా లేదు. నాకయితే పల్లెటూరి నుండి రావడంలో ఈ టౌను గోల తెలిసేదీ కాదు. వచ్చిన వాళ్ళతో చేరి నేనూ గోల చేసేదాన్ని. దానితో తెల్లారి ఆ ఇంటివాళ్ళు భారీగా పోట్లాడారు. ఓ పక్క ఊళ్లో ఈ టెన్షన్, మరోపక్క ఇంటివాళ్ళ పేచీ - అయినా 'డోంట్ కేర్' అన్నట్టుగానే వున్నాం. చివరికి ఆ ఇల్లు తరువాత ఖాళీ చేయాల్సే వచ్చింది. ఇట్టాంటి పనులన్నీ చలసానితో కలిసే చేసి, ఆనందాన్నే పొందాం.

నిజానికి ఇవన్నీ సంఘం పనులనుకుని చేశాం. ఎవరి వ్యక్తిగతం కాదు. అలా ప్రారంభమయిన మా పరిచయంతో తొలి దశలో తరచుగా కలిసినంతగా తరవాత కలిసే సందర్భం లేకుండా గడిచింది. 1974 నాటికి రాష్ట్రంలో అక్కడక్కడా విసిరేసినట్టుగా వ్యక్తులము ఉండేవాళ్ళం. ఎమర్జన్సీ తరువాత 'గ్రామాలను తరలండి' కార్యక్రమంలో విస్తృతంగా జనంలోకి పోవడంతో, ప్రజా సంఘాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఏ ప్రాంతానికాప్రాంతం ఏ ప్రాంతం బాధ్యులు ఆ ప్రాంతం పనులతో బిజీ అయ్యారు. అందువల్ల విశాఖకూ, గుంటూరుకూ రాకపోకలు తగ్గాయనే చెప్పాలి. విరసం సభల్లో కలిసినా, నేను మామూలు కార్యకర్తనే కనక చలసాని వంటి సీనియర్‌తో నాకేం పనుంటుంది! పైగా సాహిత్యంలో నాకేమైనా సంబంధముంటే కొంత స్నేహం కొనసాగేదేమో! కానీ మేం ఫక్తు వీధుల్లో తిరిగే కార్యకర్తలం కావడంతో చలసానితో ఆ కాలమంతా మాతో రాజకీయ బాంధవ్యంగానే మిగిలిపోయింది. ఓ రకంగా ఓ స్థాయి, చైతన్యం ఉన్న ఆ కుటుంబంతో నా స్నేహం పరిమితుల్లోనే ఉండేది. జస్ట్ సింప్లీ - సి.ఎస్.ఆర్. ప్రసాద్ భార్యగా!

ఇంత పరిమితుల్లో ఉండే మా పరిచయం 90ల తరువాత స్నేహితులుగా మారుతూ వచ్చాం. 95ల తరువాతనయితే మా ఇంటికి రావడం చలసానికి ఇష్టంగా కూడా ఉండేది. ముఖ్యంగా 'విజయ' పోయాక చాలా తరచుగానే గుంటూరు వచ్చాడు. కనక ఈ ఇరవై ఏళ్ళగా చలసానితో మాకేం అనుభవాలున్నాయంటే! చాలానే ఉన్నాయి. మాకిద్దరికీ కొన్ని కామన్ పాయింట్స్ ఉన్నాయి. 'రుక్కూ రుక్కూ అని నిమిష నిమిషానికీ ఊరికే పిలవడం - 'ఏమే! బోడీ' అని ముద్దుగా తిట్టడం - మా పిల్లలు కూడా ఎంజాయ్ చేశారు. 'నీళ్ళు పోసుకోనా! ఒకసారా! రెండుసార్లు ఫర్వాలేదా! కూర వేసుకోనా! వేసేసుకోనా! బోడీ నా టవలు నిన్నెవరు ఉతికించమన్నారూ! నా చొక్కా ఎందుకు ఉతికించావ్' వంటి పోట్లాటలతో ఇల్లు సందడిగా ఉండేది. సి.ఎస్.ఆర్.ని నా తరపున తిట్టే ఏకైక వ్యక్తి.

వీటన్నిటికంటే నాకేదైనా అనుమానం వచ్చి ఫోను చేస్తే - అడిగిన ప్రశ్నకు అనుబంధంగా ముందూ, వెనకా ఎన్ని సంగతుల్లో, ఎంత చరిత్రో చెప్పేవాడు. నిజానికి ఆయన చెప్పిందంతా మనం చదువుకోవాలంటే పుస్తకాలు చదవడంతోనే జీవితం సరిపోద్దేమో ననిపించేది. ముఖ్యంగా 'ఒంద్రుమట్టి' రాస్తున్న కాలంలో... ఎన్నిసార్లు, ఎంత సమాచారం ఆయన్నుండి నేను తెలుసుకున్నానో చెప్పలేను. నడిచే గ్రంథాలయం. ఎక్కడ, ఎవరికి సాహిత్యానికీ చరిత్రకూ సంబంధించిన అనుమానాలు వస్తే తీర్చడమే కాదు - మనమీద అవాకులూ, చవాకులూ పేల్తున్న వాళ్ళకు... సాధికారికంగా జవాబు చెప్పగలిగిన, రాయగలిగిన అనుభవజ్ఞుడిని కోల్పోయాం. మన తరపున నిలబడి ప్రపంచానికి సవాళ్ళు విసరగలిగిన ధీరుడిని పోగొట్టుకున్నాం. ఇది సంస్థలకు ఎంత తీరని లోటు - ఎంత దుఃఖం.

చలసాని గురించి రాయాలంటే ఇలాంటివే ఏవేవో గుర్తుకొస్తున్నాయి. మనం మామూలుగా వ్యక్తుల కంటే సంస్థ గొప్పదంటాం. నిజమేగానీ... చరిత్రలో వ్యక్తుల ప్రాధాన్యత ఎక్కడా? ఏమిటీ? ఈ మధ్య 'చుండూరు జడ్జిమెంట్' సందర్భంగా ఈ మాట నాకు పదే పదే అనిపించింది. ఇప్పుడు చలసాని లేకపోయాక మళ్ళీ అనిపిస్తోంది. విరసం ఏర్పాటు నేపథ్యానికి సారథ్యం వహించిన వాడు, కానీ విరసం ఆవిర్భావ తొలి పత్రం మీద తన సంతకం లేనివాడు! అదే కాదు, నిర్బంధ కాలాలలో ఆయన పాత్రేమిటీ? నిర్వహించిన బాధ్యతలేమిటీ? తలచుకుంటే గొప్ప ఆశ్చర్యమేస్తుంది. చరిత్ర గమనంలో ఇలాంటి వారి కృషిని ఎక్కడ ప్లేస్ చెయ్యాలి?

1974 విశాఖలో 'హవా మహల్'లో విరసం సాహిత్య పాఠశాల నిర్వహించడం ఓ చారిత్రక సందర్భం. అప్పటికి కె.వి.ఆర్., చెర, త్రిపురనేని, వివి అరెస్టయి ఉన్నారు. రాష్ట్రంలో నిర్బంధ వాతావరణం. ఆ స్థితిలో నిర్బంధాన్ని అధిగమించి విరసం సాహిత్య పాఠశాల బాధ్యతంతా మోసింది చలసాని ఒక్కడే. అప్పటి ఆ పాఠశాల అనుభవాలు మర్చిపోలేనివి. 'హవా మహల్' ఇప్పుడెలా ఉందో తెలియదు గానీ... ఎదురుగ్గా సముద్రం, ప్రశాంతంగా, గంభీరంగా ఉండే సముద్రం సభ్యులను ఆకర్షణతో లాగుతుండేది. క్షణం ఖాళీ దొరికితే బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా నడుచుకుంటూ సముద్రం దగ్గరికి పోయేవారు. అప్పుడు బీచ్ వెంట ఆధునిక కట్టడాలూ లేవు, జన సంచారమూ ఉండేది కాదు. రాత్రిపూట బెంచీల మీద చేరి సముద్రాన్ని చూస్తూ అట్లా గడిపేవాళ్ళు రాత్రంతా.

అట్లా ఆ రెండు రాత్రుళ్ళూ జనం నిద్ర పోనేలేదు. పాటలూ దూల ఆడటం, సముద్ర స్నానాలూ... అంతా ఉత్తేజంగా, ఉద్విగ్నంగా సాగిన

పాఠశాల. ఆఖరి రోజు ఊరేగింపు. ఆ ఊరేగింపులో రావిశాస్త్రి, శ్రీశ్రీ కూడా పాల్గొన్నారు. 'నల్రేంక చెట్టు కింద నరుడో భాస్కరుడా' - రావి శాస్త్రి పాడుతూ, మాతో కలిసి 'దూలా' ఆడటం మర్చిపోలేనివి. జగదాంబ సెంటరు మొదలు ఊరంతా తిరిగాం, నిజంగా అవి మర్చిపోలేని సన్నివేశాలు. అంతటి మహాకవులు, ఆ నిర్బంధపు రోజుల్లో ఊరేగింపుకు నాయకత్వం వహించడం మామూలు విషయం కాదు. అది సంస్థకు ఎంత నైతిక మద్దతునిచ్చిందో ఆనాటి కార్యకర్తలకే తెలుసు. ఈ మహా ప్రయత్నం వెనుక ఆ రచయితల రాజకీయ మమేకతతో పాటు చలసాని వ్యక్తిగత స్నేహం కూడా ఎంతో దోహదం చేసింది.

ఆ సభల రెండు రోజుల్లో, ఏదో సందర్భంలో చలసానితో మేం మాత్రం తిట్లు తిన్నాం. సముద్రంలో మునిగి క్లాసుల్లో కూర్చోవడం లేదనో! లేదూ రాత్రంతా పాటలు పాడుతూ, గోల చేస్తూ నిద్రాభంగం చేస్తున్నామనో!

అట్లా విరసంపై, ప్రజా సంఘాలపై నిర్బంధం రాజ్యమేలి నప్పుడల్లా ఆయనో పెద్ద దిక్కుగా సంస్థ బాధ్యత నెత్తినేసుకునేవాడు. ఆట, పాటా బందయి - వ్యక్తులు పలకరించడానికి కూడా భయపడే కాలంలో - ఆయన సంస్థకూ బయట ప్రపంచానికీ వారధిగా ఉండేవారు. బయటి ప్రపంచంతో... శ్రీశ్రీని ముందు పెట్టుకుని మనకు కిటికీని తెరిచేవాడు. డైలాగ్ ప్రారంభించేవాడు. ఇది అనుకోవడానికి చిన్న విషయంగా కనిపిస్తుందేమోగానీ - ఆయా నిర్బంధ కాలాలలో, అది ఎంత అవసరమైందో, అర్థం చేసుకోగలిగితే... వ్యక్తుల పాత్ర కూడా చరిత్రలో గౌరవనీయమైందే అవుతుంది.

చలసానికి ఇదంతా ఎలా సాధ్యమయిందంటే అతని విశిష్టవల్లనే, భిన్నమైన వ్యక్తులతో అతనికుండే సంబంధ బాంధవ్యాల వల్లనే సాధ్యమయింది. ఆయన, నవ్వుతూ 'మిగిలిన వాళ్ళలాగా మనకెక్కడ కుదురుతుంది రుక్కూ! మనకెన్ని గొడవలూ! పెళ్ళిళ్ళూ, విడాకులు, పురుళ్ళూ, పుణ్యాలూ' అనేవాడు. అట్లా వట్టి రాజకీయ సంబంధాలు మాత్రమే కావవి. చాలా వ్యక్తిగత సంబంధాలు. ఇందుకు ఆయనకు ఉపయోగపడిన ఆయుధం సాహిత్యం. సాహిత్యం మాత్రమే! ఆయన విప్లవ మూర్తే! తపనంతా సమ సమాజమే! అయితే ఆయన హృదయమంతా సాహిత్యమే. అందువల్లే సాహిత్యాభిమానులను, పరిచయస్తులనూ ఎందరినో విరసం పట్ల ప్రేమను కలిగి ఉండేటట్టు చేయగలిగారు. అది సంస్థకు ఎసెట్టయ్యింది. ఇదే చలసాని ప్రత్యేకత.

ఆయనకు ఏది వ్యక్తిగతం, ఏది సంస్థాగతం, ఏది కాదు - అన్న తేడా లేదు. వ్యక్తిగా ప్రేమాస్పదుడు. ఆయన ప్రేమలో పడ్డ ప్రతి ఒక్కరూ సాలెగూటిలో చిక్కుకున్నట్లే! ఆ వ్యక్తుల నుండి సంస్థకో, ఉద్యమానికో, ఏదో ఒక రూపంలో వారి వారి శక్తీ, సంసిద్ధతను బట్టి... మాట సహాయమో, డబ్బు సహాయమో, నైతిక మద్దతునో సంపాదించకుండా ఉండడు. ఆయన వ్యక్తిగత పరిచయాలనన్నిటినీ ఉద్యమావసరాలకు మాత్రమే ఉపయోగించేవాడు. తన ప్రతిష్ట కోసం, ఎన్నడూ, దేన్నీ, ఎవరినీ వాడకుందామన్న ఆలోచన లేనివాడు. వ్యక్తిగతం అనే దాన్ని రద్దు చేసుకున్నవాడు.

అసలు ఆయనకు వ్యక్తిగత అవసరాలే లేవు, పట్టవు. భార్యా పిల్లలూ, సొంత కుటుంబం అన్నదానికి ప్రాధాన్యత ఇచ్చేవాడు కాదు. అవన్నీ కృష్ణక్క, వేణుమామల సహాయంతో విజయే చూసుకునేది. ఏమన్నా అరా కొరా ఇంటి పని అంటూ చూస్తే, బాధ్యత కనక చేసేవాడు. ఒక్క క్షణం కూడా సొంత కుటుంబం కోసం బుర్రపెట్టి ఉంటాడనుకోను. ఆయన బట్టలే ఆయనకు పట్టేవి కాదు. పాతబడితే విజయ తెస్తే వేసుకునేవాడు. అదీ ఎంత గుంజాకుంటూనో, చిరాకు పడుతూనో! (అయితే ఆయనకు కూడా ఓ ఇల్లంటూ (సొంత షెల్టర్) అవసరమయ్యే ఉంది. అది వేరే సంగతి).

అలాంటి చలసానికి సొంత ఆస్తి అంటే ఎలాంటి భ్రమలుంటాయి? రావిశాస్త్రికీ, శ్రీశ్రీకి కూడా సొంత ఆస్తి కాన్సెప్ట్ మీద మహా ఏవగింపు ఉంది. శాస్త్రిగారు చివరలో రాసిన 'ఇల్లు' నవల గురించి, 'సొంత ఆస్తికోసం, నమ్మిన వాళ్ళను ఎలా దగా చేస్తారో మా గురువుగారు ఎంత బాగా చెప్పారూ!' అని మురుసుకుంటూ చెప్పేవారు. అందుకే వాళ్ళిద్దరినీ మిగిలిన వాళ్ళకంటే ఎక్కువ అభిమానించాడేమో?

పరీక్షలు లేని విద్య, తలుపుల్లేని ఇల్లు, పోలీసులు లేని రాజ్యం ఉండాలన్న ఆయన ఆకాంక్షల్లో మరొకటి 'డబ్బుల్లేని జేబులు'! అందుకే జేబు ఖాళీ అయ్యే దాకా అడిగిన వాళ్ళకల్లా ఇచ్చేవాడు. అవసరమయితే అప్పు చేసి కూడా ఇచ్చేవాడు. ఒక్కోసారి అవి అపాత్రదానం కూడా అయ్యేవి. అలాంటివి వింటుంటే, ఆయన మనుష్యుల్లోని ద్వంద్వ ప్రవృత్తిని పట్టించుకోలేదనిపిస్తుంది. అయితే అది ఆయన ఎల్లలు లేని మంచి తనానికి నిదర్శనమే తప్ప మరొకటి కాదు.

ఇంత వైరుధ్యమున్న ఈ సమాజంలో, ఈ మనుషుల మధ్య ఆయనకు 'సొంతాస్తి' ఉండకూడదన్న చైతన్యం ఎట్లా వచ్చిందీ? దాన్ని జీవితం చివరి వరకూ ఎట్లా నిలబెట్టుకున్నాడూ? ఇది పట్టించుకుని, విశ్లేషించుకోవాల్సిన విషయం. పైగా ఆయన తిరిగిన స్నేహితులూ, రంగాలూ, ప్రదేశాలూ ఎలాంటివీ! ఆంధ్రదేశంలో ధనిక జిల్లాగా పేరుగాంచిన కృష్ణాజిల్లా వాసుల స్నేహాలు, సినీ, వ్యాపార రంగాలు అయినా అవేవీ కమ్యూనిజం నుండి చలసానిని అంగుళం కూడా కదిలించలేకపోయాయి.

అందుకు ఆయన బాల్యంలో గడిపిన జీవితమే గట్టి పునాది వేసింది. ఏ వ్యక్తికైనా చిన్ననాటి ఘటనలు అంతరంగంలో బలీయమైన ముద్రను వేస్తాయి. అవి జీవితం చివరి వరకు చాలా వరకు నిల్చి ఉంటాయి. ఆ ప్రభావాలు ఎలాంటివైనా కావచ్చు. అయితే చలసానికి మాత్రం ఊహాపోహలు తెలిసే దశలోనే కమ్యూనిస్టు భావజాలం రక్తంలో ఇంకిపోయింది. ఆనాటి కృష్ణాజిల్లా కమ్యూనిస్టుల ప్రభావం. సొంత అన్న, బాబాయి పార్టీ కోసం ప్రాణాలర్పించడం ఎంతో ప్రభావితం చేసింది. తండ్రి బసవయ్య కమ్యూనిస్టేం కాదు. తన బిడ్డలూ, తమ్ముడూ ఆ పార్టీ కోసం అమరులవడం ఆయన్ను మార్చివేసింది. చల్లపల్లి రాజా దగ్గర 'ముఖద్దారు'గా ఉద్యోగం చేసిన బసవయ్య - ఎన్నడూ ఆయన పదవిని సొంతానికి ఉపయోగించుకోలేదు. ఉద్యోగ ధర్మంగా పన్నులు వసూలు చేసేవారు. అదిరించీ, బెదిరించీ ఎన్నడూ వసూలు చేసేవాడు కాదని చలసానే చెప్పేవారు. 'మా నాన్న 'సొంత ఆస్తి'కి వ్యతిరేకి. జీవితంలో సొంత ఇల్లు కూడా లేదాయనకు' అంటుండేవాడు. తండ్రి ప్రభావం చాలా ఎక్కువ చలసాని మీద.

అట్లా తండ్రి నిజాయితీ గురించీ, ఆయన సొంతాస్తి వ్యతిరేకత గురించి చలసాని చాలా సంతోషంగా చెప్పేవాడు. ఇటీవల రెండు నెలల క్రితం మా ఇంటికి వచ్చినప్పుడు ఏదో సందర్భంలో - మా నాన్నకు చెడ్డ పేరు తేకూడదు. బసవయ్య కొడుకునని చెప్పుకోవాలని పదే పదే చాలాసార్లు అన్నాడు. పని గట్టుకొని బాలగోపాల్ని వాళ్ళ ఊరు తీసికెళ్ళి బసవయ్యగారిని చూపించారు కూడా! అట్లా తండ్రి ప్రభావం, చిన్ననాటి పరిస్థితులు ఆయనకు చాలా ప్రేరణనిచ్చి, స్థిరపరిచాయి.

తెలంగాణ ఉద్యమకాలంలో నిర్బంధం రీత్యా సొంత గ్రామమైన 'భట్ల పెనుమర్రు'లో ఉండలేని స్థితిలో, కుటుంబం నాదెండ్ల వారి పాలెం మారాల్సి వచ్చింది. చలసాని చాలా కాలం ఈ ఊరిలోనే పెరిగాడు. కానీ ఆయనకు 'భట్ల పెనుమర్రు' అంటే ప్రాణం. అట్లా పుట్టిన గ్రామాన్ని వదిలి వేయడానికి బాధపడి ఉంటారు గానీ... ఉద్యమం కోసం, ఆ స్ఫూర్తిలోనూ గ్రామాన్ని వదిలివేశారు. ఏమైనా సరే సొంత వూరిని అంటిపెట్టుకుని ఉండాలనే ఫ్యూడల్ సెంటిమెంటు... అట్లాంటి అవకాశం ఆ కుటుంబానికి లేకపోయింది. ఆ తరువాత కాలంలో జీవనం వెతుక్కుంటూ, వారంతా తమ అవసరాల రీత్యా, పట్టణాలకు తరలిపోయారు. అందువల్లే సొంత ఆస్తి, సొంత గ్రామం, సొంత కుటుంబం పట్ల ఆయన భావాలు సెంటిమెంటుతో కూడింది కాక - స్వేచ్ఛాయుతంగానూ, తర్కబద్ధంగానూ ఉండేది. ఇది చలసానికి చిన్నప్పుడే ఎదురైన ప్రత్యేక పరిస్థితులూ, పరిసరాలూనూ!

అయితే దీనివల్ల కుటుంబం కొంత ఇబ్బంది పడిందనే చెప్పాలి. మనం మారినంత మాత్రాన - లేదా అనుకోనంత మాత్రాన... చుట్టూ సమాజం మారదని, అట్లా మారకపోవడాన్ని ఆయన గమనంలోకి తీసుకోలేదు.

అట్లా చిన్నప్పుడు నిజాయితీతో కూడిన కమ్యూనిస్టు కార్యకర్తల ఆచరణను దగ్గరగా చూసిన వాడు కనుక - కమ్యూనిస్టు పార్టీల చీలికలు, పరిణామాలన్నిటిలోనూ, ఆయనెప్పుడూ ఉద్యమ ఆచరణ ఎటు ఉంటుందో, అటు వైపు మొగ్గుతూ వచ్చారు. అట్లా సోషలిజాన్ని కాపాడి - ప్రపంచానికి మొట్టమొదటిగా వాస్తవ రూపాన్ని చూపించినందువల్లే స్టాలిన్ అంటే ఆయనకెంత ఇష్టమో! అది అందరికీ తెలిసిందే! మార్క్సిజం సిద్ధాంత చర్చకంటే - ఆచరణకే ప్రాముఖ్యతనిచ్చిన శాస్త్రమని ఆయన నిశ్చితాభిప్రాయం. అందుకే ఆయన కాంట్రవర్సీల్లోకి పెద్దగా తలదూర్చేవాడు కాదు. అయితే మార్క్సిజానికే వ్యతిరేకంగా పోతున్నారనుకున్నప్పుడు - తానెంత ప్రేమించేవాడయినా విమర్శ పెట్టకుండా ఉండేవాడు కాదు. అయితే ఆ వ్యక్తి పట్ల మాత్రం పాజిటివ్‌గానే ఉండేవాడు.

అందుచేత ఉద్యమానికి తన అవసరం ఎక్కడ ఉంటే, అక్కడి కల్లా కాలికి బలపం కట్టుకుని జీవితమంతా తిరిగారు. చింతపల్లి అడవుల్లో గిరిజనుల ఇళ్ళు తీగల బట్టినపుడు - పౌరహక్కుల సంఘంతో కలిసి ఆ గిరిజనులకు ధైర్యమివ్వడం కోసం వారికి పునరావాసం ఏర్పాటు చేయడానికి, ఆ ప్రాంతాలకు ఆ రోజుల్లో చాలా సార్లు వెళ్ళారు. నిధి వసూళ్ళు చేసి వాళ్ళకు తిరిగి ఇళ్ళు ఏర్పాటు కూడా చేసినట్లు గుర్తు. ఆ తరువాత అలాంటి సంఘటనలు ఎన్ని జరిగాయో! ఎన్నిసార్లు ఆ ప్రాంతాలు తిరిగారో! ఎన్ని పోరాటాలలో పాల్గొన్నారో! అదొక రాజకీయ చరిత్ర.

సాహిత్యమంటే గుండె కోసుకుంటారు కదా! ఇంతమంది ప్రసిద్ధ రచయితలలో ఇంత సాన్నిత్యముంది కదా! మీరెందుకు రాయకపోయారూ? అని ప్రతిసారీ ఆశ్చర్యంగానే అడిగేదాన్ని! సాహిత్యం మీద ఆయన చెప్పే విషయాలు వింటూంటే అంత ఆశ్చర్యంగా ఉండేది. తిక్కన నుండి విశ్వనాథ దాకా... తెలుగు సాహిత్యం నుండి ఇంగ్లీషు సాహిత్యం దాకా ఎంత పట్టు ఉందో ఆయన్ను విన్న వాళ్ళకే తెలుస్తుంది. అందుకు ఆయన... 'నేను బేసిక్‌గా కార్యకర్తను, సమాజంలో మార్పు రావాలంటే - రాజకీయాలతో పాటు, సాహిత్యం, సంస్కృతి ముఖ్యమైన రోల్ ప్లే చేస్తాయని నా నమ్మకం. అందువల్ల నేను సాహిత్యాన్ని ప్రేమించాను. నా చిన్నతనాన సాంస్కృతిక బృందాలు మా ఊళ్ళలో పాటలు పాడి, ప్రదర్శనలిస్తే జనం ఎట్లా స్పందించేవారో నేను చూశాను. అదే నాకు ప్రేరణ. అందువల్ల సృజనాత్మక రచయితలూ, కళాకారులూ అంటే నాకు ప్రేమ' అనే వారు.

ఇంకో మాట కూడా చెప్పేవాడు. కల్చరల్ రంగం నుండి ఉద్యమాల్లోకి వచ్చిన వాళ్ళు అంత తొందరగా వెనక్కి పోరనీ... అలా వెళ్ళినా కనీసపు విలువలు మిగుల్చుకుంటారనీ ఆయన విశ్వాసం. మనిషి అంతరంగాన్ని సాహిత్యం క్షాళన చేస్తుందని ఆయన నమ్మకం. అందుకే సాహిత్యానికి ప్రచార కార్యకర్తగా తన్ను తాను నిర్దేశించుకున్నాడు. (ఆయన నమ్మకానికి మినహాయింపుగా ఉన్న వాళ్ళు ఎందరు లేరూ?)

ఇది నిజమేనని నాకూ అనుభవంలో ఉంది. మేం 72లో పరిచయమైనా... మేం బాగా దగ్గరయింది మళ్ళీ 90లలో నేను రాయడం మొదలుపెట్టాకే! నా రచనలు చదివి ఎప్పటికప్పుడు తన స్పందనను తెలియ చేసేవాడు. అలా మా స్నేహం 95, తరవాత మరింత అనుబంధంగా మారింది. ఆయనను ప్రపంచం సాహిత్యోపాసకుడుగానే గుర్తిస్తుంది. శ్రీశ్రీ, కొకు, గోపీచంద్, రావిశాస్త్రి వంటి రచయితల, రచనా సర్వస్వాలు ఒక్క చేతిమీదుగా తేవడం మామూలు వాళ్ళకు సాధ్యమయ్యేది కాదు. ఒక రకంగా పని రాక్షసుడు.

ఈ క్రమంలో నేను అర్థం చేసుకున్నంత వరకు ఆయనకు తన పని బాధ్యతగా చేసుకుంటూ పోవడమేననే దృష్టి ఎక్కువగా ఉండేది. అదేగాదు తాను నమ్మిన ప్రజాస్వామ్య విలువలను పాటించడానికి ప్రయత్నం చేసేవాడుగానీ ఇతరులు ఎలా ఉన్నారనేది పట్టించుకునేవాడు కాదు. తన నమ్మిన విలువలు తన చుట్టూ వున్నవారు ఏ మేరకు కాపాడుతున్నారనేదీ ఉండేది కాదు. చలసానికి ఎసర్టివ్ స్వభావం కాదు, కనక ఎసర్ట్ చేసుకోవాలనుకోలేదు. కానీ అటువంటి స్వభావంతో ఎవరైనా ఇతరులకు, ఇబ్బంది కలిగిస్తున్నారేమోనన్నైనా జిజ్ఞాస ఉండేది కాదు. ఘర్షణ ఆయన వంటికి పడదు. సమాజంతో ఘర్షణ పడాలి కానీ, మనుషులతో కాదు అన్న ఆలోచన వల్ల - ఘర్షణ పడాల్సి వస్తుందనుకున్న చోట, తప్పుకుని మౌనంగా ఉండేవాడు. మనుషుల సమూహాలే సమాజం అన్న దాని మీద ఆయన దృష్టి పెట్టలేదు. అది ఏదో ఒక మేరకు ఆయన వ్యక్తిత్వంలో చిన్న పరిమితేననిపిస్తుంది.

అయితే అవేవీ ఆయన మూర్తిమత్వానికీ, కమ్యూనిస్టు ఆచరణ, అభిమానాలకు కించెత్తు కూడా అపవాదు కాదు. రేపు మనం కోరుకుంటున్న సమాజంలో మనిషి ఇలా ఉండాలేమోననిపించే 'నమూనా' వ్యక్తి. మద్రాసు సినీ ప్రపంచంగానీ, విశాఖ నగర జీవితం గానీ ఆయనలో ఎంత మాత్రం కృత్రిమత్వాన్ని తేలేక పోయాయి. ఆయన ఆంతరంగం పూర్తిగా గ్రామీణ వైవిధ్యంతో నిండి ఉంది. 'మా ఊరికి పోతేనే, వర్తమాన రాజకీయాల మీద ఖచ్చితమైన అంచనాకు రాగల'ననేవాడు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి గ్రామాలే కొలబద్దలుగా భావించేవాడు. కనకనే వీలు చేసుకుని అప్పుడప్పుడు తన పుట్టి పెరిగిన భట్ల పెనమర్రు, నాదెండ్లవారిపాలెం తప్పక వెళ్ళేవాడు. 'మనం ఇక్కడున్నా, మన మూలాలు అక్కడే ఉన్నాయని' - నన్ను తనతో కలుపుకుని అంటుండేవాడు. అది నిజం కూడాననిపించేది. పల్లెటూరి రుగ్మతలు కాక - ఆ జీవితంలో ఉండే బోళాతనం ఆయనలో నిండి ఉండేది. పల్లెల్లో ఉండే మానవీయత, నోటినిండా పలకరింపులు, మోహం నిండా నవ్వులు చెరగకుండా జీవితమంతా కాపాడుకున్న ధన్యజీవి.

లక్షల అడుగుల్లో పదైనా వేయగలమా?

ఎన్.ఆర్.కె.

ప్రసాద్ మామయ్యతో నాకు 35 ఏళ్ల పరిచయం ఉంది. ఇంత సుదీర్ఘ కాలంలో ఒక వ్యక్తి జీవితంలో చాలా మార్పులు వస్తాయి. కానీ ప్రసాద్ మావయ్య జీవితంలో ఇవేమీ జరగలేదు. తన మౌలిక వ్యక్తిత్వాన్ని మార్చుకోకుండా ఉండటమే గొప్ప విషయమని ఆయన్ని చూసినప్పుడల్లా అనిపించేది. తను మారలేదన్న విషయాన్ని తాను నమ్మిన తాత్వికభూమిక ప్రకారం తను ససేమిరా అంగీకరించడు. దాన్ని కాసేపు పక్కన పెడదాం. ఇంతకీ ఏమిటా మౌలిక వ్యక్తిత్వం? అని ప్రశ్నించుకుంటే చాలా అసాధారణ విషయాలు కనపడతాయి. సొంత అవసరాల కోసం ఆయన ఏనాడూ వెంపర్లాడలేదు. గుట్టుగానైనా జీవితానికి అవసరమైన ప్రాణావసరాల కోసం కొన్ని నిమిషాలైనా తను వెచ్చించాడా అన్నది సందేహం. ఎన్ని గడపలెక్కినా, తను నమ్మిన సిద్ధాంతాలపై గురిలేని వాళ్లతో ఎన్ని సావాసాలు చేయాల్సి వచ్చినా అవేవి తన కోసం చేసినవి కావు. ఎవరెవరి కోసమో చేసినవి. ఈ గుణం ఉన్న వాళ్లను ఇప్పుడు వేళ్లపై లెక్కించవచ్చు! తనతో వీసమెత్తు పరిచయం ఉన్న వ్యక్తి వచ్చి నాకు ఫలానా సాయం కావాలని వస్తే దాన్ని ఎలా తీర్చాలన్న దానిపైనే ఆయన ఆలోచనలు పరుగెత్తేవి. అందుకాయనకు సిద్ధాంతాల గోడల్లేవు. దగ్గరి దూరపు బంధువుల మొదలుకుని... కుల, మత, వర్గాల ఎల్లలు దాటి సర్వ ప్రయత్నాలు చేసేవాడు. ఇందులో ఆయనకు సాటివచ్చే వాళ్లు తెలుగు సీమలో ఎందరుంటారని ప్రశ్నించుకుంటే గట్టిగా సమాధానం చెప్పలేం. ఈ వ్యక్తిత్వం ఆయనకు సిద్ధాంతబలం నుంచి వచ్చిందా అని ప్రశ్నించుకుంటే దానికీ కచ్చితమైన జవాబు దొరకదు! మానవతా దృక్పథం ఒక ఆదర్శంగా చాలా మందికి ఉంటుంది. బలమైన వామపక్ష ఆలోచనలు ఉన్న వాళ్లకి ఈ ఆదర్శం ఇంకా బలంగా ఉంటుంది. కానీ కొందరైనా ప్రసాద్ మామయ్యలా ఉండగలిగారా అంటే ఎన్నో ఆత్మల్లోకి పరకాయ ప్రవేశం చేస్తేనే కానీ అసలు తత్వం బోధపడదు! ఎందరెందరికో ఆయన బహిరంగ, రహస్య సహాయకుడు!

సిద్ధాంతం నిర్దేశించిన కార్యకలాపాల కోసం ఎంత తిరిగాడో పరసేవాతత్పరత కోసం అంతే తిరిగాడు. బహుశా అందుకేనేమో మామూలు చెప్పులు ఆయన ధాటికి ఆగేవి కావు. విశాఖ పోర్టు కన్వేయర్ బెల్ట్‌కు చెందిన ముక్కల నుంచి ఆయన చెప్పులు తయారు చేయించుకునే వాడు. ఆ బెల్టు చెప్పులు మాత్రమే ఆయన నడకను భరించగలిగేవి.

భేషజాల్లేని జీవితం గురించి చెప్పుకోవాలన్నా ప్రసాద్ మావయ్యే ఒక ఉదాహరణ. వయసుభేదాలు తనను అంటేవి కావు. సాహిత్య స్పర్శ లేశమంత ఎవరిలో ఉన్నా వాళ్లని అక్కున చేర్చుకోటానికి ఆయన హృదయ వైశాల్యం అమాంతం పెరిగిపోయేది. తను చేసేది లెక్చరర్ ఉద్యోగమైనా నా డొక్కు సైకిల్‌పై వెనకాల కూర్చొని ఎంత దూరమైనా వచ్చేవాడు. అరమరికల్లేని ఈ కలివిడి ఆయనకు వయస్సు, హోదాల్లేని ఆత్మబంధువులెందరినో సంపాదించి పెట్టింది.

సిద్ధాంతప్రేరిత సాహిత్యానికి కట్టుబడి ఉన్నా మనిషి జీవితం లోతుల్లోంచి వచ్చిన సాహిత్యాన్ని తను ఇంకా గాఢంగా ప్రేమించే వాడు. జీవితపు గాఢత నుంచి రాని సాహిత్యాన్ని, విభిన్న జీవితావస్థలను వర్ణించని కవిత్వాన్ని తను అంతగా ఇష్టపడే వాడు కాడు. కవి జీవిత విషాదాన్ని ప్రతి ఫ్రేంలోనూ అద్దంపట్టిన గురుదత్ ప్యాసా సినిమా అంటే తనకెంత ఇష్టమో... అలాగే దేవులపల్లి నడిచేయకోగాలి... నడిచేయబోకే... బడలి ఒడిలో రాజు పవళించేనే... అన్న పాట అంతే ఇష్టం. మల్లీశ్వరిలో... మమతెరిగిన మేఘమాల... పాట వింటూ తను మైమరిచిపోయేవాడు. యవ్వనంలో ఉన్నప్పుడు విజయ అత్తమ్మ కోసం ఎంతో శ్రావ్యంగా పాడేవాడు. తన విలువైన వ్యక్తిగత ఆస్తిగా

చాలు ఏళ్లు... ప్యాసా వీడియో క్యాసెట్‌నే ఆయన మురిపెంగా చెప్పుకునేవాడు. సమస్త మానవకోటి నవరస హృదయగానాన్ని వినిపించటానికే పుట్టాడా అని అనిపించే సచిన్‌దేవ్ బర్మన్ గాత్రమంటే ప్రసాద్ మామయ్య చెవికోసుకునేవాడు. ముఖ్యంగా బర్మన్ విషాదగీతాలు తనని ఎక్కడికో తీసుకెళ్లేవి. మూగమనసులు సినిమాలో ఈనాటి బంధం ఏనాటిదో పాటలోని గోదావరి ప్రస్తావనలను, ఆ నదీ దృశ్యాలను చూస్తే గోదావరిలో దూకి అందులో కలిసిపోవాలనుందిరా అని చెప్పేవాడు. సోదరులు, సహవీరులందరూ మరణించిన తర్వాత ఓటమి తప్పదని తెలిసి చీకటి మందిరంలో ఏకాంతంగా హృదయభారంతో కుంగిపోతూ... సంపూర్ణ రామాయణం సినిమాలో రావణాసురుడు పాడుకున్న విషాదవేదాంత గీతమంటే కూడా తనకు చాలా చాలా ఇష్టం.

ఒకరోజు భిన్న సమయాల్లో ఓ మనిషి... కవిగా, గాయకుడిగా, సంగీతకారుడిగా, తత్వవేత్తగా, శాస్త్రవేత్తగా, కళాకారుడిగా, శ్రామికుడిలా ఇలా అనేక అవతారాలెత్తి తనను తాను ఆవిష్కరించుకున్నప్పుడే నిజమైన మనిషి అవుతాడని మార్క్స్ ఎప్పుడో 1845లో చెప్పినది సందర్భోచితంగా ప్రస్తావిస్తూ జీవితం అలా ఉండాలని కోరుకునేవాడు. శ్రీశ్రీ కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవాడని చెబుతూండే వాడు. జీవితంలోని వివిధ రుచుల భిన్నత్వమే తనని ఆవహించి నడిపించింది. అందుకే తన లైబ్రరీలో కేవలం వామపక్ష సాహిత్యాన్ని మాత్రమే భద్రపరచలేదు. ప్రపంచంలో గొప్ప సాహిత్యానికి దాన్ని ఆటపట్టుగా మలిచాడు. జీతం రూపంలో తనకొచ్చిన ఆదాయంలో ఎంతో భాగం దానికే ధారపోశాడు. వయస్సు మీదబడినా పుస్తక సంపదపై మమకారాన్ని వదులుకోటానికి సిద్ధపడలేదు. ఏ మాత్రం వీలు దొరికినా ఆ సాహిత్య భాండాగారంపైనే శక్తి, సంపదా ఖర్చయ్యిపోయేవి.

వందచేతులు వందకాళ్లున్నాయా అన్నంతగా ఎవరెవరి అవసరాల కోసమో ఎప్పుడూ పరిగెత్తుతూ ఉండే ప్రసాద్ మామయ్య టైం విషయంలో ఎంత కచ్చితమో చెప్పలేం.. ఎవరి దగ్గరకైనా వస్తానన్న టైంకి ఠంచనుగా వచ్చేవాడు. ఆలస్యంగా వస్తే తనకు చాలా చిరాకు. ఏదైనా ఫలానా టైంకి ఇస్తానంటే ఆ టైంకి ఇవ్వటానికి శతవిధాలా ప్రయత్నించేవాడు. ఎవరు ఆప్యాయంగా పిలిచినా వారి ఆతిథ్యాన్ని కాదనేవాడు కాదు. ఆతిథ్యాన్ని ఇచ్చిన వారికి ఎన్నో కమ్మని అనుభూతులు మిగిల్చేవాడు.

మనకు తెలిసిన మేధావుల్లో చాలా మందికి సామాజిక పరిసరాల గురించి తగినంత ఆసక్తి ఉండదు. ప్రసాద్ మావయ్యకు అలా కాదు. తను తిరిగిన ప్రతి ఊరు, పట్టణం, నగరం గురించి అడుగడుగునా తెలుసు. వీలైనంత మేరకు తనను తెలిసిన వ్యక్తుల కుటుంబనేపథ్యం గురించి వాకబు చేసేవాడు. వాళ్ల వాళ్ల సామాజిక పరిస్థితులు గురించి క్షుణ్ణంగా తెలుసుకునే వాడు. బహుశా ఈ అలవాటు కూడా తను ఎక్కువ మందితో కలిసిపోవటానికి తోడ్పడింది. అందుకే ఎందరో ప్రేమ, పెళ్లి, విడాకుల కోసం తన హృదయసాయం.కోసం అర్థించే వాళ్లు. ఎంత పరోపకారి అయినా తనకూ కోపం వచ్చేది. కానీ అది సత్యాగ్రహంగా ధర్మాగ్రహం లాంటిది. అది ఎంతో సేపు ఉండేది కాదు. చెప్పిన టైం, ఇచ్చిన మాట పాటింపు విషయంలో కొన్ని సందర్భాల్లో ఇతరులకు చాదస్తంలా అనిపించేది. కానీ ఆ చాదస్తమే లేకపోతే ప్రసాద్ మామయ్య లేడు! అదీ ధర్మబద్ధ చాదస్తమే.

తను సాహిత్యాన్ని ఎంతో ప్రేమించినా తను సాహిత్య సృష్టి చేయలేకపోయానన్న బాధ ఎక్కడో ఉండేదని నాకు అనిపించేది. కానీ దాన్ని తాను అనితరసాధ్యమైన రీతిలో అధిగమించాడు. భారతీయ భాషా సాహిత్యంలో సాహిత్య సంపాదకత్వాన్ని తనలా నిర్వర్తించిన వారు ఎవరైనా ఉన్నారా అన్నది సందేహమే. అదీ ఒక్క చేతిమీదుగా శ్రీశ్రీ సాహిత్యాన్ని 20 సంపుటాలుగా విభజించి... ఏ పదం, ఏ అక్షరం, ఏ వాక్యం, ఏ సున్నా, ఏ అరసున్నా వివరణ కోరుకున్నా దానికి తిరుగులేని ప్రాతిపదికలు ఏర్చికూర్చి వివరించిన విధం నిజంగా ఒక విజ్ఞాన సర్వస్వానికి సమానం. తెలుగు సాహిత్య సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకోటానికి ఆ వివరణలు ఎంతగానో తోడ్పడతాయి. ఆ వివరణల కోసం తనెంతగా చెప్పులరిగేలా తిరిగాడో స్వయంగా చూసిన వాళ్లకే తెలుసు. శ్రీశ్రీ తన రచనల్లో ఎన్నో యుగాలను, ఎందరెందరో వ్యక్తులను, ఎన్నో సాహిత్య రూపాలను, ఎందరో సాహితీవేత్తలను ప్రస్తావించాడు. ప్రతి ప్రస్తావన తాలూకూ వివరణ, దాని నేపథ్యం, అందులో పాత్రధారులను మన కళ్ళెదుట నిలిపాడు ప్రసాద్ మామయ్య. అంతకుముందు ఇలా చేసిన వాళ్లెవ్వరైనా లేరా? అంటే ఉన్నారు. అయితే ఇంతగా శ్రమచేసి సమగ్రత కోసం పరితపించి సఫలీకృతులైన వాళ్లు మహా అరుదు. తనుగాక ఈ ఒరవడిని ఆ తర్వాతైనా ఎవరైనా అందుకున్నారా అన్నది సందేహాస్పదం!

ఇంత జీవిత విభిన్నత్వాన్ని అడుగడుగునా ఆవాహన చేసుకుని అనుభవించిన వ్యక్తి ప్రపంచవ్యాప్తంగా వీచిన, వీస్తున్న రాజకీయ, సామాజిక పవనాలను గుర్తించలేకపోయాడా అన్న సందేహం రాకమానదు! 1980 నుంచి 1990 వరకూ కమ్యూనిస్టు ఆదర్శానికి తగిన దెబ్బలు కోలుకోలేనివి. ఒక భౌతిక లోకం కళ్లముందే కరిగినీరై పోయిన మహాదృశ్యం అందరి ముందు ప్రత్యక్షమైంది. 1990 తర్వాత వీచిన సరళీకరణ హోరుగాలిలో ఆదర్శాలన్నీ చెల్లాచెదురై స్వార్థం, లాభచింతనలే నాగరికతలకు చోదకశక్తులనే భావనలు పాదుకొంటున్న తరుణంలోనూ ఆయన 1950-1977 మధ్య ప్రపంచాన్ని ఉద్రేకపరచిన భావజాలానికే నిబద్ధుడిగా ఉండిపోయాడు. అంతకంటే ముందుకు వెళ్లటానికి తను ఇష్టపడలేదు. తాను నమ్మిన భావజాలంపై ముసురుకున్న సందేహ, ప్రశ్నార్థక మేఘాలను గమనించకుండా ప్రసాద్ మావయ్య ఉండలేదు. కానీ ఆ మేఘాలు గర్జించిన వర్షంలో తడిచి ముద్దయిపోయి క్రియారాహిత జీవితంలోకి జారిపోవటం ఆయన నైజానికి విరుద్ధం. కొత్త జీవితాల్లోని తళుకుబెళుకుల్లో తనదైన వ్యక్తిత్వాన్ని కోల్పోయి గతమంతా తప్పుల వంతెనపైనే నడిచామన్న భావనను దరిచేరనీయలేదు. కొత్తపాతల మేలుకలయిక కంటే పాత ఒరవడిలోని తాను ఒంటపట్టించుకున్న మానవతా మాధుర్యాన్ని నిలుపుకుంటూ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని అలా నడుస్తూ నడుస్తూ వెళ్లిపోయాడు.

తను వేసిన లక్షల అడుగుల్లో పదుల్లోనైనా మనం వేయగలమా?

☆

'మా కామూ' అని ఇంకెవరంటారు?

డాక్టర్ వి.కామేశ్వరి, లెఫ్టినెంట్ కల్నల్(రిటైర్డ్)

చలసానితో నా పరిచయం కృష్ణా-వేణుగోపాలరావుల ఇంట్లో అయింది. 1968లో వరంగల్ నుంచి చలసాని కుటుంబం విశాఖపట్నంకి మారిపోయింది. దాదాపు ప్రతి సంవత్సరం ప్రసాద్ ని చూసేదాన్నేమో గొప్ప స్నేహంగా మారింది!

నేను Andhra Medical College లో D. G. O-M. D. చేసే రోజుల్లో చిన్నారావు గారి ద్వారా కృష్ణా-వేణుల పరిచయ మయింది. వీళ్ళ ద్వారా ప్రసాద్ పరిచయమయ్యాడు. అంతకుముందు నుంచే యూనివర్సిటీ మిత్రులందరితో మంచి స్నేహం ఉండేది. Medical College నుండి Inter Collegiate Dramatic Competitions కి వేసిన 'పంజరం', 'భయం'అనే రెండు నాటకాల్లో నేను పాల్గొన్నాను. రెండింటికీ 'Best Actress Awards' వచ్చాయి. తర్వాత నేను National Emergency సమయంలో ఆర్మీలో చేరాను. అప్పటినుండి ఉద్యోగరీత్యా దేశం లోని వేరు వేరు ప్రదేశాలకి ట్రాన్స్‌ఫర్ అవుతూ ఎన్నో చోట్ల పని చేశాను. కానీ నేను ఎక్కడ ఉన్నా ఆర్మీవాళ్ళు ఇచ్చే 2 నెలల సెలవుల్లో 'తిరువణ్ణామలై' లో ఉన్న చలం గారి దగ్గరకు వెళ్ళేదాన్ని. 1956 నుండి 1979 లో వారు చనిపోయేవరకూ 'చలం నాన్న' తో నా అనుబంధం కొనసాగింది. అంతకుమించి సౌరిస్ దగ్గర నా ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలకు స్వాంతన పొందేదాన్ని! తిరువణ్ణామలై వెళ్తున్న ప్రతిసారీ దారిలో కృష్ణా-వేణుల కోసం 3-4 రోజులు ఆగేదాన్ని. ఆ రోజుల్లో మా ప్రగాఢ స్నేహం అలా మొదలయింది.

కృష్ణా, వేణు, ప్రసాద్- వీరంతా మంచి కమ్యూనిస్టు వర్కర్స్. నాకే రాజకీయాలూ తెలియవు. నేను దైవాన్ని నమ్ముతాను. పైగా Spiritual Questతో పూజలు చేసుకోవడం అలవాటు. ఇవేవీ మా స్నేహానికి కొంచెం కూడా అడ్డు రాలేదు. ఎప్పుడూ వీటిని గురించి ప్రశ్నే ఉండేది కాదు.

మా ప్రసాద్ మంచితనానికి మారు పేరు. స్నేహానికి చిరునామా. పసిపిల్లవాడంత పారదర్శకత. మాయా మర్మం తెలియని మిత్రుడు. ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తూ, ఎక్కడెక్కడికో తెగ తిరుగుతూ ఉండేవాడు. 'ఏంచేస్తావు నాయనా, ఇంత బిజీగా, కాస్త చెప్పు' అనేదాన్ని. 'చాలా పనులుంటాయోయ్' అనేవాడు. కాస్త కూడా నిలకడంటూ లేని ఆగమ్మ కాకి లాగా తిరుగుతూ ఉంటావు. పాపం విజయ ఎంత గొడవ పడుతుందో నీతో? అనేదాన్ని. అన్నిటికీ నవ్వే సమాధానం. కానీ విజయ హాస్పటల్ లో ఉన్నప్పుడు మాత్రం స్థిరంగా ఉండి, శ్రద్ధగా, చాలా బాధ్యత చూసుకున్నాడు. Thank God అనుకున్నాను!

పసితనం, వాడని అమాయక హృదయం, నిలువెల్లా ప్రేమ, స్నేహం ఉన్న ప్రసాద్ లాంటి వారిని మళ్ళీ ఎప్పటికి చూస్తామో! నిండైన మనస్సు, ఆనందంతో ఉప్పొంగుతూ ఉండే ఉత్సాహం-తన, పరాయివారనే భేదం లేనితనం-నాకు తెలిసిన ప్రసాద్‌లో ఉన్న గొప్ప గుణాలు! ఎవరు కష్టంలో ఉన్నారన్నా-సహాయం చెయ్య డానికి సిద్ధంగా ఉండేవాడు. 'జీవితం అంటే ఏముందోయ్ 'Inter Personal Relations' తప్ప' అనేవాడు ప్రసాద్.

ఒకసారి నేనూ, శివా, సీతా విశాఖ వెళ్ళాం. మమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి ప్రసాద్ వచ్చాడు. కుండాపోతగా వర్షం కురుస్తోంది.. తను రెయిన్ కోట్ వేసుకొచ్చాడు. శివ, సీతలతో 'మీరిద్దరూ ఆటోలో రండి, నేను త్వరగా కామూని ఇంటికి తీసికెళ్తాను' అని చెప్పి చాలా హడావిడిగా నన్ను మాత్రం స్కూటర్ మీద కూర్చోబెట్టుకుని ఇంటికి తీసికెళ్ళాడు. ఆ ఆత్రుతలో తనకి అనిపించలేదు'కామేశ్వరి ఇంత పెద్ద వర్షంలో స్కూటర్ మీద కూర్చోవడానికి ఎంత ఇబ్బంది పడుతుందో'నని. ఆ ఆప్యాయతని చూసి నవ్వుకోవడం, ఆనందించడం తప్ప ఏమనగలను? నాకు విదురుని భార్య కథ గుర్తొచ్చింది. ఆమెకు శ్రీకృష్ణుడంటే పరమ భక్తి. ఆయన తన ఇంటికి వచ్చినప్పుడు ఆ భక్తి తన్మయత్వంలో అరటి పళ్ళు వలిచి పళ్ళు పారేసి తొక్కలు స్వామికి తినిపించిందట. ఆయన కూడా ఆ తొక్కలే తిన్నాడట!

చలం గారింట్లో పరిచయమైన 'నర్తకి' గొప్ప వ్యక్తి. గొప్ప సేవా మూర్తి. చలం గారిని ప్రాణంలా చూసుకుంటూ అక్కడున్న అందరికీ సేవ చేసేది. తనకి చివరి దశలో 2008 లో ''Cancer, Uterus & Ovaries'' వచ్చాయి. Radiation Treatment కి ససేమిరా ఒప్పుకోకుండా, నేను వచ్చి తన దగ్గరుంటేనే చేయించుకుంటానన్నది. నేనప్పుడు ప్రసాద్ ఇంట్లోనే ఉన్నాను. ప్రసన్న అనే అమ్మాయి ఎంతో ప్రేమగా, బాధ్యతగా ఇంటినీ, ప్రసాద్‌నీ చూసుకునేది. నన్నూ అంతే ఆప్యాయంగా చూసుకుంది. ప్రసాద్ తన ప్రోగ్రాములూ, తిరిగే పనులూ అసలు మానేవాడు కాదు. కానీ ఇంట్లో ఉన్నప్పుడు మాత్రం ప్రాణప్రదంగా చూసుకునేవాడు!

ప్రసాద్ ఇంట్లో అన్ని గోడల నిండా కిందా, పైనా బుక్ షెల్ఫులు వాటినిండా బుక్స్ ఉండేవి. అవి గాక చిన్న సందుంటే చాలు అక్కడ పేపర్ కటింగ్స్ అంటించి ఉండేవి. చిన్న అద్దం వేలాడదీసుకుందుకి కూడా చోటు ఉండేది కాదు. కానీ మళ్ళీ తనదగ్గర లేని పుస్తకమేదైనా కనపడితే 'కామూ, ఇది నేను తీసుకోనా?' అనేవాడు. పుస్తకాలంటే అంత ప్రేమ మరి!

ప్రసాద్ ఎక్కడ ఉన్నా కనీసం రెండు మూడు వారాల కొకసారైనా తప్పకుండా ఫోన్ చేసి పలకరించేవాడు. హైదరాబాద్ వస్తే ఎన్ని పనులున్నా తప్పకుండా ఒకరోజు నా దగ్గరకు వచ్చేవాడు. ఎవరికైనా నన్ను పరిచయం చెయ్యాలంటే 'మా కామూ, మా కామేశ్వరి' అనేవాడు. మా అనే మాట లేకుండా నా introduction ఉండేది కాదు. విజయ అన్న కూతురు 'అరవింద' నేనుండే సైనిక్‌పురి లోనే ఉండేది. తనతో నాకు పరిచయం లేని రోజుల్లో కూడా 'మా కామూ బాగుందా?' అని అడిగేవాడు. పాపం, అరవిందకి నేను తెలియకపోతే తనేం చెబుతుంది?

ఎప్పుడు విశాఖపట్నం వెళ్ళినా మా ప్రసాద్ ఎంతో ఆప్యాయంగా అన్ని చోట్లకీ తీసికెళ్ళేవాడు. ఒకసారి విశాఖ వెళ్ళినప్పుడు రాత్రి తొమ్మిదో, తొమ్మిదిన్నరో అవుతుంది. 'దా కామూ, రావిశాస్త్రి గారిని చూసొద్దాం. లేకపోతే ఆయన్ని మళ్ళీ నువ్వు చూడలేవు' అన్నాడు. తీరా వెళ్ళి చూస్తే వారి పరిస్థితి చాలా విషమంగా ఉంది. Hypertension, severe Diabetis, Mellitus, Kidney failure- వీటన్నిటితో చాలా అవస్థ పడుతున్నారు. వారానికి ఒకసారో రెండుసార్లో డయాలసిస్ చేస్తున్నారు. అలాంటి సమయంలో మమ్మల్ని ఎంతో ఆత్మీయంగా రిసీవ్ చేసుకోవడమే కాదు, సుమారు గంటన్నర సేపు సంతోషంగా గడిపారు.

నేను ఆర్మీలో పని చేస్తున్నప్పుడు ఒక జనరల్ గారి కోడలు Cardiac Myopathy తో బాధ పడుతుండేది. రోజుకి 3 నుంచి 4 Lasix Injections ఇచ్చినా Cardiac Muscles పని చెయ్యక, యూరిన్ పాస్ చెయ్యలేక, చాలా దయనీయమైన పరిస్థితుల్లో ఉండేది. అప్పట్లో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో పని చేసే ఒక టిబెటియన్ డాక్టర్‌తో నాకు స్నేహం కుదిరింది. ఆమె పేరు 'డోల్మా'. ఈ డాక్టర్ల బృందం హిమాలయాల లోని మూలికలు స్వయంగా తెచ్చి వైద్యం చేస్తారు. డాక్టర్ డోల్మా నాడి, బి.పి. మాత్రమే చూసి మందులిచ్చేది. నేను ఆ కేస్ గురించి వివరించి చెప్తే డాక్టర్ డోల్మా ఇచ్చిన టిబెటియన్ మందుకి ఆమెకు రెండు వారాల్లో స్వస్థత చేకూరింది. 3 నెలల్లో పూర్తిగా నయమై మామూలు మనిషిలా ఆరోగ్యవంతురాలంది. రావిశాస్త్రి గారిని చూడగానే నాకది గుర్తొచ్చింది. కానీ డాక్టర్ డోల్మా అప్పటికే చనిపోయారు. వారమ్మాయి 'డాక్టర్ డోల్కర్' ముంబాయి, ఢిల్లీ మొదలైన చోట్ల రోగుల్ని చూస్తున్నారని విన్నాను. కానీ ఆమె అడ్రెస్ గానీ, ఫోన్ నంబర్ గానీ ఏమీ తెలియవు. ఇది ప్రసాద్‌కి చెప్పాను. ప్రసాదేమో 'రావిశాస్త్రిగారి కోసం ఏమైనా ఎంత కష్టమైనా చేద్దాం కామూ' అని అన్నాడు. 'మా అమ్మాయుంది, సాధిస్తుంది'-అని తనకెంతో ఆత్మీయురాలు, స్వంత బిడ్డలా చూసుకునే శివలక్ష్మికి చెప్పాడు. తను ముల్లోకాలూ గాలించినట్లే శోధించి మొత్తానికి డాక్టర్ డోల్కర్ నంబర్ పట్టుకుంది. నేనప్పుడు డాక్టర్ డోల్కర్‌తో రావిశాస్త్రి గారి కేస్ గురించిన మెడికల్ హిస్టరీ మొత్తం వివరించాను. ఇక అప్పటినుంచి రావిశాస్త్రి గారి కోడలు (ఆమె కూడా డాక్టరే) నాడి, బి.పి చూసి శివకి ఫోన్‌లో చెప్పేది. శివ అదే విషయాన్ని ఫోన్‌లో డాక్టర్ డోల్కర్‌కి చెప్పేది. వాళ్ళు అక్కడి నుంచి మందు పంపేవారు. ప్రసాద్ దాన్ని రావిశాస్త్రి గారింటికి చేర్చేవాడు. మా ముగ్గురి కృషి ఫలితంగా ఆ మహానుభావుణ్ణి కొంత సౌకర్యంగా ఉంచగలిగాం. ఆ సమయంలో 'ఇల్లు' నవలను మంచం మీద నుండే డిక్టేట్ చేస్తే ప్రసాద్ రాసి పెట్టాడట. ఆ నవలను ఒక నెలలో పూర్తి చేశారని శివ చెప్పింది. ఈ విషయాన్ని విన్న వారందరూ 'ఆ... ఇదంతా జరిగే పని కాదులే' అని అన్నవారితో 'వాళ్ళు ముగ్గురూ ముగ్గురే. ఉడుం పట్టు లాంటి పట్టుదల గల మనుషులు. బాధ్యతగా పట్టించుకుంటారు' అని కృష్ణ అన్నదట. ప్రసాద్‌కి రావిశాస్త్రి గారు పరమ మిత్రులు. ప్రతిరోజూ ఒక్కసారయినా కలుసుకునేవారట. 'ప్రసాద్ రావిశాస్త్రికి మూడో పెళ్ళాం' అని అందరూ అనేవారని నాతో చెప్పాడు. అలాగే ఆయన పోయినప్పుడు ప్రసాద్ మొదట్లో రావిశాస్త్రి లేని విశాఖను ఊహించుకోలేకపోతున్నాననే వాడు.

ఉద్యోగ రీత్యా మద్రాస్‌లో పని చేస్తున్నప్పుడు ప్రసాద్, అలాగే శ్రీ శ్రీ గారు కూడా 'నీతోనే చలం గారిని చూడటానికి తిరువణ్ణామలై వస్తామ'ని చెప్పేవారు. అలాగే నాతో పాటే వచ్చారు. కాశీ అనే ఆయన (దర్శకుడు రాజమౌళికి పెదనాన్న) ప్రసాద్‌కి చాలా ఇష్ట మైన వ్యక్తి. ఒకానొక సందర్భంలో ఆయన ప్రసాద్‌నీ, నన్నూ చూశారు. 'కామేశ్వరి గారు చలం నవల 'జీవితాదర్శం' లోని లాలస లాగా ఉన్నారన్నాడు. ఇక నువ్వయితే దేశికాచారివే!' అని అన్నారు. వాళ్ళిద్దరూ ఎవరి పనుల్లో వాళ్ళు ప్రశాంతంగా జీవిస్తూ తమ తమ వ్యక్తిత్వాలను నిలుపుకున్నవాళ్ళు. మమ్మల్ని చూస్తే ఆయన కది జ్ఞప్తికి రావడం మా అదృష్టమే మరి!

ప్రసాద్ పోవడానికి రెండు వారాల ముందు ఫోన్ చేసి తాను హైదరాబాద్ వస్తాననీ, తప్పక నా దగ్గరకి వస్తాననీ చెప్పాడు. అటువంటిది అకస్మాత్తుగా అతని మృతిని వార్తల్లో చెబితే నమ్మలేని విషయంగా అనిపించి మళ్ళీ మళ్ళీ టివి స్క్రోలింగ్స్‌లో, వార్తల్లో చూసి విస్తుపోయాను. వెంటనే కృష్ణకి చేశాను. 'ఔను కామేశ్వరీ, తను వచ్చి నిన్నూ, శివనీ, వరూధిని గారినీ, మిగిలిన మిత్రులనూ కలుసుకోవాలనుకున్నాడు' అని చెప్పింది. ఒక ఆప్త మిత్రుడిని కోల్పోవడం నిజంగా దురదృష్టకరం. కానీ తాను చక్కగా తిరుగుతూ, పని చేస్తూ, ఏ జబ్బూ లేకుండా, ఏ దైన్యమూ లేకుండా, హాయిగా హాస్పటల్ కి వెళ్ళడానికి తయారై తనకు తానుగా బట్టలు వేసుకుని, కుర్చీలో కూర్చుని ప్రాణాలు విడిచాడు. Disease, Disability, Dependence - వీటన్నిటినీ అధిగమించి ఈ ప్లానెట్‌ని విడిచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. అతన్ని పోగొట్టుకున్న మనం ఆ వెల్తితో బాధ పడతాం. కానీ అలాంటి అనాయాస మరణాన్ని నేను 'ఆహా! అనిపించే మృత్యువు' అని అంటాను. జీవితాన్ని చివరి వరకు తనకిష్టమైన పనిలో గడిపి, సునాయాసంగా ఈ లోకాన్నుంచి నిష్క్రమించిన అతను ఎంత అదృష్టవంతుడో!



వెండి మేఘం

కృష్ణుడు

చలసాని ప్రసాద్ నాకు ఎలా పరిచయమయ్యారో, ఏ విధంగా సన్నిహితులయ్యారో చెప్పడం కష్టం. ఎందుకంటే పరిచయమైన క్షణం నుంచి సన్నిహితంగా మారగలిగిన ఆకర్షణ శక్తి ఆయనలో ఉన్నది. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం ఆయన నాకు వరంగల్‌లో సాహితీమిత్రుల సమావేశంలో పరిచయమయ్యారు. తర్వాత 1982లో హైదరాబాద్ మారిపోయాక ఆయనతో సాన్నిహిత్యం పెరిగింది. మాకివలస, గుంటూరు, హైదరాబాద్ విరసం సభల్లో ఆయనతో సన్నిహితంగా మెలిగే అవకాశం కలిగింది. ఉదయం పత్రికల్లో నేను రాసే సాహిత్య విమర్శలు, కవితలపై ఆయన నాతో చర్చించేవారు. చేరాతలపై నేను ఉదయంలో తగులుకున్న తర్వాత చలసాని ప్రసాద్ నా ఆవేశాన్ని ఆలోచనగా మార్చే ప్రయత్నం చేశారు. 'ఇదేమి సార్, స్వేచ్ఛగా రాసే కవిత్వానికి ఆయన గణవిభజనలంటూ పాత కాలంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు...' అని నేను వివి ఇంట్లో చలసాని ప్రసాద్‌తో పోట్లాడుతుంటే ఆయన, వివి ఇద్దరూ కుర్రాడికి ఆవేశం ఎక్కువ అని ఒకరినొకరు చూసుకుని నవ్వుకోవడంలో నన్ను ప్రోత్సహించడమే కాని విమర్శించడం కనపడలేదు.

అప్పట్లో వరంగల్ నుంచి వెలువరిచే సృజన, ఇతర ప్రచురణలను హైదరాబాద్‌లో అమ్మడంలో చురుకైన పాత్ర పోషిస్తున్న నాపై చలసాని దృష్టి పడింది. ఆయన శ్రీశ్రీ సంకలనాల ప్రచురణ బృహత్తర బాధ్యతను మీద వేసుకుని వాటిని హైదరాబాద్‌లో కంపోజ్, పేజిమేకింగ్, ప్రచురణ చేయించే బాధ్యతల్ని వసంతలక్ష్మి గారికి అప్పజెప్పారు. ఆమెకు తోడుగా ఈ బాధ్యతల్ని నెరవేర్చే పనుల్ని నాకు అప్పజెప్పారు. ఆ రకంగా శ్రీశ్రీ పుస్తకాల ప్రూఫ్‌రీడింగ్, పేజిమేకింగ్, ప్లేట్‌మేకింగ్ బాధ్యతల్ని నెరవేరుస్తూ చివరకు వాటి ప్రచురణకు ప్రగతి ప్రెస్ యజమాని హనుమంతరావు చుట్టూ నక్షత్రకుడిలా తిరిగే పనిని చేపట్టాను. వాటి కవర్ పేజీ చిత్రాలు వేయించడం కోసం చిత్రకారుడు మోహన్‌ను వేధించడం అలవాటై పోయింది. ఒకసారి మోహన్ చాలా బిజీగా ఉంటే ప్రతిసారీ ఆయనే ఎందుకు అని... నాగార్జున సాగర్‌కు చెందిన చిత్రకారుడు సుదర్శన్‌తో 'ప్రజ' పుస్తకానికి కవర్ పేజీ వేయించాను. జెఎన్‌టియుకు చెందిన మరో చిత్రకారుడు రామును కూడా రంగంలోకి దించాను. ఈ క్రమంలో చలసానితో నిత్యం మాట్లాడే అవకాశం కలిగింది. ఆయనకు నాతో ఎలా మాట్లాడాలో బాగా తెలుసు. ఆ రోజుల్లో శివలక్ష్మి అనే రచయిత్రి టెలికమ్ విభాగంలో పనిచేసేవారు. నేను ఆంధ్రభూమిలో ఉండగా ఆమె నాకు ఫోన్ చేసి చలసాని ప్రసాద్‌తో మాట్లాడించేవారు. ఎస్‌టిడి ఖర్చుతో కూడుకున్న పనికదా... ఆ రకంగా శివలక్ష్మి ఆయనకు ఉపయోగపడేవారు. ఒకసారి నన్ను ఆమె సైఫాబాద్ టెలికమ్ ఆఫీసు ప్రక్కన ఉన్న బట్టల షాపుకు రమ్మన్నారు. అక్కడ నేను వచ్చానో లేదో షాపు యజమాని 'మీకు శివలక్ష్మి గారి నుంచి ఫోన్' అని ఇచ్చారు. ఆ ఫోన్ ఎత్తిన కాసేపటికి తొలుత శివలక్ష్మి, తర్వాత చలసాని లైనులోకి వచ్చారు. శ్రీశ్రీ పుస్తకాల ప్రచురణ గురించి మాట్లాడేవారు. అది చలసాని నిర్వహణాశక్తి. ఆయన ఏ ఊరుకు వచ్చినా ఆయనకు ఫోను, స్కూటర్ ఉచితంగా అమరేవి. తర్వాతి రోజుల్లో ఢిల్లీలో కూడా నా దగ్గరికి స్కూటర్‌పై వచ్చారు. చాలా కాలం పాటు శివలక్ష్మిని చూడకుండానే పనులు జరిగాయి. ఒకరోజు నేను, చలసాని టాంక్‌బండ్‌పై మాట్లాడుకుంటూ నడుస్తుండగా, 'శివలక్ష్మి ఎవరు సార్, ఆమె తీయని గొంతుతో ప్రతిరోజూ ఆంధ్రభూమి ఆఫీసుకు మాట్లాడుతుంటే ఫోన్ ఎత్తిన నా సహచరులు, కృష్ణారావ్, మీ గర్ల్‌ఫ్రెండ్ ఫోన్ చేసింది... అని ఏదోలా నవ్వుతున్నారు...' అని చెప్పాను. అప్పటికి నాకు వివాహం కాలేదు కనుక వారు ఏదో ఊహించుకున్నారు... దీనికి చలసాని ప్రసాద్ పెద్దగా నవ్వి... 'ఆమె నీకంటే పెద్దావిడ. ఎప్పుడో పెళ్ళయింది... ఈ విషయం మీ వాళ్లకు చెప్పు...' అని అనడమే కాదు, శివలక్ష్మి వద్దకు తీసుకెళ్లి పరిచయం చేశారు. చలసాని ప్రేరణతో ఆమె శ్రీశ్రీ రేడియో నాటికలపై ఎంఫిల్ పూర్తి చేసేందుకు కొంత తోడ్పడ్డాను.

శ్రీశ్రీ పుస్తకాల ప్రచురణ ఒక ఎత్తైతే వాటిని అమ్మడం మరో ఎత్తు. చలసాని ఆ పని నాతోనే చేయించారు. నవయుగ సాంబశివ రావును ప్రగతి హనుమంతరావు ఇంటికి రప్పించి చలసాని ఎదుట పుస్తకాలు అమ్మే ఒప్పందంపై సంతకాలు చేయించాను. చలసాని, సాంబశివరావు కుదుర్చుకున్న ఒప్పందంపై నేను, హనుమంతరావు సాక్షులుగా సంతకాలు చేసిన ఒప్పందం కాపీ ఇప్పటికీ నా వద్ద ఉన్నది. మాకివలస సభలకు శ్రీశ్రీ 'మన గురజాడ' ప్రతుల్ని అచ్చు వేయించి తీసుకువచ్చే బాధ్యత నాకు అప్పజెప్పారు. సభల తేదీ దగ్గర పడుతున్నా ప్రగతి ప్రెస్‌లో కదలిక లేదు. దీనితో హనుమంతరావు, ఆయన సుపుత్రుల చుట్టూ తిరిగాను. నేను మాకివలస సభకు వెళ్లాల్సిన సమయానికి పుస్తకం ప్రింట్ అయినా బైండింగ్ కాలేదు. 'రేపు ఉదయాన్నే బయలు దేరాలి సార్, నేను ఎక్కడో పాతబస్తీలో ఉంటాను... ఎలా తీసుకువెళ్లాలి...' అని హనుమంతరావు దగ్గర ఏడ్చినంత పని చేశాను. 'నీవు ఏ రైలుకు వెళుతున్నావు.' అని అడిగారు. 'రేపు ఉదయం ఆరింటికి గోదావరికి వెళుతున్నా సార్...' అని చెప్పాను. 'సరే. నీకు పుస్తకాలు స్టేషన్‌కు చేర్చే బాధ్యత నాది...' అని పంపించేశారు. ఉదయాన్నే రైలు కంపార్ట్‌మెంట్ వద్ద నిలుచుని ఎవరొస్తారా... అని ఉద్వేగంతో ఎదురుచూస్తుంటే హనుమంతరావు గారే రెండు కట్టల పుస్తకాల్ని రెండు భుజాలపై వేసుకుని రొప్పుతూ పరుగెత్తుతూ వస్తున్నారు. నేను వెళ్లి ఆ కట్టల్ని దించి... 'ఇదేమి సార్. మీరు మోసుకుని వస్తున్నారు...' అని అడిగాను. 'శ్రీశ్రీని మోయడం కంటే ఆనందం ఏమున్నది...' అని హనుమంతరావు అన్నారు. చలసానికి, హనుమంతరావుకు మధ్య ఉన్న సంబంధాలకు, ఆ తరం వాళ్లకు శ్రీశ్రీ పట్ల ఉన్న గౌరవానికి ఈ సంఘటన నిదర్శనం.

నాకు 1992లో వివాహం అయ్యాక నేను, మంజుల ఇద్దరం నేరుగా చలసాని ఇంటికి వెళ్లాం. భీమ్లీ వెళ్లి వచ్చాం. మమ్మల్ని సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. కాని సమీపంలో బోటింగ్ చేసేందుకు ఉన్న కొలనును చూసి ఆయన సంబరపడి ముందుగా అక్కడికి తీసుకువెళ్లారు. తానే టిక్కెట్లు తీసుకుని మమ్మల్ని బోటులో కూర్చోబెట్టి, తాను కూడా ఎదురుగా కూర్చుని 'తొక్కండి...' అని బోటును నడిపించారు. ఆయన చిన్నపిల్లాడిలా ఆ బోటును వేగంగా తొక్కుతుంటే మేమిద్దరం ఎంతో ఆశ్చర్యపోయాం.

వివాహం అయిన కొద్ది రోజులకే నన్ను ఉదయం ఢిల్లీ ఆఫీసుకు బదిలీ చేశారు. అక్కడి నుంచి కూడా చలసానితో సజీవ సంబంధాలు కొనసాగాయి. ఒకరోజు ఫోన్ చేసి 'రావిశాస్త్రి చేతులు వణుకుతున్నాయి. ధర్మశాలలో టిబెట్ మందులు దొరుకుతాయి కదా... కనుక్కో' అని చెప్పారు. ఢిల్లీలో ఉన్న కీలకమైన అధికారులు, రాజకీయ నాయకులు నాకంటే ఎక్కువ ఆయనకే తెలుసునని నాకు వచ్చిన కొత్తలో అర్థం అయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో ఉన్న యుగంధర్ ఇంటికి ఆయనే నన్ను తీసుకెళ్లారు. ఉన్నట్లుండి ఒక రోజు నన్ను సినీనటుడు కృష్ణంరాజు ఇంటికి పిలిచారు. అక్కడ ఆయన వారి పిల్లలతో ఆడుతూ కనిపించారు. 'చిలకాగోరింక సినిమాలో కృష్ణంరాజుకు అవకాశం ఇచ్చింది నేనే...' అని ఆయన చెబితే ఎంతో ఆశ్చర్యం కలిగింది.

కాలం గడుస్తున్న కొద్దీ మా మధ్య కొంత భౌతిక దూరం పెరిగింది. ఏ ఏడాదికో నేనో, ఆయనో ఫోన్ చేసి మాట్లాడేవారం. నా ఇండియాగేట్ కాలం బాగుంటే తప్పక ఫోన్ చేసేవారు. ఉత్తరాలు మాత్రం అప్పుడప్పుడూ రాసేవారు. ఏ మంచి పుస్తకం వచ్చినా తెప్పించుకునేవారు. ఆయన ఢిల్లీ రావడం కూడా తగ్గిపోయింది. రెండు సార్లు నేను విశాఖ వెళ్లి ఆయనను కలుసుకునే ప్రయత్నం చేశాను కాని ఆయన ఊళ్లో లేకపోవడం వల్ల కలుసుకోలేకపోయాను. నా ఆలోచనా విధానం మారలేదని పసికట్టిన కొద్ది మంది వ్యక్తుల్లో ఆయన ఒకరు. చాలా కాలం తర్వాత నా కవితా సంకలనం 'ఇంకెవరు' చదివి ఆయన ఈ లేఖ రాశారు.

22-07-06

ఎక్కడమ్మా కృష్ణుడు... ఎవరి వాడమ్మా కృష్ణుడు... ఎలాంటి వాడమ్మా కృష్ణుడు... ఎదనిమీటినాడమ్మా కృష్ణుడు... కవితని రగిలించాడమ్మా కృష్ణుడు... కన్నీటిని ఒలికించాడమ్మా కృష్ణుడు... ప్రేమను పలికించినాడమ్మా కృష్ణుడు... మదినంతా ఆవరించినాడమ్మా కృష్ణుడు... మారు మాటలేదు. మరో మాటలేదు. అన్నీ పోల్చుకున్నాను... పలవరించాను... నీ మనసు పసికట్టాను... ఎన్నో... ఎన్నెన్నో కౌగిళ్లతో

నీ చలసాని ప్రసాద్.

అని ముగించాక కూడా ఆయన ఆగలేదు. మళ్లీ రాయడం మొదలు పెట్టారు... అది ఇలా సాగింది.

జీవితానికీ కవిత్వానికీ సరిహద్దులు చెరిపేశావు. మండుతున్న యువతరం మరుగుతున్న మనసుతో ప్రపంచం కుళ్లుపైనా, కశ్మలంపైనా ధ్వజమెత్తావు...

నీవు 10న పంపించిన పుస్తకాలు ఇవాళ చేరాయి. ఎందుకని? వివరాలు రాయి. పిల్లా మేకా చల్లగా ఉన్నారా? ఏం చేస్తున్నారు?

మీ విజయక్క పోయింది. తెలుసుగా... తేదీ 06-05-03న due to kidney trouble.

కన్నీరు చిప్పిల్లుతోంది. గుండె బావురుమంటోంది.

మనం కలుద్దాం. కలవాలి. ఎప్పుడూ, ఎక్కడా రాయి.

నీ చలసాని ప్రసాద్

15 ఎల్ఐజిహెచ్ కాలని

విశాఖ 530022

0891-2543141, సెల్ - 9885841170

* * *

వెండి మేఘంలా నిత్యం మనసులో తళుక్కుమనే చలసాని ప్రసాద్ పోయారంటే, ఇక మనకు కనబడరంటే నమ్మబుద్ధి కావడం లేదు. మానవసంబంధాలు, గుండెతడి, చైతన్యం మూర్తీభవించిన ఆ స్నేహశీలి లేరంటే తట్టుకోలేకపోతున్నాను. ఆ చిరునవ్వు మనం ఇక చూడలేమనుకుంటే కూడా నమ్మలేకపోతున్నాను. రోజూ మనం నడిచే దారిలో చల్లటి గాలితో మనను సేదదీర్చే ఒక చెట్టు ఉన్నట్లుండి కుప్పకూలిపోతే ఎలా అనిపిస్తుందో చలసాని గుండెపోటుతో కుప్పకూలి క్షణాల్లో మరణించారంటే కూడా అంతే బాధగా అనిపిస్తుంది. అసలు ఆయన ఉన్ననాళ్లూ మనకు వయసు తేడా తెలియకుండా వ్యవహరించారు. అందుకే ఆయన 8 పదులు దాటిన తర్వాత మరణిస్తే కూడా ఎంతో మనోవేదన కలుగుతోంది. 24 సంవత్సరాల తర్వాత ఢిల్లీ వదిలి మళ్లీ హైదరాబాద్ వచ్చాను. కాని చూడాల్సిన వారు తగ్గిపోతుంటే తెలుగు రాష్ట్రాలు ఖాళీగా కనపడుతున్నాయి. బాలగోపాల్, కాళోజీ, ఎంటిఖాన్, కన్నాభిరాన్, కాళోజీ... చలసాని ప్రసాద్... ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు? ☆

విప్లవ కలల నేతగాడు

మల్లీశ్వరి

ప్రసాద్‌గారూ,

మీకో ప్రేమలేఖ ఇలా రాయవలసి వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. మీరు కనపడని చోటుకి ముందస్తు నోటీసు కూడా లేకుండా దబదబ అడుగులు వేసుకుంటూ వెళ్లిపోతారని తెలిస్తే దారి కాసి గదమాయించి అయినా సరే వెనక్కి తీసుకురామా! అప్పటికి నాలుగు రోజుల కిందటే కదా నేనూ చందూ వచ్చే సరికి గదిలో మీ మదిలో పుస్తకాల మధ్య ఆలోచనల్లో ఉన్న మిమ్మల్ని కొంటె ప్రశ్నలడిగి ఏడిపించాను. ఏవన్నానో గుర్తుందా? 'ప్రసాద్ గారూ మీరెవరినైనా ప్రేమించారా?' అన్నాను. చందుకి కాస్త మర్యాద గుర్తొచ్చి పెద్దంతరం లేకుండా ఏంటి ఆ ప్రశ్నలు అని ముసిముసి నవ్వులు నవ్వి తిట్టి మీ వంక కుతూహలంగా చూసాడు. అపుడు చూసాను కదా మీ మొహంలోని చిలక నవ్వుని. నా బుగ్గలు ముద్దాడి 'నిన్ను ప్రేమించాను... ఈ లోకాన్ని ప్రేమించాను, మనుషుల్ని, పుస్తకాలలోని మనుషుల్నీ, విప్లవాన్ని ప్రేమించాన'ని చెప్పి నా ఎత్తుగడని చిత్తు చేయబోయారు. నేను వదలకుండా పోనీ ఎవరికీ ప్రేమలేఖన్నా రాయలేదా? అని కాసేపు నస పెడితే అపుడు విజయ గారికి రాసానని ఒప్పుకున్నారు. నేనొక ప్రేమలేఖ రాస్తాననీ నాకు రిప్లయ్ ఇవ్వాలనీ అడిగితే మీరు నాకు మాటిచ్చారు. నిలుపుకోవాలి మరి!

చలసానీ,

మీ లక్ష్యాలు, మీ ఆచరణ, మీ చిత్తశుద్ధి అసలివేమీ తెలీకుండానే మిమ్మల్ని ప్రేమించిన మనుషులున్నారు. అది మీకు తెలియకపోలేదు. సాహిత్యమన్నా రచయితలన్నా సభలూ సమావేశాలన్నా పెద్దగా ఆసక్తి లేని చందుని, మీ 'మిస్టర్ మల్లిగాడిని' ఏం మాయ చేసి మీ వశం చేసుకున్నారు? మిమ్మల్ని ఇలా సాగనంపి వచ్చి, రెండ్రోజులుగా ధరించిన బింకపు ముసుగుని విప్పి హేంగర్‌కి తగిలించి పడకగది తలుపు వేసుకుని బావురుమని ఏడ్చిన చందు మీ గురించిన మరో పాత సత్యానికి కొత్త ఉదాహరణ. మాట్లాడటానికి ఎవరు దొరుకుతారా అని ఎదురు చూస్తూ తన లోపల ఓవర్ ఫ్లో అవుతున్న దానిని ఆపుకోలేక కొత్త మాటల్లోకి దిగిపోతున్నాడు చందు. ఒక రైతు వర్షించే మేఘాన్ని కావిలించుకున్నట్లుగా ఉంటుంది ప్రసాద్ గారిని కావిలించుకోవడం అంటున్నాడు. ఇంకొక్క ఏడాదో రెండేళ్లో ఈయనతో స్నేహం నడిచి ఉంటే ఇక నేనూ దిగక తప్పేది కాదు అన్నాడు. చలసానీ వింటున్నారా? ఎవరికి వారు, చలసానితో తమ అనుబంధమే అత్యున్నతం అనుకునే స్థాయిలో హృదయాన్ని అంతలా ఎలా విశాలం చేసుకోగలిగారు?

మీరెంత విస్తరించారో తలుచుకుంటున్న కొద్దీ గుండెలు అవిసిపోతున్నాయి. మీరు చటుక్కున మాయం అయ్యారన్న విషయం తెలిసి మా అమ్మానాన్నలు, అత్తమామలు, మా అక్కయ్యలు నా చిన్నప్పటి స్నేహితులు సాహితీ మిత్రులు ఇంత మంది నన్ను పరామర్శించడం చూస్తే ఒక మనిషితో అనుబంధం అంటే వారి సమస్తంతో సహా ప్రేమించడం అన్నది ఆచరణలో ఎలా ఉంటుందో తెలిసి వచ్చింది. అంత శక్తి ఓపిక ఎలా వచ్చాయి? ముఖ్యంగా అహాన్ని రద్దు చేసుకోగల అంతటి హృదయాన్ని ఏ పదార్థంతో తయారు చేసుకున్నారో ఇక ఇపుడు పరిశోధించాలి. మీరు విస్తరించినంత మేరా ఏర్పడిన శూన్యాన్ని భర్తీ చేయడానికి మీ పనులు, మీ జ్ఞాపకాలు, వినా మార్గం లేనందుకు, ఉందేమో మరి ఇంకా మా ముందుకు రానందుకు దుఃఖంగా ఉంది.

కృష్ణాబాయి గారితో చెప్పాను చెదిరిన మనస్సు నుంచి వచ్చే అక్షరానికి కుదురు ఉండదు అని, అదే రాసి చూడు అన్నారామె. అచ్చం ఆమె వంటి మీరు, మీ వంటి ఆమె.

ఫ్రెండూ,

ఆరుద్ర అంటే పెద్దగా పడదు కదా మరి ఆరుద్ర సంపుటం కోసం నన్ను విసుక్కున్నారు ఎందుకూ! నిజ్జంగా నిజం ఫ్రెండూ ఆ 9 నంబర్ సంపుటం నేను తీసుకు వెళ్ళలేదు. సరే మీకు మనసు మనసులో ఉండదు కదా అని మన నారాయణ వేణు గారి పుస్తకం తెచ్చి మీకిస్తే అది మీది కాదని చెప్పి వేణుకి ఫోన్ చేసి పుస్తకం పంపించి వేసి మళ్ళీ రిక్వెస్ట్ చేసి పుస్తకం ఇవ్వమని అడిగారు. చాదస్తం కాదా మరి! నేను అలిగానేమోననీ నేను మొహం మాడ్చుకున్నానేమోనని పదే పదే ఫోన్లు చేసి 'ఒరేయ్ మల్లీ నాకు పుస్తకాల కన్నా మనుషులే ముఖ్యం. ఏవీ అనుకోబాకు' అంటుంటే ఫ్రెండూ! అసలకి మీమీద కోపం వస్తుందా ఎవరికైనా?

చివరిసారి ఎపుడు చూసానూ అని పెద్దగా ఆలోచించలేదు. మిమ్మల్ని కలిసిన ప్రతి సందర్భమూ ఒక పండుగే కదా! మీ మహాప్రస్థానానికి మూడు రోజుల ముందు నేను లోపలి గదిలో పని చేసుకుంటున్నాను. కాలింగ్ బెల్ పని చేయడం లేదు. ముందు గది తలుపు కొట్టినట్లున్నారు వినిపించలేదు. అపుడు ఇంటి వెనుక వైపు వచ్చి పెరట్లో నిలబడి తలుపుకొట్టి పిలిచారు. మీ గొంతు వినగానే పరుగున వచ్చి తలుపు తీసానే గానీ మీకు అంత ఇబ్బంది కలిగించినందుకు ఎంత నొచ్చుకున్నానో అంత అబ్బురపడ్డాను. ఏం ఫ్రెండూ చివరి జ్ఞాపకాన్ని నా కోసం ఘనంగా పదిలపరచడానికా ఆ రోజు మీరు అంత ఆరాటపడ్డారు!

వ్యక్తి పూజలు కూడదు నిజమే. కానీ విప్లవ వాహకులు వ్యక్తులే కదా, వారు ఎంతటి సంస్కారవంతులైతే విప్లవానికి అంతటి సానుభూతిని సంపాదించి పెట్టగలరు కదా... ఇది రాస్తుంటే కొకు చెప్పిన మాటలు గుర్తొస్తున్నాయి మనుషుల్లో సంస్కారం పెరిగేకొద్దీ నేరాలు తగ్గుతాయనీ అపుడు చట్టం చేయాల్సిన పనిని సంస్కారమే చేస్తుందనీ అంటాడు. ఆ సంస్కారం చేతనే కదా తాళాలు లేని ఇంటిని సాధ్యం చేసుకున్నారు, ఆ సంస్కారం చేతనే కదా పోలీసులు లేని రాజ్యం కోసం విప్లవ కలల నేతగాడుగా మారారు.

సీపీ

మీరు పరిచయం అయిన తొలినాళ్ళలో ఏయు అసెంబ్లీ హాల్‌లో కిక్కిరిసిన ఒక సభలో మనిద్దరం వెనుక వరుసలో జనాల మధ్య కూచుని ఉండగా అల్లంత దూరంలోని వేదిక నుంచి సినారె 'అదుగో ఆ మూలన కూచున్న మూల పురుషుడు' అంటూ చతురోక్తులతో మిమ్మల్ని ప్రశంసించినపుడు మీ గురించి కొత్తగా తెలిసినట్లని పించింది. ఆ తెలియరావడం ఒక సుదీర్ఘ ప్రక్రియ. ఇంకా కొనసాగుతూనే ఉంది. కొనసాగుతూనే ఉంటుంది.

కమ్యూనిస్టులు అంటే చాలా మందికి లానే నాకూ గొప్ప గౌరవం ఉంటుంది. మరీ ముఖ్యంగా మీ తరం వారంటే మరీనూ. ఎందుకంటే సగటు మానవుల కంటే భిన్నంగా ఆచరణలో బలంగా ఉంటారనీ, త్యాగాల బాటలో అలవోకగా అడుగులు వేస్తారనీ. సందేహమే లేదు. డబ్బు, అధికారం, హోదా వంటి అనేక ఆధిపత్యాలను జయించిన

నమ్మినవాడు మంచివాడు

వెల్చేరు నారాయణరావు

ఆంధ్రజ్యోతి 28.07.2015

చలసాని ప్రసాద్ పోయాడా? ఖమ్మం నుంచి క్రాంతి శ్రీనివాసరావు అట్లాంటాలో మా ఇంటికి వచ్చి చెప్పారామాట. నాకప్పటికీ నమ్మబుద్ధి కాలేదు. చలసాని ప్రసాద్ పోవడమేమిటి. ఉత్సాహం, ఆప్యాయత, పట్టుదల ఈ మూడింటినీ కలిపిన ముద్దలా కనిపించేవాడు ప్రసాద్ ఎప్పుడు చూసినా.

ప్రసాద్‌ని నేనెరగని రోజులు నాకు గుర్తులేవు. అందరితో కలిసే ఉండేవాడు. కానీ అందరికన్నా వేరేగా ఉండేవాడు. అంత వల్లమాలిన మంచినతనం అంత తీవ్రమయిన రాజకీయ మార్గం రెండూ ఒక్కచోట ఎలా కలిశాయా అని - అతని రాజకీయాలకి కాస్త ఎడంగా జరిగాక కాని నాకు అనుమానం కూడా కలగలేదు.

విపరీతంగా చదివేవాడు. బోలెడు పుస్తకాలు పోగు చేసేవాడు. అతని జీవితమంతా పుస్తకాలే అనుకుందామా అంటే, కాదు అతని మనసంతా లోకమే. సమాజాన్ని అతను చూసే మార్గంలో, విధానంలో అతను ఎన్నడూ పక్కకి జరగలేదు. తన నమ్మకాలని ఎన్నడూ వదులుకోలేదు. కానీ ఆ నమ్మకాలతో సంబంధం లేకపోయినా స్నేహితుల పట్ల ప్రేమనీ తగ్గించుకోలేదు. నేను రెండేళ్ల క్రితం విశాఖపట్నం వెళ్లినప్పుడు పూర్వంలాగే నవ్వుతూ పలకరిస్తూ సరయు ఎలా ఉంది అని అడిగాడు. మా అమ్మాయిని దాని చిన్నప్పుడు చూసిన జ్ఞాపకం అతని మనసులో పదిలంగా ఉంది. అతని లోపలికి చూసినప్పుడల్లా అంత నిశితంగా ఆలోచించేవాడు మళ్లా అంత అమాయకంగా మాట్లాడుతూ ఉంటే అతనితో వాదించడం ఎలా అనిపించేది.

తను నమ్మినదాని కోసం శరీరాన్ని హారతి కర్పూరంలా ఖర్చు పెట్టేస్తూ తన నమ్మినదాన్ని నమ్మిన వాళ్ల కోసం తన సంతోషాన్ని వదులుకుంటూ వాళ్ల కష్టాలు తన కష్టాలు చేసుకుంటూ తనకు కష్టాలే లేవన్నంత హాయిగా నవ్వుతూ ఉండే ప్రసాద్ నాకెప్పటికీ గుర్తుంటాడు. ఒకసారి స్థిమితంగా కూర్చుని అతనితో మాట్లాడాలనే కోరిక ముగిసిపోయింది. ప్రసాద్ లేడనే మాట విన్నప్పటి క్షణం నా మనస్సులో నిలిచిపోయింది.

రన్నింగ్ కామెంటరీ

- దేవిప్రియ

ప్రజాసాంస్కృతిక రంగపు
పెద్ద పెద్ద తలకాయలు,
ఒకటొకటిగ అస్తమించి
చుట్టూ నిస్పృహఛాయలు!

అమరుడు చలసాని ప్రసాద్
ఆయన స్మృతి కలకాలం,
అంకిత విప్లవ స్ఫూర్తికి
సదా ఆలవాలం!!

28/7/2015 ఆంధ్రజ్యోతి

అపురూప మానవుల సమక్షం ఎంత హాయిగా ఉంటుందో నేను మీ వద్ద, మీ వంటి మరికొందరి వద్ద గ్రహించాను. అయితే అలాంటి వాళ్ళలో కూడా మీరు వేరు సీపీ. ఆధిపత్యాలను జయించి మామూలు వ్యక్తులకి సాధ్యం కాని ఆచరణ బలంతో, జ్ఞాన సంపన్నతతో మిలమిలలాడే వ్యక్తులకు ఒక నైతిక తీక్షణత ఉంటుంది. అది చాలా సందర్భాల్లో అది నైతిక ఆధిపత్యంగా మారడం, అజ్ఞానులను(?), బలహీనులను చిన్న చూపు చూడటం గ్రహించినపుడు ఉసూరమంటాం. కానీ చెప్పగా సీపీ మీరట్లా కాదు. మీరసలు పూర్తిగా వేరే. జ్ఞాన, నైతిక ఆధిపత్యాలను కూడా జయించి మీరు మనుషుల్ని ప్రేమించారు.

నాకు మీరు ఇలా అర్థం కాక ముందు ఏడిపించడానికే అయినా ప్రసాద్ గారూ మీరు రాన్రానూ అజాత శత్రువులా మారుతున్నారు అంటే ఒప్పుకునేవారు కాదు. అబ్బే! నేను అజాత శత్రువుని ఏంటి! అదేం తిట్టు! అనేవారు. మీరు నమ్మి ఆచరించిన రాజకీయాల పట్ల మీ నిక్కచ్చితనం ఎంతటిదో పలు సభల్లోనూ పలు సందర్భాల్లోనూ నేను చూసాను కాబట్టి రాజకీయ విలువల పట్ల మీకున్న నిబద్ధత వల్లనే మనుషుల పట్ల అంతటి ప్రేమ సాధ్యపడిందేమో అనిపిస్తుంది.

ప్రసాద్ గారూ,

2009లో రచయిత్రుల సదస్సు ఒకటి పెడుతున్నామని అందరం కలిసి మాలో మేము సంభాషించుకుంటామని ఆ సదస్సుకి ఒక పేరు పెట్టడం కోసం ఆలోచిస్తున్నామని చెప్పినపుడు మీరు చటుక్కున 'మనలో మనం' అనండి బావుంటుంది. తుమ్మల వేణు గోపాలరావు గారి పుస్తకం పేరు అది అన్నారు. ఆ పేరు చాలా నచ్చింది మాకు. తర్వాత 'మనలో మనం' అన్న పేరుతో తాత్కాలికంగా రాష్ట్ర వ్యాప్త రచయిత్రుల వేదిక ఆవిర్భవించడం ఏడాది పాటు జరిపిన సభల అనంతరం నిర్మాణంతో కూడిన 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక'గా అది రూపాంతరం చెందడం జరిగింది. ఈ ప్రయాణంలో మీ భాగస్వామ్యం పరిమితం అయినప్పటికి మనలో మనం అన్న పేరు మీ వల్ల కూడా ఒక అపురూప జ్ఞాపకంగా మిగిలింది నాకు.

మిమ్మల్ని ఇలా ఈ ఇరుకైన వ్యక్తిగత పరిధిలోకి లాక్కొచ్చి మాట్లాడటం క్షంతవ్యం కాని నేరమంటారేమో మీ సహచరులు. ఏం చేయను సీపీ మీరు లేని లోకంలో ఒకటే తత్తరపాటుగా ఉంది. నాలుగు రోజులన్నా పట్టదా సర్దుకోవడానికి! హడావిడిగా దుఃఖాన్ని దులిపేసుకుని కార్యోన్ముఖులు కావడం మంచిదే కానీ ఈ దుఃఖం, ఈ ఖాళీ ఎప్పటికీ తీరేది కాదు కనుక హృదయంలో దానికొక అర నిచ్చి అక్కడ దాపెట్టాలి. అదే పనిలో ఉన్నా. తిరిగిరాని జవాబు కోసం ఎదురు చూస్తూ -

మీ
మల్లిగాడు

నా దృష్టిలో

వివిన మూర్తి

చలసాని ప్రసాద్ అంటే ఒక ప్రయత్నం. ఒక కాలం. ఒక నమ్మకం. నేను ఆ ప్రయత్నంలో ఒక చిన్ని భాగాన్ని. ఆ కాలంలో ఒక పెను మలుపు తర్వాత కలిసిన వాడిని. ఆయనది నమ్మకం. నాది ఆలోచన.

ఆయన గురించి నీకు అంతకన్నా తెలీదా? నీకు వ్యక్తిగత పరిచయంలేదా?

తెలవటం అంటే నిర్వచించుకోవాలి. వ్యక్తగత పరిచయం తెలియటానికి కొలబద్ధ కాదు. అది కేవలం ఒక అవకాశం మాత్రమే. తెలవటమంటే ఆయన రూపం, సంసార వివరాలు, జీవిత ప్రయాణం, మాటతీరు వంటివైతే తెలుసు. తెలవటమంటే ఆయన ఆశలు, ఆలోచనలు, బాధలు, ప్రయత్నాలు అయితే కొంత తెలుసు. నిరాశలు అసలు తెలియవు. నిలబడ్డాలు బాగానే తెలుసు. నిలబెట్టటాలు కొంతే తెలుసు. ఇవన్నీ పైపైన ఎంతవరకూ తెలియటానికి వీలుందో అంతే తెలుసు. నాకు తెలిసిన వాటిని బట్టే నేనాయనకి ఒక రూపం కల్పించుకున్నాను. ఆయన రూపం అదేనా? అంతేనా? నువ్వు ఎరిగినది తప్పు. నీ ఊహ, నీ కల్పన తప్పు. అని ఎవరైనా అనొచ్చు. అంతెందుకు.. నేనే అనుకోవచ్చు.

కాకపోతే-

మనసు విప్పి మాటలాడుకోటాలు, రాజకీయ విషయం కాని, సాహిత్య విషయంకాని లోతుగా చర్చించుకోటాలు మామధ్య జరగలేదు. అంటే ఆయన నిలువు (stand) యెక్క సారం (essence) మీద నేనో అభిప్రాయం ఏర్పరుచుకునేంత దగ్గరగా గాని; నా అభిప్రాయాలను ఆయన మార్చటానికి గాని, ఆయనవి నేను మార్చటానికి గాని; తగినంతగా మేం ఎన్నడూ మాటాడుకోలేదు. నాకు సమకాలీనులైన, ప్రసాద్ కన్న వ్యక్తిగతంగా తక్కువ కలిసిన, వరవరరావు, బాలగోపాల్ గార్లతో లోతుగా మాటలాడే సందర్భాలు వచ్చాయి. కాని ప్రసాద్ గారితో వచ్చినట్టు నాకు గుర్తులేదు.

అందుకు కారణం ముందే అనుకున్నట్టు ఆయనది నమ్మకం. నాది ఆలోచన. ఆయన నమ్మకం ప్రకారం లోకంలో మంచి వాళ్లుంటారు. చెడ్డవాళ్లుంటారు. ఆ మంచివాళ్లలో ఎక్కువమంది పేదలు. కొందరు కొనితెచ్చుకున్న - పేదరికాన్ని స్వీకరించిన- త్యాగాలను ఎంపిక జేసుకున్న పేదలు. ఆ చెడ్డవాళ్లలో ఎక్కువమంది డబ్బున్నవాళ్లు. కొందరు పేదలు చెడ్డవాళ్లైతే దానికి కారణం వాళ్ల పేదరికం. ఈ పేదరికం పోవటానికి అవకాశం ఉంది. చైతన్య వంతులు జనాన్ని మేల్కొలపాలి. ధైర్యవంతులు వారి తరపున పోరాడాలి. వారిని కూడగట్టాలి. ఈ విషయాన్ని ప్రపంచానికి చెప్పినవారు మార్క్సు. తమ దేశ పరిస్థితులని అధ్యయనం చేసి, దానిని అన్వయించి, సాధ్యమేనని చూపిన వారు లెనిన్, మావో. లెనిన్ సాధనని నిలబెట్టినవారు, కొనసాగించిన వారు స్టాలిన్. ఈ విషయం గురించి తెలుగులో రాసినవారు శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొడవటిగంటి, కారా. వారిని సాధన వైపు కూడగట్టటం, నిలబెట్టటం తన కర్తవ్యం. తన లక్ష్యం. ఎందుకంటే చైతన్యం పెంచటానికి సాహిత్యం రాజమార్గం. ఇది ఆయన అవగాహన అని నా అవగాహన.

తమ కాలంలోని ప్రగతి శీల పోరాటాలకు ప్రాణాలు ధారపోసిన కుటుంబంనుంచి వచ్చారు ఆయన. మన దేశంలో మనిషి ఎక్కువగా సామాజిక జంతువు. నేను అనువాదం చేసిన చెప్పులు కుడుతూ.. కుడుతూ అనే పుస్తకంలో రొషాంబు క్లా అనే విదేశీ మహిళ క్రైస్తవం లోకి వచ్చేవారు కుటుంబాలు కుటుంబాలుగా రావటం గమనించింది. కాస్తంత ఆశ్చర్యపోయింది. అదే పద్ధతిలో కమ్యూనిస్టు పోరాటాలలోకి కుటుంబాలుగా రావటం జరిగినట్టు అనేక రచనలలో నమోదయింది. ఇలా కుటుంబాలుగా రావటం అనేది మన సమాజాల లేదా ప్రాచ్య సమాజాల ప్రత్యేకత కావచ్చు. అయితే మతంలోకి రావటం వేరు. పోరాటంలోకి రావటం వేరు. పోరాటంలోకి వచ్చినవాళ్లు దెబ్బలు తిన్నాక కష్టాలు అనుభవించాక తాము కొనసాగటం ఒక విలువైతే, తమ సంతానాన్ని కొనసాగనివ్వటం, కొనసాగేలా ప్రభావితం చెయ్యటం అంతకు మించిన విలువ అని నేను అనుకుంటాను. చలసాని ప్రసాద్ గారిని ఆ విలువ కల వ్యక్తిగా నేను ఆరాధించాను.

1971 జనవరి 1న నేను ఉద్యోగంలో విశాఖపట్టణంలో చేరాను. చేరిన కొద్దికాలానికే నాకు అనంతం అనబడే భమిడిపాటి అనంతనారాయణ నా సంస్థలో సహోద్యోగిగా పరిచయం అయింది. అతని ద్వారానే సిరిపురం క్వార్టర్స్ వేణు, కృష్ణక్క, ప్రసాద్, విజయక్కలతో పరిచయం అయింది. నేనప్పటికి అచ్చెక్కిన రచయితని కాదు. సాహిత్యంతో సాన్నిహిత్యం ఉన్నా సామాజిక చేతనలో దాని ప్రమేయం పట్ల గౌరవం పోగొట్టుకుంటున్న మనస్థితి నాది. ఆ దశలో నేను స్వయంగా గమనించి, ఆలోచించి, నిర్ణయించుకునే నా తత్వం పట్ల కూడా నాకు అగౌరవం ఉండేది. దానిని మధ్యతరగతి ఊగిసలాట అనే ప్రచలిత భావనగా చూసి నన్ను నేను కించపరుచుకునేవాడిని. 1989 వరకు సోవియట్ రష్యా విచ్ఛిత్తి వరకూ నన్ను ఆ భావన వెన్నాడింది. 1976లో కారా మాస్టారు పరిచయమయారు. ఈ మధ్యలో నేను అనేకమార్లు అనంతంతో ఆ నలుగురినీ కలిసే వాడిని. ప్రసాద్ గారి గురించి విని తెలుసుకునే వాడిని. ఆ నలుగురూ స్నేహపూర్వక మనస్సుతో ఎందరికో ఎందరెందరికో చూపిన ఆదరం నాకూ దక్కింది. నా అంతశ్చేతన మీద ఆ కుటుంబ ప్రభావం చాలా ఉంది.

అయితే- అప్పటికి నా బౌద్ధిక పరిస్థితి కొంత చెప్పకతప్పదు. ముఖ్యంగా కమ్యూనిజం వైపు నా ప్రయాణం గురించి. ఆకలి, పస్తులు, అయిదేళ్ల నిరుద్యోగం నా జీవితంలో ఉన్నాయి. పైండా వారి సత్రవలో భోజనం సీటు దొరికినందువల్ల విశాఖలో డిగ్రీ సీటు వచ్చినా కాకినాడలో డిప్లమా చదివాను. అది ఆనాటి మా కుటుంబ స్థితి. ఉద్యోగ ప్రయత్నాలలో హైదరాబాదు చేరాక కమ్యూనిజంతో 68లో పరిచయం. డోస్టోవిస్కీ నేరమూ-శిక్షా చదవటంతో అంతవరకూ నన్ను ప్రభావితం చేసిన భావ కవిత్వం పైన నమ్మకం సడలింది. అప్పటికే భారతీయ కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయింది. పార్లమెంటరీ విధానంపై పూర్తిగా నమ్మకం

పోయినవారు మరోశాఖగా చీలిపోయారు. కలకత్తాలో జరుగుతున్న ఉద్యమం నాలో చాలా ఆశలు రేపింది. డప్పు అనే కలంపేరు పెట్టుకుని రాసేవాడిని. పద్యకవిత్వం ఎడం పెట్టకుండా దానిలో కమ్యూనిస్టు భావనలతో రాసుకునేవాడిని. అది ఒక విధమైన angry Youngman వాతావరణం. అది individual సాహసం పట్ల యువకులలో నమ్మకం కలిగించిన పరిస్థితి. విశాఖ, చలసాని గారు కలిసేనాటికే పార్లమెంటరేతర కమ్యూనిస్టు ఉద్యమంలోని చీలికలు నన్ను హతాశుడిని చేసాయి. ముఖ్యంగా చనిపోయిన అమరులకు లాల్ సలామ్ చెప్పటంలో పాటించిన వివక్ష. ఆ స్థితిలో చలసాని గారితో మాటలాడాలని ప్రయత్నం. ఎన్నో ఆలోచనలు కూడగట్టుకుంటే తప్ప ఒక ప్రశ్న ఏర్పడదు నాకు. అది పట్టుకుని మాటలాడటానికి ప్రయత్నించితే నోరు పెగిలేది కాదు. 'మార్క్సు సిద్ధాంతం ప్రకారం మూడు వర్గాలుగా సమాజం ఉందంటున్నారు. దాని నుంచి వందసంవత్సరాల ప్రయాణం సాగింది. దానిని ఆధారం చేసుకుని అనేక ప్రయత్నాలు ప్రపంచంలో నడిచాయి. ఈ విభజన మనం సమాజాన్ని అవగాహన చేసుకోటానికి పెట్టుకున్న ఏర్పాటు. వందేళ్ల ఆచరణలో మరెవరైనా భిన్నంగా ఆలోచించారా?' ఇదీ ఓ ప్రశ్న. ఈ ప్రశ్నను నేను కొంత సులువుగా అక్షరబద్ధం ఇప్పుడు చేయగలిగాననుకుంటున్నాను. కాని నాలుగు దశాబ్దాల క్రితం నాకు అది చాలాపెద్ద సాధన. ఈ ప్రశ్న వేయగలిగే సరికి ప్రసాద్ గారు నవ్విన నవ్వు ఇప్పటికీ నాకు గుర్తు. సామాజిక పరిణామం ప్రయత్నాలలో విశ్వాసానికి గల స్థానంపై నాకు అప్పటికే ఒక అంచనా ఉండేది. కాని కన్విక్షన్ లేకుండా విశ్వసించలేని నా మనస్థితి పై ముందే చెప్పినట్లు అగౌరవం ఆ నవ్వుతో పెరిగింది. విరసం ఏర్పడటం అనేది ఓ చారిత్రక అనివార్య పరిణామంగా నేను అనుకునేవాడిని. తిరగబడి తీరందే జరుగుబాటు లేదనే భావన సాహిత్యం ద్వారా ప్రచారం చేయటం విరసం సాహిత్య కర్తవ్యంగా నేను ఆనాడు భావించాను. దానితో నాకు ఏకీభావం ఉండేది. కొకు రావిశాస్త్రి గారి సాహిత్యంలో ప్రచారగుణం గురించి చెప్పారు. ప్రచారం అవసరమైనపుడు సిలోన్ రేడియోలో మత ప్రచారానికి డబ్బు పెట్టి సమయం కొనుక్కోగలిగినపుడు మన భావజాల ప్రచారానికి మనం ఎందుకు కొనుక్కోకూడదు? ఇది మరో ప్రశ్న. ఈ ప్రశ్న ప్రసాద్ గారికి వేసిన మరో ప్రశ్న. బహుశా ఇది వెర్రిప్రశ్నే కావచ్చు. శ్రీశ్రీ సినిమా, టివి వంటి నూతన ఆవిష్కరణలు మనకి- అంటే విప్లవ ప్రచారానికి- ఉపయోగపడతాయనే వాడు. ఆ ఆలోచననించి పుట్టినదే నా ఈ బహుశా వెర్రిప్రశ్న. నా దురదృష్టం కొద్దీ ఇలాంటివి మాటలాడటానికి అనుకూలమైన ఇద్దరు ఎస్సెస్, ఐవి పరిచయమైన అతి కొద్దికాలానికే అందకుండాపోయారు. ఇలాంటి ప్రశ్నలకి నాకు నేనే జవాబులు వెతుక్కునే చదువు ముమ్మరం చేసాను. 76లో కారా మాస్టారితో పరిచయం కలిగింది. తాను ఒక విషయాన్ని అర్థం చేసుకునే క్రమంలోనే తన రచన ఉందని ఆయన అనేవారు. నేను కూడా నా అంతట నేనే చదువుద్వారానో ఆలోచన ద్వారానో నా ప్రశ్నలకు జవాబులు వెతుక్కునే మార్గాన్ని స్థిరపరుచుకున్నాను. శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రిల కన్న ప్రసాద్, కృష్ణక్కల పట్ల మాస్టారికి ఉన్న ప్రత్యేక గౌరవం నా ఆలోచనల పట్ల నాకు నమ్మకం పెంచింది. వ్యక్తులలో విశ్వసించదగ్గ లక్షణాలు కొన్ని ఉంటాయన్న విషయం గురించి నేనూ మాస్టారూ చాలా మాటలాడుకున్నాం. ప్రసాద్ ఫొటో మాస్టారి పుస్తకాల మధ్య ఎప్పుడూ ఉండేది. అది చూస్తే పని చెయ్యవలసిన బాధ్యత గుర్తు వస్తుందనేవారు మాస్టారు. కొంతకాలానికి నిబద్ధత, నిమగ్నత చర్చ వచ్చిన కాలంలో సాహిత్య నిబద్ధులను ఉద్యమ నిమగ్నులు చేయటమనే పని విరసం చేస్తున్నట్లు నేను అర్థం చేసుకున్నాను. నాకు ఎలాగూ సాహిత్యం యొక్క ప్రత్యేక అస్తిత్వం పట్ల నమ్మకం లేకపోవటం వల్ల ఆ పని పట్ల నాకు అభ్యంతరం కలగలేదు. స్వయం వివేచనా ధోరణి కల మాస్టారికీ, అదే కోవకి చెందిన నాకూ, సాన్నిహిత్యం పెరిగింది. వ్యక్తిగత విలువలు చాలా ప్రధానమైనవని నేను అనుకునేవాడిని. సమాజం అలా ఉండటం వల్ల నేను ఇలా ఉన్నాననే శ్రీశ్రీ అభిప్రాయాన్ని నేను అంగీకరించలేకపోయాను. ప్రసాద్ గారు నాకు తెలిసినంత వరకు గొప్ప వ్యక్తిగత విలువలు కలవారనే ఆలోచన వల్ల నేను నా నవల బతుకుని అంకిత మివ్వటానికి రాసుకున్న మాట - నాకు తెలిసిన ప్రపంచంలో నేనెరిగిన మంచితనానికి నేనెరిగిన మేరకి ఏకైక రూపం చలసాని ప్రసాద్ గారికి నా ఈ బతుకు అంకితం.

విరసంలో చేరమని ప్రసాద్ గారు ఏనాడూ నన్ను అడగలేదు. చేరతానని నేను ఏనాడూ అనలేదు. నా రాతల గూర్చి ఆయన మాటలాడిన గుర్తు నాకు లేదు. నా పద్ధతి ప్రకారం నేను నా రాతలపై ఎవరి అభిప్రాయాలూ అడిగేవాడిని కాను. ఆయన వద్దనుంచి నేను తీసుకుని చదువుకున్న పుస్తకాలలో ముఖ్యమైనది టాల్ స్టాయ్ రిసరక్షన్. దాని గురించి చాలా మాటలాడుకున్నాం. వేణు గారు మాత్రం నా కథ సినీవాలి చదవి నా యింటికి వచ్చి నాతో మాటాడేరు. కృష్ణక్క కొన్నిసార్లు మాట్లాడారు. విరసంలో చేరిక విషయంలో నా సాహిత్యం యొక్క గుణగణాల ప్రసక్తి ఉందా అన్న ఆలోచనతో ఇవి చెపుతున్నాను. అలాగే ఆనాటి అరసం ప్రసిద్ధులు చాసో, సోమసుందర్, ఆరుద్రల పై ప్రసాద్ గారి వ్యతిరిక్త అభిప్రాయాల ప్రభావం నాపై ఉన్నా, నా అభిప్రాయాలు నావిగానే ఉండేవి. ఒక వ్యక్తి సాహిత్యాన్నీ, వారి సంస్థల మధ్య సంబంధాలతో చూడరాదని నేను గట్టిగానే వాదించేవాడిని. విరసంలో నాకు అదే -అంటే ముద్రలు వేయటం, వేయించుకోటం - ప్రధానంగా కనపించేది. కనీసం భావజాల రంగమైన సాహిత్యంలో కూడా రాజకీయాలలో ఉండేంత గాఢమైన ఎడం ఉండటం గమనించినపుడల్లా నాకు చాలా నిరాశ కలిగేది. వామపక్ష రాజకీయాలలో, ముఖ్యంగా మావో ఆలోచనతో ప్రభావితమైన వారిలో, మావో భావజాల ఆయుధాలైన విమర్శ, స్వీయవిమర్శ, పిడివాదం, ఉదారవాదం వంటివి సక్రమంగా వినియోగించుకోలేకపోటం వల్ల వ్యతిరేక ఫలితాలు ఇచ్చాయనేది నా అవగాహన. అది ఒక ఎత్తైతే అదే స్థాయిలో సాహిత్యరంగంలో అధికార కేంద్రాలు ఏర్పడటం అధ్యయనరాహిత్య ఫలితం కావచ్చని నాకు అనిపించేది. అడిగితే నా అభిప్రాయం చెప్పటం తప్ప పూనుకుని చెప్పరాదన్నది నా పద్ధతి కావటంతో అడిగినపుడు నిస్సందేహంగా మాటలాడేవాడిని. ఒక సాహితీ తీర్మానంలో ఒక మాట ఉండటమా లేదా అన్న అంశం మీద జరిగిన చర్చల గురించి విన్నాక నాకు దాన్ని ఎలా తీసుకోవాలో అర్థం కాలేదు. ఇవన్నీ మాస్టారితో చెప్పేవాడిని. నువ్వు నీ అభిప్రాయాలు చెప్పాలి అని వారు గట్టిగా చెప్పటంతో 83లో విరసం సాహిత్య పాఠశాల సందర్భంగా కలిసిన వరవరరావు, ప్రసాద్, మరొకావెరో గుర్తురావటం లేదు, మాస్టార్లతో 2,3 గంటల సేపు విరసం పని ధోరణి గురించి మాటాడేను. అప్పుడు నాకు అర్థమయినది కారా నేరుగా మాటాడలేనివి నా ద్వారా మాటాడిస్తున్నారన్న ఫీలింగు ఎదుటి వారికి ఉన్నట్టు అనిపించింది. కారా గారితో నా సాన్నిహిత్యం మరోరకమైన సమస్య అయిందా అన్న అనుమానం వచ్చింది. కారా నమ్మిన వ్యక్తిగా మాత్రమే నాకు ముద్ర ఏర్పడింది, నాకో ప్రత్యేక గుర్తింపు పోయింది అని అనిపించింది. ఈ సమస్య నా ఊహో నిజమో నాకు తెలియదు. బహుశా

ఇది నిజమైతే విరసం ప్రసక్తి మామధ్య రాకపోటానికి ఇదీ ఒక కారణం కావచ్చు.

కారా మాస్టారి అమ్మాయి వివాహ సమయంలో నేను ప్రసాద్ గారితో అన్నాను. ఇలాంటి పెళ్లిళ్లు ఎప్పుడు పోతాయని. మరో పదేళ్ల అన్నారాయన. నా బిడ్డల వివాహ విషయంలో నేను సాంప్రదాయకంగా పెళ్లి చేసానని తెలిసి దాదాపు పాతిక ఏళ్ల తర్వాత ఆయన కాస్త ఆశ్చర్యపోయారు. - నేను చేసినదానిని నేను సరైనదే అనను అలాగే తప్పనీ అనను. కాని మీకు నామీద ప్రత్యేక భావం ఉందని తెలిసి సంతోష పడుతున్నాను. కాకపోతే మనదేశంలో సామాజిక, వ్యక్తిగత విలువల సంఘర్షణ భిన్నమైనది. నామటుకు నాకు సమాజంలో ప్రత్యేక ముద్ర లేదు. కనక ఆ ముద్రతో ప్రభావితులయే వారి పట్ల బాధ్యతగా వ్యవహరించవలసిన సందర్భం నాకు రాలేదు. నేను నాకు మాత్రమే బాధ్యుడిని. నా వ్యక్తిగత విలువలూ, ఆలోచనలూ నా నిజాయితీ నాకే పరిమితం. పోతే మన వివాహ విధానం ఒకనాడు సాంప్రదాయానికి సంకేతం. నేడది వేల కోట్ల వ్యాపారం. అది మారకుండా ఉంచేందుకు పెట్టుబడిదారుడూ, అతని బాకాలైన ప్రవచన మీడియా, ధార్మిక గురువులూ వెయ్యి రకాల వ్యూహాలతో సిద్ధంగా ఉన్నారు. ఇది మన దేశపు కమ్యూనిస్టు, సంస్కరణ వాదుల వైఫల్యం ఖాతాలోకే వస్తుంది. - అని చెప్పాను. ఇలాంటివి నేను ఒకనాడు మాటలాడినవి ఆయన వంటి వెయ్యికాళ్ల జెర్రి నిరంతర కార్యకర్తకి గుర్తుండటం నాకు చాలా ఆశ్చర్యంగా ఉండేవి. జ్ఞాపకం ఆయన ప్రత్యేకశక్తి.

ప్రసాద్ గారి సాహిత్య, రాజకీయ ఆచరణలతో నాకు ఉన్న ఏకీభావం ఆయన అభిప్రాయాలతో లేకపోయినా ఆయన వ్యక్తిత్వం పట్ల అపారమైన గౌరవం ఉండేది. ఇప్పటివరకూ అది అలాగే ఉంది. 85లో నేను బెంగళూరు బదిలీ అయాను. అప్పుడు ఆయన కలుసుకోమన్న వ్యక్తి బాబయ్య గారు. ప్రసాద్ గారికి నకలులా కనిపించేవారు. వారిద్దరిదీ మంచి స్నేహం అనేది నా అభిప్రాయం. ప్రసాద్ గారి కన్న బౌద్ధికంగా, మానసికంగా ఆయన దగ్గరయారు. బెంగళూరు వచ్చినపుడల్లా ప్రసాద్ గారు నన్ను కలిసేవారు. విజయక్కగారిని మా ఇంటికి తీసుకువెళ్లాను. వారి మీద ప్రసాద్ గారు నా జ్ఞాపకాలు రాయమని అడిగారు. రాసాను కాని సమయానికి పంపలేకపోయాను. ఇప్పుడు నేను రాస్తున్నదైనా జనానికి చేర్చగలనన్న, చేరుతుందన్న నమ్మకాలు అంతగా లేవు. బెంగళూరులో వారికి పుస్తకాలు చేర్చటం వంటి చిన్నిచిన్ని పనులు, నేను విశాఖ వచ్చినపుడు, ఇచ్చేవారు ప్రసాద్. ఉద్యమం గురించి కాని, విరసం వ్యవహారాల గురించి కాని నేను ఎన్నడూ ఆయన నించి తెలుసుకోలేదు. విరసం చరిత్ర రాయటం గురించి మాత్రం కృష్ణక్క అడిగారు. అది స్థాపకులైన మీరే రాయటం వల్ల సమగ్రత రాదు. సామాజిక ప్రయోజనం తక్కువగా ఉంటుంది. సమాచారం ఇచ్చి ఎవరి చేతనైనా చరిత్ర ప్రొఫెసరు చేత రాయించగలిగితే దానికి ఒక సాధికారత వస్తుందని చెప్పాను.

ఆయన మౌలిక తత్వం గురించి ఆలోచించక తప్పని పరిస్థితి ఒకటి వచ్చింది.

అది రాచకొండ వారి రచనాసాగరం నేను సంపాదక బాధ్యతలు వహించిన సందర్భం. ఆ పుస్తకానికి హక్కులు విషయంలో ప్రసాద్ గారు శాస్త్రిగారి పిల్లలతో మాటలాడారు. ఇన్ని పుస్తకాలు ఇచ్చే ఒప్పందం కుదిరింది. అయితే పుస్తకం ధర విషయమై నేనూ, మనసు ఫౌండేషన్ రాయుడూ పుస్తకం ముద్రణ కన్న తక్కువ ధరకి జనానికి ఇవ్వాలని అనుకున్నాం. అది దాచుకునేవారి కన్న చదువుకునే వారికి చేరాలన్నది మా ప్రయత్నం. దానికి మేం అనుకున్న ధరకన్న రెట్టింపు ధర పెట్టాలని వారసుల కోరిక. దానిని మేం అంగీకరించలేదు. దాంతో పుస్తకం ఆవిష్కరణ జరిగినా మార్కెట్లోకి తెలేకపోయాం. ఆ సందర్భంలో ప్రసాద్ గారు వారసులకి ఎక్కువ ముట్టటంపై దృష్టి పెట్టారు. జనం కన్న శాస్త్రిగారి పిల్లలపై ఆయన అలాంటి నిలువు తీసుకుంటారని నేను ఊహించలేదు. ఆయన కలానికన్నా ఆయన దేహం ముఖ్యమని మీరు భావిస్తారా - అని గట్టిగా అడిగాను. పిల్లలని వదిలేస్తామా అన్న ధోరణిలో మాటాడేరు. అప్పటికీ ఇప్పటికీ ఈ విషయంలో ఆయన పాత్ర ఏమిటన్నది నాకు స్పష్టత లేదు. తర్వాత శ్రీశ్రీ సర్వస్వం వేసేటపుడూ ఆయన నుంచి సహకారం లభించలేదు. గురజాడ వేస్తున్నపుడు కూడా నేను మాటలాడాను. ప్రసాద్ సరైన జవాబు ఇవ్వలేదు. అప్పుడు నేను ఆయనని గురించి అర్థం చేసుకోటానికి ప్రయత్నించాను. రచనాసాగరం ముందుమాటలో మహా రచయితలు మానవజాతి సంపద అంటూ వారిని ప్రేమించేవారు ఆ మహా రచయితలని ప్రపంచ మంతటికీ అందించటంలో ముందుండాలని రాసాను. ప్రైవేటు ఆస్తి అనేది మహాపాపంగా కమ్యూనిస్టులు చెపుతుంటారు. అది ఒక భావన. అది నమ్మి ఆస్తులు పోగొట్టుకున్న కమ్యూనిస్టులు మనకి కనిపిస్తారు. కాని దానిని వ్యక్తులు వదులుకోటం వేరు. అది ఆశయం మాత్రమే అవుతుంది. సమాజం దానిని రాజ్యాంగ బద్ధం చేయగలిగితే అది సోషలిజానికి తొలి అడుగు అవుతుంది. విరసం తొలినాళ్లలో ఒక భావం ప్రచలితంగా ఉండేది. రచన సమాజ ఫలితం కనక దానికి కర్త ఏ ఒకరూ కారు. ఈ భావంతోనే కొన్ని రచనలు కూడా పేరులేకుండా వచ్చాయి. ఇలా తాత్వికంగా, రాజకీయంగా వ్యతిరేకించే స్వంత ఆస్తి అనేదాని పట్ల ప్రసాద్ వంటి వ్యక్తి నిలువు ఏమిటి? వ్యక్తిగత జీవితంలో అన్ని విలువలకి కట్టుబడిన మనిషి తన విధేయత రచయిత కుటుంబానికి ఉండాలా లేక జనానికి ఆ రచనలను చేర్చటానికి ఉండాలా? ఇలాంటి ప్రశ్నలు కలిగాక నేను అనుకున్నదేంటంటే ప్రసాద్ గారు సమాజం కన్న సాహిత్యానికి, సాహిత్యంకన్న రచయితలకి ఎంతోకొంత ఎక్కువ విలువనిస్తారన్న ఆలోచన కలిగింది. దీనిని ఆయన వ్యక్తిగత మౌలిక తత్వంగా నేను భావించాను. ఈ ఆలోచన విస్తరించి భారతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఇక్కడి పరిస్థితులని అధ్యయనంలో భారతీయ సమూహ మనస్తత్వం గురించి ఆలోచించలేదేమో అనిపించింది. ఈ విషయం ప్రస్తావించక పోతే నా జ్ఞాపకాలనన్నింటినీ చెప్పుకున్నానన్న భ్రాంతి నాకు కలగలేదు.

చివరగా-

మానవజాతి ప్రయాణంలో ఒక గతి ఉంది. సమాజంలో వ్యక్తులు స్వతంత్రులుగా సుఖంగా ఉండటం అనేది కేవలం ఆ వ్యక్తి సామర్థ్యతకి పూర్తిగా పరిమితం కాదు. ఈ విషయం వ్యక్తులు గ్రహించటంతో సరిపోదు. సమాజం అలా నిర్మించుకుంటే తప్ప వ్యక్తికి విముక్తి కలగదు. అలాంటి నిర్మాణం కోసం పోరాటాలు జరిగాయి. జరుగుతాయి. అదే మానవజాతి గతి. అలాంటి పోరాటాలకి ప్రసాద్ గారి వంటి పట్టువదలని వారూ కావాలి. ఆ పోరాటాలకి మానవజాతి అంతటినీ స్థలకాలాలతో నిమిత్తం లేకుండా సమగ్రంగా అర్థం చేసుకునే ఆలోచనా పరులూ కావాలి.

పోతే-

పోరాటాలు కొనసాగాలంటే ఆచరణ కావాలి. పోరాటాలు వేగంగా లక్ష్యాలను సాధించాలంటే ఆలోచనా కావాలి. ఆచరణ జీవులలో ప్రసాద్ ఎందరికో నమూనా కావలసిన మనిషి. పరిపూర్ణత్వం ఆశించదగింది కావచ్చు కాని అది ఒక స్వప్నం మాత్రమే. అది స్వప్నం కాదు సత్యమేమో ననిపించే వ్యక్తి నాకు తెలిసినంతవరకూ చలసాని ప్రసాద్.

పుస్తకాలూ, ప్రజల మధ్య చలసాని!

నారాయణస్వామి వెంకట యోగి

మా ఆఫీసులో నాతో పాటు పనిచేసే అనిల్ అనే మిత్రుడు నెలరోజుల సెలవుపై వైజాగ్ వెళ్ళి, వచ్చీ రాగానే 'సార్ మీకో సర్ప్రైజ్ ఉంది' అంటూ ఒక పాకెట్ తెచ్చి యిచ్చాడు. విప్పి చూద్దును కదా 'సాహిత్య సమాలోచన' కృష్ణాబాయి గారి పుస్తకం, అందులో అందమైన దస్తూరితో కృష్ణక్క ఉత్తరం - ఒక ఐదారు వాక్యాలతో మరో ఉత్తరం - 'స్వామీ యెలా ఉన్నావ్ విద్యా పిల్లలూ యెలా ఉన్నారు - ఈ ఒక్క పుస్తకం మా వదిన కోసం పంపి హెల్ప్ చెయ్యి - నిన్ను యెప్పటికీ మరవం' అంటూ - వెనక విన్నెట్లా భరిస్తుందో అమ్మాయి అంటూ ఒక చురక - తనకు మాత్రమే సాధ్యమయ్యే పలకరింపు వాక్యాలు - ప్రసాద్ గారి ఉత్తరం - చాలా సంతోషపడ్డా - గత దినాల స్మృతులన్నీ ఒక్క సారి చుట్టుముట్టినయి -

వెంటనే ఫోన్ చేసా వైజాగ్‌కి - 'యేమి నారాయణస్వామీ పూర్తిగా అమెరికనైజ్ అయిపోయావా - ఇంక అక్కడే ఉండిపోతావా' చాలా ఆత్మీయంగా, హాయిగా పలకరింపు - 'లేదండీ ... అని నేనేదో అనబోతుంటే 'అండీ యేమిటి నీ బొంద కొత్తగా...' అని ప్రేమగా చీవాట్లు - అదే చనువు అదే ఆత్మీయత అదే ఆర్తి గొంతులో.. యే మాత్రం మారలేదు - తనకి 83 యేండ్లు అంటే నమ్మ బుద్ధి కాలేదు - పసి పిల్ల వాడిలా మాటలు - ఒక నాలుగైదు పుస్తకాల పేర్లు చెప్పి ఇవి వెతికి పంపు వెంటనే - వదిన (కృష్ణక్క) అడిగిన పుస్తకం వెంటనే పంపు - అని చనువుగా పురమాయింపు - పుస్తకాలు పంపాక ఫోన్ చేస్తే 'అందినయి పుస్తకాలు చాలా థేంక్స్ - యెప్పుడొస్తావు ఇండియాకు - వచ్చేటప్పుడు మరిన్ని పుస్తకాలు తీసుకు వద్దువు కాని ' - పుస్తకాలే పుస్తకాలే ఇంకా యేమీ యెప్పుడూ అడగ లేదు, కోరుకోనూ లేదు -

2005లో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం చర్చల ప్రహసనం ముగించి 'ఎన్‌కౌంటర్'ల వేడి నెత్తురు చిందించి, విరసం నిషేధించినప్పుడు, నిషేధం యెత్తివేయాలని (అప్పుడు వీవీ ని కూడా జైల్లో పెట్టారు) సంతకాల సేకరణ కోసం శివారెడ్డి గారూ, వేణూ నేనూ, యెం.టీ. వాసుదేవన్ నాయర్, కే. సచ్చిదానందన్‌ల సంతకాల సేకరణ కోసం వెళ్ళినప్పుడు కలిసాం ప్రసాద్ గారిని - (నేనప్పుడే యేడేళ్ళ ప్రవాసం తర్వాత ఇండియా వెళ్ళి ఉండినాను) - ఒక డొక్కు స్కూటర్ వేసుకొని వచ్చారు - అదే ఇస్త్రీ లేని ముడుతల అంగీ, పాంటూ, భుజానికి సంచీ, లావుపాటి మసక కళ్ళద్దాలు - 'యేమివోయి స్వామీ యెప్పుడొచ్చావు - రాగానే నిషేధమా - నాకు సన్ ట్సు 'ఆర్ట్ ఆఫ్ వార్' ఒరిజినల్ స్పెషల్ ఎడిషన్ కావాలి - సంపాదించి పంపు యెట్లయినా' - అప్పుడూ పుస్తకమే అడిగారు.

1984లో శ్రీకాకుళం (మాకివలస) విరసం మహాసభల్లో చూసాను మొదటి సారి ప్రసాద్ గారిని - నేనంతకు ముందు సంవత్సరమే విరసంలో చేరాను. అప్పల్నాయుడు గారి అధ్వర్యంలో చాలా గొప్పగా అద్భుతంగా జరిగినయి ఆ సభలు - అక్కడే నేను విరసం మహామహులందరినీ కలిసాను - కేవీ ఆర్, త్రిపురా, ప్రసాద్, సురా, అప్పల్నాయుడు - ఇంకా చాలా మందిని మొదటిసారి కలిసేను -

సభ ప్రారంభంలో విరసం జెండా యెగరేసినాక
'యెత్తినాం విరసం జెండా
అలలలలుగా వరదలొత్తు
పోరు పోరు జెండా'

అద్భుతమైన మమేకతతో ఆర్తితో నిండిన కంఠస్వరంతో కళ్ళు మూసుకుని గానం చేస్తుంటే 'ఆయనే చలసాని ప్రసాద్' అని చెప్పారెవరో - అప్పట్నుండీ ప్రతి విరసం సభలో సమావేశం లో రుద్రజ్వాల రాసిన పతాక గీతం ప్రసాద్ గారు పాడాల్సిందే!

'సుబ్బారావు పాణిగ్రాహి సంధించిన కళల త్రోవ
మా యెన్నెస్ ప్రకాశరావ్ మండించిన కథనంలో ...
పరిటాల రాములన్న ప్రతిఘటనా మార్గంలో
మా చెర యేతం పట్టిన విప్లవాల గానంలో'

గొప్ప తాదాత్మ్యంతో పాడే వారు ప్రసాద్ గారు - నాకూ నేర్పించండి పాట అంటూ వెంట పడ్డాను ఆయన వెంట - అప్పుడు నాకు 18 యేండ్లు - నవ్వి బుజం తట్టి ఓ తప్పకుండా అన్నారాయన ఆత్మీయంగా -

తర్వాత సభలో
'ఈ విప్లవాగ్నులు యెచ్చటివని అడిగితే
శ్రీకాళం వైపు చూడమని చెప్పాలి
వెంపటాపు సత్యమెవరని అడిగితే
గిరిజనుల సత్యమని గొప్పగా చెప్పాలి
సత్యమూ మాస్టారు స్థానమెచటని అడుగ
గిరిజనుల హృదయాలు గుర్తుగా చూపాలి'

కళ్ళు పూర్తిగా మూసుకుని ఒక చేత్తో బల్ల మీద దరువేస్తూ మూసిన కళ్ళ వెనుక తడి ఉబుకుతుండగా చాలా ఆర్ద్రంగా గొప్పగా గానం చేసారు ప్రసాదు గారు. సభ అంతా పూర్తి నిశ్శబ్దంగా లీనమై పోయి విన్నారా పాటను. పాట తర్వాత నినాదాలు మిన్నంటాయి. అట్లే మరో పాట కూడా పాడే వారు - నాకు పూర్తిగా గుర్తు లేదు కానీ తనకు మాత్రమే సాధ్యమయ్యే గొంతుతో పలికే వింతయిన గమకాలతో పాడే వారు 'స్టాలినోనీ యెర్ర సైన్యం ఫాసిజ వినాశ సైన్యం' అంటూ - ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి ఉద్యమాల్లో ఉన్న అపారమైన అనుభవం ప్రసాద్ గారిది.

పల్లెర్లమూడిలో విరసం తరగతులు నిర్వహించినప్పుడు మాకు మార్క్సిస్టు తత్వశాస్త్రం - గతితార్కిక చారిత్రిక భౌతిక వాదాల పైన పాఠం చెప్పారు ప్రసాద్ గారు. అంత సంక్లిష్టమైన విషయాన్ని చాలా సులభంగా అర్థమయ్యేట్లు ''in a nut-shell'' అనే పద్ధతిలో గొప్పగా చెప్పారు పాఠాన్ని. నేనూ, నా మిత్రుడూ సన్నిహితుడూ ఐన అమరుడు మాధవస్వామీ పాల్గొన్నాం ఆ తరగతుల్లో - మాకు మార్క్సిస్టు తత్వశాస్త్రం పునాదులేసింది ప్రసాద్ గారే. ఆ మొత్తం తరగతులైనన్ని రోజులూ మేమొకటి గమనించాం - ప్రసాద్ గారు గాఢంగా యెప్పుడూ నిద్రపోయే వారు కాదు - వారిది పిట్ట కునుకే! ఒక నాలుగైదు నిమిషాలు ఉన్నచోటే కూర్చునే కళ్ళుమూసుకుని కునికే వారు - తర్వాత మళ్ళీ యథాతథంగా చురుగ్గా ఉత్సాహంగా పనిచేసే వారు!

ప్రసాద్ గారు శ్రీశ్రీ కి, శ్రీశ్రీ సమగ్ర సాహిత్యానికీ పర్యాయ పదం మా దృష్టిలో - శ్రీశ్రీ అంటే వల్లమాలిన ప్రేమ - చిన్నపిల్లాడై పోయే వారు శ్రీశ్రీ పేరు చెపితే - ఈగ వాలినా సహించే వారు కాదు - ఆయన యెప్పుడు యేది మాట్లాడినా రాసినా తప్పకుండా ఒక్కసారైనా శ్రీశ్రీ కవితా వాక్యమో వచన వాక్యమో తప్పకుండా దొర్లుతుంది - శ్రీశ్రీ సమగ్ర సాహిత్యం ప్రచురణ మొత్తం తన భుజాల మీద వేసుకున్నాడు - డబ్బుల సేకరణ దగ్గర్నుండీ, కవర్ పేజి డిజైన్, ప్రూ ఫులూ, ఫుట్ నోట్సూ - సమస్తం ఆయనే - ఒక్కడే నెరవేర్చాడు అంటే అతిశయోక్తి కాదు - సినిమా వాళ్లతో చాలా సంబంధాలుండేవి తనకి -తెలుగు సినిమా రంగంలో కొంత అభ్యుదయ భావాలున్న వారితోనే (ప్రత్యగాత్మ, కే.బి. తిలక్ తదితరులతో ..) సంబంధాలు - కొన్ని సినిమాలకి సహాయ దర్శకత్వం కూడా చేసారని విన్నాను - శ్రీశ్రీ సమగ్ర సాహిత్యం ప్రచురణలో ప్రసాద్ గారు యెవరినీ ఇబ్బంది పెట్టలేదు - తన స్వంతపని లాగానే (యే విరసం పనైనా తాను అట్లే చేసేవారు గొప్ప కమిట్మెంటుతో డెడికేషన్‌తో) అలుపెరుగకుండా చిరునవ్వుతో చేసారు - బాగా గుర్తు హైద్రాబాదులో ఒకసారి కలిసినప్పుడు శ్రీశ్రీ అనువాదం చేసిన 1968 ఫ్రెంచి విద్యార్థుల ఉద్యమం గురించిన గొప్ప పుస్తకం 'రెక్క విప్పిన రివల్యూషన్' (The beginning of the End -- Angelo Quattrochi) పుస్తకాన్నిచ్చి - 'యెట్లా వచ్చింది' అని కనుబొమలెగరేసుకుంటూ కళ్లలో కించిత్తు సంతృప్తితో కూడిన గర్వం కదలాడుతుంటే అడిగారు - నిజంగా చాలా గొప్పగా అద్భుతంగా ప్రచురించబడిందా పుస్తకం.

విరసం సభలకే మరోమారు వైజాగ్ వెళ్లినప్పుడు ప్రసాద్ గారింటికి వెళ్ళాను. పుస్తకాలు, పుస్తకాలు, యెటు చూసినా పుస్తకాలే! విశాఖ సముద్రం ప్రసాదు గారింట్లో ఉన్నట్టనిపించింది - షెల్ఫ్ లో శ్రీశ్రీ లండన్ మహాప్రస్థానం కనబడింది - ఆత్రంగా, ఆకలిగా తీసుకుని చూద్దాం మొదలు బెట్టా! నా కళ్లలో వెలుగే చూసారో, పుస్తకాన్ని అంత వెల పెట్టి కొనుక్కోలేని నా అశక్తతనే గమనించారో - 'మా నారాయణస్వామికి ప్రేమతో' అని రాసి సంతకం పెట్టి యిచ్చారా పుస్తకాన్ని - తనివితీరా శ్రీశ్రీనీ, ప్రసాదు గారినీ నీళ్ళు నిండిన కళ్ళతో గుండెలకు హత్తుకున్నా!

విరసం సంస్థాపక సభ్యులూ, జీవితాంతం నమ్మినదాని కోసం నిలబడ్డ వారూ, అత్యంత సాధారణ జీవితం గడపిన వారూ, యెటువంటి ఆడంబరాలకూ, పటాటోపాలకు పోకుండా చాలా సాదా సీదాగా జీవితాన్నీ, సాహిత్యసృజనూ కొనసాగించిన మహానుభావులు ప్రసాదు గారు. యెందరో రచయితలను ప్రచురించారు, వెన్ను దట్టి ప్రోత్సహించారు - తామ స్వయంగా రాసిందానికన్నా యెక్కువగా, ఆణిముత్యాల్లాంటి సాహిత్యాన్ని ప్రచురించారు. విశాఖలో, తెలుగు నేలపైనా విప్లవ సాహిత్యానికి మూలస్తంభంలా నిలబడ్డారు - యెంత సాదా సీదాగా ఉండే వారో అంతే సింపిల్ గా మాట్లాడినట్టున్నా గొప్ప లోతైన అర్థాన్నిచ్చేట్టుగా మాట్లాడే వారు - 'ఆంధ్రప్రదేశ్ ఒక అందమైన అబద్ధం తెలంగాణ ఒక నిష్ఠూరమైన నిజం' లాటి ఆణిముత్యాల్లాంటి వాక్యాలెన్నో ఆయన ముఖత చాలా యథాలాపంగా వచ్చేవి.

కేవలం పుస్తకాలే కాదు జీవితాన్ని, సమాజాన్నీ, ప్రజా ఉద్యమాలనీ క్షుణ్ణంగా చదివి పీడిత ప్రజా పక్షపాత ప్రాపంచిక దృక్పథాన్ని అణువణువునా వంటబట్టించుకుని అడుగడుగునా ఆచరించి చూపిన వారు ప్రసాద్ గారు. ఆయన 'గాడిదా' అని కానీ మరో రకంగా కానీ తిట్టినా చాలా ముద్దుగా ఉండేది. ఆక్షేపణీయంగా అసలు ఉండేది కాదు. ఆయన పాటలేకుండా విరసం సభలు ప్రారంభమవడం ఊహించడం కష్టంగా ఉన్నది. శ్రీశ్రీ గురించి యెవరు యెక్కడ మాట్లాడినా వెంటనే స్పందించే వారు. ఆ మధ్య ఒడిస్సిస్ యెలైటిస్ 'పిచ్చి దానిమ్మ చెట్టు' పద్యాన్ని విన్నకోట అనువాదం చేస్తే వెంటనే స్పందించి ఇది శ్రీశ్రీ యెప్పుడో అనువాదం చేసాడు - రవిశంకర్ అనువాదం కొంచెం తేడాగా ఉంది అంటూ స్పందించారు. సాహిత్యం, విరసం తదితర అంశాల మీద జరిగిన సుదీర్ఘ చర్చల్లో వేల్చేరు తదితరులతో చురుగ్గా పాల్గొన్నారు. శ్రీశ్రీ నిజమైన జయంతి యేప్రిల్ 30 అని చాలా పరిశోధించి నిర్ధారించారు. ఈ యేడాది, ఆ రోజు వివిధలో విలువైన శ్రీశ్రీ స్మృతులెన్నో పంచుకున్నారు. బహుశ అదేనేమో ఆయన చివరి ప్రచురితం.

నవంబర్‌లో వచ్చేటప్పుడు తీసుకురా అని నాకో పుస్తకాల జాబితానిచ్చారు ప్రసాదు గారు. అప్పల్నాయుడు గారితో పంపిద్దామ నుకున్నా పుస్తకాలు. నవంబర్ రాకముందే హడావిడిగా తిరిగి రాని లోకాలకు వెళ్ళిపోయారు. తలుచుకుంటే గుండె బరువెక్కుతోంది. కళ్లలో నీళ్ళు నిండుతున్నయి. రావిశాస్త్రి అంటే విపరీతమైన అభిమానం ప్రసాదు గారికి. రావిశాస్త్రి కథల్లోని, శ్రీశ్రీ కవిత్వంలోని అథోజగత్సహోదరులకోసం. పతితులు, భ్రష్టులూ, బాధాసర్పదష్టులకోసం, జీవితాంతం సాహిత్య, సాంస్కృతిక సామాజిక రంగాల్లో కృషి చేసిన ప్రసాదు గారు అందరి హృదయాల్లోనూ, ప్రజల నాలుకల పైనా యెప్పుడూ జీవించే ఉంటారు. ఆయనకూ, అసాధారణమైనదీ అయిన ఆయన జీవన శైలికీ మరణం లేదు.

(సారంగ వెబ్ మ్యాగజైన్) ☆

స్నేహశీలి, సాహితీవేత్త - చలసాని ప్రసాద్

చిగురుపాటి సతీష్ బాబు

చలసాని ప్రసాద్... సాహితీవేత్త, స్నేహశీలి, నిగర్వి, నిరాడంబరుడు, ఆశయ నిబద్ధుడు, సిద్ధాంత రాద్ధాంత గోడలను బద్దలు కొట్టుకుని మానవ సంబంధాల నడుమ అద్భుతంగా జీవించిన అతి సామాన్యుడు. శ్రీశ్రీ అంటే పడిచస్తాడు. రావిశాస్త్రికి వీరాభిమాని. వీరిద్దరినీ వ్యక్తిగతంగా ఎవరు విమర్శించినా భరించలేనని బహిరంగంగా ప్రకటిస్తూనే దానిని తన బలహీనతగా ఎంత మాత్రమూ ఒప్పుకోనని మారాం చేసే చంటిపిల్లాడు. కొద్దిపాటి పరిచయం వున్న పిల్లాడినైతే ఏమండీ బాగున్నారా? అంటూ ఎంతో మర్యాదగా పలకరించే చలసాని పరిచయం వున్న వారినైతే ఏరా అబ్బాయి ఏంటి కబుర్లు? అంటూ ఆత్మీయంగా భుజంపై చేయి వేసి పలకరిస్తాడు. ఆయన ఇష్టాన్ని ఎంత నిర్భయంగా వ్యక్తీకరిస్తాడో... అయిష్టాన్నీ అంతే నిర్భీతిగా ప్రకటిస్తాడు. అందుకే ఎందరికో ఆత్మీయుడిగా... పెద్దోడిగా వెళ్ళిపోయిన చిన్నపిలగాడు చలసాని ప్రసాద్.

ఇది తెలిసేనేమో ఆ మధ్య శివారెడ్డి, చలసాని గురించి ఇలా రాశారు... 'ప్రపంచం, సమాజం మనకు చాలా మంది మహత్తర వ్యక్తులను ప్రసాదించింది. వారు వాళ్ళ ముద్రల్ని అలా తోటి వారి మీద, సందర్భాల మీద, ఘటనల మీద వదిలి వెళ్లిపోతారు. మనుషులు పచ్చికుండల్లా పగిలిపోతున్న సమయంలో చలసాని ప్రసాద్ లాంటి మనుషుల మధ్య బతకటం, స్నేహించటం, చరించటం, సృజించటం గొప్ప ఆనందం, ఒక గొప్ప ఆశ, గొప్ప పోరాట ఉత్సాహం, ఎల్లలు లేని ఆత్మీయత ఎక్కడ దొరుకుతాయి - చలసాని ప్రసాద్ లాంటి వాళ్ళ దగ్గర కాకపోతే...'

మావోయిస్టులు, కమ్యూనిస్టులు చేసేది సరైనదేనని నేను అనుకుంటున్నానని వాళ్ళూ వీళ్ళూ అడిగినప్పుడల్లా ఏ మాత్రం సంకోచం లేకుండా చెప్పగలిగినంత ఆచరణాత్మక నమ్మకాన్ని ప్రోది చేసుకున్న చలసాని ప్రసాద్... కొద్ది రోజుల క్రితం విశాఖలో విశ్వనాథ సత్యన్నారాయణ సాహితీపీఠం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించారంటే ఎంతోమందికి ఆశ్చర్యమనిపిస్తుంది. ఆ మాటే ఆయనతో ఎవరైనా అంటే... నా సిద్ధాంతాలను, నమ్మకాలను వదులుకోవాల్సి రానంత వరకూ, ఆచరణ నుంచి పక్కకు వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడనంత వరకూ సంబంధాలను సజీవంగా వుంచుకోవాలి, అలా వుంచుకోవటంలో తప్పేమీ లేదంటూ చెప్పగలిగిన చలసాని మరిలేడని తెలిసిన మరుక్షణం ఆ ఇంటికి వచ్చిన వారిలో విరసంతోనూ, విప్లవ రాజకీయాలతో సంబంధం లేని వారు ఎంతో మంది వున్నారు. వారందరిలోనూ గొప్ప ఆత్మీయుడిని, హితుడిని కోల్పోయామన్న బాధ కనిపించింది.

నా ఐదవ ఏట నుంచే కమ్యూనిస్టునని ఓ ఇంటర్వ్యూలో ప్రకటించిన చలసాని... నాటి నుంచి నేటి వరకూ పక్కకు జరగకుండా మరింత బలంగా ఆ భావజాలానికి అంటిపెట్టుకుని సాగటానికి ప్రేరణ ఏమిటి అని అడిగితే... 'తక్కువ మందికి ఎక్కువ అవకాశాలు, ఎక్కువ మందికి తక్కువ అవకాశాలు అన్యాయం అనిపించింది. ఈ తేడా పోవాలని అనుకునేవాడిని. పెత్తందారుల అధికారం పోయి పనివాళ్ళ అధికారం వస్తేనే సామాజిక న్యాయం ఏర్పడుతుంది.' అంటూ అత్యంత సరళంగా వ్యక్తీకరించే సామర్థ్యం ఆయన స్వంతం.

సాహిత్యంలో కవిత్వ ప్రక్రియపై చలసానికి మక్కువ ఎక్కువ. శ్రీశ్రీ అంటే నాకు పంచప్రాణాలు. శ్రీశ్రీని, రావిశాస్త్రిగారిని ఎవరైనా విమర్శిస్తే నేను పర్సనల్‌గా హర్ట్ అవుతా. ఇది బలహీనత కాదా అంటారు కొందరు. నేనొప్పుకోను. శ్రీశ్రీతో నా అనుబంధం గురించి చెప్పాలంటే కొన్ని వందల పేజీల గ్రంథం రాయొచ్చు అంటూ చెప్పుకొచ్చే చలసాని ప్రసాద్ వాటిని అంత విపులంగా బయటపెట్టిన దాఖలాలు లేవు. ఆ మధ్య విశాఖకు చెందిన సతివాడ శ్రీకాంత్ అనే రచయిత, లఘుచిత్రాల దర్శకుడు శ్రీశ్రీపై డాక్యుమెంట్ తీయాలని అనుకుంటే అన్నీ తానే అయ్యి కనిపించకుండా నడిపించారు చలసాని. ఆ డాక్యుమెంటరీ పరిపూర్ణం కావాలంటే శ్రీశ్రీతో తన అనుబంధాన్ని, బంధాలను చలసాని నెరేట్ చేయ్యాల్సి వుంది. జూలై 26 ఆదివారం మీ వద్దకు వస్తాను అంటూ శ్రీకాంత్ ఫోన్ చేస్తే... వద్దు, ఆదివారం పనుంది, శనివారం రమ్మన్న చలసాని... శ్రీశ్రీతో తన అనుబంధాలను ప్రపంచం ముందు పరచకుండానే వెళ్ళిపోయారు.

సాహిత్యాన్ని ప్రభావితం చేసే సంస్థగా విరసం పాత్రను ఇవాళ ఎవరూ కాదనరనుకుంటాను అంటూనే... శ్రీశ్రీ చెప్పిన మాటలను సమయానుకూలంగా చలసాని కోట్ చేశారు... 'ఏ సాహిత్య ఉద్యమంలోనైనా ప్రధానమైన కవులు కొందరే వుంటారు. రమారమి కవులు ఎందరో వుంటారు.' ఈ మాటలు విప్లవ సాహిత్య ఉద్యమానికి కూడా అన్వయిస్తుందని ఉన్న స్థితిని ఉన్నట్లుగా చెప్పారు చలసాని. అక్కడితో ఆగకుండా తాను పురుడుపోసి, పెంచి పెద్దచేయటంలో కీలక భూమికను పోషించిన విరసం గురించి సగర్వంగా ప్రకటిస్తూ... విరసం ఒక సాహిత్య ఉద్యమం. తెలుగు సాహిత్యానికి శివసాగర్, చెరబండరాజు, గద్దర్, వంగపండు ప్రసాదరావు వంటి కవుల్ని, అల్లం రాజయ్య, బి ఎస్ రాములు వంటి కథకుల్ని విరసం అందించింది. విప్లవ సాహిత్యోద్యమం లేకుండా వీళ్ళను ఊహించలేం. విరసం తెలుగు సాహిత్యంలో నిజమైన విప్లవం తీసుకువచ్చింది అంటూ కుండ బద్దలు కొట్టగలిగిన వ్యక్తిత్వం చలసానికే స్వంతం.

విరసం కార్యదర్శులుగా పనిచేసిన వారికి కూడా సరైన మార్క్సిస్టు పరిజ్ఞానం లేదని మహీధర రామమోహనరావు ఓ వ్యాసంలో రాసిన మాటలపై చలసాని ప్రసాద్ ప్రతిస్పందన చూస్తే ఎవరికైనా ఆయన నిబద్ధతకు సలాం చేయాలని అనిపిస్తుంది. 'పాండిత్యం వేరు. జ్ఞానం వేరు. విరసం కార్యదర్శులే కాదు సామాన్య సభ్యులు కూడా మార్క్సిస్టు జ్ఞానంలో మహీధరకు ఎంతమాత్రం తీసిపోరు. ఇక ఆచరణకొస్తే నేతిబీరకాయలో నెయ్యి ఎంతుందో మహీధరలో మార్క్సిజం అంతే వుంది. రంగు మార్చకుండా దిక్కు మార్చిన రాజకీయ పార్టీ పడగ నీడన వారు కాపురం చేస్తున్నారు' అంటూ ఘాటుగా చలసాని స్పందించారంటే అప్పుడప్పుడూ ఆయనను దూరం నుంచి చూసేవారు ససేమిరా నమ్మలేరు.

విప్లవ సాహిత్యం విరసం సభ్యులకే పరిమితమయింది కాదని అంటూనే ఇవాళ సాహిత్య వస్తువుని నిర్దేశిస్తున్న సంస్థ విరసమే నంటూ సంస్థపై తనకున్న వల్లమాలిన మమకారాన్ని వీలనప్పుడల్లా చలసాని ప్రకటిస్తూంటారు. అదే సమయంలో... అనేకానేక కారణాలతో విరసం సంస్థలో సభ్యులు కాలేని వాళ్ళు కూడా మంచి విప్లవ సాహిత్యం రాస్తున్నారని అంగీకరిస్తూ... వాళ్ళంతా మా వాళ్ళే అంటూ కలుపుకోగల సత్ శీలి. అదే సమయంలో ఇవాళ పత్రికల్లో కవిత్వం రాసే వాళ్ళు ఎక్కువమంది విరసం ప్రభావంతో రాసేవాళ్ళే నంటూ సంస్థ ఆధిపత్యాన్ని ఏ మాత్రం తగ్గకుండా చూసుకోగల చమత్కారి కూడా.

ఓ ప్రభంజనానికి కారణమైన విప్లవ రచయితల సంఘం మరో మూల స్తంభం నేలకొరిగింది. సంస్థ పెద్దదిక్కును కోల్పోయింది. తనను చంటిపిల్లాడిలా సాకిన భార్యను కోల్పోయి ఒంటరిగా మిగిలిన చలసాని ప్రసాద్ ఈ రోజు ఎంతోమంది సహచరులను, స్నేహితులను, హితులను, బంధువులను, పిల్లలను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయారు. ఎంత సామూహిక స్వార్థం.

చలసానికి మావోయిజం ఒక WAY OF LIFE!

కూర్మనాథ్

ఒక శిఖరం కూలిపోయింది.
మా ఉత్తరాంధ్ర పెద్దదిక్కు పోయింది.
తెలుగు సాహిత్యం ఓ చుక్కానిని,
విప్లవోద్యమం ఓ సహచరుడ్ని కోల్పోయింది.
తెలుగు ప్రజలకి ఒక తోడు లేకుండాపోయింది.
యారాడ కొండ చిన్నబోయింది.

* * *

స్వార్థంలేని మనిషి వుంటాడా? వ్యాపారమయమైన, వస్తుమయమైన ఈ ప్రపంచంలో స్వార్థం లేకుండా వుండగలిగే అవకాశం వుందా? ఉందనే నిరూపించాడు ప్రసాద్. విప్లవసాహిత్యోద్యమానికీ, మిత్రులకీ సీపీగా తెలిసిన చలసాని ప్రసాద్ తనని తాను రద్దు చేసుకుని బతికేడు. రెండు రాష్ట్రాల్లో వందలాది మందికి ఆయన ఆప్తుడు. మానవసంబంధాలు నిలబెట్టుకోవడంలో ఆయన తర్వాతే ఎవ్వరైనా.

ఆయన పరిచయాల విస్తృతి చూసి ఎవరైనా ఆశ్చర్యపడక తప్పదు. వరంగల్ రైల్వే స్టేషన్లో కావచ్చు, నాంపల్లి పోస్టాఫీసులో కావచ్చు, పుస్తక ప్రచురణ కేంద్రాల్లో కావచ్చు, పత్రికాఫీసుల్లో కావచ్చు, రచయితల్లో కావచ్చు - ఆయనకి విస్తారంగా పరిచయాలుండేవి. అవి ఏవో మొక్కుబడి పరిచయాలు కావు. ఒకసారి పరిచయం అయితే, ఆయన లేదా ఆమె ఇక ఎప్పటికీ మిత్రుడో, మిత్రురాలో.

జీవితమంతా సాహిత్యం, సాహిత్య ప్రచారం, విప్లవం, పౌరహక్కులు తప్ప ఇంకోటి తెలియని సీపీ. అత్యంత నిరాడంబరుడు. జీవితంలో ఒక్కసారి కూడా దువ్వెన వాడని, ఒక్కసారి కూడా ఇస్త్రీ చేసిన బట్టలు వేసుకుని, ఒక్క క్షణం కూడా టీవీ చూడని - సీపీ. ఆకలి దప్పులు లేనివాడు లేదా పట్టించుకోని వాడు. కానీ, ఆకలి దప్పులతో, అవసరాలతో వున్నవాళ్లని అనుక్షణం పట్టించుకున్నవాడు. సరిగ్గా యేనన్ ప్రసంగంలో మావో చెప్పినట్టు, నిజమైన మేధావి ప్రజల్లో ఒకడిగా, ఎలాంటి భేషజాలు లేకుండా కలిసిపోవాలని చెప్పాడో, నిరాడంబరంగా వుండాలని చెప్పాడో, సీపీ సరిగ్గా అలా వుండేవాడు. మార్క్సిజాన్ని, మావోయిజాన్ని ఒక జీవిత విధానంగా మార్చుకుని, ఒక శ్వాసగా మార్చుకుని బతికినవాడు ప్రసాద్.

సీపీలేడన్న దుఃఖం రక్తంలోకి ఇంకుతున్నకొద్దీ ఆయన లేని లోటు లోతు పెరుగుతూ కనిపిస్తూవున్నది. ఏ కృష్ణా తీరాన్నుంచి ఎప్పుడు విశాఖ వచ్చాడోగాని ఉత్తరాంధ్రని సొంత వూరు చేసుకున్నాడు. శ్రీకాకుళం వుద్యమం ఆయన్నెంత కదిలించిందో, ఉత్తేజపరిచిందో, డిస్టర్బ్ చేసిందో ఆయన 'ఈ విప్లవాగ్నులు ఎచటివని...' పాడినపుడు తెలుస్తుంది.

'మా 'పంచాది' ఎలావున్నాడు,' అని అడిగేవాడు, మా అమన్ గురించి అడుగుతూ. సీపీకి మనుషులు సతతహరితాలు. అంతిమంగా మనిషి నిలుస్తాడు అని నమ్మినవాడు. అందుకే విప్లవోద్యమం ఒడిదుడుకులకు గురైనపుడు, సెట్ బేక్లకు గురైనపుడు, ఎదురుకాల్పుల్లో విప్లవకారులు మరణించినపుడు మ్రాన్పడి, దిగులుపడి ఏనాడూ కూచోలేదు. అసలు అలుపన్నదే, అనారోగ్యమన్నదే తెలియదు ప్రసాద్కి.

పుస్తకాల మీద ప్రసాద్కి ఎంత ప్రేమో చెప్పక్కర్లేదు. ఆయన ఇంట్లో మేడ మీద ఓ పెద్ద లైబ్రరీ.

వామపక్ష ఉద్యమాలకి, సాహిత్యానికి సంబంధించి ఎవరు ఏ యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్నా, ఎవరికి ఏ సందేహం వచ్చినా విశాఖలో ఆయనింటికి వెళ్ళాల్సిందే. ఎక్కడ ఏ పుస్తకం వుందని చెప్పడమే కాదు, ఏ పుస్తకంలో ఏముందో, ఎవరు ఏం చెప్పారో అలవోకగా చెప్పేసేవాడు. ఇక శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొకుల సాహిత్యం మీద ఆయనకున్న పట్టు గురించి కొత్తగా చెప్పాల్సింది ఏముంటుంది? ఆయన లేకుండా, వాళ్ళ సాహిత్య సర్వస్వాల ప్రచురణ ఊహించలేం.

అక్కడికెళ్లకుండా పని అయేది కాదు. ఓ మూడు సంవత్సరాలుగా లెక్కలేనన్ని సార్లు ఫోన్ చేసేడు - మా కొలీగ్ ఒకాయన ఇరవైఏళ్ల క్రితం తన దగ్గర తీసుకున్న పుస్తకాల గురించి. ఓ రోజు, రాసుకో ఏయే పుస్తకాలు తీసుకెళ్లాడో అని పేర్లు చెప్పేడు. అడిగేవా, ఇస్తాననా్నాడా, ఎప్పుడిస్తాడట, అసలు ఇస్తాడా - అని ప్రశ్నల మీద ప్రశ్నలు వేసేవాడు. మా కొలీగ్ రెస్పాన్స్ చాలా పూర్ గా వుండేది. వున్నాయనీ చెప్పేవాడు కాదు, లేవనీ చెప్పేవాడు కాదు. ఇస్తానని ఒకసారి, ఇంతకుముందే ఇచ్చేశానని ఇంకోసారి, వున్నాయో లేదోననీ చెప్పేవాడు.

మూడేళ్ళ గొడవ తర్వాత మొత్తానికి ఆ పుస్తకాల్లో కొన్నిటిని ఇచ్చేడు ఈ మధ్యనే. ఆ సంగతి ఫోన్లో వెంటనే చెప్తే ఎంత సంతోషించాడో! కానీ ఆ పుస్తకాలు చూసుకోకుండానే వెళ్లిపోయాడు.

నాకు ప్రసాద్ పరిచయం చోడవరం లైబ్రరీ స్టడీ మిత్రులు వర్మ, వేణుల ద్వారా. ఆ తర్వాత విశాఖలో జర్నలిజం చదువుతున్నపుడు పరిచయం కొంచెం పెరిగినా, అనుబంధం ఏర్పడింది మాత్రం నేను హైదారాబాద్ వచ్చాక, విరసంలో చేరేకే. తనకి ఇష్టమైన చిన్ని నా సహచరి అయ్యాక, ఎంత సంతోషించాడో.

(సారంగ)

సీపీ అంటే హేపీ!

బమ్మిడి జగదీశ్వరరావు

అంతా అరగంటలోనే అయిపోయింది.. చలసాని ప్రసాద్‌కు బంధుమిత్రుడైన బాలకృష్ణ చెప్పారు! 'ఆయన దేనికి టైం యివ్వడుగదా?.. దీనికి మాత్రం టైం యెందుకిస్తాడు?.. యివ్వడు!..' అని నా నోటిదాకా వచ్చిన మాటని మింగేసాను, అడిగితే అతను మాత్రం యేం చెపుతాడు? సీపీ వుంటే ముఖమ్మీదే అడిగే వాణ్ణి! ..లేడా? యెందుకులేడూ? ఉన్నాడు! ఎప్పటిలాగే మనతో మాట్లాడుతూ మధ్య మధ్యలో కోడి కునుకు తీయడం అలవాటే కదా.. అచ్చం అలాగే కళ్ళు మూసుకొని కోడి కునుకు తీస్తున్నట్టే వున్నాడు! మా మాటలు విని యెప్పటిలానే- 'హే.. లేదు.. నిద్రపోలేదు.. వింటున్నాను..' అని గొణుగుతూ నిద్రలోంచి బయటకొచ్చేసి మనమాడే చివరిమాట పట్టుకొని ఈసారి మాట్లాడలేదు! నిద్ర చాలని మనిషి కదా.. అందుకేనేమో యింత గాఢనిద్ర పోతున్నాడని సరిపెట్టుకున్నాను!

అదేమి చిత్రమో నా భుజం ఖాళీగా వుంది.. నా భుజమే కాదు, అక్కడ చేరిన అందరి భుజాలు ఖాళీగా వున్నాయి?! తప్పితే మల్ల యుద్ధంలో మెడవంచి పట్టినట్టు యెప్పటిలా అతడు పట్టుకోలేదు! పట్టుకొని మెల్లు వంచి గుండెకు మెత్తగా హత్తుకోలేదు! వేసే చేతుల కోసం చుట్టూ చూసాను! నాలాగే అందరున్నూ ఆ చేతుల కోసమే చూస్తున్నట్టున్నారు! ఆ చేతులు తన గుండెమీద కట్టుకొని బడికెళ్లే పిల్లాడిలా బుద్ధిగా వున్నాడు! ఎప్పటిలానే యిస్త్రీ లేని బట్టల్లో వున్నాడు! సీపీ గాజు జాడీలో వున్నాడు!

ఆ గాజు జాడీలో సీపీ నాకు అవుపించలేదు! ఎర్రెర్రని ఆవకాయ కళ్ళముందు అవుపించింది! కళ్ళు వులుముకున్నాను. లాభం లేదు, నన్ను సీపీ ఆవహించినట్టున్నాడు! 'కారం ఆవకాయ తీసుకురండర్రా.. యెలా లేచి కూర్చోడో చూద్దాం' అరవాలనిపించింది! అన్నం మొత్తం ఆవకాయతో తినేసి 'కూరా, చారు యెందుకు దండగ..' యెప్పటి మాటలో యిప్పుడు వినిపిస్తున్నాయి! 'ఆవకాయ మొత్తం అవగొట్టేసాడు.. ఆ బాబే కదరా చెలసాని పెసాదు.. నాకెందుకు తెలీదూ..' అటు మానాన్నకు చెపుతూ యిటు నాతో ఫోన్లో అప్పడే మాట్లాడుతోంది అమ్మ! పక్కనున్న నేరస్తుడు సీపీ మాట్లాడకుండా నేనేమి మాట్లాడను?

'మనం చీమల వైపే వుండాలి.. పాముల పాడగ నీడలోకి దిగిపోగూడదు!' సీపీలాగే రావిశాస్త్రి ఆలోచించారేమో 'చీమై పుట్టాలని వుంది.. నిన్ను కుట్టాలని వుంది..' అన్నారు, చీమై పుట్టి కుట్టినా బావున్ను, మాట నిలబెట్టుకున్నా బావున్ను, కునుకు ఒగ్గిసి లేసి కూకున్ను గావాల! 'కైక' అని పిలిస్తే శ్రీశ్రీ పిలిచాడని లేస్తాడు గావాల! సారూ పులుసూ అంటే యెలాగూ ఒప్పడు, లెగవోయ్ సీపీ అలాగెల్లి తిరిగొద్దాం.. అంటే లేస్తాడు గావాల! టీవీ యెయ్యండర్రా లేసి అవతలికో యివతలికో పారిపోతాడు గావాల! అది కాదుగాని అతగాడి లైబ్రరీకెళ్ళి రొండు పుస్తకాలు చెప్పకుండా తీసుకురండర్రా లెగుస్తాడు గావాల!

దూరాభారం ప్రయాణం చేసి వచ్చాననేమో యెవరో టిఫిన్ చేసారా? అని అడుగుతున్నారు! 'టిఫినుల్లోకల్లా ఉప్మా బాగుంటుంది..' సీపీ గొంతు వినిపించింది. 'యెందుకు?' అని అడక్కుండానే తనే చెప్పాడు. 'దేనికయినా చెట్నీ కలుపుకొనే పని.. ఉప్మాకయితే ఆ పనుండదు..' యెప్పటి మాటలో యిప్పుడు! అందరూ ఏడుస్తూంటే నేను నవ్వుతున్నాను! పలకరింపుగా నవ్వాననుకొని సెకండ్ కాపీ శేషారావు యేడుపు ముఖంలో నవ్వు వులుముకొని చేయందించారు. సెకండ్ కాపీ అతని యింటిపేరు కాదు! సీపీ సెకండ్ కాపీలన్నీ అతనికే యిచ్చేవారు! నాకూ కొకూవి యిచ్చారు.. ఒత్తినే కాదు, 'యిలాంటి కథలు రాయి..' అని! అప్పుడు నవ్విన క్రిష్ణక్క యిప్పుడు యేడుస్తోంది! పక్కన వీవీ పసిపిల్లాడయిపోయాడు!

నా చేతిలోని పుస్తకం జారిపడింది. 'నా పుస్తకమేనా?..' తీసుకెళ్ళింది తీసుకొచ్చావా? అన్నట్టు సీపీ కిందపడ్డ పుస్తకాన్ని అందుకుని దులుపుతున్నాడు. కళ్ళు వులుముకున్నాను. లేదు, సీపీ కాదు! భ్రమ! 'పుస్తకాన్ని యివ్వకముందే వెనక్కి అడగడం యేం బాలేదు..' నామాటకు నేనే నవ్వుకున్నాను! ఏది గతమో యేది వర్తమానమో తెలియడం లేదు?!

అప్పులిచ్చే కాబూలీ వాలాలా వెంటపడి యిచ్చిన బాకీ బుక్కుని వసూలు చేసుకోనేవాడివి.. ఒక్క పుస్తకం వదలని వాడివి.. యిన్ని పుస్తకాలు వదిలి యెలా వెళ్తావ్? తావ్ లేదు!

ఇవతలికొచ్చాను. ఇసక పోస్తే రాలని జనం. వరలక్ష్మి పిలవలేక అలసిపోతోంది. అప్పటికీ ఖండనకు అలవాటుపడ్డ వర్మ సగం పేర్లని ఖండించేసాడు. అయినా తరగదే. మాట్లాడుతున్నారు. పాటలు పాడుతున్నారు! వాళ్ళ గొంతులకు బదులుగా నాకు సీపీ గొంతు వినిపిస్తోంది. ఇదేనేమో మ్యాజిక్ రియలిజం?!

'ఎత్తినాం విరసం జెండా.. అల లలలుగా వరదలెత్తు పోరు పోరు జెండా..' వరద యెటు పడితే అటు పోయినట్టు పోతోంది పాట! 'సీపీ.. కోరస్‌కు కొంచెం ప్లేస్ యివ్వవూ?', యెప్పటిలా వినిపించుకుంటేగా? ఊహు..!

'ఈ విప్లవాగ్నులు యెచటవని అడిగితే శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి..' అంచెట్టకుండా పాటలు పాడుతూనే వున్నాడు సీపీ. నేనూ సువర్ణముఖి నవ్వుకున్నాం. సీపీ చూసిందాకా నవ్వుతూనే వున్నాం. పాట పూర్తిచేసి మాదగ్గరకు వచ్చాడు సీపీ. 'యేంటి నవ్వుతా?' నవ్వుతూ అడిగాడు. మేమిద్దరం అడ్డంగా తలలూపాం. 'కోడిపిల్ల పాట పాడరా?' అడిగిందే ఆలస్యం.. 'కియో కియో మన్నదే కోడిపిల్ల.. హోయి హోయిరే కోడిపిల్లా..' పాట పాడికెలి పోతన్నాడు సీపీ. కళ్ళు మూసేసి.. చేత్తో డప్పు యేసేసి.. ఆపకుండున్నాడు. మేం నవ్వికెలిపోతన్నాం. '...కసాబిసా మింగ తుంతే - సీకటి జలన్తరాలు సూసొచ్చానన్నదే కోడిపిల్ల.. హోయి హోయిరే కోడిపిల్ల.. ల్లా..ల్లా..' చివరి దాకా పాడి ఆపి యెందుకు నవ్వుతున్నారన్నట్టు మమ్మల్ని చూసాడు.

'ఏదైనా మీరు చాలా బాగా పాడుతారు!' పోటీ పడి ముఖిమ్మిదే అన్నాం ముఖీ నేనూ! సీపీ దానికీ నవ్వాడు. వీపుమీద దెబ్బలు వేసాడు. 'లేదు మీరు చాలా బాగా పాడుతున్నారు.. డప్పుకి దొరక్కుండా!' అన్నాను. సీపీ చిన్నబుచ్చుకోలేదు. నవ్వడంలో మాతో కలిసిపోయాడు. 'యిందాక మీటింగులో కూడా మీ పాటకి డప్పు కొట్టినోడు నిజంగా గ్రేటు..' నవ్వి నవ్వి కళ్ళంట నీళ్ళొచ్చాయి! ఆ కన్నుల తడి.. నిన్నటిదా? నేటిదా?

వానా కాలమని మరిచిపోయి.. చలి కాలమయినట్టు యెర్ర దుప్పటి కప్పుకొని సీపీ వెనెక్కిపోయాడు! సీపీ యెప్పుడూ స్కూటరెక్కడమే తెలుసు నాకు! నన్ను యెన్నోసార్లు తన స్కూటర్ యెక్కించుకొని విశాఖ వీధుల్లో తిప్పాడు. హేండిల్ని కూడా 'స్వేచ్ఛగా తిరుగు' అన్నట్టు వదిలితే అది యెటుకటు తిరిగేది. రోడ్డు మీద పిల్లలు బండి చక్రం తిప్పినట్టుగా తిరిగేది స్కూటరు. 'యిదేమి డ్రైవింగురా బాబు?' అనుకొనే వాణ్ణి. విజయక్క ఈయన బండి మీద యెలా తిరిగిందో.. ఆవిడ భలే ధైర్యస్తురాలిలా నా కంటికి కనిపించేది! అంతేనా?, బండి నడుపుతూ కూడా కోడి కునుకు తీసేవాడు సీపీ! ఆ భయానికి నిద్రపోనివ్వకూడదని యేదేదో నోటికి వచ్చిందల్లా మాట్లాడేవాణ్ణి అటుక్కోడిలా ఆపకుండా! జెమినీ సర్కస్ వాళ్ళు కూడా మా సీపీ దగ్గిర యెందుకూ పనికిరారు అని బండి దిగాకే గర్వపడేవాణ్ణి!

బండంటే గుర్తుకొచ్చింది.. మహానంది కథల వర్క్ షాపు నుండి కర్నూలు మీదుగా విజయవాడలో దిగి విశాఖకి వస్తున్నాం. రిజర్వేషన్ దొరక్క దొరికినదల్లా యెక్కేసాం. లారీ బస్సూ రైలూ. రద్దీగా వున్న జనరల్ బోగి. డోరు దగ్గర సీపీ కోడి కునుకు తీస్తున్నాడు. దడ దడ లాడుతోంది రైలు కాదు, నా గుండె! భయంతో పడిపోతాడని సీపీని పట్టుకున్నాను. కునుకు వదిలినపుడల్లా 'భయం లేదు నన్ను పట్టుకో' అంటున్నాడు! ఏడుపు ముఖంతో నవ్వాను. 'కంఫర్టుగా వుంది కదా.. గాలి బాగా తగులుతుంది..' అంటున్నాడు. ఔను మరి ఫేంటు వేసుకుంటానంటే వద్దని తనలాగే లుంగీ కట్టించి ఊర్లన్నీ తిప్పాడు. నా లుంగీ జారినపుడల్లా గాలి కబుర్లు చెప్పాడు!

పాత కబుర్లు చెప్పడానికన్నట్టు ఆగయ్యా అన్నాడు బాబయ్య. 'నీకు తెలుసా? నీకు తెలీకుండా నిన్ను నెత్తిన యెత్తుకు తిరిగాడు..' అని గతాన్ని యెత్తుకు కళ్ళు వొత్తుకున్నాడు. నన్ను మహానంది నీళ్ళలో యెత్తుకొని అల్లం రాజయ్యతో కలిసి ఈత నేర్పించడం తెలుసును గాని యిలా యెత్తుకు తిరిగిన సంగతి తెలీనే తెలీదు!

తెలీదంటే గుర్తొచ్చింది.. సీపీకి యేమీ తెలీదు, తెలిస్తే తను అలా అడిగుండేవాడు కాడు. మేనల్లుడూ దర్శకుడూ అయిన కే.వాసుగారిని పరిచయం చేసిన కొన్నాళ్ళకి 'నీవు రాసిన కథలున్నాయి కదా?, యివ్వు.. సినిమాకి..' అమాయకంగా అన్నారు. సినిమా కథలు వేరని సినిమాల్లో పని చేసిన మనిషికి యెట్లా చెప్పేది?

'అగ్గిపెట్టుందా?' యెవరో యెవర్నో అడుగుతున్నారు. అగ్గిపెట్టె యెవరన్నా యెవర్నన్నా అడగొచ్చు. అగ్గిపెట్టె అడిగినట్టు జాబు?.. వచ్చు అడగొచ్చు.. యెప్పుడూ యేదీ తనకోసం అడగనివాడు అడిగేవాడు. సీపీ ఈ వయసులో జాబేంచేస్తాడు? చిన్న చిన్న వుద్యోగాలు కొత్త కుర్రాళ్ళకి అడిగినవాళ్ళకి లేదనకుండా యిప్పించేవాడు. సీపీకి చెప్పేస్తే వుద్యోగం గ్యారంటీ. వ(యి)చ్చేవరకూ అడిగే వుద్యోగం ఆయనిదే! చేరేవరకూ షెల్టరూ ఆయనిదే! అంతలా యిచ్చేవాడు కంఫర్ట్!

ఇప్పుడు కూడా శనీ ఆదీ సెలవు చూసుకొని సెలవు తీసుకున్నాడు సీపీ. అందుకే యెవర్నీ యిబ్బంది పెట్టలేదని యెవరో అనుకుంటున్నారు. ఇదా కంఫర్ట్?

వేను వెంట జనం! జనం వెంట వేను!

'కామ్రేడ్ చలసాని ప్రసాద్ అమర్ రహే!' అందరితోపాటు నేనూ ఒక నినాదమయ్యాను! కదులుతున్న వేను వెంట కదిలాను! 'యేటీ అన్నేయం.. యేటీ.. ఆ బాబు చెనిపోయినాడా?' రోడ్డువార నిలబడ్డవాళ్ళ మాటలు! చావంటే నా పెళ్ళి గుర్తొచ్చింది నాకు. నా పెళ్ళి ఆయనే చేసాడు. నేననుకున్న మాటే పక్కనెవరో అంటున్నారు. 'పెళ్ళి చేసుకో.. నీ పెళ్ళితో వంద పెళ్ళిళ్ళు అవుతాయ్..' సీపీ అంటే- 'అంత పాపం యెందుకు మూట కట్టుకుంటారు?' నవ్వుతూ సురేషనుకుంటా అడుగుతున్నాడు. 'అయినా యేం పర్లేదు.. పెళ్ళి చేసినా వాళ్ళెవరూ కలిసి వుండడం లేదు..' అతనే ఆన్సరూ యిచ్చి నవ్వుతున్నాడు. ఎవ్వరైనా వేసుకోండి అన్నట్టుగా సీపీ. అందరూ వేస్తున్నారు పువ్వులు!

అందరం సీపీ వెంట నడిచాం. కేజీహెచ్ అనాటమీ దగ్గర ఆగాడు. పాడినా వేడినా అరిచి గీపెట్టినా ఆగలేదు. లోపలికి వెళ్ళాడు. అక్కడే వుండిపోయాడు! మాతో కలిసి తిరిగి రాలేదు. ఆవకాయ లేదనేమో మాతో కలిసి తినలేదు. ఒక్కడూ అక్కడ యేంచేస్తుంటాడో? అంతలోనే భయమేసింది! లేదులే, డాక్టర్ చదివే పిల్లలు తోడుంటారు.. లేదు లేదు పిల్లలకే ఆయన తోడుంటాడు! ఆయనా పిల్లాడే కదా? అందరికంటే 'చిన్న పిల్లాడు!'. సీపీ అంటే అబ్రివేషన్ అదే!

తిరిగి యింటికొస్తుంటే నా భయాన్ని, దుఖాన్ని పోగొడుతూ నా భుజమ్మీద చెయ్యి పడింది.. సీపీ అయ్యుంటాడన్న నమ్మకంతో తల తిప్పి చూడలేదు!

(- ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక 'వివిధ' 03.08.2015 సంచికలో ప్రచురితమైన వ్యాసానికి యింకొన్ని స్వల్ప చేర్పులతో)

☆

విలక్షణ సాహిత్య సంపాదకుడు

కుమార్

వర్తమాన తెలుగు సాహిత్య చరిత్రలో చలసాని ప్రసాద్ స్థానం ఏమిటనే ప్రశ్న వేసుకుంటే ఆయన ఓ మంచి సాహిత్య సంపాదకుడన్నది కచ్చితమైన జవాబు. విప్లవ రచయితల సంఘం (విరసం) నేతగా సాహిత్యోద్యమాల నిర్మాణానికి ఆయన చేసిన కృషి స్మరణీయమే. కానీ ఆయన కృషి ప్రత్యేకత ఏమంటే సాహిత్యాన్ని సృజనాత్మకంగా, పరిపూర్ణంగా ఎడిట్ చేయడం. ఆ రచన ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా చూడడం. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబారావు సాహిత్య సంపుటాల సంపాదకునిగా చలసాని కృషి విశిష్టమైంది. సాహిత్య సంపాదకత్వం అనే మాటకి అసలయిన అర్థాన్ని ప్రతిఫలించే కృషి వారిది. చలసాని ప్రసాద్ ఎడిటింగ్‌లో వచ్చిన శ్రీశ్రీ మహాప్రస్థానం, అనంతం చదివితే శ్రీశ్రీ చెప్పిన, ప్రస్తావించిన విషయాల నేపథ్యం ఏమిటో విపులంగా తెలుస్తుంది. అనేకానేక మంది కవుల్ని, వ్యక్తుల్ని, సందర్భాల్ని, సంఘటనల్ని శ్రీశ్రీ తన కవిత్వంలోనూ, ఆత్మకథలోనూ ప్రస్తావించారు. వాటన్నిటికి వివరణలు సమకూర్చడంలో ఎంతో విలువైన తన సృజనాత్మక సమయాన్ని చలసాని ప్రసాద్ వెచ్చించారు. సాహిత్య సంపాదకత్వం అంటే ఒక రచయిత లేదా కవి చేసిన రచనల్ని ఒకచోట కుప్పపోయడం కాదు. వాటి సందర్భాన్ని, సన్నివేశాన్ని, సారాంశాన్ని గమనించి పాఠకులకు ఉపకరించేలా ఒకచోట చేర్చడం. ఈ విషయంలో చలసాని ప్రసాద్ చూపిన బహుముఖ ప్రజ్ఞ అపారం, అమేయం. ఇవాళ పుస్తకాలకు 'సంపాదకులు'గా పెద్ద అక్షరాలతో పేరు వేసుకునే వారు చలసాని నుంచి ఎంతో నేర్చుకోవాలి.

సాహిత్య సంపాదకుడి కళాత్మక ప్రతిభ ఎలా ఉండాలో చలసాని ప్రసాద్ సంపాదకత్వంలో జనవరి 2010లో వెలువడిన శ్రీశ్రీ 'అనంతం' చదివితే బోధపడుతుంది. నిజానికి తను సంపాదకుడు అనే మాటని ఉపయోగించలేదు. ఈ విధంగా చలసాని ప్రసాద్ చెప్పుకోలేదు. 'మలికూర్పు: చలసాని ప్రసాద్' అని మాత్రమే 'అనంతం' ఇన్నర్ టైటిల్‌లో ఉంది. కానీ ఇది కేవలం కూర్పు మాత్రమే కాదు, అసలు సిసలు సంపాదకుని ప్రతిభా సంపత్తులు ప్రతి అధ్యాయం చివరన కనిపిస్తాయి. అనంతంలోని 28 అధ్యాయాలలో ప్రతి అధ్యాయం చివరన ఇచ్చిన వివరణలు, ఫుట్‌నోట్స్ చదివితే శ్రీశ్రీ ఔన్నత్యం అబ్బురపరుస్తుంది. అంతకన్నా, వాటిని సమకూర్చడంలో సంపాదకునిగా చలసాని ప్రసాద్ అపారమైన కృషి, ప్రతిభ, సృజనాత్మకత విస్మయానికిలోను చేస్తాయి. హేలీ తోకచుక్క, పికాసో, నజ్రుల్ ఇస్లాం, కమలాదేవి, జేమ్స్‌జాయిస్, శుద్ధానంద భారతి వంటి పేర్ల ప్రస్తావన రాగానే వాటి వివరణల్ని ప్రతి అధ్యాయం చివర పాదసూచికల రూపంలో ఇచ్చిన తీరు చకితుల్ని చేస్తుంది. నిరంతరం అధ్యయనశీలిగా జీవించేవారికే సాధ్యమైన పని ఇది.

రాయడంలో కన్నా చదవడంలో ఎక్కువ ఆనందాన్ని, అనుభూతిని పొంది ఉంటారు చలసాని ప్రసాద్. ఆ అధ్యయన అనుభవం స్వీయరచనల కన్నా సాహిత్య సంపాదకత్వాల్లో వారికి ఎక్కువగా ఉపయోగపడింది. శ్రీశ్రీ సంపుటాలనే కాదు కొడవటిగంటి కుటుంబరావు సంపుటాల్ని ఎడిట్ చేసి ముద్రించడంలోనూ చలసాని ప్రసాద్ పోషించిన పాత్ర విశిష్టమైంది. శ్రీశ్రీ, కొ.కు. సంపుటాలకు ప్రసాద్ రాసిన ముందుమాటలు ఎంతో విలువైనవి. ఇరవయ్యో శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్రను, సాహిత్య ఉద్యమాలను అర్థం చేసుకోవడానికి ఇవి ఉపకరిస్తాయి. కవిత్వంలో శ్రీశ్రీ, వచనంలో కొ.కు. ఎందుకు ప్రత్యేకమైన వారిగా నిలిచిపోయారో చలసాని ప్రసాద్ పీఠికలు సాధికారికంగా నిరూపిస్తాయి.

కేవలం వారిద్దరివే కాదు ఇంకా అనేక మంది రచనల్ని ఎడిట్ చేసి పుస్తకాలుగా తీసుకురావడంలో అందించిన తోడ్పాటు, పడిన శ్రమ ఎంతో. సొంత రచనలు అనేకం చేసినా, వాటిని పుస్తకాలుగా వేసుకోవడానికి ఆసక్తి చూపలేదు చలసాని ప్రసాద్. వాటిని ఒకచోట చేర్చడానికి ప్రయత్నించలేదు. కానీ ఇతరుల రచనల్ని పుస్తకాలుగా వెలువరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రచురణకు సంబంధించి అన్ని రకాల సహకారం అందించారు. తన రచనల దగ్గరకు వచ్చేసరికి పట్టించుకున్న దాఖలాల్లేవు. అందువల్లనే ఇప్పటివరకు వారి కొన్ని రచనలు మాత్రమే 2008లో 'సాహిత్య వ్యాసాలు', 2010లో 'చలసాని ప్రసాద్ రచనలు' పేరుతో వెలువడినాయి. కానీ గత ఆరు దశాబ్దాల కాలంలో కవిత్వం, సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షలు, సాహిత్య సంపాదకీయాలు, ముందుమాటలు ఎన్నో సృజించారు. వందలాది సభల్లో విలువైన ప్రసంగాలు చేశారు. అయితే ఇవన్నీ ఒకచోట పెట్టలేదు. ఎంతోమంది సాహిత్యాన్ని ఎడిట్ చేసిన చలసాని ప్రసాద్ సాహిత్యాన్ని ఒకచోట చేర్చి అచ్చు వేయాల్సిన కర్తవ్యం విరసం నిర్వాహకుల మీద ఉంది.

ఎందుకంటే జీవితమే సాహిత్యంగా బతికిన చలసాని ప్రసాద్ సాహిత్యోద్యమాల నిర్మాణంలో, వాటి మనుగడలో కీలకపాత్ర పోషించారు. అనేకానేక ఒడిదుడుకుల్లో కూడా విరసం స్థానం చెక్కుచెదరకుండా కాపాడారు. అస్తిత్వ ఉద్యమాలు ఎన్ని వచ్చినా విరసం అగ్రభాగాన నిలిచేలా చేయడంలో చలసాని ప్రసాద్ నిర్వహించిన పాత్రకు ప్రాధాన్యముంది. విభిన్న తరాల రచయితల్ని, కవుల్ని, వారి రచనల్ని, పోకడల్ని స్వయంగా చూసిన చలసాని ప్రసాద్ తనదైన మార్గాన ప్రయాణించారు. ఆ మార్గం విరసం మార్గమే. విరసం గురించి ఎవరెన్ని మాట్లాడినా, విరసం ప్రాధాన్యం తగ్గకుండా కాపాడటంలో ఆయన సృజనాత్మక ప్రజ్ఞ, ఉద్యమ నిబద్ధత విలక్షణమైనవి. అందువల్లనే శ్రీశ్రీ ప్రసాద్‌గా, విరసం ప్రసాద్‌గా, విశాఖ ప్రసాద్‌గా సాహిత్యలోకానికి సుపరిచితులైన చలసాని ప్రసాద్‌ను విరసం నేతగానే సాహిత్యలోకం గుర్తించింది. అయితే సాహిత్య చరిత్రకు, ముందుతరాల వారికి ఆయన అధ్యయనశీలత, సాహిత్య సంపాదకత్వంలోని కౌశలం గుర్తుంచుకోదగిన, నేర్చుకోదగిన పాఠాలుగా మిగిలిపోతాయి.

నవ తెలంగాణ, 27-7-2015

సి.పి. కి మానవ సంబంధాలే కీలకం

గంటి రమణ

1974కి ముందు 'ఓహో, ఓహో' పరిచయమే. రాజకీయ వ్యతిరేకతల వల్ల బొబ్బిలిలో చదువు మానేసి, ఎవిఎన్ నైట్ కాలేజ్‌లో జాయిన్ అయ్యా. ఉద్యమ ప్రాంతాన్నించి వచ్చినవాడిగా నా మీద ప్రేమ. 'చెలసానీ, నువ్వు...' అనే వాడిని. హిస్టరీ లెక్చరర్ మా చుట్టం 'ఏమనుకుంటున్నావ్, ఆయనంత పెద్దాయన్ని పట్టుకుని ఏకవచన సంబోధన చేస్తున్నావ్?' అని మందలించాడు. కాని నేను లెక్క చేయలా.

' 'జన నాట్యమండలి' మనమూ ప్రారంభించాలి. మనం కళాకారులం కాదాయె, ఎలాగ?' అన్నాడు. పౌరహక్కుల సంఘం సభలో 'ఒత్తన్నాడొత్తన్నాడు - బూవులున్న బుగతోడు' అని వంగపండు పాడాడు. 'ఇతను పనికొస్తాడు' అన్నాడు చెలసాని.

'ఇందిరమ్మ ఇరవై సూత్రాల పథకంలో వెట్టిచాకిరిని నిర్మూలించాలని ఉందని' వంగపండు నమ్మకం. అతనికి రాజకీయ అవగాహన లేదని నా ఉద్దేశం.

'నువ్వు నెగెటివ్‌గా ఆలోచించకు. అతన్ని ఎడ్యుకేట్ చేస్తే చాలా మంచిది. అతను కళాకారుడు' అని నన్నొప్పించాడు. పోర్టు స్కూల్లో ప్రాక్టీస్ చేసేవాళ్లం. బుర్రకథలో వంగపండుకి తోడుగా దేవ సహాయం హాస్యం, నేను రాజకీయాలు చెప్పేవాళ్ళం. 80 బుర్ర కథలు చెప్పాం. అన్నదమ్ములం ముగ్గురం ఓసారి పాటలు పాడితే వేణుగారు తెగ ముచ్చట పడ్డారని కృష్ణక్క చెప్పేది.

'శ్రీశ్రీ, పురిపండా, మా దేశం, కాళీపట్నం, రావిశాస్త్రి మా దేశం సుబ్బారావు పాణిగ్రాహి మా దేశం, చెరబండ, పురిపుండా మా దేశం' అనే పాడేవాడు వంగపండు. ఎలాగో ప్రజల మధ్యకి వెళ్లాలని సిపి ఉద్దేశం. జాలరిపేట, రెల్లివీధి లాంటిచోట్ల ప్రదర్శన లిచ్చేవాళ్లం. వంగపండు 'భూమి భాగోతం' ప్రదర్శనలో నళిని, పద్మిని, పివి రమణ బృందగానం, నవత, అప్పారావు కార్మిక కుటుంబంగా ఉత్తరాంధ్ర అంతా తిరిగాం. అదో గొప్ప అనుభవం. శృతిలేని రాగం చలసానిదే! అలాగే తిప్పలు పడి కోరస్ ఇచ్చేవాళ్లం.

'కాగితం, మనిషి నా వీక్‌నెస్' అనేవాడు చలసాని. మనుషుల్ని ప్రేమించడంలో మొనగాడు.

బొబ్బిలి విరసం మీటింగులయ్యాక ఇంటికి తిరిగొచ్చాం వివి వగైరాలతో. కాసేపటికే ఒక పుస్తకావిష్కరణకి పోయి ఒచ్చాడు. అది విశ్వనాథ సత్యనారాయణ మీద మీటింగునుకుంటా. వివితో చెప్పా 'అన్ని మీటింగులకీ వెళతాడండీ' అంటే ఆయన కొంచెం మందలించాడు. 'దుర్మార్గుడా నా మీద వివికి చెప్తావా? నాకు సాహిత్య సమావేశాలంటే ప్రాణం. ఎక్కడికి పోయినా, మన పాలసీనే చెప్తాను గదా!' అన్నాడు.

కృష్ణక్క కూడా 'పనికి మాలిన మీటింగులక్కూడా పోయి శక్తిని వృథా చేసుకుంటున్నావ్' అని దెబ్బలాడేది.

లైబ్రరీలో పుస్తకాలు సర్దమనేవాడు. ఒక్కరోజు సర్దాక నా కర్థమయింది. అదెంత కష్టమో!

'చెలసానీ! పుస్తకాల కిందపడి చావడం మాత్రం నాకిష్టం లేదయ్యా. చచ్చాక ఏ రెండు మూడు రోజులకో నా కోసం వెదుకుతావ్. ఏం లాభం?' అంటే ముసి ముసి నవ్వులు నవ్వేవాడు.

పాత సంగతొకటి గుర్తొస్తోంది - 'విజయక్కా! చెలసాని బాధితుల సంఘం పెడదాం. దానికి నువ్వు ప్రెసిడెంటువీ, నేను కార్యదర్శిని' అంటే 'నేను చచ్చినా ఉండ'ననేసింది. కుటుంబం పట్ల పెద్ద బాధ్యతగా ఉండకపోయినా, అతని ఔన్నత్యాన్ని గౌరవించేది విజయక్క.

ఏటా మే 27న తప్పకుండా బొడ్డపాడు వెళ్లేవాళ్లం బిఎన్ అప్పారావూ, చెలసానీ, నేనూను - అమరుల సంస్మరణ గురించి. ముందే గుర్తు చేసేవాడు.

మానవ సంబంధాలు ముఖ్యాతి ముఖ్యం చెలసానికి.

తనకి కాళ్లనెప్పులు రాత్రికి తేలేవి. నేను కాళ్లు పట్టేవాడిని. ప్రసాదం 'రమణ అనార్కిస్టు. వాడిని నెత్తికెక్కించుకుంటావెందుకు?' అంటే 'రివల్యూషన్‌లో అనార్కిజం భాగమేగా?' అని సమర్థించాడు.

జూలై 9 మధ్యాహ్నం ఎండ వేళా మెట్లెక్కి వచ్చాడు, రొప్పుతూ. మా ఆవిడ యాపిల్ రసం ఇచ్చింది. రెండు గ్లాసులు తాగి 'అమ్మయ్య!' అన్నాడు. మా ఆవిడ సుభద్ర మీద పాట పాడుతూ వెళ్లాడు.

48 గంటల కన్నా ఎప్పుడూ కలవకుండాలేం. ఇప్పుడెన్ని వేల గంటలు గడిచిపోయాయో చెలసానిని చూడకుండా!

విప్లవోద్యమం ఇచ్చిన కానుక - చలసాని

కె. నాగేశ్వరాచారి

విరసం పీపుల్స్‌వార్‌కు ప్రచార వేదికగా పనిచేస్తూ వుందని నేను ఎం.ఎ. చదువుకునే రోజుల్లో శత్రు పక్షం ప్రచారం చేసేది. విశ్వవిద్యాలయంలో కొందరు ఆచార్యులు కూడా అది తప్పని చెప్పిన వాళ్ళు, చెప్పేవాళ్ళు నేటికీ వున్నారు. 1983లో అనుకుంటాను, విరసం కావలిలో సాహిత్య విమర్శ అధ్యయన తరగతులు నిర్వహించింది. ఆ తరగతులకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి కొందరం విద్యార్థులం హాజరయ్యాం. ఆ తరగతుల్లో సోషలిస్టు వాస్తవికతపై చలసాని ప్రసాద్ పాఠం చెప్పారు. పాఠం అయిన తర్వాత భోజన విరామంలో చలసాని ప్రసాద్‌తో శత్రుపక్షం చేసే ప్రచారాన్ని ప్రస్తావించాను. అప్పుడు ఆయన 'అదేమిటి! నేను చెప్పిన పాఠం మొత్తం ఆ దుష్ప్రచారానికి జవాబేగా!' అని 'ఏ రాజకీయ విశ్వాసం లేకుండా ప్రపంచంలో ఏ రచయిత లేడు. ఉంటే అతను దోపిడీ రాజకీయాలకు దగ్గరున్న వాడే' అని నిష్కర్షగా వివరించాడు. తదనంతర కాలంలో ఇదే విషయంపై ఒక వ్యాసం కూడా రాసినట్లు జ్ఞాపకం. అలా మొదలైంది. చలసాని ప్రసాద్‌తో పరిచయం....

చలసాని ప్రసాద్‌ను కొత్తగా విశ్లేషించడానికి నాకు సాధ్యం కాదు, ఆయనంతటి వ్యక్తిత్వం, అంతటి లోతైన అధ్యయనం, అంతకుమించిన అవగాహన, సాహచర్యం ఉన్నవాళ్ళకే సాధ్యం. విరసం ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో వ్యాసాలు రాశారు. 2008లో 'సాహిత్య వ్యాసాలు' చలసాని రాసిన వ్యాసాల్ని విరసం పుస్తకంగా ప్రచురించింది, అందులో 30 వ్యాసాలు ఉన్నాయి. గోర్కీ, సాహిత్య వ్యాసాలు శీర్షికతో విశ్వసాహిత్యం, సాహిత్య రచన, మన రచయితలు అనే ఉపశీర్షికతో మూడు వ్యాసాలు ఉన్నాయి. ఈ మూడు వ్యాసాలు 1972 ఆగష్టు, నవంబరు, డిసెంబర్ నెలలో సృజనలో అచ్చయ్యాయి. ఈ మూడు వ్యాసాలు ఒకదానికి ఒకటి కొనసాగింపుగా కనిపిస్తాయి. ఈ వ్యాసాలు ప్రచురితమయ్యే నాటికి విరసం పుట్టి రెండేళ్లయింది. కొత్త రచయితలకు విరసం అవగాహనను తెలియజేయాలి, రచయిత బాధ్యతను తెలియజేయాలి, సాహిత్య స్వభావాన్ని, తత్వాన్ని తెలియజేయాలి. బహుశ ఈ ఉద్దేశ్యంతోనే ఈ మూడు వ్యాసాలు రాసి ఉంటారేమో. మరైతే గోర్కీ సాహిత్య వాసాలు అని శీర్షిక ఎందుకు ఉంచినట్లు? గోర్కీ అవగాహన కూడా ఇదే అయి ఉంటుందని రచయిత, పాఠకులు గ్రహించాలేమో! 1972 నాటికి శ్రీకాకుళ ఉద్యమ రక్తపు మరకలు ఆరిపోలేదు. ప్రభుత్వం పత్రికలు కక్షకట్టి దుష్ప్రచారపు హోరందుకున్నాయి. ఈ తరుణంలో రచయితల్ని, పాఠకుల్ని, ఎడ్యుకేట్ చేయాలి. శాస్త్రీయపుటాలోచనల్ని నాటాలి. అవి బలంగా, ఏపుగా ఎదిగి పుష్పించాలి. విశ్వవిద్యాలయాల సాంప్రదాయపు అశాస్త్రీయ ఆలోచనలకు, విమర్శా పద్ధతులకు ప్రత్యామ్నాయంగా కొత్త ఆలోచనా పద్ధతులకు దారులేయాలి. ఈ వ్యాసాల్లో ఎటువంటి పడికట్టు పదాలు వాడకుండా తేలికపదాలతో. చలసాని శాస్త్రీయ ప్రతిపాదనలు చేసారు. విశ్వసాహిత్యం అనే వ్యాసంలో 'సమాజ సహృదయమే సాహిత్యం' అని మొదలు పెట్టి 'ప్రకృతి చిక్కుముడులను విప్పగలిగేది, దానికి కారణాలను గొప్పగా చెప్పగలిగేది సాహిత్యం ద్వారానే' అని చలసాని అంటారు. ఈ వ్యాసంలో సాహిత్యం గొప్ప మానవుణ్ణి తయారు చేస్తుందని వివరిస్తారు.

గొప్పమానవుడ్ని సృష్టించగల సాహిత్యంలోని ప్రధానాంశాలైన భాష, వస్తువు, చిత్రణల్ని 'సాహిత్య రచన' అనే వ్యాసంలో చలసాని వివరిస్తారు. ఈ అంశాలు గోర్కీ, మావో మొదలైన వారంతా వివరించే ఉన్నారు. అదే విషయాల్ని ఇంకా చలసాని విపులీకరించారు. 1972 నాటికి వచన రచనల్లో మాండలికం సాహిత్య గౌరవాన్ని అందుకోలేదు. దాన్ని గ్రామ్య భాషని, నీచ పాత్రలకు ఉపయోగించే భాష అని మాండలికాన్ని నిందించే వారు. భాష జీవితాలకు ముడిసరుకని చలసాని వివరిస్తారు. సాంప్రదాయ సాహితీ వేత్తలను పూర్వ పక్షం చేసి సజీవంగా ప్రజలు మాట్లాడుకునే భాషలో దాగివున్న విస్తృత అంశాల్ని వివరిస్తారు. భాష 'వైరుధ్యాలు తీవ్రమైనప్పుడు వేగంగా మారుతుంది' అని సూత్రీకరిస్తారు. గతంలో ఇలా వివరించిన రచయితలు లేరు. ఇలా వివరించడానికి కారణం చలసాని దృక్పథమే. పాఠకుల్ని చేరడానికి సులభమైన మార్గమేదంటే వాళ్ళ భాషేనని ఆయన అంటారు. జీవితానుభవంలోని విషయాలే రచనా వస్తువుగా స్వీకరించాలని ఆయన అంటారు. చావు పుట్టుకలు శాశ్వత.వస్తువులని, సాంఘిక పరిస్థితుల వల్ల ఏర్పడే వస్తువులు, మనసులో వేళ్ళూనుకొని ఉంటాయని చెబుతూ ఏదీ కలకాలం ఉండవని ఆయన అంటారు. సామ్యవాద సమాజంలో శాశ్వత వస్తువులు మారి పోతాయని చలసాని అన్న మాటని చాలా లోతుగా వివరించుకోవాల్సి ఉంటుంది.

సాహిత్యంలో మూడో అంశం చిత్రణ. సాహిత్యం ఉన్న వాటిని చిత్రిస్తే సరిపోదు, మనం ఏం సాధించగలమో కూడా రచయిత గుర్తుంచుకోవాలంటారు చలసాని. ఈ వ్యాసం రచనా రంగంలోకి అడుగు పెట్టేవారికి ప్రాథమిక పాఠం వంటింది.

'మన రచయితలు' అనే వ్యాసంలో రచన అనుభూతిని కలిగిస్తే చాలదని జీవితం పట్ల ఒక దృక్పథాన్ని పాఠకులకు కల్పించాలని అంటారు. అతి చిన్న వ్యాసంలో తేలిక భాషలో గొప్ప విషయాల్ని చెప్పగలగడం చలసాని శైలి. చెప్పదల్చుకున్న విషయంపై పట్టు ఉన్నప్పుడే ఆ శైలి సాధ్యం. రచయిత పాఠకుల పట్ల, సామాజిక విలువల పట్ల బాధ్యతతో మెలగాలని ఈ వ్యాసంలో సూచిస్తారు. ఈ సందర్భంలో త్రిపురనేని మధుసూదనరావు కవిత్వం-చైతన్యం వ్యాసాలు గుర్తుకొస్తాయి. త్రిపురనేని వ్యాసాలు పూర్తిగా సూత్రీకరించినవి. చలసాని వ్యాసాలు అన్వయించి చెప్పేవిగా కన్పిస్తాయి. ఆ అన్వయం ఉద్యమాలతో కలిగి ఉంటుంది. ఒక తాత్వికతతో ఉంటుంది. లేదా చరిత్రతో ఉంటుంది. చలసాని వ్యాసాలు చదువుతూ ఉంటే ఆయన ప్రపంచ రాజకీయ తాత్వికులు, రచయితలు, ఉద్యమకారులను ఎంత గాఢంగా చదివి అర్థం చేసుకున్నారో తెలుస్తుంది.

భారత విప్లవోద్యమం ఉద్యమించే ప్రజలకిచ్చిన కానుక చలసాని ప్రసాద్. రాజకీయాలకు, సాహిత్యానికి ఉండే అవిభాజ్యతను ఆయన అనేక కోణాల్లో వివరిస్తారు. పాఠకులు తటస్తంగా ఉండి

మూగబోయిన విప్లవ స్వరం

- ఉప్పెన

చెమట చుక్కల విలువ శ్రమ జీవులకే
దక్కాలని ఎక్కుపెట్టిన కలం... కన్ను మూసింది...
నిర్బంధాలను ఎదిరించి రాజ్యహింసపై నిత్యం
గొంతు ఎత్తి గర్జించిన గళం... మూగబోయింది...
విరసం చిరునామా... మా చలసానీ
చేగొను మా... రెడ్ సెల్యూట్స్... రెడ్ సెల్యూట్స్...
విప్లవ స్వరమా... మా చలసాని
అందుకో మా అరుణారుణ విప్లవ జోహార్లు...
నేస్తమా... నేస్తమా... నక్సలైట్ల నేస్తమా... విప్లవాల మిత్రమా...
నివాళి... నివాళి... నీకు మా... విప్లవ నివాళి... మా చలసాని...
ఎమర్జెన్సీ చీకటి రోజులను ఎదిరించి వెలుగు కొరకు ఆరాటపడి...
నూతన రాజ్యం ఆవిష్కరణ కోసం పోరాడిన వాడు...
హక్కుల ఉద్యమాలను దిక్కులు పిక్కటిల్లేలాగ...
నినాదాల నిప్పులై కురిసినవాడు...
అణిచివేయబడుతు... హరించి వేయబడుతున్న
ఆదివాసీల హక్కుల రక్షణకై నిర్వాసిత ఉద్యమ మేఘగర్జనై...
సామ్రాజ్యవాదులకు సలాం కొట్టి గులాంలుగా మారిన గుండెల్లో
అక్షర తూటాలు పేల్చి... మాటల ఈటలను విసిరిన వాడు...
ప్రజా ఉద్యమాలకు జనం స్వరమై రాజ్యం కంట్లో రాయి అయినవాడు..
ఇంటి మీద... ఒంటి మీద దాడులు జరిగిన...
అదరని వాడు బెదరని వాడు బతుకు మీద ఆశవీడి బరితెగించి నడ్చాడు...
'కష్టజీవి'కి ఇరువైపుల ఉన్నవాడే 'కవి' అన్న
శ్రీశ్రీ మాటలను అక్షరాల నిజం చేసి... ఆచరించి నడిచిన వాడు...
జీవితాంతం... విప్లవ అక్షర సాహిత్య సేద్యం చేసి
విప్లవ స్వరాన్ని వినిపించి దోపిడీ వ్యవస్థను వణికించినవాడు...
మూగబోయిన ఓ... విప్లవ స్వరమా...
విప్లవ మిత్రమా... నక్సల్‌బరి ప్రియనేస్తమా...
చలసానీ చేగొను మా... శ్రమజీవుల రెడ్ సెల్యూట్స్...
అందుకొను మా... అరుణ పతాకం విప్లవ జోహార్లు...
అరుణతారల అరుణారుణ విప్లవ నివాళులు... విప్లవ నివాళులు..

కలం సిపాయి

- చిలువేరు అశోక్

అతడు...
విరసం మిత్రులు
నాటిన నిత్య చలనం

అతడు...
విప్లవ స్వరాల
అక్షర రూపం

అతడు...
కార్మిక కర్షక జనాల
హక్కుల పత్రం
మార్క్స్ సూత్రం

అతడు...
పీడిత వర్గాల
సాంస్కృతిక దళం
విముక్తి గీతం

అతడు...
ఊరు... వాడ తిరిగి
ఎర్రెర్రని అక్షరాలను
ఏరుకొని తెచ్చిపోగేసిన
నడిచే గ్రంథాలయం

అతడు...
పుస్తకాల కుస్తి పట్టి
ప్రజారాసుల గుండెను తట్టి
పోరు రాజేసిన కలం సిపాయి

నూతన ప్రజాస్వామ్య స్వప్నంకై
వర్గపోరాట మార్గాన
మడమ తిప్పని
కలం సాము చేసిన
అతడే... అతడే... కా. చలసాని
అందుకో మా అరుణారుణ నివాళి...

చలసాని ప్రసాద్ రచనలు చదివితే ప్రజా ఉద్యమాలపట్ల మొగ్గుచూపక తప్పదు. 1988లో విజయవాడ విరసం సాహిత్యం పాఠశాలలో చలసాని ప్రసంగం ఈ పుస్తకంలో 'సాహిత్యంలో తిరోగమనం - పురోగమనం' శీర్షికతో ప్రచురితమైంది. ఈ వ్యాసం సాహిత్య విద్యార్థులంతా చదువదగింది. ఉద్యమాలు రచయితల్ని ఎలా ప్రభావితం చేస్తాయో చలసాని ఈ వ్యాసంలో వివరిస్తారు. గొప్ప రచయితలు అనబడే ఆరుద్ర, సినారే, దీపాలపిచ్చయ్య శాస్త్రి లాంటి వాళ్ళు చేసిన తప్పుల్ని తత్కాలజ్ఞతను వివరిస్తారు. ఇక్కడేకాదు ఎక్కడా కూడా చలసాని నోరుజారరు. చేసిన తప్పిదాల్ని ఉదాహరణలతో ఎత్తి చూపుతారు. ఉద్యమకారులకు ఉండవలసిన విజ్ఞత, బ్యాలెన్స్ ఆయనలో పుష్కలంగా ఉన్నాయని నేను అనడం నా స్థాయికి మించిన మాట అవుతుంది. అట్లని అది ఆరాధనా భావం కాదు.

ఈ వ్యాసంలో సంక్షిప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం దెబ్బతినడానికి కారణాలు, అంతర్జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివరిస్తారు. 1955లో రష్యా నాయకులు బుల్గానిన్, కృశ్చేవ్‌లు భారత పర్యటనలో ఉద్యమ ప్రాంతమైన ఆంధ్రదేశంలో పర్యటించలేదట. కలకత్తాలో ఏర్పాటైన రష్యా నాయకుల బహిరంగ సభకు 50 లక్షల జనం హాజరయ్యారని చలసాని వివరిస్తారు. ప్రపంచంలో ఇంతమంది జనం ఒక రాజకీయ సభకు హాజరవ్వడం ఎక్కడా జరగకపోవడానికి కారణం స్టాలిన్‌పట్ల గౌరవమేనని అంటారు చలసాని. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర చరిత్రల్ని తేదీలతో సహా వివరించడం ఆయనకున్న జ్ఞాపక శక్తికి నిదర్శనం కాదు. ఉద్యమాలకు ఉన్న నిబద్ధతే కారణం.

ఈ నిబద్ధతవల్లే కావచ్చు ప్రపంచ విప్లవ సాహిత్యాన్ని బాగా ఆకళింపు చేసుకొన్నట్లు ఆయన వ్యాసాలు చదివితే అర్థం అవుతుంది. విప్లవోద్యమ చిక్కుముళ్లను ఏ రచయిత ఎలా వివరించారో చెబుతారు. అస్పష్ట విషయాల్ని ఎవరు స్పష్టం చేశారో వివరిస్తారు. ఈ విస్తృత అధ్యయనం విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి లిప్తపాటు కూడా ఏమరుపాటులేకుండా విరసాన్ని భుజానేసుకొని ముందుకు నడిపించే నిరంతర పథికుడాయన. ఆయన మన ముందు వుంచిన బాధ్యతలు గురుతరమైనవి.

ఈయనే మా ప్రసాద్

హేమ-దాసు

హేమ, నేను మా అమ్మాయి సుమను కృష్ణక్కకు, రాధమ్మ గారికి చూపించాలని 1962లో కాజీపేట వచ్చాము. మేము రైల్వే వాళ్లము కావడముతో అప్పట్లో రైల్వే క్యాటరింగు డిపార్టుమెంటులో పని చేస్తున్న ప్రసాద్‌ను కృష్ణక్క పరిచయము చేసింది. నళిని పుట్టినప్పటి నుండి హేమ దాదాపు ఘంటసాల పాలెంలోనే ఉండడముతో, ఎవరీ ప్రసాద్ - ఇంత చనువుగా, చలాకీగా ఉన్నాడు అని హేమను అడిగితే మా బసవయ్య మామయ్య కొడుకు అని చెప్పింది. మా అత్తగారిని బసవయ్య గారు 'అక్కయ్యా' అంటూ అభిమానించేవారు. నాతో పరిచయము 1962లో అయినా మా కుటుంబముతో ఈ చలసాని వారి ప్రసాద్ పరిచయము ఎంతో కాలము నుండి ఉంది. నేనే క్రొత్తవాడిని. అప్పట్లో నన్ను కె.ఎస్.గారికి, అనసూయక్కగారికి పరిచయము చేసింది ప్రసాదే.

మేము బెంగాల్‌లో ఉండడము మూలంగా కలకత్తా వెళ్తూ పోతూ విశాఖపట్నములో దిగి మా వేణు మాస్టారుతో తగాదా పెట్టుకొని వాదులాడుకోవడము నాకొక అలవాటు. గురుశిష్యుల సంవాదమది. సిద్ధాంతాల మీద పోరు పెద్దగానే ఉండేది. ఆ పోరుబాటను మాకు నేర్పించింది కూడా మా వేణు మాస్టారే. నిజాన్ని నిజంగానే చూస్తారు ఆయన. మా మాటలు ముదిరినప్పుడు, మా మాస్టారుకు చిర్రు ఎక్కినప్పుడు మధ్యవర్తిగా కృష్ణక్క వచ్చి, సర్ది చెప్పి, భోజనానికి టైము అయ్యింది. అని హుకుం జారీ చేసేది. మా పెనుగులాట మీద ఎప్పుడూ ఆమె చెవులు ఉండేవి. నేను కూడా గురువుగారు నాకు రావలసిన సెషనల్ మార్కుల్ను ఎక్కడా తగ్గింప చేస్తారోనని శిష్యుడిగా వెనక్కి తగ్గేవాడిని. అసలు భయము ఏమిటంటే చెల్లెలు హేమతో నా గురించి ఏమి చెప్పి ఇంట్లో నాకు రావలసిన సెషనల్ మార్కులు తగ్గింప జేస్తారోనని. అయితే ఆ కథ ఎప్పుడూ సుఖాంతమే ఫలవంతమే.

ఈనాటి లెఫ్టిస్టు భావాలకు, నేను స్వయంకృషితో నేర్చుకున్న వామపక్ష భావజాలానికి చాలా అంతరముంది. నాది అనుభవము మీద నేర్చుకున్న పాఠము. ఆ సిద్ధాంతాలకు నా మనస్సులో ఎప్పుడో పునాది ఏర్పడింది. అది సమ సమాజ నిర్మాణము మీద నాకున్న ఆనాటి అవగాహన. ఎక్కువ, తక్కువలు ఎందుకు వచ్చాయి అనే ఆవేదన. నాకు 11 సంవత్సరములు ఉన్నప్పుడు మా ఊరు ఈడుపుగల్లులో మా పెద్దమ్మ గారింట్లో ఉంటూ 6వ తరగతి చదివాను. అప్పట్లో మా ఇంటి ప్రక్క ఏసుదాసు మాస్టారు ఉండేవారు. ఇప్పటి తరానికి తెలియదుగానీ అప్పుడు మేము 'కరువు వచ్చి బెంగాలు ప్రజలు కాలుతున్నారూ, అస్సాంలో అన్నము లేయున్నారు' లాంటి పాటల్ని నేర్చుకున్నాము. పాడుకున్నాము. రెండవ ప్రపంచ యుద్ధము ఉధృతంగా ఉన్న రోజులవి. ఆ రోజుల్లో తూర్పు నుండి టూజోగాడు, పశ్చిమ నుండి నాజీ హిట్లరూ చేయి చేయి కలిపి తరుముకొస్తుంటే వాళ్ల పక్క లిరగదన్నా వయా స్టాలినూ' అంటూ పాడేవాళ్లము. ప్రసాద్‌కు కూడా ఆ స్టాలిన్ అంటే వల్లమాలిన ప్రేమ. అభిమానము. అవి స్వాతంత్ర్య ఉద్యమపు జోరు అందుకుంటున్న రోజులు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఉప్పులూరు రైల్వే స్టేషను తగులపడి పోతుంటే చూసిన కళ్లు నావి. ఆ రోజులలోనే మువ్వన్నెల జెండాతో ఊరంతా ప్రభాత్ భేరీ తిరిగిన వాళ్లము. కార్యకర్తలు వచ్చి మానికొండ వద్ద జరిగే కోడి పందేలకు వెళ్లకూడదంటే వెళ్లని వాళ్లము మేము. మా నాన్నగారు టీచరు అవ్వడముతో, వాస్తవాలపైనే ఆయన దృష్టి ఎప్పుడూ ఉండడముతో వాస్తవాలంటే ఏమిటో కొంత కొంత నాకు అర్థము అయ్యాయి. బీద బిక్కీలు ఉండే జీవన విధానాలపై సరియైన అవగాహన లేని లేత వయస్సులోనే ఒక విధమైన తెలియరాని సర్వమానవ సౌభ్రాతృత్వము అనే సిద్ధాంతము మీద నా దృష్టి పడింది. మానవత్వము అంటే ఎలా ఉండాలి అనే భావన నా మనస్సులో నాటుకుపోయింది. ఆ తరువాత రోజుల్లో మనకు స్వతంత్రము రావడము, మరీ కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టుల అణచివేత, కాటూరు, ఎలమర్రు సంఘటనలు, ఒక్క చేతిలో సైకిల్ ఎత్తి పట్టుకుని కాలువ ఈది సుందరయ్యగారు పోలీసుల బారి నుండి తప్పించుకోవడము, నాయకత్వమంటే మార్గదర్శకులై చేతలలో చూపించిన నాయకుల మాటలు వినడము - వారిని చూడడము, నెహ్రూ పరిపాలనా పద్ధతుల మీద తెలుగు వారి కళ్లలో ఎగిరెగిరి పడుతున్న అగ్నిజ్వాలలను చూడడము పల్లె కమ్యూనిస్టు సానుభూతిపరులని ఆడవాళ్లమీద

పోలీసుల అరాచకము జరపడము, అక్కడక్కడా మన ఆడపడుచులే పోలీసుల కళ్లలో కారము చల్లి వారినే వెనుతిరిగ పోయేలా చేయడము - ఇలాంటి విషయాలను విన్న, చూచిన చిన్న వయస్సు నాది. అందులో బందరులో ఉంటూ చదువడము మూలంగా కొన్ని రాజకీయం విషయాలు అనుకోకుండానే నా బుర్రలో తిష్టవేసాయి. పోలీసులు లాఠీలతో కొడ్తున్నా జైహింద్ అంటూ ఎత్తిన మువ్వన్నెల జెండాను దించకుండా బందరులో నినదించిన తోట నరసయ్య గారిలాంటి జాతీయ వాదులను చూసాను. ఈలాంటి సంఘటనల మూలంగా కలగాపులగమైన అంశాలు నాకు తెలియకుండానే నా మనస్సులో స్థిరపడ్డాయి. అవి అన్నీ అనుభవము నేర్పిన పాఠాలే. ఆ ఆలోచనలు నాకు సంబంధించిన వ్యక్తిగత విషయాలైనా అవే ఆ తరువాత నాకు మార్గదర్శకమౌతూ రక్షాకవచంగా మారాయి. ఏ పరిస్థితిని అయినా ఎదిరించగలిగే నేర్పు, ఓర్పు అలవరచాయి. నాకొచ్చిన సమస్యలను నేనే పరిష్కరించుకోగల సామర్థ్యమునిచ్చాయి. ధైర్యమునిచ్చాయి.

ఏదైనా సాధించాలి అంటే ప్రజలు ముందుగా విద్యావంతులు కావాలి. విజ్ఞానవంతులు కావాలి. అన్యాయాన్ని వాళ్లే ఎదిరించ గలగాలి. వాళ్లు చదువుకుంటే పరిస్థితులకు అనుగుణంగా వారే ఏ సమస్యలపైనైనా తగిన నిర్ణయాలు తీసుకోగలరు. బలవంతంగా మనకు నచ్చిన ఆశయాలను వారికి నచ్చినా నచ్చకపోయినా వారి నెత్తిమీద రుద్దకూడదు. చిన్నప్పుడే అంబేద్కరు ఆశయాలను ఒంటబట్టిచ్చుకున్నవాడిని. సర్వమానవ సౌభ్రాతృత్వమే వాటి సారాంశము. సమానత్వమే వాటి అంతరార్థము. అందరూ చదువుకుని సమస్యలను అర్థము చేసుకుని, వాటిని పరిష్కరించే మార్గము నిర్ణయించుకొని సమిష్టిగా పోరాడి ఫలితము సాధించుటే వాటి అర్థము. గాంధీగారి ఆలోచనలు ఆదర్శాలు కూడా సమ సమాజ నిర్మాణానికేనని తెలుసు. కాని ఆచరణలో అవి ఫలితము నివ్వలేక పోయేసరికి నిరుత్సాహమొచ్చేది ఆ చిన్న వయస్సులోనే నాకు. దేశమంతా ఒకటే అన్నప్పుడు కులాల పేరుతో కొంతమందిని అణగద్రొక్కి వారి శ్రమతోనే బంగారు మేడలు కట్టుకున్న వారంటే ఒళ్లు మంట. ఈ సమస్యకు సమాధానము చూపించలేక పోయిన నాయకత్వము అధికారములో ఉన్నదే అని నా బాధ. ఎంతో ముందుకు పోయామని విర్రవీగుతున్న భారత సమాజంలో ఈ సమస్య ఇప్పటికీ మండుతున్న రావణకాష్టమే. ఈ పరిస్థితులలో కమ్యూనిజం ప్రాణం పోసుకుంది. తెలంగాణ సాయుధ పోరాట మూలంగా ఆంధ్ర ప్రాంతానికి కట్టుబట్టలతో వచ్చిన కాందిశీకులను చూసాను. వారి వీరగాథలు విన్నాను. మునగాల పరగణా వారికిచ్చిన ఆశ్రయము గురించి విన్నాను. ఆ రోజుల్లోనే ప్రజాశక్తి పత్రిక ప్రాణం పోసుకుంది. ప్రజల పత్రికా పఠనములో మార్పు కూడా తెచ్చిందది. విషయ పరిజ్ఞానము ఉంటే సమస్యలకు సమాధానము దొరుకుతుంది. దానిని పొందడానికి పనికి వచ్చే ఆ చదువునే అందరికీ అందుబాటులోకి రాకుండా అడ్డుపడే వారి మీద అలవికాని కసి నాకు. బానిసత్వము అంటే ఆ రోజులలో నాకు అవగాహన అంతగా లేదు గానీ పాలేర్లు ప్రొద్దున్న కోడి కూసిన వెంటనే లేచిపోయి, ప్రొద్దుపోయిన తరువాత ఇంటికి వచ్చేవారు. ఏమి తినేవారో తెలియదు. పెళ్లయిన కొత్త జంటకూ తప్పలేదు ఈ శిక్ష. ఏరువాక పూర్ణిమనాడు తప్ప సెలవు అనేది తెలియదు వారికి. ఒక రోజు ఒక ఆసామి బాణా కర్రతో ఒక పాలేరును గొడ్డును బాదినట్లు బాదుతుంటే చూసిన కళ్లు నావి. వాడు ఎదురు తిరిగితే ఆ ఆసామి పనిగల్లంతే. ఎదురు తిరగాలనే భావన రాకుండా సమాజము పెంచింది అతనిని. అందుచేత సమాజము మీద నాకు తీరని కసి. రాంజీ రావుగారు లాంటి ఉదాత్తుల మూలంగా మాలో కొంత మందికి చదువులబ్బాయి. మరి మిగిలిన వాళ్లో!

ఆ తరువాత నేను ఉద్యోగములో చేరడము. బెంగాలీ నవలలు చదివీ, చదివీ వాళ్లలో ఏదో గొప్పతనముందని ఆశిస్తూ బెంగాల్‌లో అడుగుపెడితే నా ఆశయాలకే తూట్లు పొడిచిన ఆ బెంగాలీల వింత ప్రవర్తన నాకు చాలా బాధ కలిగించింది. ఆ వింత వాతావరణములోనే నేను చాలా కాలము ఉద్యోగము చేయవలసి వచ్చింది. ఈ బెంగాలీలే అస్సాములో -అస్సామీయులను అణగద్రొక్కడము చూస్తే వారు ప్రబోధించే ఆశయాలకు ఆచరణకు ఎంత దూరమో తెలుస్తుంది. సంఘములో మార్పు రావాలని అందరి ఉవాచ. మార్పు తేవాలని అందరి ప్రయత్నము. అయితే ఆ మార్పును సాధించే మార్గాలను గురించి అవగాహన వేరువేరుగా ఉండేది. కాని కోరుకుంటున్న మార్పు ఇది అని చెప్పి ఆచరణలో పెట్టిన ధైర్యవంతులు లేరు. కోరికలు ఉంటే చాలదు. అవి సాధించే మార్గాలు, సాధనాలు చేతిలో ఉండాలి. సుందరయ్య గారి తెలంగాణ పోరాటాన్ని గురించి ఇప్పటి విప్లవవాదులకు ఎంత తెలుసో నాకు అవగాహన లేదుగాని కొన్ని ప్రాథమిక సూత్రాలైనా ఆ పుస్తకము చదివితే అవగాహనకు వస్తాయి. వారు ఆనాటి సామాజిక పరిస్థితులకు, ఆనాటి నాయకులు ప్రజా బాహుళ్యానికి కల్పించిన చైతన్యము ఆ పుస్తకము అద్దంలా చూపిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగములో ఉన్న నాకు ప్రజాహితార్థము టెలిఫోను వ్యవస్థలాంటి వాటిని నిర్మించడమెంత కష్టమో తెలుసు. అవి ఏ కారణము చేతనైనా కూల్చబడితే వాటిని మళ్లీ కట్టించడానికి ఇంకెంత కష్టపడాలో అది కూడా తెలుసు. అలాంటి వసతులనే ఏదో ఇజమ్ పేరుతో నాశనము చేస్తుంటే ఇదా వారు సంఘానికి చేస్తున్న మంచిపని అని నేను విస్తుపోతూ ఉంటాను. ప్రజల అవసరము కొరకు నెలకొల్పిన వ్యవస్థలనే కూలదోయడము మానవసేవ, సంఘసేవ అవుతుందా? అసలు సంఘానికి పట్టిన చెదపురుగులను ఏరి వేయకుండా నిర్జీవమైన ప్రజోపకరమైన ఆస్తుల మీద వీరి దాడి ఎందుకు? వారిని వారు రక్షించుకోవడానికి ఇదొక్కటే మార్గమా? వారి గురి సంఘ విద్రోహుల మీద పెట్టి, చేయవలసిన పని చేస్తే పీడ విరిగి పోతుందని ఎందుకు ఈ ఆదర్శవాదులు, కార్యశూరులు కంకణము కట్టుకోరు అని నా ప్రశ్న. చేతకాకనా? ఒక్కొక్క సారి విప్లవాన్ని ముందుకు తీసికెళ్తామని శపథము తీసుకున్న వీరికి సంఘాన్ని ముందుకు తీసుకెళ్లే ఆలోచన ఉందా? ఆ సామర్థ్యము ఉందా? అని నాకు అనుమానము వస్తూ ఉండేది. సంఘ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, విప్లవవాదులంతా మరొక్కసారి ఆలోచించుకుని వారి ఆచరణా కార్యక్రమములో మార్పు తెచ్చుకోవాలని నా వాదన. ఇక్కడ కలమా, కత్తా అని ఆలోచించి వివరణలకు పోనవసరము లేదు. బలవంతులదే రాజ్యమని basic philosophy. దోపిడీదారి తనాన్ని, స్వార్థపరత్వాన్ని ఏ సంస్కరణ అయినా ఇంతవరకు రూపుమాపిందా? ప్రజలు బలవంతులైతే రాజు తలఒగ్గుతాడు. ఏదైనా విషయాన్ని ప్రజల ముందు పెడితే అది ప్రాక్టికల్‌గా ఉండాలి. ప్రజలు వారికి వారే వారి సామర్థ్యముతో అనుకున్నది సాధించగలగాలి. అది మరచి తమకు తోచిన ఆలోచనలే మార్గమని ఆచరణ సాధ్యము గాని విషయాలతో ప్రజలను వెర్రి వాళ్లను చేసేవాళ్ళను చూస్తే నాకు చాలా కోపము. పేదవాని కోపము పెదవికి చేటు అనే సామెత నాకు తెలియనిది కాదు. అయినా... ప్రజలను నిద్రనుండి లేపాలి. వారిలో నిద్రాణమైన శక్తిని వెలికి తీయాలి. వారే తప్పును తప్పుగా నిరూపించగలగాలి. సరైన నాయకత్వము ఉండాలి. ఈ రకమైన వాదనలు నాకూ మా మాస్టారికి మధ్య జరుగుతూ ఉండేవి. ఇదంతా ఎందుకు

ఉటంకించుచున్నానంటే అనేక సార్లు ఈ వాదనలు జరిగేటప్పుడు కృష్ణక్కతో పాటు ప్రసాద్ కూడా ఉండేవాడు. మా వాదనలను వింటూ ఇంత జరుగుతున్నా ఒక్క మాట బయటకు అనేవాడు గాడు ప్రసాద్. అప్పటికే మూవ్‌మెంట్‌లో లెక్కించదగిన నాయకుడుగా ఎదిగినవాడు. అన్ని విషయాలూ చెవులు రిక్కించి మరీ వినేవాడు. ప్రసాద్‌లో ఉన్న గొప్ప గుణమిదే. 'వినదగునెవ్వరు చెప్పిన...' అనే సిద్ధాంతాన్ని అక్షరాలా అమలు చేస్తున్న కార్యదక్షుడు. ఎదుటి వారు ఎంత నొప్పించే మాటలన్నా ఆ పెదవుల మీది చిరునవ్వుతోనే వాటికి సమాధానమిచ్చేవారు. పెదవిదాటి ఒక్క మాటా వచ్చేది గాడు. ఆ మాటే బయటకు వస్తే ఆ మాట తూటా అవుతుందని నాకు తెలుసు. ఆ చిరునవ్వు వెనుక అర్థము అదే.

నా వాదనల చుట్టూ ఉన్న చెలియలి కట్ట గురించి కూడా నాకు తెలుసు. ఆయన భావాల అంతరార్థము కూడా నాకు అవగతమే. నా వాదనలలోని పసను ఆయన పసిగట్టి తన రాజకీయ పాఠాల్లో తన విద్యార్థులకు వివరించే వారని నాకు తెలుసు. అదే నాకూ ప్రసాద్‌కు ఉన్న ఎవరికీ తెలియని బాంధవ్యము. అనుబంధము. అదే నాకు తాను ఇచ్చిన గౌరవము. అంతేకాదు వాల్టేర్ సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా అమలు చేసిన వ్యక్తి. 'ఎదుటి వారి వాదనలను వినకూడదు' అనే మనస్తత్వము గాతడిది. భావ ప్రకటనా స్వేచ్ఛ అందరికీ ఉండాలని, ఆ స్వేచ్ఛను అణచేశక్తి ఎవరికీ లేదు అని ఆచరించి చూపించాడు. అందుకేనేమో నేను వాదిస్తుంటే వినేవాడు. ఎంతవరకు ఆచరణ సాధ్యమో అంతవరకు చేసి చూపించేవాడు. ఆ నేర్పరితనముతోనే ఆయన పదిమంది నోళ్లలో నాలుక అయ్యారు.

- ఆ తరువాత మేము విజయవాడ రావడము, 'చిలకా- గోరింక' సినిమా తీయించే హడావిడిలో ప్రసాద్ మద్రాసు నుండి వస్తూపోతూ మా ఇంటికి అప్పుడప్పుడు రావడము మామూలు అయ్యింది. ఆ సినిమాలో ఒక 'ప్రేమ జంట బొమ్మ' తిరుగుతూ సంగీతము ఆలపిస్తుంది. యగళ్ల రామకృష్ణ పద్మలకు ఇవ్వడానికిగాను మద్రాసులోని చైనా బజారు నుండి హేమ కొని తెచ్చిన బొమ్మ అది. దానిని హేమ ప్రసాద్‌కు చూపించడము. ప్రసాద్ ఆ బొమ్మ కావాలనడము, ఆ బొమ్మ ఆ సినిమాలో ఒక సన్నివేశానికి కీలక పాత్ర కావడము, దాని ఉనికిని ప్రత్యగాత్మగారు ఎంతో కళాత్మకంగా చిత్రించడము నాకు ఇంకా జ్ఞాపకము.

మా హేమ పుస్తకాల పురుగు. ఏ పుస్తకము దొరికినా చదువకుండా వదిలేదిగాదు. ఇంట్లో 'హరి-ప్రసాద్' అని సంతకము చేసి ఉన్న పుస్తకాలు దర్శనమిచ్చేవి. ఏమిటి వీటి రహస్యమేమంటే హేమ చెప్పింది. చిలకా గోరింక సినిమాతో కుస్తీ పడుతున్న హరి ప్రసాద్‌ల జంటపేరు అని. ఆ పుస్తకాలను చూసి, పుస్తకాలతో ప్రసాద్‌కు ఎంత పరిచయమో నాకు అర్థం అయ్యింది. నేను కలకత్తాలో ఉండగా కాలేజ్ స్ట్రీట్‌లో పేవ్‌మెంట్ మీద అమ్మబడుతున్న పాత పుస్తకాల నుండి దొరికిన క్లాసిక్ బుక్స్ కొని చదువుకున్న వాడిని. ఆ మాత్రము అవగాహన లేక పోతుందా నాకు! మా ఇంటికి వచ్చి 'అత్తయ్యా' అంటూ ప్రసాద్ మా అత్తగారిని పలుకరిస్తూ ఉంటే, వాళ్ల మూవ్‌మెంట్‌లో జరుగుతున్న అవక తవకల గురించి ఆమె ప్రసాద్‌కు పాఠాలు చెప్పేది. రాజకీయ చైతన్యములో తలపండిన పెనుమలూరు వాసి ఆవిడ.

ప్రసాద్‌కు ఆవకాయ పచ్చడి ఉంటే చాలు. ప్రత్యేకంగా మరే కూరలూ వండవలసిన అవసరముండేది కాదు. అతడితో కలిసి భోజనము చేస్తుంటే ముచ్చటగా ఉండేది. రైల్లో ప్రయాణిస్తూ రైలు స్టేషనులో బండి ఆగినంత సమయములోనే అన్నము తినాలని ప్రయాణీకులు క్యాంటీన్‌లో గబగబా తింటునట్లుగా ఉండేది ఆయన అన్నం తినే అలవాటు. అంత తొందరగా ముగిసేది ఆయన ఆ కార్యక్రమము. ఎన్నో పల్లె వాసాలలో ఆయా గృహస్తులకున్న దానినే మనసారా పంచుకు తిని, వాళ్లను' అన్నదాతా! సుఖీభవ! అంటూ ఆశీర్వదించే మంచి భోక్త ఆయన. అందుచేతనే ఆయన ఎక్కడకు వెళ్లినా స్నేహితులు ఉన్నదే పెట్టి ఆనందించేవారు. అదే సంతృప్తిగా తిని - చలంగారి మోతుబరీ రైతులాగా పడక్ కుర్చీలో కూర్చుని - అన్నీ తెలిసి కూడా 'ఏమిటి దాసూ - ఎవరో ఏదో అంటున్నారు' అనే మనస్తత్వమాయనిది. అమాయకపు ఆ ముఖము వెనుక విజ్ఞానాన్ని దాచుకున్న తత్త్వవేత్త 'నొప్పించక తానొవ్వక' అనే తత్వాన్ని జీర్ణించుకున్న మేధావి అతనిలో ఉన్నాడని చాలా మంది ఊహించి ఉండరు.

మేము విజయవాడలో ఉండగా ఒక ఉత్తరము వచ్చింది. చించి చూస్తే అది ప్రసాద్ నుండి, 'అది పెళ్లికార్డేమో'నని ఆతురతగా చూసా. ఆ పెళ్లికి వెళ్లాలని మా ఆలోచన. తీరా చూస్తే మేము అంటే 'నేను, విజయ' పెళ్లి చేసుకున్నాము అని. తరువాత కృష్ణక్క చెప్పింది ఆ సంగతి, సందర్భాలు - ఆ కథ. ఇక విజయ, నవత, మమతల గురించి కొంచెము చెప్పాలి. ఆ పేర్లలోనే ఉంది సరిక్రొత్త భావన. ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తూ కళకళలాడే ముఖము విజయది. ఆమె నవ్వులో ఆప్యాయత, హుందాతనము, అణకువ, ఎదుటివారంటే గౌరవమూ ప్రతిఫలిస్తూ ఉండేవి. తను లేకుంటే ప్రసాద్ అంతటివాడు కాకపోయేవాడు కాదేమో. పెళ్లి కాకముందు ప్రసాద్ తెగిన గాలిపటంలా ఉండేవాడు. ఆ తెగిన గాలిపటాన్ని పట్టుకుని దారము కట్టి, నిర్దేశిత మార్గాన్ని, గమ్యాన్ని చూపించింది విజయేనేమో. పట్టుదలలో విజయ, ప్రసాద్ కన్నా తక్కువది కాదు. ఎనిమిది దశకాల దాటిన తరువాత కూడా ప్రసాద్ అంత ఎనర్జటిక్‌గా ఉన్నాడంటే దానికి క్రెడిట్ అంతా విజయకే ఇవ్వాలేమో. 'మన విజయ' పుస్తకము చదివితే విజయ విశ్వ రూపము తెలుస్తుంది.

ఇక నవత కుందనపు బొమ్మ. బుగ్గ పట్టుకుంటే కంది పోతుందేమో అన్నంత సున్నితంగా ఉండేది. అందీ అందనట్లుగా మసలుకొనేది. మమత అంటారా ఎప్పుడు నవ్వే. అద్దములో చూస్తే వాళ్ల అమ్మ ప్రతిబింబమే. ఆ కిలకిల నవ్వులతో చిలిపిగా, చలాకీగా చిందులు వేస్తుండేది. వేణుగారి ముద్దుబిడ్డ. మమతకు నేను పెట్టుకున్న ముద్దుపేరు 'నవ్వుల రాణి' - ఆ ముసి ముసి నవ్వులతోనే లెక్చరర్‌గా ఇప్పుడు క్లాసెస్ మ్యానేజ్ చేస్తూ ఉంటుందని నా అభిప్రాయము. ఇక తెలివి అంటారా? నాన్నగారి పోలికలు ఎక్కడకు పోతాయి? రఘు ఆ విధంగా అదృష్టవంతుడే. తుషార అంతగా నవ్వదు గానీ పెరుగుతున్నకొద్దీ పెద్దరికాన్ని మరీ ఒంటబట్టించుకున్న పెద్దింటి ఆడవడుచులా ఉంటుంది. ప్రసాద్ తన కలలను పండించుకున్నాడు అంటే ఈ కుటుంబపు సపోర్టు ఎంతో ఉంది.

విజయవాడలో ప్రసాద్ మూలంగా ఒక మహద్భాగ్యము అబ్బింది నాకు. పనుల మీద బయటకు వెళ్లి వస్తూ ఉండే ఉద్యోగము నాది. ఒక రోజు ఉదయము నేను ఇంటికి వచ్చేసరికి మా ఇంటిలో 'శ్రీశ్రీ'గారు కనిపించారు. ఆ ప్రక్కనే చిరునవ్వుతో హేమ. ఆ నిండు విగ్రాహాన్ని చూసి నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. ఆ మహా మనీషి మా ఇంట్లోనా అంటూ నిలబడిపోయాను. విశాఖలో షష్టిపూర్తి ఉత్సవాల తర్వాత విరసం స్థాపించడానికి హైదరాబాదు వెళ్తూ ఆ మహాకవి మా ఇంట్లో ఒక రాత్రి విడిది చేసిన రోజు అది.

శ్రీశ్రీ గారి పేరు వచ్చింది గాబట్టి ఒక విషయము చెప్పాలి. నాకు తెలుగు అన్నా, తెలుగు పుస్తకాలన్నా తగని ప్రేమ. అభిమానము. ఆ నుడి కారములోని మాధుర్యము అనుభవైక వేద్యము. అందుకే రాయలవారు 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నారు. నేను చిన్నప్పుడు బందరులోని రాంజీరావుగారి హాస్టలులో ఉంటూ ఎన్నో పుస్తకాలు

చదివాను. చిన్నప్పుడే, అర్థము తెలియకపోయినా కావాలని పట్టు బట్టి మనుచరిత్ర, వసుచరిత్ర, రాఘవ పాండవీయము, భగవద్గీతలాంటి పుస్తకాలను చదివిన వాడిని. గద్యములో పింగళి సూరన కళా పూర్ణోదయము కూడా చదివిన వాణ్ణి. అందుచేత గ్రాంథికము అంటే ఎనలేని మక్కువ. కానీ మాకు ఇంటర్‌మీడియట్‌కు వచ్చే సరికి తెలుగులో టెక్స్ట్‌బుక్స్ లేకుండా Non Detailed పుస్తకాలతో సరిపెట్టారు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు తెలుగులో చదివిన చదువే మాకు తెలిసిన తెలుగు. అవి వ్యావహారిక భాషకు ప్రాచుర్యము పెరుగుచున్న రోజులు. నేను కాకినాడలో ఇంజనీరింగు చదివేటప్పుడు ఎవరి నుండో తీసుకుని శ్రీశ్రీ మహా ప్రస్థానము చదువుతూ అందులో ఆ మహాకవి వాడిన సంస్కృత పదాలను చూసి అలాంటి భాషను చదివి ఆనందించే భాగ్యము మాకు లేకుండా శ్రీశ్రీలాంటి వారే చేసారని నా తప్పుడు అభిప్రాయము అప్పుడు బలంగా ఉండేది. 'నిజంగానే...' అనే వారి గేయాన్ని అద్దంకి శ్రీరామమూర్తిగారి అబ్బాయి, నా క్లాస్‌మేట్ అయిన గోపాలకృష్ణ కాలేజ్ కాంపిటీషన్స్‌లో రాగయుక్తంగా పాడుతుంటే విని ఇంత బాగా శ్రీశ్రీ గారు గేయాలు వ్రాయగలరా అని పులకించి పోయినవాణ్ణి. ఆయన గేయాలకు రాగయుక్తంగా సంగీతము జోడిస్తే గాంధారమౌతుందని నాకు అర్థం అయ్యింది. ఆ 'మహాప్రస్థానము' పుస్తకము కొనుక్కోవడానికి కూడా నా వద్ద డబ్బులు ఉండేవి కావు. అందుకని ఒక దస్తా తెల్ల కాగితాలు కొనుక్కుని పుస్తకంలా కుట్టి మహా ప్రస్థానమంతటినీ చేతితో వ్రాసికొని దానిని అపూర్వ సంపత్తిగా దాచుకున్న ఏకలవ్యుడను నేను. ఆ తరువాత ప్రతులలో చలంగారు ఆ పుస్తకానికి వ్రాసిన పీఠిక ఉండేది కాదు. ప్రసాద్‌ను అడిగితే మన దగ్గర ఒరిజినల్ కాపీ ఉందని తెచ్చి ఇచ్చాడు. దాని ఫొటోకాపీ తీసుకుని భద్రపరుచుకున్న వాడిని నేను. అలాంటి వాడి ఇంటికి శ్రీశ్రీని తీసుకుని వచ్చి పరిచయము చేసిన ప్రసాద్‌కు మా కృతజ్ఞతలు చెప్పుకుంటాము. ఈ మాట చెప్తే మా కృష్ణక్క నవ్వుకుంటుంది. మనస్సులోని భావాల్ని బాహాటంగా వ్యక్తీకరింపజాలని పరిస్థితులతో ముడిపడిన ఉద్యోగ బాధ్యతలు మావి. హేమ కారణంగా అనేక మంది కవులతో కళాకారులతో, రచయితలతో పరిచయమేర్పడింది నాకు, ఆవిడ స్వతహాగా కళాద్రష్టకావడముతో. బయటపడేదిగాదంతే. అది నా అదృష్టమే. ప్రసాద్ కూడా నాకు ఎంతో మందిని పరిచయమం చేసాడు. అందరికీ అందరూ దగ్గరగా ఉండాలని ఆయన ప్రయత్నము. వసుధైక కుటుంబ స్థాపనే ఆయన లక్ష్యము.

ప్రసాద్ పోలిటిక్స్ లెక్చరర్‌గా ఉంటూ విప్లవోద్యమంలో ఎలా కొనసాగగలిగాడో నాలాంటి ప్రభుత్వ ఉద్యోగికి అర్థముగాని విషయము. ఎమర్జెన్సీ, పార్వతిపురం కేసులులాంటివి ఎప్పుడూ ఆయన చుట్టూ తిరిగేవి. ఎప్పుడు చూసినా ఆయన చుట్టూ గూఢచారుల నిఘా. ఆయనను పట్టుకోలేకగాదు. ఆయనను చూడడానికి 'వారు వెదుకుచున్నవారు' ఆయన దగ్గరకు వస్తే వాళ్లతో పాటు ఈయనను కూడా నిర్బంధించాలని, ప్రసాద్‌ను తమ గేలానికి ఎరగా వేయాలని ప్రభుత్వాల ప్రయత్నాలు. ఇన్ని ఒడిదుడుకుల మధ్య తొణకకుండా బెణకకుండా ఎప్పుడూ నవ్వుతూ 'దాసూ' అంటూ పలకరించే ఆ ముఖము చూసి ఉబ్బిపోయేవాడిని. ఆ పిలిచే పలుకులోని ఆప్యాయత, గొంతులోని ఆ మాధుర్యము - అనుబంధము అనుభవించాలి అంతే. వాటిని వివరించడానికి భాష చాలదు. ఆయన నాకన్నా ఒక సంవత్సరము పెద్ద. అయినా మా పిల్లలు ఇద్దరూ ఆయనను ప్రసాద్ బాబాయ్ అని పిలిచేవారు. ఎందుకంటే నళిని, పద్మిని కూడా అదే వరుసతో ప్రసాద్‌ను పిలుస్తారు గాబట్టి. మా చిన్నమ్మాయికి ఆయన పెట్టుకున్న ముద్దుపేరు 'బండబుచ్చి'. వాళ్ల అనుబంధాలు వాటికవే చెప్పుకోవడానికి.

తను మూవ్‌మెంట్‌లో అందరికీ ఆరాధ్యుడయ్యాడు. ఎవరైనా ఏదైనా సహాయము అడిగితే నా వల్ల కాదు అని చెప్పడము ఆయనకు తెలియదు. ఎంత పెద్ద సమస్య అయినా ఆయన వంతు ప్రయత్నము ఆయన చేసేవారు. అందరిలోనూ నిరుత్సాహపడవద్దని ఉత్సాహము నింపేవారు. ఆ రోజు సభలో వంగపండులాంటి వారితో సహా చాలా మంది ప్రసాద్ వారికి చేసిన సహాయాన్ని, ఇచ్చిన ప్రోద్బలము, ప్రోత్సాహాలను మరువకుండా మననము చేసుకున్నారు. ఒకటి రెండు సార్లు నేను ఎవరి కొరకో సాయము కోరితే ఆ సమస్య యొక్క మూలాలలను తెలుసుకుని ఆ సమస్యలను ఒక కొలికికి తెచ్చారు. మూవ్‌మెంట్‌లో ఉన్నవారికి కూడా ఆయన సామర్థ్యము మీద అంత నమ్మకము. బయట అందరితో తిరుగుతూ ఉండేవారు గాబట్టి ఆ పరిచయాలతో కొన్ని కొరకరాని సమస్యలకు కూడా విరుగుడు కనిపెట్టేవారు. ఎట్టి పరిస్థితులలోనైనా మనస్సు వికలము కాకుండా దాన్ని స్వాధీనములో ఉంచుకోగల స్థితప్రజ్ఞుడీ ప్రసాద్. నాయకుడి ముఖ్య లక్షణము తనను తాను రక్షించుకోవడము గాదు. తన అనుయాయులను కూడా రక్షించగలగాలి. ఆ న్యాయకత్వ లక్షణాలు ప్రసాద్‌లో పుష్కలంగా ఉన్నాయి.

క్రొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రసాద్‌కు చాలా ఎక్కువ. ఎందుకు అవసరమొచ్చిందో వాల్తేరు - కలకత్తాల మధ్య మొదటిసారి రైలు ఎప్పుడు నడిచింది అని అడిగాడు. బహుశా విశాఖలో రైల్వేజోన్ కొరకు అక్కడివారు ఉద్యమిస్తున్న రోజులవి. ఖరగ్‌పూర్ - హౌరాల మధ్య రూప్‌నారాయణ్‌పూర్ బ్రిడ్జి వచ్చేవరకు డైరెక్ట్ లైన్ లేదు అని వివరాలు చెప్తే ఎంత సంతోషించాడో మానవుడు. నాకు మరో task కూడా అప్పజెప్పారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో ఏ రైల్వే లైను ఎప్పుడొచ్చిందో చెప్పమని. అలాగే రైల్వేల విషయములో తనకు పూర్తి సమాచారము కావాలని ఎప్పుడూ నన్ను అడుగుతూ ఉండేవాడు. సాంఘిక సమస్యల మీద కూడా తనకు తీరని సందేహాలు ఎన్నో ఉండేవి. అందులో వర్గీకరణ సమస్య ఒకటి. ఉన్నత పదవులలో ఉంటూ ఈలాంటి సమస్యల మీద అవగాహన ఉన్న వారి కొరకు వెదుకుచూ అసలు సమస్యకు మూలకారణమేమిటా అని తను తలను బ్రద్దలు కొట్టుకుంటున్న రోజులలో ఆయన కన్ను నా మీద పడింది. ఆ సమస్య వెనుకనున్న వాస్తవాలను గురించి, 1944 నుండి నాకు తెలిసిన వివరాలను, అనుభవాలను గురించి చెప్తే ఆయన తల తిరిగిపోయింది. ప్రభుత్వము తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అది 'వద్దు' అని అడ్డుకున్న ప్రజా నాయకులు ఇంత స్వార్థపరులా? మసి పూసి మారేడుకాయను చేసే నాయకమ్మన్యులు కూడా ఎందుకీ సమస్యను తెగనీయడము లేదు? రాజకీయ నాయకులు సరే, మూవ్‌మెంట్‌లో వారు కూడా నిజానిజాలను తెలుసుకోకుండా అన్ని చోట్లా న్యాయమే కావాలనే వీరు ఎందుకు గ్రుడ్డిగా ఈ అన్యాయాన్ని సమర్థిస్తున్నారు అని విస్తు పోయారాయన. ఈ దళిత జాతుల్లోనే ఇంత అంతర్గత వైరాలా అంటూ ముక్కు మీద వ్రేలు వేసుకున్నారాయన. వాస్తవాలను వెలికి తీయాలనే వారి తపన మనలాంటి వారికి అవగతము కాదు. ఆయనకాయనే సాటి. ఏ సమస్యనైనా థియరిటికల్‌గా, ప్రాక్టికల్‌గా ఆలోచించి సమస్యకు సమాధానము సంపాదించాలని ఆయన నిరంతర ప్రయత్నము.

దివిసీమలో ఒక నానుడి ఉంది 'కోడిగ్రుడ్డు అంత బంగారము లేనివాడు దివిసీమలో ఉన్నవాడు ఎవరురా?' అని. ఆ వర్గపు ఆలోచనలు అంత ఎత్తులో ఉండి శాసిస్తూ ఉండేవి. కృష్ణాజిల్లా చల్లపల్లి జమిందారీలో

బసవయ్యగారు పనిచేసేవారు. ఆనాటి సాంఘిక సమస్యల గురించి, అసమానత్వము గురించి, కులాల గురించి, ప్రజల జీవన విధానాల గురించి ఎన్నో వాస్తవాలను ప్రసాద్ తన కళ్లతో చూసాడు. 'దాసూ! ప్రభుత్వాల శాసనాల ద్వారా ప్రజల జీవన విధానాలలో ఎన్నో మార్పులు వచ్చి ఉండాలి గదా' అని అంటే నేను అనుభవించిన బాధల గురించి నేను వివరించే సరికి ఆయన అవాక్కయ్యారు. కులము పేరు పైకి చెప్పకుండా అన్యాపదేశంగా ఉన్నత పదవులలో నున్నతోటివారిని కూడా అగ్రకులాల వారు ఎలా అణగద్రొక్కుతారో, సూటిపోటి మాటలతో ఎలా కుళ్లబొడుస్తారో ఉదాహరణలతో చెప్పి స్వయంగా అనుభవించిన వారికే ఆ బాధ తెలుస్తుంది గాని, బయట నుండి లెక్చర్స్ దంచే మీలాంటి బడాబాబులకు మా బాధలు ఎలా తెలుస్తాయి అంటూ జాషువాగారి'... బాకున క్రుమ్మినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్' అనే సామ్యాన్ని నేను తీసుకు వస్తే ఉలిక్కిపడ్డారు. అదీ సంగతి అంటూ కొన్ని నిజాలు చెప్పి మీ మూవ్‌మెంట్‌లో కూడా అదే వరుస గదా ప్రసాద్ అంటే అదిరిపోవడము ఆయన వంతు అయ్యింది. మాకు అంటే ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని విషయాలూ తెలుసు. అవగాహన ఉంది. కానీ మేము విసపు మేతరులము గాబట్టి ఎన్నో విషయాలను మేము బయటకు క్రక్కలేకపోతున్నామంతే - అది సాకుగా ప్రభుత్వ ఉద్యోగులు అసమర్థులు అంటే ఒప్పేది కాదు. కొన్ని రాజకీయ నిర్ణయాలు సమర్థులను కూడా అసమర్థులుగా చూపిస్తాయంతే.

ప్రసాద్ పుస్తకాల పిచ్చి గురించి కొంచెము చెప్పాలి. వేణు మాస్టారూ, కృష్ణక్క బావట్లలో ఉండగా దేశములోనే అతి ప్రాచీనమైన గ్రంథాలయాలలో ఒకటైన వేటపాలెం గ్రంథాలయానికి వెళ్లాము. అక్కడ చాలా పురాతనమైన మ్యాగజైన్స్ పుస్తకాలు కనబడ్డాయి. హెచ్‌బి కాలనీలో ప్రసాద్ ఉండే ఇంటిలో చాలా పుస్తకాలు ఉన్నాయని తెలుసు. ఎప్పుడో విజయ ఉండగా చూసిన ఇల్లు ఇది. అక్కడ ఉన్న పుస్తకాల విలువ తెలియనివాడను. వేటపాలెం గ్రంథాలయము చూసిన తరువాత ఎందుకో ప్రసాద్ వద్ద ఉన్న పుస్తకాలను కూడా చూడాలనే కోరిక కలిగింది. పట్టుబట్టి హెచ్‌బి కాలనీకి వెళ్లి ప్రసాద్ ఇల్లు చూసాను. ఆ మంచము పట్టే చోటు తప్ప మిగిలిన స్థలమంతా పుస్తకాల దొంతరలే. ఇక మొదటి అంతస్తుకు వెళ్లి చూతును గదా అది పీకల వరకు పుస్తకాలతో నిండి ఉంది. ఎవరో ఇద్దరు ముగ్గురు ఆ మసక చీకట్లో ఏదో పని చేస్తూ కనిపించారు. అందులో బాలకృష్ణ కూడా ఉన్నారు. ప్రసాద్ పుస్తకాల సంపద ముందు వేటపాలెం గ్రంథాలయము దిగుదుడుపే. ఈ ప్రసాద్ భాండాగారములో దొరకని పుస్తకమంటూ లేదు. ఒకరి ముఖాలనొకరము చూసుకుని ఏం చేస్తున్నావయ్యా ప్రసాద్ అంటే స్నేహితుల సాయంతో వీటిని క్యాటగిరీస్‌లో కాటాలాగ్ తయారు చేయిస్తున్నాను అన్నారు.

భారతిలాంటి సాహిత్యపు సంచికలతో సహా తెలుగులో వెలువడిన సాహిత్య పత్రికలు అన్నీ ఉన్నాయి. ప్రముఖులు వివిధ భాషలలో వ్రాసిన వివిధ గ్రంథాలు, వాటి అనువాదాలూ అనేక విశేష ప్రతులు కనిపించాయి. ప్రాచీన సాహిత్యము, ఆధునిక సాహిత్యము రాజకీయ సాహిత్యము ఒకటేమిటి అలాంటివన్నీ ఆ నిధులలో నిక్షేపింపబడ్డాయి. ఎందుకనో ఇంగ్లీషులో వస్తున్న ఈనాటి ఫిక్షన్ నావెల్స్‌ను మటుకు వాటి జతను ఉంచను అన్నాడు. ఆ మాటతోనే అర్థము అయ్యింది ఆయన తన గ్రంథాలయాన్ని ఎంత ప్రత్యేకంగా పవిత్రంగా చూసుకుంటున్నాడో. వీటన్నిటి గతి ఏమిటి అంటే 'చూస్తున్నాను' అని ఆయన ముక్తసరి జవాబు. ఆయన అడగకుండానే ఒక చిన్న సలహా పారేశాను. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నార్లవారి పుస్తకాలన్నిటినీ ఒక రిఫరెన్స్ లైబ్రరీగా పెట్టి, రీసర్చ్ కొరకే వాటిని ఉపయోగించాలా, బయటకు పుస్తకాలు పోకుండా చూస్తున్నారు. ఆ పద్ధతిలోనే ఇక్కడే ఉన్న ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖకు వీటిని అప్పగించవచ్చు గదా అంటే ఆయన పోతన పద్యాన్ని ఒకదాన్ని జ్ఞాపకము చేసుకున్నారు. ఆ పద్యము తెలుసుగా 'కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ ఏలనేడ్చెదో కైటభదైత్యమర్దనునిగాదిలి కోడల ఓ మదంబ...' అంటూ. అర్థమయ్యింది. తను పెంచి పోషిస్తున్న ఈ బిడ్డ భవిష్యత్తు ఏమిటా అని ఆ బుర్ర పడుతున్న ఆవేదన. ఏదైనా మామూలు గ్రంథాలయాలలో వాటిని ఇస్తే రోజుకొక విలువైన పుస్తకము తీసుకెళ్లి తిరిగి ఇవ్వని వారెందరో. తీరా గదమాయిస్తే వాటి ధర ఎంతో నా డిపాజిట్‌లో నుంచి మినహాయించుకోండి అని డబాయించే చదువుల రాయుళ్లు ఎందరో. అలాంటి పుస్తకాలన్నీ ఇప్పుడు ముద్రణలో లేవు. మళ్లీ ముద్రణలకు అవకాశాలూ లేవు. ఎంత వెదికినా అలాంటి పుస్తకాలు దొరికే పరిస్థితీ లేదు. రెండు మూడు నెలల క్రితము కూడా ప్రత్యేకంగా ప్రసాద్ ఇంటికి వెళ్లి ఈ విషయమే ముచ్చటించాము. స్కూటర్ ప్రమాదము తరువాత మనిషి చాలా క్రుంగి పోయాడు. బయటకు వెళ్లడము కూడా తగ్గించాడు. ఆ పరిస్థితులలో కూడా ఎన్నో పనులు నెత్తిమీద వేసుకుని సతమతమౌతున్నాడు. అవి తనకు సంబంధించిన పనులు కావు. పరోహితార్థమే ఏ పని తీసుకున్నా. విజయలేని ఒంటరితనము తనను లోలోన బాధిస్తున్న ఛాయలు బాగానే కనిపిస్తున్నాయి. అయినా ఆ పిచ్చి మా రాజు ఇల్లు తలుపులకు తాళాలు లేని ఇల్లే. ఎందరో వస్తున్నారు. పోతున్నారు. ఆ ఇంటిలో అతిథి మర్యాదలు పూర్వము ఎలా ఉండేవో అలానే జరుగుతున్నాయి. తన పుస్తకాల రక్షణ బాధ్యత మాత్రమే తన బుర్రను తొలుస్తూనే ఉంది.

ఇక ఈ పుస్తకాల రాయుడు పుస్తకాలను సంపాదించే విధానము గురించి కూడా కొంత చెప్పాలి. మా బావగారు కొండలరావుగారు కూడా రకరకాలైన మ్యాగజైనులు, పుస్తకాలు కొని వాటిని భద్రంగా దాచి పెట్టి ఉంచుకునేవారు. ఆయన ఇల్లు అంతా కూడా పుస్తకాల మయమే. ఆయన పోయిన తరువాత ప్రసాద్‌తో చెప్పాను మీకు అవసరమైన పుస్తకాలు తీసుకెళ్లమని. వెళ్లాడు. చూసాడు. Came, Seen, and conquered అనే సామ్యము గుర్తుందా? ఆ ముఖము చూడాలి. పూర్తిగావిచ్చిన కమలములా కిలా కిలా నవ్వుతూ కనిపించింది. అందులో అనేకమైన పుస్తకాలు, గెజిటీర్లతో పాటు ఎంతో ప్రాచుర్యము పొందిన Shankers weekly, ఖాసా సుబ్బారావుగారి స్వతంత్ర, యువ, పాత చందమామలు, విమర్శనా గ్రంథాలు. తాపీ వారి రచనలు, నార్లవారి రచనలు, గోపీచంద్ రచనలు, కవిరాజు గారి పుస్తకాలు ఒకటా రెండా అదీ ఒక సముద్రములా ఉంది. అన్నీ తనకు ఇష్టమైనదే వేటిని తీసుకెళ్లాలో అర్థము గాలా ఆయనకు మొదట్లో. ఆ తరువాత తానొక్కడే వచ్చి ఒక రోజు తనకు ఓపిక ఉన్నంత వరకు 5, 6 పెట్టెలలో సర్దారు. నేను కూడా వెంట వెళ్లి వాటిని హబ్సిగుడలో ఉన్న నవభారత్ ట్రాన్స్‌పోర్ట్‌లో అప్పజెప్పాము. అప్పుడొక మాట చెప్పాడు ఆయన. 'దాసూ - నీవు ఏమీ పేమెంట్ చేయనవసరము లేదు. ఆ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు వచ్చి నా పేరు చెప్పి, టూ పే అని లేబుల్ అంటించి ఆ పుస్తకాల పెట్టెలు వాళ్లకిస్తే అవి నాకు భద్రంగా చేరుతాయి' అని. అప్పుడు అర్థమయ్యింది ఈయన ఎలాంటి పబ్లిక్ రిలేషన్స్ పెంచుకునే మనిషో అని. అందరితో పరిచయమే. అందరికీ ఏదో ఒక రూపములో ఎప్పుడో ఒకప్పుడు సహాయము చేసి ఉంటాడు తన జీవన యానములో.

ఇంకా ఎన్నో పుస్తకాలు ఉండిపోయాయి. ఆ పుస్తకాలన్నీ తన భాండాగారము చేరే వరకూ తనకు నిద్ర పట్టినట్లు లేదు. అందుకని తన

శిష్యుడు రామ్‌కీకి ఆ బాధ్యతను అప్పజెప్పాడు. ఎన్నో అట్టపెట్టలు తెచ్చాను. ప్రసాద్ టేస్ట్‌కు అనుగుణంగా తనకు ఏ పుస్తకాలు నచ్చుతాయో అవి ఏరి పెట్టెలలో పెట్టాము. తను వచ్చాడు చూసాడు. ఇంకా ఎన్నో గుట్టలు ఉన్నాయి. అతనికి పుస్తకాల మీదనున్న మక్కువ గురించి చెప్పాలంటే చిన్నప్పుడు నేను చదువుకున్న కథనొక దానిని ఇక్కడ చెప్పాలి.

'ఒక బీద బ్రాహ్మణుడుండేవాడు. చాలా గొప్ప పండితుడు. రోజు గడిచేది గాదు. ఆ పండితుని పేరు ప్రఖ్యాతులను విని ఆ ప్రాంతపు రాజాగారు అతనిని పిలిపించి అతని పాండిత్యానికి అబ్బురపడి ఎంతో సంతోషంగా ఆ బ్రాహ్మణుని ఊహకు అందనన్ని బంగారు నాణేల సంచులను ఎడ్ల బండిలో ఎక్కించి, ఆ పండితుని సన్మానించి పంపాడు. ఆ బ్రాహ్మణుడు ఊరి నుండి బయటకు వెళ్తుండగా మేడ మీద నుండి రాజాగారు చూసారు. ఆ బ్రాహ్మణుడు ఆ బండి వెనుక అటూ, ఇటూ, క్రిందకు చూస్తూ వెళ్తున్నాడు. అతని ముఖములో ఏదో ఆతురత రాజాగారికి ఆశ్చర్యమేసింది. ఇంత ధనము అతనికి ఇచ్చాను గదా. అతడు కూడా హాయిగా బండిలో ఎక్కి ప్రయాణము చేయవచ్చుగదా? అనుకుంటూ. ఈ బాపడు ఆ బండి వెనుక అలా ఏదో పోయినట్లు చూసుకుంటూ ఎందుకు వెళ్తున్నాడో అర్థము గాలేదు. వెంటనే భటులను పంపించి ఆయనను వెనుకకు రప్పించాడు. ఆ బ్రాహ్మణునికి భయము. రాజాగారు తనకిచ్చిన ధనాన్ని తిరిగి తీసుకుంటారేమోనని. అయితే రాజుగారు ఒక ప్రశ్న అడిగారు తను చూచిన అతని ప్రవర్తనను గురించి.

దానికి ఆ పండితుని జవాబు ఇది.

'రాజా! నా జీవితమంతా దరిద్ర దేవత నన్ను వెన్నాడుతూ వేధిస్తూనే ఉంది. నాకు మీరు బహూకరించిన నాణేల సంచుల నుండి, ఆ నాణేలను రాల్చుదామని ప్రయత్నిస్తూ ఆ జ్యేష్ఠదేవి నన్నింకా వెంటాడుతూ ఉన్నదేమో చూచి దాన్ని పట్టుకోవాలని నలుదిక్కులు చూసుకుంటూ వెళ్తున్నాను' అని చెప్పాడు. ఆ పండితుని సమయస్ఫూర్తికి ఆ రాజు మరింత సంతోషించి మళ్లీ కొన్ని ధనరాసులను అతనికి బహుమతిగా ఇచ్చి సత్కరించి పంపాడు.'

ఆ పేద పండితుడిలాగా ఇంకా ఆ పుస్తకము తీసుకోలేదే ఇది తీసికోలేదే అని రామ్‌కీని గదమాయించి తనకు ఏమి కావాలో అట్టపెట్టెలలో సర్దుతూపోయాడు. అప్పుడొక కన్యాశుల్కము ప్రతి ఆయన చేతికి దొరికింది. ఆ పుస్తకము నెత్తిమీద పెట్టుకుని తన్మయుడయ్యాడు. చిన్నపిల్లాడికి మిఠాయి పొట్లాము అనుకోకుండా చేతిలో పడితే ఎలా సంతోషించి గంతులేస్తాడో అలాంటి సంబరము ఆయన కళ్లలో కూడా కనిపించింది. అవి కన్యాశుల్కము నాటకాన్ని విశాఖపట్నంలో ప్రసాద్ సారథ్యములో 9 గంటలు ప్రదర్శించిన తరువాత రోజులు. గురజాడ వారంటే ప్రసాద్‌కు ఎంత అభిమానమో ఈ సంఘటనే చెప్తుంది. ఆ కన్యాశుల్కము పుస్తకము మీద రామ్‌కీ కన్ను పడింది. మీ దగ్గర విశాఖపట్నములో ఆ పుస్తకము ఉంది కదా. ఈ పుస్తకాన్ని నాకెందుకు ఇవ్వరని రామ్‌కీ మారాము. వాళ్ళ తగువులాట ఎంతకీ తెగపోయేసరికి లోపలి నుండి మరొక్క ప్రతిని తెచ్చి రామ్‌కీకి ఇచ్చి ఆ తగవు తీర్చాను. మా కొండల రావుగారు కూడా ఏదైనా పుస్తకము నచ్చితే 'cheaper by dozen' అంటూ ఎక్కువ కాపీలు కొని ఉంచేవారు. 2, 3 రోజులు శ్రమపడి ఎన్నో పెద్ద పెద్ద పెట్టెలలో తనకు నచ్చిన పుస్తకాలన్నీ సర్దుకున్నారు. ప్యాకింగ్‌కు వచ్చేసరికి మా వల్ల కాలేదు. రామ్‌కీకు తెలిసిన ప్రెస్‌లోని మనుషులు వచ్చి ప్రొఫెషనల్ ప్యాకింగ్ చేయవలసి వచ్చింది. ఆ రోజు ఒక లారీలో ఆ పుస్తకాల పెట్టెలను ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు పంపి విశాఖలో ప్రసాద్ భాండాగారానికి భద్రంగా చేర్పింపగలిగాము. ఈ విధంగా ఎక్కడ క్రొత్త పుస్తకాలు దొరికితే వాటిని సంపాదించి తన భాండాగారానికి చేర్చుకునే అలవాటు ప్రసాద్‌కు. అందుకే అన్ని రకాల పుస్తకాలు తన భాండాగారములో దర్శనమిస్తాయి. ఎన్ని పుస్తకాలు సేకరించినా ఆయనకు తృప్తిలేదు. ఇంకా ఇంకా సంపాదించాలని కోరిక ఆయనలో చాలా బలమైనది. తన వద్దనున్న రికార్డెడ్ మ్యూసిక్ క్యాసెట్స్ చూస్తే ఈనాటి ప్రజా నాట్యమండలి కళాకారుల గాత్రాల నుండి పాతకాలపు నాజరులాంటి వారి గొంతులు కూడా అందులో ఉన్నాయి. అందులో శ్రీశ్రీ గారు అమెరికాలో పాడి వినిపించిన మహా ప్రస్థానపు పాటలు కూడా ఉన్నాయి. ప్రసాద్ దృష్టిలో వాటి విలువ ఎంతో మనము కూడా ఊహించలేము. ఇది కూడా తన శ్రమతో కూడబెట్టుకున్న సంపద. కార్యదీక్ష అనే ప్రవృత్తికే సానబట్టి మెరుగులు దిద్దిన మేటి కళాకారుడీ ప్రసాద్. ఏదైనా పద్యమును నేను గుర్తు చేస్తే అందుకుని దాన్ని పూర్తి చేసే జ్ఞాపకాల ఖజానా అతని బుర్ర. ఈ ధారణా ప్రక్రియ తన సహజ గుణము ఎలా అయ్యిందో అర్థము గాదు. ఏదైనా విషయము మీద అడిగితే తెలియదు అని తన నోట వచ్చేది గాదు. లేదు అనే మాట రాయని భాస్కరుని నోట రానట్లు తెలియదు అనే మాట ప్రసాద్ నిఘంటువులోనే లేదు.

ప్రసాద్ మీద కోపము కొంచెమేమిటి, ఎక్కువగానే ఉండేది నాకు. కృష్ణక్క విరసానికి సారథ్యము వహించిన రోజులవి. కృష్ణక్క ఆరోగ్యము అంతంత మాత్రంగా ఉండేది. అప్పుడప్పుడు ప్రసాద్, కృష్ణక్క లాల్ సలామ్ చేస్తూ పత్రికలకెక్కేవారు. ప్రసాద్ కృష్ణక్కను బలవంతంగా ఆ సమావేశాలకు తీసుకెళ్తున్నాడని నా గుర్రు. అయితే ఇద్దరూ ఇద్దరే. ఎవరికీ ఎవరూ తీసిపోరు. ఏవైనా సమావేశాలన్నా, సహాయము చేయాలన్నా 'సిరికిం జెప్పడు...' అంటూ సంచులు భుజాన వేసుకుని పరుగెత్తేవారే. కృష్ణక్కను నేను ఆ విషయములో గదమాయించిన రోజులు కూడా ఉన్నాయి. హేమ నా వెనుక ఉండి ఈలాంటి సమయాలలో నన్ను ముందుకు తోసేది. అసలు ఆ విషయములో హేమ కన్నెర్ర చేస్తే అందరూ హడలిపోవాల్సిందే. అవి తూటాల దెబ్బ కాదు. ఫిరంగి గుళ్లదాడి. ప్రసాద్ పోయిన రోజున కృష్ణక్క ఒంటరి అయ్యింది. వేణు మమ్మల్ని వదిలి వెళ్లిన బాధ వెంటాడుతూనే ఉంది. ఆమె ఆ రోజు అంతరంగంగా పడ్డ వేదన మాలాంటి వారికి అనుభవము కాని, ఇతరులకు ఆ వేదన అర్థం కాదు. కొ.కు. రచనల ప్రచురణలో ఇద్దరూ క్రింద కూర్చుని పాడి పాడి మాటలతో ముచ్చటించుకుంటూ ప్రూఫ్‌లు దిద్దిన రోజులు నాకు గుర్తు. వాటి ప్రచురణలో కాలాతీతమయ్యిందని వారు పడ్డ బాధకు నేను సాక్షిని. కొంత మంది రచయితల గురించి, వారి రచనల గురించి కృష్ణక్క, ప్రసాద్‌లు మాట్లాడుకుంటుంటే 'అమ్మో! వీళ్లు ఇంత ఘటికులా' అంటూ నేను నోరు వెళ్లబెట్టిన రోజులు చాలానే ఉన్నాయి. వాళ్లిద్దరి అనుబంధమది. ప్రావీణ్యమది. గొప్పతనమది. ఇంకా చెప్పాలంటే దాని వెనకనున్న వారి స్నేహబంధమది.

ఈ మధ్య ప్రసాద్ గురించి ఆంధ్రజ్యోతిలో రెండు ఆర్టికల్స్ వచ్చాయి. మొదటిది శ్రీశ్రీతో ప్రసాద్ పరిచయము, శ్రీశ్రీ రచనల గురించి. అది చూసిన తరువాత ప్రసాద్ మీద కోపము వచ్చింది. శ్రీశ్రీ గురించి వ్రాయాలంటే వ్రాసే ఆ కలములో ఊగ్రరూతలూగించే శక్తి ఉండాలి. ఆ రచన చప్పగా ఉంటే రుచించదు. లోపలి ఉడుకు రక్తాన్ని పెల్లుబుక చేయించలేని ఆ రచనలకు బదులు ఒక ఆర్టికల్ నీవే వ్రాసి ప్రచురించడానికి ఆయనకు ఇచ్చే పనిగదా అని - నేనంటే నా మాటలకు జవాబుగా ఫోనులో నాకు వినబడిన ఆయన చిరునవ్వే దానికి జవాబు. రచనా వ్యాసంగములో ప్రసాద్‌కు అంత పట్టు ఉంది. నేర్పు ఉంది. ఒకసారి తన వ్యాసాల సంకలనమున్న పుస్తకాన్ని కృష్ణక్క నుండి తీసుకున్నా.

సాధారణముగా అందరిలాగా రైలు ప్రయాణములో నేను అంతగా చదవను. కానీ ఆ ప్రయాణములో ఏకబిగిగా ఒకేసారి సగానికి పైగా పుస్తకాన్ని చదివింపగలిగిన సత్తా ఉంది ఆ ప్రసాద్ రచనలలో. అలా పట్టుబట్టి ఒకేసారి నేను చదివిన పుస్తకాలు బహుతక్కువ. రెండవ ఆర్టికల్ ప్రసాద్‌కు ప్రియమైన ఆవకాయ మీద. ఆ పేపరులో తగినట్లుగా ప్రసాద్ నవ్వు ముఖాన్నే ముద్రించారు చాలా ఆప్ట్‌గా. ఆ తెలుగు వారి పచ్చడి రుచి, దానిలో ఉన్న కారము, ఉప్పులలోని సారాన్నంతా ఒంటబట్టించుకుని ఆ గుణాలనే తన నాయకత్వ లక్షణాలుగా ప్రసాద్‌లో పెంపొందించుకున్నారు. ఏది తను నమ్మాడో, ఏది చెప్పాడో అవే జీవితములో ఆచరించి చూపించిన నాయకుడీతడు. నాయకుడు అనే దానికి ఆయన రోల్ మోడల్ అని చెప్పవచ్చు.

ప్రసాద్ ఎప్పుడు. ఎక్కడ ఎలా వ్రాయగలడో ఒకసారి చెప్పాలి. మనవాడికి అల్లసాని వారి 'నిరుప హతిస్థలము...' లాంటివి అవసరము లేదు. మొక్కజొన్న చేలలో మంచెపై నుండి పిట్టలను ఒడిసెలతో బెదురుగొట్టుచున్న కన్నెపిల్ల హొయలు చాలు. వరిచేల గట్లపై వయ్యారంగా నడుము అటూ ఇటూ ఊపుతూ నెత్తిమీది పచ్చిగడ్డి మోపును మోసుకెళ్తున్న ఆ మోహన రూపము చాలు. గొడ్లను చెరువులో వదిలి, చెరువు గట్టుపై చెట్టునీడలో పవలించి హాయిగా గొంతెత్తి ఆమడ దూరము వినిపించేలా 'జెండాపై కపిరాజు...' అంటూ ఆలపిస్తున్న ఆ అమాయకపు పసుల కాపరి గొంతు చాలు. ఎక్కడైనా నీ ఆటలు సాగుతాయిగానీ వంగతోట కాదు బావా అని బావను ఆట పట్టిస్తున్న ఎంకి చాలు. లంకలలోని రెల్లు పొదలు తలలూపుతూ లయబద్ధంగా ఈలలతో శరవణభవునికి జోల పాడుతున్న ఆ జోల పాటలు చాలు. వరిచేలలో వంగి వంగి నాట్లు వేస్తూ పల్లె పాటలు పాడే శ్రమ జీవుల ఆలాపన చాలు. దివిసీమలో పుట్టిన ఆయన మెట్ట పొలాలు మాగాణిగా మారిన కాలాన్ని చూసాడు. లంక పొలాలతో తను పుచ్చకాయలు తిన్న రోజులూ తనకు గుర్తు ఉన్నాయి. ఇవన్నీ తన చిన్ననాటి అనుభవాలైనా స్మైల్ రచనలలోని ఖాళీ సీసాలు అమ్ముతున్న ముసలమ్మ ఉన్న విశాఖపట్నపు మురికి కాలువలోని కంపు కూడా తరువాత తరువాత ఆయనకు కథా వస్తువు అయ్యింది. కారా మాస్టారి యజ్ఞపు కథలోని ఆంతర్యాన్ని ఒడిసిపట్టుకున్నవాడు. ఆరు సారా సీసాల రావిశాస్త్రిగారి రచనా ప్రాభవాన్ని ఒంటబట్టించుకున్నవాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే రాను రాను చాలీ చాలని మెతుకులతో సూర్యచంద్రులతో పగలూ రాత్రి సావాసము చేస్తూ పూరి గుడిసెలో నివసించే కడు పేదరాలి ఆకలి కేకలను ఆయన చెవులు వినబడడము మొదలుపెట్టాయి. గమ్యాన్ని చూడాలని కొండలు కోనలు దాటి, వాగులు వంకలు దాటి గుంపుల గుంపులుగా ఉన్న చెట్ల నడుమున నడుస్తూ విప్లవగీతాల సవ్వడి వినాలని ఆరాటపడుతుంటే కిలా కిలా రావాలతో పక్షులు దారి ఇటూ ఇటూ అంటూ సంజ్ఞలు చేస్తుంటే, అక్కడ చూసిన వాస్తవ పరిస్థితులూ ఆయన కథా వస్తువులు అయ్యాయి.

పెత్తందార్ల అధికార దాహాన్ని అంతము చేయాలని, అహంకారాన్ని అణచాలని గొంతెత్తి 'విప్లవం వర్ధిల్లాలి' అని నినదిస్తున్న యువతరపు చైతన్యము ఆయన కవితా సేద్యానికి రాను రాను మూలబిందువయ్యింది. ఆ బిందువునే సింధువుగా మార్చాలని ఆయన తాపత్రయము. కావేవీ కవిత కనర్హమన్న మహాకవి మాటలకు ప్రతీకగా ఏ పరిస్థితులనైనా కళ్లకు కట్టేలా అక్షరాలలో ఇరికించి ప్రబంధాలుగా వ్రాయగల సమర్థుడయ్యాడీ ప్రసాద్.

ప్రసాద్ మాటలనే విన్నారు గానీ, ఆయన రచనలను చదివి, రుచి చూసిన వారు చాలా తక్కువ మంది. ఈ మనిషికి ఒక అలవాటు ఉంది. అలాంటి రచనలను చేయడానికి సమయము లేకపోయినా, తనకు మూడ్ అంటూ వస్తే దొరికిన కాగితాన్ని తీసుకుని బరా బరా వ్రాసి పెట్టేవాడు. అది బ్రహ్మరాత. తీరిక ఉన్నప్పుడు వాటిని చూస్తే అవి చాలా వరకు నారికేళ పాకములోనున్న రచనలే. ఆయన రచనలలో అనేకం అలాంటివి ఉన్నాయి. వాటి జోలికి పోను నేను. వాటి మధ్యకు పోయి అభిమన్యుడిలా బయటకు వచ్చే దారి తెలియక ఆ పద్మవ్యూహములోనే బందీని కావడము నాకు ఇష్టము లేదు. ఇక్కడ ఒక మాట చెప్పక తప్పదు. పరోపకారార్థమంటూ, ఒక జత బట్టలు సంచిలో వేసుకొని పది ఊళ్లు తిరిగే ఈ పూజారికి వ్రాయడానికి టైము ఎక్కడ దొరుకుంది? ఆయన మాటలే చాలు. పాటలే చాలు ప్రజలను మేలుకొలపడానికి. అదేనేమో ఆయన ఎంచుకున్న అసలు మార్గము. ఒక్కటే నా బాధ. అందరి కళ్ళు ఆ శ్రమ జీవి జీవితకాలమూ కష్టించి ప్రోది చేసి దాచి పెట్టుకున్న పుస్తకాల మీదనే. వాటి ధరను డబ్బు సంచులతో వెలగట్టలేము. అవి అమూల్యమైన సంపద. ఆ రోజు వచ్చిన వారందరూ ప్రసాద్ ఆశయాలకు కార్యరూపము ఇస్తామని పిడికిలి బిగించి లాల్ సలామ్ చేస్తూ నినదించిన వారే. మూవ్‌మెంట్ అనేది ఎప్పుడూ ఒడ్డును ఒరుసుకుంటూ పోయి ప్రవహించే కూలంకష. దానిని ఎవరూ ఆపలేరు. ప్రసాద్ లేని లోటును ఉత్సాహము, పట్టుదల, కార్యదీక్ష, ఉత్తేజము ఉన్న మరో నాయకుడు వచ్చి పూరించగలడు. అలాంటి వారు వస్తారు కూడా.

కానీ పుస్తకాలే. అవి అనాథలయ్యాయి. ఎవరు మమ్మల్ని దగ్గరకు తీసి ఆదరించి కాపాడుతారా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాయి. కొన్ని పుస్తకాలను చదివి తిరిగి ఇస్తామని తీసుకెళ్లిన వారు చాలా మంది ఉన్నారు. వారందరికీ వాటిని తిరిగి వాటి గూటికి చేర్చాలని నా అభ్యర్థన. తను చివరి వరకూ ప్రేమించిన ఆ పుస్తకాలను భవితకు ఎల్లప్పుడూ పరిశోధనలకు ఉపయోగించుకునేలా, అవి కాలగర్భములో కలిసి పోకుండా చూడవలసిన బాధ్యత ప్రసాద్ అభిమానుల మీద ఉంది. తాను తన భార్య కాల గర్భములో కలిసిపోయినా ఆ తరువాత మానవాళికి ఎలా ఉపయోగపడుతున్నారో, తన ప్రాణ సమానమైన పుస్తకాలు కూడా తన తరువాత భావితరాల వారికి ఉపయోగపడాలని ప్రసాద్ చివరి కోరిక. అది జరిగిన నాడు ప్రసాద్ ఎక్కడ ఉన్నా సంతోషిస్తాడు. ప్రసాద్ మీద అవ్యాజ ప్రేమను వెల్లడించిన వారంతా ఆ బాధ్యతను తీసుకుని ఆ పుస్తకాలు భావితరాలకు ఉపయోగించేలా ఒక వ్యవస్థను ఏర్పరచి సంరక్షిస్తారని నా ఆకాంక్ష.

తార్నాకాలో నున్న state archives (ప్రాచీన లిఖిత భాండాగారము)నకు వచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే ప్రసాద్ ఉంటూ ఉండేవారు. అక్కడ ఉన్న సమాచారము చూసి మురిసి పోయేవాడు. ప్రతి విషయములోనూ ఆ కాలానికి ఈ కాలానికి ఉన్న మార్పును గమనించి ఆ అంశాన్ని తన పరిశోధనలలో భాగంగా ఎన్నుకోనేవారు. తను చెప్పిన ఏ అంశమైనా authenticగా ఉండాలని తాపత్రయ పడిన నిత్యనూతన విద్యార్థి. 'నేను పది రోజుల్లో ఈ పని మీదే తార్నాక వస్తున్నాను దాసూ' అంటూ ఫోనులో చెప్పారు. వస్తాను, వస్తున్నాను అంటూ మురిపించి ఆ పదిరోజులు దాటకుండా ఎవ్వరికీ చెప్పకుండా మనము అందుకోలేనంత దూర తీరాలకెళ్లాడా పెద్ద మనిషి.

ఎప్పుడూ మాట తప్పని ఈయన ఈసారి మాట తప్పాడు.
ఈయనే మా ప్రసాద్.
ఇవి మా హృదయాంగణ కుసుమ సముదయ మధువులు
అందరికీ అందుబాటులో నుంచిన కమ్మటి తేనియులు.

తూరుపు తీరాన తీరని లోటు

జి ఎస్ రామ్మోహన్

ఆ నవ్వు లేక విశాఖ బోసిపోయింది. సముద్రం లాగే కొలవలేనంత తడి ఉన్న మనిషి. నీళ్లు కనిపించినా, పరిచయస్తులు కనిపించినా పట్టలేం. దూకి లోతు తెలుసుకోవాల్సిందే. పరిసరాలతో పరిచయం లేకపోయినా నీళ్లు కనిపిస్తే దూకేస్తారు. పరిచయస్తులు కనిపిస్తే భుజం పట్టుకుని లోపలా బయటా కుదిపేసి లోతుల్ని తెలుసుకుంటారు. ఆయనతో రెండోసారి మాట్లాడేసరికే పేరుతో పలకరించేసే చనువు వచ్చేస్తుంది. అచేతనంగా పడి ఉన్న మనిషి సాక్షిగా సాగిన సమావేశంలో అందరూ మా చలసాని అనే గుర్తుచేసుకున్నారు. చాలామంది భోళా మనిషి అన్నారు. మామూలుగా వాడే అర్థంలో అయితే భోళా అనేది సరిపోదు. తెలివైన మనిషి, తెలిసిన మనిషి భోళాగా బతకడం కష్టం. అందుకు చాలా వదులుకోవాల్సి ఉంటుంది. అది ఊరికే ఆయాచితంగా వచ్చిపడే లక్షణం కాదు. సులభంగా కనిపించే తెలుగు వాక్యం రాయడం లాంటిది. అది అంత సులువుగా రాదు. సాధన కావాలి. ఆ సాధన వెనుక లక్ష్యం ఉండాలి. భోళాతనంలోనూ లక్ష్యమున్నది.

నిత్య జీవితంలో ప్రివిలేజెస్‌ని అడ్వాంటెజెస్‌గా మార్చుకోకుండా నిగ్రహించుకోవడం కష్టం. కులం ప్రివిలేజ్. అందులోనూ ఇంటిపేరు ప్రివిలేజ్. సీనియారిటీ ప్రివిలేజ్. అనుభవం ప్రివిలేజ్. వయసు ప్రివిలేజ్. విస్తృత పరిచయాలు ప్రివిలేజ్. నా ఏకైక కైక అని శ్రీశ్రీ స్వయంగా అని ఉండడం ప్రివిలేజ్. ఇలాంటివాటిని చాలామంది ఏదో సందర్భంలో అడ్వాంటెజెస్‌గా మార్చుకుంటారు. ఎదుటివ్యక్తిని డామినేట్ చేయడానికి ఉపయోగించుకుంటారు. నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా అన్నట్టు ఆయన చూడడం నేనెన్నడూ చూడలేదు. శ్రీశ్రీకే ఆత్మలాంటివాడిని, ఈ పిపీలికములతోనా అన్నట్టు ఎవరితోనైనా ఆయన ప్రవర్తించినట్టుగా తెలీదు. ఆ ప్రివిలేజెస్ ఆయనకు ఏ పరోక్ష రూపంలోనైనా ఏ కొంచెమైనా ఉపయోగపడ్డాయో లేదో చెప్పలేను కానీ ప్రజాజీవనంలో తన ప్రయోజనం కోసం ప్రయత్నపూర్వకంగా ఉపయోగించుకున్నట్టుగా అయితే తెలీదు. సంస్థల కోసం ఎన్నడైనా ఉపయోగించి ఉండవచ్చును.

ఆయన మానవసంబంధాల్లో పార్టీవ్రత్యం పాటించలేదు. ఉక్కు క్రమశిక్షణ అవసరమైన, అత్యంత కఠినమైన రాజకీయపంథాతోనూ పోరాటంతోనూ ఉంటూ కూడా ఇంత విస్తృతమైన సున్నితమైన సంబంధబాంధవ్యాలు నెరపడం మామూలు విషయం కాదు. ఆ మానవసంబంధాల విస్తృతి చూసినపుడు ఉదారవాదపు లక్షణాలున్నట్టుగా కనిపించొచ్చుకానీ ఆయన రాజకీయ జీవితంలో ఉదారవాదిగా వ్యవహరించినట్టు అయితే తెలీదు. సంబంధ బాంధవ్యాలు కూడా ఏదో వ్యక్తిగత అవసరం కొద్దీ ఎంచుకుని చేసినవి కావు. ఈ లక్షణం ఆయాచితంగా వచ్చే భోళా లక్షణం కాదు. రాజకీయ వైఖరికి సంస్థల క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూనే ఆ లైన్ తప్పకుండానే ఇన్ని రకాల మనుషులతో వ్యవహారం నెరపాలంటే ఏదో కావాలి. అదేదో ఆయన దగ్గర ఉంది. దాన్ని సాధించారు. స్టాలిన్‌కు వీరాభిమానిగా ఉంటూ కూడా ఇలాంటి లక్షణాన్ని అలవర్చుకోవడం ఊహించడానికే కష్టమైన విషయం. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించడం వల్ల ఆ వారసత్వంగా వచ్చిందా, లేక ఎప్పుడో ఒకసారి అందరమూ కలవాల్సినవాళ్లమే, పంథాలు వేరుకావచ్చుకానీ, లక్ష్యం వేరుకాదు అనే భావనలోంచి వచ్చిందా అనేది తెలీదు. ఆయనకు ముందు ముగ్గురు కుటుంబ సభ్యులు అమరులై ఉన్నారు. ఆయన తర్వాతా ఆ కుటుంబ సభ్యులు ముళ్ల బాటనే ఎంచుకుని ఉన్నారు. అపుడైనా ఇపుడైనా వారెంచుకున్న బాటతో రాజకీయ విభేదం ఉండవచ్చును. కానీ అది త్యాగాల బాట కాదని అయితే ఎవరమూ అనలేం. ఆయనెప్పుడూ వివాదాస్పద అంశాలను చర్చించేవారు కాదు. హాయిగా మాట్లాడుకోవడానికి అవసరమైన అంశాలనే ప్రస్తావించేవారు. ఏదైనా ఫాక్చువల్ మిస్టేక్ ఉందనిపిస్తే మాత్రం అందులో అలా లేదు. ఇలా ఉంది అని గుర్తుచేసేవారు అంతే. ఆయన మనసులో ఏమి ఉండింది అనేది తెలిసేది కాదు. ఎదుటివారి పట్ల లుకింగ్ డౌన్ యాటిట్యూడ్ లేదు. జీవితం అర్థవంతంగా ఉండాలని చాలామంది సామాజికులు తపిస్తారు. ఒక లక్ష్యం కోసం నిలవడం అనేది అందులో భాగమౌతుంది. లక్ష్యశుద్ధి, ఎంచుకున్న మార్గం పట్ల విశ్వాసం లేకుండా ప్రయాణం కష్టం. కానీ అందుకోసం మన మార్గాన్ని సంపూర్ణంగా విశ్వసించని వారినందరినీ తక్కువగా చూడనక్కర్లేదని అర్థం చేసుకున్నవాడు. మనుషులను కూడగట్టుకోవడానికి అది అవసరమని భావించి ఉండొచ్చు. అందువల్లే అన్ని శ్రేణులతో అంత విస్తృత సంబంధాలు ఏర్పరుచుకోగలిగాడు. చాలామందికి ఏకకాలంలో తండ్రీ, బాబాయ్, స్నేహితుడు. కూడగట్టడం కష్టమైన కాలంలో అది అవసరమైన లక్షణం. ఏసుక్రీస్తు ముళ్లకిరీటం భారం తానొక్కడే మోస్తున్నట్టు ఎన్నడూ కనిపించేవారు కాదు. సదా బాలక్, సదా లోక్ సంచార్.

ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అనే వాడుకకు నిజమైన అర్థంగా నిలిచినవాడు. మూడింటి మిక్స్. చేసే పనిలో తన పేరు ప్రముఖంగా కనిపించాల్సిన, తన పేరు వినిపించాల్సిన అవసరం లేదని భావించినవాడు. నేను అనేది ముందుకు తోయకుండా పనిచేసేవారు అరుదు. ఇతరులను ప్రోత్సహించడంలోనూ శ్రీశ్రీ, కొకు, గోపీచంద్ సంపుటాలు తేవడంలోనూ వెచ్చించిన శ్రమ, సమయం తన పేరును వెలిగించుకోవడం కోసం వెచ్చించి ఉంటే ఆయన ఇంకో రకంగా కూడా పేరు పొంది ఉండేవారేమో! తెలీదు. సమాచారం మీద పెట్టిన శ్రద్ధ విశ్లేషణ మీద వ్యాఖ్యానం మీద పెట్టారా! అనుమానమే! వ్యక్తిగత పరిమితుల పాత్ర కూడా ఉండొచ్చును కానీ పూర్తిగా పరిమితికి మాత్రమే వదిలేయగలమా! వ్యక్తులపై ప్రేమవల్ల ఆయన తన సమయాన్ని, శక్తిని అవసరమైన దానికన్నా ఎక్కువ వెచ్చించారేమో. ఆ వెచ్చింపులో కొంత వృథా కూడా ఉందేమో అనిపిస్తుంది. ఏమైనా సామాజిక ఆచరణలో నేనును సాధ్యమైనంత వరకు రద్దు చేసుకోగలిగారు. ఇది చాలా చాలా కష్టమైన విషయం. ప్రాణాల్ని వదులుకోవడం సులభం, అహాన్ని వదులుకోవడం కష్టం అని గంటి ప్రసాదం అనేవారని వివి అక్కడ గుర్తు చేశారు. లిటరల్ సెన్స్‌లో తీసుకోకుండా స్పిరిట్ తీసుకుంటే గొప్ప మాట. అలా వదులుకున్న మనిషి చలసాని.

పుస్తకానుభావాలైనా, జీవితానుభవాలైనా అవసరమైన వారితో పంచుకోవడం వాటి ప్రాధాన్యాన్ని తెలియజెప్పడానికే అనిపిస్తుంది. చదువు ప్రాధాన్యాన్ని అర్థం చేయించే కృషి అవసరమైనది. చివరి దశలో తారీఖులు దస్తావేజుల చాదస్తం కాస్త కనిపిస్తుంది. చరిత్రను సరిగా రికార్డు చేయడం అనే కచ్చితత్వం నుంచి వచ్చిన అవశేషంగా దాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుందేమో! తన ఇంటినే ఒక నమూనాగా మార్చడంలో ఆయన విజయం సాధించారు. తాళాలు లేని ఇల్లు, దండన లేని చదువులు, పోలీస్ స్టేషన్లు లేని రాజ్యం ఆదర్శ నమూనా అని వాటికోసం కలగన్న చలసాని తన పరిధిలో వాటిని చేసి చూపించారని వివి అక్కడ చెప్పారు. మొదటిది,

ఆయనే సముద్రమూ కొండ శిఖరాగ్రమూ...

- కె. క్యూబ్

అవునూ
మీరలా ఆ బజాజ్ చేతక్ బండిని
ఆ మెట్ల పక్కన వదిలేసి హాయిగా
ఎలా నిదురోతున్నారు
మీరెప్పుడూ కోడి కునుకు తీసి
మీవైపు చూసే లోపే మరల
మాటలలో మాటలు కలిపే వారు కదా?

ఒక్కసారి లేవండి సార్
ఇంతమంది మీకోసం మీ ఆత్మీయ
పలకరింపు కోసం
మీ టేబుల్ చుట్టూ కూచుని
మీరలా అరచేయినిండా
ఆవకాయ కలిపిన అన్నం ముద్ద
తినడం చూస్తూ మురిసిపోవాలని
ఎదురు చూస్తున్నారు

మీరలా పక్కదాటుని చేతుల్నలా
చాపుకు నిదరోవడం ఇదే మొదటిసారికదా
గట్టిగా భుజం తడుతూ మెత్తని మీ
అరచేతులతో హత్తుకుని
మాలోని అలసటను మాయంజేసే
మంత్రపు నవ్వును మరొక్కసారి
మాపై రువ్వండి సారూ

ఈ తూరుపు దిక్కున
సంద్రంలో దాగిన అపురూప మణిహారంలా
మీ ఎల్ఐజీ15 గోడల అరలనిండా
ఒదిగిన పుస్తకాలు దుమ్ము పట్టి
చెదలేవో వస్తున్నట్టున్నాయి
ఒక్కసారి మరల
సర్దుకుందాం రండి సారూ

మీరు చూడమన్న విప్లవాగ్నులు
శ్రీకాకుళం వైపే కనబడుతు
ఈ కొండబారిడి కొండలమీదుగా
అటు ఉద్దానం బొడ్డపాడు నడిబొడ్డున
తామాడ గణపతి ఇంట్లో
మనం ఫలహారం చేసి
అమర వీరుల ఆశయాలను
కొనసాగిస్తాం అని నినదిస్తూ
ఆ వీథులగుండా బ్యానర్లమై
ఎర్రెర్రని జెండా రెపరెపలమై
సుబ్బారావు పాణిగ్రాహి
హారతిచ్చిన గుడిమెట్లపై
సేదదీరుదాం ఒక్కసారి లేవండి సారూ

శ్రీశ్రీని ఎవరో తాగుబోతు అని
తిడుతున్నారు
ఆయన పుట్టిన తేదీ మీరన్నది కాదని
రాస్తున్నారు
నిన్నటి జట్కావాలా అసలు
కవిత్వమే కాదని
ఏదో పేపర్లో రాసారంట
ఇదిగోండి సారు
మీ పెన్నూ కాగితమూ
అలా పెద్ద పెద్ద
అక్షరాలతో ఓ నాలుగు పేజీల
వివరణ ఇవ్వండి గట్టిగా
లేవండి సారూ

మేమంతా అలా బెంగగా
బేలగా దిక్కులేని దిక్కుతోచని
పక్షులమయ్యామీ దిక్కున
దిగ్గున లేచి
ఎత్తినాం విరసం జెండా
అలలలలుగా వరదలొత్తు పోరు పోరు జెండా
అని మీ గొంతు ఎత్తి
ఈ సముద్రమూ
ఆ కొండ శిఖరాగ్రమూ
ఏకమయ్యేట్టు
ఆలపించండి సారూ.

చివరిది ఏ సమాజంలోనైనా సాధ్యమేనా, అది ఉటోపియా మాత్రమేనా అనే సందేహం ఉన్నప్పటికీ సారాంశంలో అటువంటి లక్ష్యమొకటి ఉండడం ఉదాత్తం. ఆ అవసరాన్ని తన ఆచరణతో గుర్తు చేసిన మనిషి చలసాని. బీ ద ఛేంజ్ యు వాంట్ అన్న గాంధీ మాటలకు ఆచరణ రూపం.

చలసాని ఎనభై యేళ్లకు పైబడి బతికారు. కూసింత డిమెన్షియా లక్షణాలు తొంగిచూస్తున్న తరుణంలోనే గుండ్రాయిలాగా తిరుగుతున్న తరుణంలోనే ఆరోగ్యానికి సంబంధించిన ఇబ్బందులు లేకుండా మరణించారు. కొన్ని ఒంటరితనాలు, కొన్ని దిగుళ్లు, సాయం చేయబోయి తిన్న ఎదురుదెబ్బలు కొన్ని ఉంటే ఉండొచ్చును. కానీ అవేవీ ఆయన జీవితాన్ని అసంపూర్ణం చేయలేవు. ఇట్స్ ఏ సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్. మనకు ఉన్న బంధాన్ని గుర్తుచేసుకుని బాధపడడం తప్ప, ఆ మరణంలో దిగ్భ్రాంతికరమైనదేమీ లేదు. సంపూర్ణజీవితమే గడిపారు. చేయాలనుకున్నది చేయగలిగినంత చేశారు. కానీ ఆయన లేని ఉత్తరాంధ్రను గుర్తుచేసుకుంటే మాత్రం బాధేస్తుంది. కేంద్రం లేకపోతే ఆ ప్రాంతాలు ఎలా అనాథలవుతాయో చరిత్ర చూపించి ఉంది. అసలే గడ్డుకాలం. పురోగామి శక్తులు పుట్టకొకరు చెట్టుకొకరుగా చెల్లాచెదురవుతున్న కాలం. నలుగురిని కూడగట్టడం గగనమవుతున్నకాలం. ఈ సమయంలో చెట్టులాగా అందరికీ చల్లని నీడనిచ్చి కూడగట్టే మనిషి లేకపోతే ఆ శక్తులు విస్తరించలేవు. దాన్ని తల్చుకుంటే మరింత దుఃఖమేస్తుందని ఒక మిత్రుడు వ్యాఖ్యానించారు. అది నిజమైన లోటు.

సాహిత్యోపజీవి చలసాని ప్రసాద్

ఆర్వీ రామారావు

కొంత మంది మనకన్నా వయసులో చాలా పెద్ద వాళ్లయినా వాళ్లతో ఉండే చనువుతో ఏకవచనంలోనే సంబోధిస్తాం. కేతు విశ్వనాథ రెడ్డిని, చలసాని ప్రసాద్‌ను నేను అలాగే సంబోధిస్తాను. చలసాని ప్రసాద్ పుట్టింది కమ్యూనిస్టు కుటుంబంలో. 1932 డిసెంబర్ 8న కృష్ణా తీరంలోని చల్లపల్లి దగ్గరిలో భట్లపెనుమర్రులో పుట్టినా విద్యాభ్యాసం, ఉద్యోగ రీత్యా ఆయన జీవిత కాలంలో ఎక్కువభాగం విశాఖ పట్నంలోనే గడిచింది. ఖాళీ దొరికితే జైలులో గడిచింది. నిజం నోరు నొక్కేయాలనుకున్నప్పుడల్లా ఆయనను ప్రభుత్వం జైలులో పెట్టింది. ఎమర్జెన్సీలో జైలు శిక్ష అనుభవించారు. ఆ తర్వాత అనేక సందర్భాలలో జైలుకెళ్లారు.

సాహిత్య రంగంలో ఆయన కృషి రెండు పాయలుగా సాగింది. సాహిత్యోద్యమాలను నిర్మించడంలో గత అర్ధ శతాబ్దంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విరసం వ్యవస్థాపకులలో ప్రధానమైన వారు. ఆయన పేరు ఎవరు ప్రస్తావించినా విరసం ప్రసాద్ అంటారు. విరసం అన్న మాట దాదాపుగా ఆయన ఇంటిపేరై పోయింది. ప్రసాద్ సాహితీ సృజన తక్కువేమీ కాదు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అవసరమైనప్పుడల్లా సామాజిక, రాజకీయ అంశాల మీదా రాశారు. అయితే ఉద్యమజీవులందరికి లాగే తన సృజనాత్మక శక్తిని ప్రోది చేసుకుని, పదిలపరచుకుని ఆ రంగంలో కీర్తి సంపాదించాలన్న దుగ్ధ ఆయనకేనాడూ లేదు. 1970లో విరసం ఏర్పడినప్పటి నుంచి మూడున్నర దశాబ్దాలకు పైగా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1985 నుంచి 88 వరకు మూడేళ్ల పాటు విరసానికి కార్యదర్శి. 1998 నుంచి 2002 వరకు అధ్యక్షులు. అయినా ఆయన సాహిత్యోద్యమంలో తనను తాను కార్యకర్తగానే పరిగణించే వారు. సాహితీ రంగం కూడా ఆయనను అదే దృష్టితో చూసింది. తొమ్మిదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు 1947 'నవయుగ' సంచికలో 'ఓ విద్యార్థి సోదరుడా, సమ్మెయే మన ఆఖరి ఆయుధమోయ్' అన్న పాటతో మొదలెట్టి కవిత్వం, సాహిత్య విమర్శ, ముందుమాటలు, సాహిత్య, రాజకీయ అంశాల మీద వ్యాసాలు దండిగానే రాశారు. చాలా కాలంపాటు ఒకటి రెండు అనువాదాలు తప్ప స్వతంత్ర రచనలుగా ప్రచురించడం మీద ఆయన దృష్టి ఎన్నడూ లేదు. 2008లో 'సాహిత్య వ్యాసాలు', 2010లో 'చలసాని ప్రసాద్ రచనలు' వెలువడ్డాయి.

శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు సంపుటాలను ప్రసాద్ వెలువరించిన పద్ధతి సాహిత్యాన్ని ఎడిట్ చేయడంలో కొత్త ఒరవడి దిద్దింది. పాదసూచికలకు ఉన్న విశిష్టత ప్రసాద్ సంపాదకత్వంలో వెలువడిన సంపుటాలను చూస్తే తెలుస్తుంది. సంపుటీకరించడం అంటే కలిపి కుట్టేయడం కాదు అని రుజువు చేశారు. వాటికి ఆయన సమకూర్చిన ముందు మాటలు ఆ రచయితల ఆత్మను ఆవిష్కరిస్తాయి.

ప్రసాద్ రచన మీద కన్నా సాహిత్యాధ్యయనం మీద ఎక్కువ దృష్టి పెట్టారు. అంతకన్నా సాహిత్యోద్యమ నిర్మాణమే ఆయనకు పరమావధి అయింది. ఆయన విరసానికి నాయకుడైతే నేను అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తను. ఆ విభేదాలు, వైషమ్యాలు అక్కడి వరకే పరిమితం తప్ప వ్యక్తిగత స్నేహానికి ఎన్నడూ అడ్డు తగలలేదు. విశాఖలో ఆయన ఇల్లు చిన్నదే. కాని దాని మీద పై అంతస్తు వేసి పుస్తకాలతో నింపేశారు. ముఖ్యమైన పుస్తకం ఏదైనా ఆయన దగ్గర దొరుకుతుందన్న ధీమా. ఒకసారి సెట్టి ఈశ్వరరావు 1943లో రాసిన 'బాంబులు పడ్డనాడు' కథ ప్రస్తావన తెస్తే నా దగ్గర ఉంది అని వెంటనే ఇచ్చారు. ప్రజా శక్తి కథల సంపుటిలో ఆ కథ అచ్చయింది. కొడవటిగంటి కుటుంబ రావు విశాలాంధ్రలో రాసిన వ్యాసాలన్నింటినీ కూర్చి ప్రత్యేక సంపుటంగా ప్రచురించి ఆ సంపుటి ఆవిష్కరణ సభకు నన్నూ, చందు సుబ్బారావును ఆహ్వానించారు. మాకు అనుమానం వచ్చిన మాట నిజం. ఆ మాటే సభా ముఖంగా 'ప్రసాద్ మమ్మల్ని ఫిక్స్' చేయాలని చూస్తున్నట్టుంది అన్నాను. 'కాదు అవి కొ.కు. అభ్యుదయ రచయితల సంఘంలో ఉన్నప్పుడు రాసిన వ్యాసాలు కనక మీరు ఆవిష్కరించడమే భావ్యం' అని చెప్పారు.

మరో సందర్భంలో విశాఖ వీథుల్లో ఎక్కడో కనిపించి 'నీకేమైనా మతి పోయిందా, ఆ రాతలేమిటి, రష్యా మీద నీకెంత కోపం ఉంటే మాత్రం అలా తిట్టి పోయాలా' అని మందలించడాన్ని మించిన స్థాయిని మించి కడిగేశారు. నాకేమీ అంతుపట్టలేదు. ఆ మాటే చెప్తే 'అదేదో రాస్తున్నవుగా, పనికొచ్చే ముక్కో, పనికి రాని ముక్కో' అన్నారు. విషయం ఏమిటంటే ఆ కాలం రాసింది నేను కాదు. ఆర్వీయార్ అని ప్రసిద్ధి చెందిన రాళ్లబండి వెంకటేశ్వర రావు. మమ్మల్నిద్దరినీ ఆర్వీయార్ అనడం వల్ల వచ్చిన తంటా ఇది. విరసం వాళ్లు సోవియట్ యూనియన్ ను సోషల్ సామ్రాజ్యవాదం అని దూషించిన మాట ఎంత వాస్తవమైనా సోషలిజం మీద ఉన్న అపారమైన అభిమానం కారణంగా ప్రసాద్‌కు రష్యాను దూషించడం నచ్చలేదు. దారులు వేరైనా సిద్ధాంతం ఒకటే అన్న అవగాహన వల్ల సమకూరే సమ్యక్ దృక్పథం ఇది. అది ప్రసాద్‌కు నిండుగా ఉండేది.

శిష్టా ఉమా మహేశ్వర రావు రాసిన 'విష్ణు ధనువు' కోసం దాదాపు పదేళ్లు వెతికా. ఎక్కడా దొరకలేదు. చివరకు వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు ఆవంత్స సోమసుందర్ గారు నా దగ్గరుందిగా అన్నారు. మళ్లీ వచ్చినప్పుడు తీసుకు రండి, జిరాక్స్ చేయించుకుని ఇస్తా అంటే ఆయన గుర్తుపెట్టుకుని తీసుకొచ్చారు. ఈ లోగా ప్రసాద్‌తో ఈ మాట అంటే నాకూ ఒక కాపీ తీయించు అన్నారు. కొంపెల్ల జనార్దన రావు 'ఉదయిని' సంచికల విషయంలోనూ అలాగే జరిగింది. అవీ కాపీ చేయించి ఇచ్చాను. పుస్తకం అంటే ప్రాసాద్‌కు అంత ప్రాణం. ప్రసాద్ జీవితం విరసం ప్రస్థానంలో అంతర్భాగం. ఆ క్రమాన్ని రికార్డు చేసే బాధ్యత మిత్రులు తీసుకుంటారనుకుంటా.

ఆత్మవిశ్వాసం ఉన్న విప్లవ సాహిత్య జీవి

వి. చెంచయ్య

సైద్ధాంతిక అవగాహనలో రాజీపడకుండానే విస్తృత మానవ సంబంధాలు కలిగిన అరుదైన విప్లవ రచయిత, మేధావి చలసాని ప్రసాద్. మానవ సంబంధాల్ని సరిగ్గా అర్థం చేయించగలిగేది మార్క్సిజమేనని చలసాని గట్టిగా నమ్ముతాడు. ఆయనకున్న మానవ సంబంధాలు వర్గాతీతంగా ఉన్నట్టు కనిపించినా, వ్యక్తిగతంగా గానీ, సాహిత్యపరంగాగానీ వర్గ స్వభావాన్ని కోల్పోయి ప్రవర్తించడు. తన రాజకీయ చైతన్యాన్ని నిలబెట్టుకుంటూనే ఉదారంగా కనిపిస్తాడు. నవ్వుతూ పలకరిస్తూనే కచ్చితంగా ఉంటాడు. చాలా కాలం క్రితం విశాఖలో ఒక వ్యక్తిని నాకు పరిచయం చేస్తూ, 'బెస్ట్ ఫ్రెండ్ వరస్ట్ రైటర్' అన్నాడు.

1960లలోనే మార్క్సిజంలో సంక్షోభం ఏర్పడిందని ఒక రచయిత అంటే, అసలు సంక్షోభంలో నుంచే మార్క్సిజం పుట్టిందని చలసాని అన్నాడు. సంక్షోభంలోంచి పుట్టిందానికి సంక్షోభాల్ని ఎదుర్కోవడం కష్టం కాదన్నాడు. ప్రశ్నలోనే జవాబుకు బీజం ఉంటుందన్న సూక్ష్మాన్ని చలసాని గుర్తించగలడు. 2003 జనవరిలో అనంతపురంలో జరిగిన విరసం సాహిత్య పాఠశాలలో చలసానికిచ్చిన అంశం 'విప్లవ సాహిత్యం - ఎదురవుతున్న ప్రశ్నలు' అనేది. 'విప్లవ సాహిత్యం అసలు పుట్టడమే ప్రశ్నలో పుట్టింది' అని ఉపన్యాసాన్ని ప్రారంభించాడు. 1970 ఫిబ్రవరిలో శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సభలో విశాఖ విద్యార్థుల 'రచయితలారా మీరెటువైపు' కరపత్ర ప్రభావాన్ని వివరించాడు. సాహిత్యంలోనూ, సమాజంలోనూ కనిపించే వైరుధ్యాల్ని అలవోకగా వివరించే ధోరణ చలసానికి వెన్నతో పెట్టిన విద్య.

కందుకూరి వీరేశలింగం రాసిన 'కవుల చరిత్ర'లో వేమనకు చోటు లేకపోవడం రచయిత వ్యక్తిగత దోషంగా చూడడం శాస్త్రీయం కాదని చలసాని అభిప్రాయం. సాహిత్యంలో చిరకాలంగా వస్తున్న పండిత, ప్రజా సంప్రదాయాల మధ్య వైరుధ్యమే కారణంగా చూపుతాడు. వీరేశలింగం పండిత సంప్రదాయంలోంచి వచ్చిన రచయిత. వేమన ప్రజా సంప్రదాయానికి చెందిన కవి. చాలా మంది పండితులు వేమనను అసలు కవిగానే గుర్తించలేదు. వేమన సూక్తికారుడు మాత్రమేనని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి అభిప్రాయం. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మలాంటి ఒకరో ఇద్దరో వేమనను కవిగా గుర్తించారు. వేమన కవిత్వం గావి వంటిదనీ, అది చొరబడని చోటు ఉండదనీ ప్రజాసాహిత్య సంప్రదాయానికున్న ఒక బలమైన లక్షణాన్ని రాళ్ళపల్లి చెప్పాడు. చలసాని ఈ రెండు సంప్రదాయాలనూ రాత, నోటి సంప్రదాయాలుగా చెబుతారు. 'వేలాది సభల్లో లక్షలాది మందిని ఉత్తేజపరిచే పాటలు నోటి మాటలుగా పుట్టి, తమ మనుగడని నిలబెట్టుకున్న కొన్నేళ్ళకి గాని 'రాత' రూపంలోకి రావడం లేదు, అచ్చుకెక్కడం లేదు.' (చలసాని 'సాహిత్య వ్యాసాలు' పుట 151.)

రాతలో ఉండేదే సాహిత్యం అనే మూస అభిప్రాయానికి అలవాటు పడిపోవడం వల్ల నోటి (మౌఖిక) సాహిత్యాన్ని పట్టించుకోవడం లేదు. జాతీయోద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీకాకుళ పోరాటం, ఉత్తర తెలంగాణలో పెల్లుబికిన విప్లవోద్యమం ప్రజాసాహిత్య సంప్రదాయాన్ని ఆధునిక కాలంలో పునరుజ్జీవింప జేశాయి. నిజానికి లేఖనం కన్నా ముందే సాహిత్యం ఉంది. సామెతలు, నానుడులు, పొడుపు కథలు, పాటలు మొదలైనవన్నీ నోటి సాహిత్యంలో భాగమే. ప్రజల నోళ్ళలో నాని, ప్రజల నాలుకలపై నాట్యమాడి, ప్రజల గుండెల్లో పదిలంగా ఉండే సాహిత్యం తరతరాలుగా, యుగయుగాలుగా మనకు అందుబాటులో ఉందంటాడు చలసాని. అక్షరం అంటే నాశనం లేనిదని, అచ్చులో ఉన్నది శాశ్వతంగా ఉంటుందని అనుకోవడం పండిత లేదా రాత సంప్రదాయంలో ఉన్నవాళ్ళ భ్రమేనని ఆయన అభిప్రాయం. శ్రీశ్రీ కూడా పండిత సంప్రదాయం నుండి వచ్చిన కవే కాబట్టి వేమన, గురజాడల్ని చాలా ఆలస్యంగా గుర్తించాడని మరో దృష్టాంతం చూపుతాడు చలసాని. వీరేశలింగం వేమనని పట్టించుకోలేదని తప్పుబట్టడం ఎవరైనా చేస్తారు, కాని సాహిత్య విమర్శకుడు చెయ్యవలసిన పని అలా జరగడానికి గల

కారణాల్ని, నేపథ్యాన్ని వివరించడం. చలసాని సాహిత్య విమర్శకుడుగా ఆ పని చేశాడు.

ముందుగా నిర్ణయించుకున్న ఒక ప్రణాళిక ప్రకారం సాహిత్యం గురించి చర్చించకపోయినా, సందర్భానుసారంగానూ, అవకాశం దొరికినప్పుడల్లా కథ, నవల, కవిత్వం, పాట, నాటకం మొదలైన సాహితీ ప్రక్రియల గురించి నిర్వచిస్తూ, వివరిస్తూపోయాడు చలసాని. ఏదైనా ముక్తసరిగా, క్లుప్తంగా చెప్పడం ఆయన పద్ధతి. ఆ క్లుప్తతతో కూడా సాంకేతికత కంటే హృదయగత తాత్వికత కనిపిస్తుంది. కవిత్వం అంటే ఏమిటి అనే ప్రశ్న వేసుకుని 'ఒక కదలిక, ఒక స్పందన' అని సమాధానం చెప్పుకుంటాడు. కదలిక, స్పందన అనేవి అస్పష్టమైన వ్యక్తీకరణలే అయినా, కవిత్వానికి సరిపోయే మాటలే. అయితే అంతటితో ఆగక, ఆ కదలికను, స్పందనను, ఎదుటివారిలో పలికించాలంటాడు. పాఠకులలో, శ్రోతలలో కదలిక, స్పందన కలగకపోతే కవిలోని కదలికకూ, స్పందనకూ అర్థం లేదు. ఇంతా అయింతర్వాత మనలో మాట అని చెవిలో చెప్పినట్టు మెల్లగా అంటాడు -

'అసలు కవిత్వం అంటే ఏమిటి? చిక్కటి భావాల చక్కటి వ్యక్తీకరణ-' అని (చలసాని ప్రసాద్ రచనలు - పుట 197). ఈ నిర్వచనం ఉత్త కవిత్వానికి సంబంధించిందే. అంటే ఏ రకమైన కవిత్వానికయినా సరిపోయే నిర్వచనం. ఒక విప్లవ సాహితీవేత్త ఇలాంటి నిర్వచనం చెప్పవచ్చా? ఆయన నిర్వచనం చెప్పింది కవిత్వానికి గాని, విప్లవ కవిత్వానికి కాదు. 'రచనలు చెడ్డకి సాయం, మంచికి హాని చేయవచ్చా?' అని చలసాని వేసిన ప్రశ్న కవితా వస్తువును ప్రస్తావిస్తుంది. అయితే మంచి, చెడ్డ అనేవి కూడా అస్పష్టమైన మాటలే. మంచి చెడ్డలకూ వర్గ స్వభావం ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు మంచిని రెండు రకాలుగా చెప్పారంటే అది వారి వర్గమూలాల్ని వ్యక్తీకరిస్తుంది. 'దేశకాల పరిస్థితులతోనూ, ప్రజల శోకాలతోనూ, జీవితపు ఆటుపోటులతోనూ ముడిపడి ఉంది కవిత్వం' (చలసాని ప్రసాద్ రచనలు. పుట. 150) అన్నప్పుడు విప్లవ కవిత్వానికి కావలసిన వస్తువు దొరుకుతుంది.

మంచి కవిత్వాన్ని నిర్ణయించగలవాళ్ళు కవులే అని ఒక సందర్భంలో వెల్చేరు నారాయణరావన్న మాటకు స్పందించి, సాహిత్య విమర్శకుల్నీ, పాఠకలోకాన్నీ పక్కన పెట్టేయ్యడం ఆయన పాక్షిక దృష్టికి తార్కాణమని చలసాని ఖండింతంగా చెప్పాడు. ఇక్కడ మంచి కవిత్వాన్ని నిర్ణయించే వాళ్ళలో సాహిత్య విమర్శకులతో బాటు, పాఠకలోకాన్నీ చేర్చిన చలసాని అభిప్రాయాన్ని గమనించాలి. కవిత్వం చేరవలసింది పాఠకులకే. కవిత్వం స్పందన కలిగించవలసిందీ పాఠకులలోనే. కవి ఆశించిన చైతన్యం పాఠకులలో కలగడమే కవిత్వ ప్రయోజనం. పాఠకుల్ని పట్టించుకోని కవిత్వానికి ఉనికి ఉండదు. కవుల కోసం కవిత్వం రాసే వాళ్లు కొందరుండొచ్చు. విమర్శకుల కోసం కవిత్వం రాసేవాళ్ళూ కొందరుండొచ్చు. కాని పాఠకుల కోసం కవిత్వం రాసేవాళ్ళే నిజమైన కవులు. దీన్ని గుర్తించిన విమర్శకుడు నిజమైన విమర్శకుడు, మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడు. చలసాని దీనికొక ఉదాహరణ.

కవిత్వం ఒకటే అయినా, దాని రూపాలు అనేకం - పద్యం, వచన కవిత, పాట, గేయం మొదలైనవి. కవిత్వానికున్న ఈ రూపాలు కేవలం రూపాలు మాత్రమే కాదు, వాటి పుట్టుకున్న మూలాలు భిన్నమైనవి. రేఖామాత్రంగానైనా ఈ విషయాన్ని చలసాని ప్రసాద్ స్పృశించాడు. సామాజిక వ్యవస్థలతో బాటు కవితా రూపాలు మారతాయన్నాడు. ఒక్క మాటలో పాటులో నుంచే పాట పుట్టిందన్నాడు. 'పనీ పాటా' అనే మాట పనికీ, మాటకీ ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుందని ఎన్నో సందర్భాల్లో చెప్పేవాడు. ఆధునిక జీవితంలోకి ప్రవేశించిన సంక్లిష్టతని వ్యక్తం చెయ్యడానికి వచన కవితారూపం మంచి వాహిక అయ్యిందన్నాడు. 'రకరకాల భావజాలాలకీ, ఆవేదనలకీ, ఆక్రోశాలకీ, స్పందనలకీ వచన కవిత గొప్ప వేదికగా నిలిచింది. విశ్లేషణ, వివేచన, వికాసం, ఆలోచన - వీటితో గూడిన చైతన్యం కలిగించాలంటే వచన కవిత అవసరమయింది. ఈ అవసరాన్ని అటు పద్యం గానీ, ఇటు పాటగానీ తీర్చలేవని, అవి సరిపోవని తేలిపోయింది.' (చలసాని ప్రసాద్ రచనలు పుట-197) పద్యం భూస్వామ్య వ్యవస్థలో పుట్టి భూస్వామ్య వ్యవస్థ పతనంతో వెనకపట్టు పట్టిన కవితా ప్రక్రియ. ఆధునిక కాలంలో కూడా ఇంకా పద్యం ఏదో విధంగా ఉందంటే, దానికి కారణం ఇవాళ్టికీ ఇంకా మిగిలి ఉన్న భూస్వామ్య భావజాల ప్రభావమే.

కవిత్వం, కథ రెండూ భిన్నమైన సాహితీ ప్రక్రియలైనా, ఆ రెంటినీ కలిపి రెండు చిన్న వాక్యాలలో వివరించడానికి చలసాని చేసిన ప్రయత్నం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. 'బాధ కవిత్వానికి పర్యాయపదం అన్నాడు శ్రీశ్రీ. కథకు వ్యథ మూలం అనొచ్చు మనం' (సాహిత్య వ్యాసాలు పుట-69). బాధకన్నా వ్యథ బరువైనది. బాధ తాత్కాలికం, వ్యథ దీర్ఘకాలికం. బాధను మర్చిపోవచ్చు. వ్యథ గుండెలో గూడుకట్టుకొని ఉంటుంది. బాధ సులభంగా వ్యక్తమవుతుంది. వ్యథ అంత సులభంగా వ్యక్తం కాదు. బాధను మాటల్లో చెప్పొచ్చు. వ్యథ మాటలకతీతంగా ఉంటుంది. బాధలో క్షణికావేశం ఉంటుంది. వ్యథలో లోతైన సుదీర్ఘమైన ఆలోచనతో ఆవేదనతో కూడిన బాధ ఉంటుంది. కాబట్టి బాధ కవిత్వంతో పలికితే, వ్యథ కథలో దాగి ఉంటుంది. ఇంతకంటే విలక్షణంగా కవిత్వం, కథ, నవలల గురించి మరో సందర్భంలో ఇలా చెబుతాడు - 'జీవితాన్ని పిండి కవిత్వం రాయాలి. కాచి వడపోసి కథలు రాయాలి. రంగరించి, విస్తరించి నవల రాయాలి.' (సాహిత్య వ్యాసాలు. పుట.73). చలసాని వాడే మాటలలో తార్కికత ఉన్నట్టు కనబడకపోవచ్చుగానీ, తార్కికతతోపాటు అంతకు మించి సాహిత్య హృదయం కనిపిస్తుంది. సాహిత్య సారాన్ని చెబుతున్నట్టు అనిపిస్తుంది. కథలో ఉండవలసిన వ్యథను పట్టుకోవడంలో చాలా మంది కథా రచయితలు విఫలమవుతుంటారు కాబట్టి, రాసిన కథల కన్నా రాయని కథలే ఎక్కువని చలసాని అంటాడు. నూటికి నూరు పాళ్ళూ ఈ వ్యథ ఉన్న కథకు కాళీపట్నం రామారావు 'యజ్ఞం' మంచి ఉదాహరణ.

రచయితలు ఎలా ఉండాలో మాత్రమే కాదు, ఎలా ఉండకూడదో కూడా చెప్పాడు చలసాని - నూతిలో కప్పల్లా ఉండకూడదు, దేవాలయాల్లో గబ్బిలాల్లా ఉండకూడదు - అని. నూతిలో కప్పలకు బాహ్య ప్రపంచం తెలియదు. దేవాలయాల్లో గబ్బిలాలు తల్లకిందులుగా ప్రపంచాన్ని చూస్తాయి. రచనలు చేసినంత మాత్రాన్నే రచయితలపై పోయామనుకుంటే పొరబాటు, రచయితల సమాజాన్ని చూసే చూపు, విశ్లేషించే పద్ధతి శాస్త్రీయంగా ఉండాలి, కనీసపు హేతబద్ధత అవసరం. చలసాని దృష్టిలో రచయితలకు జీవితానుభవం, సమాజ పరిణామం, మనుషుల వర్గ స్వభావం తప్పనిసరిగా తెలియాలి. ఇవి తెలియాలంటే మార్క్సిజం తెలియాలి. అంతే కాదు, మార్క్సిస్టుకు స్పందన, చిత్తశుద్ధి, సమర్థత కూడా అవసరం అంటాడు. మార్క్సిజం అంటే కేవలం సైద్ధాంతిక పరిజ్ఞానం మాత్రమే కాదు, పీడిత ప్రజల పట్ల ప్రేమ కూడా. ఈ సందర్భంగా చలసాని ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను వివరిస్తాడు. మనిషిని మనిషిగా నిలబెట్టే వ్యవస్థ కోసమే మార్క్స్ తపన పడింది.

అది వర్గరహిత వ్యవస్థలోనే సాధ్యమౌతుందని నిరూపించాడు. వర్గ వ్యవస్థలలో, బోలెడు అసమానతల మధ్య ఎవరైనా మనిషిని మనిషిగా చూడ్డం సాధ్యం కాదు. ఈ అసమానతల్ని రూపుమాపడానికి ఎన్ని ఘర్షణలు, ఎన్ని పోరాటాలు, ఎన్ని ఉద్యమాలు, ఎన్ని వైఫల్యాలు, ఎన్ని విజయాలు చూడాలో గదా! మార్క్సిజం అటు సామాజిక విశ్లేషణకి సంబంధించిన శాస్త్రమనీ, ఇటు సామాజిక విప్లవానికి పనికొచ్చే శాస్త్రమనీ గుర్తించగలిగిన దృష్టి చలసాని రచనలలో అంతర్లీనంగా పరుచుకుని ఉండడం ఆశ్చర్యపడవలసిన విషయమేమీ కాదు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన, జ్ఞాన సిద్ధాంతం, వైరుధ్యాలు, సాంస్కృతిక విప్లవం మొదలైన అనేక తాత్విక విషయాల గురించి ఎంతో మందికి, ఎన్నో సందర్భాలలో పాఠాలు చెప్పిన అనుభవం ఆయన రచనలలో ప్రతిబింబించడం అసహజం కాదు గదా! నిజానికి ఆయన రాసిన రచనలకన్నా రాయని రచనలు ఎక్కువ. రాయని రచనల కన్నా చెప్పిన పాఠాలు ఇంకా ఎక్కువ. చేతిలో కాగితం ముక్క లేకుండా మూడు రోజుల పాటు పాఠం చెప్పడం ఆయనకే చెల్లు.

ఏ రచనలో అయినా వస్తువుకూ, శిల్పానికీ ఉన్న సమ ప్రాధాన్యాన్ని బల్లగుద్ది చెబుతాడు చలసాని. అసలు శిల్పం అనేది భాష దగ్గరే మొదలవుతుందంటాడు. గుండెల్లో ఉన్న భావానికి తగినట్టు సూటిగా మాటల్ని ఉపయోగించడమే ఉత్తమ శిల్పం అంటాడు. ఎంత బాగా చెప్పాడు! అని కాదు, ఎంత మంచి సంగతులు చెప్పాడు! అనిపించాలి. ఇటువంటి శిల్పం కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యంలో దొరుకుతుంది. రచయిత శిల్పానికి లొంగిపోకూడదు, శిల్పాన్ని లొంగదీసుకోవాలి. ఇంత చెప్పింతర్వాత వస్తువా? శిల్పమా? ఏది ముఖ్యం? అని ప్రశ్నిస్తాడు. విషయం పట్ల గాఢమైన అభినివేశం లేకపోతే విషయాన్ని కళాత్మకంగా చెప్పలేమంటాడు. వస్తువును వ్యక్తీకరించడంలోనే శిల్పం ఉంటుంది కాని, వస్తువుని కాదన్న శిల్పం అసలు శిల్పమే కాదంటాడు. జీవితం పట్ల అపారమైన ప్రేమ ఉండడమే సృజనాత్మకతకు కారణం అని తెగేసి చెబుతాడు. దీన్ని బట్టి వస్తువు, శిల్పం విడివిడిగా ఉండవనీ, ఆ రెండిటినీ వేరు చేసి చూడడం సరైంది కాదనీ అర్థమవుతుంది.

అసలు ఏ కళకైనా జీవం వాస్తవికతే అనే విషయాన్ని చాలా మంది కళాకారులతో బాటు విమర్శకులూ గుర్తించరు. అందమైన అబద్ధం కవిత్వమని ఒక పాశ్చాత్య విమర్శకుడన్నాడు. ఆయనకు సమాజంలోని కటిక నిజాలు కాకపోయినా, కనీసం అందమైన నిజాలు కూడా కనిపించలేదు. అబద్ధపు ప్రకటనలతో లక్షలు, కోట్లు లాభాలు గడించే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం ఈ నిర్వచనంలో కనిపిస్తుంది. సాహిత్యంపై, కళలపై వ్యవస్థ ప్రభావం అంటే ఇదే మరి. వాస్తవికతను వదిలి, నేల విడిచి సాము చేసే కళ రాణించదని చలసాని అనడంలోనూ అర్థం ఇదే. అది తాత్కాలికంగా రాణించినట్టు కనిపించినా, ప్రజల బలహీనతల మీద ఆధారపడి బతకాల్సిందే. రచయితలు, కళాకారులు ఇలా సొమ్ము చేసుకోవడాన్ని ప్రజల శ్రమ దోపిడిపై బతికే ఈ వ్యవస్థ సమర్థిస్తుంది. ఈ వ్యవస్థను తెలిసో, తెలియకో సమర్థించే వాళ్ళు ఆ భావజాలంలో పడికొట్టుకుపోయి ప్రజాకళల్ని, ప్రజాసాహిత్యాన్ని శిల్పం లేదనే పేరుతో వ్యతిరేకిస్తుంటారు. వాళ్ల కోరుకునే శిల్పం నేల విడిచి సాము చేసే కళలాంటిదే. ప్రజా జీవితానికి దూరంగా ఉండేవాళ్ళు సహజంగానే సామ్రాజ్యవాదుల ప్రభావంలోకి వెళతారనే విషయాన్ని చెబుతూ నైరోబీ ఫెమినిస్టు కాన్ఫరెన్స్ (1985)లో జరిగిన చర్చ తీరును చలసాని ఉదహరిస్తాడు. ఫెమినిస్ట్ కాన్ఫరెన్స్‌లో లక్ష్యాలపై చర్చ జరుగుతున్నప్పుడు అమెరికన్ ప్రతినిధులు ఫెమినిజాన్ని డిఫెండ్ చేస్తూ 'ఇట్ ఈజ్ నథింగ్ టు డూ విత్ ద పాలిటిక్స్' అని ప్రణాళికలో రాయించారట. ఈ విషయాన్ని ముగిస్తూ చలసాని అన్న మాటలు ఇవి - 'ప్రజల బతుకులతో, ఉద్యమాలతో, నిర్మాణాలతో సంబంధం లేకుండా నీవుంటే నీకు తెలియకుండానే సామ్రాజ్యవాదం చేతుల్లోకి వెళ్తావు'. (సాహిత్య వ్యాసాలు పుట. 192)

1982లో 'స్పృహ' చేసిన ఇంటర్వ్యూలో సాహిత్యంలో రాజకీయాల ప్రవేశం ఎంతవరకుండాలి? అన్న ప్రశ్నకు జీవితంలో ఉన్నంత మేరకని చలసాని సమాధానం ఇచ్చాడు. ప్రశ్నలో ఉన్న కొంటెతనానికి తగ్గట్టుగానే సమాధానం ఉంది. వెనకటికెవరో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళిన అభ్యర్థిని నువ్వెక్కొచ్చిన మెట్లెన్ని అని అడిగితే, దిగబోయే అన్ని అని తలేమని సమాధానం చెప్పాడట. రాజకీయాలకు సాహిత్యంతో, కళలతో అసలు సంబంధమే లేనట్లు అమాయకంగా ఉన్నట్టు ప్రవర్తించడం కొందరు రచయితలకు, మేధావులకు ఒక ఫ్యాషన్‌లాగా తయారయింది.

సాహిత్యానికీ, రాజకీయాలకూ ఉన్న సంబంధాన్ని చలసాని సోదాహరణంగానే చర్చించాడు. 1955 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ ఓటమిని చవి చూసింతర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై భ్రమలు పెరిగిపోయాయి. భ్రమలు పెరిగాయనడం కంటే, బూర్జువా పార్టీలలాగా పార్లమెంటరీ రాజకీయాలలోనే సుఖానుభూతిని పొందుతూ ప్రజాపోరాటాలకు దూరమయ్యాయి. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ఓటమి పార్టీ నిర్మాణాన్ని దెబ్బ తీస్తే, కృశ్చేవ్ శాంతియుత పరివర్తన సిద్ధాంతం మార్క్సిస్టు సిద్ధాంత స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నం చేసింది. 1955 తర్వాతనే సాహిత్యంలోకి విపరీతంగా పెట్టుబడి ప్రవేశించింది. ఎన్నో ప్రచురణ సంస్థలు వెలిశాయి. వీటి యజమానులు ఎక్కువగా మాజీ కమ్యూనిస్టులే. అభ్యుదయ రచయితలు, ప్రజానాట్యమండలి కళాకారులు సినిమారంగం వైపు చూడసాగారు. అవకాశం దొరికినవాళ్ళందరూ అక్కడే ఉపశమనం పొందారు. ఆ ప్రాంతాల్లోనే సాహిత్య అకాడమీ స్థాపన జరిగింది. అప్పట్నించి సాహిత్యం ప్రభుత్వం పడగనీడన ఆశ్రయం పొందసాగింది. సాహిత్య అకాడమీ అవార్డులు రచయితల్లో ప్రజా పోరాటాల వైపు నిలబడే శక్తిని కోల్పోయేట్టు చెయ్యసాగాయి. పోరాటానికి స్వస్తి పలికిన కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ రచయితల్లో సైతం నిరుత్సాహాన్నీ, నిస్పృహనీ నింపింది. ఆరుద్రలాంటి అభ్యుదయ కవి కూడా ఆనకట్ట మీద హత్య, ఆడదాని భార్య, అణాకొక బేడస్టాపు పేర్లతో డిటెక్టివ్ నవలలు రాసి పాఠకుల మీదికివదిలాడు. ఒక్క కుటుంబరావు మాత్రమే తన వ్యంగ్య రచనల ద్వారా ఈ డిటెక్టివ్ నవలాధోరణిని ఎదుర్కొన్నాడు. ఆనాటి అభ్యుదయ సాహిత్య సాంస్కృతిక రంగం ఇలా నిర్జీవం కావడానికి రచయితల కళాకారుల వ్యక్తిగత పాత్ర కొంత ఉన్నా, ప్రధాన పాత్ర ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానిదే. రెండు మూడు వ్యాసాలలో ఈ వాతావరణాన్ని చలసాని అద్భుతంగా చిత్రించాడు.

1968లో జై తెలంగాణ, 1972లో జై ఆంధ్ర ఉద్యమాలు సాహిత్యానికి స్ఫూర్తిదాయకం కాకపోవడాన్నీ, 1967-70 మధ్యకాలంలో పెల్లుబికిన నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు సాహిత్యానికి స్ఫూర్తినివ్వడాన్ని చలసాని వివరించడం నిజమైన ప్రజా పోరాటాలకీ, సాహిత్యానికీ ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది.

చలసాని స్మృతి

ఎం.వి. రమణారెడ్డి

ఆత్మీయతకు మారుపేరు చలసాని ప్రసాద్. మేమిద్దరం మొదటిసారిగా కలిసింది ఖమ్మంలో జరిగిన విరసం మహాసభల్లో. అప్పట్లో నేను 'ప్రభంజనం' పక్షపత్రిక సంపాదకుణ్ణి. నా వ్యాసాలు ఆయన్ను పెద్దగా ఆకట్టుకున్నాయని పరిచయంలోనే తెలిసింది. అక్కడున్న రెండురోజుల్లోనే 'ఏమోయ్ రమణా' అనేంత సన్నిహితుడుగా చలసాని మారిపోతాడని మొదట్లో నేను ఊహించలేదు. తరువాత ప్రతి విరసం సభలోనూ మేము కలిసేవాళ్ళం. ఎప్పుడు కలిసినా అదే పలకరింపు, అదే ఆప్యాయత. 'మీరు' అనే గీతను దాటి చనువు చూపడం నాకు చేతయ్యేదిగాదు. 'ఇంకా ఏమిటోయ్ మీరూ సారూ' అంటూ ఆయన ఎన్నిసార్లు మందలించినా, తనపట్ల గౌరవభావం నాలో సడలింది గాదు. మనసులో ఆయన నాకు స్నేహితుడు, ఎదురుగా కనిపిస్తే పెద్దవాడు.

సెల్‌ఫోన్ల ప్రవేశంతో మా సాన్నిహిత్యం పెరిగింది. ఇప్పుడు మా చర్చ పుస్తకరూపంలో వెలువడుతున్న నా సాహిత్యం గురించి. ప్రసాద్‌గారి పరిశీలన 'బయోలాజికల్ డిసెక్షన్'కు సమాంతరం. అదే భావాన్ని ఏఏ సందర్భాల్లో ఏఏ రచయితలు ఏఏ తీరుగా వ్యక్తీకరించారో ఆయన పలుకుల్లో వింటున్నప్పుడు, ఇంగ్లీషు తెలుగు సాహిత్యాల మీద ఆయనకున్న అధికారానికి ఆశ్చర్యం కలిగేది. బహుశా అందుకేనేమో, విరామమెరుగని పఠితగా చలసాని ప్రసాద్ నా ఆలోచనలో మిగిలి పోయారు.

అంతేగాదు, సామాజిక దృష్టితో వెలువడిన సాహిత్యానికి సాటిలేని 'ప్రమోటర్' చలసాని ప్రసాద్. అభిప్రాయాలను సహచరులతో పంచుకోవడమే గాదు, విద్యార్థులను చేరదీసి, సామాజిక స్పృహను, సాహిత్యాభిలాషను ప్రోత్సహించడం ఆయన రోజువారీ పరిశ్రమ. ఆయన లేకపోవడం నాబోటి మిత్రులకేగాదు, తెలుగుజాతి ముందంజకే తీరని లోటు.

ఉద్యమానికి నాయకత్వమే వెన్నుపోటు పొడిస్తే ప్రజా సాహిత్యం, ప్రజా కళలు నిర్జీవం కావడానికి 1955 తర్వాతి అరసం, ప్రజా నాట్యమండలి ఉదాహరణలు. దీనికి భిన్నంగా ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రవేశపెట్టినా, బూటకపు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది పోరాట వీరుల్ని చంపినా పోరాడి ఓడిన శ్రీకాకుళ పోరాటంతో స్ఫూర్తిని పొందాయనడానికి విప్లవ రచయితల సంఘం (1970), జననాట్యమండలి (1972) ఉదాహరణలు.

వ్యక్తిగత ఆస్తి రద్దయినప్పుడే సమసమాజం వికసిస్తుంది. 'Private Property is theft' అని ఫ్రెంచి తత్వవేత్త ప్రౌధాన్ అన్నాడని, Private property is murder అన్నాడు చలసాని. వ్యక్తిగత ఆస్తి దొంగతనం మాత్రమే కాదు, హత్యతో సమానం కూడా. ఒకచోట కోట్ల ఆస్తి కూడుకున్నదంటే ఎంతో మంది శ్రమను దోపిడీ చెయ్యడమే. ఈ రోజుకు నా పని అయిపోయిందని ఒక కార్మికుడు అనుకుంటే, ఈ రోజుకు ఆ కార్మికుడు దోపిడీ చెయ్యబడడం అయిపోయిందని అర్థమని మార్క్స్ చెప్పాడు. చలసాని తన ఇంటికి తాళాలు వేసేవాడు కాదని తెలిసి ఆశ్చర్యపోయాను. ఈ దోపిడీ వ్యవస్థలో కూడా ఇంటికి తాళం వెయ్యకపోవడం వ్యక్తిగత ఆస్తిని చలసాని ద్వేషిస్తున్నాడనడానికి చిహ్నం. దొంగలు పడితే ఏం దోచుకుంటారు? పుస్తకాలే కదా! అనుకున్నాడేమో. కాని, పుస్తకాలే చలసాని ఆస్తి. అయితే ఆ పుస్తకాలను ఆయనెప్పుడూ సొంత ఆస్తిలా భావించలేదు. అవి తిరిగొస్తాయా లేదా అని ఆలోచించకుండా వాటితో అవసరం ఉన్న వాళ్ళకు ఎన్ని పుస్తకాలైనా ఇచ్చేవాడు. పుస్తకం అంటే చలసానికి ఎంత ప్రేమో, అవి అందరికీ ఉపయోగపడాలని అంతగా అనుకునేవాడు. ఆనందం కోసం, ఔన్నత్యం కోసం పురోగమించే మానవుడు చూపించిన మహిమల్లో కల్లా మహత్తరమైంది పుస్తకం అని గోర్కీ అన్న మాటను చలసాని తన జీవితానికి 'మోటో'గా భావించాడు. లేకపోతే యాభై వేలకు పైగా పుస్తకాల్ని ఒక వ్యక్తి సేకరించగలడా! 83 సంవత్సరాల వయసులో కూడా వాటితో సహజీవనం చెయ్యగలడా!

సమాజ హృదయమే సాహిత్యం అన్న గోర్కీ మాటను కూడా తన సాహిత్య కృషికి ఆలంబన చేసుకున్నాడు చలసాని. గోర్కీ సాహిత్య వ్యాసాల్ని తన సొంత రచనలే అనిపించేంత హాయిగా అను వదించాడు.

శ్రీశ్రీ అంటే చలసానికి పంచ ప్రాణాలు. ఎవరైనా శ్రీశ్రీని విమర్శిస్తే, పర్సనల్‌గా హర్ట్ అవుతానని చెప్పుకున్నాడు. ఇది బలహీనత కదా అన్నా ఒప్పుకోడు. అలా ఒప్పుకోకపోవడంలో ఆయన బలహీనతే కాదు, ఆయన బలం కూడా ఉంది. ఆయనే అన్నట్టు శ్రీశ్రీతో తనకున్న అనుబంధం గురించి చెప్పాలంటే వందల పేజీల గ్రంథం అవుతుంది. ఇది బలహీనత. మార్క్సిస్టు తాత్వికతను కవిత్వంలో రంగరించి అద్భుతంగా వ్యక్తీకరించిన ఘనత శ్రీశ్రీది. ఇది చలసాని బలం.

సమాజాన్ని మార్చే కృషిలో సాహిత్యానికి ఎంతో కొంత పాత్ర ఉంటుందన్నది చలసాని నమ్మకం. ఈ నమ్మకం కేవలం నమ్మకం కాదు. హేతుబద్ధమైన నమ్మకం. సమాజ పురోగమనానికి ఎంతో కొంత తోడ్పడే అలాంటి సాహిత్యంతో చలసానికి గాఢమైన అనుబంధం ఉంది. అయితే ఉద్యమ ప్రభావం లేకుండా సాహిత్యం నిర్ణయాత్మకమైన పాత్ర నిర్వర్తించలేదని కూడా చలసానికి తెలుసు. 'ప్రజా రాజకీయాల ప్రభావంతో సాగే సాహిత్య ఉద్యమంలో నేను భాగస్వామిని' (చలసాని ప్రసాద్ రచనలు. పుట - 222) అని ఆత్మ విశ్వాసంతో, ఆత్మ సంతృప్తితో చెప్పుకున్నాడు. అలా చెప్పుకోగలిగే విధంగా తన జీవితాన్ని మలుచుకున్నాడు. విప్లవం లాగే సాహిత్యానిది కూడా సుదీర్ఘ పోరాటమేనని అనేక సందర్భాల్లో పేర్కొన్నాడు.

రచయిత సమాజానికి గుండెలాంటి వాడని, గుండె చేసే పని రచయిత చెయ్యాలని చలసాని అభిప్రాయం. అంటే - చెడు రక్తాన్ని స్వీకరించి, శుద్ధి చేసి, అన్ని అవయవాలకూ సరఫరా చెయ్యడం గుండెపని. అలాగే రచయిత కూడా ప్రజలలోని అశాస్త్రీయ భావాన్ని సంస్కరించి, విప్లవీకరించి సమాజాన్ని గురించి సరైన రీతిలో అవగాహన చేసుకుని ముందుకు నడిపించడానికి ఉపయోగపడాలి. అలా ఉపయోగపడిన విప్లవ రచయిత చలసాని ప్రసాద్.

చలసాని బలంగా నమ్మిన అభిప్రాయం ఆయన మాటల్లోనే - 'సకల సంపదలు సకల జనానికీ ఎలా చెందాలో అలాగే భాష, సాహిత్యం, కవిత్వం అన్నీ అందరికీ చెందాలి. ఏనాటికైనా ఈ మార్పు రావాలి. సాహిత్య సంఘాలు ఈ మార్పుకి దోహదం చేస్తాయి.'

ఆతడనేక యుద్ధముల....

కాకరాల

భావన :
'విరిగి పెరిగితి పెరిగి విరిగితి
కష్టసుఖముల సారమెరిగితి'
- గురజాడ

వస్తుగత విశ్లేషణ :

మహాకవి మాటల సారం వ్యక్తిజీవితానికి, సంస్థ జీవితానికి, వ్యవస్థ జీవితానికి, వెరసి చరిత్ర గతికి వర్తిస్తుంది. వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ జీవన వలయాలను పరిశీలించి చూస్తే, కనిపిస్తున్న యాంత్రిక వృత్తంలో - కనగలవారికి కనిపిస్తుంది 'శంఖావృత్తం'.

ప్రకృతి సహజాతమైన 'శంఖావృత్తం' జీవితంలో లేనిదెక్కడ?

* * *

చెప్పే విషయం :

చలసాని మరణ వార్త నా మీద పిడుగులా పడింది.

క్షణం సేపు అంతా శూన్యం. నిస్సత్తువ ఆవరించింది. ఆతని జ్ఞాపకాలే నాలో సుడులు తిరుగుతున్నాయి. కృష్ణ నిర్యాణం నుంచి వచ్చిన అర్జునుడు. ధర్మజానితో 'మన సారధి మన సచివుడు... మనలను విడనాడి చనియె మనుజాధీశా' అన్న పద్య పాదాలు నాగుండె గూడపట్టుని కదిలించాయి.

నాకు సంబంధించి డా॥ రాజారావుగారి మరణం తరువాత రోజుల తరబడి కదిలించి కలత పెట్టినది సి.పి. మరణమే. నాకు లేని ముందు చూపుని అందుకునేందుకు దోహదం చేసిన సచివులెందరో ఉన్నారు. నా నిరంతర సాధనకు చెయ్యిపట్టుక దారి చూపిన నలుగురైదుగురు సారథుల్లో చలసాని ముఖ్యుడు.

ప్రత్యగాత్మగారి 'చిలకా గోరింక'కి పని చేసినప్పుడు మా తొలిపరిచయం. హరి అను హరిపురుషోత్తమరావు కూడా అప్పుడే పరిచయం. కుడి ఎడమగా నాకు సమాంతరంగా కలిసి వచ్చిన సినిమాలు 'రంగుల రాట్నం', 'చిలకా గోరింక'. అవి నటుడుగా చీకట్లో ఉన్న నన్ను వెలుగులోకి తెచ్చిన చిత్రాలు.

అక్కణ్ణించి నా ప్రయాణం నక్సల్‌బరీ వెలుగులో పడుతూ లేస్తూ సాగింది.

* * *

విషయ నేపథ్యం :

నక్సల్‌బరీ వెలుగులో అంటే వర్గపోరాటాల వెలుగులో అని అర్థం.

నక్సల్‌బరీకి ఓ ప్రత్యేకత ఉంది.

అది ఢంకా బజాయించి తనేమిటో, తన శక్తేమిటో, తన స్వభావమేమిటో ప్రకటించడం. 'తిరిగి తిరిగొచ్చింది నక్సల్‌బరీ. మళ్ళీ తిరిగొచ్చింది నక్సల్‌బరీ. మరణమే లేదంది నక్సల్‌బరీ' అని ప్రకటించడమే కాదు. ప్రకటించినట్టుగా వచ్చి, బరిగీసి బాహా బాహి పోరాడి, తనేమిటో తన శక్తేమిటో తన స్వభావమేమిటో నిరూపించి నిలబడడం.

విశిష్టత కూడా ఉంది.

సమాంతరంగా సమాజావసరం కోసం, సమాజ పురోగతి కోసం అదే వ్యక్తులతో శక్తులతో చెట్టాపట్టాలేసుకుని అలాయ్ బలాయి లాడ్డం. ప్రత్యామ్నాయంగా కొనసాగడం.

సమాజ వర్గ పోరాటానికి సాహిత్య వర్గపోరాటానికి
ఇదే సూత్రం. సూత్రం ఇదే.
ఆ మాత్రం తెలియదూ...
నువ్వు ఏమరితే శత్రువు గెలుస్తాడు
శత్రువు ఏమరితే నువ్వు గెలుస్తావు
అంతే, తృటిలో నిర్ణయమవుతుంది.
అంతే అదంతే క్షణంలో సగం
పదార్థం నుంచి చైతన్యం చైతన్యం పదార్థంలోకి
వర్గ పోరాటానికి విప్లవ గతితర్కమే ఒప్పుతుంది
శుద్ధ పరిశుద్ధాత్మ తర్కం నప్పదు, ఒప్పదు, ఒప్పవద్దు

అయిదేళ్ళ బాల్యం తప్పటడడుగుల నుంచి
ఎనభై మూడేళ్ళ వార్ధక్య గంభీర గమనం వరకూ
తెలంగాణా సాయుధ పోరాట కాలం నుంచి
దండకారణ్య ప్రజాయుద్ధ కాలం వరకూ
అనేక సాహిత్య యుద్ధముల ఆరితేరిన వృద్ధమూర్తి
చలసాని ప్రసాదుకీ విశ్లేషణాత్మక వివరణ వర్తిస్తుంది.

* * *

చలసాని 'చిలకా గోరింక' తరువాత కలిసిందెప్పుడు? ఎక్కడ? ఆ తరువాత అతనూ, విశాఖలో ఉద్యోగంలో స్థిరపడ్డారు. మదరాసుకి ఒచ్చిపోయేవారు. ప్రత్యగాత్మ వారింట్లో అలా కనిపించి ఇలా ఫ్లైయింగ్ స్మయిల్ విసిరి వెళ్ళిన గుర్తుంది. హరి అప్పుడప్పుడు మద్రాసుకొచ్చి మాట్లాడిన గుర్తూ ఉంది.

ఇద్దరికీ ఒక పోలిక ఉంది. సినిమాయో, సాహిత్యమో, రాజకీయమో తప్ప కుటుంబం సంగతులు గాని వ్యక్తిగత విషయాలు గాని మాట్లాడేవారు కాదు.జాతుల సెమినారప్పుడో, లేక మరొకప్పుడో మద్రాసు వాణీ మహల్లో రెండు మూడు రోజులు జెయన్నెమ్ ప్రదర్శనలు జరిగాయి. గద్దర్ 'రగల్ జెండా, వంగపండు, భూమి భాగోతం' వేశారు. అప్పుడు ప్రసాద్ కలిశారు. నవత భూబాగోతంలో వేషం వేసింది - రైతు కూతురుగా.

గద్దర్, వంగపండు, సంజీవ్, దివాకర్, నర్సింగ్, నవత ఇలా జెఎన్నెమ్ సభ్యులతో ప్రదర్శనలు జగజ్జేగీయమానంగా జరిగాయి. చలసాని ప్రసాదును మళ్ళీ కలిసింది అప్పుడేనని స్పష్టంగా చెప్పగలను. ఆ తరువాత ఎప్పుడు ఎక్కడ కల్సినా ముందు 'స్మయిల్'తో పలకరించి తరువాత యోగక్షేమాలు విచారించడం అతని అలవాటు.

అన్నట్టు 'చిలకా గోరింక' విడుదలయ్యాక అతను కలవక పోవడానికి కారణం ఉంది. హరి, ప్రసాదు నక్సల్‌బరీ సాహిత్య యుద్ధంలో నిబద్ధతతో నిమగ్నమై పని చేస్తున్నారు. అందుకు బీజాలు శ్రీశ్రీ సన్మానం నుంచీ ఉన్నాయి. అసలు 1967 మేలో 'నక్సల్‌బరీ విస్ఫోటనం' ఆసేతు శీతాచలాన్ని కదిలించి నిద్ర లేపింది. శ్రీకాకుళ వసంత మేఘ గర్జనకి మరోసారి దేశం - ఉలిక్కిపడింది.

ఆ సంతోష సంక్షుభిత సమయాల్లో అంతకు ముందు ఏ కవికీ జరగనంతగా మహాకవి శ్రీశ్రీని సన్మానించాలని విశాఖ - విప్లవ శాఖ - నిర్ణయం తీసుకుంది. ఆ మహత్తర బృహత్తర కార్యానికి సెంటర్, జీవధాతువు - సి.పి. అను చలసాని ప్రసాద్.

ఇక అతను ఎవరికైనా, ఎక్కడైనా, ఎందుకు కనిపిస్తారు.

అప్పుడే విశాఖ 'నాట్యభారతి', 'నిజం' నాటకంతో రా.వి. శాస్త్రి మద్రాసుకు వచ్చారు. మర్నాడు జి. రామినీడుగారి ఆఫీసులో సాహిత్య సమావేశం జరిగింది. శాస్త్రిగార్ని చూడాలని వినాలని వెళ్ళాను. సమావేశం అయ్యాక రావుగోపాలరావు శాస్త్రి గారిని మర్నాడు కొకు గారింటికి తీసుకు వెళ్ళాలన్నాడు.

మర్నాడు శాస్త్రిగారిని సతీసమేతంగా కొకు గారింటికి తీసుకువెళ్ళాను.

ఆ తరువాత విశాఖలో శ్రీశ్రీ సన్మానం. విశాఖ విద్యార్థులు 'రచయితలారా! మీరెటువైపు? అన్న ప్రశ్నని సంధించారు. సన్మాన సభలో అలజడి, ఆందోళన. సాహిత్య లోకంలో తుఫానుల తుపాకి గాలుల అనంతర పరిణామాలూ - 'విరసం' ఆవిర్భావం అందరికీ తెలుసు.

* * *

నా చిన్నతనం నుంచి నాది చేతకాని ఈత. నా పరిమిత పరిజ్ఞానంలో కొందరు నటీనటుల్ని కలుపుకుని 'నాటికలు' వేస్తున్నాను. 1969లో కవి రాజు త్రిపురనేని రామస్వామి చౌదరి శతజయంతి. సభ పి.వి. రాజమన్నార్, కూర్మా వేణుగోపాలస్వామి ఆ సభకి అధ్యక్ష కార్యదర్శులు.

ఆ సభానంతరం కవిరాజు 'ఖూనీ' నాటకంలోని ఆఖరి దృశ్యం నా దర్శకత్వంలో వేయాలన్నారు. అందుకు అవసరమైన కళాకారుల్ని కలుపుకుని సోషల్ & కల్చరల్ క్లబ్‌లో ఆ దృశ్యాన్ని ప్రదర్శించాం. ఆ సంవత్సరమే విజయవాడలో ఎబికె నిర్వహణలో 'జనశక్తి' మహాసభలు జరిగాయి, వల్లంతో కలిసి ఆ సభలకి వెళ్ళాను.

ఆ వేదిక మీదే సుబ్బారావు పాణిగ్రాహిని మొదటిసారి చూశాను. 'ఎరుపంటే కొందరికి భయం భయం' పాట విన్నాను. వల్లంతో కలిసి మాట్లాడాను. నాకు అదే ఆఖరి చూపు కూడా అయింది. 1970లో 'విరసం' ఆవిర్భావం జరిగింది.

'విరసం' రచయితల - ముఖ్యంగా కొకు, శ్రీశ్రీ, రావిశాస్త్రి, కెవిఆర్‌ల - రచనలను చదువుతూ నా అవగాహనని పెంచుకుంటూ వస్తున్నాను. 1972 టి నగర్ 'ఇస్కస్' శాఖ, నగర శాఖ కలిసి లెనిన్ శత జయంతిని చేయాలనుకున్నాయి. ఆ సందర్భంగా దర్శకత్వంలో అలెగ్జాండర్ పొగిదిన్ రచించిన కొండేపూడి అనువదించిన 'క్రెమ్లిన్ గంటలు' నాటకాన్ని ప్రదర్శించాలన్నారు.

ఏప్రిల్ 22న మద్రాసు సోషల్ & కల్చరల్ క్లబ్‌లో ఆ నాటకాన్ని ప్రదర్శించాం.

ప్రదర్శన విజయవంతమైంది. ప్రేక్షకులు ప్రశంసించారు. పత్రికలు సమీక్షలు రాస్తూ నేను వేసిన 'లెనిన్' పాత్రని గురించి ప్రత్యేకంగా పేర్కొన్నాయి. లెనిన్ పాత్ర ప్రాధాన్యంగా వచ్చిన నాటకాల్లో దక్షిణ భారతంలో ఇదే ప్రథమం అని అన్నాయి. చివరి దృశ్యంలోని హెచ్.జి.వెల్స్. లెనిన్ పాత్రల సంభాషణలు విరుద్ధ దృక్పథాన్నించివచ్చి ఆసక్తిని కల్గించడమే కాదు, వైజ్ఞానికంగా ఆలోచింపజేసేలా ఉన్నాయని రాశారు.

ఆ నాటకం 'విప్లవ పునర్నిర్మాణానికి కార్మిక వర్గ నియంతృత్వం' ఎంత అవసరమో ముందు దృశ్యమానం చేసింది. చివర్లో హెచ్.జి.వెల్స్. లెనిన్ సంభాషణల ద్వారా వక్కాణించిందని నా ఉద్దేశం. ఈ విజయాన్ని చూసిన కళాకారులు డా॥ రాజారావుగారి పేర ఒక నాటక సంస్థగా ఏర్పడ్డారు. ఆ సంస్థ ఆ దశాబ్దం చివరి దాకా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది.

'మా భూమి' సినిమా షూటింగ్స్ పూర్తయ్యాక మేం చేసిన ఒక కార్యక్రమానికి కె.వి.ఆర్. వచ్చారు. హైదరాబాదులో జరగబోయే 'విరసం' సభలకి రమ్మని పిలిచారు. విరసం పుట్టిన పదేళ్ళకి వెళ్ళగలిగానన్న తృప్తి, సంతోషం కలిగాయి. మద్రాసు వాణీ మహల్ జె.ఎన్.ఎమ్. కార్యక్రమాల నాటికి సాన్నిహిత్యం బాగా పెరిగింది.

కె.వి.ఆర్. ఎఐఎల్ఆర్‌సిలో వ్యక్తిగత సభ్యత్వాలు కూడా ఉన్నాయి. మీరు చేరాలనుకుంటే చేరవచ్చునన్నారు. సభ్యత్వం తీసుకుని ఢిల్లీ సభలకి వెళ్ళాను. అక్కణ్ణించి ఎఐఎల్ఆర్‌సి సభ్యుడుగా కొనసాగాను. ఈ పరిణామాల వల్ల హరి, ప్రసాద్ కాదు రాష్ట్రంలోనూ రాష్ట్రేతరంగానూ చాలా మంది సన్నిహితం అయ్యారు. హరి, ప్రసాద్ ఇంకా సన్నిహితమయ్యే అవకాశాలు వచ్చాయి.

హరి మద్రాసు వచ్చినా నేను హైదరాబాద్ వెళ్ళినా వీధుల్లో తిరుగుతూ మాట్లాడుకున్న సందర్భాలే ఎక్కువ. హరితో అలా తిరుగుతూ మాట్లాడడం గిరీశం అన్నట్టు ఓ ఎడ్యుకేషనే. తిరిగింది హైదరాబాదైనా, మదరాసైనా, విశాఖైనా, 'విముక్తి కోసం' సినిమా షూటింగ్స్‌కి వెళ్ళిన చిన మేరంగి, పెద మేరంగి పల్లెలైనా అడవులైనా ఆయన మాట్లాడిన విషయాలు - నా మెదడుని పదునెక్కించినవే. ముఖ్యంగా సాహిత్యం, కళలు, రాజకీయాలను గతితార్కిక దృష్టి నుంచి ఎలా చూడవచ్చునో, చూడగల్గితే ఆ లోతులెలా తెలుస్తాయో వివరించారు.

చలసానితో నా సాన్నిహిత్యానుభవాలు ఇందుకు పూర్తిగా భిన్నం.

అతన్ని నేను సాధారణంగా కల్సింది నేను విశాఖ వెళ్ళినప్పుడు మాత్రమే. లేదా అతనెప్పుడైనా మా ఇంటికొస్తేనో, సాహిత్య సభల్లో కలిసి ఉన్నపుడో మాత్రమే. ఏమైనా హరిలా నాతో అతిగా మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ. ఓ సారి కారా మాస్టారి సంతకంతో 'మనలో మనం' సంకలనానికి సినిమా మీద వ్యాసం రాయమని ఉత్తరం వచ్చింది. నాకు సాహిత్య ప్రక్రియల మీద సాధికారత కల్లోమాట. వ్యాసం రాయడమే కష్టం. ఎంత కష్టపడ్డా పట్టుబడలేదు.

అయినా తెల్సిన విషయమని ప్రారంభించి అతికష్టం మీద పూర్తి చేసి పంపించాను.

'మనలో మనం' రాగానే ముందు నా వ్యాసం చూసుకున్నాను. ఆశ్చర్యం వేసింది. ఇంచుమించు నేను రాసిందే. అయినా ఆద్యంతాలు అర్థవంతంగా అమరడం వల్ల దానికో రూపు, రేఖా విలాసం వచ్చాయి. ఈ మార్పు వెనక సిపి హస్త నైపుణ్యం ఉందని నాకనిపించింది. అదీ సిపి ప్రత్యేకత. ఊరికే నోటిలో చెబుతూపోడు. చేసి చూపిస్తాడు. సాధకుడు గ్రహించుకోవాలి. అదీ విషయం.

అతను మామూలుగా మాట్లాడినా, ఫోన్లో మాట్లాడినా ముక్తసరిగా విషయం మాట్లాడి ముగించేస్తారు. ఫోన్లో అయితే ఫోను పెట్టేస్తారు. అంతా టెలిగ్రాఫిక్ కోడ్స్ భాష. సాధకులు 'బిట్వీన్ ది లైన్స్' నుంచి గ్రహించుకోవాలి. తోడుకున్న వారికి తోడుకున్నంత.

'కన్యాశుల్కం' తొలి కూర్పు శత జయంతి సభలు గ్రామ గ్రామాన చేస్తున్నారు. మీరు 'కన్యాశుల్కం - చిల్లర పాత్రలు' రాస్తున్నారు. ముందు మాట్లాడుతున్నారు అన్నారు. అదీ నా చేతకాని ఈత నుంచి విస్మృతంగానే వచ్చింది. మరో శీర్షికతో 'ప్రజాసాహితి'కి రాశాను. అది కూడా అలాగే వచ్చింది.

మారుతీరావు కొడుకు శ్రీనివాస్ తీస్తూ పోయిన సినిమాని పూర్తి చేస్తున్నారు. ఆ పని మీద విశాఖ వచ్చి హోటల్లో ఉన్నాము. ప్రసాదూ నేనూ వెళ్ళి శాస్త్రి గారిని కలవాలనుకున్నాం. ఊహించని విధంగా ప్రసాద్ శాస్త్రిగారిని తీసుకుని హోటలు కొచ్చేశారు. నా గుండె గతుక్కుమంది. ముగ్గురం లాన్లో కూచుని మాట్లాడుకుంటున్నాం.

శాస్త్రిగారు 'మీ వ్యాసం చదివాను. బాగుంది. కష్టపడి చాలా పెద్దది రాశారు. కానీ మీ పరిశీలనలు కొన్ని చాలా బాగున్నాయి' అని ఆయన కన్యాశుల్కం గురించి పరవశించి పలవరిస్తున్నారు. మేం మాట్లాడకుండా ఆయన్ని శ్రద్ధగా వింటున్నాం.

సాయంకాలమైంది.... మహాకవి ఆ నాటకాన్ని ఆ మాటతో మొదలెట్టారు. ఆ మాట అన్నవాడెవడు? ఎక్కడ నిలబడ్డాడు? ఆడెనకేవుంది? ఇలాటివన్నీ ఆలోచిస్తే - సాయం కాలమైంది ఆ రోజుకి మాత్రమే కాదు. ఒకానొక శిథిల వ్యవస్థకి సాయంకాలమైంది అని స్ఫురించదా? అన్నారు. ఆయన అలా ఆ నాటకం గురించి మాట్లాడుతూనే ఉన్నారు.

శ్రద్ధగా వింటూనే నేను ఆలోచనలో పడ్డాను. ఆయన అన్న ఆ మాటల సారం నాటకం ఆరంభానికి ముందున్న పూర్వ చరిత్రని ముగింపు తరువాతున్న ఉత్తరోత్తర చరిత్రని సూచిస్తూ - కన్యాశుల్కం జీవితమంత విశాలమైందన్న శ్రీశ్రీ మాటల్ని గుర్తుచేస్తున్నాయి. అంతేకాదు. పాత్రల సంభాషణల్లో కనిపిస్తోన్న అర్థాల వెనక స్ఫురించే విషయాలెన్నో ఉన్నాయని తెలుస్తోంది. ప్రయోక్త రచయిత ఆ నాటకానికి అమర్చిన సంవిధానాన్ని సదవగాహన చేసుకుని, ఆ సంభాషణల వెనక స్ఫురిస్తున్న విషయాన్ని సమీక్షిస్తూ, ప్రేక్షకుల్ని పరిశోధకుల స్థాయికి పెంచేలా ప్రదర్శించగల్గితే - చివరికి రచయిత నిర్దేశించిన అంతరార్థం స్ఫురించదా?

అవుతుందనిపించి గురజాడ ఇచ్చిన క్లూలు - శాస్త్రిగారు చెప్పిన 'సాయం కాలమైంది' లాంటి వాటిని - చూపిస్తూ వ్యాసాలు ఎవరైనా తెలిసిన వాళ్ళు రాస్తే బాగుండనుకున్నాను. ఆ ఆశ కనిపించక నా చేతకాని ఈతతో ఒకటో రెండో నేనే రాశాను. చెప్పొచ్చేదేమిటంటే నిప్పు తగిలించి వదిలేస్తారు ప్రసాదు. అంతే. సాధకుని పాట్లు సాధకులు పడాల్సిందే. ఇలా ప్రసాదు వల్ల నాకు ఎంత మేలు జరుగుతూ వచ్చిందో మాటలతో చెప్పలేను.

కన్యాశుల్కం నాటకంలాగే చలసాని ప్రసాదు చాలా లోతైన మనిషి. మిలిటెంటుగా సమిష్టి కోసం వెయ్యి చేతుల పనిని మూడో కంటికి కనిపించకుండా చెయ్యగలడు. అదే తన వ్యక్తిగత విషయం వస్తే - ముందూ వెనకా చూడకుండా లిబరల్‌గా ఇచ్చి తరువాత పీకల మీదికి తెచ్చుకోగలరు. అతనిలో సమిష్టికి ప్రాణమిచ్చి పని చేసే కార్యకర్త ఉన్నాడు. వ్యక్తిని నమ్మితే గుడ్డిగా నమ్మి పరవశించి సాయం చేసి పీకల మీదికి తెచ్చుకునే అమాయక వ్యక్తీ ఉన్నారు.

ఎటొచ్చీ మొదటిది మెండుగా ఉంది. రెండోది బెండులా ఏదో మేరకి అతని కాళ్ళకే అడ్డుపడేలా ఉంది.

సమాజం మొదటి దానికే శిరసొంచి పిడికిలెత్తి జోహార్లు చెబుతోంది.

కన్యాశుల్కం మొత్తం నాటకాన్ని వ్యయ ప్రయాసలకోర్చి మూడు నగరాల్లో ఆడించారు ప్రసాదు. కవి హృదయమైన అంతరార్థ విశదీకరణ గురించి ఎంత చెప్పినా పట్టించుకోలేదు సరే. 'తాంబూలాలిచ్చాను తన్నుకు చావండని' చెప్పా పెట్టకుండా తిరిగి రాని చోటికి వెళ్ళిపోయారు. తీరాచూస్తే ఆయన అనువదించిన 'తత్వశాస్త్ర మాయాజాలం' కాదు అన్న పుస్తకంలో 'రెండు పంథాల (సోషలిస్టు పంథా - పెట్టుబడిదారీ పంథా) పోరాట సారంగా - స్ఫురిస్తున్నది మహాకవి గురజాడ చేసిన హెచ్చరికే.

సమాజంలో వ్యక్తి సమిష్టుల మధ్య 'వ్యక్తి' వాదులదేపై చేయై ముందు సోవియట్ రష్యా తరువాత జన చైనా - ఆపైన ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమమే కూలిపోయి అవశేషాలతో మిగిలింది. గ్లోబలైజేషన్ మార్కెట్ మొగసాల మీదకెక్కి 'నాపేరు గిరీశమే నినద భీషణ శంకము దేవదత్తమే' అని దేశదేశాల గిరీశాలు విజయ శంఖాలను పూరిస్తున్నారు.

ప్రపంచంలోని సోషలిస్టు పంథా సమిష్టిని గెలిపించడానికి జీవన్మరణ పోరాటాలు చేస్తోంది.

ఈ చారిత్రక సందర్భంలో నాకు 'విశ్వరూప' సందర్శనమైంది. అది ఆధ్యాత్మిక విశ్వరూప సందర్శనం కాదు. అందులో కనిపించని ఆత్మ కనిపించని పరమాత్మలో ఐక్యమవుతుంది. ఇది చారిత్రక విశ్వరూప సందర్శనం. ఇది తాత్విక చరిత్రని గతితార్కికంగా చూసి విశ్వసించి, జీవితాన్ని ప్రాణాల్ని పణంగా పెట్టి 'ముందుచూపు'తో ముందడుగు వేసి - సమాజాల్ని ముందుకు నడిపించి జీవితాల్ని చరితార్థం చేసుకునేది.

విశ్వరూప సందర్శనంలోంచి మన చలసాని ప్రసాద్!

సంఘ జీవితం మొదలయ్యాక మానవజాతి మేలైన జీవితాన్ని కలగన్నది. ఆటవిక అనాగరిక వ్యవస్థల్లోనే శ్రమైక జీవనం నుంచి సమిష్టి జీవన విలువలు ఉత్పత్తి చెందాయి. ఆ కాలాన్నే శాస్త్రవేత్తలు 'ఆదిమ కమ్యూనిజం' అన్నారు.

నాగరికత రెండంచుల కత్తి. అది సమిష్టి జీవన విలువల్ని విధ్వంసం చేస్తూ - వేగంగా వృద్ధి చెందుతోంది. అదే సమయంలో అంతకన్నా ఉన్నతమైన సమిష్టి జీవన విలువలు గల, సమాజాన్ని నిర్మించే ప్రాతిపదికలను సృష్టిస్తూ వస్తోంది...

ఆదిమ వ్యవసాయ నాగరికత నుంచి ఆధునిక పారిశ్రామిక నాగరికత వరకూ 'విధ్వంసం' 'నిర్మాణం' జమిలిగా జరుగుతూ వస్తున్నాయి. పాలక వర్గాలే 'విధ్వంస' ప్రతినిధులు. నిర్మాణ ప్రాతిపదికలు మాత్రం శ్రామిక వర్గాలే. చరిత్రలో ఈ 'వర్గ-బాహువుల ఉగ్ర సంఘర్షణ' కొనసాగుతూ వస్తోంది.

అయితే, ఆధునిక పారిశ్రామిక నాగరికతలోనే శ్రామికవర్గాల నుంచి చైతన్యపరంగా ఎదిగిన కార్మిక వర్గం 'భువన భవనపు బావుటాయై పైకి లేస్తాను' అని - 'జయభేరి' మోగించింది.

ఇక్కణ్నించే వర్గపోరాటాలు తీవ్రమవుతున్నాయి.

పారిస్ కమ్యూన్ నిర్మాణం జరిగింది. డెబ్బయి రోజుల్లో 'విధ్వంసం' చేయబడింది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచ సామ్రాజ్యవాదమైంది. అది ప్రపంచ ప్రజల నెత్తిమీద 'మృత్యువై' - స్వైరవిహారం చేస్తోంది. మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. దాన్నించే 'తొలి సోషలిస్ట్ సోవియట్ యూనియన్' నిర్మాణమైంది.

అదే స్థాయి జీవితమైనా - వృత్తి నుంచి వ్యవస్థ వరకూ - విధ్వంసం చేయడం చాలా సులువు. నిర్మాణం భూగోళమంత బరువైన బండల్ని కేవలం మానక శ్రమతో ఎవరెస్టు శిఖరాగ్రం మీదికి యెక్కించడం కన్నా కష్టతరమైన పని. అసలిప్పుడు ప్రపంచం సామ్రాజ్యవాద సాలిగూడు అల్లికలో ఇరుక్కుపోయిందే - ఇప్పుడేమవుతుంది?

విరిగి ముక్కలై బూడిదై పోతుంది. ఆ బూడిదలోంచే - మరో ప్రపంచం రెక్క విప్పే క్రమం మొదలైపోతుంది.

ఇందుకు మానవ చరిత్ర నిండా సాక్ష్యాలున్నాయి.

మచ్చుకు ఒక్కటి చూస్తే చాలు. మహీధర సోదరులు 'ది జెయింట్ వైడెన్స్ హిజ్ వరల్డ్' గ్రంథాన్ని 'జనులు మహాజనులు' పేరుతో తెలుగులోకి అనువదించారు. అందులో పాలక వర్గ ప్రభుత్వాలు 'విధ్వంసం' చేస్తుంటే ప్రజాశక్తులు - శ్రామిక వర్గాలు - ప్రాణాల్ని జీవితాల్ని పణంగా పెట్టి అమూల్య జ్ఞాన సంపదల్ని రక్షించి సంరక్షిస్తూ దేశం నుంచి దేశానికి మారుతూ - తొలి సోషలిస్ట్ రాజ్యావతరణ వరకూ వచ్చారు.

అయితే, ప్రజాశక్తుల విజయాలకు ఎక్కడైనా ఓ షరతు ఉంది.

విప్లవ ప్రాధాన్యం గల సమాజం పోరాటానికి ఉద్యమకారుల్ని ప్రజల్ని కదిలించి వెన్నుదన్నుగా నిలిచి నిలబెట్టగల మేధావుల కృషి కలిసి రావాలి. ఇటలీ పునరుజ్జీవన కాలంలో 'డాంటే'లా ఫ్రెంచి విప్లవంలో వాల్టేర్, రూసోల్లా, పారిస్ కమ్యూన్‌లో ఆ పోరాటానికి తాత్విక సమర్థన నిచ్చిన మార్క్స్ ఏంగిల్స్‌లా ముందుకు రావాలి మేధావులు.

వీరందరూ జ్ఞాతంగా అజ్ఞాతంగా ఆయా కాలాల్లో పనిచేసిన అసంఖ్యాక ప్రజాశక్తులకు ప్రతీకలై చరిత్రలో నిలిచినవారు. ప్రజాశక్తుల్లోని ప్రతి కార్యకర్తా - కర్త - కర్తవ్య - వీర్యార్జుననిలా వెయ్యి చేతులతో చేయాల్సిన పనుల్ని - రెండు చేతుల్తో మూడో కంటికి తెలియకుండా చేసినవారే -

అనేక యుద్ధముల ఆరితేరిన వృద్ధమూర్తులే.

కమిటెడ్ సోల్జర్లా చిన్నతనం నుంచి 'కమ్యూనిస్ట్ ఉద్యమం'తోనే కొనసాగి, అనేక సాహిత్య యుద్ధముల ఆరితేరిన వృద్ధ మూర్తిగా జీవితాన్ని చరితార్థం చేసుకుని అమరుడైన కామ్రేడ్ చలసాని ప్రసాద్, కనగల వారికి ఆ ప్రజాశక్తుల్లో కనిపిస్తారు. వ్యక్తికి బహువచనం శక్తి అన్న శ్రీశ్రీకి అసలైన వారుసుడుగా.

అతని శాశ్వత చిరునామా అయిన 'యూజిన్ పాటియార్ ఇంటర్నేషనల్లో' కాస్త నిశితంగా చూడండి. చెరగని చిరునవ్వుతో ప్రజాశక్తుల మధ్య తిరుగుతూ ముందు చేయెత్తి పిడికిలి బిగించి - చెయ్యి ఊపుతూ పలకరిస్తాడు.

'అతడు అనేక యుద్ధముల ఆరియు తేరిన వృద్ధమూర్తి'
పురోగమన శీలమైంది కాలం
పశ్చాద్భృక్కుల ప్రగల్భఘోషలను లక్ష్యపెట్టక
మహోదయం దిక్కుగా క్రాంతి రథం కదిలిపోతుంది'

- మహాకవి శ్రీశ్రీ.

అలసిన చలసాని

సంగ్రామ్

శీత కన్నేశారు
శీతలం కమ్మింది
చేతగాని వాడినని
ఒంటరిని చేసితిరి
తోచి తోచనివానిగా
చూచి చూచి ఊరకున్నా.

ఉలుకు లేదు
పలుకు లేదు
యాడబోతివి
ఏటి చేస్తివి?

చలసాని కోరిన పత్రికలు ఇక్కడ లంకా సూర్యనారాయణ గారి స్వంత గ్రంధాలయంలో తీసుకొని ఫోటోస్టాట్ చేసి పంపడం కాస్త అలస్యమైనందుకు 13-2-2008లో నాకు రాసిన ఉత్తరం ఇది. చలసాని మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన రూపం, మాట, పాట అయన్ను తలచుకుంటేనే రూపు కడతాడు. చలసాని మనుష్యుల్ని, పుస్తకాల్ని మక్కువతో అక్కున చేర్చుకున్నాడు. మంచి ఉపాధ్యాయుడు. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని కార్యకర్తలకు అరటిపండు ఒలిచిపెట్టినట్లు చెప్పేవాడు. నేను 1977 చీరాల విరసం సభల్నుండి సభ్యుడిగా కొనసాగుతున్నాను. 1981 అక్టోబర్ 25, 26, 27 తేదీలలో విరసం సభ్యులకు చీరాలలో తత్వశాస్త్ర క్లాసులు చెప్పాడు. ఆ క్లాసులకు మూడు యూనిట్లు - ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల సభ్యులు హాజరయ్యారు. ఆయన ఉపాధ్యాయుడు. నేను ప్రకాశం జిల్లా కన్వీనర్‌గా సమన్వయకర్తను. ఆయన క్లాసులు జరిగిన మూడు రోజులూ మాతోపాటే పాఠశాలలో గడిపారు. ఆయన తత్వశాస్త్ర పాఠాలు విన్న తరువాత నా మట్టుకు నాకు మార్క్సిస్టు తత్వశాస్త్ర గ్రంథాలు చదివితే బాగా అర్థమయ్యేయి. క్లాసులు విన్నవారి అభిప్రాయం కూడా అదే. అలా ఉండేవి వారు బోధించే తత్వశాస్త్ర పాఠాలు. ఆ క్లాసులకు అప్పటికే అజ్ఞాత రచయితగా కొన్ని నవలలు రాసిన కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి విరసం క్యాండిడేట్ సభ్యుడిగా హాజరయ్యాడు. ఆయన గెరిల్లా పత్రిక కొన్నాళ్ళు ఇంకొల్లు నుండి నడిపాడు. అందుకని ఆయన్ను గెరిల్లా రెడ్డి అనేవాళ్ళం. అయనకు చలసాని పాఠాలు చెప్పే విధానం నచ్చినా, ఉదాహరణలు ఎక్కువగా రాడికల్స్‌ను, మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీని ప్రస్తావించడం నచ్చక నవంబర్ 1981లో రాజీనామా చేశాడు. చలసాని అలా 'రాడికల్స్‌ను', 'మార్క్సిస్టు - లెనినిస్టు' పార్టీని స్వంతం చేసుకొని తన జీవితాంతం కొనసాగిన ప్రజల విప్లవ నేస్తం అని చెప్పటానికే ఈ సంఘటన ప్రస్తావన.

అలాగే 1986లో మా స్వగ్రామం అయిన ఉన్నవ గ్రామంలో 'పాట - వచన కవిత' అధ్యయన తరగతులు జరిగాయి. ఆయన కార్యదర్శిగా ఆ పాఠశాలకు ప్రిన్సిపాల్. యూనిట్ కన్వీనర్‌గా నేను సమన్వయ కర్తను. మూడు రోజులు క్లాసులు గ్రామీణ వాతావరణంలో చక్కగా జరిగాయి. కేవిఆర్, మధు, వరవరరావు, జయధీర్ తిరుమలరావు, అల్లం రాజయ్య, కృష్ణక్క మొదలగు వారంతా క్లాసులు చెప్పడం, చర్చల్లో పాల్గొనడం అదొక మరచిపోలేని అనుభూతి. అక్టోబర్ 26న ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లి రచయిత) వేదికపైన జరిగిన బహిరంగసభలో గ్రామీణుల పరిభాషలో చలసాని ఇచ్చిన ఉపన్యాసం ప్రజలను ఉత్తేజపర్చింది. క్లాసుల నుండి తిరిగి వెళ్తూ కొంత మంది ఉన్నవ గ్రామానికి ఓ మైలు దూరంలో ఉన్న తుమ్మలపాలెంలోని 'తెలంగాణా - శ్రీకాకుళం' అమర వీరుల స్థూపాలు దర్శించి వారికి శ్రద్ధాంజలి ఘటించడం ఓ మరచిపోలేని జ్ఞాపకం.

ప్రతి సభలోనూ చలసాని ఏదో ఒక క్లాసుకు అధ్యక్షత వహించడమో, ఉపన్యసించడమో పరిపాటి. కావలి సభలో ప్రజాకళారూపాలపై ఆయన ప్రసంగం మరచిపోలేనిది. ఆయనకు ఈతంటే భలే ఇష్టం. ఆలకూరపాడులో ప్రజా కళారూపాల క్లాసులు దాదాపు పదిహేను రోజులు జరిగితే ఆయన ప్రతి రోజు పంట కాలువలో ఈది ఆనందించేవాడు.

అరుణతార పత్రిక డిక్లరేషన్ 'బొమ్మారెడ్డి గారి' పేరు మీదనే ఉండి నడుస్తుండేది. దానిని బొమ్మారెడ్డి విరసానికి ఇచ్చినా డిక్లరేషన్ విరసం సభ్యుల పేరుకు మారలేదు. బొమ్మారెడ్డికి వయస్సు మీరి పోతోంది. దానికోసం చలసాని విశాఖ నుండి విజయవాడ, మచిలీపట్నం అనేకసార్లు వచ్చి ఆఫీసుల చుట్టూ తిరిగి చివరకు విరసం బాధ్యుడిగా తన పేరు మీద డిక్లరేషన్ తెచ్చుకునే సందర్భంలో ఆయన పట్టువదలని విక్రమార్కుడే. నేను ఆ సమయంలో ఆరుణతార మేనేజరుగా ఉండటంతో ప్రత్యక్షంగా చూసినవాడను.

చలసాని ఈ మధ్య తరచుగా గుంటూరు రావడంగానీ లేక ఉత్తరాలు రాయడంగానీ, జరుగుతూ ఉండేది. ఆయన గుంటూరులోని వైవిధ్యభరితమైన బహు గ్రంథసేకర్త లంకా సూర్యనారాయణను, సాహితీవేత్త పాపినేనిని, అరసం కార్యశీలుడు పెనుగొండను తరచుగా అడిగేవాడు. ఆయన తన దగ్గరలేని అనేక పత్రికల ఫోటోస్టాట్ కాపీలు పంపమనేవాడు. అలా సాహితీ, కిన్నెర, కళా, ప్రతిభ, శారద, సుజాత, వీణ, విమర్శిని మొదలైన సాహితీ పత్రికలు ఫోటోస్టాట్ తీయించి పంపడం జరిగింది. ఇప్పటి సాహిత్య పత్రికలతో పోల్చితే అవన్నీ గొప్ప పత్రికలు. వారికి పంపుతూ నేను కూడా కొన్ని ఫోటోస్టాట్ తీయించుకునేవాణ్ణి. అలా ఈ ఏడెనిమిది సంవత్సరాల్లో ఎన్ని ఫోటోస్టాట్ కాపీలు పంపానో. ఆయనకు సాహిత్యమంటే అంత ఇష్టం మరి. ఆయన పంపిన లిస్టు ప్రకారం దాదాపు 64 సాహిత్య పత్రికలు ఆయన సేకరణలో ఉన్నాయి. కొన్ని పూర్తిగా ఉన్నాయి. కొన్ని పాక్షికంగా ఉన్నాయి. ఈ మధ్యనే మే 5న గుంటూరు వచ్చారు. మా ఇంటికి వచ్చి నేను సేకరించుకున్న కొన్ని పుస్తకాలు తిరగేశారు. విరసంపై ఆరు నెలలు నిషేధం విధించినప్పుడు జరిగిన కార్యకలాపాలు రికార్డు అంటే విరసంపై ప్రభుత్వ నిషేధ ఉత్తర్వులు, దానికి విరసం నుండి ప్రభుత్వానికి ఇచ్చిన సమాధానాలు రాష్ట్రంలో ఉన్న మిగిలిన సాహితీ సంస్థలు, సాహిత్యకారులు విరసంపై నిషేధాన్ని ఖండిస్తూ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఇవన్నీ మూడు పుస్తకాలుగా తయారుచేసి ఉంచాను. నేను విరసం చరిత్ర రాస్తున్నాను. ఇవన్నీ నాకు కావాలి. అన్నీ ఒక చోట దొరకటం నాకెంతో మేలు. వాటి అన్నింటినీ ఫోట్టోస్టాట్ చేసి పంపమన్నాడు. స్టాలిన్ నిర్యాణం చెందినప్పుడు మంచి కవిత్వం రాసిన 'కరుణశ్రీ' అంటే అయనకు ప్రత్యేక అభిమానం. కరుణశ్రీ సాహిత్యం నాల్గు భాగాలుగా ఈ మధ్య గుంటూరులోని వారి కుటుంబీకులు ప్రచురించారు. ఆ నాల్గు భాగాలు కావాలని కొని తీసుకువెళ్ళారు. కొత్త సత్యన్నారాయణ సాహిత్యం కావాలని పంపమన్నారు. 'దేవీప్రియ' నడిపిన ప్రజామిత్ర పత్రికలు పంపమన్నారు. ఇలా కొన్ని పత్రికలు, పుస్తకాలు నా దగ్గరవి పంపమన్నారు. కొన్ని కట్టలు కట్టి ఉంచాను. పంపేలోపు మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఎక్కడున్నా ఆయన పుస్తక సేకరణ అగదు. మనుషుల్తో స్నేహం నిరంతరం ఆయన రచనలద్వారా కొనసాగుతూనే ఉంటుంది.

అమరుడు చలసాని ప్రసాద్ మామయ్య

నాదేళ్ళ పాపారావు

భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణా సాయుధ పోరాటం భారత దేశ చరిత్ర పుటలో శాశ్వతంగా నిలిచి ఉండే వాస్తవం.

భూస్వామ్య, పెత్తందారీ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా జరుగుబాటు గురించి తిరుగుబాటు మార్గం ఆచరించిన ప్రతి సామాన్యుడు పూజనీయుడే.

విముక్తి పోరాటాలు స్థానికతను దాటి దేశ వ్యాప్తం కావాల్సిన పరిణామ క్రమంలో తెలంగాణా ప్రజల సాయుధ పోరాటాలకు కొండంత అండగా నిలబడ్డ కోస్తా ఆంధ్రలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు పురిటిగడ్డ కృష్ణా జిల్లా దివి తాలూకా.

తెలంగాణా సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ఒక విప్లవ కెరటం అయితే దివి తాలూకాలో వీరనారి వియ్యమ్మ వెలిగించిన పోరాట జ్యోతిలో దరిదాపు నలభైమంది యోధులు అమర వీరులయ్యారు.

అమరుడు చలసాని ప్రసాద్ జన్మస్థలం కృష్ణాజిల్లా భట్లపెనుమర్రు అయినా జీవితానికి అర్థాన్ని తెలుసుకున్నది అదే జిల్లాలోని నాదేళ్ల వారి పాలెంలో. జీవితం ఎదుగుదలలో ఆర్థిక ఇబ్బందులు, కష్టనష్టాలు ఎన్ని ఎదురయినా నమ్మిన ఆశయం కోసం జీవితాంతం పోరాడిన ఆదర్శ మూర్తి మా మామయ్య చలసాని ప్రసాద్.

చలసాని బసవయ్య, వెంకటనర్సమ్మ గారి సంతానంలో అయిదవ వ్యక్తిగా జన్మించిన ప్రసాద్‌గారు మూర్తీభవించిన మానవతా దృక్పథంతో ఉన్న స్నేహశీలి.

నాదేళ్లవారి పాలెంలో చిన్నప్పటి జ్ఞాపకాలలో భాగంగా అనేక అంశాలలో ప్రసాద్ మామయ్య తన మిత్ర బృందంతో జరిపిన చర్చలు క్యారమ్‌బోర్డు ఆటతో మిత్రుల ఆనందాలు, కృష్ణానదీ స్నానాలు ఎప్పటికీ మరచిపోలేని అనుభూతులు.

ముఖ్యంగా మామయ్య కొన్న పుస్తకాలపైన హరి ప్రసాద్‌ల పేర్లు అప్పట్లో చాలా ఆశ్చర్యంగా ఉండేది.

మా తాతయ్య బసవయ్యగారి దృష్టిలో 'పుస్తకాల పురుగు'గా బిరుదునందుకున్న ప్రసాద్ మామయ్య జీవితాంతం ఎన్నో పుస్తకాలు జమ చేసి, ఒక వ్యక్తి తలచుకుంటే ఒక సంస్థను మించి పని ఎలా చేయగలరో అర్థం అవుతుంది.

ఆచరణాత్మక కమ్యూనిస్టు దృక్పథంతో మా తాతయ్య ఆలోచనలు ఆలంబనగా నాదేళ్లవారి పాలెంలో అనేక మార్పులలో భాగంగా కుటుంబ సభ్యులు సాయుధ పోరాట భాగస్వాములయ్యారు.

చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటాలకు సానుభూతిగా 'సముద్దారీ' ఉద్యోగం వదులుకున్న తాతయ్య బసవయ్యగారి కుటుంబంలో ముగ్గురు ప్రజల కోసం అమరులయ్యారు.

ప్రసాద్ మామయ్య అన్న శ్రీనివాసరావు, బాబాయి జగన్నాథరావు, బావ వెంకటకృష్ణయ్య ప్రజల కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులు.

కుటుంబ సభ్యుల త్యాగాలు పెట్టుబడిగా మార్చుకునే ప్రయత్నాలకు దూరంగా స్వంత వ్యక్తిత్వంతో, కార్యాచరణతో, విప్లవనిబద్ధతతో పనిచేసి ఎంతో మందికి ఆదర్శం అయ్యారు చలసాని ప్రసాద్.

ముఖ్యంగా మా కుటుంబం విషయంలో ప్రసాద్ మామయ్య (అమరుడు నాదేళ్ల వెంకట కృష్ణయ్యగారు మా తండ్రి) ఎంతో జాగ్రత్త వహించి మాకు జీవిత గమ్యాన్ని చూపించారు.

వైజాగ్‌లో స్థిరపడి ఒకే ఇంటిలో చాలా సంవత్సరాలు కలిసి ఉన్న వేణు మామయ్య, కృష్ణ అత్తయ్య, ప్రసాద్ మామయ్య, విజయత్త నాకు ఎప్పుడూ ఒక ఇన్‌స్పిరేషన్‌గా ఉండే వ్యక్తులే.

మేనల్లుళ్లతో స్నేహితుడిగా, సమ వయస్కులతో ఉన్నత వ్యక్తిత్వం గల సహచరుడిగా జీవితాన్ని ధన్యం చేసుకున్న వ్యక్తి ప్రసాద్‌గారు.

ఆవకాయపచ్చడిని వేడి అన్నంలో వేసుకుని తినే మామయ్య పచ్చడి ముక్క కన్న 'ఎర్రగా' ఉండే రంగుని ఎక్కువ ఇష్టపడి ఆ 'ఎర్రదనం'తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే వారనుకుంటా.

ప్రసాద్ మామయ్యతో నా అనుబంధం వల్ల ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం 1970-జూలై నెల 'విరసం' ఆవిర్భావం. హైద్రాబాద్ నాంపల్లి - అబిడ్స్ మార్గంలో ఒక హోటల్ గదిలో మరో ప్రపంచపు మహా ప్రస్థానం శ్రీశ్రీ గారు, సృజన వరవరరావుగారు, దిగంబర కవులు, హరిపురుషోత్తమరావు గార్ల ఆధ్వర్యంలో జరిగిన 'విరసం' ఆవిర్భావ సమావేశంలో నేను పాల్గొనగలగటం మాటలకు అందని అనుభూతిగా భావిస్తాను.

12.8.2015 నాడు హైద్రాబాద్ వచ్చి ఒక వారం రోజులు ఉండి అందరినీ కలసి వెళతానురా పాపడ (మామయ్య నన్ను అలా పిలిచేవారు) అన్న మావయ్య కనబడని, వినబడని రూపంగా మారినా ఆయన మనందరి దృష్టిలో నిత్యం సజీవుడే, స్నేహశీలి, ఆత్మీయుడే.

జోహార్ చలసాని ప్రసాద్!
రెడ్ శాల్యూట్ టు మామయ్య.

విప్లవమే శ్వాసగా, ధ్యాసగా బతికిన కామ్రేడ్ చలసాని

రాంకి

'నేనొక్కడ్ని ఆగిపోతే నింగిలోని చుక్కలన్నీ నెత్తురు కక్కుకు రాలిపోవా' అన్నట్లుగా, 'అనితర సాధ్యం నా మార్గం' అని సగర్వంగా ప్రకటించుకునేలా కామ్రేడ్ చలసాని ప్రసాద్ విప్లవ సాహిత్య, సాంస్కృతిక ఆచరణ కొనసాగింది. ఆయన విప్లవమే శ్వాసగా, ధ్యాసగా జీవించాడు. వేరే ఏ విషయాలు ఆయన మనసుకు ఎక్కలేదు. కాదు ఎక్కించుకోలేదు. తాను చేయాలనుకున్న పనులు ఖచ్చితంగా చేశాడు. విప్లవ సాహిత్య, సాంస్కృతిక రంగంలో ఎప్పటికీ నిలిచిపోయే కృషి చేశాడు.

కమ్యూనిస్టు కుటుంబంలో కళ్ళు తెరిచి, కమ్యూనిస్టు ఎలా ఉండాలో అలానే జీవించి 83 ఏళ్ళ ఒక పరిపూర్ణ జీవితాన్ని జీవించి చూపించాడు కామ్రేడ్ చలసాని ప్రసాద్. పీడిత ప్రజల విముక్తి కోసం ఈ దేశ ప్రజల కల నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం విప్లవ సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తానేమేమి చేయగలడో అన్నీ చేశాడు కామ్రేడ్ చలసాని ప్రసాద్.

కామ్రేడ్ ఆలూరి భుజంగరావు సంస్మరణ సభలో గుంటూరులోని తన చివరి ప్రసంగంలో - (అరుణతార జూన్-జూలై, 2013, పుట 57-58) కామ్రేడ్ గంటిప్రసాదం అన్న మాటలు దృఢచిత్తంతో విప్లవ కార్యచరణలో ఉన్న వారందరికీ అన్వయించు కోగలిగేవే - 'భుజంగరావు జీవితాన్ని ఆదర్శంగా స్వీకరించడం అంటే ఏమిటి? గొప్ప ఆలోచనలు, గొప్ప ఆశయం, గొప్ప లక్ష్యం కలిగి ఉండటమే భుజంగరావు జీవితం కాదు. అందుకు తగినట్టుగా నీవు కూడా శక్తి వంచన లేకుండా దానికి ప్రాతినిధ్యం వహించే మనిషిగా వ్యక్తమవుతూ ఉండాలి. నీ వ్యక్తిగత జీవితంలో, నీ ఆచరణలో, నీవు ఎంచుకున్న కార్యక్షేత్రంలో ఆ నడకను ప్రతిబింబిస్తూ ఉండాలి. అలా ఉన్నటువంటి వాళ్ళే చరిత్రలో నిలబడిపోతారు' అని అన్న మాటలు కామ్రేడ్ సిపికి అక్షరాల సరిపోతాయి.

'వ్యక్తి ఔన్నత్యానికి గీటురాయి ఏమిటి? ప్రపంచంలో చాలా మంది చాలా చెప్పవచ్చు కాని అత్యంత శాస్త్రీయమైన గీటురాయి ఏమిటంటే ప్రజలను ప్రేమించడం, ప్రజలకు సేవ చేయడం, ప్రజల కోసం బతకడం, ప్రజల కోసం చనిపోవడం - అంతకు మించిన ఔన్నత్యమేమీ ఉండదు' సరిగ్గా అలాంటి ఆచరణే తన కడ దాకా కామ్రేడ్ సిపి కొనసాగించాడు. కామ్రేడ్ గంటిప్రసాదం అన్న మరో మాట - 'ప్రాణ త్యాగం చాలా ఉన్నతమైనది, అంతకన్నా ఎన్నో రెట్లు కష్టమైనది అహాన్ని, గుర్తింపును, నేను అనే భావనను వదులుకోవడం' - కామ్రేడ్ చలసాని ప్రసాద్ విప్లవ సాహిత్య, సాంస్కృతిక ఆచరణలో అలాంటి నేను అనే భావన లేని ఆచరణను ఒక నమూనాగా మనముందు పెట్టి వెళ్లిపోయాడు.

ప్రజలకు విప్లవం అవసరం ఉంది అని అనుకోవడం, ప్రజల పక్షాన ఉండడం అదే విప్లవ తాత్వికత. ఆ తాత్వికతను చలసాని ప్రసాద్ హృదయానికి హత్తుకున్నాడు. అలాగే ప్రజలకు జవాబుదారీతనం అనే విలువను పాటించాడు.

విరసం మహాసభలలో, సాహిత్య పాఠశాలలో, కవిత్వం వర్క్‌షాపుల్లో, వ్యాస తరగతుల్లో, రాజకీయ తరగతుల్లో అన్నింటా తెలుగు నేల అంతటా కాలికి బలపం కట్టుకుని తిరిగి తన విలువైన, సూక్ష్మమైన పరిశీలనలతో కూడిన అధ్యయనాన్ని పంచుకున్నాడు. మరీ ముఖ్యంగా విరసం సభలు అన్నిటా విరసం పతాక గీతం తను పాడాల్సిందే.

కొత్త తరం, కొత్త గొంతు, కొత్త గాలిపై కామ్రేడ్ సిపికి గొప్ప ప్రేమ, నమ్మకం. ఎటువంటి అరమరికలు లేకుండా వారితో కలిసిపోవడం, వారితో సంభాషించడం, తాను చెప్పవలసినవి, చెప్పాలనుకున్నవి చెప్పడం, వారు చెప్పినవి వినడం తనకు చాలా ఇష్టం. అలా తన ప్రేమను మేమంతా పొందాం. ఇటీవల పోరంకి, మంగళగిరిలలో జరిగిన కవిత్వ వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు, కొత్తతరం కవులతో సన్నిహితంగా మెలిగి, ఎంతో ఓపికతో, శ్రద్ధతో వారి కవిత్వంలోని లోటుపాట్లను సరిచేసాడు. విరసం ప్రచురణల అమ్మకం బాధ్యతలు చూస్తున్న శ్రీనివాస్ కవిత రాసుకొస్తే స్వయంగా దిద్ది, అవసరమైన మార్పులు చేర్పులు సూచించాడు. డిసెంబర్ 72 సృజనలో సిపి రాసిన 'మన రచయితలు' వ్యాసంలో 'యువతరానిది సున్నితమైన హృదయం, నిశితమైన మేధస్సు, సామాజిక ఆదర్శాలకు స్పందించి, అన్యాయాలను ఎదిరిస్తారు' అని వారి పట్ల తన నమ్మకాన్ని వ్యక్తం చేసాడు. చేయడమే కాదు, వారిని అంటిపెట్టుకుని వారితో కలిసి నడిచాడు.

అదే వ్యాసంలో రచయితలు ఎలా ఉండాలి అనే అంశంపైన ఏమంటాడంటే 'రచయిత వీలైనన్ని ఎక్కువ సంగతులు తెలుసుకోవాలి. ప్రతి ఒక్క సంగతి తెలుసుకుంటే మరీ మంచిది. తాను చూసి తెలుసుకుని అనుభవించిన ఎన్నెన్నో సంగతుల నుంచి చిక్కనైన విషయాలను, విశ్వజనీనమైన వాటిని మాత్రమే ఎంచుకుని, కేవలం వ్యక్తిగత, సంకుచిత సంగతులను వదిలి వేయాలి. అలా ఎంచుకోవడం ద్వారా రచయిత కళాత్మక, సామాజిక రచనలు రాయగలుగుతాడు. ఒకవేళ వ్యక్తిగత, సంకుచిత విషయాలను వదిలివేయలేకపోతే సామాజిక, వైజ్ఞానిక విలువలు లేని ఉదంతాలు మాత్రమే రాయగలుగుతారు' అని అంటాడు. అలాగే తాను ఆచరణతో పాటు అధ్యయనానికి చాలా ప్రాధాన్యతనిచ్చాడు.

'మన గమ్యం ఎంత గొప్పదైతే మన తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలు అంత బాగా ఫలవంతమవుతాయ'ని అంటాడు. 'ఎత్తు ఎక్కిన కొద్దీ దూరం చూడగలుగుతాం' అని అంటాడు. 'సాహిత్యం కేవలం వాస్తవికతను ప్రతిబింబిస్తే చాలదు. అంతకన్నా ఎక్కువ ప్రయోజనం ఉంది సాహిత్యానికి' అని స్పష్టంగా చెపుతాడు.

కామ్రేడ్ సిపి విరసం వ్యవస్థాపకుడుగానే కాదు, విరసం కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా చివరి వరకు గట్టి కార్యకర్తగా కొనసాగాడు. అరుణతార సంపాదక బాధ్యతలు తీసుకుని ఆ బాధ్యతలు నిర్వర్తించాడు. కామ్రేడ్ చలసాని ప్రసాద్ 'సాహిత్య వ్యాసాలు', 'చలసాని ప్రసాద్ రచనలు' పేరిట వచ్చిన తన రెండు సంపుటాలు 424 పేజీల్లోనే కాదు, 2010 తరువాత వచ్చిన ఆయన రచనా వ్యాసంగాన్ని, ప్రసంగాలు, లేఖలు, ముందుమాటలు, ఇంటర్వ్యూలు, సంభాషణలు, ఇలా అనేక రూపాల్లో ఉన్న సాహిత్యాన్నంతా ఒకచోటుకు తేవాల్సి ఉంది. సంఘానికి, పత్రికకు అవసరమైన ఆర్థిక అవసరాలను తీర్చడంలో అలుపెరగని కృషి చేశాడు. కామ్రేడ్ సిపికి వ్యక్తిగతం, సామాజికం వేరు వేరు కావు. తన వ్యక్తిగత స్నేహాలు, బంధుత్వాలు, పరిచయాలు అన్నింటిని విప్లవ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ అవసరాలకు వినియోగించాడు. కామ్రేడ్ సిపి సహచరి విజయ, పిల్లలు నవత, మమతలతో సహా అందరిని తన ఆశయాల్లో భాగస్వామ్యం చేసాడు. బహుశా సహచరి విజయ సహకారం లేకుండా ఇంతటి క్రియాచరణ సిపికి సాధ్యం అయ్యేది కాదేమో. ఈ దేశంలోని ఆదివాసులు, దళితులు, అట్టడుగు వర్గాల ప్రజల కుటుంబాలకు కుటుంబాలే విప్లవోద్యమంలో భాగస్వామ్యం అవుతున్నాయి. అలాగే కామ్రేడ్ సిపి కూతురు నవత విప్లవ లక్ష్యాలను అందుకొని ముందుకు కొనసాగడం మనం చూస్తాం.

అరుణతార 300వ సంచిక ఆగస్టు-సెప్టెంబరు 2013 కవిత్వం ప్రత్యేక సంచికగా వచ్చింది. ఆ సందర్భంలో సిపి - 'అరుణతార విరసం నిర్వహణలో వెలువడుతున్న సాహిత్య, సాంస్కృతిక మాస పత్రిక. సాహిత్య సంస్థకి పత్రిక లేకపోతే ఎలా అని నిగ్గదీసి మమ్మల్ని ముగ్గుల్లోకి దింపింది ఎవరనుకున్నారు? మరి ఎవరో కాదు మా వ్యవస్థాపక అధ్యక్ష, ఉపాధ్యక్షులు - శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు. వాళ్ల ఆదేశానుసారమే మేము బరిలోకి దిగాం' అని గుర్తు చేశాడు.

అలాగే 'ఇక మిత్రుడు బొమ్మారెడ్డి (1917-2006)కి మనసారా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. బొమ్మారెడ్డి ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో పాత్రికేయుడుగా పనిచేశారు. ఎప్పుడూ ఒక రూపాయి జీతం తీసుకోలా, చిట్టచివరి దాకా మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలో ఉన్నాడు. ఆయన పేర అరుణతార డిక్లరేషన్ వచ్చింది. ఆయనకి ఆ పార్టీకి కూడా దాని అవసరం లేకపోయింది. అయితే డిక్లరేషన్ నా పేర మారడానికి ఇద్దరం 22 నెలలు ముప్పతిప్పలు పడి మూడు చెరువులు నీళ్లు తాగవలసి వచ్చింది. ఆయనకు బాగా జబ్బు చేసి ఏమవుతానోనని భయపడ్డాడు. ఈ డిక్లరేషన్ నీ పేర మార్చకుండా నేను చచ్చినా చావను అని నవ్వేసాడు. అలాగే నా పేర వచ్చిన కొద్ది రోజులకే కన్ను మూశాడ'ని బొమ్మారెడ్డి చేసిన సహకారాన్ని, ఇద్దరూ పడ్డ సాధక బాధకాలను గుర్తు చేసుకున్నాడు.

చలసాని వయసు రీత్యా, అవసరాల రీత్యా, విజయవాడ నుంచి నడపడంలో ఉన్న ఇబ్బందుల రీత్యా అరుణతారను హైదరాబాద్‌కు మార్చాలన్న విరసం సర్వసభ్య సమావేశం నిర్ణయం మేరకు, డిక్లరేషన్‌ను తననుంచి నా పేర మార్చడానికి సంబంధించిన ఆలోచన మూడేళ్లుగా సాగుతూ గత ఏడాది కార్యరూపం దాల్చింది. 28 ఫిబ్రవరి 2014న కామ్రేడ్ సిపి విజయవాడ సబ్ కలెక్టర్ ఆఫీసుకు వచ్చి అరుణతార ట్రాన్స్‌ఫర్ అఫిడవిట్, సీజింగ్ డిక్లరేషన్‌లపై సంతకం పెట్టాడు. పోలీసు వెరిఫికేషన్, ఆర్ఐ వెరిఫికేషన్ పనులు పూర్తయ్యాయి. సబ్ కలెక్టర్, ఆర్ఐల చుట్టూ కామ్రేడ్ అరసవిల్లి కృష్ణ తిరుగుతూనే ఉన్నారు. 'అరుణతార డిక్లరేషన్ నీ పేర మార్చి నిశ్చింతగా చనిపోవాలని ఉంది బాబూ' అంటూనే సిపి వెళ్లిపోయాడు. మళ్లీ మరొక సెట్టు కాగితాలు సిపి సంతకాలతో తెమ్మంటే చనిపోవడానికి రెండు రోజుల ముందు సంతకాలు పెట్టి విజయవాడకు పంపాడు.

అరుణతార చేతికి అందగానే నాకు ఫోన్ చేసి పత్రిక బాగా వచ్చిందని, బాగుందని ప్రోత్సహిస్తూ, ప్రతి నెలా 5వ తారీఖు కల్లా పాఠకుల చేతిలో ఉండేలా చూడమని చెప్పేవాడు. 'నువ్వేం బెంగపడకు, అరుణతారకు ఆర్థిక వనరు ఏర్పాటు చేద్దాం; హైదరాబాదుకు వస్తాను. కలిసి తిరుగుదాం, ఈసారి మీ ఇంట్లోనే పది రోజులు ఉంటాను' అని అంటూనే వెళ్లిపోయాడు.

కామ్రేడ్ చలసాని ప్రసాద్ కన్న కలలను, తన ఆశయాలను నిజం చేయాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. అరుణతార క్రమం తప్పకుండా తీసుకురావడం, కామ్రేడ్ చలసాని ప్రసాద్ గ్రంథాలయాన్ని పది కాలాలు ప్రజలకు ఉపయోగపడేలా పరిరక్షించడం మన అందరి బాధ్యత. అమరులు మనముందు ఉంచిన ఉన్నతమైన త్యాగాల సంప్రదాయాన్ని ఎత్తిపట్టి, ప్రజల విప్లవ ఆకాంక్షను నిజం చేయడంలో మనమంతా మరింత దృఢంగా భాగం కావడం ద్వారానే చలసానికి మనం నిజమైన నివాళులు అర్పించగలం.

ఈ దేశంలో ప్రజలకు విప్లవ అవసరం ఉన్నంత వరకు నక్సలైట్లు ఉంటారు. విప్లవ రచయితల సంఘం ఉంటుంది. అరుణతార ఉంటుంది. ప్రజలు విప్లవోద్యమ చరిత్రను నిర్మిస్తున్నారు. కుటుంబాలకు కుటుంబాలు బాధ్యత పడుతున్నాయి. త్యాగాలు చేస్తున్నారు. పాలకులు మనల్ని హిందూ మతోన్మాద మారణకాండలకు, కుల అణచివేతలకు, అణుబాంబుల, భోపాల్ గ్యాసుల, హత్యలకు, ఆత్మహత్యలకు, విధ్వంసానికి ఆకలి చావులకు, అవమానాలకు, సామూహిక హననాలకు, కాలుష్యాలకు, బలవన్మరణాలకు, నిర్లక్ష్యాలకు బలిచేసే లోపు మన వంతుగా ఇంటికొక్కరమైనా (?) బాధ్యత పడదాం. ఈ పోరాటం నీది, నాది, మనందరిది. ఈ రోజు కా. చలసాని ప్రసాదుల, కా. వివేక్‌ల, కా. సూర్యంల, కా. కవితల అవసరం మరింత పెరిగింది. వేల, లక్షల, కోట్ల చేతులతో అమరులు వదిలిన ఖాళీని పూరిద్దాం. వారి స్వప్నాలను నిజం చేసుకుందాం. అదే మనం వారికి ఇవ్వగలిగిన నిజమైన నివాళి.

చలసాని ప్రసాదన్న స్మరణలో

- కోటి, ప్రజా కళా మండలి

వీరుల వారసుడా... విరసం స్థాపకుడా...
విప్లవ తాత్వికుడా... మా కవి గాయకుడా...
చలసాని ప్రసాదన్న అందుకో మా లాల్ సలామ్
ప్రజా కళా మండలి అందించే లాల్ సలామ్ ॥వీరుల॥

క్రిష్ణా జిల్లాలోనా...
భట్లపెనుమర్రు గ్రామానా...
నరసమ్మ బసవయ్యల
నవ్వుల కొడుకువు నువ్వు
చిన్న తనము నుండె నీకు
ఉన్నత భావాలెన్నో
కళ్ళముందు కష్టజీవి
ముళ్ళ పొదలు చూశావు
కమ్యూనిస్టునౌతానని
కదం తొక్కి కదిలావు ॥వీరుల॥

ఓరుగల్లు పోరుజల్లు
దారులల్లో తడిచినోడా
వెంపటాపు సత్యంతో
చైతన్యం పొందినోడా
తామాడ గణపతంటే
తనువు పులకరించినోడా
పాణిగ్రాహి పదాలకు
బాణీలను కట్టినోడా
చినబాబు అడుగులతో
చిందులేసి ఎగిరినోడా ॥వీరుల॥

పంచాది నిర్మలలు
పంచప్రాణమైనోడా
కైలాసం లాలసుడా
కె.వి.ఆర్. స్నేహితుడా
శ్రీశ్రీ ప్రేమించినోడా
చెరబండకు చెలికాడా
గోరు తాత ఏరి అంటే
పోరు దారి చూపినోడా
గంటి ప్రసాదన్నతోటి
వెంటబడి తిరిగినోడా ॥వీరుల॥

విష సంస్కృతి విలయాన్ని
నిలువరించమన్నోడా
విధ్వంసపు వలయాన్ని
ఛేధించి నడిచినోడా
మనిషికి మనిషికి మధ్య
మంచు తెరలు తెంచినోడా
మనసుకు మనసుకు నడుమ
మాయపొరలు చీల్చినోడా
కత్తుల వంతెనపైన
ఎర్రజెండ ఎత్తినోడా ॥వీరుల॥

ఆపరేషన్ గ్రీనుహంటు
ఆపివేయ మన్నోడా
బాక్సైట్ తవ్వకాలు
బంద్ పెట్టమన్నోడా
థర్మల్ విద్యుత్ వద్దని
దండుగట్టి నడిచినోడా
మత్స్యకార్ల బతుకులకై
మృత్యువు నెదిరించినోడా
వ్యంగ్యంతో పాలకుల
రంగుబయట పెట్టినోడా ॥వీరులా॥

చలిగాలికి జడివానకి
చెదిరిపోని గుండెనీవు
నిర్బంధపు నీడలను
నిలువున చీల్చేసినావు
కోడి కునుకు తీస్తు నువ్వు
జాడలెన్నో వెతికావు
అండలేని బతుకులకు
దండువయ్యి నిలిచినావు
సంపద సంస్కృతికి మూలం
శ్రమ జీవులె అన్నావు ॥వీరుల॥

తెలంగాణ పోరాటపు
తెగువ నిన్ను నడిపించింది
శ్రీ కాకుళ అమరత్వం
సమరాన్ని నేర్పింది
కవి గాయకుడయ్యినావు
భవితవ్యం చెప్పినావు
అరవై ఏండ్ల పోరాటపు
అలుపెరుగని యోధుడవు
గుండెపోటు నిన్నాపితే
జెండవయ్యి మెరిసినావు... ॥వీరుల॥

ప్రసాదు ప్రస్థానం

నగరి బాబయ్య

ఔను ప్రసాదూ దాదాపు మూడు వారాల నుండి నీ పలుకు వినబడకపోయినా - యీ చీమల పుట్టల జ్ఞాపకాలు వెంటాడుతూ నన్ను కుట్టుతున్నాయే!

మొన్న జూలై 25కు వారం రోజుల ముందు ఫోన్‌లో నేను బెంగుళూరు వస్తాను. మా చెల్లాయి ఎట్లుంది? పేరు పేరునా అందర్నీ అడిగితివే - బెంగుళూరుకు టికెట్స్ బుక్ చేయిస్తానంటివి కదా?' అంతలోనే అంత పెద్ద మార్పా? దిగ్గున ఉన్నట్టుండి వైజాగ్‌కు బయలు దేరి వచ్చేంతటి మార్పా? మాట తప్పావు ప్రసాదూ! 'అరే పిచ్చి బాబీ - రావాలనే ఉన్నా - ఇదేదో చావంట - దీన్నీ చూచి - అనుభవించి వచ్చేస్తాలే. రాకుండా పోతానా? మాట తప్పను - అంటూనే ఉన్నావు - 25 ఉదయాన్నే పిచ్చి పిచ్చీ - పిచ్చి పిచ్చీ అని నన్ను రోజూ పిలిచి నిద్రలేపే పక్షి వచ్చే ఉంటుంది - నా ఆత్రంలో వినలేదు ప్రసాదు - కానీ ఆ పక్షి దినమూ వస్తూనే ఉంది. - నీలో అంత పెద్ద మార్పేమీ రాలేదు - వస్తున్నా - వస్తున్నా - అంటూ ఉందీ పక్షి.

ప్రతి ఉదయమూ ప్రత్యక్షం
నీ జ్ఞాపకాల్ని పాడుతూనే ఉంది
నేనెదురు చూస్తూనే ఉన్నాను
చెప్పు - నువ్వు రావడం ఇంకా
ఆలస్యమైతే - నేనే వచ్చేస్తాను.

ఔను - రామలక్ష్మి నీ అప్పంతా తీర్చిందా? ఆ లెక్క నీ టేబుల్ మీద ఉండేది. 'ఇదేమి లెక్కలు ప్రసాదూ - లక్షలు లక్షలు అని నేనంటే - నీవేదో సమాధానం ఇచ్చావు. కానీ నాకు చీమల కాళ్ళు విరిగిన చప్పుడు వినిపిస్తున్నట్లనిపించింది. రామలక్ష్మి ఇంటి పని మనిషి - లక్షల అప్పులెట్లా ఇచ్చావయ్యా మరి? నన్ను పిచ్చి బాబీ, అనకు మరి.

'చావును జయిస్తాడు మనిషి' అన్నాడు కదా నీ పెద్ద గురువు - శ్రీశ్రీ - వైతరణీ నదీ ప్రవాహాములు - అక్కడ కూడానా? నీకడ్డమా అవి.

జయిస్తాం- జయిస్తామంటున్నావా?
చావు మనల్నేమీ చేయలేదంటావా?
నిజంగానే - నిజంగానే నిఖిల లోకం
(లభించడం కాదు) - రయిస్తుందా?
అని కదా ఆ కవి చెప్పింది.

ఇది గుర్తుందా ప్రసాదు? పాట్నాలో సభ తర్వాత రాత్రి 12 గంటలప్పుడు - మన గంగా స్నానం - ఇప్పుడేంది ప్రసాదూ స్నానం అంటే - పిచ్చీ - ఫాలో మీ అని గంగలో దూకావు - నీళ్ళు చూస్తే నిన్నెవ్వరాపగలరు? నేనూ నీళ్ళలో దిగిన కాస్సేపటికి కొట్టుకొంటూ వచ్చిన శవం నాకు తగిల్తే ప్రసాదూ - శవం తగుల్తోంది అంటే ఆ..! అంతా బ్రతికున్న శవాలమే అంటూ ఒక పెద్ద పద్యం లంకించుకున్నావు - నీ కడుపు నిండా పద్యాలే. 26న నేనొచ్చి చూసేప్పటికి నీ కళ్ళు కనిపించలేదు. కాళ్ళు మాత్రం దొరికాయి.

కానీ ప్రసాదూ - శ్రీశ్రీ నిలుపుకోలేక పోయిన మాట నువ్వైనా నిలుపుకొని దేహాన్ని కె.జి. హాస్పిటల్‌కిచ్చావు.

నీ పెద్దా గురువూ, చిన్న గురువూ నువ్వూ ఆ పెద్ద మార్పులో భాగమై పోతే విశాఖతో నాకు పనేముంది.

నీకు జ్ఞాపకం ఉండి తీరాలి. కలకత్తాలో దుర్గా గుడికెళ్ళి - కలకత్తా కాళిక నాలుక తెలుపైందని... ఇదేమని అక్కడి పూజారుల్తో తగువు పడి - అలసిపోయి - కోల్గేట్ మహత్యం వైట్ వాష్ చేస్తోందని గుర్తు రాక మహాశ్వేతా దేవిని చూడ్డానికెళ్ళాము.

విసుగులేని సముద్రపు అలలు - హోరు-భీమ్లిలో సారీస్‌ను చుద్దామని చలం జ్ఞాపకాలలో వెళ్ళి - శ్రీశ్రీ గీతాలు నీ ధాటిలో పాడేవు. మన స్నేహానికి మరణం లేదు. సెలబ్రేట్ చేద్దాం - మళ్ళీరా. మనకెన్ని భేదాభిప్రాయాలున్నా వాదించుకొని, ఒకరివెంట ఒకరు నడుచుకొని పోతున్నాం - 'నా పనే నీ పని - నీ పని మొదట చేసి పెట్టు' - ఇది నీ మొరాయింపు. తీరా చూస్తే నువ్వు చెప్పిన పని నీ పని కాదు. అందరి బాధలు నీ బాధలు - మోసుకొని గంతులేస్తూ సముద్రం మాదిరిగా బ్రతికావు.

నీ డిసార్డర్‌లోనూ ఆర్డర్ ఉండేది ఇఇ కమింగ్స్ (అమెరికన్ పోయెట్) జీవించునట్లు. ఆ పుస్తకాల సముద్రంలోనూ ఆర్డర్ ఉండేది. నీది మూడోతరం కమ్యూనిస్టు జీవితం. రామోజీ నీ కులస్థుడే కావచ్చు - కానీ స్నేహితుడు కాదు. అనుకున్నాం కదా! మేమే నీ స్నేహితులం. సెలబ్రేట్ చేద్దాం.

ఔను - 'వరద రాజులు గారున్నారా' అని చిన్నగా నాతో అంటే పగలబడి నవ్వేవాళ్ళం - అదొక జోక్ - ఎన్నో జోకుల్లో అదొకటి -

ఆవకాయ కనిపెట్టిన వాళ్ళకు నోబెల్ అవార్డు ఇవ్వాలనే వాడివి. ఆవకాయ కోసమే కదా అన్నం తినడం - అని మురిసిపోయేవాడివి.

నీ ముగ్గురు లక్ష్ముల్ని చూడ్డానికైనా ఎప్పుడొస్తావు? - నా నమ్మకం నువ్వు తప్పక వస్తావని - 'నీలో పెద్ద మార్పు వచ్చిందనీ - చావును జయించి తీరతావని - వచ్చే వస్తావని - మనిద్దరమే మళ్ళీ మాట్లాడుకుంటామని - నువ్వు ప్రజా ప్రసాదానివి - కుడి ఎడమల దగాలన్నీ దాటి వచ్చేస్తావని - నీ చిరునవ్వుల్తో ఎగురుకుంటూ వస్తావని ఎదురుచూస్తున్న.

నగరి బాబయ్య
కాదు
నీ పిచ్చి బాబీ.

విరసం నాయకులు చలసాని ప్రసాద్ కన్నుమూత

ఉపాధ్యాయ, ఆగస్టు 2015

ప్రముఖ సాహితీవేత్త, విప్లవకవి, రచయితగా పేరు గాంచిన చలసాని ప్రసాద్ తన 83వ యేట విశాఖపట్నం సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో జూలై 25న తుది శ్వాస విడిచారు.

1932 డిసెంబర్ 8న కృష్ణాజిల్లాలోని భట్ల పెనుమర్రులో వీరు జన్మించారు. తండ్రి బసవయ్య, తల్లి వెంకటన నరసమ్మ. వీరిది కమ్యూనిస్టు కుటుంబం. వీరి కుటుంబ సభ్యులు జమిందారి వ్యతిరేక పోరాటాల్లో, తెలంగాణ పోరాటాల్లో కమ్యూనిస్టు కార్యకర్తలుగా పాల్గొన్నారు. ఆయన పినతండ్రి జగన్నాధరావు, అన్న వాసుదేవరావు, బావ పాపారావులను 1940 దశకంలో పోలీసులు కాల్చి చంపారు. సహజంగానే ఆయన కూడా వామపక్ష భావాలకు ప్రభావితుమై తొమ్మిదవ తరగతి నుండే స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యునిగా ఉండి 1947లోనే 'ఓ విద్యార్థి సోదరుడా, నమ్మేయే మన ఆఖరి యుద్ధమోయ్' అని రాసి ఉద్యమ జీవితం ప్రారంభించారు. 1957-59 మధ్య రాజకీయ శాస్త్రంలో ఎం.ఎ. చేసిన ఈయన మత్స్యశాఖలో ఎల్.డి.సి.గా 1960-62లో రైల్వే క్లర్క్‌గా 1968 నుండి 1992 వరకు విశాఖలోని ఏవిఎన్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. ఆంధ్రా యూనివర్సిటీ, ఎవిఎన్ కళాశాల విద్యార్థులను చైతన్యపరచడంలో కృషి చేశారు.

1970లో ఏర్పాటైన విప్లవ రచయితల సంఘం (విరసం) వ్యవస్థాపక సభ్యుల్లో వీరు ఒకరు. దేశంలోని పతితులు, భ్రష్టులు, అన్నార్తులు, అభాగ్యుల అభ్యున్నతిని ఆకాంక్షించి నయా ఉదారవాద విధానాలు సహా పెట్టుబడిదారీ పెత్తందారీ పోకడలను తనదైన శైలిలో నిరసించిన విప్లవ కవి ఈయన. ఎమర్జెన్సీ సమయంలో రెండేళ్ళపాటు జైలు జీవితం గడిపారు. శ్రీశ్రీ, రావిశాస్త్రిలకు అత్యంత సన్నిహితులు. వీరి రచనలు 'చలసాని రచనలు' సాహిత్య వ్యాసాలు పేరిట ప్రచురితమయ్యాయి. చలసాని నిరంతర అధ్యయన శీలి. ఈయన ఇంటిలోని లైబ్రరిలో కమ్యూనిస్టు, అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన 25 వేల పుస్తకాలున్నాయి.

చలసాని శ్రీకాకుళం ఉద్యమంలోనూ, తెలంగాణా ఉద్యమంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. 1986-88 మధ్య విరసం ప్రధాన కార్యదర్శిగా, 1998-2000ల మధ్య విరసం అధ్యక్షునిగా పని చేశారు. అరుణతార పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. 14 ఏళ్ళ పాటు శ్రమించి ఆయన శ్రీశ్రీ సాహిత్యాన్నంతటినీ 20 సంపుటాలుగా వెలువరించారు. రా.వి.శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు రచనలను కూడా సంపుటాలుగా తెచ్చారు.

చలసాని ప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు. నవత, మమత. ఆయన భార్య విజయలక్ష్మి 2003లో మరణించారు ఈయన కోరిక మేరకు ఆయన భౌతిక కాయాన్ని విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాలకు, నేత్రాలను మోహిసిన్ ఐ బ్యాంక్‌కు అప్పగించడం జరిగింది.

తాళాలు లేని ఇల్లు, పరీక్షలు లేని చదువు, పోలీసులు లేని రాజ్యం ఉండాలని కలలుగన్న విప్లవ కవి చలసాని మరణంతో విరసం పెద్ద దిక్కును కోల్పోవడమే కాదు. మొత్తం అభ్యుదయ సాహిత్యలోకానికి కూడా తీరని లోటని భావిస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వారికి నివాళులర్పిస్తోంది.

విరసం చలసాని ప్రసాద్ మృతి

ఉపాధ్యాయ దర్శిని, ఆగస్టు 2015

ప్రగతిశీల సమాజం కోసం నిరంతరం శ్రమించిన సాహిత్యకారుడు ప్రముఖ సాహితీవేత్త, విప్లవ రచయితల సంఘం (విరసం) వ్యవస్థాపకుల్లో ఒకరైన చలసాని ప్రసాద్ (83) విశాఖపట్నంలో 25-07-2015 నాడు గుండెపోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య విజయలక్ష్మి ఇదివరకే కన్నుమూశారు.

1932లో కృష్ణాజిల్లాలో భట్లపెనుమర్రులో బసవయ్య, వెంకట నరసమ్మ దంపతులకు జన్మించిన ప్రసాద్, 1957లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేసిన తర్వాత 1959 వరకు మత్స్యశాఖలో గుమస్తాగా, 1960 నుంచి 1962 వరకు రైల్వేక్లర్క్‌గా పని చేశారు. 1964 నుంచి 1967 వరకు సినీరంగంలో పనిచేశాడు.

చలసాని ప్రసాద్‌కు శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, కె.వి. రమణారెడ్డి అంటే ఎనలేని అభిమానం. 14 ఏళ్ళపాటు శ్రమించి శ్రీశ్రీ సాహిత్యాన్నంతటిని 20 సంపుటాలుగా వెలువరించారు. రావిశాస్త్రి, కొడవటిగంటిల రచనలను కూడా సంపుటాలుగా తెచ్చారు. శ్రీకాకుళం ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన చలసాని స్ఫూర్తితోనే విరసం ఆవిర్భవించింది. విశాఖలో శ్రీశ్రీ షష్టిపూర్తి సభ నిర్వహించి విరసం స్థాపనకు అంకురార్పణ చేశారు.

83 ఏళ్ళ వయసులోనూ చలసాని ప్రసాద్‌లో అలసట కన్పించేది కాదు. 1970ల స్థాపన నుంచి నేటి వరకు విరసంలో ఆయన క్రియాశీల పాత్ర పోషిస్తూ వచ్చారు. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఎక్కడా రాజీలేని జీవితాన్ని గడిపారు. ఆయన భౌతికంగా లేకున్నా రచనలు శాశ్వతంగా నిలిచిపోతాయి.

ఆయన కోరుకున్న విధంగా విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాలకు ఆయన భౌతిక కాయాన్ని 26-07-2015 బంధువులు, అభిమానులు, రచయితలు, కవులు కళాకారుల సమక్షంలో దానం చేశారు. నేత్రాలను మోహిసిన్ ఐ బ్యాంకుకు దానం చేశారు.

ఆయన మరణం ఉద్యమాలకు, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని టిపిటిఎఫ్ సంతాపం ప్రకటిస్తోంది.

చలనశీల ప్రసాద్

- ఎం. రాఘవాచారి

అతను
ప్రసన్నంగా నవ్వుతూ పరిమళిస్తాడు
ఇంత స్నేహంగా విశాఖ సముద్రం
నవ్వుతోందనిపిస్తోంది అతని ముఖంలోంచి

అతనితో
హాయిగా ఉంటుంది సంభాషణ
ఎంత దాకా మనం పోగలిగితే అంతదాకా
లోకం పరుచుకుంటుంది
తేటనీటిలో ఈదినంత హాయిగా

బాగున్నావా తొలిపలుకు
అందరూ బాగున్నారా మలిపలుకు
ప్రయాణం ఎట్లా జరిగింది మరో పలుకు
ముందు విశ్రాంతి తీసుకో

తన తిండి పెడతాడు
తన పడక వేస్తాడు
అన్నీ తానై ఆదరిస్తాడు ఎవరినైనా
మీరు వస్తున్నారనీ ఎట్లా వస్తున్నారనీ తెలవటం చాలు
వాకబు చేస్తునే ఉంటాడు మళ్ళీ మళ్ళీ
మిమ్మల్ని కళ్లారా చూసి కౌగిలించుకునేదాకా

ఎవరు మరచిపోతారు సముద్రాన్ని
అలల్ని అలలమీద తేలి ఆడే పడవల్ని తెరచాపల్ని
విరుచుకుపడుతున్న అలలమీద ఇంద్ర ధనస్సుల్ని

సముద్రం గుర్తొచ్చిందంటే
తుఫాను గుర్తొస్తుంది
ఒడ్డున భగ్నమయ్యే అలలు, పడవలు
దినగండమైన జాలర్ల జీవితాలు గుర్తుకొస్తాయి

మొన్న.దివిసీమను మింగింది
నిన్న విశాఖను పరిసరాటవులనూ చుట్టి
మింగి కక్కేసిన హుద్ హుద్ తుఫాను గుర్తొస్తుంది

అందరికీ సముద్రం చూపించే అతనెక్కడుంటాడు
కన్నీళ్ళు మింగుతు
సముద్రం మీదకినిసి
తాను ప్రేమించే జన సముద్రం మధ్య
కన్నీళ్ళు తుడిచే ఆపన్న హస్తంలా ఉంటాడు
ఆగ్రహిస్తాడు
సముద్రం ఇంత బరితెగిస్తుందా అని
అడగండి అతన్ని

సముద్రం మీద బాగా కోపమా అని
కాకపోతే... అని నవ్వి శ్రీశ్రీని ఇచ్చింది కదా అంటాడు

ఎన్ని సభలు చూసి ఉంటాడు
ఎంత హృదయం పరచి ఉనిటాడు
శ్రీకాకుళ వీరగీతం లేని సభ కూడా సభ కాగాలదా...?
అనుమానం అతనికి
అందుకుంటాడు అతనే శ్రీకాకుళ గీతం

కవులారా మీరెటువైపు?
విశాఖ విద్యార్థుల సవాలు స్వీకరించిన కార్యకర్త
విరసానికి పురుడు పోసిన విప్లవ ప్రయాణికుడు
తన చరిత్ర విరసం చరిత్రగా
విరసం చరిత్రన తన చరిత్రగా
తనను తాను విరసానికి అర్పించుకున్న సాహిత్యోద్యమనేత

జల సముద్రం
జన సముద్రం
రెండు సముద్రాల వెంట అతని ప్రయాణం
జల విలయానికి
జన విప్లవానికి
అంతరం తెలిసినవాడు
చరిత్ర మలుపుల గుండా పురోగమించి
శిఖరం మీద
శ్రీకాకుళ రాజకీయాల్ని ఎత్తిపట్టిన
యోధుల చేతిలోని పతాక

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : arunatara1977@gmail.com
Like Page://arunatara viplava rachayitala sangham
Website : www. virasam. in

విశాఖ సముద్రం వెక్కివెక్కి ఏడ్చింది

- ఎస్వీ

మీ మరణవార్త విని చలసాని
ఉదయించే ఉదయమూ
మంచుగడ్డలా ఘనీభవించింది
మీ అస్తమయాన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో
బ్రేకింగ్ న్యూసు చూచి
విశాఖ సముద్రం విరామం ఎరుగని
అలలతో వెక్కి వెక్కి ఏడుస్తూ
ఒక్కసారి ఆపుకోలేని దుఃఖంతో భోరున రోదిస్తోంది
విప్లవ సాహితీ దిగ్గజం ఒరిగిపోయిందని
తెలుగు రాష్ట్రాల సరిహద్దులు చెరిపేసుకొని
తెలుగు సాహితీ కన్నీటి అక్షరాలు కారుస్తూ
కాలువలై ప్రవహిస్తున్నాయి ఎడతెగకుండ
సోదరి కృష్ణాబాయిని విశాఖలో వదిలిపెట్టి
అందని తీరాలకు అంత తొందరలోనే
చెప్పకుండ చెయ్యకుండ ఎలా వెళ్ళిపోయారు కామ్రేడ్!
విశాఖను వదిలి శ్రీశ్రీ, రావిశాస్త్రి వెళ్ళిపోవడంతో
విశాఖతో సాహిత్య బంధుత్వం తెగిపోతుందని
తెగ బాధపడుతున్న ఈ సమయంలో
ఇవ్వాల మీ చిరునామాను
ఎక్కడ వెదుక్కోమంటారు విశాఖపట్నంలో
శ్రీశ్రీ, కొడవటిగంటి
రావిశాస్త్రి రమణారెడ్డి మీరు
విరసం తొలి ఆవిర్భావ సభల ఊరేగింపులో
అగ్రభాగాన నడిచిన అపురూప దృశ్యం
మరిచి పోలేదు ఇంక మేం కామ్రేడ్
ఖమ్మం పురవీధుల్లో ప్రవహించిన
ఆనాటి విప్లవ నినాదాల వేడి వాడి
మా ఎర్రెర్రటి జ్ఞాపకాలలో మూటగట్టుకొని
చల్లారిపోకుండ భద్రంగ దాచుకున్నాం ఇవ్వాల్టికీ
'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే
శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి' అని
మీ కంఠం నుండి ఉద్వేగంలో పాడిన పాటను
వేల గొంతులతో మేమంత అందుకొని
కోరస్‌గా గొంతెత్తి పాడుతాం తుదికంట
అందుకోండి కామ్రేడ్ చలసాని!
అరుణారుణ దండాలు అందుకోండి ఇదుగో!

చలసాని ఒక చరిత్ర

వి. ప్రతిమ

'దుఃఖం, మరణించిన మనిషి ప్రాణాలను వెనక్కి తీసుకురాలేదు. అయినా ఆత్మీయులు కన్ను మూసినపుడు కన్నీరు కార్చకుండా ఉండలేం... అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే' - చలసాని.

చలసాని ప్రసాద్ గారి వంటి విప్లవ సాహిత్య పోరాట యోధుల్ని కోల్పోవడం నిజంగా బాధాకరం. కడుపులోంచి చెలిగి వచ్చే దుఃఖాన్ని ఎవరాపగలరు? నాకొక్కోక్కసారి అన్పిస్తూ ఉంటుంది ఒక చలసాని, ఒక బాలగోపాల్, ఒక మహాశ్వేతాదేవి, ఒక మదర్ తెరిస్సా వీళ్ళంతా కూడా మరణిస్తారా? కన్పడకుండా పోతారా? మృత్యువు నిజంగా ఎంత దయలేనిది... అని. అయితే దుఃఖం తగ్గాక లోతుగా ఆలోచిస్తే వీళ్ళంతా మరణించిన తర్వాత కూడా జీవించే ఉంటారన్న సత్యం అర్థమవుతుంది.

చలసాని ఎవరు? అనుకుంటే ఆయనే కాళోజిని గురించి చెప్పినట్లుగా ఆయన కవా? రచయితా? విమర్శకుడా? విప్లవకారుడా? ప్రజా నాయకుడా? అనుకుంటే ఆయన అన్నీను. ఆ మాటకొస్తే చలసాని విశ్వ స్నేహితుడు, ప్రపంచ ప్రేమికుడు కూడ.

చలసాని గారనుకోగానే మనకి విశాఖ సముద్రం గుర్తొస్తుంది. సముద్రమంత లోతు, కెరటమంత ఎత్తు, ఉధృతి, దీని గర్భమంత రత్నజ్ఞానఖని చలసాని. వారిలా అంకితభావం, నిజాయితీతో సమసమాజం కోసం కలలు గన్న, విప్లవించిన, మనుషుల్ని ప్రేమించడం మాత్రమే తెలిసిన ఒక తరం క్రమక్రమంగా కనుమరుగయి పోతోంది... ఆ నిబద్ధతనీ, ఆ నిజాయితీనీ, నిమగ్నతనీ, నిబిడత్వాన్నీ, ఆ నిర్భయత్వాన్నీ అంతే స్థాయిలో, ఆ తర్వాతి తరం అంటే మనం అంది పుచ్చుకోలేకపోవడం నిజంగా దురదృష్టకరం...

తాళాలు లేని ఇల్లు, పరీక్షలు లేని చదువు, పోలీసులు అవసరం లేని సమాజం ఏర్పాటు చేసుకుందామని 80ల్లో బన్నీతో ఒక కలను పంచుకున్నారని చెప్పారు వివి గారొచోట. అటువంటి కలలు కనడానికి ఎంత సాహసం కావాలి ఏ మనిషికయినా? సంకెళ్ళు లేని స్వేచ్ఛాపూరితమైన నేలమీద సంతోష సమతా కుటీరాలు వెల్లివిరియాలని తపన పడిన, ఆరాటపడిన సాహసోపేతమైన మహా స్వాప్నికుడు చలసాని.

విరసం స్థాపనలోనూ, శ్రీశ్రీని విరసంలో భాగస్వామ్యం చేయడంలోనూ చలసాని గారి పాత్ర కొనియాడదగినది. ఆ విశిష్ట సంఘటన గురించి ఇటు చలసాని గారూ, అటు వివి గారూ విడివిడిగా చెప్పిన సందర్భాలు చాలా అపురూపమయినవి. వారి నోటి నుండి స్వయంగా ఆ విశేషాలు వినడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

జనజ్వాలగారన్నట్లు దొడ్డి కొమురయ్య అమరత్వం అంది పుచ్చుకున్న 4 జూలై 70 మీద సంతకం చేసిన బడబాగ్ని మస్తిష్కాలలో చలసానిది ఒకానొక వాస్తవ సంతకం... సత్య సంతకం.

'ప్రజా రాజకీయాల ప్రభావంతో సాగే సాహిత్య ఉద్యమంలో నేను భాగస్వామిని, ఉద్యమం ఆరోగ్యవంతంగా కొనసాగాలంటే సాహిత్యం పట్ల ఆసక్తి ఉండి నిజాయితీతో పనిచేసే వ్యక్తులు కావాలి. వ్యక్తులు విడివిడిగా చేసే కృషి ఉద్యమం ఉమ్మడి లక్ష్యాలను సాధిస్తుంది... అలాంటి వ్యక్తుల్లో నేనొకడిని' అని చెప్పుకున్న చలసానిగారి మాటల్లోనే ఆయనేమిటో మనకి స్పష్టంగా అర్థమవుతుంది. ఆయనకి సమాజంతో, సాహిత్యంతో, రాజకీయాలతో ఉన్న అనుబంధమేమిటో అవగాహనకొస్తుంది.

ఆయన రాయడం కంటే ఎక్కువగా పని చేసేవారు. సాహిత్యకారులనీ, తద్వారా ప్రజలనీ ఉద్యమం కోసం ఉద్యుక్తుల్ని చేయడమే ప్రధాన లక్ష్యంగా జీవించారు.

'కలాలు విదిలించండి.

మురికి వదిలించండి.

పాళీలు పదునుపెట్టండి' అంటూ రచయితలనీ, కవులనీ పత్రికా విలేకరులను కూడా రచనోద్యుక్తుల్ని చేసేవారు. 'మీ ధాటిని చూపించండి, పునాదులు పెకలించండి' అంటూ ధైర్యాన్ని నూరిపోసే వారు. రక్తాక్షరాలతో చరిత్రను లిఖించమని రారమ్మని పిలిచేవారు. పత్రికల వాళ్ళకి భట్రాజులు కాకండి అంటూ హితవు పలికేవారు.

'భారత రాష్ట్రపతి కావడం కన్నా
విరసం అధ్యక్షుడిని కావడమే గొప్ప
సాధారణ సభ్యత్వం అంతకన్నా గొప్ప
అందుకే

నా శాశ్వత చిరునామా విరసం' అన్న శ్రీశ్రీ వాక్యాలు చలసాని గారికి సరిగ్గా అతికినట్లుగా సరిపోతాయి. సాహిత్యకృషిలోగానీ, విప్లవాభ్యుదయంలోగానీ తన వ్యక్తిగత ఎదుగుదలకి ఎంతమాత్రం తావివ్వకుండా విప్లవ సాహిత్య అభిమానిగానూ, నిరంతర పోరాటశీలిగానూ, నిత్యపాఠకుడిగానూ ఉండడానికే ఆయన ఎక్కువ ఇష్టపడ్డారు. ఏ విషయాన్నయినా, ఏ మనిషినయినా గుండెకి పట్టించుకునే ప్రేమ, అభిమానం ఉన్న వ్యక్తి చలసాని గారు. వారు జీవించి ఉండగానే ఒక పదేళ్ళముందే వారి మీద ప్రత్యేక సంచిక వచ్చి ఉంటే బావుండేదని పదే పదే అన్పిస్తోంది.

'విరసానికి ఊపిరి, ఉత్తేజం శ్రీకాకుళ పోరాటం. అన్ని అడ్డంకులూ దాటుకుంటూ ముందుకు వెళ్ళే విరసం ప్రోగ్రెస్ రిపోర్టు పోలీసు వాళ్ళకు బాగా తెలుసు' అంటుండే చలసానిది తెలంగాణ సాయుధ పోరాటంతో ముడిపడిన చరిత్ర... అది ఒకవైపు...

శ్రీకాకుళ పోరాట సమయంలోనూ, గోదావరి లోయ పోరాటంలోనూ, ఇంకా పౌరహక్కుల సంఘం మీద రాజ్యం దాడి చేసినపుడూ ఇలా అనేక రకాల ఉద్యమాలలో ప్రధాన పాత్ర వహించి అనేక సార్లు ఆయన జైలుకెళ్ళడం జరిగింది. జైల్లో కూడ ఆయన విప్లవాన్నే కలగనేవారు. మిత్రులంతా ఆయన్ని చలసాని ప్రసాద్‌గా కాక ముచ్చటగా చెరసాల ప్రసాద్‌గా పిలుచుకునేవారట. పుస్తకం చదివినంత తేలిగ్గా, మీటింగులకు వెళ్లినంత హాయిగా జైళ్ళ అర్థాన్నే మార్చేశారంటారు.

శివారెడ్డిగారన్నట్లు మనుషులు పచ్చికుండల్లా పగిలిపోతున్న సమయంలో చలసాని ప్రసాద్ లాంటి వ్యక్తుల మధ్య బతకడం, చరించడం స్నేహించడం, సృజించడం నిజంగా గొప్ప అనుభవం. ఒక గొప్ప ఆశ, గొప్ప పోరాట ఉత్సాహం.

వారు మా నాయుడిపేటకి వచ్చి నాతో పాటు నాలుగయిదు రోజులుండడమనేది నాకో గొప్ప జ్ఞాపకం... రాగానే 'సినిమా సెట్టింగులా పెట్టావు కదరా ఇల్లు' అన్నారు... రెండు రోజులు గడిచాక ఏమాత్రం ఆడంబరాల్లేని, రాజకీయాల్లో ఉండి కూడ డబ్బు మీద, అధికారం మీద యావలేని కుమార్రెడ్డి గారిని అభిమానించడం మొదలు పెట్టారు. ఆ తర్వాత ఎప్పుడు ఫోన్ చేసినా 'కుమార్రెడ్డి బావున్నారా నాన్నా' అని తప్పనిసరిగా అడిగేవారు... ఒకసారి నా పుట్టిన్రోజున ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్తూ ఏ సంవత్సరం పుట్టావురా నాన్నా' అన్నారు. 'యాభయ్యారులో' అంటే యాభయ్యారా? అరవయ్యారా గుర్తు చేసుకోరా' అన్నారు. కాసేపటికి కానీ అర్థం కాలేదు నాకు. వారు మా ఊళ్ళో ఉన్న ఆ నాలుగయిదు రోజులూ మా ఊరి స్వర్ణముఖీ నది తీరంలో ఎన్నెన్నో విషయాలను కలబోసుకుంటూ మేము నడిచిన అడుగులు ఇప్పటికీ నన్ను పలకరించి తడి జ్ఞాపకాల ముచ్చట్లు పెడుతుంటాయి... మా గుడి పూజారి ఎప్పుడూ చలసాని, వివి గార్లిద్దరి క్షేమ సమాచారాలు ఆరా తీస్తూ వారి క్షేమం కోసం ప్రార్థిస్తుంటాడు. సమాజమూ, రాజకీయమూ బాగా తెలిసిన ఆ పూజారి చలసానిగారికి బాగా ఎరుకే...

విప్లవాగ్ని ఎప్పుడూ కొడిగట్టిపోదు. అది రగులుతూనే ఉంటుంది... ఒక సన్నని చిరుగాలి వీస్తే చాలు అందులోంచి మంటలు లేచి జ్వాలలై చుట్టూ ఉన్న సమాజంలో వెలుతురుని నింపుతాయి. ఎటొచ్చీ ఆ రగులుతున్న నిప్పుని మంట చేసే చిరుగాలి కోసమే మన ఎదురు చూపంతా...

ఆ బాధ్యతని, ఆ నిమగ్నతని, ఆ నిబద్ధతని, మొత్తంగా ఆ మూర్తిమత్వాన్ని ఈనాడు యువతరం అంది పుచ్చుకోవల్సిన అవసరం ఎంతయినా ఉంది.

స్వాతంత్ర్యం, సమభావం
సౌభ్రాత్యం, సౌహార్ధం
శాంతి శాంతి కాంతి శాంతి
సకల జనం, సకల జగం
సంద్రంలా పొంగాలి

సంగీతం పాడాలి' అనే చలసాని గారి అమరత్వాన్ని మనం దోసిట్లోకి తీసుకోవాలి.

ఆయన్ని తలుచుకోవడమంటే, ఆయన్ని స్మరించుకోవడమంటే వారు విడిచిపెట్టి వెళ్ళిన పనిని అందుకోవడమే. అదే ఆయనకి మనమివ్వగల గొప్ప నివాళి.

చలసాని ప్రసాద్‌గారికి భాష్పాంజలి

- తుర్లపాటి రామమోహన్‌రావు

అశనిపాతములాంటి నీ మరణ వార్త విని
గుండెల్లో ఏమూలో కలుకుమన్నాది
గుబులేదో మనసులో ఆవరించింది
పెద్ద దిక్కిక మాకు ఎవ్వరెవ్వారనుచు
మదిని తొలచే ప్రశ్న దిగులు రేపింది
ఎదలోన ముల్లయ్యి గుచ్చుకున్నాది
నోట మాట రాక నిశ్చేష్టుడయ్యాను
నిను యాది చేసుకుని గొల్లుమన్నాను
నీ మాట ఎదలోన పదిలమున్నాదిలే
నీ మూర్తి, నీ స్ఫూర్తి మాతోనే ఉందిలే
భాష్పాంజలుల తోడ బాస చేసేము
మడమ తిప్పక పోరుబాట నడచేము
వేగుచుక్కై మాకు దారి చూపించు
తోడువై మాకెపుడు తోవ చూపించు
జోహార్లు జోహార్లు విప్లవ జోహార్లు
చలసాని జోహార్లు అందుకోవయ్యా.

విరసం చిరునామా!

డా. బీరం సుందరరావు

ఆ నవ్వు లేక విశాఖతీరం బోసిపోయింది
గుండె నిండా తడివున్న
కొండంత సాహితీమూర్తి లేడని తెలిసి
నిండు సముద్రం తనలో తాను ఇంకిపోయింది
ఆ సాయంత్రం పొద్దు కూడా త్వరగా
కుంకిపోయింది

చినుకురాలని వానాకాలంలో
నా కళ్ళు మేఘాలయ్యాయి
విప్లవ శిఖరం కూలిందన్న వార్తతో
విశాఖన నగరం ఎరుపెక్కింది
అపుడు జూన్ 15న శ్రీశ్రీ కోసం ఏడ్చాను
ఇపుడు జూలై 25న సీపి కోసం దుఃఖిస్తున్నాను
'దారి తప్పిన బాటసారి'లా
నేనో అనాథనై, అభాగ్యుణ్ణై
'రీడింగ్ రూం' ప్రాంగణంలో
గుండె బరువును దించుకుంటున్నాను

నిజం చెప్పాలంటే -
రాస్తుండగనే కలం ఆగిపోయింది
చూస్తుండగనే శ్వాస ఎగిరిపోయింది
అరసం నించి విరసం దాక
కాలాన్ని కలంతో కొలిచిన
ఒకానొక సాహిత్య చరిత్రకారుడు
లోకం నించి నిష్క్రమించాడు

పేరు కోసం తపించే లోకంలో
'నేను'ను స్వీయ నిఘంటువు నుండి తొలగించి
'మనం' గా మార్చిన నిరాడంబర విశ్వంభరుడు
వేల పుటల సంపుటాలో
శ్రీశ్రీ, కొకు, గోపీచంద్‌లను
చిరంజీవులుగా చేసినవాడు
శ్రీశ్రీ కాళిదాసును సాధికారికంగా వ్యాఖ్యానించిన
మన తరం మల్లినాథుడు
'అరుణతార' అక్షరాలకు
అన్నీ తానై ఎరుపును అద్దినవాడు
రచనలకు రంగు, రుచిని సింగారించి
ఆఖరి సంతకంగా మిగిలినవాడు
నిన్న నవ్వుతూ పలకరించినవాడు
నేడు నవ్వుతూ మాయమైనవాడు
పదునైన విమర్శకు పట్టం కట్టినవాడు
అదును తెలిసి కవిత్వాన్ని ఆహ్వానించినవాడు
అరసంతో అడుగువేసినా
విరసంగా విరబూసినా
శ్రీశ్రీ చుట్టూ తిరిగిన
ఈ శతాబ్ది సాహిత్య చరిత్రకు
అక్షర భాష్యకారుడుగా నిలిచినవాడు
మూడక్షరాల 'విరసాన్ని'
'శాశ్వత చిరునామాగా మార్చుకున్న
వైజాగ్ మార్క్స్' మన చలసాని!
కమ్యూనిస్టు ఆకారంలో నడిచే
గొప్ప హ్యూమనిస్టు మన చలసాని మాష్టారు!

అహం అతడి ఆరో వేలు
ఆత్మీయత బొటన వేలు
ఆప్యాయంగా ఆలింగనం చేసుకునే
అమ్మతనం చలసాని ఆస్తి
పుస్తకాలతోనే అతడి దోస్తీ!
భూమి, చంద్రుడు మధ్య
దూరాన్ని కొలవగలం గాని
చలసాని హృదయాన్ని కొలవలేం
విశాఖ సముద్రమంత లోతు
విశాఖ నగరమంత విశాలం
యారాడ కొండంత ఎత్తు
కమిట్‌మెంట్ ప్లస్ పంక్చుయాలిటీ కలిస్తే
నడుస్తూ కన్పించే వారే కామ్రేడ్ సిపి
సీపి నిత్య పురోగామి!
నిరంతర నవ్య పథగామి!!
అరసానికి ఆస్తి!
విరసానికి శ్వాస!!

మనం ఇవాళ చల్లే విత్తనాలే
రేపు ఆలోచనలై మొలకెత్తుతాయి
చలసాని మొలకెత్తే విత్తనం
విరబూసే ఆలోచనల చెట్టు
నీడనిచ్చిన మహావృక్షం
ఆత్మీయత పంచిన అమ్మఒడి
అనురాగం వర్షించే వాత్సల్య మేఘం
చిరునవ్వుతో స్నేహాన్ని చిగురింపచేసే
విశాల హృదయ జనిత సాహితీ సరాగం!
అడవుల్లో, కొండమూలల్లో
విరబూసిన చదువుల పాల బుగ్గల్ని నిమిరి
భవితవ్యాన్ని పరిచిన బంగారు బాట!

చలసాని గురించి చెప్పడమంటే
మంచి పుస్తకానికి ముందు మాట రాయడమే!
మనుషుల గుండెల మధ్య సకల అడ్డుగోడల్ని
తొలగించి
'తెరిచిన పుస్తకం'లా వెళ్ళిపోయిన ప్రసాద్‌గారు
పుటల మధ్య విప్పారిన అక్షర తపస్వి
పుస్తకాల్నే కాదు, లోకాన్నీ చదివిన
సమకాలీన సాహితీ పారంగతుడు
గుప్పెడు గుండెలో ఘూర్ణిల్లే అక్షర ఘోష
తనను తాను శిల్పీకరించుకున్న భాష
సరిహద్దుల్నీ, కొలబద్దల్నీ చెరిపేసి
కవుల గుండెల్ని మీటిన సహృదయవైణికుడు
కనుకనే సిపికి కవిత్వం తీరని దాహం
శ్రీశ్రీ కోసమే పుట్టిన మహాక్షర ప్రస్థానం
సమాజం కోసం శ్రీశ్రీ బతికితే
శ్రీశ్రీ కోసం తన శ్వాసను దానం చేసిన
జీవన సాఫల్య సిద్ధాంతకారుడు

అటు శ్రీశ్రీ, ఇటు స్టాలిన్
మధ్యలో ఎరుపెక్కిన చైతన్యమైన చలసాని
పాతకాలం పద్యాలు రాసే పాపయ్యశాస్త్రిగారు
స్టాలిన్‌ను పద్యాల తేరు మీద ఊరేగిస్తే
గళంలో గలగలా గానం చేసిన
విరసం ఘంటసాల మన చలసాని
శ్రీశ్రీ కవితా సముద్రాన్ని పుక్కిలించిన
ఆధునిక అగస్త్యుడు చలసాని ప్రసాద్‌గారు
నిన్నటి దాకా మన మధ్య
జీవనదిలా ప్రవహించిన మనిషి
ఇవాళ లేడంటే
ఇంకిపోయినవి నదిలో నీళ్ళా?
అభిమానుల ఎదలో కన్నీళ్ళా?

ఎప్పుడో అన్నాడు అజంతా
శ్రీశ్రీకి ముందూ, వెనుకా అంతా శూన్యమని!
ఇప్పుడూ అంతే!
శ్రీశ్రీకి ముందూ వెనక నిల్చినవాడు సిపి ఒక్కడే!

(విరసం భాష్యకారుడు కా. చలసాని ప్రసాద్‌గారి
స్మృతికి అక్షర నివాళి)



విరసం అరుణతార చలసాని ప్రసాద్

ప్రమోద్

కామ్రేడ్ చలసాని ప్రసాద్ జూలై 25న విశాఖలో గుండెపోటుతో చనిపోయిన వార్తను పత్రికలో చదివి విచారించాము. వెంటనే మా ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర అధ్యక్షులు డా. హన్మేష్‌తో ఈ విషయం చెప్పాను. మా రాష్ట్ర కార్యవర్గం సమావేశమైనాము. కా. చలసాని ప్రసాద్‌కు మహబూబ్‌నగర్ జిల్లా, నారాయణపేటలో జరుగుతున్న మా రాజకీయ తరగతులలో శ్రద్ధాంజలి ఘటించాలని నిర్ణయించాము. ఆ మేరకు నేను రాష్ట్ర రాజకీయ తరగతులు రెండవ రోజు ప్రారంభంలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టినాను. ప్రతినిధులు నివాళి అర్పించి, విప్లవ జోహార్లు తెలియజేసారు. కా. చలసాని ప్రసాద్ గురించి నాకు తెలిసిన రెండు మాటలు చెప్పినాను. చలసాని ప్రసాద్ గారి పేరు 'అరుణతార' పత్రికలో చదివాను. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులలో ఒకరై, సుదీర్ఘ కాలం ఆ సంస్థలో కొనసాగడం ఒక విశేషమే. సాహిత్య కృషి చేయడం ఒక కమిట్‌మెంట్ ఉన్నవాళ్ళకే సాధ్యపడుతుంది. విరసం ప్రస్థానంలో అనేక మలుపులున్నాయి. సైద్ధాంతిక చర్చలు జరిగినాయి. సంస్థ నుండి వ్యక్తిగత వ్యాపకాలతో వెళ్ళి పోయినవారున్నారు. సైద్ధాంతిక అభిప్రాయ బేధాలతో విడిపోయినవారున్నారు. విరసం మొదటి మహాసభలు ఖమ్మంలో జరిగినాయి. ఈ మహాసభలలో ప్రపంచ విప్లవాల నడతను, ఉరకలను సరైన దిశా నిర్దేశాలను నిర్ణయించుకున్నారు. విప్లవోద్యమ పురోగమనాన్ని ఎత్తిపట్టి ముందుకు సాగాలని శపథం పూనినారు. విరసం కృషి మొత్తం ప్రజా పోరాటాలను ఎత్తి పట్టడమే అయింది. అందులో కా. చలసాని కార్యకర్తగా పని చేసాడు. ఆయన పేరు ప్రతిష్టల కోసం కాకుండా ఒక సుదీర్ఘ విప్లవ లక్ష్యం కోసం అహర్నిశలు పోరాడాడు. రాలిపోతున్న విప్లవ తారలు ఒక వైపు, నిలబడుతున్న ఎర్రజెండాలు మరొకవైపు జమిలి సందర్భాలలో తానొక భూమికలాగా బాధ్యతలను మోసాడు. విశాఖ నుంచి హైదరాబాద్ వరకు సుదీర్ఘ ప్రయాణం చేసినాడు. ఎన్నో సాహిత్య పాఠశాలలు నడిపినాడు. యువకులను ప్రోత్సాహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చలసానికి ఎంతోమంది మిత్రులున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాకారమైనదని సంతోషించాడు, సంతృప్తినొందినాడు.

ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంలో ఓరుగల్లు ప్రత్యేక స్థానం కలిగినది. విప్లవ శిశువులను, విప్లవకారులను సానబట్టిన విప్లవ పాఠశాల కాకతీయ యూనివర్సిటీ సూరపనేని జనార్దన్, పులి అంజయ్య, లింగమూర్తి, ఐలయ్య, రాజమల్లు, ఆర్ఇసీ నుండి చెరుకూరి రాజ్‌కుమార్ వరకు విప్లవానికి అంకితమైనారు. అమరులైనారు. అలాంటి అమరత్వం గలిగిన ఓరుగల్లు గడ్డమీద ఏనుమాముల మార్కెట్‌లో విప్లవ రాజకీయాల నెత్తిపడుతూ జరిగిన సభలో చలసాని ఒక ప్రత్యేకత. అమరుల స్థూపావిష్కరణ తన చేతుల మీదుగా జరిగినది. విప్లవోద్యమాల గర్జనలు ఓరుగల్లు నగరంలో దిక్కులు మారుమ్రోగి దండకారణ్యం వైపు ఉరుముతూ చిరుగాలి సితారై గోదావరి పరివాహక ప్రాంతం అసాంతం ఆవరించి రాజ్యాన్ని సవాల్ చేస్తున్నాయి. ఎన్నో త్యాగాలు, ఎంతో అమరత్వం ఇండియాపై అరుణతార నెలవంకలాగా తళతళ మెరుస్తుంది. కిషన్‌జీ, గంటి ప్రసాదం లాంటి తారాజువ్వలు, నిప్పురవ్వలు, మెరుపులు అబూజ్‌మాడ్, జంగల్‌మహల్‌లో రైతు సాయుధంగా రాజ్యాన్ని నిలదీసే ధైర్యం, సాహసం తెచ్చుకున్నాడు. అది నక్సల్బరీ వసంత మేఘగర్జన వారసత్వం, శ్రీకాకుళం సాయుధపోరుదాడుల గుర్తులు, ముషాహరి, ఉన్న ప్రవాయిల్, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట త్యాగాలు నేడు కొనసాగుతున్నాయి. ఆ పరవళ్ళ ఉరకల మీద విరసం అడుగులు వేస్తుంది. కలాన్ని ఝుళిపిస్తుంది. సాహిత్యాన్ని సృష్టిస్తుంది. విశ్వవేదికల మీద గళం విప్పుతుంది.

1947లో భారత దేశానికి అధికార మార్పిడి జరిగింది. దొరలు, భూస్వాములు, బూర్జువాలకు స్వాతంత్ర్యం వచ్చింది. ఈ స్వాతంత్ర్యంలో అభ్యుదయాన్ని, సోషలిజాన్ని, అభివృద్ధిని చూసే కవులు, సాహిత్యకారులు బయలు దేరినారు. నెహ్రూ ఎర్రగులాబీలు సోషలిజం ధగధగలు చూసి మురిసినారు. అరసంవాదులు శ్రీశ్రీ లాంటి మహాకవిని 1970 వరకు సాహిత్యం నడిపించింది. 1970 నుండి సాహిత్యాన్ని శ్రీశ్రీ నడిపించినాడు.

ప్రియమిత్రుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్‌ను గుర్తు చేసుకుంటూ

సనోబర్, అనువాదం: పిఎస్ఆర్

కామ్రేడ్ చలసాని ప్రసాదు నుండి, ఆయన స్వదస్తూరితో రాసిన పోస్టుకార్డు కొద్ది సంవత్సరాల క్రితం చివరి సారిగా నాకు అందింది. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు, వాట్సప్‌ల ద్వారా క్షణాల్లోనే సమాచార మార్పు జరుగుతోన్న ఈ శకంలో 'నత్త నడక తపాల'గా ఈసడింపుకు గురౌతున్న పోస్టు ద్వారా చేతిరాత ఉత్తరాలను మనం ఇప్పుడు పంపడం లేదు. పోస్టుకార్డులు మన మధ్య నుండి మాయమయ్యాయి. కాని, ఒక నేస్తం తన చేతి రాతతో పంపిన కార్డును అందుకున్నప్పుడు ఎంత ఆనందించేవాళ్ళమో అనే జ్ఞాపకం మాత్రం మిగిలే ఉంది. అలానే, చలసాని కూడా వెళ్ళిపోయారు. కాని ఆయన జ్ఞాపకాలు నాకు ఉత్తేజాన్ని కల్గిస్తాయి, నా జీవితానికంతటికీ ఊరటనందిస్తాయి.

1980ల తొలినాళ్ళలో బొంబాయి విద్యార్థి ఉద్యమ కార్యకర్తలుగా మేము ఆంధ్రప్రదేశ్‌లోని విప్లవోద్యమం పట్ల ఎంతో ఆదరంతోనూ, గౌరవంతోనూ ఉండేవాళ్ళం. విప్లవపు గుండెకాయ అయిన ఆ ప్రాంతాన్ని మొదటిసారి సందర్శించిన వేళా విశేషాలు నాకు బాగానే గుర్తున్నాయి. 1981లో ఒక విద్యార్థి ప్రతినిధి బృందంలో భాగంగా నేను గుంటూరులో జరిగిన రాడికల్ విద్యార్థి సంఘ రాష్ట్ర మహాసభలకు వెళ్ళాను. దారిలో మేము వస్తున్న రైలులోనే వరంగల్ స్టేషన్‌లో కామ్రేడ్ వివి ఎక్కడంతో మా అదృష్టానికి ఎంతో మురిసిపోయాం. అపుడు కామ్రేడ్ అనురాధ గాంధీ సహా కలసి ప్రయాణిస్తున్న కామ్రేడ్ కోబడ్ గాంధీ (ఆయన్ను ఆ మహాసభకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు) వివిని మాకు పరిచయం చేశారు. సంభ్రమాశ్చర్యలతో ఉన్న నాకు ఆయనతో ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో తోచక మూగదానిలా ఉండిపోయిన విషయం నాకు బాగానే గుర్తుంది. అపుడు మేమంతా విప్లవోత్సాహంతో తుళ్ళి కేరింతలు కొడుతున్న యువజనులం కదా! ఆ గుంటూరు మహాసభలోనే గద్దర్ పాడగా విన్నాను - అపుడు ఆయన నల్లని జుట్టు గల యువకుడు. ఆయన మమ్మల్ని మైమరపింపజేశాడు. శ్రీశ్రీ కవితల అనువాదాలు విన్నాం. విరసం ఏర్పాటు వెనక కథలను విన్నాం. సికిందరాబాదు కుట్రకేసు వివరాలు తెల్సుకుని ఆందోళన పడ్డాం. అరుణతార, సృజన సంచికలను కొన్నింటిని చూశాం. మాకు తెలుగు ఒక్క అక్షరం కూడా తెలియనప్పటికీ అరుణతార, సృజనల కొన్ని సంచికలను కొన్నాం. ఎంతో గొప్ప పుస్తకాలైన డొమిల్లా టారోస్ రాసిన 'నన్ను మాట్లాడనివ్వండి' అనే పుస్తకం, అష్రఫ్ దెఘాని అనే ఇరానియన్ విప్లవ మహిళా గెరిల్లా రాసిన మరో పుస్తకపు తెలుగు అనువాద ప్రతులను అక్కడ చూసి ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాం. వాటి ఆంగ్లప్రతులు మాకు అప్పటికింకా దొరకనేలేదు! అరువు తెచ్చుకున్న కెమెరాతో ప్రదర్శనలిస్తున్న గద్దర్ ఫోటోలు తీసిన విషయం ఇప్పటికీ గుర్తుంది. ఆనాడు నవయవ్వన మేధస్సులపై విప్లవ ప్రభావం అలా పడింది. ఆనాడు నాలానే విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా పని చేస్తుండిన నవతను ఆ సభలోనే కలిశాను. ఆమెతో, ఆమె తండ్రి, చలసాని ప్రసాద్‌ను మూడేళ్ళ తరువాత, ఢిల్లీలో ఎఐఎల్ఆర్‌సి ప్రారంభ మహాసభలోనే నేను తొలిసారి కలిశాను.

అపుడు నేను అహ్వాన్ నాట్యమంచ్‌లో క్రియాశీలంగా పని చేస్తుండే దానిని. అటు తర్వాత, దాదాపు దశాబ్దం పాటు ఆ సంస్థ ప్రతినిధిగా ఎఐఎల్ఆర్‌సి ఎగ్జిక్యూటివ్ కమిటీలో పని చేశాను. ఆ విధంగానే, నాకు ఆంధ్రప్రదేశ్ విప్లవ సాహిత్యోద్యమంలో కాకలు

విప్లవోద్యమానికి 1964, 1968లో రివిజనిస్టులు సరికొత్త భాష్యాలు చెప్పినారు. వారి ప్రతినిధి వర్గీయులు కృశ్చేవ్ శాంతియుత ఆర్థిక పోటీ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చినాడు. పార్లమెంటరీ రాజకీయాలు ముందు వరుసలో పెడుతున్న వర్గ సంకర వాదుల ప్రతినిధులు అరసంలో మెజారిటీగా ఉండి, దాని కాళ్ళు, చేతులు బంధించినారు. అప్పుడు శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రి, దిగంబర కవులు, విరసం ఆవిర్భావానికి పునాదులు వేసినారు. వారి శిష్యుడే చలసాని ప్రసాద్‌గారు. శ్రీశ్రీ సన్నిహితుడుగా, శిష్యుడుగా, శ్రీశ్రీ విప్లవ కవిత్వాన్ని నలుదిశలా ప్రజ్వరిల్లేలా నడుం కట్టినాడు. అవిరామంగా మోసుకుపోయినాడు. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం, కొకు సాహిత్య సర్వస్వం భవిష్యత్తరాలకు అందించినాడు. ఇదొక గొప్ప సాహిత్య కృషి. రచయితలు, కవులు, కథకులు నేడు చేయవలసింది కూడా ప్రధానమైన కర్తవ్యం. ఆ కృషి కా. చలసాని ప్రసాద్‌గారు చేసినారు. తెలుగు సమాజంలో చలసాని, సిఎస్ఆర్ ప్రసాద్‌లు విరసం కుటుంబ సభ్యులై విరసాన్ని ముందుకు తీసుకుపోవడంలో కృషి చేసినారు. విశాఖ మహానగరంలో కళాశాల అధ్యాపకుడుగా మూడు దశాబ్దాలుగా పాఠాలు చెబుతూ, విరసం బాధ్యతలతో ఉన్నాడు. ఎన్నో విప్లవ వేదికల మీద ఉపన్యసించాడు. రాజ్యం డేగకళ్ళ చూపులకు వణికిపోతున్న మురికి వాడల ప్రజలు, దళితులు, కార్మికులు, జాలరులు, పేదలు, మహిళలకు గుండె ధైర్యం ఇచ్చినాడు. అండగా కలాలను సంధించినాడు. గొంతు నిప్పినాడు. తనే కాకుండా విరసాన్ని, కుటుంబాన్ని ముందు వరసలో పెట్టినాడు. విప్లవోద్యమంలో తన కూతురును పయనింపజేసినాడు.

కా. త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు, కృష్ణాబాయి, గోరుమాధవరావు, వై. కాశీపతి, నమ్ము, తదితర సహచరులతో కా. చలసాని కవిత్వ సహచర్యం చేసినాడు.

కా. చలసాని ప్రసాద్ విప్లవోద్యమ వీరపుత్రుడు, అలుపెరుగని కళాయోధుడు. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం పోరాడాడు. సామ్రాజ్యవాదం, అర్ధ భూస్వామ్య సమాజం అంతం కోసం శక్తినంత ధారపోసాడు. కుటుంబాన్ని సైతం విప్లవంలో పరుగులు దీయించినాడు. ముగ్గురు అమరులను కోల్పోయాడు. యువతరం, కవులు, రచయితలు కా. చలసాని నమ్మిన సమాజం కోసం పోరాడాలి. అదే కా. చలసానికి మనం అందించే నిజమైన నివాళి.

తీరిన ఇద్దరు యోధులు - కెవిఆర్, చలసాని ప్రసాద్ - పరిచయమయ్యారు, దృఢ నేస్తాలమయ్యారు. ఎఐఎల్ఆర్‌సిలో వారు నాకు గాడ్‌ఫాదర్స్ లాంటి వారని చెప్పాలనిపిస్తుంది కాని ఆ పోలిక సరైనది కాదు. వారిద్దరు మా నాన్న కంటే వయసులో పెద్దలు. నా కంటె ఎంతో ఎక్కువగా అధ్యయనం చేసినవారు, విషయం పరిజ్ఞానం కలవారు, అనేకానేక పోరాటాలలో పాలు పంచుకున్న వారైనప్పటికీ వారు నన్ను తమతో, సమానురాలిగానే చూశారు. వారు నాకు బోధన గరిపారు, సమస్యలపై ఎటువంటి మినహాయింపులు లేకుండా సమగ్రంగా నాతో చర్చించారు. ఒక్కోసారి నాతో గాఢంగా విభేదించేవారు. నేను వారి అభిప్రాయాలకు ఎంత విలువ నిచ్చేదానినో వారు నా అభిప్రాయాలకు అలానే ఎల్లవేళలా విలువనిచ్చేవారు. కెవిఆర్, చలసాని వీరిద్దరు చాలా సన్నిహిత మిత్రులు, కామ్రేడ్లు. అయితే ఎవరి వ్యక్తిత్వాలు వారివి. కెవిఆర్‌లో కలివిడితనం తక్కువ కనబడేది. ఆయనతో పోలిస్తే చలసాని కొంత సున్నితతత్వంతో కలివిడిగా ఉండేవాడు. కెవిఆర్ అప్పుడప్పుడు ముక్తసరిగా మాట్లాడేవారు. చలసాని సాపేక్షికంగా సౌమ్యంగా మాట్లాడేవారు. కాని వారిద్దరిని నేను ఎంతగానో అభిమానించాను, గౌరవించాను. వారు సైతం నా పట్ల అలానే ఉండేవారు. జాతీయ భాషగా హిందీని సమర్థించాలా అనే సమస్యపైనే కానివ్వండి, లేదా ఒక కళాకారుడు సరైన వర్గ దృక్పథాన్ని ఎలా అలవర్చుకోవాలి అనే విషయం పైనైనా కానివ్వండి వారు ఆచి, తూచి, వడపోసి రూపుదిద్దుకొన్న భావాలను వ్యక్తం చేసేవారు. నాకూ, ఇతరులకూ కూడా గురుతుల్యులుగా నిల్చారు.

ఎఐఎల్ఆర్‌సి కమిటీ సమావేశాల మధ్యకాలంలో వారు పోస్టుకార్డుల ద్వారా నాతో సమాచారాన్ని పంచుకునేవారు. కెవిఆర్ చీమ తలకాయలాంటి అక్షరాల తనచేతిరాతతో ఒక పోస్టుకార్డులో ఇంచుమించుగా 300 పదాల దాకా కుక్కేవారు; దాంట్లో ఆయన సలహాలను, తీసుకున్న నిర్ణయాలను తెలియజేసేవారు. ఎఐఎల్ఆర్‌సికి సంబంధించిన విషయాలపై నా అభిప్రాయాలను కోరేవారు. కాగా, చలసాని చదవడానికి నానా తిప్పలు పడాల్సి వచ్చే ఆయన చేతిరాతలో పెద్ద అక్షరాలతో 50 పదాల కంటే తక్కువగానే రాసేవారు. అయితే ఆయన అందులో ఎక్కువలో ఎక్కువగా ఏదో ఒక పుస్తకాన్ని తన లైబ్రరీ కోసం సేకరించి పెట్టమనే అభ్యర్థనతోనే ఉండేది. 1980ల మలినాళ్ళలో మహారాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఎంపిక చేసిన రచనల సంపుటాలను ప్రచురించడం మొదలు పెట్టింది. ఒక కొత్త సంపుటి వచ్చిందో లేదో, దాన్ని కొని తన లైబ్రరీకి తక్షణమే పంపాలని కోరుతూ చలసాని నుండి ఉత్తరం అందేది. ఒక మేధావిగా అంబేద్కర్‌ను ఇప్పటి దాకా తక్కువ అంచనా వేయడం జరిగిందని, ఆయన రచనలను మనందరం చదివాలని ఆయన నొక్కి చెప్పేవారు. పాత పుస్తకాలను తవ్వి వెలికి తీయడంలో కూడా చలసానికి తీరని దాహం ఉండేది. గాంధీని విమర్శిస్తూ 'గాంధీ అహింస - ఎక్స్ రే' అనే మార్క్సిస్టు సామాజిక శాస్త్రవేత్త, క్రియాశీల కార్యకర్త అయిన ఎఆర్ దేశాయ్ 1930లలో రాసిన పుస్తకాన్ని సంపాదించిపెట్టమని ఆయన నా వెంట బడిన సందర్భం నాకు ఇంకా గుర్తుంది. నాకు ఎఆర్ దేశాయ్ కొడుకుతో పరిచయం ఉంది. తన తండ్రి తాలూకు పత్రాల నుండ లీ పుస్తకాన్ని వెతికి పట్టుకొమ్మని నేను ఆయన్ని వేధించాను. చివరికి ఆయన వెతికి, శిథిలావస్థలో ఉన్న ఆ రచన ప్రతినొకదాన్ని సంపాదించి నాకిచ్చారు. దాని కాగితాలు పచ్చ రంగులోకి మారి ముట్టుకుంటే చిరిగిపోయేటట్టు ఉండి చాలా జాగ్రత్తగా చూసుకోవల్సిన స్థితిలో ఉంది. దాని జిరాక్స్ ప్రతిని చలసానికి పంపగా ఆయన నన్ను అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలుపుతూ ఒక పోస్టు కార్డు రాశారు.

చలసానికి సంబంధించి నాకు అత్యంత విలువైన జ్ఞాపకం 1990ల మలికాలం నాటిది. క్షణం తీరిక లేకుండా సాగే రాజకీయ జీవితంలో అతలాకుతలమయ్యే స్థితి నన్ను అప్పటికే ఒక అసమ్మతి వాదిని చేసింది. ఉద్యమంలో నాతో కలిసి ఎదిగిన కామ్రేడ్లు నన్ను దూరంగా పెట్టారు. సమిష్టి జీవనం తాలుకు సౌకర్యం, మద్దతు, కార్యాచరణ ముగింపుకు వచ్చినట్లైంది. నాకు అన్యాయం జరిగిందని, నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారని, ఒంటరిని చేశారని భావించేదాన్ని, 'ఎడారిలో నిలిచాను' వ్యక్తిగతంగాను, రాజకీయపరంగాను, అది చాలా గడ్డుకాలం. అపుడు ఒక రోజు చలసాని నాకు టెలిఫోన్ చేశారు. విద్యార్థి సంఘ రాష్ట్ర స్థాయి సభకు ముఖ్య అతిథిగా ఆహ్వానితుడై ఆయన అపుడు ముంబాయిలో ఉన్నారు. సభాస్థలికి వచ్చి తనను కలవమని ఆయన నన్ను ఆహ్వానించారు. పోవడం నాకు మింగుడు పడని విషయమే అయినప్పటికీ బరువు గుండెతోనే అక్కడికి వెళ్ళాను. హాలులోకి అడుగు పెట్టగానే ఆయన చూపు వేదికపై నుంచి నాపై పడింది. వేదిక మీదికి నన్ను రమ్మనమని సైగలు చేశారు. నేను వేదిక దగ్గరికి చేరుకోగానే ఆయన మూడడుగులు ఎత్తు వేదికపై నుంచి చెంగున దూకి (ఆ వయసు మనిషికి అది సామాన్య విషయం కాదు) తనదైన విలక్షణమైన తీరులో నన్ను ఉడుంపట్టుతో గుండెకు హత్తుకున్నాడు. నేను కన్నీటిని ఆపుకోలేకపోయాను.

ఆ సాయంత్రం నాతో పాటు మా ఇంటికి వస్తానని పట్టుబట్టారు. ఇద్దరం అన్నం వండుకు తిని, ఆపైన కూచుని మాటల్లోకి దిగాం. నా ఇబ్బందుల గాథలను ఒకసారి నాతో విభేదిస్తూ, ఇంకోసారి ఏకీభవిస్తూ ఆయన శ్రద్ధగా, ఓపికగా విన్నాడు. సంభాషణల ముగింపులో ఆయన నాకు పోరాటాన్ని కొనసాగించగల సాహసం, నిబద్ధత ఉన్నాయని, తాను గాఢంగా విశ్వసిస్తున్నానని అన్నారు. పశ్చాత్తాప వేదన, చిల్లరమల్లర వ్యక్తిగత విభేదాలను అధిగమించి, మన సిద్ధాంతం నుండి, ప్రజా పోరాటాల చేవ నుండి స్ఫూర్తిని తీసుకోవాలని అన్నారు. అంతే తప్ప ఏదో ఒక సంస్థ లేదా నాయకత్వపు ఆమోదం కోసం చూడకూడదని చెప్పారు. నాకు ఉద్యమంలో ఇంకా ఎంతో జీవితం ఉందని, చేయవలసింది ఇంకా ఎంతో ఉన్నదని చెప్పారు. నాపై ఆయన వ్యక్తం చేసిన విశ్వాసంతో తిరిగి నేను ధైర్యాన్ని, మనోనిబ్బరాన్ని పొందగలిగాను. ఒక మృతుడు, ఒక విప్లవకారుడు నుంచి మనం ఇంతకు మించి ఏమి ఆశించగలం. ఆయన తరాల వారిధిని దాటి రాజకీయ చీలికలను దాటి మనసును తట్టగలడు, ఊరట కల్గించగలడు. చలసాని అంటే అదే.

చాలా ఏళ్ళక్రితం సాంస్కృతిక రంగ కార్యకర్త ఒకరు తన నోటుబుక్కులో జ్ఞాపిక ఏమైనా రాయమని ఆయన్ని కోరగా ఆయన ఆమె నోటుబుక్కులో ఇలా రాశారు... 'ప్రజా విముక్తి ఆశయం కోసం పట్టు విడవని, ఎడతెగని అంకిత భావంతో చేసే కృషి దానికదే ఒక పెద్ద బహుమతి'. నేను ఆ సూక్తిని ఆనాడే అక్కడ నా బుర్రలో నిక్షిప్తం చేసుకున్నాను. అది నాకు ఉపకరిస్తోంది.

చలసాని ప్రసాద్
ఒక యాది - ఒక వెంటాడే స్ఫూర్తి

బాసిత్

'నగ్జల్బరీతో పుట్టావన్నమాట' అనే మాటతో చలసాని తొలిసారిగా నా గుండెల్లోకి నేరుగా చొచ్చుకుపోయాడు. 67లో పుట్టాననేది కేవలం యాదృశ్ఛికమే. కాని ఆ మాట ఆయన చేత అట్లా అనిపించింది. ఆ మాటకు ఇంకెవ్వరైనా అలాగే స్పందించేవారా? ఆయన ఆ మాట అలవోకగా అన్నాడా? ఆయనతో మాట్లాడిన వారికల్లా ఏదో విధంగా చారిత్రక స్పృహ కలిగించడమే ఆయన పనా? మనుషుల్ని తాను న్యాయం అనుకున్న వైపు నిలబెట్టడం కోసం ఆయన ఎంచుకున్న శిల్పమా? అట్లా చరిత్రలో నమోదైన సంఘటనలకు లింక్ చేస్తూ మాట్లాడడం ద్వారా ఆయనేదో ప్రయోజనం సాధించే పని పెట్టుకున్నాడా? అది ఆయన తరహానా? ఎవరైనా ఒక తరహాను అట్లా రూపొందించుకున్నారంటే, అది అసంకల్పితమా, సంకల్పితమా? ఆయనట్లా అనడంతో ఇన్ని ప్రశ్నలు తలెత్తాయి నాలో. అదెప్పుడో పది, పన్నెండేళ్ల కిందటి మాట.

కామ్రేడ్ చలసాని ప్రసాద్ ఎప్పుడు పుట్టాడు? ఎక్కడ పుట్టాడు? ఎలా రూపొందాడు తలచుకుంటే అబ్బురమనిపించేంత బ్యాక్ గ్రౌండ్!

విజయవాడ చేరువలో నాదెండ్ల వారి పాలెంలో 1932లో పుట్టి, బాల్యం తెలంగాణ సాయుధ పోరాటంతోపాటు గడించింది. తదనంతరం విశాఖసాగర తీరం చలసాని చదువు సాగింది. ఆయన బాబాయి, అన్న, బావలు తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైనారని చదివాను. చలసానిది తెలంగాణతో పేగుబంధమన్న మాట! పేగు తెగిన విలవిలతోనే తెలంగాణ గోసను చలసాని విన్నాడని ఇప్పుడర్థమవుతోంది. అన్న వాసుదేవరావు, చినబాపు జగన్నాథరావు, బావ పాపారావుల అమరత్వం చూపిన బాటలోనే తెలంగాణను ఆయన ప్రేమించాడు. దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలతో బంధుత్వం నెరిపాడు. విచిత్రంగా తెలంగాణను కనీసం ఆరు దశాబ్దాలు, ఇంకా వెనక్కి వెళ్లి చూస్తే ఒకటిన్న శతాబ్దం పాటు 'నిజాం-ఉర్-ముల్క్' జమానా నుంచి తెలంగాణలో చొరబడి దోచుకున్న వలస పెట్టుబడి మూలాలున్న జిల్లాలోనే పుట్టి తెలంగాణ భూమి, భుక్తి, విముక్తి పోరాటంలో వర్గ పోరాట మూలాల్ని ఆయన చూశారు. పెట్టుబడి పడగ నీడలోనే పుట్టినా తానే ప్రకటించుకున్నట్లు 'చీమలవైపు నిలిచాడనేది' వాస్తవం. ప్రపంచ సాహిత్యాన్ని చదివి ఏర్పరచుకొన్న ఆయన చారిత్రక దృష్టే దానికి కారణమవ్వొచ్చు. నగ్జల్బరీకి ముందు నుంచే ఆయనకి ఈ దృష్టి ఏర్పడింది. అంటే దానికి కారణం ఆయన అధ్యయనమా? కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టడమా? ఉజ్వల చారిత్రక ఘట్టాల సాహిత్య ప్రకంపనలను ప్రోది చేసి అనుసంధానం చేసే వారధిలా కూడా చలసాని నిలిచాడు. విప్లవ రచయితల సంఘానికి అంకురార్పణ చేశాడు.

చలసానికి తెలంగాణ అంటే ఎంత అభిమానమో అందరికీ తెలిసిందే. కాని వరంగల్ అంటే వల్లమాలిన ప్రేమ. కిషన్‌జీ అంత్యక్రియల సందర్భంలో విమానంలోనే పార్థివ దేహంతో వస్తారనుకున్న చలసాని హఠాత్తుగా కాజీపేటలో తెల్లవారు ఝామున దిగారు. ఎందువల్లనో కిషన్‌జీ దేహాన్ని స్వీకరించడానికి వెళ్లాల్సిన బృందంతో బెంగాల్ వెళ్లలేక, విశాఖ నుండి నేరుగా కాజీపేట రైల్వేస్టేషన్‌కు రాబోతున్నట్లు నాకు ఫోన్‌లో సమాచారం అందింది. ఆయన రైల్వే స్టేషన్‌లో దిగీ దిగగానే 'ఐయాం ఎట్ యువర్ డిస్పోజల్' అన్నారు. అంటే పెద్దపల్లిలో కిషన్‌జీ అంత్యక్రియలకు హాజరుపరిచి, తిరిగి విశాఖకు పంపేంతవరకు తన్ను నాకు ఆధీనపరిచాడన్న మాట! అంతిమ యాత్రలో సరే, పెద్దపల్లి నుండి తిరిగి వస్తున్నప్పుడు కూడా పెద్దపల్లి వీథుల గుండా రైల్వేస్టేషన్ దాకా నడిచి తానేమి

యువకులకు తీసిపోనని ప్రకటించుకున్నాడు. అప్పటికే వి.వి. చలసానిని ఎందుకు నడిపించుకు పోతున్నావని అన్నారు. వెహికిల్ ఉందని వేణు చెప్పినా వినిపించుకోకుండా మొండిగా నడవడానికే నిర్ణయించుకున్న వాడికి నేనేం చెప్పగలను? పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఉండగానే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో గార్డు ప్రయాణించే డబ్బాలో సీటును ఫోన్ చేసి రిజర్వ్ చేసుకున్నాడు. ఇప్పుడిక ఏదో ఒక ట్రైన్ ఎక్కి గోదావరి టైంకి కాజీపేటకు చేరుకోవాల్సిందే. ఆ తొందరలో కాజీపేటలో హాల్ట్‌లేని అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లోకి... 'సిగ్నల్ పడితే దిగొచ్చులే' అని ఎవరో ఇచ్చిన సలహా విని ఎక్కేసాడు. ఇక ఆయనను అనుసరించక తప్పింది కాదు. దిగేప్పుడు కూడా సాహసోపేతంగానే... కాజీపేట టౌన్ వద్ద సిగ్నల్ పడీ పడంగానే ఇంకా ట్రైన్ పూర్తిగా ఆగకుండానే అప్పుడే దిగిన సీఎమ్మెస్ కళ చేతిని ఆసరాగా అందుకొని దిగేసాడు. ఇక అక్కణ్ణుంచి కాజీపేట జంక్షన్ కిలోమీటరున్నర. గోదావరి కాజీపేటకు చేరుకునే టైం షెడ్యూలు ప్రకారం అయిదు నిమిషాలు కూడా లేదు. ఫాతిమా నగర్ చుట్టు ప్రక్కల్ని చలసాని అదో తమకంతో చూస్తున్నాడు. అయినా వెళ్లాల్సిందే కనుక ఆటో ఎక్కేసాం. 'ఇక్కడ బిర్యానీ హోటల్ ఉండాలే... చికెన్ బిర్యానీ తినకుండా వెళ్లేది లేదని' పట్టు పట్టాడు. ప్రయాణం రద్దు చేసుకొమ్మంటే వినడు. బిర్యానీ హోటల్ అక్కడ ఇప్పుడు లేదు. మరోవైపు గోదావరి ఎక్స్‌ప్రెస్ రాక ప్రకటన వినిపిస్తోంది. 'బిర్యానీ తినకుండానే గోదావరి ముండ వచ్చేసిందే' అని గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను తిడ్తూనే స్టేషన్‌లోకి నడిచాడు. మొదటి ప్లాట్ ఫాం మీదికే గోదావరి వచ్చి కదిలిపోతోంది. ఎవరో ట్రైన్ లోపల్నుంచి చలసానికి చేయందించారు. అంతే ట్రైన్ ఎక్కేసాడు. ఎవరిదా ఆపన్న హస్తం? వారిని చలసాని ఎరుగునా? సందేహాలతోనే ఇల్లు చేరేసరికి చలసాన్నుంచి ఫోన్. 'నన్ను లోపలికి లాక్కుంది వరంగల్ వాళ్లేనోయ్... వాళ్ల తినేదే నాకూ పెట్టారోయ్... ఫాతిమానగర్ వద్ద బిర్యాని మరోసారి వచ్చినప్పుడు తిందామోయ్... విజయవాడ వెళ్లాక గార్డు డబ్బా సీట్లోకి మార్తానోయ్...!' అంటూ పెట్టేసాడు. 'హమ్మయ్య' అనీ ఊపిరి పీల్చుకున్నాను.

ఇంతకే వరంగల్ - ఫాతిమానగర్ చుట్టూ... ఆయన మనసెందుకు తిరుగుతూంది? ఆయన అప్పట్లో వరంగల్‌లో ఉన్న నాలుగేళ్ల ఊసులేవో ముప్పిరిగొన్నాయా? కాజీపేట రైల్వేస్టేషన్‌లో చేసిన క్యాటరింగ్ ఉద్యోగం, ఆర్.ఇ.సి.లో కొలువు సంగతులు గుర్తుకొచ్చాయా? గ్రేట్ డిబేట్ కాలంలో గ్రేట్ కంపానియన్ కె.ఎస్.తో. పంచుకున్న గ్రేట్ కబుర్లు మదిలో మెదిలాయా? ఆ నాలుగేళ్ల సాన్నిహిత్యంలో ఇద్దరి మధ్య జరిగిన డిబేట్ ఏ వెలుగులకు దారి తీసిందో ఆ ప్రస్థానం అనే ఎరుక వల్లనేనా, ఆ ఒళ్లు మరిచిన పారవశ్యం!

మిర్యాలగూడ వర్క్‌షాపులో వ్యాసం మీద జరిగిన చర్చలో పాల్గొంటూ భాషా శాస్త్ర విషయాలెన్నింటినో సుదీర్ఘంగా మాట్లాడుతుంటే నోరెళ్ల బెట్టడం మావంతైంది. చేరా, చలసాని ఒకరికొకరు 'డూప్'లని వాళ్ల ఫిజికల్ ఫీచర్స్ చూసి అన్నారా? లేక వాళ్ల భాషా శాస్త్ర పరిజ్ఞానం చూసి అన్నారా? అనే సందేహం వస్తుంది. నిజమేదో ఇద్దరిని బాగా ఎరిగిన వారే చెప్పాలి. కాని విచిత్రంగా చేరా చనిపోయి ఏడాది తిరక్కుండానే ఆయన అనుంగు మిత్రుడు అమరుడయ్యాడు. సరిగ్గా చేరాను సంస్మరించుకోవడానికి సభ పెట్టుకున్న రోజే చలసాని గుండె ఆగిపోవటమేమిటి? ఆ సభలో మాట్లాడే వక్తలందరు సభ కాన్సిల్ చేసుకొని చలసాని అంత్యక్రియలకు హాజరయ్యారు, కదా! మిర్యాలగూడ వర్క్‌షాపులోనే చలసానిని కవ్వించడానికా అన్నట్లు శ్రీశ్రీ వచనంలో దొర్లిన 'ఒకటీ, అరా' తప్పుల్ని చెంచయ్య, వేణు, రాంకిలు దొరకబట్టి చూపిస్తే అదోలా కొట్టి పారేసారాయన. శ్రీశ్రీని ఏమైనా అంటే చలసాని ఊరుకుంటారా? కత్తీ, డాలుతో యుద్ధానికి సిద్ధం! ఎంత గాఢమైన ప్రేమో శ్రీశ్రీ అంటే!

ఆర్వైసీ విద్యార్థి రాజ్‌కుమార్ అలియాస్ కామ్రేడ్ ఆజాద్ రాజ్యం కోరల్లో చిక్కుకొని అమరుడైనపుడు తలకొరివి పెడుతూ తల్లడిల్లిన దృశ్యం కళ్లముందు కదలాడుతోంది. పంజాగుట్ట స్మశానవాటిక నుండి బయటికి వస్తూ భుజాల మీద రెండు చేతులు వేసి రాలిపోతున్న వీరులు కలలు కన్న సమాజాన్ని ఎట్లా నిర్మించుకోవాలో, అందుకోసం చేపట్టవలసిన సాంస్కృతిక కార్యాచరణ గురించి ఎన్ని మాటలు చెప్పారో! ఇప్పుడవన్నీ జ్ఞాపకాలే.

తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి తెలంగాణ అస్తిత్వ ఆకాంక్షల దాక గుర్తించిన చలసాని ఆంధ్రప్రదేశ్‌ను అయిదు రాష్ట్రాలుగా విభజించాలని కోరుకున్నారు. చలసాని అంటే ఈ జ్ఞాపకాలేనా? ఆయన్నుంచి ఈ తరం నేర్చుకోవాల్సింది ఖచ్చితంగా ఎంతో ఉంది. 'శాంతియుత పరివర్తన'లోకి దివాళా తీసిన పాత కమ్యూనిస్టుల పతన దిశ నుండి, దాని అనుబంధ సాహితీ సంస్థ అరసం, అనభ్యుదయంలోకి తర్జుమా అవుతున్న సంధి సమయంలో చలసాని పోషించిన పాత్ర అనితర సాధ్యం. అరసం నిస్తేజమై విరసం వ్యవస్థాపన జరిగే దాక ఆయన నెరిపిన కార్యకర్తృత్వమంతా అనన్య సామాన్యమే. ముఖ్యంగా విశాఖ విద్యార్థులు వేసిన 'రచయితలారా మీరెటువైపు' అన్న ప్రశ్నకు సమాధానంగా రచయితల్ని ప్రజలవైపు నిలబెట్టిన దార్శనికత, దానిని కడదాక గుండె ఆగిపోయేంత వరకు కొనసాగించిన నిబద్ధతా అంతా అపురూపమే. ఆ కాలమంతా ఆయన నిర్వహించిన చారిత్రక పాత్ర నిరంతరం వెంటాడే స్ఫూర్తి.

చలసాని రాసిన కవిత్వం, వచనం తక్కువే అయినా, రచనల నిండా హిందూత్వ వ్యతిరేకత, మతత్వ వ్యతిరేకత ప్రస్ఫుటమౌతుంది. వర్గపోరాటం దిక్సూచిగా వర్గాతీత సమాజాన్ని కలకన్నట్టుగానే రచనల్లో దాన్ని ప్రతిబింబిస్తాడు. ఆయన సాహిత్య వ్యాసాలు చదువుతూ ఉంటే అబ్బురమనిపిస్తాయి. ఒక్కో వ్యాసం యువత కంఠతా పట్టాల్సినంత విలువైన పాఠాలు. చిన్న చిన్న వాక్యాల్లో ఎన్ని చారిత్రక సత్యాల్ని సంపుటీకరించాడో! నిజంగా ఏ ఒక్క వాక్యం విస్మరించడానికి వీల్లేదు. ఆయన చారిత్రక దృష్టిని నేను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కాని వాక్యమంటే చరిత్రను మదించిన సంక్షిప్త ప్రకటన. ఆయన శైలి. అందువల్లనే చిన్న, చిన్న వాక్యాల్లో చిత్రంగా ఇమిడి పోతుంది. సాగరాన్ని చిలికి క్షీరాన్ని

కలం యోధుడు
చలసానికి నివాళి

- దప్పు రమేష్

ఒక కలం ఆగిపోయింది
ఆ గళం మూగబోయింది
ఆ మాట ఆగిపోయింది

ఆ దేహం అలుపెరుగక
అరవై ఏండ్లు ప్రజల కోసం
తిరిగి తిరిగి పరితపించి
ఇప్పుడాగిపోయింది నిర్జీవంగ

ఆ శబ్దం పరితపించి
ప్రజల కోసం మాట్లాడి, మాట్లాడి
ఇప్పుడాగిపోయింది నిశ్శబ్దమై

ఇప్పుడా కలం మనల్ని కదిలిస్తుందిక
ఇప్పుడా గళం మనల్ని పాడిస్తుందిక
ఇప్పుడా మాట మనల్ని మాట్లాడిస్తుందిక
ఇప్పుడా దేహం మనలో కల్సిపోయి కదిలిస్తుందిక

దాని ధ్యాస విప్లవం
దాని శ్వాస మార్క్సిజం
దాని స్వప్నం సమసమాజం
దాని కసి వర్గకసి
దాని తపన నూతన మానవావిష్కరణ

అవును ఆ దేహం
తన పని తాను
చేసి పోయింది
నూటికి నూరు మార్కులు
సాధించుకుంటూ,
అన్నిటినీ ఛేదించుకుంటూ
ఎవ్వరికీ అందనంత ఉన్నత
మానవ చైతన్య శిఖరానికి
చేరి పోయింది

ఆ మనిషి ఆదర్శాన్ని
అణువణువు అధ్యయనం చేస్తూ
అతనధిగమించిన అన్యవర్గ
భావాలను ధోరణులను
మన మనోః పొలిమేరల్లోకి
సైతం రాకుండా చూసుకుంటూ
మనం కూడా అతనిలా
ఆత్మ విమర్శతో అడుగులు వేస్తూ

అతని ఆశయ సాధనలో
వారసులవుదామని,
అంతరాత్మలో ప్రతిజ్ఞ చేసి
ఆచరణలో కెళ్ళడమే అతనికి
మనమిచ్చే అశ్రునయనాల
అరుణారుణ శ్రద్ధాంజలి
నిజమైన నివాళి

అందించినట్లే. మంచి వాక్యాన్ని ప్రేమించిన గొప్ప ప్రేమికుడు అందించే వాక్యం అట్లా ఉంటుందన్న మాట! ఇక్కడే ఆయన 'చేరా'ను మించిపోయాడనిపిస్తోంది. చలసాని రాసిందంతా కొత్త తరానికి అపురూప కానుక. చలసాని 'సాహిత్య వ్యాసాలు' చదువకపోతే విరసం చరిత్రంతా మిస్ అయినట్లే. ఆయన ఒక్కో సాహిత్య వ్యాసం ఒక్కో నవల్ని, కథని అపూర్వంగా వాఖ్యానిస్తుంది. కొకును, రావిశాస్త్రిని ఇష్టంగా చదివించేలా చేస్తాయి ఆ వ్యాసాలు. ఆయన ఏ రచయితను ముట్టుకున్నా ఆ రచయితను చదివి తీరాలనేంత ఇష్టం కలుగుతుంది.

విశాఖ తీరంలో నడయాడి విరసం పెద్ద దిక్కుగా నిలిచి, కృష్ణ బాయక్క మరిదిగా ప్రకటించుకొని, డా. నళిని బాబాయిగానే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం కొండల దాక 'విప్లవాగ్నులు విస్తరించిందాక' అల్లుకున్న కా. చలసాని ప్రసాద్‌ను తలుచుకున్న కొద్దీ తండ్లాట తీరటం లేదు. ఆయన లేని లోటును ఎవరు తీర్చగలరు? ఏమైనా ఆయనిక లేరు. ఆయన మిగిల్చిన ఆ జ్ఞాపకాలు... ఆ వెంటాడే స్ఫూర్తిని ఎవరూ దూరం చేయలేరు.

విరసం కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికలను, విరసం ప్రచురణలను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సాఫ్ట్‌కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

సాహిత్యం, సాహిత్య విమర్శ - చలసాని

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

సాహిత్యమంటే ఏమిటి? అది ఎక్కడ పుడుతుంది? అది ఎందుకు పుడుతుంది? అది ఏ కర్తవ్యం నిర్వహిస్తుంది? సాహిత్యం ఏమి చెబుతుంది? ఎలా చెబుతుంది? మొదలైన ప్రశ్నలకు సాహితీ శ్రేణులు సాహిత్యం పుట్టినప్పటి నుంచి సమాధానాలు చెబుతూనే ఉన్నాయి. సామాజిక సందర్భం మారినప్పుడు, కొత్త ఉద్యమం వచ్చినప్పుడు, కొత్త ఆలోచన వచ్చినప్పుడు పాత సమాధానాలు పోయి కొత్త సమాధానాలు పుడుతున్నాయి. లేదా పాత సమాధానాలు సవరింపబడుతున్నాయి. ప్రశ్నలు అవే అయినా వ్యవస్థను బట్టి సమాధానాలు మారతాయి. సాహిత్య చింతనలో ప్రాచీన అలంకార శాస్త్రాలకు, ఆధునిక ఆలోచనలకు పూర్తిగా తేడా ఉంది. ప్రాచీనులది భావవాదం, ఆధునికులది భౌతికవాదం కావడమే ఇందుకు కారణం. ఆధునిక కాలంలో కూడా భావవాద అవశేషాలకు కొదువలేదు.

1914లో కట్టమంచి 'కవిత్వతత్త్వ విచారము' వచ్చిన తర్వాత సాహిత్యాన్ని గురించిన ఆలోచనలు మారాయి. 'దేశ చరిత్రను భాషా చరిత్రను నిత్య సంయోగములు' అనే సూత్రం తర్వాత కాలంలో ప్రగతిశీల వాదుల ప్రధాన సాహిత్య సిద్ధాంతమైంది. అలాగే కవిత్వంలో వస్తుశిల్పాల గురించి, పాత్ర చిత్రణ గురించి, కవిత్వ శైలి గురించి భావనా శక్తి గురించి ఇంకా అనేక విషయాల గురించి కట్టమంచి సంప్రదాయం నుండి విడివడి 1914లో కొత్తగా మాట్లాడాడు. మొత్తం మీద సాహిత్యంలో వాస్తవికత, సంభావనీయత, అవసరజ్ఞతలను గురించి ఆయన మాట్లాడాడు. విశ్రాంతి వర్గ సాహితీగారడీలను చీల్చి చెండాడాడు. అంతే విశ్రాంతి శిబిరానికి గంగ వెర్రులెత్తింది. పుస్తకాలకు పుస్తకాలే ఆయనను వ్యతిరేకిస్తూ రాసేశారు. ఇంకా రాస్తూనే ఉన్నారు. అయినా కవిత్వతత్త్వ విచారము వన్నె తగ్గలేదు. తర్వాతి కాలంలో ప్రజాసాహిత్యవాదులు ఆయనతో అనేక విషయాలలో విభేదించినా, మౌలిక అభిప్రాయాలను గౌరవించారు.

చంద్రం వ్యాసావళి, మన గురజాడ (శ్రీశ్రీ), సాహిత్య వ్యాసాలు (కొకు), సారస్వత వివేచన (రారా), కవిత్వం - చైతన్యం, సాహిత్యంలో వస్తు శిల్పాలు (త్రిపురనేని మధుసూదనరావు), వివిధ (హరిపుర పురుషోత్తమరావు), రూపం-సారం (బాలగోపాల్), విభాత సంధ్యలు (సి. సుబ్బారావు సం), సాహిత్య వ్యాసాలు (కెవిఆర్) వంటి పదుల గ్రంథాలు ఆధునిక కాలంలో సాహిత్యం గురించి కొత్త ఆలోచనలు చేశాయి. పాత ప్రశ్నలకు కొత్త సమాధానాలు చెప్పాయి. సరి కొత్త ప్రశ్నలకు సమకాలీన సమాధానాలు చెప్పాయి. ఈ వరుసలోదే చలసాని ప్రసాద్‌గారి 'సాహిత్య వ్యాసాలు' (2008).

ఈ పుస్తకంలో 31 వ్యాసాలున్నాయి. వీటిలో మొదటిది పోతే తక్కిన 30 వ్యాసాలు 1971-2003 మధ్య మూడు దశాబ్దాల్లో రాసినవి. విప్లవ రచయితల సంఘం బాధ్యునిగా చలసాని మాట్లాడిన మాటలే ఈ వ్యాసాలు. ఈ వ్యాసాలలో సాహిత్యం గురించి చలసాని అభిప్రాయాలు ఒక పార్శ్వమైతే, రచనలు, రచయితలు, సంఘాలు వంటి వాటిపై ఆయన అభిప్రాయాలు మరో పార్శ్వం. ఇందులో ఇప్పుడు మొదట పార్శ్వాన్ని అర్థం చేసుకుందాం.

చలసానికి సాహిత్యం - దానికి సంబంధించిన అనేక అంశాల మీద ఉన్నతమైన అభిప్రాయాలున్నాయి. అవి మార్క్సిజంలోని పడుగులోని పోగులే. 'శ్రమైక జీవనమే అన్ని కళలకూ మూలం' (పు 37, 63) అన్నది మార్క్సిస్టు మూల సూత్రం. ప్రతిదీ మానవుని శ్రమ ద్వారా ఉత్పత్తి అవుతుంది. సాహిత్యం కళలు కూడా అందులో భాగం అని మార్క్సిజం చెబుతుంది. ఈ మూలాన్ని పట్టుకో గలిగారు చలసాని. ఇక ఇక్కడి నుంచి సాహిత్యాన్ని రక రకాలుగా మూడు దశాబ్దాలు నిర్వచిస్తూనే ఉన్నారు. 'సాహిత్యం జీవిత దర్పణం' (పు 44) అన్నది నూరేళ్ళుగా అందరూ అనుకుంటున్నదే. 'సామాజిక జీవితమే ఒక గీతిక' (పు 37) 'సమాజ హృదయమే సాహిత్యం' (పు 43, 151) 'లోకాన్నంతటినీ అవలోకించే నేత్రమే సాహిత్యం' (పు 43) 'జీవిత వృక్షాగ్రాన పూచే పువ్వు సాహిత్యం' (పు 72) వంటివి చలసాని సాహిత్య నిర్వచనాలు. మిరపగింజవంటి ఈ నిర్వచనాలు సాహిత్య చరిత్రలోకి వెళ్ళి లోతుగా వ్యాఖ్యానించ వలసినవి.

సాహిత్యంమంతా ఒక ముద్ద కాదు. సమాజంలో వివిధ శ్రేణులున్నాయి. వాటి స్వభావాలు, ప్రయోజనాలు ఉన్నాయి. మార్క్సిజం సమాజాన్ని పాలక, పాలిత శ్రేణులుగా విభజించింది. పాలిత ప్రజల పక్షం వహించింది. సాహిత్యం, కళలు ప్రజాపక్షం వహించాలని చెప్పింది. చలసాని 'ప్రజా జీవితపు దారుల్లో పయనించేదే ఉత్తమ సాహిత్యం' అన్నారు (పు 81) జానపదం మీద చలసానికి ప్రత్యేక ఆసక్తి ఉంది. దేశీ సాహిత్యం మీద గౌరవం ఉంది. అందుకే 'పాటు పడేవాళ్ళు పాడేది పాట' (పు 38) 'మార్గ కవిత్వం శవప్రాయం, దేశీ కవిత్వం సజీవం' (పు 37) అనగలిగారు. జానపద కళల మీద గల గౌరవంతోనే చలసాని 'సమాజంతో పాటే పుట్టింది సాహిత్యం' (పు 151) అన్నారు.

రచన ఉబుసుపోక వ్యవహారం కాదు. పని లేని పని కాదు. అదొక గంభీరమైన కార్యకలాపం. ప్రజాపక్షం వహించే రచన అసలు కాలక్షేప విషయం కానే కాదు. అందుకే చలసాని 'రచన గొప్ప బాధ్యతతో కూడినది' (పు 46) అన్నారు. 'రచయితపని చాలా కష్టమైంది' (పు 49) అన్నారు.

సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుంది, ఉదాత్తీకరిస్తుంది. మన జీవితాన్ని నిన్నటి కన్నా ఇవాళ, ఇవాళిటి కన్నా రేపు అందంగా, ప్రజాస్వామికంగా మార్చుకోడానికి కళలు కృషి చేస్తాయి. అందువల్ల ఇతర రంగాల కన్నా సాహితీ రంగం మీద సమాజానికి ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి. 'మామూలు విషయాల కన్నా కొంచెం ఎత్తులో ఉంటుంది సాహిత్యం' (పు 45) అని చలసాని అన్నదందుకే.

భద్రపర్చండి...

ఉదయమిత్ర

ఇవి కళ్లు...
ఎడారి దుఃఖాన్ని తుడవడానికి
విస్తరించిన ఒయాసిస్సులు...
కనిపించే దాని వెనుక
కనిపించని గమన సూత్రాలు
కనిపెట్టిన దిక్సూచికలు...
ఆకాశం నుండి తొంగి చూసే పాలపుంతలు...

ఇవి కాళ్లు...
ఎక్కడ వెల్తురు పిట్టలు గానం జేస్తే
అక్కడికి ఇరుకు దారులనైనా పయనించినవి...
దూర భారాలను పరిహసించినవి

ఇవి చేతులు
ఇప్పుడంటే కట్టె గరుచుకుపోవొచ్చు గాని
నిన్నటి దాంకా
ఏదో ఒక పుస్తకం పట్టుకు
సముద్రాన్ని దోసిలి పట్టినవే...

ఇది గొంతు...
'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే
శ్రీకాకుళం వైపు వేలు చూపిస్తాను' అంటూ
పదపదమున జయభేరిని మోగిస్తూ
గళగళమున అలలలలుగా విస్తరిస్తూ
అద్భుతగానం జేసినది

అప్పుడంటే, డప్పుకు దొర్కలేదుగాని
ఇప్పుడు మనిషికే దొర్కకుండా పోయింది....

ఇది హృదయం...
విశాఖ వెన్నెల రేఖ
శ్రీశ్రీ ఏకైక కైక...
బహుభోళా...
విస్తృత సంబంధాల మానవ మేళా...
మూడు తరాల ఆకాంక్షలను
మూడు దళాల పోరాటాలను
ప్రతిఫలించిన నిలువెత్తు అద్దం...
చెరగని చిర్నవ్వుల సంతకం...

ఇది
ప్యాంటూ షర్టూ వేసుకున్న
పల్లె మనిషి పార్థివ దేహం...
భుజాల మీద చెయ్యేసి
హృదయాల బరువెక్కించిన
ఓ మానవీయ జ్ఞాపకం...

ఇది
నడిచే నది
పలికే పుస్తకం...

భద్రపర్చండి...
భవిష్యత్ తరాల కోసం...

అంతేకాదు 'సాహిత్యం నిత్యం విప్లవాత్మకమే' (పు 45) అనటం కూడా ఈ దృష్టితోనే. మార్పును ఆహ్వానించడమే విప్లవం. సాహిత్యం నిరంతరం సమాజంలో మార్పులను కోరుతూ ఉంటుంది. వస్తున్న మార్పులను ఆహ్వానిస్తూ ఉంటుంది. (మార్పులను వ్యతిరేకించే వర్గం ఎప్పుడూ ఉంటుంది.)

గంభీరమైన సాహిత్యం సామాజిక పరివర్తనే లక్ష్యంగా పుడుతుంది. 'పదండి ముందుకు, పదండి తోసుకు' అనేది గంభీర సాహిత్యం. 'కదిలేది కదిలించేది మునుముందుకు నడిపించేది, పెను నిద్దర వదిలించేది' ప్రజాసాహిత్యం. అవగాహనపరమైన పునాది ప్రతి మార్క్సిస్టుకు ఉంటుంది. చలసానికి కలం బలం తెలుసు. 'సాహిత్యం మన ఆలోచనలను తీర్చిదిద్ది మన ఉద్రేకాలను నాజూకు పర్చి మన మనసును పదును దేర్చి ఓ విశ్వవ్యాప్తమైన పాత్ర నిర్వహిస్తుంది. అన్ని దేశాలను ఒక తాటి మీదకు తెస్తుంది. అంతర్గతంగా అందరిలో ఉన్న బాధ తపన ఒక్కటేనంటుంది సాహిత్యం' (పు 45) అన్నారు చలసాని. మనుషులకు లాగే కళలకూ భాషలు, భౌగోళిక హద్దులు ఉన్నా, అవి ప్రపంచ ప్రజల్ని ఏకం చేస్తాయనడం ఉదాత్తంగా ఉంది. 'మాకు గోడలు లేవు, గోడలు పగులగొట్టడమే మాపని' ప్రజాసాహిత్య కర్తవ్యమిదే.

సాహిత్యం పుట్టేదే పాఠకుల కోసం. పాఠకులతో రచయిత మాట్లాడే సాధనమే సాహిత్యం. రచయితకు తగిన పాఠకులు, పాఠకులకు తగిన రచయిత లభించడం ఒక గొప్ప సంఘటన. చలసాని రచయితలకు పాఠకులకు మధ్య మంచి జత కుదిరినప్పుడే నిజమైన సాహిత్యం పుడుతుంది' (పు 50) అన్నారు. అంటే సాహిత్యం ఎవరి దగ్గరికి చేరాల్నో వాళ్ళ దగ్గరికి చేరినప్పుడు ఆ సాహిత్యం గొప్పదనం తెలుస్తుంది.

సాహిత్యంలో మూడంశాలు ప్రధానంగా ఉంటాయని చలసాని గుర్తించారు. అవి 1. భాష, 2. వస్తువు, 3. చిత్రణ (పు 46-48) సాహిత్యానికి భాష అసలైన పని ముట్టు అని, జీవిత వాస్తవాలు దానికి ముడిసరుకు అని ఆయన పేర్కొన్నారు. 'జీవిత వాస్తవాల వెనకదాగిన సాంఘిక సత్యాలను, వాటి ప్రత్యేకతను వెల్లడించడమే

సాహిత్య ప్రయోజనం' (పు 46) అని పేర్కొన్న చలసాని ఈ ప్రయోజనం నెరవేరడానికి ఖచ్చితమైన మాటలను ఎన్నుకోవాలన్నారు. అసలైన శ్రామిక ప్రజలలోనే ఉందని, రచయితలు ఆ భాషను పట్టుకోవాలని, ప్రపంచ ప్రసిద్ధ రచయితలందరూ ఆ భాషనే ఉపయోగించుకున్నారన్నారు.

వస్తువు రచయిత అనుభవంలోంచే వస్తుందని భావించిన చలసాని జీవిత పరిస్థితులు సామాజిక స్థితిగతులు రాజకీయ వ్యవస్థ కవితా వస్తువులని నిర్ణయిస్తాయన్నారు (పు 101). వీటి మధ్య రచయిత పొందిన అనుభవమే సాహిత్య వస్తువని, దానిని జీవితమే నేర్పుతుందని చలసాని స్పష్టం చేశారు (పు 47). చిత్రణలో ప్రజల పరస్పర సంబంధ బాంధవ్యాలు, వైరుధ్యాలు, ఇష్టాయిష్టాలు చేరుతాయని చలసాని అన్నారు. ప్రతిభను గురించి ఎక్కువగా మాట్లాడే వాళ్ళకు అది కూడా సమాజం నుంచే రూపొందుతుందని స్పష్టం చేశారు.

ఇంత చేయాలంటే రచయితకు కాలజ్ఞానం ఉండాలంటారు చలసాని. ఈయన సాహిత్యంలో రొడ్డ కొట్టుడు పద్ధతికి వ్యతిరేకి. 'సాహిత్యంలో మూస పాత్రలు పనికి రావు' (పు 73) అంటూ సాహిత్యానికి సజీవ పాత్రలే పునాది అని అన్నారు. సజీవ పాత్ర చిత్రణలో మూడు సంగతులుంటాయని అవి 1. జీవితానుభవం, 2. సమాజ స్వభావ పరిజ్ఞానం, 3. మనుషుల వర్గ స్వభావం అని పేర్కొన్నారు.

సాహిత్యం ఉన్న వాటిని చిత్రిస్తే చాలదని, మనం ఏమి సాధించగలమో కూడా రచయితలు గుర్తించాలని చలసాని అభిప్రాయ పడ్డారు. రచన డాక్యుమెంట్ కారాదని, అది ప్రజల ఆకాంక్షను ప్రతిబింబించాలని ఆయన అవగాహన. విరసం పుట్టినాక వచ్చిన ఒక వాదం రాజకీయ ఉద్యమాలు నడుస్తున్నప్పుడే గొప్ప సాహిత్యం వస్తుందన్నది. చలసాని కూడా అలాగే అభిప్రాయ పడ్డారు. 'రాజకీయ ఉద్యమాలు, ప్రజా పోరాటం ఉన్నప్పుడే మంచి సాహిత్యం రావడానికి వీలుంది. వాటి నుంచి ఊపిరి పీల్చుకొని ఉత్తేజం పొందిన సాహిత్యమే మంచి సాహిత్యం' (పు. 136). 1955-65 దశాబ్దం స్తబ్దతా యుగం అనే అవగాహన కొనసాగుతున్న రోజుల్లో ఏర్పడినదే ఈ అభిప్రాయం. ఆ తర్వాత స్తబ్దత మీద జరిగిన చర్చల్లో పై అభిప్రాయం పూర్తిగా సరైనది కాదేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందువల్ల చలసాని పై అభిప్రాయాల్ని మరోసారి అందరూ ఆలోచించాలి.

సాహిత్య విమర్శను గురించి చలసాని విలువైన ఆలోచనలు చేశారు. సమాజానికి సాహిత్యం అతీతంగా ఉండలేనట్లే సాహిత్య విమర్శ కూడా సమాజానికి దూరంగా ఉండదు. సాహిత్యాన్ని, కవిత్వాన్ని విమర్శించేటప్పుడు సామాజిక మార్పులను, రాజకీయ మార్పులను ఆకళింపు చేసుకోవాలి. కళా సాహిత్య కవిత్వాలను మదింపు వేసేటప్పుడు సామాజిక శక్తుల ప్రభావం మరచిపోకూడదు. సామాజిక శక్తులు, రాజకీయ మార్పులు, సిద్ధాంతాల ప్రభావం వీటిని గీటురాళ్ళుగా తీసుకొనే సాహిత్య విమర్శ కొనసాగాలి' (పు 102). సాహిత్యమే కాదు సాహిత్య విమర్శ కూడా సమాజపరంగానే జరగాలి' (పు 04) సాహిత్య విమర్శకుల బాధ్యతల్ని, కర్తవ్యాల్ని, అర్హతల్ని ఇంతకన్నా స్పష్టంగా పేర్కొనడం సాధ్యం కాదు. సాహిత్య విమర్శకులు రచయితకన్నా రెండాకులెక్కువ చదువుకోవాలన్న కొకు అభిప్రాయాన్ని మరింత బలంగా చలసాని చెప్పారు. విమర్శకులు ఈ లక్షణాలను జీర్ణం చేసుకుంటే ఒక వారం శ్రీశ్రీ విప్లవం మీద, మరోవారం శ్రీనాథుని శృంగారం మీద వ్యాసాలు రాయరు. ప్రజా ఉద్యమాలను చులకన చేయరు. విమర్శకులంతా ఇంత స్పష్టంగా ఉంటే రెండు పడవల మీద కాళ్ళు పెట్టరు. రెండెద్దుల గానుగలు కారు.

చలసానికి సైద్ధాంతిక బలం ఉంది. 'నేను విప్లవ రచయితల సంఘానికి చెందినవాడిని' (పు. 159) అని ప్రకటించుకోవడంలోనే అది వ్యక్త మౌతుంది. సాహిత్య విమర్శకులకు నిబద్ధత ఉంటే ప్రమాదాలు జరిగిపోతాయని భ్రమపడే వాళ్ళకు చలసానిని చదివితే భ్రమ తొలగిపోతుంది. సైద్ధాంతిక నిబద్ధత ఉంటే విమర్శకుల అభిప్రాయాలలో పులుముడు ఉండదు. నంగిమాటలుండవు. కప్పదాట్లు ఉండవు. స్వవచోవ్యాఘాతాలుండవు. చలసానిని చదివైనా సాహిత్య విమర్శకులకు నిబద్ధత అనివార్యమని గుర్తించాలి.

సాహిత్యం, సాహిత్య విమర్శ పట్ల చలసాని అభిప్రాయ విశ్లేషణకే ఈ వ్యాసం పరిమితమైంది. సాహిత్య సంస్థలు, వివిధ రచనలు, రచయితల పట్ల ఆయన అభిప్రాయాలను మరోసారి చర్చించుకోవచ్చు.

చలసాని ఉద్యమ సాహిత్య విమర్శకులు.

ఎప్పుడు పలకరించినా మా రాచపాళమేనే? అనే ప్రశ్నతో మొదలుబెట్టే చలసాని మాష్టారికి నా స్నేహాంజలి.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను **వలేటి అరవింద్ కుమార్, హైదరాబాద్** పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-



ఎ.ఐ.ఎల్.ఆర్.సి. సభలో - నిల్చున్న వాళ్ళు (ఎడమ నుంచి) : తెలీదు, సనోబర్, తెలీదు, విజయ్‌కుమార్ ఆర్య, రక్షిత్, రాంబలి యాదవ్, గోవింద్ స్వామి, సి.ఎస్.ఆర్., కళ్యాణి, తెలీదు.
కూర్చున్న వాళ్ళు : అరుణ్ సన్యమత్ (ఎ.ఐ.ఎల్.ఆర్.సి. మొదటి సంయుక్త కార్యదర్శి), సి.పి., కె.వి.ఆర్., రాజ్‌కిశోర్.



ఆర్.ఎస్.రావు సంస్మరణ సభ, హైద్రాబాద్‌లో రాజ్‌కిశోర్, వివిలతో



కాళీపట్నం రామారావు, కవి శివారెడ్డిలతో (విశాఖలో)



క్రిష్ణక్కతో ఎస్.పి. హాల్, హైదరాబాద్‌లో



విప్లవ పూవయ్యి పూసినా చలసాని

తంగెళ్ల సుదర్శనం

విప్లవ పూవయ్యి నేలన పూసినా చలసాని
ఎర్రనిజెండయ్యి నింగికెగిసినాడయ్యా "వి"

విప్లవ నావకు తాను తెరచాపై నిలిచినాడు
తీరాన్ని చేరాలని కలలెన్నో కన్నాడు
ప్రజల కొరకే జీవితాన్ని పంచినాడయ్యా "వి"

అధ్యయన శీలుడు అలుపెరుగని ధీరుడు
మార్క్స్ లెనిన్ మావోయిజం బోధించే గురువయ్యా
విప్లవ రచనల కలమయ్యి సాగినాడయ్యా "వి"

మనిషిని ప్రేమించే మానవత ఉన్నోడు
ఆపదలున్నోల్లను అంటిపెట్టి తిరిగినోడు
బాధలుబోయె బాట జూపినాడయ్యా "వి"

అరుణతార వెలుగులయ్యి విరసాన్నే నడిపినాడు
విప్లవ భావాలను ప్రజలల్లో చాటినాడు
విప్లవ సభలకు మొదటి గీతమైనడూ "వి"

నమ్మిన సిద్ధాంతముకై కట్టుబడి నిలిచినోడు
రాజీ అంటె గిట్టనోడు పట్టుదల ఉన్నోడు
విప్లవాల నిలయమయ్యి వెలసినాడయ్యా "వి"

కమ్యూనిస్టు ఒడిలోన కన్నుతెరిచినాడయ్యా
నక్సల్బరీ పోరులోన అడుగులయినాడయ్యా
పోరాటమే శ్వాసయ్యి బతికినాడయ్యా "వి"

స్మృత్యంజలి

బి. కూర్మారావు

నీ చేయి మా భుజాలపై పడి
నిమురుతూ నడిచినపుడు
విప్లవ చైతన్యం వేయింతలయ్యేది -
నీ మాటలు
మా తలలో జల్లులై కురిసినపుడు
విప్లవ సాహిత్యం ఏరులై పారేది
నీ సజల భావాల ధారలు
మా నరాల నాగేటి చాళ్ళలో ఇంకినపుడు
ఎన్నో విప్లవ కవితా కుసుమాలు విచ్చుకున్నాయి
విశాఖ సాగర తీరంలోని
సముద్ర హోరుకు వేదిక నీవు
ఎల్లప్పుడూ నీవో సముద్ర ఘోష
నీ చుట్టూ సముద్ర భాష - వెరసి
విప్లవ సాహితీ సంద్రం శిగలో
కలికి తురాయి నీవు
విప్లవ కలాలకు
పలకరింత పులకరింత నీవు
విశాఖ విప్లవ ఖైదీల కళ్ళకు
తొలి ప్రపంచం నీవు
రోగగ్రస్త విప్లవ వీరుల మందు నీవు
బిడ్డలు కోల్పోయిన
వీరమాతలకు తొలి ఓదార్పు నీవు
ప్రజా సంఘాల ఉద్యమ వాణి నీవు
విశాఖ 'విరసం' వెన్ను నీవు
విప్లవ సాహిత్యానికి దన్ను నీవు
ప్రజా పోరాటాల గన్ను నీవు
నీ అడుగు జాడలు
గుబాళించిన స్నేహబంధానికి
మానవ సంబంధాలకు - దిక్సూచీలు
నీ అడుగు జాడలు
నిబద్ధతకి త్యాగనిరతికి - సోపానాలు
నీ అడుగుజాడలు
మూర్తీభవించిన మంచితనానికి
మహోన్నత మానవత్వానికి రహదారులు
నీ స్మృతి
కదిలేది - కదిలించేది
పెను నిద్దుర వదిలించేది
నీ స్మృతి
రాసేది - రాయించేది
ప్రజాసాహిత్యం వైపు నడిపించేది
నీ స్మృతి
జ్వలించేది, ప్రజ్వలించేది
పోరుబాట పట్టించేది
జోహార్ కా. చలసాని ప్రసాద్
జోహార్! జోహార్!!

జైత్రయాత్ర

ఆర్. శశికళ

కా॥ చలసాని ప్రసాద్ ఎక్కడ?
ఆయన గానం, మాట
వినగలనా? అంతిమయాత్ర
జరిగిందట, చివరి సంతకం
చేశాడట నిజమేనా?

కా॥ గంటి ప్రసాదం హత్య
జరిగింది హంతకులెవరో
ఇంకా తేలలేదు...

కా॥ ఆలూరు భుజంగరావు
గారు దూరమయ్యారు...
ప్రతి సభలో వారి మాటలు
విన్న నా చెవుల్లో
అవింకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి

ఎన్నటికి తీరేను ఈ దుఃఖం
మసికోసిన కళ్ళంలో
మాటలు ఆవిరవుతున్నాయి -
మసిబారిన కలలు
మబ్బుల చాటున దోబూచులాడుతున్నాయి
నిస్పృహతో ఉక్కిరిబిక్కిరవుతున్నా...

కానీ మరణం ఒక సత్యం
సత్యమొక మరణం
ఆ మర్మం అమరత్వం
వారి అమరత్వం పోరాడే
ప్రజల జీవన గీతం

ఈ సామాజిక శాస్త్రజ్ఞులు
ఓ చారిత్రక డాక్యుమెంటు
తమ భుజ స్కంధాలపై
మోసుకొచ్చారు...
అది భుజకీర్తుల కోసం కాదు

వారి ప్రతి మాట, పాట, శ్వాస
ఆ డాక్యుమెంటు గురించే
అది ప్రపంచ కార్మికుల కలల
మహా సౌధం...

ఎన్నెన్ని కలలు కంటూ
అవమానాలు, అవహేళనలు
కుట్ర కేసులు, చిత్రహింసలు మోస్తూ
తెలుగు సమాజం కోసం మాత్రమే
కాదు
రేపటి ఓ వినూత్న మానవ
ఆవిర్భావం కోసం

భూగోళంపై మెరిసిన
మెరుపులను ఎంత ఒడుపుగా
పట్టుకొన్నారు వాళ్ళు
ఆ మెరుపులతో తీశారు
వాళ్ళొక డాక్యుమెంటరీ...
ఓటమికా వెరుపు కల్గించే
సాహసం చేశారు

వారి ప్రతి అడుగూ ఓ పోరాటం
వ్యవస్థీకృత క్రూరత్వం
ఛేదించాలి
విధ్వంసకర అభివృద్ధి వద్దన్నారు వాళ్ళు
సామాన్యునికి ఓ భద్రతా రాజ్యం
కావాలి... కాదు రాజ్యం పీడన
లేని సమాజం కావాలన్నారు

ఏ మాటలోనూ తొట్రుపాటు లేదు
సమర పాటులేదు
అదొక విస్పష్ట ప్రకటన
బడుగు జీవుల చారిత్రక డాక్యుమెంటు అది
దానిపై వారి చివరి సంతకం చేశారట -
అంతిమ యాత్ర జరిగిందట
కాదు... వారి జైత్ర యాత్ర మొదలయింది...

1984వ సంవత్సరము నేను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పి.జి. చదువుతున్నా. రాడికల్ విద్యార్థి సంఘంలో సభ్యురాలిని కవితలు వ్రాసే అలవాటుండేది. అక్కడ జరిగే సాహిత్య సమావేశాల్లో పాల్గొనటం వలన అరుణ అనే స్నేహితురాలి ద్వారా కా॥ త్రిపురనేని మధుసూదన్ రావుగారు పరిచయమ్యారు. ఆయన ప్రసంగించిన సభల్లో శ్రోతను. జనవరిలో శ్రీకాకుళం మాకివలనలో విరసం మహాసభలు జరుగుతున్నాయి. రమ్మని చెప్పారు. ఇంక ఆర్.ఎస్.యు. నుండి 100 మంది విద్యార్థులం 'చలో' బయల్దేరాం. రైల్లో పాటలు పాడుకొంటూ, చర్చలు చేస్తూ ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజంగా జరిగింది. అప్పటికి నాలో వ్రాయాలనో తపన తప్ప విరసం గురించి వివరాలు తెలియవు. ఆ రైలులోనే కా॥ సి.వి. సుబ్బారావు గారు, కా॥ రత్నమాల గారు ఇంకా ఎందరో సభ్యులున్నారని తెల్సింది.

ఆ సభల్లోనే మొదటిసారిగా కా॥ చలసానిప్రసాద్ గారిని చూశాను. 'విరసం పతాకావిష్కరణ'లో 'ఎత్తినాం విరసం జెండా' అనే పాట పాడారు. జన నాట్యమండలి సభ్యులు కోరస్ ఇచ్చారు. ఆ ఉత్సాహం, ఉత్తేజం ఇటీవల సభల వరకూ ఆయనలో ప్రతిఫలిస్తూనే ఉండటం చూశాను. సాహిత్య, రాజకీయ ఉపన్యాసం ఓ కవితతో ప్రారంభమయ్యేది - 'ఈ

విప్లవాగ్నులెచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి'... శ్రీకాకుళ విప్లవోద్యమ స్ఫూర్తిని ఆయన విరసం జెండాతో పాటు ఎత్తి పట్టారు.

విప్లవోద్యమంలో ఆ కుటుంబానికి మూడు తరాల అనుబంధం ఉందని తెల్సింది - ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ లోపించేసే సి.పి.గారి కుటుంబ సభ్యులు కూడా ఆ బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులయ్యారు సి.పి. గారి అమ్మాయి నవతను జన నాట్యమండలి కార్యక్రమాల్లో చూశాను. ఆయనకు వయసు తారతమ్యం లేదు. అందరితో కలిసిపోతారు. విరసంలో సి.పి. మాత్రమే ఇటువంటి వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి అంటే అది సహజం.

లునచార్స్కి 'విద్యాశిక్షణలు'లో ఓ నూతన మానవుడి గురించి వ్రాశారు. అతడు అత్యధిక సామరస్యం మనుషుల మధ్య సృష్టించ గల్గిన ఓ గొప్ప సామాజికవేత్తట. అటువంటి సామరస్యంతో, స్నేహంతో ఆయన తన జీవితమంతా గడిపారు...

పౌరహక్కుల ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్న శేషయ్యగారితో 1984 సంవత్సరంలో నా జీవిత సాహచర్యం మొదలయింది 1984 నుండి 2015 వరకూ అనేక సందర్భాల్లో కా॥ సి.పిని దగ్గరగా చూసి, విని తెల్సుకొనే అవకాశాలు అరుదుగా వచ్చాయి. జనవరి, 2003లో అనంతపురంలో విరసం సాహిత్య పాఠశాల జరిగింది - అప్పుడు జరిగిన ఊరేగింపులో ఆయన వి.వి.గారితో కలిసి అగ్రభాగాన ఉన్నారు. ఆ పాఠశాలలో 'విప్లవ సాహిత్యం - ఎదురవుతున్న ప్రశ్నలు' అనే అంశంపై ఆయన ఎంతో లోతుగా విశ్లేషించారు. ఆ ప్రసంగం అభివృద్ధి చేయటానికి, కావలసిన వనరులను తాత్విక, రాజకీయ భూమికను అందించారు. ఆయనలోని చైతన్యం, అపారమైన అధ్యయనం, సునిశిత దృష్టిని ఈ ప్రసంగం ద్వారా నేను అర్థం చేసుకున్నాను. బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణించిన అమరుల అంత్యక్రియల్లో పాల్గొని రాజ్యం దుర్మార్గాన్ని ఎండగడుతూ, అక్కడ తానూ ఓ నినాదమై ప్రతిధ్వనించారు.

లోపూడి కథల వర్క్‌షాప్ సందర్భంలో కూడా కా॥ సి.ఎస్.ఆర్. ప్రసాద్, రుక్మిణి గారు, అల్లం రాజయ్యగారు కొత్తగా కథలు వ్రాయాలనే ఆసక్తి ఉన్న వాళ్ళందరితో కలిసి కా॥ చలసాని ప్రసాద్ చురుకుగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ చర్చలు మరింత ఆసక్తికరంగా జరిగేటందుకు ఆయన కృష్ణాబాయిగారు సహకరించారు.

కర్నూలు జిల్లా, మహానంది కథల వర్క్‌షాప్ జరిగినపుడు కా॥ పాణితో పాటు అనేక మంది కథకులు పాల్గొన్నారు. కా॥ సి.పి.గారు అక్కడ యువకులతో పాటు కలిసిపోయి కేరింతలు కొట్టారు. దాదాపు అందర్ని కొలనులో దూకించారు. ఆయన ఎక్కడుంటే అక్కడ ఓ స్వచ్ఛమైన మానవతా పరిమళం చుట్టుముడుతుంది. ఆత్మీయత పంచే ఆయన చైతన్యం వెంటాడుతుంది.

సాహిత్య పాఠశాలలు, మహాసభలు, సర్వసభ్య సమావేశాల్లో ఆయన ప్రత్యక్ష, పరోక్ష సహకారం చొరవ ఉంటుంది. ఆయన హాజరు కాని సమావేశం ఊహించటం కష్టమే.

విశాఖలో విరసం మహాసభలు జరిగినపుడు నవ యువకుడిలాగా స్కూటర్‌పై తిరగడం చూశాను. అక్కడి సాహిత్యమిత్రులు ఎంతో కష్టపడి పనిచేశారంటే అదంతా కా॥ చలసాని ప్రసాద్‌గారిపై అభిమానం, గౌరవం - ఆ సహకారంతో సభలు విజయవంతంగా జరిగాయి. విశాఖపట్నంలో జరిగే ప్రతి నిరసన సభలోనూ ఆయన పాల్గొన్నారు. విరసం తరఫున విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తపించారు. అణువిద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి నినదించారు. ఆయన ఇల్లు ఓ అపూర్వ గ్రంథాలయం - పుస్తక సేకరణ ప్రాణం - రమణారెడ్డిగారి సహకారంతో లైబ్రరీ చక్కదిద్దే పని మొదలుపెట్టారు.

నా రచనలన్నీ ఒక కాపీ పంపమని అడిగారు. ఆయన ఈ పని పెట్టినందువలనే అన్నీ వెతికి కాపీ చేశాను. ఓ పుస్తకం అనువాదం ఆయన ముందుమాట, సలహాల కోసం పంపాను. పూర్తిగా చదివి ఫోన్ చేశారు. అనంతపురమూ వస్తానని చెప్పారు. ఇక్కడి సాహితీమిత్రులను కలవాలని మూడు రోజులుంటాననన్నారు. వీలైతే విశాఖ రమ్మన్నారు. నేను వెళ్ళి ఆయన్ను కలిశాను. అన్నపూర్ణను, నన్ను కూర్చోబెట్టుకొని రెండుగంటల పాటు ఎంతో ఓర్పుగా, వివరంగా భాషప్రయోగం, తెలుగులోని పద సౌందర్యం, మాధుర్యం గురించి మాట్లాడారు. ఆ చర్చ ఎంతో అర్థవంతమైనది. కొన్ని జాగ్రత్తలు, సలహాలు పాటించమని ఎంతో ప్రోత్సహించారు.

'ఈ యుద్ధానికి కారణమెవరు? మావోయిస్టులా? ప్రభుత్వమా? అనే అంశంపై గాంధేయవాది అయిన హిమాంశు కుమార్ అక్టోబర్ 31, 2009న ముంబయి ప్రెస్‌క్లబ్‌లో చేసిన ప్రసంగాన్ని జ్యోతి పువ్వని ఆంగ్లంలోకి అనువదించారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నవంబర్ - 21, 2009 సంచికలో ప్రచురితమైన ఆ వ్యాసాన్ని నేను తెలుగులోకి అనువాదం చేశాను. విశాఖ యూనిట్ ఆ అనువాదం బుక్‌లెట్ ప్రచురించింది. కా॥ చలసాని, కా॥ కృష్ణాబాయిగారు ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. 'ఆపరేషన్ గ్రీన్ హంట్'కు వ్యతిరేకంగా సభ నిర్వహించారు. ఆ సభలో కా॥ కళ్యాణరావుగారు పాల్గొని ప్రసంగించారు. నేను పాల్గొన లేకపోయాను. కా॥ ప్రశాంత్ కూడా ఈ పనిలో పాల్గొన్నారు. ఆ సభలో ఈ బుక్‌లెట్స్ పంచారని అన్నపూర్ణ చెప్పారు.

ప్రభుత్వ విధ్వంసకర అభివృద్ధి విధానాలకు, బాక్సైట్ తవ్వకాలకు, పోర్ట్ కాలుష్యానికి, అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా 'ప్రజలు జీవించే హక్కుకోసం జరిగిన అన్ని సభల్లోనూ కా॥ చలసాని ప్రసాద్‌గారు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనల్లో నినదించారు.

అమలు కాని హామీల చరిత్ర (భారత రాజ్యం ఆదివాసీలు) పుస్తకం ఆవిష్కరణ సభలో రచయిత బి.డి. శర్మగారు పాల్గొన్నారు. అక్కడి విరసం సభ్యులు, సి.ఎల్.సి. సభ్యుల సహకారంతో ఆ సభ జరిగింది. నేను పాల్గొనలేక పోయాను. ఆ పుస్తకం తెలుగు అనువాదం నేను చేశానని తెల్సుకొని కా॥ చలసాని ప్రసాద్ గారు ఫోన్ చేసి సంతోషం పంచుకున్నారు.

మానసికంగా బాగా కుంగిపోయిన సందర్భంలో కా॥ కృష్ణాబాయి కా॥ చలసాని ఉత్తరం నాకెంతో ఊరటనిచ్చింది. ఆయన ఆత్మీయ ప్రోత్సాహం మరువలేనిది. అపుడే 80 దాటేశాం - అంటూ వ్రాసిన ఆ ఉత్తరం చివరిదవుతుందనుకోలేదు.

ప్రొ॥ బాబయ్యగారు మాట్లాడుతూ - 'చలసాని కాదు - చలనశీలి, స్నేహశీలి, గొప్ప మానవతావాది' అటువంటివాడు ఇంక రాడు, లేడు - కాదు - అతను నా ఆలోచనల్లో బ్రతికి ఉన్నాడమ్మా - అంటూ ఎన్నెన్నో జ్ఞాపకాలు మాతో పంచుకున్నారు.

విజయగారి అంతిమయాత్రలో పాల్గొనే అవకాశం వచ్చింది. ఆమె ఎందరికో స్ఫూర్తి... ఆ ఇల్లొక విజ్ఞాన నిలయం అనుభవాల పంట - ఉద్యమాల ఊపిరి... కా॥ చలసాని జీవితం - ప్రసంగాలు, రచనలు, అనుభవాలు, పాల్గొన్న సభలు - సాహిత్య సాంస్కృతిక రంగాలను సుసంపన్నం చేశాయి. విరసం జెండాను సగర్వంగా ఎత్తిపట్టిన ఆయన జీవితం మహోన్నతమైనది...

ఆయన అంతిమ యాత్ర జరగలేదు.

జైత్రయాత్ర ప్రారంభమైంది...

కా॥ చలసాని ప్రసాద్ లాల్ సలామ్.

'అడవి తల్లిని' కడసారి చూసిన 'చలసాని'

తుంపాల శ్రీరామమూర్తి

ఆయన విప్లవసాహిత్యోద్యమ ప్రస్థానం గిరిజన జీవితంతోనే ముడిపడివుంది. చలసానిని తెలియని విశాఖ మన్యంనేల లేదు. రాజ్యహింస, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా అడవిని కలియతిరిగారు. అది 27 జూన్ 2015 చలసాని ఆడవితల్లిని కడసారి పలకరించిన రోజు. ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ప్రకాశం జిల్లా కొరిసపాడు గ్రామానికి చెందిన కొప్పర్తి సూర్యంను కాల్చి పోలీసులు అప్పటికే ఖననం చేశారు. ఆ మృతదేహాన్ని తవ్వి తీయించి బంధువులకు అప్పగించేందుకు విశాఖపట్నంనుంచి పాడేరు అటవీప్రాంతానికి వేకువజామునే నేను చలసాని ఇద్దరమూ బయలుదేరాం. వంద కిలోమీటరపైగా దూరం, మూడు గంటల ప్రయాణం. మృతదేహాన్ని బయటకు తీయించి చూసిన తరువాత చలసాని చలించిపోయారు. బహూశా వయసు ప్రభావమేమో..! చుట్టూ పోలీసులు, గ్రామస్థులు, బంధువులు, చలసాని చెమ్మగిల్లిన కళ్లు, జీరవోయిన గొంతుతో పెద్దపెట్టున విప్లవ జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయారు. చలసాని నినాదంతో మరో ఇద్దరం కలిసి గొంతు కలిపాం. మళ్లీ ఈ గొంతు అడవిలో వినిపించదని అనుకుందేమో.., ఇదే ఆఖరి నినాదమని అవుతుందని ఊహించిందేమో.. అడవితల్లి., ఆరోజు అడవంతా ఎండ వెన్నెల్లా కాచింది. ఆ వెన్నెల వెలుగులో అడవితల్లి చలసాని ముఖాన్ని తినివితీరా ఆఖరిసారి చూసిందా అని అప్పటి ఘడియల గురుతులు ఆయన అంతిమయాత్రలో మదిలో మెదిలి నా కళ్లు చెమర్చాయి.

నక్సల్బరి ఒక ఊరిపేరు మాత్రమే కాదు. అది ఒక ఉద్యమం. నిఘంటువులో చేరిన పదం. 1967లో పశ్చిమబెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా సిలుగురి తాలూకా నక్సల్బరీలో ప్రారంభమైన సాయుధ రైతాంగ పోరాటం నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. నక్సల్బరీలో కానసాగిన పోరాట స్ఫూర్తి శ్రీకాకులం వరకు వ్యాపించి ఆ తదుపరి జగిత్యాలమీదుగా మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలలో నేడు కొనసాగుతూనే ఉంది. 1967-70 మధ్యకాలంలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం కొనసాగిన క్రమంలో సుమారు 300 మంది అమరులయ్యారు. 1970 ఫిబ్రవరిలో శ్రీశ్రీ షష్టిపూర్తి సభ విశాఖపట్నం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగినప్పుడు విద్యార్థులు పంచిన రచయితలారా మీరు ఎటువైపు అన్న కరపత్రం అనేకమంది మెదళ్లకు పదును పెట్టింది. 22 డిసెంబర్ 1969 శ్రీకాకుళం జిల్లా మందసా సమీపంలోని బొడ్డొర్సింగ్ కొండల్లో పోలీసు కాల్పుల్లో విప్లవగాయకుడు సుబ్బారావు పాణిగ్రాహి, పాంచది నిర్మల, దున్న అంకమ్మ, తెలకల సరస్వతి, రమేష్ చంద్రసాహూ అమరులైనారు. ఈనేపథ్యంలో 1968లో విశాఖ వచ్చిన చలసాని ప్రసాద్ నాకు 1969లో పరిచయమయ్యారు. నక్సల్బరీ నుండి సుబ్బారావు పాణిగ్రాహి వరకు ఆయన చరిత్రను అధ్యయనం చేసి భారత ప్రజల విముక్తికి సాయుధ పోరాటమే ఏకైక మార్గమని ఆకాంక్షించారు. 1992 వరకూ ఎ.వి.ఎన్ కాలేజీలో పనిచేశారు. ఉద్యమ అవసరాల రీత్యా 1970-71 నేను ఎవిఎన్.కాలేజీలో రాత్రి కళాశాలలో నేను విద్యార్థిగా జాయిన్ అయ్యాను. నాకు చలసానితో ఆయన మరణించేవరకు నిత్యం ఉద్యమాల్లో కలిసి పనిచేశాను. ఆయన అంతకుముందునుంచే సాహితీవేత్త కనుక సాహితీకారులతో సాహిత్యంతో ఎనలేని బంధం కొనసాగుతూఉండేది. ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులతో కూడ పరిచయం ఉండేది. 1972లో భారత నాస్తిక సమాజం ఏర్పడింది. 1973లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఆవిర్భవించింది. దీనికి మొదటి అధ్యక్షుడు శ్రీశ్రీ ఉపాధ్యక్షుడు రావిశాస్త్రీ వారితో నాకు పరిచయాలు కొనసాగాయి. ఎమర్జెన్సీ సమయంలో చలసాని జైలుకు వెళ్లినప్పుడు ఆయన కుమార్తె నవతను జైల్లో నిర్బంధించినప్పుడు నేను జైలుకు వెళ్లి కలిసేవాణ్ణి. పౌరహక్కుల సంఘం ఏర్పడిన నాటినుంచి అందులో నేను కొనసాగుతూ గత పది సంవత్సరాలు పైబడి జిల్లా అధక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. అన్నింటిలోనూ చలసాని ప్రసాద్ పాల్గొంటూనే ఉన్నారు.

విశాఖజిల్లా ఏజెన్సీ 11 మండలాల్లో 6 లక్షల 30వేల మంది గిరిజనులు ఉన్నారు. ఏజెన్సీ ప్రజలకు ఆయన పరిచితుడు. మొట్టమొదటిగా 1970 దశకంలో జీ.కె.వీధి మండలంలోని ఎన్‌కౌంటర్‌లో జ్యోతి హత్యగావించబడింది. ఆమె బబూజగజ్జీవన్‌రామ్ కళాశాల హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని. నేను భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్, చలసాని ప్రసాద్ ఇంకో మిత్రుడు కలిసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి నిజనిర్ధారణ కమిటీగా వెళ్ళాం జ్యోతిని చెట్టుకు కట్టి చిత్రహింసలకు గురిచేసి తదుపరి కాల్చి చంపినట్లు పోస్టుమార్టం చేసిన వైద్యురాలు మాకు చెప్పినప్పుడు మాతోపాటు చలసాని బోరున ఏడ్చారు. అప్పటి రోజుల్లో ఎక్కడ ఎన్‌కౌంటర్ సంఘటన జరిగితే అక్కడికే వైద్యులు వెళ్ళి పోస్టుమార్టం చేసి శవాన్ని అక్కడే పాతిపెట్టేసేవారు. కుటుంబ సభ్యులకు సమాచారం కూడ లేదు. విశాఖ ఏజెన్సీలో విప్లవోద్యమంలో సుమారు 300 మంది అమరులైనట్టు అంచనా. భారతదేశ చరిత్రలో ప్రసిద్ధిగాంచిన పార్వతీపురం కుట్రకేసు నెం. 46/ 1973, విశాఖలోనే ప్రత్యేక కోర్టులో విచారణజరిగి 1976 ఆగస్టు 30 తీర్పు వెలువడింది. విచారణ సమయంలో చలసానితో పాటు నేను కోర్టుకు హాజరయ్యేవాణ్ణి. ఈ కేసులో 120 మంది ముద్దాయిలు, అందులో కొంతమంది విచారణకు ముందే చనిపోయారు. కేసు తీర్పు 1711 పేజీలు. 502 మంది వ్యక్తులను సాక్షులుగా విచారించారు. ఈ కేసులో ఉన్న ముద్దాయిలందరినీ, కోర్టుకువచ్చి పలకరించి క్షేమ సమాచారం తెలుసుకునేవారు. తీర్పునాడు 12 మందికి జీవిత ఖైదు పడింది అందులో ఇద్దరు మహిళలు మేడవరపు రామసీత, చౌదరి సంపూర్ణమ్మ. తీర్పువిని చాలా ఆందోళన చెందారు. 2004లో ప్రభుత్వం పీపుల్స్‌వార్ మధ్య చర్చలు సందర్భంగా పార్టీపై నిషేధం సడలించినప్పుడు 2004 జూలై 28న జీ.కె.వీధి మండలం దారకొండలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభ నిర్వహణలో చలసాని పాత్ర కీలకమైనది. ఆ స్థూపంపై 75 మంది అమరులు పేర్లు కూడ నమోదు చేయించారు. ఈ కార్యక్రమానికి నేను చలసాని, వరవరరావు, తదితరులంతా హాజరయ్యారు. అలాగే జూలై 30న పెదవలస పాడేరు, విజయనగరంలలో జరిగిన భారీ సభల నిర్వహణలో ఆయన ముఖ్య భూమిక వహించారు.

అమరుల కుటుంబ సభ్యులను వేదికపైకి తీసుకువచ్చి ప్రజలతో మీడియాతో మాట్లాడించారు. రాష్ట్రంలో 1968నుంచి 2001 వరకు లభించిన ఆధారాలు మేరకు బూటకపు ఎదురు కాల్పుల్లో 2,437 మంది మరణించారు. ఏజెన్సీలో ఎక్కడ ఎదురు కాల్పులు జరిగినా నిజనిర్ధారణ కమిటీలో ఆయన ఉండేవారు. అంతేకాక ఇతర రాష్ట్రాలలో ఎన్‌కౌంటర్లు

అరుణారుణతార

- పోతుల బాలకోటయ్య

జర్నలిస్ట్, విజయవాడ

1991లో అనుకుంటా. నేను తీరం తెలియని సముద్ర ప్రయాణం చేస్తున్నపుడు, నా తొలి కవితా రచన ప్రచురణ జరిగింది అరుణతారలోనే. పెన్నుతో రాసిన అక్షరాల్ని అచ్చు రూపంలో చూసుకున్న తొలి మధుర క్షణాలు కూడా అవే. అరుణతార ఎవరు నిర్వహిస్తారని? ఆరా తీస్తే, చలసాని ప్రసాద్‌గారు అని చెప్పారు. నా కవితకు 'పట్టాభిషేకం' చేసినందుకు మనసులోనే కృతజ్ఞతలు ప్రకటించా. నాకు విరసంలో పెద్దవారు తెలియకపోయినా, సమకాలీన మిత్రులు కొందరు తెలుసు. వారితో సాహచర్యం, భావ సారూప్యత ఉంది. అందుకే విరసం అంటే అభిమానం. దాని అధికారిక పత్రిక అరుణతార అంటే మరీనూ. ఇంకా వివరంగా చెప్పాలంటే అది పీడిత తాడిత పక్షపాతి, వారి పతాక కూడా.

ఓ రెండు మూడు సార్లు చలసానిగారిని చూశా. ఆయన మీటింగు విన్నా. ఆయనది అదో తరహా ప్రసంగశైలి. ముద్దు ముద్దుగా, బొద్దు బొద్దుగా మాట్లాడే నిజాలు, ఇజాలు జాలువారుతుంటాయి. ఫీంకారాలు, డైనమెట్లు చప్పుడు చేయకుండా పేలుతుంటాయి. కళ్ళద్దాల్లోంచి చూస్తుంటారు. సాదాసీదా దుస్తుల్లో పెద్దరికంగా కనిపిస్తుంటారు.

చలసాని గారికి శ్రీశ్రీ అంటే విపరీతమైన అభిమానం. కాదు పిచ్చి. శ్రీశ్రీ రచనల్ని, ఆయన పేరిట కార్యక్రమాల్ని చలసాని ఉద్యమంలా నిర్వహించేవారు. చాలా మంది ఇదే అనేవారు. చలసానికి శ్రీశ్రీయే సర్వం. శ్రీశ్రీయే సర్వస్వం.

ఆ తరువాత ఎప్పుడో, నా మిత్రుడు, సహచరుడు కలేకూరి ప్రసాద్ (యువక)తో కలసి చలసాని గారింటికెళ్ళా. 'మా ఊరే, నా మిత్రుడు' అంటూ నన్ను పరిచయం చేస్తే, రెండు చేతులతో నమస్కరించిన గుర్తు. చిద్విలాసంగా ఓ చిరునవ్వు నాకిచ్చిన గుర్తు కూడా. ఇక అంతే. సుదీర్ఘమైన నా జర్నలిస్టు కొలువులో అప్పుడప్పుడూ పత్రికల్లో ఆయన రచనల్ని ఇష్టంగా చదివేవాణ్ణి.

నాకు జ్ఞప్తి ఉన్నంత వరకు రివల్యూషనరీ పనితనంలో చలసాని గారు ఎప్పుడూ వివాదం కాలేదు. విరసంలోనూ ఒకరిద్దరిపై ఏవేవో ఆరోపణల దండలు పడ్డాయేమో కానీ, చలసాని గారిపై అభిమానపు దండలే పడ్డాయి. ఆయన మరణ వార్తకు నా కనుకొలనులు కాస్త చెమర్చాయి. పాత జ్ఞాపకాల చిత్తడిలో తడిశాయి.

చలసాని గారికి నివాళులతో...

జరిగినప్పుడు కూడ ఆయన వెళ్లేవారు. పార్థివ దేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడంలో మాతోపాటు ఆయన పాలుపంచుకునేవారు. ప్రజాపోరాటం చేసేవారైతే చాలు. వారికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుండేవారు. విశాఖ ఏజెన్సీతో సహ పొరుగు రాష్ట్రాలలో ఎక్కడ ఏ అలజడి జరిగినా ఏ ఉద్యమ కారుణ్ణి పోలీసులు పట్టుకున్నా తిన్నగా తీసుకునివచ్చేది విశాఖపట్నం కేంద్ర కారాగారానికే. వారిని తొలుత పరామర్శించేదే చలసానే. వారితరుపున ప్రభుత్వాన్ని ప్రశ్నించేది ఆయనే. విశాఖ కె.జి.హెచ్ దగ్గర, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి పోస్టుమార్టం అనంతరం అమరుల పార్థివ శరీరాలను వారి కుటుంబ సభ్యులకు అందజేసే పనిలో మాతోపాటు ఆయన అనేకసార్లు పాల్గొన్నారు. జోహార్లు చెప్పే మొదటి గొంతు ఆయనదే. పీపుల్స్‌వార్‌కి ప్రభుత్వానికి మధ్య చర్చల సందర్భంలో విశాకలో పీస్ ఇన్సియేటివ్ కమిటీ ఏర్పాటు చేసి చర్చల ఆవశ్యకతను ప్రజల సమస్యలే పీపుల్స్‌వార్ ఎజెండా అని చెబుతూ పలు సభలు నిర్వహించారు. 2003లో ఆయన సహచరి విజయక్క మరనించినప్పుడు ఆమె భౌతిక కాయాన్ని విశాఖ మెడికల్ కాలేజీకి అందజేశాం. ఎన్‌కౌంటర్‌లో 2015 జూన్ 20న మృతిచెందిన ప్రకాశం జిల్లా కొరిసపాడు గ్రామానికి చెందిన కొప్పర్తి సూర్యం (22) మృతదేహాన్ని 27 జూన్ 2015న పాడేరు శ్మశనవాటికనుంచి తవ్వి తీయించి వారి కుటుంబ సభ్యులకు అందజేసే పనిలో చలసానితోపాటు మేమూ పాల్గొన్నాం. అదే అతని చివరి ఏజెన్సీ పర్యటన. అక్కడ జోహార్లు చెప్పడమే అతని చివరి నినాదం. విప్లవసాహిత్యోద్యమ ప్రస్థానం గిరిజనంతోనే ముడిపడివుంది. చలసానిని తెలియని విశాఖ మన్యంనేల లేదు. రాజ్యహింస, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా అడవిని కలియతిరిగారు. అది 27 జూన్ 2015 చలసాని ఆడవితల్లిని కడసారి పలకరించిన రోజు. ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ప్రకాశం జిల్లా కొరిసపాడు గ్రామానికి చెందిన కొప్పర్తి సూర్యంను కాల్చి పోలీసులు అప్పటికే ఖననం చేశారు. ఆ మృతదేహాన్ని తవ్వి తీయించి బంధువులకు అప్పగించేందుకు విశాఖపట్నంనుంచి పాడేరు అటవీప్రాంతానికి వేకువజామునే నేను చలసాని ఇద్దరమూ బయలుదేరాం. వంద కిలోమీటరపైగా దూరం, మూడూ గంటల ప్రయాణం. మృతదేహాన్ని బయటకు తీయంచి చూసిన తరువాత చలసాని చలించిపోయారు. బహూశా వయసు ప్రభావమేమో..! చుట్టూ పోలీసులు, గ్రామస్తులు, బంధువులు, చలసాని చెమ్మగిల్లిన కళ్లు, జీరవోయిన గొంతుతో పెద్దపెట్టున విప్లవ జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయారు. చలసాని నినాదంతో మరో ఇద్దరం కలిసి గొంతు కలిపాం. మళ్లీ ఈ గొంతు అడవిలో వినిపించదని అనుకుందేమో.., ఇదే ఆఖరి నినాదమని అవుతుందని ఊహించిందేమో.. అడవితల్లి.., ఆరోజు అడవంతా ఎండ వెన్నెల్లా కాచింది. ఆ వెన్నెల వెలుగులో అడవితల్లి చలసాని ముఖాన్ని తనివితీరా ఆఖరిసారి చూసిందా అని అప్పటి ఘడియల గురుతులు ఆయన అంతిమయాత్రలో మదిలో మెదిలి నా కళ్లు చెమర్చాయి.

ఇతర ప్రజాఉద్యమాలతో పాటు భారత నాస్తిక సమాజం (1972) ఆవిర్భావం నుంచి ఆయన ప్రస్థానం కలిగి ఉన్నారు. సాహితీ ఉద్యమాలతోపాటు సామాజిక ఉద్యమాల్లోను ఆయన చివరిశ్వాస వరకు కొనసాగారు. అండదండలందించారు. అందుకే అన్ని రంగాలకు చెందిన ఉద్యమకారులు ఆయన చివరిశ్వాస ఆగినప్పుడు కంటతడిపెట్టారు. సాయుధ పోరాటంతోపాటు సామాజిక ఉద్యమాలను నమ్మినవ్యక్తి ఉద్యమాలల్లో పాల్గొనడం, నిర్వహించడం ద్వారా ఆయన ఆశయాల కొనసాగింపే ఆయనకు మనమిచ్చే నివాళి.

బాలగోపాల్‌తో

సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర

వేణు, శివారెడ్డి, వేణుగోపాల్‌రావు, క్రిష్టక్కలతో

మహబూబ్‌నగర్‌లో పాఠం చెబుతూ, సిఎస్ఆర్, వరలక్ష్మి, రాంకీలతో

ఒక ఎ.ఐ.ఎల్.ఆర్.సి. సెమినార్ - కామ్రేడ్ చలసాని జ్ఞాపకం

షోమాసేన్, తెలుగు: వరలక్ష్మి

కామ్రేడ్ చలసాని ఇక లేరనే వార్తను వినవలసి రావడం నాకు చాలా బాధాకరంగా ఉంది. ఆయనతో నేను గడిపిన కాలం పెద్దగా లేదు. కానీ 90ల తొలి రోజుల్లో నాగపూర్ కు, మా ఇంటికి ఆయన రాకపోకలు గుర్తున్నాయి.

స్త్రీ సమస్య పై ఏ.ఐ.ఎల్.ఆర్.సి. సెమినార్ సందర్భం అది. నాకు, నావంటి మహిళా కార్యకర్తలకు ఆ సెమినార్ ఒక కీలక మలుపు వంటిది. కేవీయార్, వీవీ, చలసాని ప్రసాద్, రాజ్ కిషోర్, విజయ్ కుమార్ ఆర్య, షీలా దీదీ వంటి కామ్రేడ్స్ అందులో ముఖ్య పాత్ర నిర్వర్తించారు. పురుష కామ్రేడ్స్ జెండర్ ప్రశ్నపై ఆసక్తి చూపరని తరచూ అంటూ ఉంటారు కానీ ఈ పురుష కామ్రేడ్స్ మాత్రం మహిళా కామ్రేడ్ల అభిప్రాయాలకు, మరీ ముఖ్యంగా అనురాధా గాంధీ వంటి క్రియాశీల కామ్రేడ్‌కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అప్పుడు కా.చలసాని కె.అనూరాధతో కలిసి నాగపూర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాజకీయ పరిజ్ఞానం ఏ మాత్రం లేని ఒక అత్యుత్సాహం గల పోలీసు అధికారి వాళ్ళిద్దర్నీ రైల్వే స్టేషన్‌లో నిర్బంధించాడు. కేవలం అనూరాధ కొండపల్లి సీతారామయ్య మనుమరాలు కావడమే అందుకు కారణం. ఫోన్ నెంబర్లు, అడ్రస్సులున్న చలసాని డైరీని స్వాధీనం చేసుకొన్న తర్వాత వారిద్దర్నీ పోలీసులు విడుదల చేశారు. దీన్ని పెద్ద వార్త చేయలేదు కా.చలసాని. తర్వాత నాగపూర్‌లో ఎవరో పూర్వ విద్యార్థి ఆచూకీ తవ్వితీసి తన డైరీని తిరిగి రాబట్టుకోగలిగానని ఆయన నాకు చెప్పాడు.

అదే అంశంపై విశాఖపట్నంలో సభ జరిగినప్పుడు చలసానిని, ఆయన కూతురు నవతను వ్యక్తిగతంగా కూడా ఎక్కువ పరిచయం చేసుకోగలిగాను. మీటింగ్ అయిపోయాక రైల్వే స్టేషన్ కు ఆటో తీసుకుందామని ప్రయత్నిస్తున్నా. చలసాని మాత్రం నేను బస్సులో వెళ్లాలని పట్టుబడుతున్నాడు. చివరికి నేను అట్లాగే వెళ్ళాను. ఆయన తర్వాతి తరం వాళ్ళం ఏమాత్రం ఓపిక లేకుండా ఎలా కార్లు, టాక్సీలు పట్టుకుంటామో, చాలా అలవోకగా ఇంటిపనుల్లో సహాయం తీసుకుంటామో తలచుకుంటే చాలా సిగ్గనిపిస్తుంది. నవతతో నా పరిచయం వల్ల ఆమె కుటుంబ నేపథ్యం తెలిసింది. ఒక రాజకీయ కుటుంబంలో పెరగడం అంటే ఎలా ఉంటుందో తెలియవచ్చింది. ఆమె నాయనమ్మ కూడా ఒక క్రియాశీల కమ్యూనిస్టు. బీచ్‌లో డాన్స్ చేయడం నేర్చుకొని నవత ఆంధ్రప్రదేశ్‌లో ఒక మంచి సాంస్కృతిక కార్యకర్త అయింది. ఆమె తండ్రి ఆమె విప్లవ భావాలనే కాదు, ఫెమినిస్టు ఆలోచనల్ని కూడా ప్రోత్సహించాడు... పితృస్వామిక ఆధిపత్యం కింద ఉన్న ఆమె మొదటి వివాహ సంబంధాన్ని తెంచేసుకుని స్వేచ్ఛగా ఆమె ఎంచుకున్న మార్గంలో వెళ్ళేలా. ఉద్యమాన్ని ముందుకు నడిపించిన స్పష్టమైన రాజకీయ దృక్పథం గల గొప్ప మేధావులు, రచయితలు, ఉపన్యాసకులైన కమ్యూనిస్టుల తరానికి చెందినవాడు చలసాని. ఈనాటి కార్యకర్తలుగా మనం వారి నుండి ఎంతో నేర్చికోవాలి.

మరపురాని మహామనిషి - మన చలసాని ప్రసాద్

కడియాల సుబ్బనాచారి

దాదాపు 30 సంవత్సరాలుగా విరసం మీటింగులు, పౌరహక్కుల సంఘాల మీటింగులలో చూచినానే గాని ఇద్దరం మాట్లాడుకున్న సందర్భాలు లేవు. ఒక్కసారి మాత్రం డా॥ రాముగారి సావనీర్ పుస్తకాన్ని ఆయనికివ్వడం జరిగింది. అది చదివి 'ఇరవై పుస్తకాలు తెచ్చి ఇవ్వగలవా,' అన్నాడు. అట్లాగే 20 పుస్తకాలు తెచ్చి ఇచ్చాను. అదొక్కసారి మాత్రమే దగ్గరుండి మాట్లాడిన సందర్భం.

తర్వాత చాలా రోజులకు అంటే. 30 సంవత్సరాలకు మా మనుమడు ఎం.బి.బి.ఎస్.లో సీటు తెచ్చుకున్నాడు. మంచి ర్యాంక్ వచ్చినది. గనుక కోరుకున్న కాలేజీలో సీటు ఇస్తామన్నారు. కానీ ఏ కాలేజీలో చేర్పిస్తే భద్రతగా ఉంటుంది? అని ఆలోచన వచ్చి మిత్రులు వి.చెంచయ్యగారిని సలహా అడిగాను. ఆయన ప్రసాద్ గారికి ఫోన్ చేసి వైజాగ్ బాగుంటుందా? అని అడిగాడు. అన్ని కాలేజీల కన్నా, అన్ని విధాలుగా బాగుంటుంది. వైజాగ్‌లో చేర్పించమన్నారు ప్రసాద్‌గారు. అట్లాగే చేర్పించాము. కాని ర్యాగింగ్ బెడద ఉండనే ఉన్నది కదా! అందుకని నేను వెళ్ళి వైజాగ్‌లో ఒక వారం రోజులు ఉండడం జరిగినది. చెంచయ్యగారు నన్ను ప్రసాద్‌గారిని కలిసి మాట్లాడమన్నారు. ఒక రోజున నేను ఫోన్ చేసి ప్రసాద్ గారితో మాట్లాడాను. మీతో కలవాలని ఉంది. ఎప్పుడు వీలవుతుందో తెలిపితే పిల్లవాడిని తీసుకొని మీ దగ్గరకు వస్తానని చెప్పాను. నువ్వు రానవసరం లేదు. నేను వచ్చి నిన్ను కలుసుకుంటాను. రూమ్ అడ్రస్ తెలుపమన్నాడు. మేముండే హాస్టల్ రూం నెంబర్ చెప్పాను. మరుసటి రోజు ఉదయం 9 గంటలకల్లా మేముండే రూంకు వచ్చి కలిసాడు. నీవు రూంలోనే ఉండు నేను అబ్బాయిని తీసుకొని పోతాను అని చెప్పి తన వాహనం మీదనే ఎక్కించుకుని పోయినాడు. ఆయనకు బాగా పరిచయమున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అనాటమీ ప్రొఫెసర్‌గారిని అబ్బాయికి పరిచయం చేసి ధైర్యం చెప్పి అప్పుడప్పుడు కలుసుకుంటుండమని చెప్పి తిరిగి రూం దగ్గరకు వచ్చి అబ్బాయిని విడిచిపెట్టినాడు. పిమ్మట నాతో కాసేపు మాట్లాడి ఇక నీవు ఇచ్చట ఉండవలసిన అవసరం లేదు, అబ్బాయికేం ఫర్వాలేదు. ఏ ఇబ్బంది వచ్చినా నేను చూచుకుంటాను. ఇక నీవు నిశ్చింతగా ఇంటికి వెళ్ళిపొమ్మన్నాడు. ప్రొఫెసర్ గారికి పరిచయం అయినందువలన స్వేచ్ఛగా తిరుగుతూ నిర్భయంగానే ఉంటున్నాడు. బాగా చదువు కుంటున్నాడు కూడా. అంత సాదాసీదాగా ప్రసాద్‌గారుంటారని నేననుకోలేదు. ఎప్పటికైనా మనము మరణించవలసినదే. కాని ఇటువంటి వారి మరణం సమాజానికెంతో తీరని లోటని భావిస్తూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అశ్రునయాలతో...

చలసాని ప్రసాద్ మరణంతో డిటిఎఫ్ ఒక శ్రేయోభిలాషిని కోల్పోయింది

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్

చలసాని ప్రసాద్ విశాఖపట్టణంలోని తన ఇంట్లో (హెచ్‌బి కాలనీ, సీతమ్మధార) 25.7.2015 నాడు గుండె ఆగి చనిపోయారు. ఆయన 83 ఏళ్ల పెద్ద మనిషి. ఆయన వయస్సు వల్లనే కాదు, తన జీవిత కాలమంతా ప్రజా ఉద్యమాల్లో నిర్వహించిన పాత్రను బట్టి కూడా ఎంతో మందికి పెద్ద మనిషి. 26.7.2015 నాడు ఆయన మృతదేహాన్ని ఆంధ్ర వైద్య కళాశాలకు అప్పగించడానికి ముందు ఆయన ఇంటి ముందు జరిగిన సంతాపసభ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందినవారు, వేదిక మీద, వేదిక కింద, తమకు పెద్ద దిక్కు లేకుండా పోయిందని ఆవేదన చెందారు.

కృష్ణా జిల్లాలోని భట్ల పెనుమర్రులో ప్రసాద్ 8.12.1932 నాడు జన్మించారు. ఆయనది అప్పటికే కమ్యూనిస్టు కుటుంబం కావడం వలన ఆయన చాలా చిన్నప్పటి నుండే కమ్యూనిస్టు ఉద్యమ కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చారు. ఆ నడవడి ఆయనకు జీవిత కాలమంతా కొనసాగింది. ఆయన జీవించిన ఎనిమిది దశాబ్దాల కాలంలో దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం తీసుకున్న అవి విప్లవకరమైన మలుపుల్లోనూ ఆయన స్థిరమైన అడుగులు వేసి నడిచారు.

ఆయన వృత్తిరీత్యానే కాదు, ప్రవృత్తి రీత్యా కూడ అధ్యయనపరుడు, అధ్యాపనపరుడు. సాహిత్యం, రాజకీయాలు, చరిత్ర, సంస్కృతి ఆయనకు ఇష్టమైన విషయాలు. ఆయన విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులు.

ఆయన ఇల్లు ఒక పెద్ద గ్రంథాలయం. ఆ ఇంట్లో, బహుశా ఒక్క వంటగదిలో తప్ప, పుస్తకాలు లేని గది లేదు. పుస్తకాలంటే పదీ ఇరవై పుస్తకాలు కాదు, వందలూ వేల పుస్తకాలు. పుస్తకాలతో కూడిన ఆ ఇల్లే కాదు, ఆయనే స్వయంగా ఒక పెద్ద సమాచార భాండాగారం. ఆయనతో మీరు మాట్లాడితే, మీ వ్యక్తిగత వివరాలు కూడా ఆయన వద్ద లిఖితపూర్వకంగానో, మౌఖికంగానో ఉండి పోతాయి.

సమాజం కొరకు ఉద్యమాల్లో పని చేసే వారందరికీ ఆయన ఇల్లు ఎప్పుడూ తెరిచిన తలుపులతో స్వాగతం పలికే ఆశ్రయం. ఆయనకు రాజకీయ విశ్వాసాల పట్ల, ప్రజాస్వామ్య, సామ్యవాద విలువల పట్ల, చరిత్ర చెప్పే సత్యాల పట్ల తిరుగులేని నిబద్ధత ఉంది. అదే సమయంలో ఆయన భిన్నాభిప్రాయాలు కలిగిన వారితో కూడా తన అభిప్రాయాలకు కట్టుబడి ఉండి సంభాషణ చేస్తూనే వారితో స్నేహపూర్వకంగా కూడా ఉండగలరు.

ఆయన చాలా నిరాడంబర జీవి. సామ్రాజ్యవాద సంస్కృతి, ప్రపంచీకరణ క్రమంలో వచ్చిన వస్తు వినిమయ సంస్కృతి ఆయనను లోబరుచుకోలేకపోయాయి.

ఆయనది ప్రజా ఉద్యమాల కుటుంబం. ఆయన కుటుంబం కూడా ప్రజా ఉద్యమాల్లోనే ఉంది.

ఆయన డిటిఎఫ్ శ్రేయోభిలాషి. డిటిఎఫ్ శ్రేణులు ఎపిటిఎఫ్‌లో పనిచేస్తున్న కాలం నుండి అప్పుడప్పుడు మంచిచెడులు విచారిస్తూ ఉండేవారు. డిటిఎఫ్ ఏర్పడిన తరువాత, 2000 నాటి గుంటూరు సభల నుండి 2015 నాటి గుంటూరు సభల వరకు కూడా దాని గమనాన్ని గమనిస్తూ, తన అభిప్రాయాలను, తన ఆకాంక్షలను డిటిఎఫ్ బాధ్యులతో పంచుకుంటుండేవారు.

ఆయన పని మీద బయటకు పోయినపుడు విశాఖలోని తన ఇంటికి తాళం వేసి తాళపుచెవిని పక్కనే ఉన్న కిటికీలో ఉంచేవారు. ఆయన ఉద్యమ కుటుంబంలోని వారు ఎవరైనా సరే వచ్చి తాళం తీసుకుని ఇంట్లోకి పోవచ్చును.

నిజానికి ఆయన తాళం లేని ఇంటిని, అణిచివేత లేని కుటుంబాన్ని, దోపిడీ లేని సమాజాన్ని కోరుకున్నారు. ఆ స్వప్నం నిజం కావాలని ఆయన జీవిత కాలమంతా ఆరాటపడ్డారు. ఆయన దాని కోసం తన జీవితాన్ని ఇచ్చారు. ఆ జీవితం ముగిసింది. ఇప్పుడిక అది తన వంతు.

ఆయనకు జోహార్లు.

నాకు తెలిసిన చలసాని

డా.ఇ. పెద వీర్రాజు

నాకు తెలిసిన చలసాని
అలుపెరుగని విప్లవ సేనాని
సాహిత్యపు వీరాభిమాని
ప్రపంచాన్ని చదివిన జ్ఞాని!

శ్రీశ్రీకి బహుదగ్గర
శ్రీరంగానికి చాలా దూరం
రాచకొండంటే ఇష్టం
రాచరికం మాటే కష్టం!

వేణు మాస్టారి మిత్రుడు
వేలాది దీనులకు ఆప్తుడు
కాళీపట్నం పేరే స్మరణం
విశాఖపట్నం ఊరే ప్రాణం!

వంగపండు గేయానికి దండ
గంటిలాంటి వారికి అండ

వరవరరావు నేస్తం
ఆజాద్‌కి స్నేహ హస్తం
నమ్మిన సిద్ధాంతాన్ని మోస్తాడు
నమ్మిన వాళ్ళను కాస్తాడు!

ఏయులో బిఏ ఆనర్స్
ఎవిఎన్‌లో లెక్చరర్ ఫర్ ఇయర్స్
వేంకటేశ్వర్లు క్లాస్‌మేట్
విజయేమో లైఫ్‌మేట్!

విప్లవ సాహిత్యంలో దిట్ట
రాజనీతి శాస్త్రంలో పట్టా
విరసానికి ఆయువుపట్టు
విప్లవ స్నేహానికి వెన్నుదన్ను

లేనే లేదు భేషజం
లేవనీయవద్దు ఫాసిజం
నమ్మింది మావోయిజం
ముమ్మాటికి ఇదే నిజం!

బహుముఖ ప్రజ్ఞాశాలి
విద్యావితరణ శీలి
స్పష్టంగా మాట్లాడే శైలి
కష్టపడే వాళ్ళ పట్ల జాలి!

అనునిత్య సత్యాన్వేషి
నిరంతర పరనాభిలాషి
గోపిచంద్ మిత్రుడు
కొడవటిగంటి హితుడు

ఛందస్సు బంధాల్ని తెంపేస్తాడు
చాందస భావాల్ని తరిమేస్తాడు
అందరితో కలసి పని చేస్తాడు
ఎందరికో ఆదర్శం అనిపిస్తాడు!

నవతా సమతావాదానికి ప్రోది
మమతానురాగాల వారధి
జనం మెచ్చిన హేతువాది
మనం మరచిపోలేని మానవతావాది!



చలసాని స్వప్నం నిజం చేద్దాం

రామచంద్రం

చలసాని ప్రసాద్ కృష్ణా జిల్లాలోని మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మద్దతుగా, జమీందారీ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నందుకు చలసాని కుటుంబం నుంచే ముగ్గురిని ప్రభుత్వం కాల్చి చంపింది. అదే చలసానిని మరింత పట్టుదలతో ప్రత్యామ్నాయ రాజకీయ బీజాలు నాటుకోవడానికి పురికొల్పిందేమో. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో విద్యార్థిగా తన రాజకీయ జీవితం ఆరంభించారు. సమ్మె కవితతో తన భావాలను సమాజం ముందు ఉంచారు. ఆయన చివరి శ్వాస వరకు భారత పీడిత ప్రజల విముక్తికి సాయుధ పోరాటమే మార్గమని నమ్మి విప్లవ రచయితల సంఘంలో విస్తృతమైన కృషి చేశారు. ఆంధ్రదేశంలో కదిలే గ్రంథాలయ గని ఇక లేదు.

ఆయన సాహిత్య సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో చేయగలిగినంత కృషి చేశారు. ప్రజాజీవితంలో ఉన్న ఏ వయస్సు వారు చెప్పిన పనినైనా చలసాని ఆదేశంగా భావించేవారు. ప్రభుత్వ నిర్బంధంలో భాగంగా జైలుకు వస్తున్న కార్యకర్తలను తెల్లవారే ములాకత్‌లో ప్రత్యక్షమై వారి అవసరాలు తీర్చడంతో పాటు గొప్ప ధైర్యాన్ని ఇచ్చేవారు. ఆయన ఎవరితో మాట్లాడినా వయసు, క్లాసు మరిచి వ్యవహరించేవారు. ఆయనతో అన్ని విషయాలు చర్చించొచ్చు అనే విశ్వాసాన్ని కలిగించేవారు. ఆయనను కడసారి చూసుకోవాలనే తపనతో రెండు రాష్ట్రాల నలుమూలల నుండి అనేక మంది విశాఖ తరలి వచ్చారు. దారి పొడుగునా తమ జ్ఞాపకాలు పంచుకున్నారు. ఆయన ప్రజా సంఘాల మిత్రులతో చాలా లిబరల్‌గా ఉండేవారు. రాజకీయ పరమైన తాత్విక చర్చల్లో మాత్రం తన వాదనను వినిపించడంలో ఏమాత్రం శషబిషలకు లోనయ్యేవాడు కాదు.

శ్రీకాకుళ ఉద్యమం అణచివేతకు గురైన సందర్భంలో ఆ రాజకీయాలను భావజాల రంగంలో ప్రచారం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి విప్లవ రచయితల సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు, వ్యవస్థాపకుల్లో ఒకరుగా నిలిచారు. సమాజంలో మౌలికమైన మార్పుకు దోహదపడాల్సిన విశ్వవిద్యాలయాలు నీటి గుంటలా మారిపోయి పాలకులకు కొమ్ముకాయడాన్ని ఎదిరించారు.

అరుణతార పత్రిక క్రమం తప్పకుండా రావడానికి ఆయన తన పనుల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రభుత్వ నిర్బంధాలు, జైళ్లు ఆయన రాజకీయ ప్రయాణాన్ని ఆపలేకపోయాయి.

నూతన సమాజంలో మనిషి ఎలా ఉంటాడో ఆయన కుటుంబంలో, సంఘంలో, సమాజంలో తన విలువల ఆచరణతో ఒక నమూనాలా నిలిచాడు. ఆయన తొలితరం కమ్యూనిస్టు విలువలను ఈ తరానికి అందించడంలో వారధిగా నిలిచారు. సాహిత్య సాంస్కృతిక, సైద్ధాంతిక రంగంలో ఆయన చేసిన కృషి నుంచి ఈ తరం ఎంతో తెలుసుకోవాల్సి ఉంది. ఈ విషయంలో ఈ తరంలోని మాలాంటి వాళ్లం ఎక్కడో వెనుబడి పోయాం. మూడు తరాలకు వారధిగా నిలిచి నూతన సమాజాన్ని స్వప్నిస్తూ సాగిన ఆయన అనుభవాలను ఈ సమాజం కాపాడుకోవాలి. చలసాని తన జీవిత ప్రస్థానంలో విస్తృతమైన పరిచయాలను ఏర్పాటుచేసుకున్నారు. సమాజ మార్పుకోసం జీవితకాలం ఒక నావ లాగా ఆయన సాగిపోయారు.

చలసాని మన నుంచి వెళ్లిపోయినందుకు లక్షలాది మందిమి విచారిస్తున్నాము. ఇక నుంచి ఆయన నుంచి నేర్చుకున్న విలువలను మన కుటుంబంలో, సమాజంలో విస్తరింపజేయడానికి అంకితమవుదాం. ఆయన లేని లోటును పూడ్చడానికి మన పరిమితులను అధిగమించి పరిధిని విస్తరించుకోవాలి. అప్పుడే కొంతమేరకైనా ఆయన లేని ఖాళీని భర్తీ చేయగలం.

త్యాగాల కుటుంబం నుండి వచ్చిన చలసాని ఆ సంప్రదాయాన్ని చివరివరకు కొనసాగించాడు. ఆయన పాదుకొల్పిన విలువలు ఈ సమాజానికి అవసరం అని చెప్పడం ద్వారా ఈ సమాజాన్ని చలనశీలం చేయగలం. చలసాని మిత్రులుగా, అభిమానులుగా ఆయనతో ప్రభావితమైన మనం ఆయన ఆశయాలను కాపాడుకుందాం.

కామ్రేడ్ చలసాని ప్రసాద్

మిత్ర

ఉప్పొంగె సంద్రాల సప్పుడూ తానయ్యె
చలసాని మన చలసాని
ఉదయించే సూర్యుని నిప్పులా తొవ్వయ్యె
చలసాని మన చలసాని
అడవిలో వెన్నెలై
ఆకుల వన్నెలై
పువ్వులా ఎరుపులై
పూదోట మెరుపులై
విప్లవ అక్షర సాక్షాత్కారమై
విరసం జెండా చిరునామ తానై ॥ఉప్పొంగె॥

విల్లమ్ములందించె చెలికాడు విలుకాడు
పెనుమర్రు పోరు తనయుండులే
సిక్కోలు సంగ్రామ చరితనే వినిపించ
పాణిగ్రాహి పాళినెత్తిండులే
పాటంటె మురిసీ పాడుతూ గొంతెత్తి
చెరసాలనే మైమరిపించెలే ॥ఉప్పొంగె॥

శ్రీశ్రీని హృదిలోన మదిలోన నిలుపుతూ
కదిలించె కవితల సమరమేలే
గ్రంథాలయమై నడిచి జ్ఞానాన్ని పంచుతూ
తరములన్నీ కలిపే వారదేలే
స్వరములకు కరములకు సంకెళ్ల తెంపుతూ
విప్లవాగ్నులనెల్ల స్పృష్టించెలే ॥ఉప్పొంగె॥

అరసంతో విరసంకు ఆగక పయనిస్తు
వీర రసములోలికి పారిండులే
విప్లవ సాహిత్య మదనంలో పేరొంది
ఆణిముత్యములెన్నో అందించెలే
కత్తి కలముల పోరుసాహిత్య జగతికి
జనకళా సైనికుడయ్యిండులే ॥ఉప్పొంగె॥

దండకారణ్యాన్ని గుండెలకద్దుకుని
జనతన రాజ్యాన్ని చాటిండులే
కావలికుండల్ల ఆంధ్ర తెలంగాణముల
ధ్వజమోలె భుజంపై ఎత్తిండులే
అరుణతారల గమినినందించి తెలుగుకు
తనబాకి తీర్చుకొని తరలిండులే ॥ఉప్పొంగె॥

విశ్వాన్ని వీక్షించె వీరుని కలమెపుడు
దూరాన్నీ భారంగ చూడదులే
శ్రామికులే సర్వంగ భావించె తరమెపుడు
త్యాగాన్నీ గర్వంగ తలిచేనులే
విముక్తి తీరానికి సాగేటి పయనంలో
ప్రజాయుద్ధ బేరి మోగించెలే

ఉప్పొంగె సంద్రాన్నీ అక్షరమాలగా
చలసాని మెడలోన వేసేములే
కడసారి వీడ్కోలు పలికేములే
జెండ ఎరుపులో నిన్న చూసేములే

(జూలై 25/2015 నాడు అమరుడైన విప్లవ కవి, విరసం నేతా కామ్రేడ్ చలసాని ప్రసాద్ స్మృతిలో) జూలై 27/2015

చదవండి! చదివించండి!



మార్క్సిజం లెనినిజం మావోయిజం
స్టడీ నోట్స్
వెల : రు. 100/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్



మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
వెల : రు. 80/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు : మైత్రి బుక్ హౌజ్ విజయవాడ, నవోదయ పబ్లిషింగ్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్. విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదారాబ్, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్.

అరుణకాంతులను

- ఆకుల రఘురామయ్య

ప్రగతిశీల సమాజం కోసం
నిరంతరం శ్రమించిన
సాహితీ శ్రామికుడతడు

సాహిత్యానికీ
సమాజానికీ మధ్య
అభ్యున్నతి కోసం
వారధైన విప్లవ రచయిత అతడు

ప్రజా ఉద్యమాల్లో
ప్రత్యేకతను చాటుకుంటూ
నమ్మిన సిద్ధాంతం కోసం
తుది దాకా కట్టుబడ్డ విప్లవ శిల్పం

తన నివాసాన్ని
పుస్తకాల ప్రపంచంగా
సాహితీ నిలయంగా
చేసుకొన్న పుస్తక ప్రేమికుడు

అరుణకాంతుల్ని
నలుదిశలా ప్రసరించడానికి
తన రక్త మాంసాలనే
ఇంధనంగా వాడిన కార్మికుడు

నలుగుర్ని కలపడం
గగనమవుతున్న సమయంలో
చెట్టులాగా చల్లని నీడనిచ్చి
కూడగట్టే ఆశయ నిబద్ధుడు

పేదల పక్షాన
నిరంతరం పోరాడుతూనే
సాహితీ రంగానికి
ఎనలేని కృషి చేసిన సవ్యసాచి

సిద్ధాంత రాద్ధాంత
గోడలను బద్దలు కొట్టుకొని
మానవ సంబంధాల నడుమ
జీవించిన అతి సామాన్యుడు

ఎన్ని నిర్బంధాలు ఎదురైనా
నమ్మిన భావజాలాన్ని విడవని
నిరంతరం అక్షర కర్షకుడి
కలం ఆగిపోయింది

పెట్టుబడిదారీ
పెత్తందారీ పోకడలను
నిరసించిన నినదించిన
విప్లవం కంఠం మూగబోయింది

రాజకీయాల్లో
విప్లవ స్ఫూర్తి ఉన్నంత వరకూ
సాహిత్యం
మనుషుల్లో ఉన్నంత కాలం
మన మధ్యనే
మనతోనే
పంచుతూ ఉంటాడు
అరుణ కాంతులతో.

దశాబ్దాలుగా కరుగుతూ

- బొగ్గరపు రాధాకృష్ణమూర్తి

ప్రజల మేలుకొలుపుకై
ఉద్యమ పిలుపులతో
అభ్యుదయ భానుడివయ్యావు...

సామాన్యుల సంక్షేమానికై
సామాజిక విప్లవబాటలో
సైద్ధాంతిక ఎర్రబావుటాలెత్తావు...

పేద సాదల బాగుకై
అనుక్షణం పరితపిస్తూ
వర్గపోరాట మార్గంలో నడిచావు...

సమత ప్రత్యక్ష్యానికై
ప్రతి అక్షరంతో
అప్రతిహతంగా విజృంభించావు...

జనత చైతన్యంకై
సమస్త పదాలతో
ప్రగతి పథంలో పయనించావు...

బడుగుల భవితకై
దశాబ్దాలుగా కరుగుతూ
మార్పు కోసం వెలుగుతున్నావు...

అందుకే అక్షరం సాక్షిగా అంటున్నా!
అచంచల విశ్వాసవాది చలసాని
సదా సంచలనాల జీవనవాహిని
సజీవ భావాల శ్వాసనిచ్చే సంజీవని.

కమ్యూనిస్టు మానవుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్

కోటయ్య పిన్నిబోయిన

కామ్రేడ్ చలసాని ప్రసాద్ అందరిలా కవి, రచయిత, విమర్శకుడు, సమీక్షకుడు మాత్రమే కాదు. అంతకు మించిన వాడు. విప్లవీకరించబడిన రాబోయే సమాజపు ఆధునిక మానవుడు. మానవీయతకు నిజమైన సాక్షిగా నిలిచినవాడు. నమ్మిన ఆశయాల కోసం వాటి లక్ష్య సాధన కోసం కడవరకు జీవించిన ఆచరణవాది. కమ్యూనిస్టు అమరుల కుటుంబంలో పుట్టి, దాదాపు డెబ్బయి సంవత్సరాల పాటు కమ్యూనిస్టుగా జీవించి మృతజీవుడు కావడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. అలాంటి కొద్దిమందిలో చలసాని ఒకరు.

చలసాని ప్రసాద్ ఒక విప్లవ స్ఫూర్తి ప్రదాత. విప్లవ రాజకీయాలు రాజేస్తూనే ఉంటాడు. బ్రతికి ఉన్నప్పుడే కాదు - మరణించిన తర్వాత కూడా! తనకంటూ ఏమీ మిగుల్చుకోని, ఉన్న ఇంటిని సహితం పుస్తకాలయంగా మార్చి సమాజపరం చెయ్యడం ఎందరికి సాధ్యం? ఇది తన వ్యక్తిగత ఆస్తిని తాను రద్దు చేసుకోవడమేగా! చివరకు తన మృతకాయాన్ని బూడిద చేసి వృథా కానీయకుండా వైద్య విద్యార్థులకు పాఠ్యగ్రంథం కావడం; తనే కాకుండా తన సహచరి విజయ మృత శరీరం కూడా కెజిహెచ్‌కి సమర్పించడం బ్రాహ్మణీయ హైందవ భావజాలాన్ని భూస్థాపితం చెయ్యాలనుకోవడమే కదా!

చలసాని ప్రసాద్ వ్యక్తిగత జీవితాన్ని చాలా సాదాసీదాగా గడిపాడు. ఎక్కువగా ప్రయాణాలు చేసే చలసానికి సూట్‌కేసులు, జిప్ బ్యాగులు తెలియవు. తెలిసిందంతా ఒక గుడ్డ సంచీలాంటిది మాత్రమే! ఎంత దూరం ప్రయాణించినా, ఎన్ని రోజులు ఇల్లు వదలి వెళ్ళినా ఆ సంచీలో 2 జతల బట్టలు మాత్రమే ఉండేవి. తను రైల్వేలో పని చేసినా, కాలేజీలో అధ్యాపకుడిగా పని చేసినా, ఇస్త్రీ బట్టలు ఎరుగని వ్యక్తి. తన బట్టలు తనే ఉతుక్కుంటూ, ఆ! ఇదేంత పని అంటూ, పని ముగించేవాడు. ఎక్కడికి వెళ్ళినా, ఎవరు ఎలాంటి ఆహార పదార్థాలు పెట్టినా కడు కమ్మగా ఉందంటూ కడుపారా తిన్నాననేవాడు. తనను తాను 'డీ క్లాసిఫై' చేసుకుంటూ కమ్యూనిస్టులకే ఆదర్శంగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ చలసాని.

ఐదవ ఏటనే ఊళ్ళో ఎన్నికల ప్రచారంలో ఎర్రజెండా పట్టుకొని ఊరేగింది మొదలు కడదాకా జెండా కర్రవదలని ధీరుడు. రంగు మార్చకుండా దిక్కు మార్చిన రేనగేడ్ దృక్పథాన్ని శషభిషలు లేకుండా చీల్చి చెండాడినవాడు. "వర్గ సామరస్యం, శాంతియుత సహజీవనం, శాంతియుత పరివర్తన" సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చిన రష్యా కమ్యూనిస్టు పార్టీ, "కృశ్చేవ్" రివిజనిస్టు ముసుగును "గ్రేట్ డిబేట్" ద్వారా బ్రద్దలు కొట్టిన చైనా కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకుడు కామ్రేడ్ 'మావో' అంటే ఎనలేని గౌరవం.

భారతదేశ విముక్తికి మార్గం కామ్రేడ్ "చారు మజుందార్" దారే సరైన దారని ప్రగాఢంగా నమ్మినవాడు. నక్సల్‌బరీ వసంత మేఘ ఘర్జన, శ్రీకాకుళ కొండల ఎరుపు - పోరుబాట మెరుపులన్నాడు. శ్రీకాకుళ సవరులు, జాతావులు, గిరిపుత్రులు తమ విముక్తి కోసం చిందిస్తున్న నెత్తురు కళ్లకు కనబళ్ళేదా, "రచయితలారా మీరెటువైపు" అంటూ 1970 శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సభలో విశాఖ విద్యార్థులు "రచయితలకో సవాల్" అంటూ వేసిన కరపత్రంలో చలసాని దాగున్నాడు. విరసం ఆవిర్భావానికి అంకురార్పణ జరిగింది అక్కడే! అప్పటి నుండి 1970 జులై 4వ తేది విరసం ఆవిర్భావం వరకు చలసాని కృషి అద్వితీయమైనది.

1955 నాటికే తన జవసత్వాలను కోల్పోయి 1970 నాటికి కొడిగట్టిపోయిన అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యులుగా ఉన్న కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, కె.వి. రమణారెడ్డి, శ్రీశ్రీ లాంటి ఉద్దండులను, చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ లాంటి దిగంబర కవులను, వరవరరావులాంటి తిరగబడు కవులను ఏక తాటిపైకి తెచ్చి విప్లవ రచయితల సంఘాన్ని స్థాపించడంలో విప్లవోద్యమం పట్ల ఆయనకు దీక్షా దక్షతలు అర్థమౌతాయి.

శ్రీశ్రీని విరసానిని తొలి అధ్యక్షుడిగా ఎన్నుకొన్నప్పుడు అభ్యుదయ రచయిత సంఘంలోని కొందరు విరసం శ్రీశ్రీని హైజాక్ చేసిందని గుబుల చెందితే దానిని జవాబుగా శ్రీశ్రీ "నన్నెవరూ హైజాక్ చేయలేదు. ఒక విప్లవ కెరటం నన్నెత్తుకు పోయింది" అంటారు. బహుశా ఆ విప్లవ కెరటం చలసాని కాబోలు.

శ్రీశ్రీకి ప్రియమైనవాడూ, రావిశాస్త్రికి ఆత్మీయుడు, వారిద్దరిపై మాట పడనివ్వని వాడు, అవసరమైతే ఎదురు దాడికి సిద్ధమయ్యే చలసాని ప్రసాద్, ఈ ముగ్గురూ విశాఖకు చెందిన వారే కావడం యాదృచ్ఛికమో, కాకతాళీయమో, ఏమో! కానీ విశాఖపట్నంలో భూకంపం వచ్చినప్పుడు శ్రీశ్రీ ఫొటో భద్రంగా పట్టుకొని వీధిలో పరిగెత్తాడట. ఇంత వ్యక్తి ఆరాధన కమ్యూనిస్టులకుండడం సరికాదేమో!

నేను విశాఖపట్నంలో జరిగిన విరసం సభలకు వెళ్ళాను. కానీ చలసాని ఇల్లు చూడలేకపోయానని ఇప్పుడు బాధగా ఉంది, ఎందుకంటే చలసాని గ్రంథాలయం అతిపెద్ద వ్యక్తిగత గ్రంథాలయాల్లో ఒకటనీ, ఆయన ఇల్లంతా పుస్తకాలేననీ, దాదాపు ముప్పై వేల పుస్తకాల దాకా ఉన్నాయని మిత్రులు చెప్తూనే ఉండేవారు.

చలసాని ఇంటికి తాళాలు వెయ్యడని, గడి మాత్రమే వేసి బైటికెళ్తాడని మిత్రులంటే ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. ఎందుకు వేయడంటే "ఆ! ఏమున్నాయ్ అందులో ఒక మంచం రెండు దుప్పట్లు, నాలుగు తపేలాలు, పుస్తకాలే కదా! అంతగయితే పుస్తకాలు దొంగిలించుకొని పోతే, చదువుకోనీండి..మంచిదే కదా అంటాడట" చలసాని. మనుషుల మీద ఎంత అపార నమ్మకం ఆయనకు. వింటుంటే ఇలాంటి జీవితం జీవించిన వ్యక్తి మనతో కలసి తిరిగాడా! నడయాడాడా! కలసి పనిచేసామా? అని ఆశ్చర్యం, సంభ్రమం కలగడమే కాదు. ఒక నూతన ఉత్తేజం, ఉద్దీపన కలగక మానవు.

విప్లవోద్యమం శ్రీకాకుళం నుండి ఉత్తర తెలంగాణ దండకారణ్యం వైపు విస్తరించిన క్రమంలో నేటి జనతన సర్కార్ల దాకా ఎన్ని ఆటంకాలు, ఆటుపోట్లు ఎదురైనా సాహిత్య, సాంస్కృతిక, భావజాల రంగంలో స్పచ్ఛమైన ఆరాటంతో అటువైపే ప్రయాణించాడు. ఆయన కూతురు "నవత" నేడు దండకారణ్య విప్లవ పోరాటంలో భాగం కావడంతో తరతరాలుగా ఆయన కుటుంబం కమ్యూనిస్టు వారసత్వాన్ని నిలుపుకున్నట్లయింది. సోషలిస్టు సమాజంలో మనం కోరుకునే మానవ జీవితాన్ని, స్నేహ మాధుర్యాలను ప్రేమ, దయ, క్షమా గుణగణాల్ని, వ్యక్తిగత ఆస్తిని రద్దు చేసుకొనే నూతన మానవుణ్ని మన కళ్ళముందే చూశాం. చలసాని ప్రసాద్ గారు ప్రజల్లో సదా జీవించి ఉంటారు. వారికివే నా విప్లవ జోహార్లు.

అమరుడు కా. చలసాని ప్రసాద్‌తో నా జ్ఞాపకాలు

_అరుణోదయ రామారావు_

"ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే
శ్రీ కాకుళం వైపు చేయెత్తి చూపాలి" అనే పాట విన్నా
"ఎత్తినాం విరసం జెండా,
అలలు-అలలుగా వరదలెత్తు పోరులెత్తు పోరుజెండా "పాట విన్నా గుర్తొచ్చే గొంతు మూగబోయింది. ఆ గొంతే కా. చలసాని ప్రసాద్. జూలై 25 ఉదయం విశాఖలో శాశ్వతంగా మూగబోయింది.

1974 జనవరి 13, 14, 15 తేదీలు. విప్లవ రచయితల సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలు. విరసం సభ్యుడు, 'నాంది' నాటక రచయిత, కా. గంగిరెడ్డి రాసిన "ఎర్ర జండా కింద ఏకమై కార్మికులే, ధీరులై ముమ్ముందు వరుస నిల్వ" అనే పద్యం పాడాను. ముగిసిన వెంటనే గట్టిగా కౌగిలించుకొని "ఇదే రాయలసీమ గొంతు, విప్లవ సాహితీ, సాంస్కృతికోద్యమానికి లభించిన వజ్రం లాంటి మరో గొంతు" అని చేయెత్తి "వర్ధిల్లాలి ప్రజా సాహిత్యం, ప్రజా కళలు" అంటూ నినదించాడు. అది ఆయనతో నా మొదటి పరిచయం. అక్కడి నుండి తరచుగా కలుస్తూ ఈ మధ్య "చుండూరు దళితుల న్యాయ పోరాట సంఘీభావ కమిటీ" సదస్సు విశాఖలో జరిగితే అక్కడికొచ్చి కలవడమే ఆఖరిసారి. విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడుగాను, కార్యదర్శిగాను పని చేయడమే కాదు, స్వయంగా కవి, గాయకుడు, నాయకుడు కా. చలసాని ప్రసాద్. వయసు 83 ఏళ్లు.

కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రు జన్మ స్థానమైనా నాదెండ్ల వారిపాలెం గ్రామంలో స్థిరపడ్డారు. చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ పోరాటంలో స్వయంగా పాల్గొని అమరుడైన చలసాని శ్రీనివాసరావు పోరాట వారసత్వం కలిగిన కుటుంబం కా. చలసానిది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలికలో మార్క్సిస్టు పార్టీ వైపు, ఆ తర్వాత నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాట రాజకీయాలవైపు నిలబడి సాహితీ, సాంస్కృతిక రంగాల్లో తనదైన కృషి చేస్తూ వచ్చారు. జీవనం కోసం అనేక ఉద్యోగాలు చేసినా చివరగా విశాఖ నగరం ఎ.వి.ఎన్. కాలేజీలో లెక్చరర్‌గా స్థిరపడ్డాడు కా. చలసాని. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రేరణతో తానే కాకుండా తన కుటుంబాన్ని చైతన్యం చేసి అందులో నిబద్ధతతో నిమగ్నమయ్యేట్లు చేశాడు కా. చలసాని. ఆయన ఇద్దరు కూతుళ్ళలో ఒకరు విప్లవోద్యమ నిర్మాణానికి అంకితమయ్యారు. విశాఖ నగరంలో పుట్టి పెరిగిన మహాకవి శ్రీశ్రీతో కా. చలసానికి ఉన్న అనుబంధం అద్వితీయమైనది. అందుకే మహాకవి శ్రీశ్రీ సాహిత్యాన్ని 20 సంపుటాలుగా తెలుగు సాహితీలోకానికి అందించిన ఘనత కా. చలసానిదే.

విశాఖ నగరంలో మహాకవి శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా "రచయితలారా! కళాకారులారా! మీరెటువైపు" "ప్రభుత్వం వైపా, ప్రజలవైపా?" అని ప్రశ్నించిన యువకుల్లో కా. చలసాని ఒకరు. ఒకవైపు శ్రీకాకుళ పోరాటం జరుగుతుంటే, ఆ పోరాటాన్ని గానం చేస్తూ కా. పాణిగ్రాహి ప్రజల దగ్గరకు వెళుతుంటే మీరిక్కడ సన్మానాలు చేసుకోవడం సబబేనా? అంటూ నిలదీసి, ఆ క్రమంలో 1970 జూలై 4న శ్రీశ్రీ అధ్యక్షతన 'విప్లవ రచయితల సంఘం' ఆవిర్భావానికి అంకురార్పణ చేసిన వాళ్లలో ముఖ్యుడు కా. చలసాని ప్రసాద్.

కా. చలసాని రచయితలను, కళాకారులను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే వాడు, ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలిస్తూ రచయితలను, పాటగాళ్ళను తయారు చేస్తూ రావడం అనే విద్యలో ఆరితేరిన వాడాయన. అలాగే సంస్థలోగానీ, వ్యక్తుల్లో గానీ తప్పులు జరిగితే (వ్యక్తులు ఏ స్థాయి గల వారైనసరే, శ్రీశ్రీ అయినా సరే) సకాలంలో ఎత్తి చూపి సరిదిద్దటానికి ఆయన అనుసరించే పద్ధతి అద్భుతమైనది. పరిచయం చేసుకోవడంలో, దాన్ని అభివృద్ధి చేసి కొనసాగించడంలో (రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నా సరే) కా. చలసాని అనుసరించే పద్ధతి చాలా అమోఘమైనది. స్వభావరీత్యా కూడా పిల్లవాడి మనస్తత్వం. ఎక్కడ ఏ పోరాటం జరిగినా అక్కడ వాలి తన మద్దతును ప్రకటించి ఆ పోరాటంలో భాగమయ్యేవాడు. విశాఖనగరంలో మురికివాడల, గుడిసెవాసుల పోరాటంలో తాను భాగమై మన మహిళా కార్యకర్తలను అభినందిస్తూ ప్రోత్సహించడమే కాదు, ఆ పోరాటాలపై ఏ రకమైన నిర్బంధం వచ్చినా ముందుండి ఖండించి, ఎండగట్టేవాడు.

నన్ను ఇంటికి తీసుకెళ్ళి తన లైబ్రరీ చూపించాడు. అది చూసి విస్తు పోయాను. కొన్ని వేల పుస్తకాలు, ఫలానా అంశమనీ కాదు, ఏ సమస్యకైనా అక్కడ అధ్యయనం చేస్తే పరిష్కారం దొరుకుతుంది అనే అభిప్రాయం సర్వత్రా ఏర్పడింది. తన రాజకీయ అభిప్రాయాలను ఇతరులపై రుద్దే ప్రయత్నంగాని, ఇతరుల్లో ఉన్న మంచి, చెడుల చర్చకానీ చర్చకు రాకుండా జాగ్రత్త పడేవాడు.

కా. చలసాని ఓ సాహితీ శిఖరం, సాంస్కృతికోద్యమ స్నేహశీలి. ఆయన మరణం విప్లవ సాహిత్యోద్యమానికే కాదు, సకల ప్రజా, ప్రజాస్వామికోద్యమాలకు తీరని లోటు. కా. చలసానికివే విప్లవ జోహార్లు.

శ్రీశ్రీ శతజయంతి సభానంతరం ప్రదర్శనను నిర్వహిస్తూ. (విశాఖపట్నం, 2010)

శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా విశాఖపట్నంలోని టర్నర్స్ చౌల్ట్రీ దగ్గర మహా ప్రస్థాన గేయాన్ని ఆలపిస్తూ



హైదరాబాద్ సెక్రటేరియట్ దగ్గర జూలై *17, 1985*న నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన సభని గుర్తు చేసుకుంటూ *2014*లో

చలసాని ప్రసాద్ అంతిమ యాత్ర సందర్భంలో

అలల వెంట, కలల వెంట సాగిపోయిన చలనశీలీ.. వెళ్లిరా నేస్తం

జూలై 25 ఉదయం 11 గంటల ప్రాంతంలో గుండెపోటుతో చివరి శ్వాస విడిచేంత వరకు విప్లవమే ఊపిరై జీవించిన చలసాని ప్రసాద్ అంతిమ యాత్ర జూలై 26న జరిగింది. విరసం, వివిధ ప్రజాసంఘాలు, చలసాని అశేష స్నేహ ప్రపంచం, సాహిత్య మిత్రులు, విప్లవాభిమానులు వెంటరాగా 15 ఎల్ఐజి, హెచ్‌బి కాలనీ నుండి ఆంధ్ర మెడికల్ కాలేజీ వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంట దాకా నినాదాలు, విప్లవ గీతాలాపనలతో, కళాకారుల ప్రదర్శనలతో సాగింది. జీవితమంతా విప్లవోత్తేజంతో సాగిన చలసాని అంతిమయాత్ర కూడా కన్నీటితో, కర్తవ్య ప్రతిజ్ఞలతో సాగింది. ఒక రచయితకు సమాజం పలికిన ఘనమైన వీడ్కోలు అది. ఆయన హృదయ స్పందనల్లో, అక్షరాల్లో, ఆలోచనల్లో, సమస్త రక్త చలన తరంగాల్లో దశాబ్దాలుగా విప్లవం ప్రతిధ్వనిస్తూ వచ్చినందు వల్లే సమాజం ఇలా వీడ్కోలు పలికింది. అది రేపటి లోకపు దారులపై కాంతి రేఖలు పరిచే సామాజిక, సామూహిక వ్యక్తీకరణ. ఒక సాహిత్యమూర్తి తుది ప్రయాణంలో ప్రజా ఆకాంక్షలు రగులుకున్న క్షణాలివి. సాహిత్య, విప్లవ రాజకీయ ప్రపంచాల్లో చలసాని గడిపిన సార్థక జీవితం ఇనుమడించిన తుది యాత్ర ఇది. మారు మూల దళిత పల్లెలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడేలు, రాష్ట్రాలు దాటి దేశమంతా కలియదిరిగి ప్రజల గుండెలపై చెవి పెట్టి వాళ్ల ఆరాటాలను, పోరాటాలను విని, వ్యాఖ్యానించి, ప్రచారం చేసిన నిరంతర పథికుడి చివరి ప్రయాణమది.

ఆయన చివరి కోరిక మేరకు ఆయన దేహాన్ని కుటుంబ సభ్యులు, విరసం సభ్యులు కలిసి వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఏఎంసి అనాటమీ విభాగానికి అందజేశారు. 25వ తేదీ మధ్యాహ్నమే ఆయన కళ్లను ఐ బ్యాంకుకు ఇచ్చారు.

అంతిమయాత్రకు ముందు చలసాని ఇంటి వద్ద జరిగిన సంస్మరణ సభలో పులువురు రచయితలు, కళాకారులు, వివిధ ప్రజాసంఘాల, వామపక్ష పార్టీల వాళ్లు ఆయనతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. కామ్రేడ్ వరవరరావు మాట్లాడుతూ కేవలం సాహిత్య సాంస్కృతిక రంగాల్లో మాత్రమే కాదు, మానవ జీవిత సకల రంగాల్లో ఒక ఆదర్శం, ఒక ఒరవడి ఎట్లా ఉండాలో పెట్టి పోయినవాడు చలసాని ప్రసాద్ అనీ, తెలంగాణ సాయుధ పోరాటం నుంచి దండకారణ్య ఉద్యమం వరకు చలసాని తన రక్తమాంసాలర్పించాడని అన్నాడు. ఆయన కలగన్న సమతా లోకాన్ని ఎన్ని త్యాగాలు చేసైనా విప్లవకారులు, ప్రజలు సాధించి తీరుతారని చెప్తూ ఆయనకు జోహార్లర్పించారు. కామ్రేడ్ కృష్ణాబాయి మాట్లాడుతూ అందరితో అరమరికలు లేని స్నేహాన్ని కొనసాగించిన ప్రసాద్‌కు అందరూ తన కుటుంబ సభ్యులేనని, అయితే విరసం, అరుణతార ఆయనకు ప్రాణప్రదమని, ఆయన రాసిన చివరి ఉత్తరంలోనూ అరుణతారను కాపాడుకోవాలని రాశాడని అన్నారు. విప్లవాన్ని తనలోకి ఆవాహన చేసుకున్నాడు గనకనే చలసాని అందర్ని అంతగా ప్రేమించాడని కామ్రేడ్ రాఘవాచారి అన్నారు. ఆయన ఇంటిని, గ్రంథాయాన్ని ఆయన తదనంతరం విరసం నిర్వహించాలని కోరుకున్నాడని, స్వంత ఆస్తి పట్ల ఆయన వైఖరి అట్లా ఉండేదని అమరుల బంధుమిత్రుల సంఘం కార్యదర్శి కామ్రేడ్ పద్మకుమారి అన్నారు. ఉత్తరాంధ్రలో అమరులైన విప్లకారుల శవాలను బంధువులకు అప్పగించడానికి ఆయన ఎంత దూరమైనా ఎంత కష్టభరితమైన ప్రయాణమైనా 83ఏళ్ల వయసులోనూ తమ వెంట వచ్చారని, అమరుల బంధుమిత్రుల సంఘం ఉత్తరాంధ్రలో కొండంత అండను కోల్పోయిందని అన్నారు. మహిళా చేతన తరపున పద్మ మాట్లాడుతూ విశాఖలో చలసాని లేని ప్రజాఉద్యమం లేదని, ఆయన మహిళా పక్షపాతి అని అన్నారు. ప్రొ.కాత్యాయని విద్మహే చలసానితో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ఆత్మీయతను, ప్రజాస్వామిక విలువల్ని పంచి ఇచ్చారని వాటిని ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ చలసాని, హరి లాంటివాళ్లు తెలుగు సమాజాల సుదీర్ఘ చరిత్రను తనతోపాటు మోసుకొని ప్రయాణించారని అన్నారు. సాహిత్య విద్యార్థిగా తనకు చలసాని ఎప్పటి నుంచి తెలుసో సరిగ్గా చెప్పలేనంత అనుబంధముందని గుర్తు చేసుకున్నారు.

చలసాని ప్రసాద్ తమకు కార్మికోద్యమ నిర్మాణం గురించి, పనివిధానం గురించి ఎంతో అవగాహన కల్పించారని ప్రగతిశీల కార్మిక సమాఖ్య కొండారెడ్డి చెప్పారు. భవిష్యత్తులో ఎటువంటి మానవ సమాజాన్ని కోరుకుంటున్నామో ఆ సమాజ మానవుని నమూనా చలసాని ప్రసాద్ అని ప్రైవేటీకరణ వ్యతిరేక వేదిక బాధ్యులు రమణ అన్నారు. ప్రజాకళల మీద ఆయన ప్రేమ అపారమని చాలా శ్రద్ధగా జముకు వాయించడం కూడా నేర్చుకున్నారని ఆయన చెప్పారు. గంగవరం ఉద్యమానికి ఆయన సహకారాన్ని సిపిఐ సత్యనారాయణ గుర్తుచేసుకున్నారు. అందర్నీ కలుపుకుపోయే వ్యక్తి చలసాని ప్రసాద్ అనీ, అయితే ఆయన అభిప్రాయాలు స్పష్టంగా తెలిపేవారని అన్నారు. చలసాని ప్రసాద్ వేరువేరు మనుషుల మధ్య గొప్ప వారధి అని మనుషుల మధ్య కులం, ప్రాంతం, వయసు భేదాన్నీ అధిగమించి అందరి ప్రేమను పొందారని వీక్షణం వేణుగోపాల్ అన్నారు. విప్లవ పూవై పూసిన పూసిన చలసాని, ఎర్రని జెండై నింగికెగసినాడని సుదర్శన్ పాట పాడారు.

ఇట్లా ఎంతో మంది ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు బాబాయ్‌ని కోల్పోయామని, తండ్రిని కోల్పోయామని, గొప్ప స్నేహితుడ్ని, ఆదర్శ విప్లవకారుడ్ని కోల్పోయామని అంటూ జ్ఞాపకాల తడిలో భావోద్వేగంతో చలసానితో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గంటి రమణ, ఆంజనేయులు (పౌరహక్కుల సంఘం), రాజేశ్వరి (చైతన్య మహిళా సంఘం), గంగాధర్ (అధ్యాపక జ్వాల), మధు (డిటిఎఫ్), మిస్క కృష్ణయ్య (కుల నిర్మూలనా పోరాట సమితి), పివి రమణ (ప్రైవేటీకరణ వ్యతిరేక కమిటీ), సిహెచ్ నర్సింగరావు (సిపియం), లక్ష్మి (పివొడబ్ల్యూ), సింహాద్రప్పడు (ఎపిటిఎఫ్), చాగంటి రాజారావు (సిపిఐ (ఎం.ఎల్) (న్యూడెమాక్రసీ), డా.అంజయ్య (సోషల్ సైన్సెస్ ట్రస్టు), వై.నూకరాజు (భారత నాస్తిక సమాజం), చలసాని గాంధీ (రైల్వే శ్రామిక యూనియన్), చందు సుబ్బారావు (అరసం), అజయ్ కుమార్ (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారు సంఘం), తాండ్ర ప్రకాశ్ (సిపిఐ (ఎం.ఎల్) (న్యూడెమోక్రసీ), చలం (కోస్టల్ కారిడార్ వ్యతిరేక పోరాట కమిటీ), సీతామహాలక్ష్మి (శరీర దాతల సంఘం), మామిడి క్రాంతి (న్యాయవాది), మద్దెల రామారావు (లిబరేషన్ పార్టీ), డా.కృష్ణమూర్తి, ప్రొ.కె.వెంకటేశ్వర్లు, కొల్లా రాజమోహన్, చౌదరి తేజేశ్వరరావు, వంగపండు ప్రసాద్ తదితరులు సంస్మరణ సభలో పాల్గొని చలసాని ప్రసాద్‌ను స్మరించుకుంటూ ఆయనకు జోహార్లర్పించారు.

అనివార్య కారణాలవల్ల రాలేకపోయిన కాకరాల, వకుళాభారణం రామకృష్ణ, తుమ్మల రామకృష్ణ, మనోరంజన్ మహంతి, సరోజా శ్రీశ్రీ, ఓపిడియార్ భాస్కర్ రావు, అరసం పెనుగొండ లక్ష్మీనారాయణ, తమ సంతాప సందేశాలను పంపించారు.

సాగర తీరాన మేధో సముద్రం వంటి చలసాని సంస్మరణ సభ, విశాఖపట్నం

విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో చలసాని ప్రసాద్ సంస్మరణ సభ ఆగస్టు 9వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ అసెంబ్లీ హాలులో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 7 గంటల దాకా జరిగింది. ఉదయం సెషన్ లో కామ్రేడ్ చలసాని ప్రసాద్ సాహిత్య కృషి - సాంస్కృతిక వ్యక్తిత్వం అనే అంశంపై కా.చెంచయ్య, కె.వి.యస్.వర్మ ప్రసంగించగా విరసం కార్యదర్శి కా.వరలక్ష్మి అధ్యక్షత వహించారు. కా.చలసాని ప్రసాద్ మూడు తరాల విరసం సభ్యులకు ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అని, ఆయన సంస్మరణ ద్వారా ఆయన వ్యక్తిత్వాన్ని, ఆచరణను చరిత్రలో నమోదు చేయడం, ఆయనను మన ఆలోచనల్లో, ఆచరణలో సజీవంగా నిలపడమే అమరత్వ స్ఫూర్తి అని వరలక్ష్మి అన్నారు. ఈ పనిలో భాగంగానే విరసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలసాని సంస్మరణ సభలు నిర్వహిస్తున్నదని, మిత్రుల నుండి రచనలు సేకరించి అరుణతార ఆగస్టు సంచికను చలసాని ప్రసాద్ సంస్మరణ సంచికగా తీసుకురాబోతున్నామని చెప్పారు.

చలసాని ప్రసాద్ సాహిత్య కృషి- సాంస్కృతిక వ్యక్తిత్వం గురించి వర్మ మాట్లాడుతూ ప్రజల తరపున ఉన్న రచయితలకు, సాహిత్యం పట్ల, ప్రజా సంస్కృతి పట్ల ఎలాంటి దృక్పథం ఉండాలో చలసాని ప్రసాద్ తన వ్యాసాల్లో స్పష్టంగా చెప్పారని అన్నారు. ఒక రచయితకు ప్రజా జీవితంతో సంబంధం ఎన్ని స్థాయిల్లో ఉండాలో, ఒక సజీవ పాత్ర చిత్రణకు, మన జీవితానికి ఎంత సామీప్యత ఉందో చాలా సోదాహరణగా ఆయన చెప్పాడని అన్నారు. తన ముందు తరాలు సృష్టించిన సాహిత్యం పట్ల ఉండాల్సిన దృష్టికోణం గురించి 1970ల్లోనే రాశారని అన్నారు. కా.చెంచయ్య మాట్లాడుతూ చలసాని ప్రసాద్ ఏ మాట మాట్లాడినా అది చాలా సరళంగా, ప్రభావశీలంగా లోతైన అర్థాన్ని ఇముడ్చుకున్నట్లుగా ఉంటుందని అన్నారు. సకల సంపదలు సమస్త జన సమూహాలకు చెందాలి అన్నట్లుగానే, భాష, సాహిత్యం, కళలు అందరికీ చెందాలని చలసాని రాశాడని ఆయన చెప్పారు. అనంతరం విశాఖ సెంట్రల్ జైలు నుండి రాజకీయ ఖైదీలు పంపిన నివాళి ప్రకటనను వరలక్ష్మి చదివి వినిపించారు. వివిధ సాహిత్య సంస్థల బాధ్యులు, రచయితలు చలసాని ప్రసాద్ తో వారి అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మాట్లాడారు. ఉప్పల అప్పలరాజు (అరసం), మల్లీశ్వరి (ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక), ఎన్ వేణుగోపాల్ (వీక్షణం), అడపా రామకృష్ణ (విశాఖ రచయితల సంఘం), దివాకర్ (సాహితీ స్రవంతి), శేఖరమంత్రి ప్రభాకరరావు (సహృదయ సాహితి), రామినాయిడు (వెలుగు సాహితీ సంస్థ), రామతీర్థ (మొజాయిక్ సాహిత్య సంస్థ), చింతా అప్పల్నాయుడు (స్నేహ కళా సమితి), వాసిరెడ్డి నవీన్ (కథా సాహితి), రాజేష్ కుమార్ (యువసాహితి), ఏవియన్ కాలేజీ సిబ్బంది ఉదయం సెషన్ లో మాట్లాడిన వారిలో ఉన్నారు. ఆదివాసీ

రచయితల వేదిక నుండి రామారావు దొర తమ సందేశాన్ని ఉత్తరం ద్వారా పంపించారు. చిన్నారి సాహితీ మిత్రుడు సూరజ్ శ్రీశ్రీ మహాప్రస్థానం నుండి జ్వాలాతోరణం కవిత వినిపించాడు.

మధ్యాహ్నం సమావేశానికి కా.సి.యస్.ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కా.కళ్యాణరావు, కా.సజ్జా చలసానితో తమ స్నేహాన్ని, ఆయనతో పంచుకున్న పనుల్ని, చేసిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. వీరుల వారసుడా, విరసం స్థాపకుడా, విప్లవ తాత్వికుడా, కవితా గాయకుడా.. అంటూ ప్రజా కళామండలి కోటి చలసాని ప్రసాద్ పై పాట పాడి ఆయనతో తన అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. చలసాని కుటుంబ సభ్యులు, స్నేహితులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, వామపక్ష పార్టీల నాయకులు చలసానికి జోహార్లర్పిస్తూ తమ సందేశాన్ని వినిపించారు. బాలకృష్ణ, గంటి రమణ, జెర్ర అప్పారావు, రాము, అరుణోదయ బృందం, శ్రీరామమూర్తి (పౌరహక్కుల సంఘం), అనూరాధ (మానవ హక్కుల వేదిక), కాకరాల (అమరుల బంధుమిత్రుల సంఘం), భాస్కరరావు (ఓ.పి.డి.ఆర్), సి.ఆర్.పి.పి (నార్ల సుధాకర శర్మ), రామకృష్ణ (పి.డి.యం), మిస్కా కృష్ణయ్య (కులనిర్మూలనా పోరాట సమితి), కొండారెడ్డి (ప్రగతిశీల కార్మిక సమాఖ్య), పద్మ (మహిళా చేతన), చెండ ఏలియ (దండకారణ్య విమోచన సమితి), చల్లపల్లి శ్రీనివాసరావు (సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమాక్రసీ), ఝాన్సీ (సిపిఐ ఎం.ఎల్), తాన్యా (సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమాక్రసీ), జీవి సత్యనారాయణ మూర్తి (సిపిఐ), బి. నర్సింగరావు (సిపిఎం) తదితరులు రెండో సెషన్ లో మాట్లాడిన వారిలో ఉన్నారు.

చివరిగా చలసాని ప్రసాద్ రాజకీయ జీవితం, ఉద్యమ ఆచరణ పై కా.వరవరరావు మాట్లాడారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ రీజనల్ బ్యూరో చలసాని ప్రసాద్ కు జోహార్లు చెబుతూ పంపిన ప్రకటనను ముందుగా ఆయన చదివి వినిపించారు. మనిషిగా పుట్టి, జ్ఞానమూ, చైతన్యమూ కలిగే క్రమంలో కమ్యూనిస్టులవుతారని, అట్లా ఉన్నతమైన మానవులుగా రూపొందుతారని, కానీ కామ్రేడ్ చలసాని ప్రసాద్ ఏకకాలంలో మనిషిగానూ, కమ్యూనిస్టుగానూ పుట్టాడని అంటూ విప్లవ ఊయలలో పుట్టిన చలసాని ప్రసాద్ సుదీర్ఘ ఉద్యమ జీవితాన్ని కా.వివి పరిచయం చేశారు. విరసం ఏర్పాటుకు దోహదం చేసిన చారిత్రక పరిణామాల్లో చలసాని క్రియాశీల పాత్ర గురించి చెప్పారు. ఉద్వేగభరితమైన విప్లవ జీవితం పరిపూర్ణంగా జీవించిన చలసాని ఆస్తి లేని, అహంకారం లేని కమ్యూనిస్టు కార్యకర్తగా, గొప్ప ఉదాహరణగా, ఒక నమూనాకు ఇచ్చి వెళ్లాడని అన్నారు.

కడదాక వర్గపోరాటం వైపే చలసాని ప్రసాద్ వరంగల్‌లో చలసాని సంస్మరణ సభ

విప్లవ మానవుడు చలసాని ప్రసాద్ సంస్మరణ సభ ఆగస్టు 16న వరంగల్, హన్మకొండ, వాగ్దేవి కాలేజి సెమినార్ హాలులో

విరసం ఆధ్వర్యంలో చలసాని ప్రసాద్ సంస్మరణ సభల నివేదికలు

16వ తేది ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగింది.

సభలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ చలసాని 1979 నుంచి తనతో, తన తండ్రి రామకోటి శాస్త్రిగారితో నిత్య సంభాషణలో ఉన్నవాడని, ఆయన రచనలు, కార్యాచరణ విరసం భావజాలం పరివ్యాప్తం కోసమే తపించారని అన్నారు. ఆయన తన రచనలకంటే ఇతరులను చదివించడం, పరిశోధనలకు సహకరించడంలో ఎక్కువగా శ్రమించాడని అన్నారు. విరసమేతర సాహిత్యం కూడా చదవాలి, విశ్లేషించాలని చలసాని అనే వారని, శ్రీశ్రీని, రామకోటి శాస్త్రిగారిని చలసాని లోవల్పుంచి విమర్శించారని, విమర్శించడానికి, ఆత్మ విమర్శకు చలసాని ఎప్పుడూ సిద్ధంగా ఉండే వారని ఆమె అన్నారు. సామాజికత, రాజకీయ దృక్పథం లేని వ్యాసం ఊకదంపుడేనని చలసాని అనే వారని గుర్తు చేశారు. విరసం కవిత్వానికి దిగంబర, తిరుగుబాటు కవులే స్ఫూర్తి అని అనే వారని కాత్యాయని అన్నారు.

కామ్రేడ్ పాణి మాట్లాడుతూ చలసాని వర్గపోరాట సంరంభంలో పుట్టిన వాడని, చలసాని కొందరు అనుకుంటున్నట్లు మామూలు మానవతావాది కాదని, సాయుధ పోరాటం ద్వారానే సమాజం మారుతుందని విశ్వసించి అటువంటి విలువలున్న మనుషుల కోసం పరితపించారని అన్నారు. ఆయనలో వర్గ స్పృహను వీడని ప్రేమలుండేవని అన్నారు. చలసాని రచయితలను నిర్మాణంలో భాగంగా చూసారని, 1980లలో ఆట, పాట, మాట బందైనా కాలంలో, 2000 తర్వాత మరో దశ నిర్బంధంలో కూడా సంస్థను ఆదుకున్నారని అన్నారు. ఉద్యమాల ద్వారా, నిర్మాణాల ద్వారా సోషలిజం అనే విలువ పెరుగుతుందని ఆయన విశ్వసించాడని అన్నారు. ప్రసాద్ జీవితకాలమంతా కమ్యూనిస్టు విప్లవ రాజకీయాల నిబద్ధతతో బతికినందుకు ఆదర్శప్రాయమయ్యాడని అన్నారు.

కామ్రేడ్ వరవరరావు మాట్లాడుతూ కడదాక వర్గపోరాటం వైపు నిలబడ్డ కమిస్సార్ చలసాని ప్రసాద్ అని అన్నారు. ఒక కంట్లో కన్నీరు ఉన్నవాడే మరో కంట్లో కత్తులు మొలిపిస్తాడని, వర్గపోరాట రాజకీయాలు అర్థం కాకుండా మనిషి అర్థం కాడని ఆయన అన్నారు.

చలసాని, శ్రీశ్రీలు గొప్ప యుద్ధ కాలంలో ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాల ఊయల్లో పుట్టారని, ఫాసిస్టుకు వ్యతిరేకంగా స్టాలిన్ ఆ కాలంలో అట్లా పోరాడి ఉండకపోతే మనం ఈ రోజు ఇట్లా బతికే వాళ్లం కాదని అన్నారు. మనం ఇట్లా బతకడానికి కారణమైన స్టాలిన్‌ను విమర్శించడం చలసానికి ఇష్టం ఉండేది కాదని వివి అన్నారు. శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో కె.ఎస్. తన కొడుకును పోగొట్టుకున్నాడని, తన కొడుకు కోసం స్టాలిన్ మిలిట్రీ జనరల్‌ను వదిలిపెట్ట దలుచుకోలేదని అన్నారు.

స్పెయిన్ అంతర్యుద్ధంలోకి సాయుధంగా వెళ్ళని తాత్వికుడు, కవి, రచయిత ఆ రోజుల్లో లేరని అన్నారు. చలసానికి ఆ తరం రచయితలు ఆదర్శమని అన్నారు. అయితే తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం తమ కార్యకర్తలను వ్యాపారాలు చేసుకొమ్మని చెప్పిందని, అటువంటి కాలంలో వరంగల్‌కు కానూరి వెంకటేశ్వరరావు, కె.ఎస్. వచ్చారని అన్నారు. అది గ్రేట్ డిబేట్ జరుగుతున్న కాలమని ఆ కాలంలో చలసాని ప్రసాద్ కూడా వరంగల్‌లో ఉండడం సంభవించిందని అన్నారు. తిరిగి వర్గపోరాటం గురించి వాళ్లంతా చర్చిస్తుండేవారని, 1964లో వచ్చిన రాత్రి కవితా సంకలనం 'కర్టెన్ రైజర్' అని చలసాని అనేవారని గుర్తు చేశారు. ఆ తర్వాత నక్సల్బరీ పోరాటంతో స్పష్టత వచ్చిందని అన్నారు.

చలసానిలాగా వాళ్ల తండ్రి బసవయ్య గారు కూడా చాలా ఖచ్చితమైన మనిషని, ట్రిగ్గర్ మీద వేళ్లతో రా!' అన్న కవి లోచన్‌ను ఇష్టపడేవాడని ఆయన అన్నారు.

పార్టీలైనుకు భిన్నంగా సత్యం, కైలాసం, కె.ఎస్. ప్రజా సంఘాలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని, ఆ తర్వాత పార్టీ దాన్ని సమర్థించిందని వివి అన్నారు. భారతదేశంలో, ప్రపంచంలోని ఎం.ఎల్. రాజకీయ తాత్వికత ఉన్న సాహితీ సంస్థ విరసం మాత్రమేనని, చలసాని విరసాన్ని నిర్మించడానికి 17 ఏళ్ల రివిజనిస్టు పార్టీల మీద పోరాటం, అనుభవం పని చేసిందని అన్నారు.

శ్రీశ్రీని విరసంలోకి తేవడానికి, ఎమర్జెన్సీ తర్వాత రాజకీయంగా కాపాడుకోడానికి చలసానిచారిత్రాత్మక ప్రయత్నం చేశారని అన్నారు. ఆ తర్వాత 'భారతదేశానికి అధ్యక్షుణ్ణి అవడం కన్న విరసం సభ్యుడవ్వడం గొప్ప గౌరవం' అని శ్రీశ్రీ ప్రకటించారని ఆయన అన్నారు.

చలసాని జీవిత కాలంలో మనుషుల్ని నిలబెట్టుకొనే కృషి ఎక్కువ చేశాడని అన్నారు. అందువల్లే విరసానికి సభ్యులు చేసినదానికంటే సభ్యులు కాని వారు చేసిందే ఎక్కువని చలసాని అంటుండేవారని వివి అన్నారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ రీజనల్ బ్యూరో ప్రతినిధి ప్రతాప్, కేంద్రకమిటీ ప్రతినిధి అభయ్ పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు.

చెలిమి, సాహితీ సంస్థ తరఫున మెట్టు రవీందర్ మాట్లాడుతూ చలసాని లోపలా, బయటా మార్క్సిస్టుగా జీవించాడని, 'అచ్చులో బతకటం కంటే అర్థవంతంగా బతకడానికి' ప్రాధాన్యత ఇచ్చారని హృదయంలో విరసం జెండా ప్రతిష్టించుకుని నిజమైన మార్క్సిస్టుగానే తుది వరకు నిబద్ధతను కొనసాగించాడని అన్నారు.

కాళోజీ ఫౌండేషన్ తరఫున వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ చలసాని కాళోజీ రచనలను వెలుగులోకి తేవడానికి కృషి చేశారని నివాళులర్పించారు.

ఘంటా రామిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి శ్రీకాకుళ పోరాటం దాకా చలసాని నడిచాడని, విరసానికి పెద్ద దిక్కుగా, బోధకుడిగా ఉండి ఎన్నో చారిత్రక విషయాలను సజీవంగా బోధించేవాడని, ఆయన లేని లోటు తీరనిదని అన్నారు.

వీరాచారి, అరసం తరఫున మాట్లాడుతూ చలసాని గురించి

రంగనాయకమ్మ అన్యాయంగా రాసిందని సమూహాలుగా ఉన్న రచయితలు, సంఘాలుగా పటిష్టమవడమే చలసానికి నివాళి అని అన్నారు.

గోదావరి సాహితీ మిత్రుల తరఫున వంగాల సంపత్‌రెడ్డి మాట్లాడుతూ, అనేకానేక విపత్కర పరిస్థితుల్లో సైతం ఆయన ప్రజా రాజకీయాల పట్ల నిలిచిన వ్యక్తి అని నివాళి అర్పించారు.

తెలంగాణ రచయితల వేదిక తరఫున పి. చంద్ మాట్లాడుతూ ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, కార్మికలోకం సంక్షుభితమౌతున్న సందర్భంలో చలసాని లేకపోవడం బాధాకరమని నివాళి అర్పించారు.

కోడెం కుమార్ జనగామ రచయితల సంఘం తరఫున మాట్లాడుతూ సందేహాలకు మృదువుగా సమాధానాలు చెప్పే చలసాని లేని లోటు తీరనిదని నివాళి అర్పించారు.

తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు బి. రామాదేవి మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక ఉద్యమాల్లో రాజకీయ తాత్వికతను చూపించారని, ఆయన పరీక్షలు లేని చదువు, తాళాల్లేని ఇల్లు, పోలీసులు లేని సమాజాన్ని కోరుకున్నారని చలసానికి నివాళి అర్పించారు.

కుల నిర్మూలన పోరాట సమితి తరఫున మంద సంజీవ మాట్లాడుతూ, చలసాని పీడిత ప్రజల రాజకీయ తాత్వికతతో నిర్మాణాత్మకంగా పని చేసారని నివాళి అర్పించారు.

చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జె. కళ మాట్లాడుతూ, చలసాని పలకరింపు ఆత్మీయతా మరచిపోలేనిదని, 'విరసం జెండా గీతం', 'ఈ విప్లవాగ్నులు...' పాటల్ని ఎంతో ఉద్వేగంతో పాడేవారని అన్నారు. .వరంగల్ రచయితల సంఘం అధ్యక్షులు నల్లెల్ల రాజయ్య తెలంగాణ నలుచెరుగుల నడయాడిన తెలంగాణ ఆత్మీయుడైన చలసానికి విప్లవాభినందనాలని నివాళి అర్పించారు.

పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ మానవ సంబంధాల్ని ఆర్థిక సంబంధాలుగా మారుతున్న కాలంలో విప్లవ సమాజం కోసం చలసాని కృషి చేశారని అన్నారు. .

మానవ హక్కుల వేదిక జిల్లా బాధ్యుడు బి. రాజు మాట్లాడుతూ చలసాని సాహిత్య సాంస్కృతిక కృషితో సమాజంలో మానవ సంస్కారాన్ని పెంపొందింపజేసే ప్రయత్నం చేసారని నివాళి అర్పించారు.

ప్రజా సంఘాల కార్యకర్త వీరమల్లయ్య మాట్లాడుతూ గంటి ప్రసాదం గారిలాగే చలసాని ప్రసాద్‌గారు కూడా ఉత్తముడని, నక్సల్బరీ ఉద్యమమే సరియైనదని ఆయనకు నివాళి అర్పించారు.

అంపశయ్య నవీన్ మాట్లాడుతూ చలసాని సాహిత్య సంస్కారవంతుడని, ఆయన విరసమేతర రచనల్ని కూడా చదవాలనడం మాత్రమేకాక, తన రచనలన్నింటిని తెప్పించుకునే వారని అన్నారు.

అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు పద్మకుమారి మాట్లాడుతూ చలసాని భౌతికంగా దూరమైన మానసికంగా ఎంతో దగ్గరగానే ఉన్నాడని, చలసాని తాను ఏజెన్సీ ప్రాంతాలెన్నింటినో కలిసి ప్రయాణం చేసామని, అమరుల బంధుమిత్రులకు ఉత్తరాంధ్రలో చలసాని మార్గదర్శకుడుగా ఉన్నారని ఆయనకు నివాళి అర్పించారు.

డిటిఎఫ్ నాయకులు గంగాధర్ మాట్లాడుతూ చలసాని ముగ్గురు వీరుల్ని త్యాగం చేసిన కుటుంబంలో పుట్టారని, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అగ్రకుల ఆధిపత్యం ఉండేదని చలసాని చెప్పేవారని, తాను పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘం పట్ల చలసాని 'కన్‌సర్న్'తో ఉండేవారని, ఆయన నిర్వహించిన మానవ సంబంధాల పట్ల తనకు ప్రశ్న ఉందని చెప్తూ, ఆయన లేకపోవడం తీరని లోటని నివాళి అర్పించారు.

రెండు సెషన్‌లుగా సాగిన సంస్మరణ సభలో బాసిత్, వీరబ్రహ్మాచారి అధ్యక్షులుగా వ్యవహరించారు. జోదా కోబల్, ఎన్. వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సభలో సుదర్శన్, భారతి, శ్రీనివాస్‌లు పాటలు పాడి చలసాని ప్రసాద్‌కు నివాళి అర్పించారు. సిఆర్‌పిపి నాయకులు ఎం. రామస్వామి, పౌరహక్కుల సంఘం రమేష్ చందర్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు. సభలో రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్నూలులో చలసాని సంస్మరణ సభ

జూలై 30న నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో జిల్లా యూనిట్ చలసాని సంస్మరణ సభ నిర్వహించింది. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు పి. మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కార్యదర్శి వరలక్ష్మి చలసాని ప్రసాద్ సాహిత్యం గురించి మాట్లాడుతూ ఆయన సాహిత్యాన్ని దేశీ, ప్రజా సంప్రదాయం నుంచి చూశారని, సమాజ హృదయం సాహిత్యం అనే విషయంపట్ల ఆయనకు అచంచల విశ్వాసం ఉండేదని అన్నారు. తెలుగు భాషా, సాహిత్య చరిత్రలోని ప్రజా సంప్రదాయాలను ఆయన పుణికిపుచ్చుకున్నారని అన్నారు. సాహిత్య చరిత్రకు అవసరమైన సమాచారాన్ని, దృక్పథాన్ని చలసాని అందించారని అన్నారు. అలాగే సాహిత్య రచన ఉద్యమంగా ఉండాలని, రచయితలు సంఘటితంగా ఉన్నప్పుడే సమాజ అవసరం తీర్చే వస్తు నిర్దేశం చేయగలరనే అభిప్రాయం ఉండేదని అన్నారు. విరసం సభ్యుడు అరుణ్ మాట్లాడుతూ చలసాని అపారమైన అధ్యయనశక్తి, మానవ సంబంధాల అనురక్తి వల్ల విలక్షణ మానవుడిగా రూపొందారని అన్నారు. ఆయనకు అనేక సామాజిక విషయాలపట్ల సాధికార అవగాహన ఉండేదని అన్నారు. పాణి మాట్లాడుతూ ఒక సంఘం, లేదా పార్టీ ఏర్పడ్డాక అందులో పని చేయడం ఒక ఎత్తయితే చలసాని ఒక ఉద్యమం రాబోతోందని ముందుగానే గుర్తించి దానికి అవసరమైన రాజకీయ, సాహిత్య, నిర్మాణ ప్రయత్నాలు చేశాడని

అన్నారు. రచయితలు, కవులు మానవ హృదయ నిర్మాతలనే స్టాలిన్ అవగాహన చలసానికి మార్గదర్శి అన్నారు. ఆయన ప్రత్యేక రాయలసీమ ఆకాంక్షను బలంగా సమర్థించారని గుర్తు చేశారు. చివర్లో వివి మాట్లాడుతూ చలసాని తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత కూడా కమ్యూనిస్టుగా బతికిన రెండో తరం పార్టీ సభ్యుల్లో ఒకరని అన్నారు. అందువల్లే ఆయన శ్రీకాకుళ పోరాటాన్ని బలపరిచే రచయితల సంఘం ఏర్పాటు చేశారని అన్నారు. అక్కడి నుంచి దండకారణ్యం దాకా ఆయన మడమ తిప్పకుండా సాగారని అన్నారు.

ప్రొద్దుటూరులో చలసాని ప్రసాద్ సంస్మరణ సభ

ఆగస్టు 23, ఆదివారంనాడు విరసం కడప జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని పురపాలక కమ్యూనిటీ భవన్‌లో చలసాని ప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. విరసం అనంతపురం జిల్లా యూనిట్ కన్వీనర్ కా.శశికళ ఆధ్యక్షత వహించిన ఈ సభలో ఆదర్శ కమ్యూనిస్టు చలసాని ప్రసాద్ అన్న అంశంపై పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొ.శేషయ్య, చలసాని ప్రసాద్ సాహిత్య కృషి. సాంస్కృతిక వ్యక్తిత్వం గురించి విరసం కార్యదర్శి కా.వరలక్ష్మి మాట్లాడారు. విరసం పునర్ముద్రించిన 'చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలు' పుస్తకాన్ని ప్రముఖ కథారచయిత దాదాహయాత్ ఆవిష్కరించారు.

ప్రొ.శేషయ్య మాట్లాడుతూ చలసాని తెలుగు సాహిత్య రంగాన్ని శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటానికి, నక్సల్బరీ రైతాంగ పోరాటానికి మద్దతుగా నిలిపే కృషి చేశారని అన్నారు. చలసాని చుట్టూ ఉన్న సమాజ చైతన్యమే ఆయన బాల్యం నుండే కమ్యూనిస్టుగా నిలబెట్టిందన్నారు. కన్నీళ్లు, కష్టాల పట్ల స్పందన లేని వారు కమ్యూనిస్టు కాలేరన్నారు. ప్రజల పట్ల ప్రేమ, విప్లవం పట్ల నమ్మకం ఉన్న రచయితలందరూ సంఘంగా ఏర్పడాలని చలసాని విరసం నిర్మాణానికి కృషిచేశాడని, శ్రీశ్రీ వంటి మహాకవిని విప్లవ మార్గం వైపు నడిపించిన ఘనత చలసానిదన్నారు. స్వార్థమన్నదే లేని గొప్ప వ్యక్తి చలసాని ప్రసాద్ అని, గుర్తింపును కూడా వదులుకొని పనిచేసిన అరుదైన వ్యక్తిత్వం ఆయనదని చెప్పారు. విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ మరణించిన తర్వాత జీవించడం చలసాని వంటి సాహిత్య సైనికుడికే సాధ్యమవుతుందన్నారు. శ్రమజీవుల కష్టం నుండి సంస్కృతిని అర్థం చేసుకోవాని, సమస్త సంపదలకూ, కళలకూ, సంస్కృతికీ మూలం శ్రమజీవులేనని చలసాని అర్థం చేసుకున్నాడు కనక సాహిత్యాన్ని, కళల్ని పోరాడే ప్రజకు అంకితం చేసిన సుబ్బారావు ప్రాణిగ్రాహి వారసత్వాన్ని అందుకుని విరసం స్థాపనలో కీలక పాత్ర పోషించారని ఆమె వివరించారు. చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలు పుస్తకాన్ని కథా రచయిత దాదాహయాత్ ఆవిష్కరించి సభకు పరిచయం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమానికి లెనిన్ ఎంత చేశాడో తెలుగులో కమ్యూనిస్టు సాహిత్యానికి శ్రీశ్రీ అంత చేశాడని చలసాని వ్యాఖ్యానించడం శ్రీశ్రీపై ఆయన అంచనాను తెలుపుతుందన్నారు. ప్రేక్షకుడి మనసులోనే రసం ఉంటుందని గొప్ప శిల్ప చర్చ చేశాడన్నారు. తిక్కన, గురజాడలపై చలసాని విమర్శ శిఖరాగ్రమైనదన్నారు. మరో కథా రచయిత కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి కమ్యూనిస్టు ఉద్యమం ఎంతో దోహదం చేసిందన్నారు. చలసానితో పెద్ద పరిచయం లేకున్నా ఆయన సాహిత్య వ్యక్తిత్వం వల్ల ఆయనెంతో దగ్గరివాడిగా అనిపిస్తాడన్నారు. ఈ సంస్మరణ సభలో స్థానిక రచయితలు కొమ్మిశెట్టి మోహన్, డా.ఎన్.రామచంద్ర, ఎస్.పి.మహమూద్, ఎన్నెస్ ఖలందర్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, చైతన్య మహిళా సంఘం బాధ్యులు పద్మ, మానవహక్కుల వేదిక బాధ్యులు జయశ్రీ, జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్. డా.తవ్వా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడిన విప్లవ రచయిత చలసాని ప్రసాద్

విరసం నెల్లూరు యూనిట్ 16-8-2015న చలసాని ప్రసాద్ సంస్మరణ సభను నెల్లూరులో జరిపింది. ప్రజా రాజకీయాలతో కూడిన సాహిత్య ఉద్యమంలో ప్రజల పక్షాన నిలబడిన విప్లవ రచయిత చలసాని ప్రసాద్ అని ప్రధాన వక్త కళ్యాణరావు అన్నారు. ఉద్యమకారుడు కాని రచయిత విప్లవ రచయిత కాలేడని చలసాని చెప్పేవాడన్నారు. ప్రజలు బాసటగా నిలుస్తూ, ప్రజల గొంతుకే అజెండాగా పని చేసేదే విప్లవ రచయితల సంఘం అన్నారు. విరసానికి జన్మస్థానం శ్రీకాకుళం అనీ, విప్లవ రచయితలకు కన్న తల్లి విరసం అనీ అన్నారు. విరసాన్ని అణిచివెయ్యాలని జలగం వెంగళరావు నుండి రాజశేఖరరెడ్డి వరకు ఎందరో నాయకులు ప్రయత్నించి చరిత్రహీనులుగా మిగిలిపోయారన్నారు. తెలుగు సాహిత్యానికి, విప్లవ సాహిత్యోద్యమానికి చలసాని ప్రసాద్ చేసిన సేవ అనిర్వచనీయమన్నారు.

సభను ప్రారంభించిన విరసం జిల్లా కన్వీనర్ పిన్నిబోయిన కోటయ్య చలసాని ప్రసాద్ జీవిత విశేషాలను వివరించారు. సభకు అధ్యక్షత వహించిన వి. చెంచయ్య మాట్లాడుతూ సైద్ధాంతికన అవగాహనలో రాజీపడకుండానే విస్తృత మానవ సంబంధాలు కలిగిన అరుదైన విప్లవ రచయిత చలసాని ప్రసాద్ అన్నారు. సంపదలన్నీ ప్రజలకు చెందాలన్నట్టే, భాషా సాహిత్యాలు, కళలు ప్రజలకే చెందాలని, ఈ మార్పుకు విరసం లాంటి సాహిత్య సంఘాలు దోహదం చేస్తాయని చలసాని అభిప్రాయపడ్డాడని వివరించాడు. ఈ సభకు 120 మంది హాజరయ్యారు.

గుంటూరులో సీపీ సంస్మరణ సభ

అమరుడు చలసాని సంస్మరణ సభ విరసం గుంటూరు యూనిట్ ఆధ్వర్యంలో ఆగస్టు 10 సాయంకాలం జరిగింది. వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో చెంచయ్య ప్రధాన వక్తగా పాల్గొని చలసాని ప్రసాద్ సాహిత్య జీవితం గురించి ప్రసగించారు. సాహిత్యంలో నేల విడచిన సాము ఎప్పటికీ పనికి రాదని, వాస్తవికత మాత్రమే గాక, కళాత్మకత కూడా ఉన్న సాహిత్యమే చిరకాలం నిలచి పోతుందని చలసాని భావించేవారని చెప్పారు. జీవిత వాస్తవికత విలువైనదే గాక దానంతట అది కళాత్మకంగా కూడా ఉంటుంది కాబట్టి అలాంటి రచయితల భావజాలం ఏదైనప్పటికీ ఆ రచనల ద్వారా, ఆయా కాలాల నాటి సామాజిక జీవితాన్ని అర్థం చేసుకొనే అవకాశం ఉందని నమ్మిన చలసాని ఏ రచయితలోనైనా అంతర్లీనంగా ఉన్న పాజిటివ్ అంశాలను గుర్తించేవారన్నారు. సంపదకు మూలం శ్రమ కాబట్టి సంపద అందరికీ చెందాలని అన్నట్లే భాష, సాహిత్యం, సంస్కృతికీ కూడా మూలం శ్రమే కాబట్టి అవి కూడా అందరికీ చెందాలని చలసాని భావించే వారని చెప్పారు. సాహిత్యంలో రాజకీయాలు ఎంతవరకు ఉండాలి అని అడిగిన ప్రశ్నకు "జీవితంలో ఉన్నంత మేరకు" అని ఆయన జవాబు చెప్పారని చెంచయ్య గుర్తు చేశారు. చలసాని మార్క్సిజాన్ని విశ్లేషణా శాస్త్రంగాను, విప్లవ శాస్త్రంగాను భావించారని, అటు సాహిత్యానికి, ఇటు భావజాలానికి పూర్తిగా నిబద్ధుడైన చలసాని రచయితలందరికి మార్గదర్శి అని అన్నారు.

అరసం నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ చలసానికి నివాళులర్పిస్తూ తమిద్దరికి మధ్య వున్న స్నేహపూర్వకమైన సంబంధాలను ప్రస్తావించారు. ఆయన ప్రేమాస్పదుడైన వ్యక్తి అని, అరసం, విరసం వంటి ప్రజా పక్షాన నిలబడే సాహిత్య సంఘాల మధ్య రచయితల మధ్య స్నేహపూర్వక కార్యాచరణ సంబంధాన్ని రూపొందించడానికి కృషిచేసిన ప్రజాస్వామికవాది అన్నారు.

చలసాని మిత్రుడు, అపురూప పుస్తకాల సేకర్త లంకా సూర్యనారాయణ ప్రసంగిస్తూ పుస్తకం పట్ల చలసానికున్న ఆత్మీయతను గుర్తు చేసుకుంటూ ఆయన మనుషులతో ఎలా స్నేహం చేసేవారో పుస్తకాలతో కూడా అలాగే స్నేహం చేసే వారని అంటూ నివాళులర్పించారు.

జనసాహితి ప్రధాన కార్యదర్శి దివి కుమార్ ప్రసంగిస్తూ చలసాని తనూ ఎప్పటి నుండో మిత్రులమని, అనేకానేక సాహిత్య సాంస్కృతిక విషయాల గురించి చర్చించుకొనేవారమని, తెలుగు భాష పరిరక్షణ పట్ల చలసానికి ఉన్న ప్రేమను వివరిస్తూ కేవలం సెంటిమెంట్ ద్వారా భాషను కాపాడుకోలేమని శాస్త్రీయంగా హేతుబద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే తెలుగును కాపాడుకోగలమని చలసాని భావించే వారని చెప్తూ నివాళులర్పించారు.

సభకు అధ్యక్షత వహించిన వరలక్ష్మి మాట్లాడుతూ విరసంలోనూ, బయటా తరాల అంతరాన్ని అధిగమించి అందరితోటే కలుపుగోలుగా స్నేహంగా ఉండగలగటం చలసాని ప్రత్యేకత అని అన్నారు. విరసంలో కొత్తగా చేరిన యువ సభ్యులకు ఆయన గొప్ప స్నేహితుడు, ప్రేరణదాయకుడు అని అంటూ వాళ్ళను ఎంతగానో ప్రోత్సహించే వాడని, భావజాలపరంగా, తాత్విక పరంగా కొత్త సభ్యుల ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించేవారని అన్నారు. తత్వశాస్త్ర సంబంధిత అంశాలను కూడా సాహిత్య కోణం నుంచి వివరించటం ఆయన ప్రత్యేకత అని, ఆ కారణంగా ఆయన ప్రసంగాలు సులువుగా అవగాహనలోకి వచ్చేవంటూ నివాళులు అర్పించారు.

ఈ సభకు కామ్రేడ్ సంగ్రామ్ స్వాగతం పలికి ప్రారంభించారు.

విజయవాడలో సీపీ సంస్మరణ సభ

ఆగస్టు 27వ తేదీ విజయవాడలో రోజంతా సీపీ సంస్మరణ సభ జరిగింది. మొదటి సెషన్‌కు విరసం కార్యవర్గ సభ్యురాలు రుక్మిణి అధ్యక్షత వహించారు. కామ్రేడ్ కళ్యాణరావు సీపీ సాహిత్యం-సాంస్కృతిక వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. చలసాని కమ్యూనిస్టు ఉద్యమ సంప్రదాయంలోంచి సాహిత్యంలోకి వచ్చి విప్లవ సాహిత్యానికి ఒక రూపాన్ని, దృక్పథాన్ని అందించారని అన్నారు. శ్రీకాకుళ పోరాటం నుంచి ప్రజా కళలను, ప్రజా సాహిత్యాన్ని విరసం ప్రచారం చేయడం వెనుక చలసాని కృషి ఉన్నదని అన్నారు. ప్రజా జీవితం, ప్రజా పోరాటం చలసాని సాహిత్య దృక్పథానికి గీటురాయి అన్నారు. మధ్యాహ్నం ఇదే అంశంపై పాణి మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యాన్ని మార్క్సిస్టులు ఎలా విమర్శనాత్మకంగా చదవాలో చలసాని తెలుగు సమాజానికి నేర్పించారని అన్నారు. తర్వాత సీపీ రాజకీయ జీవితం గురించి వివి మాట్లాడుతూ చలసాని సాహిత్యం, జీవితం, స్నేహాలు అన్నీ వర్గపోరాటంతో సంబంధం లేని విషయాలు కాదని అన్నారు. ప్రామాణిక మార్క్సిస్టు సిద్ధాంత అవగాహన నుంచి చలసాని రాజకీయాలు, సాహిత్యోద్యమాలు నడిపాడని విశ్లేషించారు. మావోయిస్టుపార్టీ కేంద్ర కమిటీ సంతాప ప్రకటనను చదివి వినిపించారు. అంతకంటే ముందు శ్రీశ్రీ సాహిత్య నిధి తరపున చలసాని స్మారక సంచికను వివి ఆవిష్కరించారు. ఈ సెషన్‌కు అరసవెల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వివి కృష్ణారావు, సీఎల్‌సీ నుంచి బోస్, పీడీఎం నుంచి క్రాంతికుమార్, సీఎంఎస్ నుంచి రాధ, కెవిపిఎస్ నుంచి కృష్ణ, పికెఎస్ నుంచి కొండారెడ్డి, ఒపిడిఆర్ నుంచి దాసు, జనసాహితి నుంచి రవిబాబు, అరసం నుంచి మాధవరావు, ప్రొ. అంజయ్య, శ్రీశ్రీ సాహిత్య నిధి తరపున అశోక్‌కుమార్, అంకురం సినిమా దర్శకుడు ఉమామహేశ్వరరావు, కెవిఆర్, శారదాంబ స్మారక కమిటీ తరపున డా. వసుంధర తదితరులు సీపీకి సంతాపం తెలిపారు. ఈ సభలో ప్రజా కళాకారుడు పిచ్చయ్య పాటలు పాడారు.





ఇంట్లో...





కా. విజయతో సహజీవనం ప్రారంభించిన చోటు
దివ్యజ్ఞాన సమాజ భవనం, ఎస్.పి.హాల్ దగ్గర, హైదరాబాద్.

ప్రస్తుతం మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణలు, వాటి ధరలు

కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

1.	కొడవటిగంటి కుటుంబరావు - 1 (కథలు)	200-00
2.	కొడవటిగంటి కుటుంబరావు - 2 (కథలు)	200-00
3.	కొడవటిగంటి కుటుంబరావు - 3 (కథలు)	200-00
4.	కొడవటిగంటి కుటుంబరావు - 4 (కథలు)	200-00
5.	కొడవటిగంటి కుటుంబరావు - 5 (గొలుసు కథలు)	200-00
6.	కొడవటిగంటి కుటుంబరావు - 6 (నవలలు)	200-00
7.	కొడవటిగంటి కుటుంబరావు - 7 (నవలలు)	250-00
8.	కొడవటిగంటి కుటుంబరావు - 8 (నవలలు)	250-00
9.	కొడవటిగంటి కుటుంబరావు - 9 (నవలలు, కథలు నాటికలు)	250-00
10.	కొడవటిగంటి కుటుంబరావు - 10 (సైన్స్ వ్యాసాలు)	300-00
11.	కొడవటిగంటి కుటుంబరావు - 11 (చరిత్ర వ్యాసాలు)	150-00
12.	కొడవటిగంటి కుటుంబరావు - 12 (రాజకీయ వ్యాసాలు)	400-00
13.	కొడవటిగంటి కుటుంబరావు - 13 (సంస్కృతి వ్యాసాలు)	300-00
14.	కొడవటిగంటి కుటుంబరావు - 14 (సినిమా వ్యాసాలు)	300-00
15.	కొడవటిగంటి కుటుంబరావు - 15 (సినిమా వ్యాసాలు)	250-00
16.	కొడవటిగంటి కుటుంబరావు - 16 ఎ (సాహిత్య వ్యాసాలు)	300-00
17.	కొడవటిగంటి కుటుంబరావు - 16 బి (సంస్కృతి వ్యాసాలు)	300-00
18.	కొడవటిగంటి కుటుంబరావు - 17 (తాత్విక వ్యాసాలు)	150-00
19.	కొడవటిగంటి కుటుంబరావు - 18 (లేఖలు)	125-00
20.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మొదటి భాగం)	300-00
21.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (రెండవ భాగం)	250-00
22.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మూడవ భాగం)	250-00
23.	కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు (నాల్గవ భాగం)	250-00
24.	కె.వి.ఆర్. మహోదయం	200-00
25.	వసంతగీతం (అల్లం రాజయ్య)	250-00
26.	కొమురం భీం (అల్లం రాజయ్య)	150-00
27.	సృష్టికర్తలు (అల్లం రాజయ్య)	150-00
28.	సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి)	300-00
29.	భావవిప్లవకారుడు కొకు	80-00
30.	కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు	75-00
31.	అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు)	20-00
32.	సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు	25-00
33.	అంతస్సూత్రం (వరవరరావు కవిత్వం)	40-00
34.	బీజభూమి (వరవరరావు కవిత్వం)	100-00
35.	గుమ్మెటమోత (పాణి నవల)	100-00
36.	కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం)	10-00
37.	తరాల పల్లె (కౌముది రచనలు)	50-00
38.	చలసాని ప్రసాద్ రచనలు	100-00
39.	దండకారణ్య కథలు	100-00
40.	తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య)	15-00
41.	సామాజికం (వి. చెంచయ్య)	30-00
42.	సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం	30-00
43.	విరసం సాహిత్య విమర్శ	150-00
44.	కథల పంట-3	120-00
45.	కదిలే కథ	80-00
46.	తీత్వాల్ కుక్క మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో)	60-00
47.	జాజిపూల పరిమళం (షహీదా కథలు)	150-00
48.	ఒక మాట, ఒక సంభాషణ (షహీదా కవిత్వం)	75-00
49.	సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు)	60-00
50.	ఫాల్గుణ (పద్మకుమారి నవలిక)	30-00
51.	నల్లమల (పి. చంద్ నవల)	225-00
52.	లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్‌కె దీర్ఘ కవిత)	25-00
53.	ముడిమనిషి (అరుణతార కథలు 1)	30-00
54.	చేపలు (అరుణతార కథలు 2)	30-00
55.	కథ అద్దం తిరిగింది (అరుణతార కథలు 3)	30-00
56.	కో...బలి (అరుణతార కథలు 4)	30-00
57.	అడవిలోని వెన్నెల (అరుణతార కథలు 5)	30-00
58.	నెలవు (అరుణతార కథలు 6)	30-00
59.	ఒక వీరుడు మరణిస్తే (అరుణతార కథలు 7)	30-00
60.	తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్)	100-00
61.	ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక)	10-00
62.	కాంత, పున్నం, వెన్నెల (పద్మకుమారి కథ)	20-00
63.	రేపు (వెర్నన్ గొంజాల్వెజ్ కథ)	20-00
64.	మిగిలెటోళ్లు (బాసిత్ కథలు)	50-00
65.	రెండు పోరాట గాథలు (భారతి కథలు)	50-00
66.	కిటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం)	10-00
67.	పిల్లనగ్రోవి తుఫాను (ఉదయభాను కవిత్వం)	10-00
68.	మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం)	25-00
69.	కవితా ఝుంకార్ (విరసం కవితా సంకలనం)	75-00
70.	ఎర్రనక్షత్రం (చైనా నవల)	50-00
71.	సముద్రంతో సంభాషణ (పి. వరలక్ష్మి)	20-00
72.	నెగడు (కథలు)	90-00
73.	పరామర్శ (నల్లూరి రుక్మిణి)	80-00
74.	ఒండ్రుమట్టి (నవల)	170-00
75.	Wake of Telangana? - A docu-drama by basith	10-00
76.	యంత్రాల మధ్య	35-00
77.	అక్షర కిరణం (కె.వి.ఆర్.)	50-00
78.	డావిన్సి (మోహన్)	150-00
79.	మార్క్సిస్టు సాహిత్య విమర్శ (డా॥ శ్రీనివాస్)	100-00
80.	అగ్నిశిఖ	80-00
81.	కార్మిక వర్గ పుత్రుడు	70-00
82.	బలహీనుడి బలం	25-00
83.	పాలమూరు వలస బతుకు చిత్రాలు - గీతాంజలి	150-00
84.	వాట్సప్ తరంలో యుద్ధగీతం	30-00
85.	ఏది నేరం?! (హజారీబాగ్ జైలు గాథలు) - బి. అనురాధ	75-00
86.	వెలుగు రవ్వల జడి (ఆలూరి భుజంగరావు)	70-00
87.	అరణ్య పర్వం	120-00
88.	ప్రజలు అజేయులు	25-00
89.	మైనా	50-00
90.	గమ్యం దిశగా గమనం	30-00
91.	దిక్కు మొక్కు లేని జనం	30-00
92.	సాహిత్య వ్యాసాలు (చలసాని ప్రసాద్)	100-00
93.	కలం యోధుడు చెరబండరాజు (వి. చెంచయ్య)	20-00

సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

1.	సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు)	125-00
2.	మావో రచనలు - 1	220-00
3.	మావో రచనలు - 2	220-00
4.	రివిజనిజం (మావో)	75-00
5.	మార్క్సిజం, లెనినిజం, మావోయిజం	125-00

6. మార్క్సిస్టు తత్వశాస్త్రం 80-00
7. చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు 50-00
8. మంద్రస్థాయి యుద్ధం 100-00
9. విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్) 30-00
10. రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హోంకీ వ్యాసాలు) 35-00
11. నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర) 125-00
12. జగిత్యాల జంగల్‌మహల్ (1) 75-00
13. జగిత్యాల జంగల్‌మహల్ (2) 100-00
14. స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో 15-00
15. అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు 60-00
16. భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు 20-00
17. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు 30-00
18. నేటి రాయలసీమ 100-00
19. గతాన్ని సమీక్షించుకుందాం 50-00
20. చూటే ఏరిన రచనలు 125-00
21. మావో సే టుంగ్ 80-00
22. గెరిల్లా యుద్ధం 60-00
23. చైనా ప్రజా విముక్తి సైన్యం 40-00
24. భూమి సంస్కృతి నాగరికత 15-00
25. స్త్రీవాద ఉద్యమం (అనురాధ గాంధీ) 25-00
26. కొత్త చూపు (ఆర్.ఎస్. రావు) 120-00
27. అభివృద్ధిని ఇలా చూద్దాం (ముదునూరి భారతి) 80-00
28. In Search of Method (Mudunuri Bharati) 200-00
29. On Education (Mudunuri Bharati) 180-00
30. Crisis and Development in Marxian Frame Work (Mudunuri Bharati) 80-00
31. Individual, Sub-Groups, Groups and Freedom (Mudunuri Bharati) 75-00
32. Methodology of Social Enquiry (Mudunuri Bharati) 150-00
33 Fifty Years of Andhra Pradesh 1956-2006 300-00
34. చైనా కమ్యూనిస్టు పార్టీ మౌలిక అవగాహన 100-00
35. జనతన సర్కార్ కావాలి మేక్ ఇన్ ఇండియా కాదు 15-00
36. విద్యార్థి ఉద్యమాల్లో విప్లవ దిద్దుబాటు 30-00
37. ఐక్య సంఘటన సిద్ధాంత వ్యాసాలు 35-00
38. బాలగోపాల్ తాత్విక గందరగోళం 70-00
39. జాతుల సమస్య రిజర్వేషన్లు కార్మిక వర్గ దృక్పథం 25-00
40. తత్వశాస్త్రం మాయాజాలం కాదు 20-00
41. వైరుధ్యాలు 20-00
42. చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు 1949-64 20-00

వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

1. ముజఫర్‌నగర్ మరో మానని గాయం 20-00
2. ఆకాస ఉద్యమ అమరులు 10-00
3. అంతర్యుద్ధంలో ఆదివాసులు 30-00
4. దండకారణ్యంలో గ్రీన్‌హంట్ 60-00
5. ఉద్యమ ఆకాశంలో సగం 15-00
6. తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన 20-00
7. జనతన జైత్రయాత్ర 20-00
8. ఫిలిప్పినో ఉద్యమం 15-00
9. ఖైదీల సైరన్ 60-00
10. విముక్తిబాటలో నారాయణపట్నా 20-00
11. జ్ఞానం అందరిది 30-00
12. అంతర్యుద్ధంలో ఆదివాసులు 30-00
13. లక్ష్మింపేట 25-00
14. గ్రీన్‌హంట్ ఉత్పాదాలు 25-00
15. నిత్య జీవితంలో సోషలిజం (భూసారం శివన్న) 100-00
16. ఆకుల భూమయ్య రచనలు 40-00
17. అమలు కానీ హామీల చరిత్ర (శశికళ) 100-00
18. ది ఫ్లేమ్స్ ఆఫ్ నారాయణ పట్నా 60-00
19. దాక్షిణ్య వాదం నుంచి దండకారణ్యం దాకా (రత్నమాల) 200-00
20. నూతన సంభాషణ (రత్నమాల) 80-00
21. జర్నలిజం ప్రొఫెషన్ (రత్నమాల 50-00
22. సాహిత్య ధోరణులు విప్లవ ధోరణులు 30-00

స్మృతి సాహిత్యం

1. ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి) 10-00
2. ఆదర్శజీవులు అమరులు 30-00
3. నేనున్నాను కామ్రేడ్ (గంటి ప్రసాదం స్మృతిలో) 30-00
4. గంటి ప్రసాద్ రచనలు 25-00
5. సూర్యుడు మరణించడు 60-00
6. చిరునవ్వు సితార 80-00
7. గెరిల్లా డైరీ 10-00
8. మన్యం వెలుగులు 15-00
9. అక్షర కిరణం 20-00
10. అడవి పుత్రుడు మంగన్న 10-00
11. గజ్జెల సరోజ 15-00
12. మహిత 10-00
13. కోటి జ్ఞాపకాలు 50-00
14. పువర్తి అమరులు 20-00
15. అమరుల యాదిలో 30-00
16. అమరుల జీవిత చరిత్ర 30-00
17. వెగుచుక్కల వెలుతురులో 10-00
18. లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు 10-00
19. అజ్ఞాత విప్లవ యోధుడు అమరుడు కొండన్న 50-00
87. శారద స్మృతి శకలాలు 30-00

డివిడిలు

అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (1977-2013) 125-00

మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామక్రిష్టారావు, అరుణతార వర్కింగ్ ఎడిటర్,
ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే) ఈమెయిల్ : arunatara1977@gmail.com
పుస్తకాల ధరకు సరిపడా డబ్బులతో పాటు, పోస్టింగ్ ఖర్చులను జతచేసి ఎం.ఓ. లేక డిడి ద్వారా పంపి పుస్తకాలను పొందవచ్చు.
ఆన్‌లైన్‌లో డి.వి.రామక్రిష్టారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లాలాగూడ బ్రాంచ్, హైదరాబాద్, ఎకౌంట్ నెం. 10243583773,
ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్.బి.ఐ.ఎన్.0007112కి చెల్లించి పుస్తకాలను పొందవచ్చు.
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి, 5-1820, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు. ఫోన్ : 81799 13123, ఈమెయిల్ : varalurwa@gmail.com

మా ప్రచురణలు నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387

వారధి : పాత, కొత్తతరం విరసం సభ్యులతో (పిల్లలమర్రి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 2013)

కామ్రేడ్ చలసాని ప్రసాద్ రచనలు రెండవ ముద్రణలో అందుబాటులో ఉన్నాయి



సాహిత్య వ్యాసాలు

చలసాని ప్రసాద్

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం

వెల : రు. 100/-



చలసాని ప్రసాద్ రచనలు

చలసాని ప్రసాద్

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం

వెల : రు. 100/-

KRSA101M107

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
● RNI Regn.No.21152/72 ● Published on 04/09/2015 317 - Aug-Sept, 2015

కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు
అరుణారుణ జోహార్లు

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

On behalf of Chalasani Prasad this issue is Published by D.V. Ramakrishna Rao, awaiting for Magistrate Order.

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M107
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	189
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	1,2
తయారు చేసినది	Vedavathi
పేజీలు విడదీసినది	Vedavathi
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good